SREEMATHANDHRA VALMIKI

RAMAYANAMU

A LITERAL METRICAL TRANSLATION OF VALMIKI'S SANSKRIT RAMAYANAM

by

VAVILICOLANU SUBBA ROW.

alias VASUDASA SWAMY

late Telugu Pandit, Presidency College, Madras.

AND THE AUTHOR OF

Sree Kumarabhyudayam, Bhagavad Gita (Dwipada), Krishnavatara Thathwamu, &c.,

Sree Kausalya Parinayam, Sree Krishna Leelamritamu, Subhadra Vijaya Natakamu, &c., &c.,

WITH AUTHOR'S OWN COMMENTARY

CALLED

MANDARAM

PUBLISHED BY

Sree Kodanda Rama Sevaka Dharma Samajam,

ANGALAKUDURU - TENALI.

(ALL RIGHTS RESERVED)

ANDHRA VALMIKI
VASUDASA SWAMY

YUDDHA KANDAMU

PART - I

శ్రీ ర స్తు

శ్రీమదాంధ్రవాల్మీకిరామాయణ

విషయసూచిక

యుద్ధకాండము

సర్గసంఖ్య.		పుటసంఖ్య.
1	శ్రీరాముఁడు హనుమంతుని బ్రశంసించుట ...	3
2	సుగ్రీవుఁడు శ్రీరామున కుత్సాహంబుఁ గలుగ భాషించుట ...	13
3	శ్రీరాముఁడు హనుమంతుని లంకయందలి దుర్గాదులవిధం బడుగుట...	19
4	శ్రీరాముఁడు కపిసేనతో లంకపై దండయాత్ర వెడలుట ...	25
4	లక్ష్మణుఁడు శుభశకునములఁ గని శ్రీరామునితోఁ జెప్పుట ...	33
4	కపిసేనలు ప్రయాణమై పోవుట ...	39
4	శ్రీరాముఁడు కపిసేనతో సముద్రతీరముఁ జేరుట ...	45
4	సముద్రవర్ణనము ...	47
5	శ్రీరాముఁడు సీతం దలంచి దుఃఖించుట ...	50
6	రావణుఁడు మంత్రులతో నాలోచించుట ...	58
7	రాక్షసులు రావణు పరాక్రమంబుఁ బొగడుట ...	62
8	ప్రహస్తాదులు తమ పరాక్రమంబు రావణుతోఁ జెప్పుట ...	68
9	రభసాదులు విజృంభించి పలుకుట ...	73
9	విభీషణుఁడు రావణునకు రాజనీతిఁ దెలుపుట ...	74
10	విభీషణుఁడు రావణుగృహంబునకుఁ బోవుట ...	80
10	విభీషణుఁడు రావణునకుఁ బురంబున నపశకునంబులు పుట్టుట జెప్పుట	83
10	విభీషణుఁడు రావణుతో సీతాదేవిని శ్రీరామున కిమ్మని చెప్పుట	86
11	రావణుఁడు కొలువుకూటంబునకుఁ బోవుట ...	88
11	రావణుఁ డెల్లరాక్షసుల సభకు రప్పించుట ...	92
12	రావణుఁడు రాక్షసుల సంబోధించుట ...	95
12	రావణుఁడు రాక్షసులతో సీతావృత్తాంతముఁ జెప్పుట ..	98
12	కుంభకర్ణుఁడు రావణునిఁ గోపించి పలుకుట ...	102

సర్గసంఖ్య.		పుటసంఖ్య.
13	మహాపార్శ్వుఁడు రావణునితో సీతాదేవిని విడువరాదని చెప్పుట...	106
13	రావణుఁడు మహాపార్శ్వునితో బ్రహ్మ తన్ను శపించినవిధంబుఁ దెలుపుట	109
14	విభీషణుఁడు సీతాదేవిని శ్రీరామున కిమ్మని రావణునకు బోధించుట	112
14	విభీషణుఁడు ప్రహస్తుని గర్హించుట ...	115
15	ఇంద్రజిత్తు విభీషణుఁ దిరస్కరించి పలుకుట ...	122
15	విభీషణుఁ డింద్రజిత్తును నిందించుట ...	125
16	రావణుఁడు విభీషణునకు జ్ఞాతిలక్షణంబుఁ దెలిపి నిష్ఠురంబు లాడుట	127
16	విభీషణుఁడు సభ విడిచి మింటి కెగసి రావణునకు హితముఁ దెల్పుట	133
17	విభీషణుఁడు నలువురు మంత్రులతో శ్రీరాముఁడున్న చోటికిఁ బోవుట	138
17	విభీషణుఁడు తనరాక శ్రీరామునకుఁ దెలుప వానరుల వేఁడుట ...	147
17	సుగ్రీవుఁడు శ్రీరామునకు విభీషణురాక దెలిపి రాక్షసుల నమ్మరాదనుట	158
17	శ్రీరాముఁడు విభీషణుని విషయమై కపుల యభిప్రాయ మడుగుట	162
17	అంగదాదులు వారివారి యభిప్రాయంబులఁ దెలుపుట ...	164
17	విభీషణుని గ్రహింపవచ్చునని హనుమంతుఁ డభిప్రాయముఁ దెలుపుట	168
18	శ్రీరాముఁడు కపులతో విభీషణుఁడు గ్రాహ్యుఁడని చెప్పుట ...	177
18	శ్రీరాముఁడు సుగ్రీవునకు శరణాగతరక్షణం బవశ్యకర్తవ్యంబని చెప్పుట	191
18	శ్రీరాముఁడు విభీషణున కభయ మిచ్చుట ...	201
19	విభీషణుఁడు శ్రీరాముపదంబులమీఁదఁబడి తన్ను నివేదించుకొనుట	240
19	విభీషణుఁడు శ్రీరామునకు రాక్షసబలంబుఁ దెల్పుట ...	247
19	శ్రీరాముఁడు విభీషణునకుఁ బట్టాభిషేక మొనరించుట ...	251
20	శార్దూలుఁడు రావణునితో శ్రీరాముఁడు కపులతో సముద్రమునొడ్డున దిగియుండువార్త చెప్పుట ...	254
20	రావణుఁడు శుకుని సుగ్రీవునొద్దకు రాయబార మంపుట ...	255

సర్గసంఖ్య.		పుటసంఖ్య.
20	వానరులు శుకుని మర్దించుట ...	257
20	సుగ్రీవుఁడు రావణునకుఁ బ్రత్యుత్తర మంపుట ...	258
21	శ్రీరాముఁడు దర్భశయనంబునఁ బరుండుట ...	262
21	శ్రీరాముఁడు సముద్రునిపై నాగ్రహపడుట ...	271
21	శ్రీరాముఁడు సముద్రునిపై బాణంబులు వైచి క్షోభిల్లఁజేయుట	276
22	శ్రీరాముఁడు సముద్రునిపై బ్రహ్మాస్త్రంబు వేయఁబూనుట ...	278
22	శ్రీరామునకు సముద్రుఁడు ప్రత్యక్షమగుట ...	282
22	శ్రీరాముఁడు బ్రహ్మాస్త్రమును ద్రుమకుల్యముపైఁ బ్రయోగించుట	285
22	నలుఁడు సేతువు నిర్మించుట ...	288
22	శ్రీరామలక్ష్మణులు కపిసేనతోడ సేతువు దాఁటుట ...	293
23	శ్రీరాముఁడు లక్ష్మణునకప్పుడు దోఁచు శకునంబుల తెఱంగెఱింగించుట	294
24	శ్రీరాముఁడు లంకలోని ధ్వని విని సీతను దలఁచి దుఃఖించుట...	298
24	శ్రీరాముఁడు సేనల వ్యూహంబు దీర్చుట ...	301
24	శుకుఁడు రావణుతోఁ దాను బోయివచ్చిన వృత్తాంతముఁ జెప్పుట	302
24	రావణుఁడు శుకునితో సీత నీయనని తనపరాక్రమముఁ దెలుపుట	306
25	రావణుఁడు శుకసారణులను వానరసేనఁ బరికించి రాఁ బనుచుట	309
25	విభీషణుఁడు శుకసారణులను బట్టి శ్రీరామున కప్పగించుట ...	311
25	శుకసారణులు రావణుతో సీతాదేవిని శ్రీరామున కిమ్మని చెప్పుట	315
26	రావణుఁడు శుకసారణులతోఁ బ్రాసాద మెక్కి కపిసేనల జూచుట	317
26	సారణుఁడు రావణునకు నంగదాదుల నెఱింగించుట ...	319
27	సారణుఁడు రావణునకు హరాదియూథనాథుల నెఱింగించుట ...	326
28	శుకుఁడు రావణునకు మైందాదుల నెఱింగించుట ...	333
28	శుకుఁడు రావణునకు శ్రీరామలక్ష్మణులఁ జూపుట ...	337
28	శుకుఁడు వానరసేనాసంఖ్యను రావణునకుఁ దెలుపుట ...	342
29	రావణుఁడు శుకసారణుల నిందించుట ...	343
29	రావణుఁడు శార్దూలాదులను శ్రీరామునిచర్య కనుఁగొని రాఁ బంపుట	347
30	రావణునకు శార్దూలుఁడు కపులచేఁ దాను బడినపాటు దెలుపుట	349
30	శార్దూలుఁడు రావణునకుఁ గపుల బలపరాక్రమములు దెలుపుట	353

వర్గసంఖ్య.			పుటసంఖ్య.
31	రావణుఁడు విద్యుజ్జిహ్వుని రామునిశిరస్సుఁజాపముఁగల్పింపనాజ్ఞాపించుట		357
31	రావణుఁడు సీతకు శ్రీరామాదులు హతులైరని చెప్పుట	...	358
31	రావణుఁడు సీతాదేవికి శ్రీరాముని కల్పితశిరశ్చాపంబులఁ జూపుట		364
32	శ్రీరాముని మాయాశిరశ్చాపంబులఁ జూచి సీత దుఃఖించుట...		365
32	మంత్రులు పిలువ రావణుఁడు కొలువుకూటంబునకుఁ బోవుట...		378
33	సరమ సీతాదేవిని సమాధానపఱుచుట	...	379
33	సీతాదేవికి సరమ యుద్ధసన్నాహముఁ దెలుపుట	...	383
34	సీతాదేవి సరమను రావణుమనోనిశ్చయం బెఱింగి రమ్మనుట...		388
34	సరమ సీతాదేవికి రావణు నిశ్చయం బెఱింగించుట	...	392
35	మాల్యవంతుఁడు సీతాదేవి నిమ్మని రావణునకు నీతి బోధించుట		395
36	రావణుఁడు మాల్యవంతుని ధిక్కరించుట	...	402
36	రావణుఁడు పురద్వారంబులఁ గాపుంచుట	...	406
37	శ్రీరామునకు విభీషణుఁడు రావణసేనాసన్నాహంబు విధంబుఁ దెల్పుట		407
37	శ్రీరాముఁడు లంకాద్వారముల సేనల నిలుపుట	...	410
38	శ్రీరాముఁడు సుగ్రీవాదులతో సువేలాద్రి నెక్కుట	...	412
39	శ్రీరాముఁడు లక్ష్మణ సుగ్రీవాదులతో లంకం జూచుట	...	414
40	సుగ్రీవుఁడు రావణు గోపురంబును దాఁటి యతనితోఁ బోరుట...		420
41	శ్రీరాముఁడు సాహసము చేయవలదని సుగ్రీవునకు బోధించుట		428
41	శ్రీరాముఁడు లక్ష్మణునకు శకునంబులఁ దెలుపుట	...	431
41	శ్రీరాముఁడు సువేలాద్రి దిగి లంక ముట్టడించుట	...	433
41	అంగదు రాయబారము	...	438
41	అంగదుఁడు రాక్షసులఁ జంపి మరలి శ్రీరాముకడకు వచ్చుట...		444
42	రాక్షసులు రావణుతో లంకను వానరులు ముట్టడించిరని తెలుపుట		447
42	శ్రీరాముఁడు లంకకోటకు లగ్గలుపట్ట వానరుల కనుజ్ఞ యిచ్చుట		449
42	రావణుఁడు రాక్షసుల యుద్ధమునకుఁ బోవ ననుజ్ఞ యిచ్చుట...		452
43	వానర రాక్షస ద్వంద్వయుద్ధము	...	454
44	వానర రాక్షసుల రాత్రి యుద్ధము	...	461
44	శ్రీరాముఁడు రాక్షసుల వధించుట	...	463

సర్గసంఖ్య		పుటసంఖ్య.
44	ఇంద్రజిత్తంగదుచేఁ బరాజితుఁడయి మాయాయుద్ధ మొనర్చుట	466
45	ఇంద్రజిత్తు శ్రీరామలక్ష్మణుల నాగపాశబద్ధులఁ జేయుట ...	470
46	సుగ్రీవాదులు బద్ధులైన శ్రీరామలక్ష్మణులఁ జూడవచ్చుట ...	477
46	ఇంద్రజిత్తు శ్రీరామలక్ష్మణులు చచ్చిరని రాక్షసులతోఁ జెప్పుట	479
46	ఇంద్రజిత్తు వానరవీరుల నొప్పించుట ...	480
46	విభీషణుఁడు సుగ్రీవునకు ధైర్యముఁ జెప్పుట ...	482
46	ఇంద్రజిత్తు రావణునితోఁ దాను శ్రీరామలక్ష్మణుల నాగపాశబద్ధులఁ జేసి వధించితి నని చెప్పుట ...	486
47	హనుమదాదులు శ్రీరామలక్ష్మణులఁ గాచియుండుట ...	487
47	రావణుఁడు రాక్షసస్త్రీలతో సీతాదేవికి శ్రీరామలక్ష్మణులఁ జూపుఁడని చెప్పుట ...	488
47	సీతాదేవి పుష్పకంబుననుండి శ్రీరామలక్ష్మణులఁ జూచుట ...	490
48	నాగపాశబద్ధులైన శ్రీరామలక్ష్మణులఁజూచి సీతాదేవి దుఃఖించుట	491
48	త్రిజట సీతాదేవికి శ్రీరామలక్ష్మణులు జీవించియున్నారని చెప్పుట	502
49	శ్రీరాముఁడు మూర్ఛదేఱి లక్ష్మణుంజూచి దుఃఖించుట ...	505
49	శ్రీరాముఁడు సుగ్రీవునితోఁ గిష్కింధకుఁ బొమ్మని చెప్పుట ...	510
50	కపులు విభీషణుని నింద్రజిత్తని భ్రమించి పరువెత్తుట ...	512
50	దుఃఖించు విభీషణుని సుగ్రీవుండు దేర్చుట ...	515
50	సుగ్రీవునితో సుషేణుఁడు సంజీవకరణిఁ దెప్పింపుమని చెప్పుట...	517
50	గరుత్మంతుఁడు శ్రీరామలక్ష్మణులఁ జూడ వచ్చుట ...	518
50	నాగపాశబంధ విముక్తులై శ్రీరామలక్ష్మణులు గరుత్మంతుని బ్రశంసించుట ...	520
50	గరుడుఁడు శ్రీరామునకు హెచ్చరికగ యుద్ధముచేయ బోధించుట	521
50	శ్రీరామలక్ష్మణులఁ జూచి కపులు సింహనాదంబులు సేయుట...	523
51	రావణుఁడు కపుల సంతోషమునకుఁ గారణము విచారించుట...	524
51	శ్రీరామలక్ష్మణులు నాగపాశవిముక్తులగుటకు రావణుఁడు వ్యసనపడుట	527
51	ధూమ్రాక్షుఁడు యుద్ధమునకుఁ బోవుట ...	528
51	ధూమ్రాక్షున కపశకునంబు లగపడుట ...	530
52	ధూమ్రాక్షు సేనలు కపులతోఁ బోరుట ...	532
52	ధూమ్రాక్షుఁడు కపుల వధించుట ...	534

సర్గసంఖ్య.			పుటసంఖ్య
52	ధూమ్రాక్షుఁడు హనుమంతునిచే హతుండగుట	...	536
53	రావణుఁడు వజ్రదంష్ట్రుని యుద్ధంబున కనుచుట	...	538
53	వజ్రదంష్ట్రుఁడు యుద్ధమునకు వెడలుట	...	540
53	అంగదుఁడు శత్రుసేనపై విజృంభించుట	...	543
54	వానరులు వజ్రదంష్ట్రి సేనలఁ బోరిగొనుట	...	545
54	వజ్రదంష్ట్రుఁడు వానర సేనపై విజృంభించుట	...	546
54	వజ్రదంష్ట్రుఁ డంగదునితోఁ బోరి చచ్చుట	...	548
55	అకంపనుఁడు యుద్ధమునకుఁ బోవుట	...	551
56	అకంపనుఁడు వానరసేనపైఁ గవియుట	...	556
56	హనుమంతునిచే నకంపనుఁడు హతుం డగుట	...	558
57	రావణుఁడు ప్రహస్తుని యుద్ధమునకుఁ బొమ్మనుట	...	562
57	ప్రహస్తుఁడు యుద్ధమునకుఁ వెడలుట	...	567
57	ప్రహస్తున కపశకునంబు లగపడుట	...	570
58	ప్రహస్తసేనలు వానరులతోఁ బోరుట	...	572
58	ప్రహస్తుఁడు కపుల వధించుట	...	577
58	నీలుఁడు ప్రహస్తుని వధించుట	...	580
59	రావణుఁడు తొలిసారి యుద్ధమునకు వెడలుట	...	586
59	విభీషణుఁడు శ్రీరామునకు రాక్షసవీరుల నిరూపించి చెప్పుట	...	591
59	శ్రీరాముఁడు రావణుఁ జూచి యాశ్చర్యపడుట	...	593
59	రావణుఁడు సుగ్రీవాదులతోఁ బోరుట	...	598
59	లక్ష్మణుఁడు రావణుతోఁ బోర రామాజ్ఞఁ గొనుట	...	601
59	రావణ హనుమంతుల యుద్ధము	...	604
59	రావణుఁడు నీలునితో యుద్ధము సేయుట	...	607
59	రావణ లక్ష్మణ సంవాదము	...	611
59	రావణ లక్ష్మణుల యుద్ధము	...	613
59	మూర్ఛిల్లిన లక్ష్మణు రావణుఁ డెత్తఁ బ్రయత్నించుట	...	617
59	హనుమంతుఁడు రావణుఁ దన్ని లక్ష్మణు నెత్తుకొని శ్రీరామునొద్దకుఁ బోవుట	...	622

శ్రీః

శ్రీ సీతా లక్ష్మణ భరత శత్రుఘ్న హనుమత్సమేత శ్రీ రామచంద్ర పరబ్రహ్మణే నమః

శ్రీహయగ్రీవ ప్రసన్న

శ్రీ శారదాయై నమః

శ్రీమతే రామానుజాయ నమః

శ్రీమదాంధ్రవాల్మీకి రామాయణము

యుద్ధకాండము

శ! ప్రతిజ్ఞేడిత! మురి
శాపహా! కారుణ్యశ్రీమ + యతిజనక్షేమా!
తాపహరా! విధిహరనుత!
పాప్మప్రశీలోల! రామ + చంద్రనృపాలా!

మందరము

చెప్పఁబోవు యుద్ధకాండార్థమును వినుమని కవి తన యిష్టదేవతయు, గ్రంథమునఁ బ్రతిపాదింపఁబడిన కథానాయకుఁడు నగు శ్రీరామచంద్రమూర్తిని సంబోధించుచున్నాఁడు. శ్రీధ = లక్ష్మీదేవిని ధరించువాఁడా! అరణ్య కిష్కింధా సుందర కాండములందు సీతా రామవియోగము చెప్పఁబడెను. దానివలన నింతవఱకు శ్రీరామచంద్రమూర్తి యశ్రీకుఁడనియే చెప్పవలసి యున్నది. ఈ కాండమున నా శబ్దము సార్థక మగుచున్నదని భావము. శ్రియఃపతీ! ప్రపద్య + ఈడిత =

ప్రపద్యేడిత. (౧) జనులచేత భజింపఁబడఁదగిన బ్రహ్మరుద్రాదులచేతను, ఈడిత= కొనియాడఁబడినవాఁడా! (౨) ప్ర + పద్య = ప్రకృష్ట పద్యములు = ఉత్తముల వాక్యములు, వానిచేతఁ గొనియాడఁబడినవాఁడా. (౩) ప్ర=ఉత్కృష్టమైన-పద్య= మోక్షమార్గము కలవారిచేతఁ గొనియాడఁ బడినవాఁడా! "సరణిః పద్ధతిః పద్యా" యని యమరుఁడు - మోక్షమార్గములం దన్నిట శరణాగతి యనఁబడు ప్రపత్తియే కదా యుత్తమమైనదని శ్రుతి చెప్పఁబడుచున్నది. 'తస్మాన్న్యాసమేషాం తపసామతి రిక్తమాహుః' ॥ తైత్తి ॥ "భక్త్యాపరమయావాపి ప్రపత్త్యా వా మహామునే। ప్రాప్యో౽హం నాన్యథా ప్రాప్యః' ఇత్యాద్యనేక ప్రమాణములు; భగవద్గీతాదులు ప్రపత్తి యౌత్కృష్ట్యమును స్థాపించుచున్నవి కదా- భగవంతుఁడట్టి ప్రపన్నులచే స్తోత్రము చేయఁబడువాఁడని భావము. ప్రపన్నేడిత యనక ప్రపద్యేడిత యని క్లిష్టవచనరచన యేల యనినఁ బ్రతికాండాదిమ పద్యమునందుఁ దొలుత ద్వయమంత్రములోని పదము చేర్పవలయునని కవి పెట్టుకొన్న నియమమే దీనికిఁ గారణము. ఇట్టి నియమ మేల యుంచుకొనవలసివచ్చె ననిన శ్రీమద్రామాయణ మంతయు దీర్ఘశరణాగతి యని పూర్వాచార్యులు యథార్థముగ వచించిరి. శరణాగతిని విశేషముగఁ బ్రతికాండ మందును బ్రతిపాదించుటచేతనే రామాయణము దీర్ఘశరణాగతి యనఁబడెను. అట్టి శరణాగతిని బోధించు మంత్రము ద్వయము. మంత్రార్థమును బోధించు గ్రంథమున మంత్రముకూడ నుండుట బాగని యీకవి యిట్లు లా మంత్రమును కాండాదిమ పద్యములందు నిర్వహించెను. మంత్రార్థానుసంధానముతో మంత్ర ముచ్చరించినఁ గదా విశేషప్రయోజనము గలుగును. దురితాపహా=దురిత=పాపములను,అపహా= పోఁగొట్టువాఁడా! నీ విట్టివాఁడవని తెలిసికదా ప్రపన్నులు నిన్ను స్తోత్రము చేయుదురని భావము. వ్యవస్థ చెప్పక దురితాపహా యనుటచే సంచితాగాములను అనభ్యుపగత ప్రారబ్ధమును బోఁగొట్టువాఁడని భావము. "ప్రారబ్ధేతర పూర్వపాప మఖిలం ప్రామాదికం చోత్తరమ్, న్యాసేన క్షపయ న్ననభ్యుపగత ప్రారబ్ధఖండంచ నః" అని కదా ప్రపత్తిమహిమ చెప్పఁబడెను. కారుణ్యసీమ = దయకుఁ బొలిమేర యగు వాఁడా! దయ యనునది యెంతయున్నదో యంతయు నీయనలోననే యున్నదని భావము. అయిన దయాప్రయోగమునకు వ్యవస్థ లేదాయనిన, అరిజనభీమా = శత్రువులకు భయంకరుఁడా - అనుగ్రహపాత్రులగు నాశ్రితులయందు మాత్రమే పూర్ణదయ వినియోగింపఁబడునుగాని తన్ను ద్వేషించువారియందుఁ బూర్ణవినియోగము లేదు. పూర్ణవినియోగము లేదనుటచేత శత్రువులందును గొంత దయచూపునని భావము. 'రిపూణామపి వత్సల' యనికదా ప్రసిద్ధి- శత్రువులందును దయదలచువాఁడనికదా రామచంద్రమూర్తి గరుత్మంతునిచేఁ జెప్పఁబడెను. (౧౦౫౯ప.) దానికి నిదర్శనముగఁ జేజిక్కిన రావణుని "పొమ్మా లంక కనుజ్ఞ యిచ్చితిని పోపో" యని కదా రామచంద్రమూర్తి వదలిపెట్టెను. తాపహరా = తాపత్రయముల హరించు

వాఁడా! 'శ్రీపద్మాశ్రితమివప్రహార' మన్నట్లు సంసారసంబంధ తాపముల నెల్ల హరించువాఁడా - విధిహరనుత=బ్రహ్మరుద్రులచే స్తోత్రము చేయఁబడినవాఁడా! క్ష్మాపుత్రీలోల = సీతాదేవియం దాసక్తిగలవాఁడా - రామచంద్ర నృపాలా = రామచంద్రమహారాజా! అవధరింపు మని యథ్యాహార్యము.

ఈ కాండమందలి యర్థ మీ పద్యమున సూచింపఁబడెను. శ్రీప యనుటచే రాజలక్షణమైన సైన్యసంపత్తియు, ప్రపద్యేడిత యనుటచే విభీషణశరణాగతియు, దురితాపహా యనుటచే సముద్రముపై నేయఁదలంచిన బాణమును సముద్ర ద్వీప వాసులైన పాపులపై నేసి చంపుటయు, కారుణ్యసీమ యనుటచే వధ్యులయిన శుకసారణుల వదలి పెట్టుటయు, అరిజనభీమ యనుటచే సమస్త రాక్షససంహారమును, తాపహరా యనుటచే సీతాపరిగ్రహమును, విధిహరనుత యనుటచే బ్రహ్మాది స్తోత్రమును, క్ష్మాపుత్రీలోల-రామచంద్ర నృపాలా యనుటచే సీతాయుక్తుఁడై పట్టాభిషేకముచేసికొని ప్రజల పాలించుటయు సూచింపఁబడియె.

— శ్రీరాముఁడు హనుమంతునిఁ బ్రశంసించుట —

క. కలది కలయట్లు చెప్పిన, వలిముఖమణి గాడ్పుపట్టి • వాక్యములెల్లన్
జలజాక్షుఁడు రాముఁడు విని, యలరుమనంబునను నిట్లు • లను నుత్తరమున్. ౨

అర్థములు. కలదికలయట్లు=జరిగినది జరిగినట్లు-సీతాదేవిని దాను దర్శించినది మొదలు-రావణు రాక-వాని బెదరింపులు-సీతా ప్రత్యుత్తరము-రాక్షసస్త్రీలు బెదరించుట-సీతావిలాపము-సీతాదేవితోఁ దనకునైనసంభాషణము-ఆమె చెప్పినమాటలు-త్రిజటా స్వప్నము - రాక్షసస్త్రీల శరణాగతి - వారి కభయ ప్రదానము - సీతా సందేశము లోనైనవన్నియు నొకటియైన దాఁపక - సుందరకాండమున సీతాదేవి రామచంద్రుని నేయుపాయముగనను పేయముగను గ్రహించుటయుఁ-పారతంత్ర్యము సీతాపురుషకారము చెప్పఁబడెను. ఇట్లు తమ్మునుపాయముగను, నుపేయముగను గ్రహించినవారి నెట్లు సీతారాములనుగ్రహింతురో యీ కాండమునఁ జెప్పఁబడును. సుందరకాండమందు ప్రపన్నునకుఁ దనవిషయమైన భగవదాశయముఁ దెలిపి భగవంతుఁడు నిన్నుఁ రక్షించును, భయపడకు మని చెప్పి వాని విషయము వాఁడు భగవంతునియం దెట్టి నిష్ఠగలవాఁడై యుండుటయు భగవంతునకుఁ దెలుపుట చెప్పఁబడెను. ఈ కాండమందు నాచార్యుఁడు ప్రపన్నుని రక్షింప భగవంతుని ప్రేరించి యాయనచే నతని రక్షింపఁజేయుట తెలుపఁబడును. సుందరకాండమందు గురువుచే బోధింపఁబడిన యోగి మనస్సు ఆత్మాన్వేషణ మం దాసక్తమై సంసార సాగరమునఁ గలుగు విఘ్నముల నెల్ల దాటి దేహమున నాత్మను వెదకి కనుఁగొని జీవాత్మ పరమాత్మలకుఁ గల సామ్యభేదముల విమర్శించి దేహమునఁ జిక్కుపడక దాని దహించి భగవంతునొద్దఁ జేరుట వివరింపఁబడెను. ఇందు జీవాత్మ పరమాత్మ

లకు నైశ్చ్యము సంపాదించి తాను సెలవు తీసికొనుట చెప్పఁబడును. ఇందుఁ బ్రథమమున భృత్యుఁడు కార్యము నెఱవేర్చి వచ్చినపిదప యజమానుఁ డాభృత్యుని విషయమున నెట్లు ప్రవర్తింపవలయునో యావిధము చెప్పుటకై సీతవార్త దెచ్చిన హనుమంతుని సుగ్రీవాదుల యుత్సాహాభివృద్ధికై రామచంద్రమూర్తి స్తోత్రము చేయుచున్నాఁడు.

వలిముఖమణి = వానర శ్రేష్ఠుఁడు - గాడ్పుపట్టి = వాయువు కొడుకు యొక్క - జలజాక్షుఁడు=కమలములవంటి కన్నులుగలవాఁడు. ఇది సంతోషమును దెలుపుచున్నది. అలరు మనంబునను=సంతోషించు మనస్సుతో - ఉత్తరమున్ = సమాచారము విన్న తరువాత విన్నవారు చెప్పుమాటను.

తాత్పర్యము

వానరశ్రేష్ఠుఁడైన హనుమంతుఁడు సీతావిషయమై లంకలో జరిగినది జరిగినట్లు చెప్పఁగా రామచంద్రమూర్తి వినిసంతోషించి బదులుమాట యిట్లుచెప్పెను.

క. మనసునసే నన్యునకుం, బొనరింప నశక్య మగుచుఁ ♦ బొరి దుర్లభమై
తనరు మహాకార్యముఁ దీర్చెను హనుమకు నీడు జోడు♦క్షితిలోఁ గలరే ? ౩

ప్రత్యక్షే గురవః స్తుత్యాః । పరోక్షే మిత్రబాంధవాః ।
కర్మాంతే దాసభృత్యాశ్చ । న కదాచన పుత్రకాః ॥

గొప్ప కార్యములను సాధించిన గురువులను బ్రత్యక్షమున స్తుతింపవలెను. మిత్రులను జుట్టములను బరోక్షమున స్తుతింపవలెను. భృత్యులను దాసులను వారు కార్యము నిర్వహించిన పిమ్మటఁ బొగడవలయును. కొడుకుల నెప్పుడైనను బొగడరాదు. అది వారికి శ్రేయస్కరముగాదు. అని యుండుటచేఁ గార్యము నిర్వహించిన హనుమంతుని రామచంద్రమూర్తి పొగడుచున్నాఁడు.

అర్థములు. మనసునసేన్ = మనస్సుచే నైనను - అన్యునకున్ = హనుమంతునకుఁ దప్ప నితరునకు, పొరిన్ = మిక్కిలి - అశక్యము=శక్తికి మించినది. ఇది సముద్రతరణమును దెలుపును - దుర్లభము=లంకాప్రవేశమును దెలుపును. పొరి దుర్లభము = రావణాసురుని యింటఁ బ్రవేశించి సీతను జూచి లంక నల్లకల్లోలము చేయుట-మహాకార్యము=మరలఁ బ్రాణముతో వచ్చుటను దెలుపును-తీర్చెను = కార్యమెట్లు చేయవలయునో యట్లు చక్కఁగాఁ జేసెను. కలరే=లేరని భావము.

తాత్పర్యము

రామచంద్రమూర్తి సుగ్రీవునిఁ జూచి చెప్పుచున్నాఁడు. మన హనుమంతుఁడు చేసిన గొప్ప కార్యమును మఱియొకఁడు నేను జేసెదనని నోరఁ జెప్పుటకే కాదు, మనస్సులో ననుకొనుటకుఁగూడ వాని శక్తికి మించినది. మిగుల దుర్లభమైనది. అట్టి కార్యమును హనుమంతుఁడు చక్కఁగ నెఱవేర్చి వచ్చెను. ఈయనకు సమానుఁడని చెప్పఁదగినవాఁ డీలోకములో నున్నాఁడా - లేఁడు - లేఁడు.

క. ఆ వ్వాయుతనూజుఁడు గా, కవ్విహగాధీశ్వరుండు • ననిలుండును గా
కెవ్వరి కౌకా సాధ్యం బగు, నవ్వారిధి దాటఁ దోఁపఁ • డాత్మ నొకండున్. ౪

అర్థములు. విహగాధీశ్వరుండు=గరుత్మంతుఁడు - అనిలుఁడు=వాయువు - తోఁపడు=మనస్సునకు వచ్చినవాఁడు కాఁడు-ఆ విహగాధీశ్వరుఁడు ఆ యనిలుఁడని యన్వయింపవలెను. - వేగంబునఁ బ్రసిద్ధికెక్కిన గరుత్మంతుఁడు వాయుదేవుఁడని యర్థము-ఆ వ్వాయుతనూజుఁడు గాక - విహగాధీశ్వరుఁడు గాక-యనిలుఁడు గాక యని యుండవలసి యుండఁగా విహగాధీశ్వరుఁడును అనిలుండును గాక-యనటచే వారి యిరువుర వేగమును నొక్కటిగఁ గలిపిన హనుమంతుని వేగమునకు సరిపోవునని భావము. ఆ యిరువు రొకయెత్తు-హనుమంతుఁ డొకఁడే యొక యెత్తని భావము.

తాత్పర్యము

ఈ హనుమంతుఁడు గాక గమన వేగమునకుఁ బ్రసిద్ధులైన గరుడానిలులు గాక మఱి యెవ్వరికైన నా సముద్రము దాట శక్యమా యని యాలోచించిన నొక్కఁడైన నంతటివాఁడు మనస్సునకు రాలేదు.

చ. అనిమిష యక్షరాక్షసమ • హాహిచయంబులకైనఁ జక్కఁగాఁ
గనఁగొన రానిదాని, దశ • కంధరపాలితమైన లంకనున్,
ఘనతరసత్త్వలక్ష్మిఁ జొరఁ • గాఁ గను టెక్కడఁ? జొచ్చి నేనియున్
దనువునఁ బ్రాణముల్ గలుగఁ • దా మఱి వచ్చుట యేడ నెట్టిఁడున్? ౫

అర్థములు. అనిమిష........చయంబులకైనన్=దేవతల యొక్కయు-యక్షుల యొక్కయు-రాక్షసులయు- గొప్పసర్పములనియు సమూహములకైనను- ఘనతరసత్త్వలక్ష్మిన్ మిగుల గొప్పదగు బలసంపదచే - చొరఁగాన్+కనుట = ప్రవేశింప నాలోచించుట - ఎట్టిఁడున్=ఎట్టివాఁడైనను.

తాత్పర్యము

సుగ్రీవా - లంకను దేవతలకు - యక్షులకు - రాక్షసులకైనను దూరము నుండి దొంగతనముగాఁ జొంచితప్ప యథార్థదృష్టిపాఱఁజూచుటకును సాధ్యముగాదు. పదితలల రావణుఁడు పాలించునట్టి లంకను మఱి యెట్టివాఁడైనను తనబలసంపదచే ప్రవేశింప సాధ్యమా? ఒకవేళ రాక్షసుల నేమఱించి లోపలఁ బ్రవేశించినను మరలఁ బ్రాణములతో వచ్చుటకు సాధ్యమా? అట్లుచేయ మన హనుమంతున కొక్కనికే చెల్లెనుగాక.

క. బలవీర్యము లున్న మహా,బలసుతుతో నీడు వచ్చు • వాఁడును గాఁడేన్
గలఁడే రక్షోరక్షిత, మల దుర్ధర్షంబు, లంక • నటువలెఁ జొరఁగన్. ౬

అర్థములు. ఉన్నన్=ఉండినను-మహాబలసుతునితో=హనుమంతునితో-ఇట్లు చెప్పుటచే కేవల స్వశక్తియేకాక పితృశక్తియుఁ గలసి యున్నదని భావము-మహాబలుఁడనుపేరు వాయువునకుఁదప్ప మఱియెవ్వనికి లేకుండుటచే నటువంటిశక్తియు

మఱియెవ్వనికి లేదు. రక్షోరక్షితము= రాక్షసులచేఁ గాపాడఁ బడునది, అల= ఆ- దుర్ధర్షంబు = కలఁత పెట్టరానిది - అటువలెన్ = హనుమంతుఁడు ప్రవేశించినట్లు.

తాత్పర్యము

ఏమయ్యా యీ హనుమంతునితో సమానులగు బలము విక్రమము గలవారు లోకమున లేరా యందు వేమో - ఒక వేళ నుండినను నన్నివిషయముల వేగము బుద్ధి దృష్టి లోనైన వానియందును వాయునందనునితో సమానుఁడు కాఁడేని రాక్షసుల రక్షించుచున్న యిటువంటి ధర్షింపరాని లంకను హనుమంతుఁడు ప్రవేశించిన విధముగా లంకలోఁ బ్రవేశింప సాధ్యమా ?

క. రవితనయ భృత్యకార్యముఁ, బవమానసుతుండు దీర్చెఁ • బ్రస్తవ్యగతిన్
నవరన నిజవిక్రమతు, ల్యవిధంబుగ బలముఁ జూపె • ననురూపముగన్. ౭

అర్థములు. రవితనయ భృత్యకార్యము=(౧)సుగ్రీవా! బంటు చేయవలసినపని (౨) సుగ్రీవునిబం టెటువంటి గార్యము చేయఁదగునో యట్టికార్యము - అల్పుని దూత యల్పకార్యమే చేయఁగలఁడు. సూర్యపుత్రుఁ డగు సుగ్రీవునంతటి గొప్ప వాని బంటు గొప్పకార్యమే చేయఁగలఁడని భావము. పవమానసుతుండు=హనుమ- సుగ్రీవుఁడు సూర్యుని పుత్రుఁడు-సూర్యుని శిష్యుఁడు హనుమంతుఁడు- గురుపుత్రుని కార్యము శిష్యుఁడు తీర్పవలసినవాఁడే కదా- ప్రస్తవ్యగతిన్ = మిక్కిలి స్తోత్రము చేయఁబడఁదగిన విధముగ- నవరన=చక్కని - అనురూపముగన్ = యజమానుని యోగ్యతకుఁ దగిన విధముగ - విక్రమము - అతిశక్తి.

తాత్పర్యము

సుగ్రీవునివంటివాని భృత్యుఁ డెట్లు కార్యము చేయవలయునో యట్లు మిక్కిలి పొగడ్తకుఁ దగిన విధముగ సీతాన్వేషణకార్యము నెఱవేర్చెను. అంత మాత్రమే కాదు. సుగ్రీవుని యోగ్యతకుఁ దగినట్లు తన యతిశయమైన శక్తికిఁ దగినట్లు బలముకూడఁ జూపి రాక్షసుల వధించి లంక కాల్చివచ్చెను.

ఆత్మశ్లాఘగా నుండునని హనుమంతుఁడు తాను జేసిన కార్యములు చెప్పలేదని సుందరకాండాంతమున వ్రాయఁబడెనే-లంకాదహనాది కృత్యములు రామచంద్రున కెట్లు తెలిసెను అని సందేహింపఁ బనిలేదు. సీతావృత్తాంతము ప్రథమవక్తవ్య మగుట నది పోలుతఁ జెప్పఁబడెను. అంతటితో రామచంద్రమూర్తి సంతోషపడి యూరకుండునా? నీవు సముద్ర మెట్లు దాఁటితివి-ఎప్పుడు దాఁటితివి-ఎట్లులంకలో బ్రవేశించితివి- రాక్షసులు నిన్నుఁ జూడలేదా? వారికిఁ గానరాకుండ సీత నెట్లు వెదకితివి. సీతతో సంభాషించునపుడు కావలికత్తె లెవ్వరు చూడలేదా - చూచి యుండిన రావణునకుఁ జెప్పియుండరా-వాఁడునిన్నూరక విడచెనా-బాధించియుండునే ఇత్యాది ప్రశ్నలు పుట్టక మానవు- వీనికిఁ బ్రత్యుత్తరముగఁ దాను జేసినకార్యము లన్నియుఁ జెప్పక తప్పదు-తన్ను గుఱించి తాను ముందుగఁ జెప్పరాదుగాని ప్రశ్న

అడిగినప్పుడు ప్రత్యుత్తరమీయకతప్పదు. అది యాత్మశ్లాఘ కాదు. రెండవ పద్యములోని కలది కలయట్టులను పద మీ యర్థమును సూచించుచున్నది.

తే. పతి సుదుష్కర మగుపనిఁ • బంప భక్తిఁ, దనకుఁ జెప్పినదై నను • దదనుబంధ
మైనదానిని ఘటియించు • నట్టి భృత్యు, నరసఁ బురుషోత్తముం డండ్రు • పరమమతులు.

సుగ్రీవుఁడు చెప్పని పనియైనను జూచిరమ్మనినఁ గాల్చివచ్చెనే యిది యధిక ప్రసంగితనము కాదా యను సందేహము నివర్తింపనట్లు చేయువాఁడే యుత్తమ దూతయని రామచంద్రమూర్తి చెప్పుచున్నాఁడు.

అర్థములు. సుదుష్కరము = చేయుటకు మిగులఁ గష్టమైనది. పంపన్ = చేయ నాజ్ఞాపింపఁగా - తదనుబంధమైనదానిని - తత్ = యజమానుఁ డాజ్ఞాపించిన దానికి- అనుబంధము=అంటివచ్చినది - సంబంధించినది- పరమమతులు = గొప్ప మనస్సు గలవారు- బుద్ధిమంతులు,(చూ-సుందర-౧౦౦౮-౧౦౨౯)దూతలక్షణము (సుందర ప. ౬౫౯-౭౬౦ మందరము చూచునది).

తాత్పర్యము

యజమానుఁడు చేయుటకు మిక్కిలి కష్టమైన పని చేయుమని యాజ్ఞాపించె నేని నాకింత కష్టమైన పని చెప్పెను, జూచితివా యని మనస్సునందు నొచ్చుకొనక మనయందనుగ్రహము, గొప్ప యభిప్రాయము కలిగి నేను నెఱవేర్పఁగల నను విశ్వాసము తోడఁగదా నాకీపని చెప్పెను అని భర్తయందు భక్తిగలవాఁడై యాయన చెప్పిన పని చేయుటయే గాక యాపనికి సంబంధించినది యాయన చెప్పకున్నను నెఱవేర్చు దూతను బుద్ధిమంతులు పురుషోత్తముఁ డనుదురు. ఇది యుత్తమదూతలక్షణము.

తే. భర్త చేత నియుక్తుఁడై • పతికి హితమ
టంచు నెఱిఁగియుఁ జెప్పఁ డ • టంచు హెచ్చు
నాచరింపని యుక్తస • మర్థభటుఁడు
మధ్యముఁడు నాఁగఁబడు సాధు • మతుల చేత. ౯

అర్థములు. నియుక్తుఁడై = నియోగింపఁబడినవాఁడై - యుక్తసమర్థభటుఁడు = యుక్తుఁడు=ఉత్సాహముతోఁ గూడినవాఁడు-సమర్థుఁడు= చేయగలశక్తిగలవాఁడు.

తాత్పర్యము

భర్తచేత నాజ్ఞాపింపఁబడి యా కార్యము నెరవేర్చి దానికి సంబంధించినది చేయఁదగిన దగుదానిని పని చేసిన భర్తకు మేలని యెఱిఁగియు నతఁడు చెప్పలేదు. చెప్పనిపని మన మేల చేయవలయునని చెప్పినదానికంటె హెచ్చు చేయనివాఁ డుత్సాహము సామర్థ్యము గలవాఁడైనను వానిని బుద్ధిమంతులు మధ్యముండని యందురు

క. పతిచే నియుక్తుఁడై త,త్కృతిని సమర్థుండునయ్యు • భృత్యుఁడు శ్రద్ధా
యుతుఁడయి చలుపక చెఱచిన, నతనిని బురుషాధముం డ • టందురు పెద్దల్. ౧౦

అర్థములు. నియుక్తుఁడై=ఆజ్ఞాపింపఁబడినవాఁడై. తత్కృతిని=ఆకార్యము చేయుటయందు - శ్రద్ధాయుతుఁడయి=శ్రద్ధతోఁగూడినవాఁడై - పురుషాధముఁడు=నీచమనుష్యుఁడు.

తాత్పర్యము

నీ వే కార్యము చేయవలసిన దని భర్తచే నియోగింపఁబడి యా కార్యము చేయుటయందు సామర్థ్యము గలవాఁడయ్యుఁ గార్యమునందు శ్రద్ధలేక చెడిచెనేని పెద్ద లతనిని నీచమనుష్యుఁ డందురు.

ఉ. కాన నియుక్తకార్యమును • గాడ్పుతనూభవుఁ డాత్మగౌరవం
బూనత నొందకుండఁ, బతి • యుష్ణకరాత్మభవుండు సంతసం
బూన ఘటించె, నెండియు ర • ఘూత్తమవంశము నన్ను లక్ష్మణున్
జానకిఁ గాంచి మన్చె, నడి • చావుఁ దొలంచెను. నిల్పె ధర్మమున్. ౧౧

అర్థములు. నియుక్తకార్యమును=నియమింపఁబడిన పనిని - నడి చావు=నిందతోఁగూడిన మరణము.

తాత్పర్యము

ఇట్లుండుటచేత హనుమంతుఁడు పురుషోత్తముఁడు కావున రాక్షసులకుఁ జిక్కినాఁడని తన గౌరవమునకు హాని లేకుండునట్లు - తన్ను నియమించిన సుగ్రీవుఁడు సంతోషించునట్లు నియమితకార్యమును సాధించెను ఇది తన స్వామికిఁ జేసిన యుపకారము. ఇఁక మాకో జానకిని జూచుటచే నాకు లక్ష్మణునకు మాయుత్తమ రఘువంశమునకుఁ బ్రాణములిచ్చి రక్షించెను. ఈయన యీపని చేయకుండిన లోకములోని యందఱు చచ్చినట్లుగాక యపకీర్తితోడి చావు చచ్చియుందుము. అట్టి దుర్మరణమునుండి తప్పించెను. ఆత్మహత్య యనెడి యధర్మమునకుఁ బాలుపడనీక ధర్మమును రక్షించెను.

క. ఇంతటి పరమప్రియము నుదంతము వచియించు పవన • తనయునికిఁ బ్రతి క
త్యంతము సమమగు ప్రియ మొక్కటియుఁ గావింపలేమి • కే దుఃఖింతున్. ౧౨

అర్థములు. ఉదంతము = వృత్తాంతము.

తాత్పర్యము

మాకు మా వంశమునకు దుర్మరణము రాకుండఁ గాపాడినంతటి గొప్ప యుపకార మగు సంతోషవార్తను జెప్పిన హనుమంతుని సాహాయ్యమునకుఁ గేవలము సమానమగు సంతోష మాయనకుఁ గలుగఁ జేయుటకు శక్తి లేదాయెఁ గదా యని మిక్కిలి దుఃఖించుచున్నాను.

ఉ. నాకుఁ గలట్టి సర్వము ధ • నంబు నొసంగినఁ గాని పోదు హృ
ద్వ్యాకులతావిధంబు, ధన • వంతుఁడఁ గా, నిఁక మాఱుమేలు నే
నే కరణిన్ ఘటింపఁ గల • నియ్యెడఁ? గావున నాదు కౌఁగిలిన్
గైకొనవయ్య దానిప్రతి • గా మహితాత్మక! మారుతాత్మజా! ౧౩

అర్థములు. హృత్ + వ్యాకులతా + విధంబు = మనస్సునందలి కలఁత – ప్రతిగా = బదులుగా - మహాత్మక = గొప్ప మనస్సు గలవాఁడా – ఇది భావగర్భితము – మిక్కిలి యుదారమైన మనస్సు గలవాఁడా – నే నిచ్చుదాని విలువ నాలోచింపకుమని భావము - గైకొనవయ్య = ప్రార్థనార్థకము.

తాత్పర్యము

నాకు లోకమునందు నాదియని నేను దలంచిన ధన మెంతగలదో యంతయు నిచ్చితినేని నీవు చేసిన ప్రియమునకు సమానమైన ప్రియము నేను జేసితినని సంతోషింపఁ గలను – అట్లు లన్నను నా యొద్ద ధన మనునది లేదు. ఇఁక నేను నీకేమి మఱుమే లిచ్చుటఁ జేయఁగలను – శుష్కాలాపములతోను, శూన్యహస్తములతోను నేమి లాభము? నేను రాజనై యుంటినేని సర్వరాజ్యము నీకిచ్చి యుందును. అదియు లేదాయె. కావున నీవు చేసిన దానికి బదులుగా నా కౌఁగిలి గ్రహింపుమని యాంజనేయా! ప్రార్థించుచున్నాను. బదులని నేను జెప్పితిని గాని సమానముగ నని చెప్పలేదు. ఇది నీవు చేసినదానికి సమానముగాదు. అయినను ఈ యల్పదక్షిణను శాస్త్రోక్తదక్షిణగా గ్రహింపుమన్నట్లు నాకుగల యల్పము నా యీ దేహము నీకు సమర్పించుచున్నాను. నీ వుదారచిత్తుఁడవు, ఎదుటివారి లోపము లెంచువాఁడవు కావు. కూలివాండ్రవలెఁ బ్రతిఫలాపేక్షచేఁ జేసినవాఁడవు కావు. కేవల ధర్మబుద్ధితో, నుపకారబుద్ధితో దయార్ద్రహృదయముతోఁ జేసిన మహాత్ముఁడవు. కావున నిరాకరింపక గ్రహింపుమని ప్రార్థించుచున్నాను. కృపతోఁ బరిగ్రహింపుము. నీవు నిరాకరించితివేని నాకంతకంటె వేఱు మరణము లేదు. ఏలయిది సమానము గాదనుచున్నా నందువా? అచ్చటఁ జచ్చుటకు సిద్ధముగానున్న సీత ప్రాణములు నిలిపితివి. ఆవార్త తెచ్చి యిచ్చుట నా ప్రాణములు నిలిపితివి. ఇట్లు లిరువుర దేహములు నీ వీయఁగా నీ కొక దేహ మిచ్చుట యెట్లు సమానమగును – కాదు – తెలియును. నే నేమి చేయుదును? ఏమియుఁ జేయలేని తిఁగదాయని పరితాపపడుచున్నాను. నా యీ దుఃఖమును నే నిచ్చినదానిని బ్రీతితో గ్రహించి యణఁపుము – నీవు చేసిన యుపకారములకు నిది సమానము గాదనుటకు మఱియొక కారణము గలదు. నీవు సుగ్రీవునితో నాకు స్నేహము గుదిర్చి గొప్ప యుపకారము జేసితివి. ఆనాటినుండి యీయనకుఁ బ్రత్యుపకార మేమి చేయుదునా యని యాలోచించుచుంటిని – ఇప్పుడిది రెండవది. ఈ రెంటికి నే నిచ్చిన యల్ప మెట్లు సరిగాఁగలదు – కావున హెచ్చు తక్కువ లాలోచింపక నేనిచ్చిన యల్పమును బ్రీతిచేఁ బరిగ్రహింపుము. కౌఁగిలి యిచ్చుట యనఁగాఁ దన్నుఁ దాను సమర్పించుకొనుట – ఆత్మాత్మీయనిక్షేపమన్నట్లు తన్ను సమర్పించుట యనఁగా దనకుఁగల సర్వస్వము, నిత్యవిభూతి, లీలావిభూతి రెండు విభూతులు నర్పించినట్లే – వీనితో నాయనకేమి ప్రయోజనము? ఆయనకుఁ బ్రియమైన దిచ్చినఁగదా ప్రయోజనమందురేమో – హనుమంతునకుఁ బ్రియమైనది

'ఇచ్ఛాగృహీతాభిమతోరుదేహ' యన్నట్లు శ్రీరామచంద్రమూర్తి దివ్యమంగళ విగ్రహమే. పరస్వరూపముతో నాయనకుఁ బనిలేదు. కావుననే నిన్ను విష్ణుఁడంపెనా యని రావణుఁ డడిగించినపుడు విష్ణు వెవ్వరో-నన్నుఁ బంపినది రామచంద్రమూర్తి యనెను. ఎవరి కేది ప్రియమో దానిని భగవంతుఁడు వాని కిచ్చుచుండును. కావున ఆ దివ్యమంగళవిగ్రహమందు హనుమంతునకుఁ బ్రీతియని తెలిసి దానినే యిచ్చెను. దానితో హనుమంతుఁడు సంతుష్టుఁ డయ్యెను. ఈ సందర్భమున శ్రీ భాగవతమున గోపికలకు శ్రీకృష్ణమూర్తి చెప్పిన వాక్యములు స్మరింపనది.

ఉ. పాయని గేహశృంఖలలఁ బాసి నిరంతర మత్పరత్వమున్
జేయుచు నున్న మీకుఁ బ్రతి సేయ యుగంబులనైన నేర నన్
బాయక కొల్చు మానసము ప్రత్యుపకారముగాఁ దలంచి నా
పాయుట తప్పుగాఁ గొనక భామినులార కృపన్ క్షమింపరే. భాగ-౧౧-౧౦౭౯

రుక్మిణీదేవి బ్రాహ్మణునితో—

మ. జలజాతేక్షణుఁ దోడి తెచ్చితివి నా సందేశముం జెప్పినన్
నిలువం బెట్టితి నీ కృపన్ బ్రతికితిన్ నీ యంత పుణ్యాత్మకుల్
గలరే దీనికి నీకుఁ బ్రత్యుపకృతిం గావింప నే నేర నం
జలి గావించెద భూసురాన్వయమణీ! సద్బంధుచింతామణీ!

భాగ-౧౦-౧౭౩౬

ఈ కాండమున ౨౬౧౩ పద్యము హనుమంతునకు సీతోక్తి చూచునది. హనుమంతునకు నుభయవిభూతు లిచ్చుట సరి యని రామచంద్రమూర్తి తలఁచెఁ గాని, సీత యదియుఁ దక్కువగానే తలఁచెను. వీని నన్నిటిని క్రోడీకరించి చూచిన భక్తికి సరియైన ప్రతిఫలము భగవంతుఁడు కూడ నీయఁ జాలఁడనియు సాయుజ్యము కూడఁ దక్కువ ఫలమే యనియు భక్తికి సమానమైనది భక్తియే కాని కర్మమునందుఁ గాని, ఫలమందుఁ గాని వేరొకటి లేదనియు నేర్పడు చున్నది. కావున భగవత్సాయుజ్యము గోరు వారికి భక్తితోడి సేవకంటె నుత్తమసాధనము లేదు, ఇట్టి కౌఁగిలింత గుహ హనుమదాది భక్తులకు లభించెఁ గాని కేవల కర్మఠులకు, మాయాజ్ఞానులకు, యోగులకు లభింపలేదు. ఈ కౌఁగిలింతయే వేదాంతముక్తి-అద్వైతవాదులయిన శంకరాచార్యుల వారును నిట్లు చెప్పిరి.

క. అని పులకితగాత్రుండై, యినవంశాభరణ మపుడు • కృతకార్యు మహా
త్ముని, బావనిఁ బిగికౌఁగిటఁ, మన మారఁగఁ గ్రుచ్చి వెండి•మానసవీథిన్. ౧౪

అర్థములు. పులకితగాత్రుండై=పులకరించిన దేహముగలవాఁడై, ఇనవంశాభరణము=సూర్యవంశపు రాజులలో శ్రేష్ఠుఁడైనవాఁడు రామచంద్రమూర్తి, కృతకార్యున్=కార్యము సాధించినవానిని, మహాత్ముని=గొప్పమనస్సు గొప్పస్వభావము

గల వానిని, పావనిన్=(౧) పరిశుద్ధుని, (౨) ఆంజనేయుని, మనము+ఆరఁగన్= నిండు మనస్సుతో, క్రుచ్చి=కౌఁగిలించి.

కౌఁగిలింతకు అనఁగా సాయుజ్యమునకు నధికారి యెట్టివాఁ డనునది కృత కార్యుఁడు, మహాత్ముఁడు, పావని యను విశేషణములు దెలుపుచున్నవి. కృత కార్యుఁడు = యావజ్జీవము స్వధర్మకర్మముల భగవదర్పణబుద్ధి నాచరించువాఁడు సాయుజ్యమున కర్హుఁడగునుగాని, కర్మమును స్వరూపముతోఁ ద్యజించినవాఁడు యోగ్యుఁడు కాఁడని తెలుపుచున్నది.

౧. మహాత్ముఁడు=గొప్పప్రయత్నము చేయువాఁడు. అనఁగా సోమరియై యంతయు దేవుఁడే చేయునని యుండక తనకు విధివిహితమైన కార్యములు చేయువాఁడు. ముందు తాను జేయవలసినవి చేసిన వెనుక భగవంతుఁడు చేయవలసినది చేయును. చరమశ్లోకత్రయ మీ యర్థమునే బోధించెడిని.

౨. మహాధైర్యము కలవాఁడు- ఎన్ని కష్టములు వచ్చినను బూనిన పని యందలి స్థైర్యము ధైర్యము గలవారయి భక్తులు 'శ్రేయాంసి బహు విఘ్నాని' యన్నట్టు లెన్నియో మనశ్శోధనమునకై విఘ్నములు కష్టములు కలుగును. వానికి భయపడి తన ప్రయత్నము మానరాదు.

౩. మహాత్ముఁడు=గొప్ప మనస్సు గలవాఁడు - సత్త్వగుణభూయిష్ఠమైన మనస్సే గొప్ప మనస్సు=సాత్త్విక కార్యములు చేయుటయం దాసక్తమైన మనస్సు గలవాఁడు.

౪. గొప్ప స్వభావముగలవాఁడు=సత్త్వగుణము కొంతసేపుండి కొంతసేపు లేకుండునదిగా నుండరాదు. అది స్వభావమై యుండవలెను. రాజసతామస కార్యములందు మనస్సు పోనిదై యుండవలెను.

౫. గొప్పబుద్ధి గలవాఁడు=నిశ్చయాత్మకమైనది బుద్ధికావున "మ య్యేవ మన ఆధత్స్వ మయి బుద్ధిం నివేశయ" యన్నట్లు బుద్ధి భగవంతునిమీఁదనే యుంపఁబడినదై యుండవలయును.

౬. మహాశరీరముగలవాఁడు = అనఁగా బలసినవాఁ డని యర్థముకాదు. మనోబుద్ధిచిత్తములు శుద్ధముగా నున్నవి కదా, బాహ్యమున నెట్లుండిన నేమి యనక శరీరముకూడ శుచిగా నుంచుకొనువాఁడు. 'శుచి ర్దక్ష' యని కదా చెప్పఁబడెను. బాహ్యాభ్యంతరముల రెంటను నేకవిధముగ నుండవలెను. త్రికరణశుద్ధి యుండవలెను. దీనివలన నస్పృశ్యము స్పృశించుట, అభక్ష్యముల భక్షించుట, దురాలోచనములు చేయకుండుట, చూడరానివి చూడకుండుట లోనైనవి గ్రహింపవలెను.

ఆత్మశబ్దమునకీ యర్థము లన్నియుఁ గలవు.

పావని=పవిత్రుఁడు, 'యజ్ఞోదానం తపశ్చైవ పావనాని మనీషిణా'మ్మన్నట్లు, దేవతారాధనము-'దానమేకం కలౌయుగే'-యన్నట్లు దానము-తపస్సు-సత్యము-దమములోనైనవిగాక యుత్తమ తపస్సు అగు న్యాసము కలవాఁడై యుండవలెను. న్యాస మనఁగా తన రక్షాభారము భగవంతునియందు నైచుట. దేహపోషణమందే యాసక్తుఁడుగాక యదృచ్ఛాలాభసంతుష్టుఁడయి నిర్భరుఁడు, నిర్భయుఁడు నగుట.

తాత్పర్యము

ఈ ప్రకారము చెప్పి దేహము సంతోషముచే బులకరింపఁగా రామచంద్రమూర్తి, కార్యసాధకుఁడు, మహాత్ముఁ డగు నాంజనేయుని నిండుమనస్సుతోఁ గౌఁగిలించుకొని తరువాత తన మనస్సునందు.

పులకితగాత్రుఁడు మనమారఁగఁ గ్రుచ్చి ననుటచే రాజనీతి ననుసరించి యుపచారార్థము గాదనియు పరమార్థబుద్ధిఁ గౌగిలించెననియు నేర్పడు చున్నది.

బోయ యగు గుహుని, గ్రద్దను, జటాయువును, క్రోఁతియగు హనుమంతుని కౌఁగిలించుటచే రామానుగ్రహమునకుఁ బూర్ణభక్తిగల సమస్త భూతములు యోగ్యములే యని సూచన.

వాల్మీకి సూర్యోదయము లంకలోఁ జెప్పెఁగాని యీవల సూర్యాస్తమానము చెప్పకుండుటచే నిది యంతయు ఫాల్గున శుద్ధ చతుర్దశి పగటిచర్యయనియే గ్రహింపవలసియున్నది.

క. తలపోసి రామచంద్రుఁడు, జలజహితతనూజుఁ గాంచి • జానకి రోయం
గల పని చక్కంబడియెను, జలనిధి దలపోయ మనసు • ఝల్లనె నయ్యా. ౧౫

అర్థములు. తలపోసి = ఆలోచించి.

తాత్పర్యము

ఆలోచించినవాఁడై రామచంద్రమూర్తి సుగ్రీవునిఁ జూచి యిట్లనియె. జానకీ దేవిని వెదకు పని చక్కనయ్యెను. కాని సముద్రమును దలఁచిన దిగులగుచున్నది.

క. దుస్తర మగు జలనిధిని సమస్తకపుల్ దాఁటి దక్షి•ణాశాతటమున్
ప్రస్తుతగతిఁ జేరుట యెటు? నిస్తులితబలాఢ్య! చెపుమ • నీ వొక యుపమన్. ౧౬

అర్థములు. దుస్తరము = దాఁటఁ గష్టమైనది - దక్షిణాశాతటమున్ = దక్షిణపుటొడ్డును - ఉపమన్ = ఉపాయమును - ప్రస్తుతగతిన్=స్తోత్రముచేయఁ బడు విధముగ.

తాత్పర్యము

దాఁటఁ సాధ్యముగాని సముద్రమును దాఁటి అందఱు వానరులు దక్షిణ దిక్కు తీరమును లోకము మెచ్చునట్లు చేరు టెట్లో నీ వుపాయముఁ దెలిసిన చెప్పుము.

క. జనకతనూభవ యుండెడు,నునికియుఁ దద్వార్త మీర • లొప్పుగఁ జెప్పన్
విని తిని వనచరు లిందఱు, వననిధిఁ దరియింప నెట్లు•వల నగుఁ జెపుడా ? ౧౭

అర్థములు. ఉనికి = ప్రదేశము - తద్వార్త = ఆమె విషయమైన వృత్తాంతము - వనచరులు = వానరులారా !

తాత్పర్యము

వానరులారా ! సీత యెం దున్నది, యెట్లున్నది మీరు చెప్పగా వింటిని. అచ్చటికి మనము పోవలయును గదా మార్గమున సముద్రము దాఁటవలయును గదా ! మీ రందఱు నెట్లు దాఁట సాధ్యపడునో యుపాయము చెప్పుఁడు.

క. అని పలికి హనుమతో సహి, త నిబర్హణుఁడైన రామ•ధరణీశుఁడు యో
జన సల్ప మహాబాహుం, డనయము శోకంబు దన్ను • నారట పెట్టన్. ౧౮

అర్థములు. అహితనిబర్హణుఁడు=శత్రువులఁ జంపువాఁడు.

తాత్పర్యము

ఈప్రకారము వానరులకుఁ దెలిపి దీర్ఘబాహువులు, భుజబలముగలిగి శత్రువుల ధ్వంసము చేయఁగల రామచంద్రమూర్తి యాంజనేయునితో శోకముచే నారాటపడుచు నాలోచించెను.

దీర్ఘబాహుఁడు, శత్రునిబర్హణుఁ డను రెండు విశేషణములు భుజబలముచే సముద్రము నెండఁగట్టి దాఁట నాలోచించె నని సూచించుచున్నవి. శత్రువగు రావణునకు సహాయుఁ డగు సముద్రుఁడు శత్రు వేకదా.

—• { ౨-వ సర్గము. సుగ్రీవుఁడు శ్రీరాముని కుత్సాహంబుఁ గలుగ భాషించుట. } •—

సీ. తతశోకసంతప్తు • దశరథాత్మజుఁ గాంచి, సుగ్రీవుఁ డిట్లను • శోకనాశ
కరములౌ సూక్తుల • ధరణీశనందన, యే లయ్య ప్రాకృతు•లీల నీవు
సంతాప మందెదు•సౌహృదంబుఁ గృతఘ్నుఁ,డవలఁ ద్రోచెడి భంగి•నార్తి విడువు
మింతకు నీ విట్లు • సంతాప మందఁగఁ, గారణం బేమియుఁ • గానరాదు
ఆ. వగతు నునికి దెలిసి • బలిమి నీరధి దాఁటి, లంక లగ్గ పట్టి • బింకమునను
నీకు శాత్రవునిని•నిహతునిఁ గావించి, వెలయఁగల మి టుల • కలఁగ నేల. ౧౯

అర్థములు. ప్రాకృతులీలన్ = పామరజనునివలె, సౌహృదంబు=స్నేహభావము, కలఁగన్ = కలఁత చెంద.

“అప ద్యున్మార్గగమనే, కార్యకాలాత్యయేషుచ, అపృష్టోపి హితాన్వేషీ బ్రూయా త్కల్యాణభాషితమ్ ॥”

క. హితకార్యము నన్నడుగఁడు, పతి నా కేమిటి కప్పుచ్చుపరిభావన మం
చతి మౌనముద్ర నుండుట,మత మనరు సునీతివిదులు మంత్రుల కెందున్. పంచ॥

తావునఁ దన్నడుగ కున్నను సుగ్రీవుఁడు చెప్పుచున్నాఁడు.

తాత్పర్యము

సముద్రము దాటు టెట్టులా యని విచారపడు రామచంద్రమూర్తిని జూచి సుగ్రీవుఁడు శోకము నాశముచేయునట్టివియు, మంచి ధైర్యము కలిగించునట్టివియు మాటల నిట్లనియె. రాజకుమారా! నీవు క్షత్రియుఁడవయ్యు నుత్సాహము వదలి సామాన్యజనుని వలె నేల పరితాప పడెదవు కృతఘ్నుఁడు స్నేహము విడిచినట్లు నీవు శోకమును వదలిపెట్టుము. ఇప్పు డేమి చెడిన దని నీవు పరితాపపడెదవు? నీపరితాపమునకుఁ గారణ మున్నఁ జెప్పుము. ఇంతవఱకుఁ బగవాఁ డెందుండునది తెలియక యూరకుంటిమి. వాఁ డుండు ప్రదేశము తెలిసెను. ఇఁక మనమువోయి మనబలము చూపించి సముద్రము దాటి లంక ముట్టడించి లగ్గలు పట్టి నీ విరోధిని జంపఁగలము. ఏల యూరక కలవరపడెదవు ?

మ. మతిమంతుండవు శాస్త్రవేత్తవు దలం ♦ పం బండితాద్యుండవున్
స్తుతధీప్రాజ్ఞవరుండ విట్లు దగునే ♦ శోకంబునం గుందఁగా ?
ధృతి యోగీంద్రుఁడు స్వార్థహానికర బుద్ధిన్ వీడున ట్లీ వృథా
మతిఁ బోవీడుము, కార్యనాశ మగుఁ జుమ్మా శోకదైన్యంబులన్. ౨౦

అర్థములు. మతిమంతుండవు=రాఁబోవు విషయముల గురించిన యాలోచన చక్కఁగా జేయఁగలవాఁడవు– "మతి రాగామిగోచరా". శాస్త్రవేత్తవు. ఏయే సమయములందు నెట్లెట్లు వర్తింపవలయునని శాస్త్రము చెప్పుచున్నదో యావిధానము దెలిసిన వాఁడవు. పండితాద్యుండవు = సర్వము దెలిసిన విద్వాంసులందు మొదటివాఁడవు – స్తుత=స్తోత్రము చేయఁబడిన, ధీ=బుద్ధిగల, ప్రాజ్ఞవరుండవు = బుద్ధిమంతులలో శ్రేష్ఠుఁడవు, ధృతిన్=ధైర్యముచే, స్వార్థహానికరబుద్ధిన్ = తాను గోరిన ప్రయోజనమునకు హాని కలిగించు నాలోచనను, వృథామతిన్=వ్యసనముతోడి మనస్సును.

తాత్పర్యము

రామచంద్రా! కాఁగల విషయమై నీ వెంతో మంచి యాలోచన సేయు సామర్థ్యము గలవాఁడవు. ఆ యాలోచనయైనను శాస్త్రము ననుసరించి చేయుదువు గాని, శాస్త్రజ్ఞానము గలవాడ వగుటచే దానికి విరుద్ధముగ జేయవు. ఏలన, నీవు పండితులలో శ్రేష్ఠుడవు. ప్రాజ్ఞు లందరు నీబుద్ధిని స్తోత్రముచేయుదురు. ఇట్టివాడవు నీవు శోకముచే బాధపడవచ్చునా? తాను సాధింపఁబూనిన ప్రయోజనమును విఘ్నపఱచు బుద్ధిని యోగీంద్రుఁడు ధైర్యముచే నెట్లు విడచునో యట్లు నీవు, సంకల్పించిన సీతాప్రాప్తి యను ఫలమునకు విరోధులగు శోకమును అధైర్యమును వదలుము. విడువవేని నీవుపూనిన కార్యము చెడిపోవును. కార్యసాధక మైన బుద్ధిసంపద గలదు గాని, సహాయసంపత్తి లేదని దుఃఖించెదవా ?

క. దిగ్గనఁ దరించి జలనిధి, నగ్గిప ముగ్గిసలుగా ని • శాటుల్ లంకన్
లగ్గలుపట్టి భవద్రిపు, గగ్గోలొనరింత్రు చూడు • కపివీరవరుల్. ౨౧

అర్థములు. దిగ్గన=తటాలున - శత్రువులు హెచ్చరిక పడుటకు ముందే- నిశాటుల్=రాక్షసులు - నగ్గిసముగ్గిసలు=తికమకలు - గగ్గోలు=కలవరము.

తాత్పర్యము

అప్పుడే శత్రువులు రాఁబోయిరా యని రాక్షసులు హెచ్చరిక తప్పియుండఁగనే వానరు లున్నట్టుండి సముద్రముదాఁటి- వానలేని పట్టి పిడుగు లట్టు వచ్చెనే యని రాక్షసులు దిక్కుదోఁపక తిక మక లాడుచుండఁగా లంక కోట గోడ లెక్కి- నీ శత్రువును గలవరపడఁ జేయుదురు.

క. దీనుండై యుత్సాహ వి, హీనుండై శోకమునను • గృశియించెడి య
మ్మానవు కార్యములుం జెడు, మానని వ్యసనముల నతఁడు • మఱుఁగుచునుండున్.

తాత్పర్యము

ఒకవేళ శోకమునకుఁ గారణ మున్నను, దీనుఁడై యుత్సాహము లేనివాఁడై యేడుచుచు కృశించువాని కార్యములు చెడును. వాఁడు వదలని వ్యసనములచే దాపము నొందుచుండును. కావున శోకకారణ మున్నను ఉత్సాహము వదలరాదు.

ఉ. ఈ హరియూథపుల్ కుశలు • లెల్లరు వీరులు విక్రమోద్ధతుల్
సాహసికాగ్రణుల్ నృపతి • చంద్రమ! నీదు నిమిత్తమై కృతో
త్సాహులు, చిచ్చునైన నుఱుకఁ • దప్పరు. వీరి ముదంబుఁ జూడఁగా
నాహవదోహలం బెఱుక • యయ్యె, దృఢంబ సుమీ మదూహయున్. ౨౩

అర్థములు. కుశలులు = ఉపాయము నాలోచించుటయందు సమర్థులు - విక్రమ + ఉద్ధతుల్ = పరాక్రమముచే గర్వించినవారు - చిచ్చునైనన్ = అగ్నియందైనను - ఉఱుకన్=దూఁకుటకు - తప్పరు = వెనుక దీయరు-ఆహవదోహలంబు = యుద్ధమునం దభిలాష - మత్ + ఊహయున్ = నా యూహ.

తాత్పర్యము

ఈవానర సేనానాయకు లందరుఁ జక్కఁగా నాలోచించుటయందు సమర్థులు- ఉత్తయాలోచన చెప్పుటయేకాదు. దాని నెఱవేర్పఁదగిన శక్తికలవారు. పరాక్రమవంతుల మను గర్వముగలవారు - ఎంతకైనను తెంపుచేయఁగలవారు- నీకార్యము సాధింపవలయు నను నుత్సాహముతో నున్నారు. నిప్పులలో దూఁకవలసివచ్చినను వెనుకఁదీయరు. ఇఁక నీళ్ళమాట యేల? వీరి సంతోషము చూడఁగా యుద్ధాభిలాషగలవారై యున్నారు. అది శుభసూచకము, మనకు మేలుగలుగును. నా యూహ వ్యర్థము కాదు.

ఉ. రావణుఁ బాపకర్ము రణ • రంగమునందు వధించి జానకిన్
దే వల నైన పద్ధతిని • దేఁకువఁ బూనుము, సేతుబంధ మిం

కేవిధి సాగు, లంకఁ గను • టెట్లగు నట్లు సమాచరింపుమీ
యా విబుధారి వీడు గని • నంత హతుం డని వాని నెంచుమా. ౨౪

అర్థములు. వలనైనపద్ధతి=సాధ్యమగు మార్గము - తేఁకువ = ధైర్యము.

తాత్పర్యము

ఏ యుపాయము చేసిన పాపాత్ముఁడగు రావణుని యుద్ధమందుఁ జంపి సీతా దేవిని తీసికొని రావచ్చునో యా మార్గమును ధీరుఁడవై పూనుము. నీవు చేయ వలసిన దంతయు సముద్రము దాఁటి లంక చూచుటకుఁ దగిన యాలోచన - లంక కనఁబడెనా, వెంటనే రావణుఁడు చచ్చినాఁడని నమ్ముము.

సీ. సేతునిర్మాణంబుఁ • జేయక వారిధిఁ, దరియింపరాదయ్య • సురలకైన
సేతు వేర్పడఁ గపి • వ్రాతంబు దాఁటుట, శత్రుసంహారంబుఁ • జలుపుటారెఁ
గా నిశ్చయింపుము • కామరూపులు కపుల్, సమరశూరులు కలి • జంక రెపుడుఁ
గావున రాజేంద్ర! • కార్యనాశిని యైన, వైక్లబ్యబుద్ధిని • వదలవయ్య
ఆ. జగతి శోక మెపుడు • శౌర్యవినాశన, క్షమము గాన నీకుఁ • గలఁక దగదు
శౌర్యముఖ్యులైన • జనులు కార్యంబుల, బలము ధృతియు దిటముఁ • బాయ రెపుడు.

అర్థములు. కలి = యుద్ధము - వైక్లబ్యబుద్ధిని = దుఃఖవశమైన బుద్ధిని - శౌర్యవినాశన క్షమము = శౌర్యమును నాశనము చేయు శక్తి గలది, కలఁక = వ్యాకులత్వము.

తాత్పర్యము

రామచంద్రా! యొకటి నిశ్చయము. సేతువు కట్టక సముద్రము దాఁట వలయు ననిన దేవతలకైనను సాధ్యముగాదు. సేతు వేర్పడెనా వానరులు దాఁటుట శత్రుసంహారము జరిగెననియే నిశ్చయింపుము. ఆ విషయమున నీవు సందేహింపఁ బనిలేదు. ఏల యందువా? ఈ వానరులు కామరూపులు. యుద్ధమునందు శూరులు. కావున కలహమునకు భయపడరు. కాఁబట్టి నీవు కార్యనాశకమైన దుఃఖమును వదలిపెట్టుము. అది నీకుఁ దగినది కాదు. శౌర్యము ప్రధానముగాఁ గలవారు కార్యములు చేయుటయందు బలము, ధైర్యము స్థైర్యము వదలరు.

లోకమునందు నిస్తులబ • లులు నినుబోఁటి మహాత్ము లెవ్వఁడున్
వ్యాకులతన్ వహింపరు ప్ర • ణష్టవినష్టములందు నెవ్వడేన్;
శోకము సర్వకార్యలయ • సూచక మాట యెఱింగి దైన్యముం
బోకడఁ బెట్టి ధైర్యగుణ • మున్ గొనియాడుచు నుండు రెవ్వఁడున్. ౨౬

అర్థములు. నిస్తులబలులు = అసమానమైన బలము గలవారు, ప్రణష్ట= రూపము లేక నాశమైనవానియందు, వినష్టములందు= కానరాక పోయిన వానియందు,

తాత్పర్యము

సముద్రము దాఁటుట యసాధ్యకార్యమని నేను వ్యసనపడ లేదు. సీతను

జూచుటకు నిచ్చిపెట్టకపోయితినిగదా యని దుఃఖించెద నందువా యదియును నీకుఁ దగినదికాదు. ఏలన—బలమునం దసమానులైన నీవంటి మహాత్ములు, మొదలంట నాశనమైనవానికిఁ, గించితాకాలము కానరానివానికి నే సందర్భమందును గలఁతఁజెందరు. ఏలన శోకము సమస్తకార్యముల నాశనముచేయునని తెలిసి దుఃఖము వదలి ధైర్యమునే ప్రశంసించి గ్రహింతురు.

ఉ. నీ వన బుద్ధిమద్వితతి ♦ నిస్తులితుండవు శాస్త్రకోటులన్
గోవిద! పుష్కలుండవు నకుంఠితవిక్రమశాలి విప్పుడో
త్మావర! మాదృశాప్తహిత ♦ మండలసంగతి శత్రుకోటికిన్
గావర మాఱఁ జేయఁ దగుఁ ♦ గాలము గా దిది గుందుచుండఁగన్. ౨౭

అర్థములు. బుద్ధిమత్+వితతిన్=బుద్ధిమంతుల సమూహమందు, నిస్తులితుండవు=అనమానుఁడవు, పుష్కలుండవు=పరిపూర్ణుఁడవు, అకుంఠిత = మొక్కవోని, విక్రమశాలివి=పరాక్రమముచేఁ బ్రకాశించువాఁడవు, మాదృశ=మావంటి, ఆప్త-హితమండలసంగతిన్=ఆప్తులయు, మేలు కోరువారలయు సమూహములతోఁ గూడి, కావరము=గర్వము.

తాత్పర్యము

నీవో యన్నివిధముల శాస్త్రసమూహములందు, బుద్ధిమంతులలో ననమానుఁడవు- పరిపూర్ణుఁడవు- పండితుఁడవు- ఏలోపములేని పరాక్రమము గలవాఁడవు- ఇట్టి నీవు రాజేంద్రా! యిప్పుడు నావంటి మిత్రుల సహాయముతో శత్రువుల గర్వ మణఁప వలసిన సమయమే కాని యేడ్చుచుండవలసిన సమయము కాదు.

ఉ. నీకు శరాసపాణికిని ♦ నిల్చి ముఖాముఖిఁ బోరువాని ము
ల్లోకములందుఁ గానఁ, గపులున్ బలయుక్తులు వారు చేయఁగాఁ
జేకొనినట్టి కార్యమునఁ ♦ జేటొనగూడదు, ఘోరివార్ధి నీ
వేకరణిం దరించి హృద ♦ యేశ్వరిఁ జూచెదు నైశమే నృప! ౨౮

అర్థములు. శరాసపాణి=చేత విల్లు ధరించినవాఁడు- ముఖాముఖి = కట్టెదురు - ఏకరణిన్ = ఏవిధముగనైనను.

తాత్పర్యము

చేత విల్లు ధరించి నిలఁబడిన నీకు నెదురుముఖమై నిల్చి యుద్ధము చేయఁగల వాఁడు మూఁడు లోకములందు లేఁడు ఇట్టి నాయకుఁడవైన నీకు సేనగా నుండు వానరులు బలవంతులు. వారు చేయఁబూనిన పనికిఁ గీ డొక్కనాటికిని రాదు. కావున నే విధముగ నైనను సముద్రమును దరించెదవు. నీ ప్రియురాలిని శీఘ్రమునం దే

క. కావున శోకము మానుము, నీ వెదఁ గ్రోధంబుఁ గొనుము • నిశ్చేష్టులు నా
భూవరులు మందభాగ్యులు, వారిరి వడఁకుదురు కోప • వంతుని కెవరున్. ౨౯

అర్థములు. నిశ్చేష్టులు=కార్యము చేయనివారు - ఉత్సాహములేనివారు.

తాత్పర్యము

నీ విట్లు శేడ్చుచుండిన నీకు శత్రువులు భయపడరు. కావున నేడుపు మాని కోపము తెచ్చికొనుము. కోపముగలవానికి నుత్సాహము లేనివారు అదృష్ట హీనులునగు రాజులు భయపడుచుందురు.

శా. మాతో నీ విపు డెట్లు వారిధిఁ దరిం•పన్ వచ్చుఁ దత్పద్ధతిన్
చేతోవీథిని సూక్ష్మబుద్ధిఁ గనుమీ • నేనావశిల్ దక్షిణా
తాతీరంబును జేరినా రిపులు నా•శం బైరి, వీరల్ శిలా
వ్రాతత్మ్రారుహవృష్టిఁ గూల్చెద రమి•త్రవ్యూహముం బోరిలోన్. ౩౦

అర్థములు. దక్షిణాతాతీరంబును = దక్షిణపు దిక్కునఁ గల యొడ్డును - శిలావ్రాత = రాలసమూహము యొక్కయు-వృక్ష=చెట్లయొక్కయు - వృష్టిన్ = వానచే-అమిత్రవ్యూహమున్=శత్రుసమూహమును.

తాత్పర్యము

మా తోడ నీవు సముద్రము దాటు నుపాయ మేదో దాని నాలోచింపుము. సముద్రముయొక్క దక్షిణతీరమును వానరులు చేరిరా వెంటనే శత్రువులు నాశమైనవారే. వీరలు రాలవానచే. చెట్లవానచే శత్రుసమూహమును ధ్వంసము చేయుదురు. కావున సహాయ సంపత్తికి, సాధన సంపత్తికిఁ గొఱఁత లేదు.

క. వరుణాలయ మెటు లైనను, దరియింపన్ వలయు నంత•దనుక నె కష్టం
బరి రావణాసురుఁడు సం,గరసీమను నిర్జితుండు•గా నెంతు నృపా! ౩౧

అర్థములు. వరుణాలయము=సముద్రము.

తాత్పర్యము

ఏ విధముగ నైన సముద్రము దాటవలయును. అంతవఱకే కష్టము. ఆ పని నెఱవేఱినా రావణాసురుఁడు యుద్ధమందుఁ జచ్చినవాఁడే యని నా యభిప్రాయము.

క. ఏలా పలుమాటలు నీ, కే లీలలనైన విజయ • మొనఁగును శుభదం
బౌ లక్షణములఁ గంటిని, జాలఁగ నా మనము సంత•సంబునఁ దేలెన్. ౩౨

తాత్పర్యము

రామచంద్రా! పెక్కుమాట లేల కాని నీ కేవిధముగ నైనను జయము కాగలదు. శుభశకునములు నాకుఁ గానవచ్చుచున్నవి- నామనస్సు సంతోషమునఁ దేలాడుచున్నది. ఇది గొప్ప శుభచిహ్నము.

3-వ సర్గము. శ్రీరాముఁడు హనుమంతుని లంకయందలి దుర్గాదులవిధం బడుగుట.

చ. అని యిటు యుక్తియుక్తముగ • నాడిన నా పరమార్థవేది యా
జనకసుతామనోహరుఁడు • చక్క గ్రహించి మరుత్తనూజునిం
గని కనులార నీవె దశ • కంఠుని వీటిని గంటిగాదె? లం
కను జెపు మెన్ని దుర్గములు • గ్రాలెడినో బల మెంతమాత్రమో. 33

అర్థములు. పరమార్థవేది=వాస్తవవిషయము దెలిసినవాఁడు, వాస్తవార్థము తెలిసినవాఁడు మరల నొకని నడుగనేల యనిన వేషమునకుఁ దగిన భావలు చేష్టలుండవలయును గావున లోకసంగ్రహార్థ మడుగుచున్నాఁడు.

తాత్పర్యము

యుక్తియుక్తముగ సుగ్రీవుఁడు చెప్పినమాటలువిని వాస్తవార్థ మెఱింగిన రామచంద్రమూర్తి హనుమంతా! నీవు లంకానగరము కన్నారఁ జూచితివికదా దానియందుఁ గోట లెన్నియున్నవి, సేన యెంతమాత్రము చెప్పుము.

క. నా తపము బలముచేతనొ, సేతువు బంధించియొండె • శిఖసఖబాణ
వ్రాతమున నొండె జలనిధి, నే తీరునసైన దాఁట • నే నిపుణుండన్. 3౪

తాత్పర్యము

నా తపోబలముచేతనో, సేతువు కట్టియో, అగ్ని సమానములైన బాణములచే సముద్రమున నీరిగిరించియో యే విధముగనైన సముద్రమును దాఁటు సామర్థ్యము నాకుఁ గలదు. ఆ విచారము నాకు లేదు.

తే. ద్వారదుర్గ క్రియాదుల • దనుజసదన
ములను దద్గుప్తికర్మముల్ • పలుక వయ్య
తీఱుపాటుగ సర్వంబుఁ • దిరిగి కంటి
వన్నివిధములఁ గుశలుండ • వాంజనేయ! 3౫

తాత్పర్యము

లంకకు ద్వారము లెన్ని? కోటలెన్ని? వాని నేవిధముగఁ గట్టినారు- రాక్షసుల యిండ్లెన్ని? వానిని రక్షింప నేమి యుపాయము చేసినారు? ఇవన్నియుఁ జెప్పుము. తీరికగా లంకయందుఁ దిరిగి చూచితివికదా - అన్నిట సమర్థుఁడవు కావున నీకే విద్యకూడఁ దెలియును చెప్పుము.

ఉ. రామవిభుండు తన్ను నిటు • ప్రశ్న మొనర్పఁగ విన్న దేవ లం
కామహిమంబు దుర్గబల • కాండ విధానము వాహనావళీ
ధామవిభాగమున్, మకర • ధామము భీమత, గుప్తికర్మమున్
భీమసురారిభక్తియుత • వేద్యము సర్వము విన్నవించెదన్. 3౬

అర్థములు. దుర్గబలకాండవిధానము=కోటలయు సేనా సమూహములయు నేర్పాటు విధము-వాహనావళీ ధామవిభాగము=వాహనముల సమూహములకై కట్టఁబడిన యిండ్ల యేర్పాటు - మకరధామము=సముద్రము - గుప్తికర్మమున్ = ఏవిధముగ రక్షకై చేసిన కార్యమును, భీమసురారి = భయంకరులైన రాక్షసులకు రావణునందు గల - భక్తి=ప్రేమయు - వేద్యము=తెలియఁదగినది.

తాత్పర్యము

రామచంద్రమూర్తి కిట్లనుచుండెను ఇట్లనుగ హనుమంతుఁడు దేవా! లంకయొక్క గొప్పతనము, దానియందలి కోటల- సేనల యేర్పాటు- రథగజాది వాహనములకుఁ గట్టఁబడిన యిండ్ల విధము, సముద్రముయొక్క భయంకరత్వము, శత్రువులను వధించుటకై చేయఁబడిన రహస్యమైన యేర్పాటులు, రావణాసురునియందు రాక్షసులకుఁగల భక్తి- తెలియవలసినది సర్వము విన్నవించెదను వినుము.

ఉ. క్ష్మారమణా! ప్రహృష్టమయి ♦ మత్తగజాకులమై, మహాకృతుల్
తేరులు గల్గి పూర్ణముగ ♦ దేవవిరోధిచయావృతంబు నై
సారతురంగమాఢ్య మయి ♦ సార్గళసంపరిబద్ధతుంగ వ
ద్ద్వారచతుష్కయుక్త మయి ♦ వాసవవైరిపురంబు గ్రాలెడిన్. 3౭

అర్థములు. ప్రహృష్టమయి = సంతోషించినది - మత్తగజాకులము = మదించిన యేనుఁగులతో నిండినది - మహా+ఆకృతుల్ = గొప్ప యాకారములు గలవి - దేవవిరోధిచయ = రాక్షస సమూహముతో - ఆవృతంబు = ఆవరింపఁబడినది- సార=బలముగల- తురంగమాఢ్యము = అశ్వసంపత్తిగలది - సార్గళ = అడ్డముగావేయు గడియ ప్రాఁకులతో-సంపరిబద్ధ=బాగుగ బిగింపఁబడిన - తుంగవత్ =ఎత్తైన - ద్వారచతుష్కయుక్తము=నాలుగు ద్వారములతోఁ గూడినది. వాసవవైరిపురంబు= రావణుని పట్టనము - లంక గ్రాలెడిన్ = ఒప్పుచున్నది.

తాత్పర్యము

రాజేంద్రా ! లంకాపురము దండలు సంతోషముతోఁ గూడినవారే-లంక యంతయు మదించిన యేనుఁగులచేతను, పెద్దతేరులచేతను - బలముగల గుఱ్ఱముల చేతను నిండి - రాక్షస సమూహముచే నావరింపఁ బడి యున్నది. లంకకు నాలుగు దిక్కుల నాలుగు ద్వారములు గలవు. వాని పాకిండ్లను అడ్డగడియ ప్రాఁకులచే బంధించి యున్నారు.

ఉ. అందలి యశ్మయంత్రముల ♦ నాగతశాత్రవసైన్య మంద వే
ప్రమండు, శతఘ్నికల్ తలచు ♦ రాక్షససంఘవినిర్మితంబు లె
క్రందుగ ద్వారదేశములఁ ♦ గ్రాలుచు నుండు, సువర్ణసన్మణి
బృందవిహారజాంతరిత ♦ భీమసువప్రము దుష్ప్రధర్షమౌ. 3౮

అర్థములు. అశ్మయంత్రములన్ = రాలయంత్రములచే - ద్వారమునకుఁ పై భాగమునఁ బలకలపైఁ గానరాకుండ శిలలు పేర్చి శత్రువు లా మార్గమున వాని క్రిందికి వచ్చినపుడు వారిపై నవి పడునట్లు చేయు యంత్రములు - ఆగత= వచ్చిన- శాత్రవసైన్యము=విరోధులసేన - అంద=ఆ ద్వారమందే - మ్రందున్ = చచ్చును - సువర్ణ = బంగారు చేతను - మణి = మంచి కెంపులచేతను - విదూరజ=వైడూర్యములచేతను - అంతరిత = పొదుగఁబడిన - భీమ = భయంకరమైన సువప్రము= పెద్ద కోటగోడ - దుష్ప్రధర్షము = పడఁగొట్టి లోపలికిఁ బోవలయు ననిన సాధ్యము కానిది.

తాత్పర్యము

ఆ ద్వారములయందలి రాలయంత్రములచే నా మార్గమున వచ్చిన విరోధి సేన యందే చచ్చును. రాక్షసులచే నిర్మింపఁబడి వేయువను నూర్గురిని జంపు శతఘ్నులు ద్వార ద్వారము నొద్ద విశేషముగ నిలుపఁబడి యున్నవి. (ఈ శతఘ్ను లిప్పటి ఫిరంగులవంటివి.) బంగారు కెంపులు, వైడూర్యములు వీనిచే నడుమ నడుమఁ బొదుగఁబడిన కోటగోడను బగులఁగొట్టి లోపలికిఁ బోవ సాధ్యపడదు.

సీ. ఆ పురిచుట్టు మ•హాభీమములు గ్రాహ•వంతముల్ శీతల•వారి మిగులఁ
గమ్రంబు లగుచు న•గాధంబు లగుచు న•గడ్త లొప్పును మీన•కాండయుక్తి
ద్వారంబులందు యం•త్రారూఢములు చాల•విరువులౌ వంతెనల్ • వెలయునాలు
గొప్పుటఁ గలవు మ•హాగృహపంక్తు లా, పలకలవంతెనల్ • పరుల సేన
తే. వచ్చునప్పుడు రక్షించుఁ • బట్టణంబు, వాని యంత్రాళిబలమునఁ • బరిఖలోన
విడుచు చుందురు; వానిలోఁ • వేదికలును వైఁడికంబంబులును గల్గి • పటిమనొప్పి.

అర్థములు. మహాభీమములు = మిగుల భయంకరములు - గ్రాహవంతముల్ = మొసళ్ళుగలవి - అగాధములు = మిగుల లోఁతైనవి.

తాత్పర్యము

ఆ పట్టణము చుట్టు మిగుల భయంకరములై మొసళ్ళుగలిగి మిగులలోఁతైన యగడ్తలు గలవు. చల్లనినీరు, చేపలుగలవై చూచుటకు మనోహరముగనుండును. ద్వారములందు నాయగడ్తల మీఁద జనుల రాకపోకల కనుకూల మగునట్లు యంత్రములతోఁ జేయఁబడిన వెడలుపాటి వంతెనలు గలవు. శత్రువులు వచ్చినపుడీ యంత్రములఁ ద్రిప్పిన నా వంతెనలు లేచి కోట ద్వారములకుఁ దలుపులవలె నడ్డపడును. అచ్చట నిండ్లవరుసలుగలవు. అవియును ఆ పలకలవంతెనలు శత్రువులు ముట్టడించినపుడు పురమును రక్షించును, ఆ పలకల వంతెనలను యంత్రబలముచేఁ బని లేనపుడు నీళ్ళమీఁద దిగవిడతురు. శత్రువులు వచ్చినపుడు యంత్రములతోఁ జేదుకొందురు. ఆ నాలుగింటిలో వరుఁగులు, బంగారు స్తంభములు కలదై, బిగువుకలదై.

క. కదలింపరాక దృఢమై, పొదలెడు నంతెన యొకంపు ♦ పోలుచును జుమ్మీ
యది సేనాదర్శనమున, యదనున దశకంధరునకు ♦ నగుఁ దానముగన్. ౨౦

అర్థములు. తానము=స్థానము – అదను=సమయము.

తాత్పర్యము

గట్టిగఁ బాఁదుగొని కదలింపరానిదై యొక వంతెన యుత్తరద్వారమునఁ గలదు. అది సేనల విమర్శింప రావణుఁడు వచ్చినపుడు వానికి విశ్రమస్థానమై యుండును.

క. మతిమత్ప్రకృతియుతుం డయి, సతతంబు యుయుత్సుఁ డగుచు♦స్వయముగ సేనా
తతి సావధానముగఁ గను, చతులితజాగరిత రావ♦ణాసురుఁ డొప్పున్. ౨౧

అర్థములు. మతిమత్ =ఆలోచనగలవాఁడు, ప్రకృతియుతుఁడు = స్వస్వభావమున జాడ్యము మొదలగు దురభ్యాసములు లేకయున్నవాఁడు, విశేషణోభయపదకర్మధారయము – మతిమంతమైన స్వభావముతోఁ గూడినవాఁడనియైన జెప్పవచ్చును. యుయుత్సుఁడు = యుద్ధమం దుత్సాహము గలవాఁడు, సావధానముగన్ = హెచ్చరికతో, అతులితజాగరిత = అసమానమైన హెచ్చరికతో, అతులితజాగరిత రావణాసురుఁడు మతిమత్ప్రకృతియుతుండయి సతతము స్వయముగ యుయుత్సుఁడయి సేనాతతి సావధానముగఁ గనుచు నొప్పును అని యన్వయక్రమము.

తాత్పర్యము

రావణాసురుఁడు మిక్కిలి హెచ్చరికఁ గలవాఁడై యాలోచనపరుఁడు, స్వస్వభావ యుక్తుఁడై సర్వదా యొకరిమాటలమీఁదనే యాధారపడి యుండక తానే యుద్ధాసక్తుఁడై సేనా సమూహములను విమర్శించి చూచుచుండును.

సీ. ఇఁక లంక నాదేయ♦కృత్రిమ పార్వత, వాన్యచతుర్విధ♦నన్యసాధ్య
భీకరదుర్గ ♦ సమాకలితంబయి సురలకు నేనియుఁ ♦ జేరఁగరాక
యాలంబహీనమై ♦ యంబుధికూలంబు, నందు నావలు చన♦నైనఁ ద్రోవ
లేక వార్తకుఁ జేర ♦ వీక శైలాగ్రంబు, నం దమరావతి♦చందమునను
తే. వాజివారణపూర్ణమై♦పరమయంత్ర, వివిధ పరిఖాశతఘ్ని కా♦న్వితమునగుచుఁ
బరమదుర్జయ♦మయి దశేవక్త్రపాలి,తంబు పోలుపొందు దశరథ♦తనయ యంమ.

అర్థములు. నాదేయ = నదియందుఁ బుట్టినది, అనఁగా జలదుర్గము, కృత్రిమ=మనుష్యులచేఁ గల్పింపఁబడినది, ప్రాకారాది దుర్గము=కోటలు మొదలయినవి, పార్వత= పర్వతసంబంధమైన దుర్గము, వాన్య=వనసంబంధ దుర్గము, అనఁగా వనదుర్గము, చతుర్విధ=నాలుగు విధములైన, అనన్యసాధ్య = ఇతరులకు సాధింపరాని, భీకర = భయంకరములైన, దుర్గ = కోటలచే, సమాలికతంబు = చక్కఁగా కూర్పఁబడినది, ఆలంబహీనమై = ఆధారములేనిదై, త్రికూట పర్వత

ముల జాలను సలులతో గొట్టి నునుపుగాఁ జేసి యా పర్వతశిఖరమున లంకను గట్టి యున్నారు. కావున దానికి వేఱాధారము లేదు. వార్తకున్ జొరవీక = ఇతరదేశ సమాచారము లక్కడి వారికి, అక్కడ నేమి జరుగునో వెలుపలివారికిఁ దెలియు మార్గము లేక, వాజివారణపూర్ణమై = గుఱ్ఱములతో నేనుఁగులతో నిండి,పరిఖా= అగడ్తలచే, అన్వితము=కూడినది.

తాత్పర్యము

ఇఁక లంకామహాత్మ్యము చెప్పెద వినుము. లంకయందు జలదుర్గము, కృత్రిమ దుర్గము, పర్వతదుర్గము, వనదుర్గము లను నాలుగు విధములైన భయంకర దుర్గములు గలవు ఇవి యితరులకు సాధ్యములగునవి కావు. లంక నిరాధారముగ సముద్రతీరమున నున్నది. దానియందుఁ బ్రవేశింప దేవతలకైన సాధ్యముగాదు. నావలు కూడ దాని సమీపమునకుఁ బోవ మార్గము లేదు. పర్వత శిఖరంబున నమరావతివలె నున్నది. బయటి వార్త లోపలికిఁ బోవుటకుఁ గాని, లోపలివార్త బయటికి వచ్చుటకుఁ గాని వలనుపడదు. ఏనుఁగులు గుఱ్ఱములు నిండి యున్నవి. గొప్ప యంత్రములు, నానావిధములైన యగడ్తలు, శతఘ్నులుకలవు. జయించుట కేమియు సాధ్యమగునది కాదు. దీనిని రావణుఁడు పాలించు చున్నాఁడు.

సీ. ప్రాగ్ద్వారరక్షకుల్ ♦ పదివేవు రుందురు, ఖడ్గాగ్రయోధులు ♦ కడిఁదిబలులు
శూలపాణులు రణ♦శూరులు దుర్జయుల్, దక్షిణద్వారంబు ♦ రక్షసేయు
నియుతరక్షోవరుల్ ♦ నిష్ఠురవిక్రముల్, చతురంగ బలయుక్త ♦ సతత ముంద్రు
పడమటివాకిఁట ♦ బ్రయుతరక్షోగ్రిముల్, చర్మఖడ్గాన్వితుల్ ♦ చటులబలులు

తే. వినుతసర్వాస్త్రకోవిదుల్ ♦ వెలయు చుందు
రుత్తరద్వారమును గాదు ♦ చుంద్రు న్యర్బు
దాసురులు కులజులు వార♦ణాశ్వవాహు
లిందఱును బూజితులు రాక్ష♦సేశ్వరునకు. ౪౩

అర్థములు. ప్రాగ్ద్వారరక్షకుల్ = తూర్పు ద్వారమును గాచువారు. ఖడ్గాగ్రయోధులు=కత్తులు ధరించి తక్కిన సేనకు ముందు నిలిచి యుద్ధము సేయు వారు. కడింది బలులు=విస్తార బలముగలవారు. నియుతరక్షోవరుల్ =లక్షరాక్షస శ్రేష్ఠులు. ప్రయుత = పదిలక్షల, రక్షః+అగ్రిముల్ = రాక్షసశ్రేష్ఠులు, చర్మఖడ్గ అన్వితులు=డాలులు తరవారులతోఁ గూడినవారు, న్యర్బుద=పదియర్బుదముల,

తాత్పర్యము

ఇఁక సైన్య సన్నివేశము చెప్పెద వినుము. తూర్పునుండి శత్రువులు వచ్చుటకు వలను పడదు. కావున ఆ ద్వారమును పదివేల రాక్షసులు సేనలకు ముందు నిలిచి ఖడ్గములతో యుద్ధముచేయు రాక్షసులు కాచియున్నారు. దక్షిణ ద్వారమును శూలములు, ధరించిన శూరులు, జయింపరాని వారు,లక్షరాక్షసులు, మిగులఁ

బరాక్రమవంతులు, నాలుగు విధములైన (రథములు, ఏనుఁగులు గుఱ్ఱములు, కాలిబంట్లు) సేనలతోఁగూడి కాచియుందురు. పడమటి వాకిట పదిలక్షల రాక్షసులు డాలులు తరవారులు ధరించి కాచియుందురు. వీరికి శస్త్రవిద్యయుఁ దెలియును. ఉత్తరద్వారమును పదియర్బుదముల రాక్షసులు గొప్పవంశములఁ బుట్టినవారు ఏనుఁగులు గుఱ్ఱములు వాహనములుగాఁ గలవారు రక్షించుచుందురు. వీరందఱు రావణునకుఁ బూజ్యులు, విశ్వాసపాత్రులు.

క. మధ్యమభాగాశ్రితులు న,సాధ్యులు నూర్వేవు రుంద్రు ♦ సర్వంబు సదా
రాధ్యం బగు తత్పురమున, మధ్యాహ్నార్కాభకోటి ♦ మానవభోజుల్. ౪౪

తాత్పర్యము

లంకాపుర మధ్యమున నసాధ్యులగు రాక్షసులు నూఱువేలమంది కలరు. సైన్యమంతయు సర్వదా శ్రేష్ఠమైనదియే. ఎందును లోపములేదు. మధ్యాహ్నసూర్యునితో సమానులగు రాక్షసు లందుఁ గోటిగలరు.

క. చెఱిచితి వంతెన లెల్లను, బఱచితిఁ బాతికబలంబుఁ ♦ బాడు లగడ్తల్
నుఱుమాడితి వప్రంబులు, తెఱపులు నెటఁ గన్న నిపుడు ♦ దేవారిపురిన్. ౪౫

తాత్పర్యము

ఇది నేను లంకను దొలుతఁజూచినప్పుడున్న విధము. ఇప్పు డిట్టు లున్నదని తలఁపవలదు. ఏలన వంతెనల నన్నిటిని జెఱిచితిని. గట్టివంతెన యొకటియు లేదు. పాతికసేనను భాడుచేసితిని. అగడ్తలు పాడుపడఁ జేసితిని. కోటగోడలు దుమ్ముచేసితిని. ఇప్పుడు లంకలోనికి నన్ని మార్గములే. ఏ కంతలోనుండియైనఁ దూఱిపోవచ్చును.

సీ. శ్రీరామ! యెటులైన ♦ వారిధిఁ దరియింపఁ, గలిగినయేని లం ♦ కాపురంబు
వానరకోటిచేఁ ♦ బాడని నమ్ముము, బల మంతయును నేల ♦ పార్థివేంద్ర
యంగదద్వివిదులు ♦ ఋక్షాధ్యక్షనీలురు, మైంద పనస నలుల్ ♦ మాత్రమైన
వారిధి దాఁటి దే ♦ వారిపురంబునఁ, బర్వత వనములు ♦ భగ్నపఱిచి

తే. తోరణంబులు చెఱిచి ప్రా ♦ కారములను
తుటుము గావించి భవనముల్ ♦ దుమ్ము గలిపి
వత్తు రీ వారిఁ బంపుము ♦ వరముహూర్త
నిశ్చయముఁ జేయుమిఁక ప్రయా ♦ ణించుపొంటె. ౪౬

అర్థములు. తుటుము = పొడి, ప్రయాణించు పొంటె = ప్రయాణము చేయుకొఱకు.

తాత్పర్యము

రామచంద్రా! లంకె ఎంత దృఢముగనైన నుండునుగాక. ఎందఱు రక్షకులుండిన నుందురుగాక. ఏవిధముగనైన సరియ సముద్రము దాఁటితిమేని వానరులచే

లంక పాడైన దని నమ్ము్ము. వానరసేన యంతయుఁ బోవలసిన పని లేదు. అంగదుఁడు, ద్వివిదుఁడు, జాంబవంతుఁడు, నీలుఁడు, మైందుఁడు, పనసుఁడు, నలుఁడు వీరు మాత్ర మైనను సముద్రమును దాఁటి లంక ప్రవేశించి పర్వత దుర్గములు వన దుర్గములు విఱిచి ద్వారములు పాడుచేసి ప్రాకారములు పొడిచేసి యిండ్లన్నియు దుమ్ములోఁ గలిపి రాఁ గలరు. వీరి నైనఁ బంపుము. ప్రయాణమునకు మంచి ముహూర్త మేర్పాటుచేయుము.

—• { ౪-వ సర్గము. శ్రీరాముఁడు కపిసేనతో లంకపై దండయాత్ర వెడలుట } •—

క. అను హనుమంతుని వాక్యము, లను క్రమముగాఁగ రాముఁ • డాలించి యనున్
దను జేంద్రపురము విధ్వం, సనముం గావింతుఁ జుండు • సత్యం బంటెన్. ౪౭

అర్థములు. అనుక్రమముగన్ = వరుసగ, ఆదినుండి యంతమువఱకు.

తాత్పర్యము

ఈ ప్రకారము చెప్పుచున్న హనుమంతునిమాట లాదినుండి కడవరకు విని రామచంద్రమూర్తి యిట్లనెను. లంక జెఱచుట గొప్ప కార్యముగాదని తలఁచి రావణాసురుని పురము ధ్వంసము చేసెదను. సత్యము చెప్పుచున్నాను.

చ. అగు నిది మంచిమూర్తము ప్ర • యాణము సేయఁగఁ బద్మమిత్రుఁడున్
గగనము మధ్యముం దఱిసెఁ • గ్రాలు నిదే విజయంబు పేరిటన్
నెగడిన సన్ముహూర్తము వ • నేచరనాయక ! యిప్డు పోయినన్
బగతుఁడు జానకిం గొనుచుఁ • బ్రాణముతో నిల కేఁగఁ గల్గడిన్ ! ౪౮

అర్థములు. మూర్తము = ముహూర్తశబ్దభవము, పద్మమిత్రుఁడు = సూర్యుఁడు.

తాత్పర్యము

"మనోజవంతు మాండవ్య" యను సూక్తినిఁబట్టి ప్రయాణమునకు నిదియే మంచి ముహూర్తము అంతియేకాదు, సూర్యుఁడు ఆకాశమధ్యమున నున్నాడు. ఈముహూర్తమునకు విజయమని పేరు. ఇది మంచిముహూర్తము. సుగ్రీవా! యిపుడు మనము బయలుదేరి పోయితిమేని పగవాఁడు జానకిని దీసికొని ప్రాణముతో నెందుఁబోగలఁడు. ఎచటికిఁ బోయినను జచ్చినవాఁడే, ఈ ముహూర్తమునకు నభిజిత్తని పేరు. సూర్యుఁడు నడినెత్తికి సరిగానుండు సమయము. "ఆర్ద్రాహిరగ మిత్ర మఘా వసు జల విశ్వాభిజి ద్వీరిం చేంద్రాః, వింద్రాగ్ని ఘూల వరుణార్యమ భగ తారా దివా ముహూర్తా స్స్యః" అని పగట పదునాలు ముహూర్తములు గలవు. ముహూర్తమునకు ముక్కాలు గంటకాలము. ఇందు నెనిమిదవది అభిజిత్తు. అనఁగా పదునొకొండు గంటల పదునైదు నిమిషముల మొదలు పండ్రెండు వఱకు నభిజిత్తు-ఇది పగలు పండ్రెండు గంటలుగల దినము వృత్తాంతము.

"అన్వీయమానో రామోసౌ, మహూర్తేఽభిజితి ద్విజాః
విలంఘ్య వివిధాన్ దేశాన్, మహేంద్రం పర్వతం యయౌ"
స్కాందము 3-౨-౨౮.

గీ॥ గార్గ్యసిద్ధాంత మత ముషః కాలకలన
శకున మూనట యది బృహస్పతి మతంబు
విప్రజనవాక్య మరయంగ విష్ణుమతము
సర్వసిద్ధాంత మభిజిత్తు సమ్మతమగు శీ. పు. 3-౪౧
భుక్త్వా దక్షిణయాత్రాయాం, ప్రతిష్ఠాయాం, ద్విజన్మని
ఆధానేచ ధ్వజారోహే మృత్యుద స్స్యాత్సదాభిజిత్.

అని జ్యోతిషరత్నాకరమందుఁ గలదు కదా. అభిజిత్తు దక్షిణదేశయాత్ర కెట్లు రామచంద్రమూర్తి మంచిదనెను. కిష్కింధకు లంక యాగ్నేయ మూల నున్నదికాని దక్షిణమున లేదు. కావున దోషంబు లేదు.

ఉ. నా యభిమానమున్ వినుచు ♦ నా ప్రియురాలు మనంగ నాసయేక్
జేయునుగాక, పీడితుఁడు ♦ చేపడినట్టి విషంబు గ్రోలి నా
పాయదశన్ సుధాద్రవముఁ ♦ బానముఁ జేసినరీతి సూర్యజా!
యీయెడఁ గాలయాపన మిఁక ♦ కేల యొనర్పఁగ రిత్త చూడుమా. ౪౯

అర్థములు. అభిమానము = దండయాత్ర, వినుచున్ = త్రిజటాదులచే నని భావము. నాపాయదశన్ = ప్రాణమునకు నపాయము వచ్చిన స్థితియందు, సుధాద్రవము=అమృతరసము, కాలయాపనము=కాలము జరుపుట.

తాత్పర్యము

నేను దండయాత్ర బయలుదేఱుట త్రిజటాదులు చెప్పఁగా విని నా ప్రియురాలు బ్రదికియుండుటకు నాశ యైనఁ గలది యగునుగాక. ఎట్లనిన, రోగి చేతికి దొరకిన విషము దిని ప్రాణముపోవు సమయమున నమృతరసము ద్రాగి జీవించినట్లు ఇచ్చట నాలోచనలతో వ్యర్థకాలక్షేపము చేసిన నేమి మేలు ?

ఆ. ఉగ్రకిరణతనయ ♦ యుత్తరఫల్గుని, నేఁడు రేపు హస్త ♦ నిలుచు శశియుఁ
గాన నేఁడ సకల సేనాసమేతంబు, పయనమగుట లెస్స ♦ ప్లవగరాజ. ౫౦

తాత్పర్యము

ఒకనాఁటిలో మించినదేమి, రేపు పోదమందువేమో, సుగ్రీవా! నేఁ డుత్తరఫల్గుని నక్షత్రము- నాజన్మనక్షత్రమున కాఱవది, సాధనతార-కావున శుభము - రేపు చంద్రుఁడు హస్తతోఁగూడిన నేడవతార నైధనతార యగును. అది యశుభము. రేపు ప్రయాణము చేయరాదు. కావున నేఁడే, యిప్పుడే సకల సేనలతో ప్రయాణము చేయవలయును.

ఈ దినమున నక్షత్ర ముత్తర యనియు, దానితోఁ జంద్రుఁడు కూడి

యున్నాఁడనియుఁ జెప్పుటచే నిది ఫాల్గునమాసము కావున నేఁడు పున్నమ యని తెలియఁదగియున్నది.

చతుర్దశినాఁటి సాయంకాలము రామాంజనేయ సమాగమము. కావునఁ బున్నమనాఁడు దండయాత్ర- 'అభిజి త్సర్వదోషఘ్న' మ్మని అభిజిత్తునఁ బ్రయాణము చేయుటకు తిథ్యాదులఁ జూడఁ బనిలేదు.

క. ఉత్తమశుభదము లైన ని,మిత్తముఁ లెంతయును దోఁచె•మేలుగ మనకున్
 మిత్తికి వశపడ రాక్షస,సత్తముఁ గావించి నిజము • జానకిఁ దెత్తున్. ౫౧

అర్థములు. మిత్తికి = మృత్యుదేవతకు.

తాత్పర్యము

మంచివి శుభశకునములు పెక్కులు కానవచ్చుచున్నవి. కావున రావణుని జంపి సీతను దెచ్చుట సత్యము.

క. మీఁగన్నదరెడి శత్రులఁ, జాఁగఁజఁగొని విజయి వగుచు • జనకజఁ గొని నీ
 వీఁగను బన్నం బను క్రియఁ, జాఁగురె పయనింప నిదియ•సమయం బనుచున్.

అర్థములు. అశుభశకునము లేవి యనిన:—మీఁగన్ను = మీఁదు + కన్ను=మీఁగన్ను=కంటి పైభాగము, చాఁగఁజగొని = నాశముచేసి, విజయివి = గెలిచినవాఁడవు, ఈఁగెదు=పోఁగొట్టుకొనెదవు, బన్నము = అవమానము, భగ్నశబ్దభవము, చాఁగురె = ప్రశంసార్థకము.

తాత్పర్యము

శత్రువులనాశనముచేసి, జయమునొందినవాఁడవై, యవమానమునుబోఁగొట్టుకొందు వని చెప్పెడు రీతి కంటి పైభాగ మదురుచున్నది. ప్రయాణము సేయుటకు నిదియే ప్రశస్తసమయము; మీఁగన్ను-వాల్మీకికుడికంటి పైభాగమైనది, యెడమ కంటి పైభాగమైనది చెప్పలేదు. మహేశ్వరతీర్థులు కుడికన్నని వ్రాసిరి. ఇది చింత్యమని వ్రాయుచు గోవిందరాజులు "నేత్రస్యాధ స్ఫురణ మసకృ త్సంగరే భంగహేతుః। శ్నేత్రోపాంతే హరతి నయనం, నేత్రమూలేచ మృత్యుః। నేత్రస్యోర్ధ్వం హరతి సకలం మానసం దుఃఖజాతం। వామే చైవం ఫల మవికలం దక్షిణే వైపరీత్యమ్॥" అను శ్లోకమును జ్యోతిశ్శాస్త్రమునుండి యనువదించిరి. దీనివలన నెడమ కన్ను పైభాగ మదరిన మానసదుఃఖము లన్నియుఁ దొలఁగునని యేర్పడుచున్నది.

"దక్షిణాక్షి పరిస్పందో దక్షిణస్య భుజస్యచ। హృదయస్య ప్రసాదశ్చ, సద్యః సంసిద్ధి సూచకాః" శకున శాస్త్రమున మగవారికిఁ గుడికన్నదురుట శుభసూచకమని చెప్పఁబడెను.

రామాయణమందే రామసుగ్రీవులు సంభాషించునపుడు వాలి రావణులకు నెడమకన్నదరెనని చెప్పఁబడెను. (కిష్కింధ ౧౭౫ వ పద్యముఁ జూచునది.) దీని

వలనఁ గుడికన్నయినను క్రిందిభాగ మదరుట శుభసూచకము. పైభాగ మదరుట వలన మేలు లేదని యేర్పడుచున్నది.

చ. వరనయవేది సెండి యను ♦ వానరరాజును లక్ష్మణుండుఁ ద
న్గురుతరరక్తిఁ గొల్వఁగను ♦ గొబ్బునఁ బంపుము నూరువేల్ వనే
చరులను మార్గశోధనము ♦ నల్పఁగ నీ వెలగోలుగాఁ జమూ
వరుఁ డగు నీలు వెంట హరి ♦ వర్య! మహాబల వేగవంతులన్. ౫౩

అర్థములు. వరనయవేది = గొప్పనీతిశాస్త్ర పండితుఁడు. గొబ్బునన్ = శీఘ్రముగ, ఎలగోలు = పెద్దసేనకు ముందుగాఁ బోవుచున్న సేన, పెద్దసేన రాఁదగిన మార్గము శోధించుట యీ సేన పని (Reconnoitering) చమూవరుఁడు = సేనాపతి.

తాత్పర్యము

సుగ్రీవ లక్ష్మణులు తన్నుఁ బ్రేమతోఁ గొల్చుచుండఁగా నీతి శాస్త్రము చక్కఁగా దెలిసిన రామచంద్రమూర్తి సుగ్రీవునితో నిట్లనియె. నీ వెలగోలు సేనగా నూఱు వేల వానరులను త్రోవలు శోధించుటకుఁ గాను మహాబలము వేగము గలవారిని ముందుగా సేనానాయకుఁ డగు నీలుని వెంటఁ బంపుము. వీరు బలవంతులు గాకేని శత్రుభయము గలదు, వేగవంతులు గాకేని పెద్ద సేన వచ్చి కలసికొనును ఈ రెండును సరిగాదు.

చ. వరఫలమూలవంతమయి ♦ వారిసుఖాస్పదమై సుశీతమై
పరమమధుప్రభూత మగు ♦ బాటలఁ దోకొని పొమ్ము నీల! నీ
హరివరసేనలన్, విను దు ♦ రాత్ములు వైరులు నీళ్ళ మూలికో
త్కరఫలకోటులన్ విషముఁ ♦ దార్తురు, పొంతురు త్రోవ రాక్షసుల్. ౫౪

అర్థములు. ఇట్లు సుగ్రీవునకుఁ జెప్పి ప్రయాణ మగుచున్న నీలునితో నిట్లు రామచంద్రమూర్తి చెప్పుచున్నాఁడు వరఫలమూలవంతమయి = మంచి ఫలములు, మూలములు గలది, వారి = నీళ్ళు, సుశీతమై = మిగుల చల్లనిదై, పరమమధుప్రభూతము = శ్రేష్ఠమైన తేనె విస్తారముగఁ గలది, మూలికోత్కర ఫల కోటులన్ = వేళ్ళ సమూహములందు; పండ్ల సమూహములందు; విషముదార్తురు = విష ముంచుదురు, పొంతురు = పొంచియుందురు. "మంత్రౌషధ ప్రయోగేన పరం నిస్సంజ్ఞం కృత్వావా రాజ్యం గృహ్ణీయాత్" - బుధస్మృతి - ౪ ౨.

తాత్పర్యము

నీలా! వానరుల కాహారము లగు మంచిఫలములు మూలములు గలట్టియు, యారోగ్యకరములై చల్లని నీళ్ళుగలట్టియు, విస్తారముగఁ దేనె గలట్టియు, బాటల యందు నీ వానరసేనలను దోడుకొని పొమ్ము - నీవొక విషయమున జాగ్రత్తగల వాఁడవై యుండవలెను. ఏ దన రాక్షసులు త్రోవలందుఁ బొంచియుండి తటాలునఁ బైపడుదురు. దుష్టబుద్ధులు గావున వీరి కాహారమైన పండ్లయందు, మూలములందు,

నీళ్ళయందు విషము పెట్టుదురు. ఇట్టి భయములేని త్రోవలందు సేనల నడిపింపుము. నీతిశాస్త్రము ననుసరించి రామచంద్రమూర్తి చెప్పెనే కాని భయకారణము లేదు. రావణుఁడు దుర్గ-సేనా - బంధు - స్వబలగర్వితుఁడై తనపై నెవడు రాఁగలఁడని వేగుల నంచినవాఁడు కాఁడు. ఈవిషయమున శూర్పణఖా మారీచులు రావణుని దూషించియున్నారు. రామచంద్రమూర్తి యీ పదినెలలుగా నెచ్చట నేమి చేయుచుండునది రావణునకుఁ దెలియదు. హనుమంతుఁడు లంకఁ గాల్చి వానర సేన సముద్రతీరమునకు వచ్చువఱకు వాఁడు నిద్రపోవుచునే యుండెను. ఆకారణముచే నీ కుచేష్టలు చేసినవాఁడు కాఁడు, అవకాశము లేదు.

క. జలదుర్గంబులఁ గానన, తలములఁ బల్లముల వైరి • తతి ఛన్నంబై
బిలముల డాఁగును గావున, వల నగు బై కెగిరి కనఁగ • వానరతతికిన్. ౧౭

అర్థములు. జలదుర్గంబులన్ = చొచ్చుటకుఁ గష్టమగు నీటిప్రదేశములందు, వైరితతి = విరోధుల సమూహము, ఛన్నంబై = మఱుఁగుపడినదై, బిలములన్ = బొరియలందు.

తాత్పర్యము

మీరు పోవునపుడు మఱియొకటి కనిపెట్టవలెను. మనము పోవునపుడు తటాలున మీఁదఁబడుటకై శత్రువులు జలదుర్గములందు, అడవులలోఁ జెట్లచాటున, గుంతలయందు, బొరియలయందు, దాఁగియుందురు. కావున నిట్టివారిని వానరులు పైనెగిరి పోవుచు కనిపెట్టవలెను.

క. బలవిక్రమవంతులకును, జలుపఁగ నర్హంబు ఘోర • సంగ్రామంబుల్
బలహీను లెవ్వరేనియుఁ గలిగినఁ గిష్కింధ కనుపఁ • గాఁ దగు నీకున్. ౧౮

తాత్పర్యము

నీలా! బలపరాక్రమములు గలవారే యుద్ధముచేయ నర్హులు. కావున నీ సేనలో బలహీను లున్నయెడల వారిని గిష్కింధకుఁ బంపుము. వారు రానేల? తేరకుఁ జావనేల?

సీ. వెల్లి వెల్లువ పొలుపు • విధమున నెలగోలు, బలము నూఱులు వేలు • పనుప నయ్య
గజుఁడు గవాక్షుండు • గవయుండు మును చను, వా రాలలో బలీ • వర్దము లన
ఋషభునితోఁ బంపు • మీ కపిసేనను, దక్షిణపార్శ్వంబు రక్ష సేయ
మదహస్తిబలి గంధ • మాదనుఁ డరుగుతఁ, గపులతో డాపటి • కాపుగాఁగ
తే. సకలబలములు జాతహా • ర్షమునఁ దేల, నేను నైరావతారూఢుఁ • డైన యింద్రు
కరణి హనుమంతు పై నెక్కి • యరుగువాఁడ, సైన్యమధ్యంబునందు నో • సైన్యనాథ

అర్థములు. వెల్లి=సముద్రము. 'అప్పాలవెల్లి లోపలి నప్పటి కప్పటికి' ॥భాగ॥ వెల్లువపొలుపు విధమునన్=ప్రవాహముగాఁ బోయినట్లు, ఎలగోలు బలము= ముందు పోవు సేన, ఆలలో = ఆవులలో, బలీవర్దములు = వృషభములు, దక్షి

పార్శ్వంబు=అనఁగా దక్షిణ దిక్కని యర్థముగాదు ఇచ్చట పడమటి దిక్కనియే యర్థము. దక్షిణముఖముగా సేన పోవుచున్నది. కావున నదియే తూర్పనియు, దానికిఁ గుడిచేతివైపు దక్షిణ మనియు గ్రహింపవలయును. అప్పుడు పడమరయే యగుచున్నది. 'యతశ్చ భయ మాశంకతాం ప్రాచీం పరికల్పయే' తని కామందకోక్తి. ఏ ప్రక్కన శత్రువులవలన భయము గలదో యా దిక్కు తూర్పుగా నెంచవలయును, ఇచ్చట దక్షిణ దిక్కునుండికదా భయము.

తాత్పర్యము

సేనానీ ! సముద్ర మేఱుగఁ బ్రవహించినట్లు నూఱువేల వానరులను ముందుగాఁ బంపుము. ఆ సేనలో గజుఁడు, గవాక్షుఁడు, గవయుఁడు ఆవులలో కోడెలవలె ముందుగా పోవలెను. కుడి పార్శ్వమున రక్షసేయ ఋషభుఁడు సేనతోఁ బోవలెను. ఎడమవైపు రక్షింప మదించిన యేనుఁగు బలముగల గంధమాదనుఁడు వానరులతోఁ బోవలెను. అందఱకు నేను గానవచ్చునట్టులు వారు సంతోషింప నైరావతమెక్కిన యింద్రునివలె నేను హనుమంతునిపై నెక్కి సేనలనడుమవచ్చెదను. ప్రభు వందఱకుఁ గానవచ్చుచుండిన సేనలో వారికుత్సాహము కలుగును.

తే. సార్వభౌమంబు మీఁది వై•శ్రవణుపోల్కి
నంగదుని నెక్కి సౌమిత్రి • యరుగుదెంచుఁ
గుక్షిరక్ష సుషేణుండు • ఋక్షనాథ
జాంబవద్వేగదర్శులు • సలుపువారు. ౨౪

తాత్పర్యము

సార్వభౌమ మను తన యేనుఁగు మీఁదఁ గుబేరుఁ డెక్కి వచ్చునట్టు లంగదుపై నెక్కి లక్ష్మణుఁడు వచ్చును. సేనామధ్యభాగమును సుషేణుఁడు జాంబవంతుఁడు వేగదర్శి యనువారు రక్షింపవలయును.

క. భూవిభుఁ డట్లు వచింప రుమావిభు నాదేశమునను • మర్కటులు గుహా
భూములు శృంగతలంబులు, భీమగతిన్ వెడలి రభ్ర•పృథ్వులు నిండన్. ౨౫

అర్థములు. రుమావిభు = సుగ్రీవుని, ఆదేశమునను = ఆజ్ఞ చొప్పున, అభ్రపృథ్వులు = ఆకాశము; భూమి.

తాత్పర్యము

రామచంద్రమూర్తి ఇట్లు చెప్పఁగా సుగ్రీవుఁ డాజ్ఞ సేయఁగా గుహలనుండి పర్వతశిఖరములనుండి భూమ్యాకాశములు నిండునట్లు భయంకరముగ వానరులు బయలుదేరిరి.

క. రాముఁడు వానరవల్లభ, సౌమిత్రిసమేతుఁ డగుచు • సమ్మదమున ను
ద్దామగతి నడిచె రయమున శామనదిఙ్ముఖముగా స•సైన్యుం డగుచున్. ౨౬

అర్థములు. శామనదిక్ + ముఖముగా = శమనుని సంబంధము శామనము=దక్షిణపు దిక్కు ముఖము చేసి.

తాత్పర్యము

రామచంద్రమూర్తి లక్ష్మణ సుగ్రీవులతో సంతోషముతో నతివేగముగ దక్షిణాభిముఖుఁడై ప్రయాణము చేసెను.

సీ. వారల వెంబడి వారణవిభులైన, క్రోఁతులు వేలును ♦ గోటు లయుత
ములు వెన్నడించిరి ♦ ముదితులై దృప్తులై, గంతులు వేయుచు ♦ గర్జ లిడుచు
నెగురుచు దుముకుచు ♦ మొగిచుట్లు పెట్టుచు, ఫలముల మెక్కి తే♦నెలను గ్రోలి
చెట్టుల నెక్కుచుఁ ♦ జిదుముచు గుత్తులు, కాయల రాల్చుచు ♦ గండుమీఱి
ఆ. యొక్కఁ డొకనిఁ ద్రోయు ♦ నొక్కనిఁ బైకెత్తు
నొకఁడు గేలి సేయు నొక్కఁ డతనిఁ
బట్టి పెనఁగు వాని♦పై నెక్కు నొక్కండు
నొకని నొకఁడు ద్రోసి ♦ యుర్వి గూలు. ౬౨

అర్థములు. ముదితులై = సంతోషించినవారై - దృప్తులై = గర్వించినవారై, గర్జలు=సింహనాదములు, చిదుముచున్=కోయుచు.

తాత్పర్యము

స్పష్టము,

క. నేనే త్రుంచెద రావణు, నేనే వధియింతు యామి♦నీచరకోటిన్
నేనే నేనే యనుచును, వానరతతి రాము మ్రోల ♦ వాదము లాడున్. ౬౩

అర్థములు. యామినీచరకోటిన్ = రాత్రి సంచారముచేయు రాక్షసుల సమూహమును.

తాత్పర్యము

స్పష్టము.

సీ. కుముదనీలర్షభుల్ ♦ కొమ్మున మున్నుగాఁ, జనిరి మార్గముల శో♦ధనము సేయ
రామలక్ష్మణులును ♦ రాజు సుగ్రీవుండు, నడుమ నేగిరి గొల్వఁ♦గడిఁదిబలులు
శతవలి పదికోట్లు ♦ శాఖామృగాళితో, సర్వంబు రక్షించె ♦ సైన్యమిత్తిఁ
బరిజనుల్ వేవేలు ♦ బలసి రాఁ బనసార్కు, గజ కేసరులు ప్రక్క♦ కావు లైరి
ఆ. ఋక్షసేనతోడ ♦ రక్షించె జఘనంబు, జాంబవంతుఁ డధిక♦శక్తి యుక్తి
బాసటయి సుషేణ♦బలిముఖుఁ డుండఁగ, దరణిసుతుఁడు మున్ను♦దవిలి నడువ.

అర్థములు. కొమ్మున = ఉత్సాహముతో.

తాత్పర్యము

సేనకు ముందుగా మార్గములను బరీక్షించుటకుఁ గాను కుముదుఁడు నీలుఁడు, ఋషభుఁడు ౫౭ పద్యంబునఁ జెప్పఁబడిన వారితోడఁ బోయిరి (వీరినిగూడ రామ

చంద్రమూర్తి యిచ్చటఁ జెప్పె ననియు కవి యచ్చట గొందఱు నిచ్చటఁ గొందఱు జెప్పెననియు నెఱుంగవలయు. లేదా యీ రెండును నియమింపఁబడకుండుటచే భక్త్యతిశయమున వారే పోయి రనియైన గ్రహింపనగు.) మహాబలవంతులు సేవించుచుండఁగా రామలక్ష్మణ సుగ్రీవులు నడుమఁ బోయిరి. శతవలి పదికోట్ల వానరులతో సేననంతయుఁ గాచి తిరుగుచుండెను. వేయివేల వానరులతోఁ బనసుఁడు, అర్కుఁడు, గజుఁడు, కేసరి, పార్శ్వముల రక్షించుచుండిరి. జాంబవంతుఁ డెలుఁగులతో సేనామధ్యభాగమును రక్షించెను. ఆయనకు సహాయుఁడై సుషేణుఁ డుండెను. సుగ్రీవుఁడు ముందు పోవుచుండెను.

క. సేనాపతి యగు నీలుఁడు, వానరసైన్యముల నాల్గు♦వంకల సంర
క్షానియమంబున నిపుణత, మానుగ నరయుచును జనెఁ బ్ర♦మాదరహితుఁడై. ౬౪

తాత్పర్యము

సేనానాయకుఁడగు నీలుఁడు నాలుగుప్రక్కల నుండు సేనలను నేర్పుతో హెచ్చరికతో రక్షించుచుఁ బోవుచుండెను.

తే. వానరులఁ దీవరించుచు ♦ వరుసఁ జనిరి
రంభుఁడు దరీముఖుండును ♦ రభసకేసియు
మఱి ప్రజంఘుండు చను చిట్లు ♦ మార్గమునను
గనిరి సహ్యాద్రి ఘనసరో♦వనయుతంబు. ౬౫

తాత్పర్యము

త్వరగా నడువుఁడు, త్వరగా నడువుఁ డని వానరులను వేగిరపెట్టుచు రంభుఁడు, దరీముఖుఁడు రభసుఁడు, ప్రజంఘుఁడను వారు పోయిరి. ఇట్లు పోయి గొప్ప సరస్సులతో వనములతోఁ గూడిన సహ్యపర్వతముఁ జేరిరి.

క. భీమాగ్రహాయుతుఁ డగు శ్రీ, రాముని యాజ్ఞప్తి వాన♦రవ్యూహంబుల్
గ్రామంబుల జనపదముల, భూముల డాయంగఁ జనవు ♦ పురుతరభీతిన్. ౬౬

తాత్పర్యము

రామచంద్రమూర్తి వానరు లెవ్వరును ఊళ్ళలోఁ గాని పల్లెలలోఁ గాని వానికిసంబంధించిన సాగు భూములలోఁ గాని పోరాదని కఠినమైన యాజ్ఞ చేసి యుండుటచే నాయనకుఁ దీవ్రమైన కోపము వచ్చు నను భయముచే వానరులు జనులు చరించు మార్గములఁ బోవక యడవుల వెంటనే పోయిరి.

తే. సాగరౌఘనిభంబయి ♦ జలధి ఘోష, సన్నిభారవ మయి కీశ♦సైన్య మపుడు
రామపార్శ్వతలంబున♦రమణ నడచె, సంప్రరోజితజవనాశ్వ♦చయముభంగి. ౬౭

అర్థములు. సాగరౌఘనిభంబు = సముద్రప్రవాహముతో సమానము - సముద్రము ప్రవాహముగాఁ బాఱిన నెట్లులుండునో యట్లు - జలధిఘోష సన్నిభారవ మయి = సముద్రధ్వనితో సమానమైన ధ్వనిగలదై - ఇట్లు చెప్పుటచే

సముద్రమును సమీపించి రని సూచన - సంప్రయోజిత=చక్కఁగాఁ దోలఁబడిన-జవనాశ్వచయము భంగిన్=వేగ వేగముగఁ బోవు గుఱ్ఱముల గుంపువలె- దీనివలన వానరులు మెల్లగా నడచిపోలేదనియు బాగుగాఁ బరువెత్తఁగల గుఱ్ఱపు వేగమునఁ బోయిరనియు తెలియ వచ్చెడిని.

తాత్పర్యము

సముద్రధ్వనితో సమానమైన ధ్వనితో సముద్రము పొంగి వెల్లువగాఁ బాఱినట్లు వానర సేన చక్కఁగాఁ దోలఁబడిన మంచి వేగముగల గుఱ్ఱపుదండు పోయినట్లు రామచంద్రమూర్తి ప్రక్కల నడచెను.

క. వానరసమూహ్యమానులు, మానవపతితనయు లపుడు • మహిత గ్రహాయు
క్తానంతరత్నమిహికా, భానులగతిఁ బొలిచి చనిరి • ప్రాభవమారన్. ౬౪

అర్థములు. వానరసమూహ్యమానులు=వానరులచే మోచికొని పోఁబడుచున్న వారు-మానవపతితనయులు=రాజకుమారులు=రామలక్ష్మణులు-మహిత=గొప్పవగు-గ్రహాయుక్త=గ్రహముతోఁ గూడిన-అనంతరత్న=సూర్యుని -మిహికాభాను = చంద్రుని - గతిన్ = విధముగ - ప్రాభవము = అతిశయము.

తాత్పర్యము

హనుమదంగదులచే మోచికొనిపోఁబడుచున్న రామలక్ష్మణులు గురుశుక్రులతోఁ గూడిన సూర్యచంద్రులవలెఁ బోయిరి.

ఇందు నాలుగు గ్రహముల కూటమి యుపమాన విధముగఁ జెప్పఁబడెను. ఇది లంక కనిష్టము సూచించును. కావున నిట నలంకారముచేత నొక వస్తువునకు ధ్వని. గ్రహయుక్తయను నుపమాన సారస్యముచేత రామలక్ష్మణులు వేంచేయుటయందు హనుమదంగదులకుఁ గల లాఘవాతిశయము సూచితము. కావున పదప్రతిపాద్యవస్తువుచేత వస్త్వంతరధ్వని.

—• లక్ష్మణుఁడు శుభశకునముల శ్రీరామునితోఁ జెప్పుట •—

శా. తారేయాంసగతుండు లక్ష్మణుఁడు సీ• తానాథుతోఁ బల్కె న
న్నా ! రక్షోధిపుఁ జంపి తద్ధృతసతిన్ • వైదేహినిం గ్రమ్మఱన్
దేరం గల్గును నీకు నిక్క మిది కం•టే కార్యసిద్ధ్యర్థమై
యారం దోఁచెడి సన్నిమిత్తముల భూ•మ్యాకాశ దేశంబులన్. ౬౫

అర్థములు. తారేయాంసగతుండు=అంగదుని భుజములపై నున్నవాఁడు, తత్ + హృతసతిన్=ఆ రావణునిచే నపహరింపఁబడిన భార్యను, కార్యసిద్ధి+అర్థమై=కార్యమనుకూలముగ ఫలించుకొఱకు, సన్నిమిత్తములు = శుభశకునములు.

తాత్పర్యము

అంగదుని భుజములమీఁద గూర్చుండిన లక్ష్మణుఁడు రామచంద్రమూర్తితో నిట్లనియె. అన్నా! రావణునిచే నపహరింపఁబడిన సీతాదేవిని మరల నీవు తీసికొని రాఁగలవు. ఇది నిజము. భూమియందు నాకాశమందుఁ గానవచ్చు శుభశకునములు కార్యసిద్ధి తెలుపుచున్నవి చూచితివా.

నాలవ పాదంబున అనుస్వార సంబంధయతి.

"గీ. ఆది పూర్ణయుతములై టతవర్గాక్షరములు తుదను గలుగు వ్రాలు దక్కఁ బొసఁగు నొకటి కొకటి భువి ననుస్వారసం। బంధ యతులునాఁ బ్రబంధ ములను" అప్పకవి. ఉదా॥ "పెక్కుచం॥ దాలంబందు నొకప్పుడుం దలుగ దింటం బ్రాఁడియుం బంటయున్" మనుచరిత్రము. "మ. దవధూమంపు తమంబులోఁ దమరస ద్రవ్యంబు పంకేజబాం।ధవ భానుప్రతతుల్ హరింపఁ గుయి వెంటన్ వెళ్ళ" అనునది సాధు పాఠము-కుయివెట్ట న్వెళ్ళునది యపపాఠము- రెండు చోటుల ననుస్వారసంబంధము లేదు. అనుస్వారసంబంధము రెండుచోటుల నుండి ననే యనుస్వారమునకు ననుస్వారమునకు యతి చెల్లును. నకార టకారములకుఁ గాని దకార టకారములకుఁగాని యతి మైత్రిలేదు. "బాన్ధవ భానుప్రతతుల్ హరింపఁ గుయివెట్టన్" అనుచో ననుస్వారసంబంధము గలదుగాని 'బాన్ధవ భాను ప్రతతుల్ హరింపఁ గుయి వెన్టన్' అనిన నట్టి సంబంధము లేదు కావున నిది దుష్టము.

సీ. అనుకూలవాయువుల్ • మన సైన్యములమీఁద
మృదుహితసుఖములై • మెలఁగఁ దొడఁగెఁ
బహుపీతరారావ•భాసమానంబులై
మృగపక్షితతు లెల్లు • లిడఁగఁ గడఁగె
నన్నిదిక్కులు సుప్ర•సన్నంబులై యొప్పె
విమలుఁడై భానుండు • వెలుఁగువాఁడు
బ్రహ్మరాశి విశుద్ధ•భార్గవుం డనుగతుఁ
డై యున్నవాఁడు • మహర్షి వరులు
తే. ధ్రువుని వలగొనుచున్నారు • తోయజాక్ష!
మనకుఁ బ్రపితామహుఁడు ని•ర్మలనృపర్షి
సహపురోహితుఁ డగుచుఁ ద్రి•శంకుఁ డదిగొ
మింట వెలుఁగుచు నున్నాఁడు • మేలిరుచుల. ౫౦

అర్థములు. అనుకూలవాయువుల్=మనకు వెనుకనుండి వీచుచు మనవెంట వచ్చు వాయువు, మృదు హితసుఖములు=మెల్లగాను,హితముగాను, సుఖముకలిగించునవిగాను, ప్రయాణమున నెదురుగాలి మోరుగాలి దుమ్ముతోడిగాలి యుఁకతకున

ములు, పరుషేతర=కఠినముగ లేక, వినసింపైన ఆరావ=ధ్వనులచే, భాసమానంబు
లై=ప్రకాశించునవియై, ఎలుఁగులు=ధ్వనులు, సుప్రసన్నంబులై = మిగులనిర్మల
ములై మబ్బులుగాని యొజ్జని కాంతులుగాని లేనివై, స్వచ్ఛములై, బ్రహ్మరాశి=
వేదములకుప్పు, సూర్యుఁడు. 'కర్మసాక్షీ జగచ్చక్షు రంశుమాలీ త్రయీతనుః" అని
నిఘంటువు, వేదములు శరీరముగాఁ గలవాఁడనఁగా వేదముల నన్నిటిని బూర్ణముగ
నధ్యయనము చేసినవాఁడని భావము. విశుద్ధభార్గవుఁడు=దుష్టగ్రహసంబంధము లేని
శుక్రుఁడు, అనుగతుఁడు=కూడవచ్చువాఁడు. శుక్రున కెదురుగాఁబోవుట యపశకు
నము, చుక్క కెదురుపోరాదు. "ప్రతిశుక్రం ప్రతిబుధం, ప్రతిభౌమం గతో నృపః।
అపి శక్రేణ సదృశో హతసైన్యో నివర్తతే" శుక్రున కెదురుగా బుధున కెదురుగా
అంగారకున కెదురుగఁ బోయెనేని నింద్రునంతవాఁడైనను రాజు,చంపబడిన సేనలు
గలవాఁడై వెనుకకు మరలును-దక్షిణముగఁబోవువారికి చుక్కెదురను ప్రసక్తి లేదు
గావున శుక్రుఁ డనుగతుఁ డనఁగా శుక్రబాధ్యము లేదని భావ మని తీర్థీయము.

విశుద్ధభార్గవుం డనుగతుఁడై యున్నాఁ డనుటచేత - రాముని యవతార
కాలమున జాతకఫలసూచనమువలె దండయాత్రాకాలమున గోచారఫలము రాక్ష
సుల విపరీతఫలమును సూచితములు-రాముఁడు కిష్కింధకు నాగ్నేయముగా నున్న
లంకకుఁ బ్రయాణమైపోవుచున్నాడు. అప్పుడు శుక్రుఁ డనుకూలుఁ డనియు వెనుక
నున్నాఁడనియుఁ జెప్పఁబడెను. శుక్రుఁడు తఱచుగా సూర్యుఁడున్న రాశికి ముందు
రాశిలో నుండును. రాముఁడు బయలుదేరినది ఫాల్గునపూర్ణిమ యని ముందే చెప్పఁ
బడెను. అప్పుడు సూర్యుఁడు మీనరాశియం దుండుటచేత శుక్రుఁడు మేషరాశియం
దున్నాఁడని తెలియుచున్నది. రాముని జన్మరాశి కర్కటము - దానికిఁ బదవరాశి
యైన మేషమున శుక్రుఁ డుండుట రామున కనుకూలము- వెనుక శుక్రుఁ డుండుట
చేతను ననుకూలుఁడే. ఇందుకు శు క్రానుకూల్యము చెప్పుటచేత బృహస్పత్యాద్యాను
కూల్యమును సూచితము, బృహస్పతి శ్రీరాములవారి జన్మకాలమున కటకరాశియం
దుండెను. ఇతని కొక్కొక్కరాశియం దొక్కొక్క సంవత్సరము వాసము కానఁ
బండ్రెండేండ్లకుఁ బండ్రెండు రాసులను జుట్టివచ్చును. అట్లు మూఁడు తడవలు చుట్టి
రాఁగా ముప్పదియాఱేండ్లు గడచినవి. ముప్పది యెనిమిదవయేఁట రాముని దండ
యాత్ర. ఆయేఁట బృహస్పతి రామరాశి ద్వితీయరాశియైన సింహమున నున్నాఁడు.
గురువు రెండవయింటనుండుట యనుకూలము. రామజన్మకాలమున శని తులావర్గో
త్తమమున నుండెను. శనికి రెండున్నర యేం డ్లొకరాశియందు వాసము. తులనుండి
పండ్రెండు రాసులు చుట్టివచ్చుటకు ముప్పది సంవత్సరములు గడచినవి. ముప్పది
రెండున్నరదాఁక తులలోను ఆపై రెండున్నర వృశ్చికములోను ఆపై రెండున్నది
ధనుస్సులోను నుండి యాపై అనఁగా ముప్పది యేఁడున్నర యేండ్లయిన తరువాత
మకరమునకుఁ బోవలసినది ప్రాప్తమయ్యును వక్రతాదులచేత ధనుస్సులోనే

యున్నాఁడని యెంచునది. రాహువు రామావతారకాలములో సింహరాశిలో నుండెను. రాహువునకుఁ బ్రతిరాశిలోను నొకటిన్నర సంవత్సరము వాసము. అప్రదక్షిణ సంచారము - అందుండి ముప్పదియెనిమిదవ యేఁటఁ గటకరాశిలో నుండవలసినది ప్రాప్తమయ్యును అతిచారాదులచే మిథునరాశిలో నున్నాఁడని నిశ్చయించునది-రాహువునకు నేడవయింట కేతువాసము. కావున నిపుడు ధనుస్సునఁ గేతువున్నాఁడు- నైరృతి దైవత నక్షత్రమగు మూల ధుమగతికేతుచే ధూపితంబని యీ ప్రకరణమునను జెప్పఁబడియున్నది. ధుమగతికేతుచే - ధూమకేతువు = ధూమాకారమైన కేతువు-ధనుస్సున శనికేతువులున్నారు. ధనుస్సు కర్కాటకరాశి కాఱవది-అందున్న శనికేతువులు రాముని కనుకూలురు-రామరావణ యుద్ధ ప్రస్తావమున "ఆక్రమ్యాంగారక స్తస్థౌ విశాఖే అపిచాంబరే" యని యున్నది. ఈ వాక్యప్రకారమపుడు అంగారకుఁడు విశాఖాచతుర్థపాదమైన వృశ్చికరాశియం దున్నాఁడు. అది కటకమునకు నైదవ రాశి- ఇక్కైదవ యింట నంగారకుఁ డున్నందున రామునికిఁ జెడు ఫలము బ్రహ్మాస్త్రబంధాదులు- బుధుఁడు రామునికిఁ బదవ రాశియం దున్నాఁడు. కావున ననుకూలుఁడు, చంద్రుఁ డుత్తరఫల్గునితోఁ జేరి యున్నాఁడు కావునఁ గన్యారాశియం దుండినట్లు. అప్పటికిఁ దృతీయచంద్రుఁడు కావున రాముని కనుకూలుఁడు. మీనమునం దున్న సూర్యుఁడు కటకమునకుఁ దొమ్మిదవ యింటివాఁ డగుచున్నాఁడు. కావున ననుకూలుఁడు. మిథునములోనున్న రాహువు కటకమునకుఁ బండ్రెండవ యింటివాఁ డగుచున్నాఁడు. కావున రామునికిఁ గొంచెము బాధాకరుఁడు. ఇట్లు రాముని కనుకూలమైన గోచారఫలము నూహించునది. ఈ గోచారము జన్మరాశిని బట్టి చూచియున్నది. చంద్రరాశిని బట్టి చూడలేదు. ఇట్లే యీ గోచారము రాక్షసులకు విపరీత ఫల మయినదిగా నున్నది, రాక్షసుల నక్షత్రము మూల, దానికి సంబంధించినది ధనూరాశి, ఇదే రాక్షసుల రాశి, దీని కైదవయింట నున్న శుక్రుఁడు ప్రతికూలుఁడు. జన్మరాశి యైన ధనుస్సులో నున్న శని కేతువులు ప్రతికూలురు. దాని కేడవ యింటనున్న రాహువు కొంచె మనుకూలుఁడు, పండ్రెండవ యింట నున్న యంగారకుఁడు ప్రతికూలుఁడు. తొమ్మిదవ యింట నున్న గురువు అనుకూలుఁడు. నాలవ యింట నున్న సూర్యుఁడు అయిదవయింట నున్న బుధుఁడును అనుకూలురు గారు. పదవ యింట చంద్రుఁడు కొంచె మనుకూలుఁడు, ఇందుఁ గొంచె మనుకూలముగా నున్నను విశేషభాగము ప్రతికూలముగా నున్నది. కావున రాక్షసుల కీ గోచారము విపరీత ఫలమునే యిచ్చును.

అర్థములు. మహర్షివరులు = సప్తర్షులు, ధ్రువునిన్ = ధ్రువస్థానమును, వలగొనుచున్నారు=ప్రదక్షిణించుచున్నారు, మనకున్ = ఇక్ష్వాకులకు, ప్రపితామహుండు = కూటస్థుఁడు, నృప + ఋషి= రాజఋషి, త్రిశంకుఁడు=(౧) సహా

పురోహితుఁడు=విశ్వామిత్రునితోఁ గూడినవాఁడు (౨)సృజన్ దక్షిణమార్గస్థాన్ సప్తర్షీ నపరాన్ ప్రభు యని బాలకాండమునఁ జెప్పినట్లు విశ్వామిత్రసృష్టిలోని సప్తర్షి మండలములోఁ జేరిన వసిష్ఠునితోఁ గూడినవాఁడు.

తాత్పర్యము

అన్నా! యనుకూల వాయువులు మన సేనలమీఁద మృదువుగాను హితముగాను సుఖకరముగా మెల్లగాను వీచుచున్నవి. విన నింపైన ధ్వనులతో మృగములు పక్షులు ధ్వనించుచున్నవి. దిక్కులన్నియుఁ బ్రసన్నములై యున్నవి. సూర్యుఁడు నిర్మలుఁడై ప్రకాశించుచున్నాఁడు. వేదమూర్తియగు సూర్యుఁడు దుష్టగ్రహ సంగతి లేని శుక్రునిగూడి మనకనుకూలుఁడై యున్నవాఁడు. సప్తర్షులు ధ్రువుని ప్రదక్షిణించుచున్నారు. మన వంశకూటస్థ పురుషుఁడు త్రిశంకుం డిచ్చటి సప్తర్షి మండలములోని వసిష్ఠునితో నాకాశమునఁ బ్రకాశించుచున్నాఁడు.

క. మనయిక్ష్వాకుల తారకఁ, గనుము విశాఖను వెలింగెఁ ♦ గడువిశదం బై
తనరి నిరుపద్రవంబుగ, మనశత్రుల కివి రహించు ♦ మార్గము వినుమా. ౫౧

తాత్పర్యము

మన యిక్ష్వాకువంశతార విశాఖ. అది యెట్లు నిర్మలముగ నుపద్రవము లేక ప్రకాశించుచున్నది చూడుము. ఇఁక నీ గ్రహములు మనశత్రువుల కుండు విధముఁ జెప్పెదను.

• విశాఖ యిక్ష్వాకుల నక్షత్ర మని జ్యోతిషదర్పణంబునఁగలదు. నిరుపద్రవ మనఁగా నంగారకాది క్రూర గ్రహసంబంధము లేక యుండుట.

సీ. నైరృతదైవత♦నక్షత్ర మగు మూల, దుమగతికేతుచే ♦ ధూపితంబు
గావుట రాక్షస♦కాండంబులకుఁ జేటు, దెల్పుచున్నది యెన్ని♦తెఱఁగు లరయ
వారికి నాశంబు ♦ చేరువ నున్నది, మృత్యుగృహీతుల♦రిక్క మరణ
కాలంబుఁ దెలుపుచు♦గ్రహపీడితం బగు, నం ద్రిప్పు డది నైరు♦లందుఁ గలిగ
ఆ. నీరు నిర్మలంబు♦నీరజాకరముల, వనము లెల్లఁ బుష్ప♦వంతములును
గమ్మఁదావి మొలసె♦ఘుమ్మని యెల్లెడ, భూజతతి యథర్తు♦పుష్పయుతము. ౫౨

అర్థములు. నైరృత దైవత నక్షత్రము = రాక్షసులకు దేవత యగు నక్షత్రము, మూల = మూలానక్షత్రము, దుమగతికేతువుచే = ధూమకేతువుచే - ధూపితంబు = తపింపఁ జేయఁబడుచున్నది, 'ధూప సంతాపే' యని ధాతువు, కాండంబులకు=సమూహములకు, మృత్యుగృహీతుల రిక్క = మృత్యుదేవతచేఁ బట్టుపడినవారి నక్షత్రము, యథర్తు = యథాబుతు–ఋతుయోగ్యమైన, పుష్పయుతము = పూలతోఁ గూడియున్నది.

తాత్పర్యము

రాక్షసుల నక్షత్రము మూల, దానిని ధూమకేతువు పీడించుచున్నది. ఎన్ని విధముల నాలోచించినను ఆ నక్షత్రము వారికిఁ జేటు తెలుపుచున్నది వారు.

నాశమైపోవు కాలము సమీపించినది. మరణము సమీపించినవారి నక్షత్రము క్రూరగ్రహములచేఁ బీడితమై మరణకాలము దెలుపునని శాస్త్రజ్ఞులు చెప్పుదురు. అట్టి చిహ్నములు వైరులందుఁ గానవచ్చుచున్నవి. మన మార్గమున సరస్సులందు నీళ్ళు నిర్మలములుగా నున్నవి. అడవులన్నియుఁ బూచియున్నవి. ఘుమ్మని కమ్మని వాసనలే కొట్టుచున్నవి. ఈ ఋతువునఁ బూచవలసిన చెట్లు పూచియున్నవి. దోహదాది క్రియలు లేక నిష్కారణముగ నొక ఋతువునందుఁ బూచవలసిన చెట్లు మఱియొక ఋతువునఁ బూచెనేని యుత్పాతము.

ఆ. తారకామయాఖ్య • దారుణరణమున, దేవసేనపోలె • దేవ వెలుఁగు
చున్నయదియు వాన • కోగ్రవీరులసేన, జయము నిజము మనకు • శంకవలదు.

అర్థములు. తారకామయాఖ్య = తారకామయ మను పేరుగల, దారుణ రణమునన్ = భయంకర యుద్ధమందు, తారక + ఆమయ = (౧) తారకుని వధము గలదని, ఆఖ్య = పేరుగల (౨) తారకా + ఆమయ = బృహస్పతి భార్య యను తార మనోవ్యాధియే కారణముగాఁ గలది. బృహస్పతి భార్య యగు తారను చంద్రుఁడు హరించెను ఎవరు చెప్పినను మరల నిచ్చినవాఁడు కాఁడు. బృహస్పతి యింద్రునితోఁ జెప్పెను. ఆయన బృహస్పతి పక్షమునఁ జంద్రునిపై యుద్ధమునకు వెడలెను. బృహస్పతి తండ్రియగు అంగిరసుని వలన విద్య నేర్చినవాఁ డగుటచే గురుపుత్రు పక్షమున రుద్రుఁడును యుద్ధమునకుఁ బూనుకొనెను. చంద్రుని పక్షమున శుక్రుఁడు జంభకుంభాది సకల దైత్యదానవ సమూహముతో సహాయపడెను. రెండు పక్షముల వారికి నఘోరయుద్ధము జరిగెను. ఈ యుద్ధము తారానిమిత్తమైనది కావున తారకామయ మను పేరు గలిగెను. "ఏవంచ తయో రతీవోగ్ర స్సంగ్రామ స్తారానిమిత్తం తారకామయో నామాభవత్" అని విష్ణుపురాణమున చతుర్థాంశమున ఆఱవ యధ్యాయ మందుఁగలదు. ఇది పౌరాణిక గాథ.

భూమియందు భూకంపన-మహావాయుప్రచారణములచే నెట్లుత్పాతములు పుట్టియున్న ద్వీపములు దేశములు పోవుట క్రొత్తవి వచ్చుట యెట్లుగలవో యట్లే యాకాశ మండలమున నెప్పుడైన మహోత్పాతములు గలుగుచుండును. అప్పు డంతరాళమునఁ దిరుగు నల్పగ్రహములు వాయుప్రేరితములై వానివాని స్థానములు విడిచి మఱియొకచోటికిఁ గొట్టుకొనిపోవుటకలదు. అట్లొకసారి యుత్పాతమున బృహస్పతిచుట్టు తిరుగు నుపనక్షత్రమొకటి (తార=నక్షత్రము) గాలికి కొట్టుకొని పోయి చంద్రుని జుట్టి తిరుగుచుండెను, ఆవల మఱియొక యుత్పాత సమయమున మరలవచ్చి బృహస్పతి చుట్టు తిరుగ నారంభించెను. ఈ జ్యోతిశ్శాస్త్ర విషయమును పౌరాణికు లీ విధముగ వర్ణించి వ్రాసిరి. ఆ మహోత్పాతములో జరగిన గందరగోళము తారకామయ మనఁబడెను. అనఁగా నక్షత్రములందు జరగిన యల్లకల్లోల మని యర్థము.

తాత్పర్యము

తారకామయు మను భయంకర యుద్ధమునందు దేవసేనవలె మనసేన ప్రకాశించుచున్నది. కావున మనకు నిస్సందేహముగా జయము గలదు.

క. అని శకునంబులఁ దెలుపుచుఁ, దనయగ్రజుమనము ముదము♦దగులఁ సుమిత్రా
తనయుఁడు పలికిన రాముఁడు, విని సంతస మంది సేన♦వే నడిపించెన్. ౨౪

తాత్పర్యము

ఈ ప్రకారము శకునములఁ దెలుపుచు నన్నకు లక్ష్మణుఁడు సంతోషము గలిగింపఁ జెప్పుచుండ రామచంద్రమూర్తియు సేనను త్వరగా నడిపించెను.

—♦ కపిసేనలు ప్రయాణమై పోవుట ♦—

చ. జలధరసంఘ మంబరము ♦ ఛాదితముం బొనరించు మాడ్కి న
బ్బలిముఖచక్రముల్ సవన ♦ పర్వతదక్షిణదిక్కు గప్పగాఁ
బలితపుఁ దత్కరాంఘ్రిహతిఁ ♦ బాయక లేచి ధరాపరాగముల్
జలజహితద్యుతుల్ సమయ ♦ సర్వజగంబును గ్రమ్మెఁ గ్రొక్కటన్. ౨౫

అర్థములు. జలధర సంఘము = మబ్బులగుంపు, అంబరమున్ = ఆకాశమును, ఛాదితమున్ = మఱుఁగుపడినదిగా, బలిముఖచక్రముల్ = వానర సేనలు, సవన పర్వత దక్షిణదిక్కు=అడవులతోఁ గొండలతోఁ గూడిన దక్షిణదిక్కును, తత్ = ఆ వానరులయొక్క, కరాంఘ్రిహతిన్ = చేతుల కాళ్ళదెబ్బలచే, ధరాపరాగముల్=నేలదుమ్ములు, జలజహితద్యుతుల్=సూర్యకాంతులు, సమయన్ = చెడిపోవునట్లు.

౨౦వ పద్యము రాత్రివర్ణనము- ఇది పగటి వర్ణనము. ఇది ఫాల్గున బహుళ ప్రతిపత్తు పగలని తెలియవలయును.

తాత్పర్యము

మబ్బు లాకాశమును మఱుఁగు పఱుచునట్లు వానరసేనలు అడవులు కొండలతో నిండిన దక్షిణదిక్కును గప్పఁగా వారి కాలుసేతుల దెబ్బలకు రేఁగిన దుమ్ము సూర్య ప్రకాశము నడఁచునట్లు లోకము నంతయు లోఁగొనెను.

క. విడువక శాఖామృగముల దడమును తెరియించుకతనఁ ♦ దటినులు వంకల్
పెడమరలి పాఱెఁ బెక్కుమడ లెప్పటి యట్ల పోవ ♦ మార్గము లేమిన్. ౨౬

అర్థములు. దడములు=దళములు = సేనలు - తటినులు = ఏఱ్ఱు - పెడమరలి = వెనుకకుఁ దిరిగి.

తాత్పర్యము

గుంపుగా వానరసేనలు విడువక యొకటి వెంట నొకటి దాఁటుచున్న కారణమున నేఱ్ఱు వంకలు యథాప్రకారము పాఱుటకు సాధ్యముగాని కారణమున పెక్కుమడ లెదురెక్కి పాఱెను.

చ. విమలసరోవరంబులను • వృక్షచయావృతపర్వతంబులన్
సమతల భూప్రదేశములఁ • జారుఫలాన్విత సద్వనంబులన్
గ్రమమున నద్మ నెల్ల యెడఁ • గ్రచ్ఛఱ నద్దముగాఁగఁ గ్రిందుగా
సమద వలీముఖప్రముఖ • సైన్యసమూహము లావరించుచున్. ౨౨

అర్థములు. వృక్షచయ = చెట్లగుంపులచే, ఆవృత = క్రమ్మఁబడిన, చారు=మనోహరములైన, ఫల = పండ్లచే, అన్విత = కూడిన, సద్వనంబులన్ = మంచియడవులను, నద్మ = నడుమ, సమద = గర్వముతోఁ గూడిన, వలీముఖ = వానరుల.

తాత్పర్యము

వానర ప్రముఖుల సేనాసమూహములు నిర్మలమైన సరోవరంబులందుఁ జల్లని నీరుండుటచే నడుమ నావరించెను. చెట్లతో నిండిన పర్వతంబులను చెట్లడ్డముగా నుండుటచే నడ్డముగా నావరించెను. సమముగా నుండు నేలలయందు సర్వత్ర యావరించెను. మనోహరములైన పండ్లతో గూడిన వనంబులందు పండ్ల నిమిత్తమై చెట్లక్రిందుగా నావరించెను.

చ. చనెఁ జని వాయువేగమున • సమ్మదవీర్య బలాతిరేకముల్
గనబడ యౌవనోద్ధతివి•లాసపరాక్రమరీతి గర్జలన్
వినుచుచు నందుఁ గొందఱు వ•నేచరనాథులు కిల్కిలార్భట
స్వనముల ఁ బొప్ప, గంతులను • వైచిరి కొందఱు రంతు సేయుచున్. ౨౩

అర్థములు. చనెన్ చనెన్ = దీర్ఘప్రయాణము గావున ద్విరుక్తి, దీనికిఁ గర్తృపదము పూర్వపద్యము నందలి సైన్య సమూహములు, సమ్మద, వీర్య, బల, అతిరేకముల్ = వారి వారి సంతోషము, వీర్యము, బలము వీని యతిశయము, యౌవనోద్ధతి = వయస్సుయొక్క గర్వము, విలాసము=పరాక్రమము, రీతిన్ = తగినట్లు వినుచుచున్=నిండించుచు.

తాత్పర్యము

ఆ సేనలందు వానరులు వారి వారి సంతోషము పరాక్రమము బలము యొక్క యతిశయము గనఁబడునట్లు, యౌవనము వలనఁ గలిగిన గర్వము, విలాసము,పరాక్రమమునకుఁ దగినట్లు సింహనాదములచే దిక్కులు నిండించిరి, కొందఱు వానర శ్రేష్ఠులు కిల కిల మని కిలారించిరి. కొందఱు ధ్వనిచేయుచు గంతులువైచిరి.

సీ. శ్మ్లాఘ్నసలి తోఁకలు • జాడించికొట్టుచు, ధరణి గ్రక్కదలఁ బా•దముల నిడుచుఁ
గొండల నెక్కుచుఁ • గుప్పించి దాఁటుచు,భూజముల్ విఱుచుచు•బొబ్బలిడుచు
నూరువేగంబునఁ • జారుల తాపాళి, నలియఁ జేయుచును వా•నరబలంబు
నూఱులు వేలును • నూఱువేలును గోట్ల, కొలదిఁగా ధారణిఁ • గలయఁ బర్వి

తే. రేయుఁబగలును నడిచె సు♦గ్రీవరక్ష, నిలువ కెడ నెడ హర్షంబు♦దలకొనంగ
నెప్పుడెప్పుడు రాముని♦యుగురుఁబోణి,బంధిఁ దొలఁగింత మను తమి♦సందడింప.

అర్థములు. క్రక్కదలు=కదలు+కదలు = మిక్కిలికదలు, భూజముల్ = చెట్లు, ఎడనెడ నిలువక = నడుమ నడుమ నిలువక, బంధి = నిర్బంధము, చెఱ; తమిన్ = కోరికతో.

తాత్పర్యము

స్పష్టము.

చ. నిలువక పోయి పోయి యవ♦నీరుహసంకటమున్ మృగావళీ
కలితము నైన సహ్య మను♦క్ష్మాధరమున్ మలయావనీధ్రమున్
బలితపుఁగాననంబులఁ బ్ర♦వాహములం గనుఁగొంచు నేగుచో
వలిముఖభంజితంబు లయి ♦ వ్రాలెఁ గరంబు తమాలసంతతుల్. ౪౦

అర్థములు. అవనీరుహ సంకటమున్ = చెట్లతో నిండినది, మృగావళీకలితము=మృగముల గుంపులుగలది, వలిముఖ=వానరులచే, భంజితంబులు=విఱువఁబడినవి - తమాలసంతతుల్=కానుగుల గుంపులు.

తాత్పర్యము

ఇట్లు లొకరాతిరి, యొక పగలు విడువక ప్రయాణము చేసిచేసి చెట్లచే నిండి మృగముల గుంపులు గల సహ్యము మలయము అను పర్వతములను బలిష్ఠములైన యడవులను, ప్రవాహములను జూచుచుఁ బోవునపుడు వానరులు కానుగు చెట్లు విఱిచివైచిరి.

క. త్రుంచుచు నాడుగులన్ భం,జించుచు మావులను జువ్వి♦చెట్లను రేగ ఖం
డించుచుఁ బొగడల నేరెడు, లించుక భయ మేది వనచ♦రేశ్వరు లరుగన్. ౪౧

తాత్పర్యము

త్రోవ కడ్డమువచ్చిన యీఁడుగు చెట్లను, మామిడిచెట్లను, జువ్వి, పొగడ, నేరేడు చెట్లను గూలఁద్రోయుచు విఱుచుచు వానరులు భయములేక పయనించిరి.

క. కానన భూరుహవారము, వానరతతిమీఁద వాయు♦వశచలితం బై
మానితసుగంధబంధుర, సూనవితానములు గురిసె ♦ సొబగారంగన్. ౪౨

అర్థములు. కానన భూరుహవారము=అడవులందలి చెట్లసమూహములు, వాయువశ చలితంబై = గాలి కారణముగఁ గదలినవై, మానిత సుగంధబంధుర సూనవితానములు=గౌరవింపఁ దగిన పరిమళముచే మనోహరములైన పూలగుంపులను - సొబగు=అందము.

తాత్పర్యము

వానరులు చెట్లక్రిందఁ బోవునపుడు అడవులలోని చెట్లు గాలికిఁ గదలి మంచి పరిమళము గల పూవులను వారిపైఁ గురిసెను.

క. చందనశీతలుఁ డగుచును, నిందిందిరబృందగాన • మెసఁగఁగ వీచెన్
మందత సుఖసంస్పర్శుఁడు, సుందరసామోదవనుల • శుభపవనుండున్. ౭౩

అర్థములు. చందనశీతలుఁడు = చందనమువలెఁ జల్లనివాఁడు, ఇందిందిర బృందగానము=తుమ్మెదలగుంపుల ఝుంకార మనెడి పాటలు, మందత= మెల్లగా, సుఖ సంస్పర్శుఁడు=సుఖము కలుగునట్లు తాఁకువాఁడు, సుందర=అందములయిన, సామోద = వాసనతోఁగూడిన, వనులన్=అడవులందు - శుభపవనుఁడు = శుభ సూచకముగ వాయువు.

తాత్పర్యము

చందనమువలెఁ జల్లనివాఁడై తుమ్మెదల ఝుంకార మనెడి పాటలు పాడుచు, మెల్లగా సుఖముగఁ దాఁకుచు శుభసూచకముగ వాయువు అందమై పరిమళముతోఁ గూడిన యడవులందు వీచెను.

క. వాతమహారయఘట్టిత, ధాతుప్రసృతము రజోవి• తానముచే న
త్యాతతగతి శైలము ప్రస్ఫీతవలీముఖవరేణ్య• సేనం గప్పెన్. ౭౪

అర్థములు. వాత = వాయువుయొక్క, మహారయ = మిగుల వేగము చేత, ఘట్టిత=ఎగురఁగొట్టఁబడిన, ధాతు=ధాతువులనుండి, ప్రసృతము = బయలు దేఱిన, రజోవితానముచే=పొడి సమూహముచే, అత్యాయతగతి = విస్తారముగ, ప్రస్ఫీత=మిగుల విస్తారమైన, వలీముఖవరేణ్య=వానరశ్రేష్ఠుల, సేనన్=దండును.

తాత్పర్యము

వాయువుయొక్క మహావేగముచేఁ గొట్టఁబడి ధాతువుల నుండి లేచిన పొడిచే పర్వతము విస్తారవానర సేనను నధికముగఁ గప్పెను. పూర్వపద్యమునందు గానము చెప్పఁబడెను. ఇందు గంధపొడి చల్లుట చెప్పఁబడెను. ఇవి శుభసూచకములు.

క. వికసించి యుండె గిరిఁ గేతకపద్మక తినిశ వరణ•ధవ పాటలచూ
తకకోవిదార రథ కురు,వక చూర్ణక సిందువార • వకుళాదితరుల్. ౭౫

అర్థములు. గిరిన్ = సహ్యపర్వతమునందు - కేతక = మొగలి, పద్మక= మెట్టదామరులు - (తి) సువాసనగల పూవుల చెట్లు-వరణ=ఉలిమిరిచెట్టుఁ ధవ= చండ్రచెట్లు - పాటల=పాదిరిచెట్లు, చూతక - మామిడిచెట్లు-కోవిదార=కాంచన చెట్లు - రథ = ప్రబ్బలిచెట్లు, కురువక=ఎఱ్ఱగోరింటచెట్లు, చూర్ణక=ఉసిరిక చెట్లు, సిందువార = వావిలిచెట్లు, వకుళ = పొగడలు, ఆది = ఇవి మొదలుగా, తరులు = చెట్లు.

తాత్పర్యము

ఆ సహ్యపర్వతమందు మొగలి మొదలగు చెట్లు వికసించి యుండెను.

క. గంతు లిడుచుఁ జను వానర, కాంతుల రాయిడిని వివిధ•కాననతరువుల్
కాంతులు చెడి వ్యాకులతా, వంతములై యుండె శైల•వర్గమువీఁదన్. ౭౬

తాత్పర్యము

గంతులు పెట్టుచు పోవుచున్న వానరశ్రేష్ఠుల రాపిడి వలనఁ గలిగిన బాధచే నానావిధములైన యడవిచెట్లు కాంతి మాసి చెదరినవై కొండలమీద నొప్పుచుండెను.

సీ. పర్వతమ్ములనున్న • బావులు గుంటలు, శీతలజలసము • పేత మగుచుఁ
జక్రకారండవ•సంసేవితంబులై, చెలువార శార్దూల•సింహఋక్ష
చిత్రకాయులులాయ•పోత్రిచయంబులు, సర్వత్ర నయనగో•చరము లయ్యెఁ
బద్మసౌగంధికో•త్పలకైరవంబుల, కొలఁకు లచ్చోటను•గలుకు లయ్యె
తే. శైలసానుతలంబుల • శ్రవ్యముగను, విహగకూజితములు చాల•బహుల మయ్యె
నట్టితలముల డాసి వ•నౌకసములు, తనివి తీరఁగ విహరించె•మనముకోలఁది. ౧౭

అర్థములు. శీతలజలసముపేతము = చల్లని నీటితోఁ గూడినది, చక్రకారండవ = చక్రవాక పక్షులచేతను నీటికోళ్ళ చేతను, సంసేవితంబులై=సేవింపఁబడినవై, శార్దూల=పులులయు, సింహ = సింగములయు, ఋక్ష=ఎలుఁగులయు, చిత్రకాయ = చిరుతలయు, ులాయ=అడవి దున్నలయు, పోత్రి = పందులయు, చయంబులన్ = సమూహములు - సర్వత్ర = అన్ని ప్రదేశములందు - నయనగోచరములయ్యెన్ ==కన్నులకుఁ గానవచ్చెను. పద్మ=తామరలు - సౌగంధిక= ఎఱ్ఱకలువలు - ఉత్పల = నల్లకలువలు - కైరవ=తెల్లకలువలు - కొలఁకులు = సరస్సులు-కలుకులు = ఒప్పిదము కలవి - శైలసానుతలంబులన్ = పర్వతముల చఱులయందు, శ్రవ్యముగను = వినుట కింపై - విహగకూజితములు = పక్షుల కూఁతలు - వనౌకసములు=క్రోఁతులు.

తాత్పర్యము

కొండలయందున్న బావులు గుంటలు చల్లనినీళ్ళ చక్రవాకములు నీటికోళ్ళు కలవై యుండెను. ఎక్కడఁ జూచినను పులులు సింహములు ఎలుఁగులు చిఱుతలు దున్నలు పందులు కానవచ్చుచుండెను. తామరలు - ఎఱ్ఱని - నల్లని - తెల్లని కలువలు గలిగి సరస్సు లందంబులై యుండెను. కొండచఱులయందు పక్షులు విననింపుగ విశేషముగఁ గూయుచుండెను. అట్టి ప్రదేశములందు వానరులు తృప్తి యగువఱకు విహరించిరి.

ఉ. దోసిట నీరు గ్రోలుచును • దోఁగుచు నిచ్ఛగఁ ద్రోవ వచ్చు నా
యాసము దీర నీళ్ళఁబడి • యాడుచు నొండొరుమీఁద నీర ము
ల్లాసముగాఁగఁ జల్లుచుఁ ద•లన్ జలమధ్యమునందు ముంచుచున్
కేసరభీతు లేక పులి • నీతతు లెక్కుచుఁ బండ్ల మెక్కుచున్. ౧౮

అర్థములు. తోఁగుచున్=మునుఁగుచు, స్నానము చేయుచు, ఇచ్ఛగన్=

ఇష్టము కొలఁది, కీసరబీతు=కొంచమైన భయము, పులిని తతులు=ఇసుక దిబ్బల గుంపులు, మెక్కుచున్=తినుచు.

తాత్పర్యము

దోసిళ్ళకొలఁది నీరు త్రాగుచు, మనసార స్నానము చేయుచు, దారి నడచిన బడలిక దీర నీళ్ళలోఁబడి యీదుచు, నొకరిమీఁద నొకరు చల్లుచు, తలలు నీటిలో ముంచుచు, భయము కొంచెమైనను లేక యిసుకదిబ్బ లెక్కుచుఁ బండ్లు తినుచు.

తే. తేనియల ద్రోణమాత్ర ప్రమాణములం గ్రోలుచున్ క్ష•మారుహతతులన్
మానితలతలం జెఱచుచు, వానరతతి దిరిగె నేర్చి • వసుధాధరముల్. ౮౯

తాత్పర్యము - స్పష్టము.

ఆ. చెట్లుచేమ లేని•మెట్టలఁ గొండలు, పోవఁ దేని లెస్స • త్రావి మత్తు
కలనఁ జెట్లనీడఁ • గపులు గొందఁ బరుగఁబడుచు లేచు • చరుసమునను. ౯౦

తాత్పర్యము - స్పష్టము,

క. ఎచ్చటఁ జూచిన కీశస,ముచ్చయముల్ పరఁగ ధరణి • మొగిఁ బక్వంబై
హెచ్చిన వరిపైరున మడి,యచ్చున రాజిల్లె నిబిడ • నైౖ యెటు చూడన్. ౯౧

అర్థములు. కీశసముచ్చయముల్ = క్రోఁతుల గుంపులు.

తాత్పర్యము

ఎచ్చటఁ జూచినను పింగళవర్ణము గల క్రోఁతులు వ్యాపించుటచేఁ దట్టముగఁ బండిన వరిపైరుచే వరిమడివలె భూమి కానవచ్చెను.

క. ఇంద్రనిభుఁడు రాముండు మ,హేంద్రధరాధరమునన్ స•మేధిత మా శృం
గేంద్రము నెక్కి కమఠఝష,సాంద్రము రత్నాకరంబు • సందర్శించెన్. ౯౨

అర్థములు. ఇంద్రనిభుఁడు=ఇంద్రునితో సమానుఁడు, మహేంద్ర ధరాధరమునన్ = మహేంద్రపర్వతమందు, సమేధితము = ఎత్తైనది, శృంగేంద్రము = శ్రేష్ఠమైన శిఖరము, కమఠఝష సాంద్రము = తాఁబేళ్ళచేతను, చేఁపలచేతను దట్టమైనది, రత్నాకరంబున్ = సముద్రమును, సందర్శించెన్ =చూచెను.

తాత్పర్యము

ఇంద్రునితోఁ సమానుఁ డైన రామచంద్రమూర్తి మహేంద్ర పర్వతమున నెత్తైన శిఖర మెక్కి తాఁబేళ్లు, చేఁపలు దండిగఁ గల సముద్రమును జూచెను.

తే. మలయసహ్యమహాశైల•ములఁదరించి,యానుపూర్విగ జలధి డా•యంగఁబోయి
దిగ్గి వేలావనం బెల్ల • దీవరముగ, దాఁటి ధ్రాతోపలతలముఁ•దఱిసి వేల. ౯౩

తాత్పర్యము

మలయపర్వతమును, సహ్యపర్వతమును దాఁటి క్రమముగ సముద్రమును సమీపించి యచట హనుమంతుని మూఁపులనుండి దిగి సముద్రతీరమందుండువనము త్వరగా దాఁటి చెలియలికట్టయందు నలలచేఁ గడుగఁ బడిన ప్రదేశము సమీపించి

చెట్లకొమ్మలు తగులు నని హనుమంతుని భుజములనుండి రామచంద్రమూర్తి దిగె నని యెఱుఁగనగు.

—♦ శ్రీరాముఁడు కపిసేనతో సముద్రతీరముఁ జేరుట ♦—

ఉ. శ్రీరఘువంశమౌళి కపి♦శేఖరుఁ గన్గొని కీశనాథ! కూ
పారము తీరముం గదియ ♦ వచ్చితి మింక నతీరమున్ సుగం
భీరము నైన దీని నొక ♦ మేలి యుపాయముచేతఁ గాక యిం
కే రహి దాఁటరాదు మన♦యీ కపి సేనకు నెల్లఁ జూడుమీ. ౯౪

అర్థములు. కూపారము తీరము = సముద్రముయొక్క యొడ్డు - అతీరమున్ = రేవు లేనిది - సుగంభీరము=మిగుల లోఁతైనది-మేలి=శ్రేష్ఠమైన.

తాత్పర్యము

రామచంద్రమూర్తి సుగ్రీవునిఁ జూచి వానరరాజా! సముద్రతీరముఁ జేరితిమి- దీనికి రేవులు లేవు. లోఁతు విస్తరించియున్నది. దీని నేదైన గొప్ప యుపాయముచేత దాఁటవలయునేకాని మఱియొక విధముగ మన వానరసేన దాఁట సాధ్యపడదు; ఆలోచింపుము.

తే. మున్ను మనకెల్లఁ మది సము♦త్పన్నమైన,చింతయే యిప్డు వెండియు♦జివురులెత్తె
చేయఁగాదగు నొక సదు♦పాయ మిప్డు కాలయాపనచేఁత యో♦గ్యంబుగాదు.

అర్థములు. సముత్పన్నము=పుట్టినది - కాలయాపనచేఁత= వ్యర్థముగాఁ గాలమ్ము గడపుట.

తాత్పర్యము

కిష్కింధలో మనకే విచారము గలిగెనో యదియే యిప్పుడు మరలఁ గలిగెను. ఏదైన నొక యుపాయము చేసి దీనిని దాఁట వలయును గాని వ్యర్థముగ గాలము త్రోయరాదు.

రావణాసురుఁడు హెచ్చరిక పడుటకు ముందే లంకపైఁ బడవలయుననియు, అటులు చేసిన సంధికి వచ్చు ననియు రామచంద్రమూర్తి తలంపు.

ఉ. కావున మంత్రతత్పరత ♦ కావ్యము చుమ్మీ, యనఘ్న నిమ్ము సు
గ్రీవ! నివేశముం గొనఁగఁ ♦ గీశచమూనిచయంబు లిందు, యిం
దే వనచారి యైనఁ బని ♦ యెయ్యది యైనను గల్గు గాక దాఁ
టోవఁగ రాను సేన విడి, ♦ పోవఁగ వచ్చును శూరసత్తముల్. ౯౬

అర్థములు. మంత్రతత్పరత = ఆలోచనమందాసక్తి గలవారమగుట, నివేశమున్ = నిలుచుటకుఁ దగినచోటు.

తాత్పర్యము

మన మీ విషయ మాలోచింపవలసి యున్నది. వానరులందఱు నిచ్చటనే వారి వారికిఁ దగిన స్థలములందు దిగున ట్లేర్పాటుచేయుము. శూరులగు నాయకులు

తప్ప మఱి యే క్రోఁతియైనను నెంత పనియున్నను దండునుండి చీలిపోరాదు. సేనలోనే యుండవలెను.

ఉ. ఛన్నవిరోధిసంఘముల ♦ చందము రోయఁగ నౌను గాన, నం
చన్న సుమిత్రపట్టియు స ♦ హాయుఁడుగాఁ గపిసేన నెల్ల వా
రాన్నిధితీరమందు వన ♦ రాజిని పాళెము దిగ్గఁబంచె సం
పన్నగుణాంచు కీశపతి ♦ భ్రాజిత మా పరిధిస్థకోటితోన్. ౯౭

అర్థములు. ఛన్నవిరోధి సంఘముల = దాఁగియుండు పగవారి గుంపుల యొక్క, చందము=విధము, రోయఁగన్ = వెదుకఁగ, వారాన్నిధి తీరమందు = సముద్రము నొడ్డున, వారాన్నిధి = అలుక్సమాసము, పాళెముదిగ్గన్=విడియుటకు, పనిచెను=ఆజ్ఞాపించెను, పరిధిస్థకోటితోన్=రక్షకసమూహముతో.

తాత్పర్యము

శూరులగు వానర శ్రేష్ఠులుమాత్ర మేల సేన విడిచిపోవలయునవిన విరోధులు మనలఁ గొట్టుటకుఁ మఱుగుస్థలములందు దాఁగియుందురు. వారిని వెదక కొందరు పోవలసియుండును. అట్టివారు మాత్రము పోవచ్చును. ఈ ప్రకారము రామచంద్ర మూర్తి చెప్పఁగా లక్ష్మణుని తోడుతీసికొని గుణసంపత్తిగల సుగ్రీవుఁడు సేనల నన్నిటిని సముద్రతీరమందు రక్షకులగువారితోడ దిగవలసినదని యాజ్ఞాపించెను.

క. పారం బెఱుఁగని మర్కట,వారము మధుపాండుసలిల ♦ వంతంబగు కూ
పారం బన లవణాకూ,పారము నికటమున నపుడు ♦ భాసిలుచుండెన్. ౯౮

అర్థములు. పారంబు = అంతము - పరిమాణము - మధుపాండు సలిల వంతము=తేనెవలెఁ బింగళమైన జలముగలది; మధుశబ్దసాహచర్యముచే పాండు శబ్దమునకు పింగళవర్ణము గ్రాహ్యమని తిలకము. కూపారము = సముద్రము లవణాకూపారము=లవణసముద్రము. ఉప్పునీళ్ళసముద్రముయొక్క,నికటమునన్= సమీపమందు.

తాత్పర్యము

పరిమాణ మింత యని చెప్ప సాధ్యపడని వానర సమూహ ముప్పునీళ్ళ సముద్రము సమీపమున తేనెవంటి పింగళబలము గల సముద్రమో యన్నట్టు లొప్పుచుండెను. అలంకార ముత్ప్రేక్ష.

క. వారిధినాదము లోఁగొని, సారం బగు కీశసైన్య ♦ సన్నాహరవం
బారూఢిఁ జెలఁగె; ముత్తెఱఁ, గై రహిమించెన్ బలంబు♦లర్కజు నాజ్ఞన్. ౯౯

తాత్పర్యము

వానరుల సేనల సన్నాహమునఁ బుట్టిన ధ్వని సముద్ర ధ్వనిని మించి గి వైచెను. అప్పుడా సేన సుగ్రీవు నాజ్ఞాప్రకారము మూఁడు విధములయి యొప్పెను. అనఁగా వానరు లందఱు నొక గుంపుగను, ఎలుఁగు లొక గుంపుగను,కొండముచ్చు లొక గుంపుగను విభజింపఁబడెను.

—• సముద్రవర్ణనము •—

సీ. దూరపారంబు రక్షోరాజియుక్తంబు చండనక్రగ్రాహసంయుతంబు
క్షణదాదిఘోరంబు కలితఫేనకదంబ,హసితంబు భంగనృత్యాంచితంబు
జైవాతృకోదయసంజృంభితంబును, ప్రతికువలయహితవ్యాకులితము
తిమితిమింగిలసముదీర్ణంబు చండమా,రుతమహోగ్రాహభాసితము నగుచు
తే. దీప్తభోగభుజంగాళి తేజ మీఱఁ, శింశుమారాదితతిచేతఁ జెలఁగుదానిఁ
బ్రకటశైలయుతంబు దుర్గమపథంబు, సాగరవరంబుఁ గాంచెఁ గీశవ్రజంబు.

అర్థములు. దూరపారము = దూరమైన పారము (గట్టు)గలది - విశాలమైనది, రక్షోరాజియుక్తంబు = రాక్షసులతోఁ గూడినది, కాలకేయనివాత కవచులవంటి వారు నీళ్ళలో దాఁగియుందురు. ఇప్పుడు (Submarine)సబ్ మారీన్= సముద్రములోనుండు నావలలోనుండు వారివంటివారు; చండనక్రగ్రాహసంయుతము= క్రూరములైన మొసళ్ళతోను, లతాకారముగాఁ జుట్టుకొని ప్రాణహింసచేయు మత్స్యములతోను గూడినది; గ్రహమే గ్రాహము "గ్రాహో వహారో నక్రస్తు కుంభీర" యని యమరుఁడు. క్షణదా=రాత్రియొక్క-ఆది = ప్రథమ భాగంబున - ననఁగా సాయంకాలంబున వృద్ధిపొందుటచే - ఘోరంబు=భయంకరమైనది; కలితఫేన = పొందఁబడిన నురుగుయొక్క, కదంబ=గుంపుచే-హసితంబు = నవ్వునది - నురుగు తెలుపు - నవ్వు తెలుపని కవిసమయము కావున నురుగు నెపమున సముద్రము నవ్వుచున్నదని భావము-భంగ=అలలచలనమనెడి, నృత్య=ఆటచేత, అంచితంబు= ఒప్పునది - జైవాతృకోదయ=చంద్రోదయముచే-సంజృంభితంబును=విజృంభించునది. అభివృద్ధి నొందునది - ప్రతికువలయహిత వ్యాకులితము = ప్రతిబింబించిన చంద్రునిచే వ్యాకులపెట్టఁబడినది. తిమితిమింగిలసముదీర్ణంబు = తిమియను చేఁపల చేతను దానిని మ్రింగు తిమింగిలముల చేతను అతిశయించినది. "అస్తి మత్స్య స్తిమిర్నామ శతయోజన మాయతః। తిమింగిలగిలోప్యస్తి తద్గిలోప్యస్తి సాగరే"-అనిపురాణ వచనము. తిమిని మ్రింగునది తిమింగిలము-దానిని మ్రింగునది తిమింగిలగిలము-చండమారుత మహోగ్రాహ భాసితము = ఝంఝూమారుతమువంటి వేగముగల మొసళ్ళచేఁ బ్రకాశించునది, దీప్తభోగభుజంగాళిన్ = రత్నములచేఁ బ్రకాశించు పడగలు గల పాములగుంపుల; తేజ=కాంతి - శింశుమార = నీటిక్రోఁతి - ఆది = మొదలగువాని-తతిచేత=సమూహముచే, ప్రకటశైలయుతంబు = పెద్దపర్వతములతోఁ గూడినది దుర్గమపథంబు=పోవుటకు సాధ్యముకాని మార్గముకలది.

తాత్పర్యము

దూరమునందు తీరము గలదియు, రాక్షసులతోను, మొసళ్ళతోను, గ్రాహములతోను గూడినదియు సాయంకాలము వేళ మిగుల భయంకరమైనదియు, నురుగు నెపమున నవ్వునదియు, అలల నెపమున నృత్యము చేయునదియు, చంద్రోదయమున

వృద్ధిపొందునదియు, ప్రతిబింబించిన చంద్రునిచే నిండినదియు, విశేషముగ తిములుతిమింగిలములు గలదియు, తుపానుగాలివలెఁ దిరుగు మొసళ్ళుగలదియు, రత్నములు పడగలందుఁగల పాములచేఁ బ్రకాశించునదియు, నీటిక్రోఁతులు గలదియు పెద్ద పర్వతము లుండుటచేఁ బోవుటకు మార్గములేనిదియునైన సముద్రమును వానరులు చూచిరి.

సీ. మొసళులచే భోగ • విసరంబుచేత వి,గాఢమై వాతప్ర • కంప్ర మగుచుఁ
బడుచును లేచుచు • బహుళతరంగము, లధికప్రవృద్ధమై యమరుదాని
నగ్నిచూర్ణాకీర్ణ • మయినట్లు భాస్వరో,దకము మహోరగ • తతులు గలిగి
యమరారివిషయమై • యధికభీకరమునై, పాతాళవిషమమై • వారిదాభ్ర
ఆ. సన్నికాశమగుచు • సాగర మిది యని,యభ్ర మిది యటంచు • ననఁగరాక
గగన మబ్ధిఁ గలసి • గగనంబునఁ దబ్ధి, గలసి తారకామ • ణులను వెలసి. ౧౧౯

అర్థములు. భోగవిసరంబుచేతన్=పాముల శరీరముల సమూహముచేతన్; విగాఢమై=ప్రవేశింపఁబడినదై, వాతప్రకంప్రము = గాలిచేఁ గదలింపఁ బడినది కనుక నే-బహుళతరంగములు = అనేకము లలలు,అధికప్రవృద్ధమై=మిగుల పెరిఁగినవై - అగ్నిచూర్ణ + ఆకీర్ణము=నిప్పుల పొడిచే నిండినట్లు - భాస్వరోదకము = భాస్వరమను ద్రవ్యముతోఁ గూడిన నీళ్ళు, ఈ భాస్వరమే ఆంగ్లభాషయందు ఫాస్ఫరస్(Phosphorous)అందురు. ఇది మెఱయుచుండును. రాత్రులందుఁ చీఁకటివేళ నలలయందుఁగానవగు. తీరమం దిసుకలోను సన్ననిపలుకులుపడియుండుటయుఁ గలదు. అల లొడ్డునఁ బడి మరల పోవుచోట నుండును. మహోరగతతులు=పెద్ద పాములగుంపులు, అమరారి విషయమై=రాక్షసులకు, స్థానమై, అధికభీకరమునై = మిగుల భయంకరమై, పాతాళవిషమము=పాతాళమువలె విషమము, వారిదాభ్ర సన్నికాశము= ఆకాశముతో సమానము, అభ్రము = ఆకాశము, తారకామణులను=నక్షత్రము లను రత్నములచే, రాత్రులందు సముద్రజలము ప్రకాశించుటకుఁ గారణము విష్ణు పురాణమున నిట్లు చెప్పఁబడినది. "ఆతాామ్రా హి భవంత్యాపో దివా నక్తం ప్రవేశనాత్। దినం విశతిచైవాంభో భాస్కరేఽ స్తముపాగతే। తస్మాచ్ఛుక్లీభవంత్యాపో నక్త మహ్నః ప్రవేశనాత్". వి-పు-౨-౮-౨౬.

తాత్పర్యము

మొసళ్ళచేతఁ బాముల పడగలచేతఁ బ్రవేశింపఁబడినదై, గాలికిఁగదలునదియై లేచుచుఁ బడుచునుండు నలలచేత వృద్ధినొందినదై,నిప్పులపొడివలె భాస్వరముతోఁ గలిసిన నీళ్ళు - పెద్ద పాములుగలదై, రాక్షసులకు వాసస్థానమై, భయంకరమై, పాతాళమువలె విషమమై-యాకాశముతో సమానమై - యిది యాకాశము ఇది సముద్రమని వేఱుపఱుపరాక యాకాశమున సముద్రము సముద్రమునం దాకాశము కలసి తారకలను మణులు, మణులను తారకలు కలసినదై.

క. తనరుచు సముత్పతన్ముదిర నికరముల భూరిభంగ ♦ రాజులచేతన్
గనుఁగొనఁగరాక భేదం, బనయము నొక్కటిగఁ బెనసి ♦ యరుదగు దానిన్. ౧౨౨

అర్థములు. సముత్పతత్ = క్రిందికి పైకిపోవుచున్న - ముదిర నికరముల = మేఘముల సమూహములచే-ఇది యాకాశమండలిది - భూరిభంగరాజులచేతన్ = గొప్ప యలలచేతను - అనయము = ఎల్లప్పుడు - బెరసి=కలసి-అరుదు=ఆశ్చర్యకరము.

తా త్ప ర్య ము

ఆకాశమున మేఘములు క్రిందికి పైకి పోవుటచే పడుచు లేచుచున్న యలలతోఁ బోలిక గల దగుటచే నాకాశ సముద్రములకు భేదము చెప్పరాక కలసియుండు దానిని, అలంకారము మీలితము, సాదృశ్యమువలన భేదమే కానరాక పోయిన మీలితాలంకార మగును.

తే. బెరసి యొండొంటితో నెండి ♦ పెరిఁగి యొకటి
నొక్కటి గుభాలునను దాఁకి ♦ యూర్మిపంక్తు
లబ్ధిరాజమహాభేరు ♦ లట్లు మ్రోయ
నగచరావళి చూచె మ ♦ హాద్భుతముగ. ౧౨౩

అర్థములు. బెరసి = కలిసి; ఊర్మిపంక్తులు = అలలవరుసలు - అబ్ధిరాజ మహాభేరు లట్లు=సముద్రరాజుయొక్క పెద్దనగారాలవలె.

తా త్ప ర్య ము

అల లొకదానితో నొకటి కలసి పెరిఁగి యొకదానితో నొకటి తాఁకి గుభాలున పడఁగా నివి సముద్రరాజు మహాభేరులా యని వానర సేన యాశ్చర్యకరముగ జూచెను.

చ. రయయుతవాత సంకుల త ♦ రంగక గర్భిత దివ్యరత్న సం
చయ జలనాదితంబు జల ♦ జంతుసమూహసమాకులంబు న
వ్యయమహితానిలోద్ధుత సు ♦ రాధ్వనటద్భృశ భంగమున్ సవి
స్మయమతిఁ జూచె నెల్లకపి ♦ సంఘము భ్రాంతతరంగనాదమున్. ౧౨౪

అర్థములు. రయయుత = వేగముతోఁ గూడిన, వాత = గాలిచే, సంకులిత = కలఁత పడినది, గనుకనే, తరంగక = అలలచేత, గర్భిత = లోపలికిఁ దీసికొనఁబడిన, దివ్యరత్నసంచయ=శ్రేష్ఠరత్న సమూహముచేతను, జల=నీటిచేతను, నాదితంబు=ధ్వని గలదిగాఁ జేయఁబడినది, జలజంతు సమూహ = నీటియందుండు జంతువులచే సమాకులంబు=నిండినది, అవ్యయ=ఎడఁతెగక వీచు, మహిత=గొప్పదగు, అనిల=గాలిచే, ఉద్ధుత = ఎగురఁ గొట్టఁబడిన, సురాధ్వనటత్ = ఆకాశమున నటించుచున్న, భృశభంగమున్ = అనేకములగు నలలు గలది, సవిస్మయ

మతిన్=ఆశ్చర్యముతోఁ గూడిన మనస్సుతోఁ - భ్రాంతతరంగ నాదమున్=కదలు చున్న అలల ధ్వని గలదానిని.

తా త్ప ర్య ము

మిగుల వేగముచే వీచు గాలిచేత కలఁత చెందిన యలలయందలి గొప్ప రత్నములు నీళ్ళ నొకదానితో నొకటి కొట్టుకొనఁగా బుట్టిన ధ్వని గలదియు జలజంతువుల గుంపులచే నిండినదియు, విడువక వీచు గొప్పగాలిచే నెగురఁ గొట్టఁ బడుటచే నాకాశమున నటించు నలలుగలదియు కదలుచున్న యలల ధ్వని గలదియు నగు సముద్రమును ఆశ్చర్యముతో వానరులు చూచిరి.

క. భర మగు నిర్హ్రాదంబును, బొరలి పొరలి వచ్చునలలు ♦ బురుగును గనఁగా
సుర ద్రావి పొర్లు వెంగలి, కరణి జలధితోఁ చెఁగేశ ♦ కాంధంబునకున్. ౧౦౫

అర్థములు. భరమగు = అతిశయించిన, నిర్హ్రాదంబును = ధ్వనియును, బురుగు = నురుగు - జొల్లు, సుర = కల్లు, వెంగలి = అవివేకి.

తా త్ప ర్య ము

విస్తార ధ్వనియు, పొరలి పొరలి వచ్చుటయు బురుగును గల సముద్రమును జూడఁగా కల్లుద్రావి కేకలు పెట్టుచు నేలఁబడి దేహము తెలియక పొర్లుచు నోట జొల్లు కార్చుచున్న మూఢునివలె వానర సమూహమునకుఁ గానవచ్చెను.

—♦ ౫-వ సర్గము. శ్రీరాముఁడు సీతం దలంచి దుఃఖించుట. ♦—

క. పాలక యుతహరివాహిని నీలుఁడు సింధూత్తరమున ♦ నెఱి విడిసెను శా
స్త్రాలపితరీతి నల్దెస, మాలక చరియించి కావ ♦ మైందద్వివిదుల్. ౧౦౬

అర్థములు. పాలకయుత = రక్షకులతోఁ గూడిన, హరివాహిని = వానర సేన, సింధు+ఉత్తరమునన్=సముద్రముయొక్క యుత్తరతీరమున, నెఱిన్=క్రమముగా, విడిసెన్=విడియునట్లు చేసెను, అంతర్భావిత ణిజంతము, దించెను, శాస్త్రాలపితరీతిన్ = శాస్త్రమునందుఁ జెప్పఁబడిన విధముగ, నల్దెస = నాలుగు దిక్కులందు, మాలక = వదలక.

తా త్ప ర్య ము

రక్షకులు గల వానరసేనను సముద్రముయొక్క యుత్తరతీరమున నలుఁడు దించెను. శాస్త్రప్రకారము మైందద్వివిదులు ప్రాలుమాలక నాలుగు ప్రక్కలఁ దిరిగి కాచుచుండిరి.

క. కడలికరి యుక్తపద్ధతి, విడియఁగ సేనలును రామ ♦ విభుఁడు ధృశార్తిన్
మిడుకుచుఁ దన కెలన వసిం, చెడి లక్ష్మణుఁ జూచి యనియెఁ ♦ జిత్తం బెరియన్.

అర్థములు. శరణ్యునం దుండవలసిన కృతజ్ఞత, మిత్రుల ననుసరించుట, కార్యములను విమర్శించుట, మహోత్సాహము, మొదలగు గుణములు శ్రీరామ చంద్రమూర్తియందుఁ గల వని యింతవఱకుఁ దెలుపఁబడెను. అన్ని గుణములతోఁ

ప్రధానమైన గుణము దయ, అది రామచంద్రునందు విశేషించి కలదని యీ సర్గము నందుఁ జెప్పబడుచున్నది. పరుల దుఃఖము తన దుఃఖముగా నెంచి తపించుట దయయనఁబడును. సీతాదేవి దుఃఖమును దలంచి రామచంద్రమూర్తి దుఃఖించుట యిందుఁ జెప్పఁబడును.

కడలి దరిన్ = సముద్ర తీరమున, యుక్త పద్ధతిన్ = యోగ్యమైన విధముగ, భృశార్తిన్ = అధిక వ్యధచే, తనకెలనన్ = తన ప్రక్కను, ఎరియన్ = మండుచుండఁగా.

తాత్పర్యము

సముద్రతీరమున సేనలన్నియు నే యే సేన యేయేచోట దిగవలయునో యా ప్రకారము దిగినపిమ్మట రామచంద్రమూర్తి యీ సముద్రమున కావలియొడ్డునందే కదా సీతాదేవి దుఃఖించుచున్నదని యామె పడు దుఃఖములను హనుమంతుఁడు చెప్పినవి జ్ఞప్తికి రాఁగా మిగుల వ్యధచే దుఃఖపడుచుఁ దలఁచుకొలఁది హృదయము మండుచుండఁ దన ప్రక్కను నున్న లక్ష్మణుఁ జూచి యిట్లనెను.

క. లోకమున నాఁడునాఁటికి, శోకంబు క్షయించుచుండుఁ • జుమ్మీ యెందున్
నాకన్ననొ నానాఁటికి, తన్వీవ్యక్తి లేమి వనట • మఱి మఱి పెరిఁగెన్. ౧౦౮

తాత్పర్యము

లక్ష్మణా! లోకములో సాధారణముగా నందఱియందు దుఃఖము కాలక్రమముగ క్షయించును. మొదటనున్న దుఃఖము తరువాతఁ గొన్నిదినముల కుండదు. ఇది లోక సామాన్య విషయము. నాకో సీతను విడిచిన దుఃఖము నానాఁటికిఁ బెరుగుచున్నది కాని తగ్గుటలేదు.

లోకమున నెవరును బరులకై దుఃఖించువారు లేరు. తమ ప్రియపదార్థ వియోగమునఁ దమకుఁ గలిగిన సుఖనష్టికై కష్టమునకై దుఃఖింతురు. రామచంద్రమూర్తి యట్టి దుఃఖమునకెడములేదు 'నానవాప్తమవాప్తవ్య' మ్మనునట్లు ఆయన సుఖసంతోషముల కన్యులపై నాధారపడియుండువాఁడు కాఁడు. కావున 'మిథిలాయాం ప్రదీప్తాయాం నమే కించి త్ప్రదహ్యతే' యన్నట్లు లేదిపోయినను దనదిపోయినట్లు దుఃఖింపఁడు. బిడ్డల దుఃఖమునకై తల్లిదండ్రులు తపించునట్లు తన యాశ్రితుల దుఃఖమునకై తాను దపించును.

తే. లేదు వగపు కాంత • దౌదవ్వ చనె నని, లేదు వగపు మ్రుచ్చి • లింపఁ బడుట
కంబుజాతనేత్ర • కరుగు చున్నది గదా, వయసటంచు నాత్మ • వగచువాఁడ.

తాత్పర్యము

నాకుఁ బ్రియురాలగు సీత మిగుల దూరము నం దున్నదికదా యని నేను దుఃఖింపను. రావణుఁ డామెను దొంగిలించికొని పోయెనే యని నేను వగవలేదు. కమలములవంటి కన్నులుగల సీతాదేవి నాయొద్ద నున్నప్పు డెంతో సంతోషించుచుండెను. అట్టి సంతోష మిప్పు డామెకు లేక కాలమంతయు వ్యర్థమైపోవుచున్నది.

గదా యని దుఃఖించెదను. నా తోడ నుండుటయే యామెకు మహానందము. నా వలన నామె సంతోషించుచున్నదికదా యని నేను సంతోషించు చుంటిని. అట్టి దానికి విఘ్నము కలిగించితిని గదా యని దుఃఖించెదను. ఇట్లు చెప్పుటచే రామచంద్రమూర్తి కాముకుఁడై దుఃఖింప లేదని యేర్పడు చున్నది. వయస్సు పోవుచున్న దనుటచే ముసలితనము వచ్చుచున్న దని యర్థము. నిత్య యౌవనవతికి వార్ధక మెక్కడిది.

శా. పోమీ మారుత ! సీత యున్న యెడకుం • బూఁబోణి స్పర్శింపుమీ
గమ్మీ నన్ను స్పృశింపుమీ మఱల, నా • రంగాంకుమార్గమ్మునన్
గొమ్మం జూచెద, నట్లు నీ వలన నా • కున్ జానకీకోమలాం
గమ్ముం దాఁకిన యట్టులౌ • గలదె భాగ్యం బంత నా కక్కటా ? ౧౧౦

అర్థములు. స్పర్శింపుమీ = తాఁకుమా.

తాత్పర్యము

వాయుదేవా ! నీవు సీతాదేవి యున్న చోటికిఁబోయి యామెను దాఁకుము. దానివలన నిది రామచంద్రుని స్పృశించిన గాలి కదా యని నాయొద్దనుండి వచ్చిన హనుమంతుని జూచి సంతోషించినట్లు ఆయన తండ్రి వగు నిన్నుఁ జూచియు సంతోషించును. అట్టులామెను దాఁకి సంతోషింపఁజేసి మరలవచ్చి నన్ను దాఁకితివేని నేను సంతోషించెదను. అప్పుడు నేను జానకిని దాఁకినవాఁడ నగుదును. ఇట్టులే జానకిని నేను జూచుచున్నాఁడను. జానకి చంద్రుని జూచుచున్నది. ఆమె దృష్టులు చంద్రుని యందుఁబడినవి. నాదృష్టులు చంద్రునియందుఁ బడినవి. ఇరువుర దృష్టులు చంద్రునందుఁ గలసికొనెను. కావున నేనామెను ఆమె నన్నుఁజూచినట్లయ్యెను. అట్లుతే, నీమూలమున మే మొకరి నొకరు స్పృశించినవార మగుదుము. అయ్యో నాకంత యదృష్టము కూడఁగలదా ?

ఉ. రావణుచేతఁ జిక్కువడి • రాజముఖీమణి నన్నుఁ గూర్చి "హా
జీవితవల్లభా !" యని వ • చించిన యార్తవిలాపయుక్త మా
నా వచనంబులన్ మనము • నందుఁ దలంపఁ దలంపఁగా నశే
షావయవంబులున్ విషము • నానిన యట్టులు గ్రాఁగఁ జొచ్చెడిన్. ౧౧౧

అర్థములు. అశేషావయవంబులు=దేహమాద్యంతము-మనస్సుమాత్రమే కాదు - దేహముకూడ.

తాత్పర్యము

రావణుచేతఁ జిక్కుకొని చంద్రముఖి సీత ప్రాణేశ్వరా యని దుఃఖముతో నేడ్చుచు పలికిన యా మాట నేను తలఁపఁగా దలఁపఁగా విషము ద్రాగినట్లు బాహ్యేంద్రియములను నంతరింద్రియములను గూడ దహించుచు నున్నది.

దుశ్శాసనుఁడు చీర లొలుచు నపుడు ద్రౌపది "హా కృష్ణ ద్వారకావాసిన్ క్వాసి యాదవనందన, ఇమా మవస్థాం సంప్రాప్తాం కిమనాథా ముపేక్షసే? శంఖ చక్ర గదాపాణే ద్వారకానిలయాచ్యుత, గోవింద పుండరీకాక్ష రక్ష మాం శరణాగతామ్ ! అని గోవిందా యని పిలిచెను.

శరణాగతురా లయిన ద్రౌపది యాపత్కాలమం దఱచిన గోవిందాయను మాట కృష్ణుని పదుమూఁడు సంవత్సరములు బాధించెను. ఈవిషయము పదునాలుగవ సంవత్సరమున రాయబారము పోవుటకు ముందు కృష్ణమూర్తి పాండవులతో 'గోవిందేతి యదాక్రందత్। కృష్ణా మాం దూరవాసినమ్। ఋణం ప్రవృద్ధమివ మే। హృదయా న్నాపసర్పతి" యని చెప్పెను. ధర్మరాజా ! నీవు రాజ్యమునకై యుద్ధము చేయుదువుగాక, చేయకుందువుగాక! దూరముగా నుండు నన్ను ద్రౌపది గోవిందా యని పిలిచెను. అప్పుడు నేను దూరమున నున్నవాఁడ నగుటచే నా దుష్టుల నేమియుఁ జేయఁజాలనైతిని-ఆమాట నా హృదయమునుండి తొలఁగిపోక ఋణము దినదినము వడ్డితోఁ బెరిగినట్లు పెరుగుచున్నది. ఆ యప్పు నేను దీర్చుకొనవలసియున్నది సుమా యని చెప్పెను. కావున భక్తుల యాక్రందనధ్వని విని భగవంతుఁడు వారి కష్టము దీర్చుటకు మిగులఁ బరితాప పడుచుండును.

సీతకు వయస్సుపోయి వార్ధకము వచ్చుచున్నది. నే నా వయస్సనుభవింపక పోతినే యని రాముఁ డేడ్చె ననుట సరిగాదు, అగ్నిని శీతో భవ యన్నట్లు రావణుని హతో భవ (చావుము) అని భస్మము చేయఁగలిగియు నా రక్షణ సామర్థ్యము విశ్వసించి తన పారతంత్ర్యమునకు హాని వచ్చునే, నాకపకీర్తి వచ్చునే యని నా నిమిత్తమై దుఃఖించు చున్నది కదా, నే నేమియుఁ జేయఁజాలకున్నానే యని దుఃఖించెదను, అని రామ హృదయము.

క. చింతాజ్వాలాయుతము ని,తాంతవియోగేంధనప్రతానేధిత మా
కంతుజ్వలనము రేవగ, లెంతయు నా దేహమున్ దహించెడి వత్సా! ౧౧౨

అర్థములు. చింతాజ్వాలాయుతము=చింత యనెడి శిఖలతోఁ గూడినది, నితాంత = తీవ్రమైన, వియోగ = వేఱుపా టనెడి, ఇంధన = కట్టెలయొక్క, ప్రతాన = సమూహములచే, ఏధితము = వృద్ధి పొందింపఁబడినది, కంతుజ్వలనము = మన్మథాగ్ని, రేవగలు = రాత్రి పగలు, ఇది సమాహారద్వంద్వము, ఏకవచనము, సర్వవేళల నని యర్థము, ద్వంద్వమున పకారము వకార మయ్యెను. వత్సా=నాయనా !

తాత్పర్యము

నాయనా! చింత యనెడు జ్వాలలు గలదై వేఱుపా టనెడి కట్టెల ప్రోవుచేఁ బెరిగిన మన్మథాగ్ని సర్వవేళల నన్ను మిక్కిలి కాల్చుచున్నది.

చిత, చింత యను రెంటిలో చింతయే గొప్పది. చిత చచ్చినవానిఁ గాల్చును. చింత బ్రతికినవానిఁ గాల్చును.

తే. నిన్ను విడనాడి లక్ష్మణా! నీరనిధిని. నేను మునిఁగి సుఖంబుగా • నిద్దురింతు
నారములలోన శయనించు • నన్ను దెట్లు, నీరజేషుఁడు దహియింప • నేర్చువాఁడు.

అర్థములు. నారములలోన=నీళ్ళలో, "నారము లనఁగా జలములు" భార. నీరజేషుఁడు=నీళ్ళలోఁబుట్టిన కమలము బాణముగాఁ గలవాఁడు, మన్మథుఁడు.

తాత్పర్యము

నిన్నుఁజూచిన నాకు సీతయుజ్ఞప్తికివచ్చును, మీరిద్దఱు నన్ను విడువక యుండు వారుగదా. కావున నిన్నుఁగూడ వదలి నేను సముద్రమున హాయిగా నిద్దురపోదును. నిద్దురపోవువానిని దుఃఖమేమిచేయఁగలదు. నీళ్ళలో నిద్దురపోవునన్ను నీళ్ళలోఁబుట్టిన కమలము బాణముగాఁ గలవాఁ డెట్లుబాధింపఁగలఁడు. నీళ్ళమీఁద గమలముతో దెబ్బగొట్టిన నీళ్ళలో నుండువానికినొప్పికలుగునా! సముద్రమునందు నేను సుఖముగ శయనింతు నని రామచంద్రమూర్తి మనుష్యభావమునఁ జెప్పినను ఆత్మహత్య చేసి కొనెద నని చెప్పినట్లే. అది ధీరోదాత్తుని లక్షణముగాదు. కావున నాయర్థము పొసఁగదు. లక్ష్మీనారాయణు లిరువురు శేషునిపైఁ బవళించువారే. ఒకరు లేకపోయినపుడు రెండవవారికా సుఖశయ్యయేల? కావున ఆదిశేషుఁడవగు నిన్నుఁగూడ వదలి ప్రలయావస్థయందు వలె నీటఁబండుకొని యోగనిద్ర పోయెదను. అప్పుడు మన్మథుని కుత్పత్తియేలేదు. కావున నన్నుఁ డితఁ డేమియుఁజేయఁజాలఁడు అని భావము. ఇట్లు లక్ష్మణుని యాదిశేషత్వము తన నారాయణత్వము సూచించెను.

క. అకళంకమలాక్షియు నేనును, నొకవసుంధరనె నిలిచి • యుండుటచే నే
నెకరణినొ మనఁ గల్గితి, ప్రకటన నప్పొలతిఁ జూడఁ • గల్గునె నాకున్ ౧౦

అర్థములు. వసుంధరనె = భూమిమీఁద - మనఁగలిగితిన్ = బ్రతుకఁగలిగితిని.

తాత్పర్యము

లక్ష్మణా! సీతను విడిచి నేను బ్రదుకుటకుఁ గారణములు రెండుగలవు. ఒక పానుపుమీఁద నిద్దఱ మున్నట్టు లొకభూమి యందే యిరువుర మున్నవారము - రెండవది సీత జీవించియున్నదని హనుమంతుఁడు చెప్పెను. కావున నేనును జీవింపఁగలిగితిని. కాని యామెను నేను జూడఁగలనా?

ఒకవసుంధరనె యనుటచే నిరువుర మొక భూలోకమందే యున్నవార మగుటచే సాంగత్యముకలదు. కావున నెట్లెట్లో బ్రతికితిని. అటుగాక యొక రొకలోకమున మఱియొకరు వేఱొకలోకమున నుండఁగలిగనేని మేము బ్రదుకఁజాలము. నిన్ను విడిచి నేను సీతయు నిమిషమైన బ్రదుకఁజాల మని నీవే చెప్పితివిగదా, వాస్తవార్థ

మున జీవ ప్రకృతిమయ మగు నీ లీలావిభూతి ప్రపంచము లేకుండిన భగవంతుఁ డుండియు లేనివాఁడే. ప్రాగవస్థయం దాయనను దలఁచువాఁ డెవ్వఁడు?

క. ఆవారి జలము గల మడి, కేవలఁ దడి లేనిపొలము • క్రీయూటవలెన్
చావని మని యున్నది యని, నే వినుటను బ్రదుకుఁ గంటి• నిర్మలచరితా. ౧౧౫

అర్థములు. ఆవారి = దండిగ, కేవలన్ = ప్రక్క-లందు, తడి = చెమ్మ, క్రీయూటవలెన్ = భూమిలోని యూట తడివలె.

తాత్పర్యము

సీతాదేవి బ్రదికి యున్నదని హనుమంతుఁడు చెప్పుటచే నేను బ్రదికి యున్నాను. బ్రదికి యుండఁగా నేయేమి? ఆమె యెక్కడ, ని వెక్కడ. నీవు బ్రదుకుట కామె యెట్లు కారణము కాఁగలదు. మబ్బులో నీరుండిన భూమిమీఁదఁ బైరు పండునా యందువేమో, అట్లు గాదు, మే మిరువుర మొక భూమియందే యున్నారము. ఒక వరిమడి నిండ నీళ్లుండెనేని యా నీళ్లు ప్రక్క భూములపైఁ బాఱకుండినను భూమిలోని యూటచే నవియు దడిగల వగుచున్నవి గదా. అట్లులే యామె బ్రదికియున్న దను వార్త విని నేను బ్రదికి యున్నవాఁడను.

ఉ. ఎన్నఁడు గాంచువాఁడనో య• హీనవిరోధులఁ జంపి నిస్తులా
భ్యున్నతి నొందు లక్ష్మివలె • నుగ్మలి నీరజపత్రనేత్ర, నే
నెన్నఁడొ గాసిఁబడ్డయతేఁ • డిష్టరసాయన మాను భంగి నా
యన్న ముఖాబ్జ మెత్తి యధ• రామృత మానుదు నాశ దీరఁగన్. ౧౧౬

అర్థములు. అహీన విరోధులన్ = బలమున గొప్పవారగు శత్రువులను, నిస్తుల = అసమానమైన, అభ్యున్నతి = మేలు, అభివృద్ధి, ఇష్టరసాయనము = ఇంపైన, శరీర పుష్టికరమైన యౌషధము, అనుభంగిన్ = త్రాగుటవలె, అన్న = స్త్రీ, ఉగ్మలి = స్త్రీ-సీత.

తాత్పర్యము

బలవంతులైన పగవారిఁ జంపి మిగుల నభివృద్ధిచెందు లక్ష్మివలె నే నెన్నఁడు సీతాదేవిని జూతునో కదా-మిక్కిలి బడలినవాఁడు దేహపుష్టికరమై యింపైన రసాయనమును ద్రావినట్లు నే నెన్నఁడు సీతాదేవి యధరామృతమును నాశ దీరఁ బానము సేయుదునో—

యజ్జరా వ్యాధి విధ్వంసి భేషజం, తద్రసాయనమ్. బాహటుఁడు
నీరసానాంహి ధాతూనాం, లాభోపాయో రసాయనమ్ - వైద్యకము

జ్వరాది సంబంధములై దేహమును నిస్సారముగఁ జేయు వ్యాధులను ధ్వంసము చేయునది రసాయనము.

క. బలిసిన యిఱిసిన తాళీ, ఫలములతో నెనయుచున్న • పద్మాక్షికుచం
బులు న న్నెన్నఁడొ కౌఁగిట, నలరించెడివేళఁ గంప•మందెడి నయ్యా. ౧౧౭

అర్థములు. ఇతరేతర=ఒకదానితో నొకటి రాచుకొనుచున్న, తాళీఫలము లతో = తాటిపండ్లతో; బలిసిన యితరేతర, ఎనయుచున్న యను విశేషణంబులు కుచంబు లను పదముతో నన్వయించును. ఇందు తాళీఫలములతో నను వ్యవధా నము గలదు. కొన్ని యెడల విశేషణోభయపదంబులు త్రికకియాజన్య విశేషణ ఘటితంబులు సందర్భయోగ్య పదవ్యవహితంబు లగు ప్రౌ. వ్యా. సమా-౧౦- "కం-చిక్కని చక్కని నున్నని, క్రిక్కిని తోలూడ్పబడని ఘుల్లి పెగలచే నొక్కఁ బడని దండంబులు తక్కక యుపనయనవేళఁ దాల్పఁగ వలయున్॥విజ్ఞా- ఆచార - కం"- మొగ్గి విసిరికఁబడు గూడక, పగులక వెడలుపును నిడుపుఁ బసిమియుఁ గలలేఁ జిగురరఁటాకులు పెట్టిరి, దిగదిగ నర్ఘేవి యాజ్ఞ దివ్యపురంధ్రుల్॥ భీమ- ౨-౧౨౮

తాత్పర్యము

బలుపుగలట్టియు - నొకదానితో నొకటి దాచుకొనుచున్నట్టియు - తాటి పండులఁ బోలియున్నట్టియు సీతాదేవి స్తనములు నేను గౌఁగిలించు నపుడు చలింపఁగలవు.

క. నన్నుం బ్రాణేశ్వరుఁగా, గొన్నసతీమణి యరాళకుంతల పోఁడుం
గన్నెలనడుమ ననాథవ, లెన్నవసెడిఁ గాచు దిక్కులే కెదపడుచున్.౧౧౮

అర్థములు. అరాళకుంతల = వంకరగా నుండు వెండ్రుకలు గలది, పోఁడుంగన్నెల = రాక్షసస్త్రీల, అనాథవలె = దిక్కులేని దానివలె, నవసెడిన్= కృశించుచున్నది, ఎదపడుచున్ = భయపడుచు.

తాత్పర్యము

నన్ను, మూఁడు లోకముల వారిని గావఁగల నన్ను తన ప్రాణేశ్వరుగాఁ గొనియుఁ బతివ్రతారత్న మయి వంకర వెండ్రుకల సీత రాక్షస స్త్రీల నడుమ దిక్కులేని దానివలె రక్షించువారు లేక భయపడి కృశించు చున్నది గదా.

క. జనకునిసుత యఁట దశరథ, జనకతికోడ లఁట నాదు సతి యఁట రక్షో
వనితాజనతామధ్యమునను నిద్దుర నెట్లు గొనెడి నవలామిహియున్. ౧౧౯

అర్థములు. రక్షోవనితా జనతా మధ్యమునన్ = రాక్షస స్త్రీ సమూ హముల నడుమ, నవలామిహి=స్త్రీల యందు శ్రేష్ఠురాలు.

తాత్పర్యము

తండ్రియా జనకమహారాజఁట. మామగారా దశరథమహారాజఁట. భర్తయా నేనఁట. ఇట్టి యుత్తమ స్త్రీ రాక్షస స్త్రీల నడుమ నెట్లు నిద్రింపఁ గలదు.

క. గౌరేతరనీరదతతి, దారితముగఁ దోఁచు శారదవిధుకల యనన్
గ్రూరాసురులన్ సతి ధిక్కారించియు వెలికి రాఁగఁ గలుగుట యెపుడో.

అర్థములు. గౌరేతర = నల్లని; నీరదతతి = మేఘసమూహము, దారి తముగన్=చీల్పఁబడినదిగ, శారదవిధుకల=శరత్కాల చంద్రరేఖ.

తాత్పర్యము

నల్లని మబ్బులఁ జీల్చుకొని వెలికిఁ గానవచ్చు చంద్రరేఖవలెఁ గ్రూర రాక్షసుల ధిక్కరించి యెప్పుడు బయట రాఁగలదో.

చ. తరళమృగాక్షి నైజముగఁ ♦ దాను కృశాంగియు, యందు నిప్డు దు
 ర్భర బహుళార్తిచేతను, వి♦పర్యయ మాటను దేశకాలముల్,
 కర ముపవాసముం బకుటఁ ♦ గాంత మ రెంత కృశించెనో కదా
 హరిహయవైరిఁ ద్రుంచి ముద ♦ మార ధరాసుతఁ దెచ్చు టెన్నఁడో. ౧౨౧

అర్థములు. తరళమృగాక్షి=చలించు జింక కన్నులవంటి కన్నులు గలది, నైజముగన్ = స్వభావముచేతనే, కృశాంగియు = కృశించిన దేహము గలది. దుర్భర=భరింపరాని, బహుళార్తిచేతన్ = విస్తార దుఃఖముచేతను, విపర్యయము= తాఱుమాఱు, హరిహయవైరిన్=ఇంద్ర శత్రువు రావణుని.

తాత్పర్యము

చలించుచున్న జింక కన్నులవంటి కన్నులుగల సీతాదేవి స్వభావముచేతనే సన్నని దేహముగలది. ఇఁక నిపుడో సహింపరాని దుఃఖాతిశయముచేత, దేశము కాలము తాఱుమాఱగుటచేత, ఆహారము లేమిచేత నెంత కృశించినదో కదా. రావణాసురునిఁ జంపి నే నెన్నఁడు సీతను సంతోషముతోఁ దేఁ గలనో.

తే. దేవతాకన్యఁ బోలు నా ♦ దేవి సీత
 పరమసాధ్వీమచర్చిక ♦ పరమరతిని
 నెప్పుడో కదె యాకంఠ ♦ మెలమిఁ గ్రుచ్చి
 విలసమోదాశ్రువులఁ దాను ♦ విడువఁగలదు. ౧౨౨

అర్థములు. ఆకంఠ మెలమిఁ గ్రుచ్చి=సంతోషముతోఁ గంఠము వఱకుఁ గాఁగిలించి, ఇట్టి కౌఁగిలింతకు స్పృష్టక మని పేరు. "యద్యోషిత స్సమ్ముఖ మాగతాయా। అన్యాపదేశాత్ వ్రజతో నరస్య। గాత్రేణ గాత్రం ఘటతే తదేత దాలింగనం స్పృష్టక మాహు రార్యాః॥ యత్కుర్వతే వక్షసి వల్లభస్య, స్తనాభిఘాతా న్నిబిడోపగూఢాః। పరిశ్రమార్థం శనకై ర్విదగ్ధా స్తత్కంఠసూత్రం ప్రవదంతి సంతః॥ ఉరసి కమితు రుచ్చై రావికంఠీవరాంగీ స్తనయుగ ముపధత్తే చేత్స్తనాలింగనంతత్॥ కంఠసూత్ర స్తనాలింగనములు పర్యాయ నామములు.

తాత్పర్యము

దేవతాస్త్రీ వంటిదై పరమ పతివ్రతలలో శ్రేష్ఠురాలైన నా దేవి సీత గొప్ప మనస్సుతో నెప్పుడు నా మెడఁ గ్రుచ్చి కౌఁగిలించి యానందబాష్పములు విడువఁ గలదు.

పరమ సాధ్వీమచర్చిక = ఉత్తమ పతివ్రతలందు శ్రేష్ఠురాలు, "మతల్లికా మచర్చికా ప్రకాండ ముద్ఘ తల్లజౌ। ప్రశస్తవాచకా న్యమూని" అమరుఁడు.

క. నాసతిఁ దరుణీరత్నము, భూసుత నెడఁబాయఁ బెరుఁగు•భూరివ్యథ నే
మాసిన వస్త్రముమాడ్కిని, బాసి సుఖముపడఁగఁగలుగు• భాగ్యంబెపుడో. ౧౨౩

తా త్ప ర్య ము

నా భార్యను స్త్రీ రత్నమును భూపుత్రిని సీతను విడనాడుటచేఁ గలిగిన దుఃఖము నే నెన్నఁడు మాసిన గుడ్డను వదలినట్లు వదలి సుఖింపఁ గలనో.

తమ్మునితోనైనను నిటువంటి మాటలు చెప్పవచ్చునా? లక్ష్మణుఁడు సర్వ విధముల సేవకుఁడే యగుటచేఁ జెప్పఁబడెను. అటు కాని యెడల ననుచితమే. గోవింద. సుందరకాండమందు సీతాదేవి తన స్తనములను గురించి హనుమంతునితోఁ బ్రస్తావించెను. పరపురుషులతో మాట్లాడునపుడు స్త్రీలు తమ స్తనముల ముచ్చట తేరాదు. అట్లుండియు హనుమంతుఁడు తమ మర్మమెఱింగి వచ్చిన బంటు కావున సర్వవిధ సేవకుఁ డను భావముతో బిడ్డతోఁ జెప్పుకొన్నట్లు చెప్పుకొనెను.

చ. అని విలపించుచుండఁగ ది•నాంతమునం గడు మందరశ్మియై
దినకరుఁ డస్తమించుటయు • దీనత పాయ వచించి లక్ష్మణుం
డనునయసూక్తిఁ దేర్చుటయు • నంబుజలోచన సంస్మరించుచున్
వనట మునుంగుచున్ నృపతి•వర్యుఁడు సంధ్య యజించె భక్తియై. ౧౨౪

అర్థములు. దినాంతమునన్=సాయంకాలమున, మందరశ్మియై=వేఁడిమిలేని కిరణములు గలవాఁడై, సంస్మరించుచున్=స్మరించుటచేత, హేత్వర్థక శత్రర్థకము.

తా త్ప ర్య ము

ఈ ప్రకారము శోకించుచుండఁగా సాయంకాలమై సూర్యుఁ డస్తమింపఁగా నా వ్యసనము పోవునట్లు లక్ష్మణుఁడు సమాధాన వాక్యములు చెప్పి సరిచేయఁగా సీతను స్మరించుచు దుఃఖపడుచు రామచంద్రుఁడు సంధ్య వార్చెను.

ఈ దినము పాడ్యమి. సూర్యాస్తమయ మైనట్లు లిచ్చటఁ జెప్పఁబడెను. చంద్రోదయము ౧౦౦ వ పద్యమందుఁ జెప్పఁబడెను. కావున నేఁడు శ్రీరామ చంద్రమూర్తి గౌణకాలమున సంధ్య వార్చె నని యేర్పడుచున్నది.

—• ౬-వ సర్గము. రావణుఁడు మంత్రులతో నాలోచించుట. •—

ఉ. అక్కడ రావణుండు, త్రిద•శాధిపతుల్యుఁడు మారుతాత్మజుం
డెక్కటి లంకలోన ఘటి•యించిన ఘోరము భీతిదంబు నా
నక్కృతి నెంచి రాక్షసస•భాంతరసీమను సిగ్గు దోఁపఁగా
నుక్కఁతి నేలఁ జూచు చసు•రోత్తమ వీరులతోడ నిట్లనున్. ౧౨౫

ఇచ్చట శ్రీరామాదులు సముద్రముదాఁటు నుపాయ మాలోచించు చున్నారని చెప్పి విడిచి యీ మూఁడు దినములలో లంకలో జరిగిన వృత్తాంతము చెప్పఁ గవి యారంభించెను. హనుమంతుడు లంకవిడిచిన నాఁటి వృత్తాంతము చెప్ప బడుచున్నది.

అర్థములు. అక్క-కు=లంకాపురమునందు, త్రిదశాధిపతితుల్యుఁడు-ఇంద్రునితో సమానుఁడు, ఏక్కటి = అసహాయుఁడై, ఒంటరిగాఁడై, ఏకశబ్దభవము, అక్కృతి=ఆ కార్యము, సీతాదర్శన, రాక్షసవధ, లంకాదహనాది కార్యములు. ఉక్కు+అఱి = బలగర్వము దిగినవాఁడై. సిగ్గు = లజ్జ, మనస్సంకోచనం లజ్జా హ్యనౌచిత్య ప్రవర్తనాత్" అనుచితకార్యము చేసినపుడు కలుగు మనస్సంకోచము లజ్జ యనఁబడును. త్రిదశాధిపతుల్యుఁ డనుటచే, ఇంద్రుఁడు చేయఁదగినంత కార్యము చేసినవాఁ డని యర్థము. ఇది మారుతాత్మజ పదమునకు విశేషణము.

తాత్పర్యము

లంకలో రావణుఁ డింద్రసమానుఁడైన హనుమంతుఁ డొక్కఁడే చేసిన చూడ నసాధ్యమై భయంకరమైన రాక్షసవధ లంకాదహనాది కార్యములు తలఁచి రాక్షసుల సభయందు బలగర్వము క్షయించినవాఁడై సిగ్గుపడుచు నేలఁ జూచుచు రాక్షస వీరులతోడ నిట్లనెను. హనుమంతుఁడు నిలువఁబడి యుద్ధము చేసినపుడు రాక్షస సేనలఁ జంపఁగలిగెను. లంకాదహనకాలమున హనుమంతుఁడు మిద్దెల మీఁదఁ బరుపు లెత్తుచు నిండ్లలోఁ దొడ్లలోఁ దూఱి కొంపలు తగులఁబెట్టి వాయు వేగమునఁ దిరుగువానిఁ దనకొంప దగులఁబెట్టినను నేమియుఁ జేయఁజాలక పోయెను. తన యిల్లు తాను గాపాడుకొన లేనివాఁడు లంకాపుర మంతయు నేమి కాపాడఁ గలఁడు? ఒక్కని నివారింప లేనివాఁడు పెక్కురు వానరులు వచ్చిన నేమి నివారింపఁగలఁడు? ఇది బలహీనతను దెలుపును గావున నవమానకరము.

ఉ. వానరమాత్రుఁ డొక్కరుఁడు ♦ వాలినశక్తిఁ జొరంగరాని లం
కానగరంబుఁ జొచ్చి నను ♦ గాసునకుం గొన కా ధరాసుతన్
గానఁగఁ బోయి పెన్గవని ♦ గల్గిన గోపుర ముర్విఁ గూల్చి ర
క్షోనిచయంబుఁ జంపి పురి ♦ ఘోరవిధిన్ దహియించె నుగ్రుఁడై. ౧౩౬

అర్థములు. వాలిన = అతిశయించిన, కొనక = లక్ష్యముసేయక.

తాత్పర్యము

సామాన్యపుఁ గ్రోఁతి (క్రోఁతి రూపు ధరించిన దేవతలు గారు) యొక్కఁడు (పెక్కుమంది గారు) మనవలె నాయుధములు ధరించినవాఁడును గాఁడు. అతిశయించిన శక్తిచేత నెట్టి వారికిని బ్రవేశింప సాధ్యపడని లంకాపురముఁ బ్రవేశించి కాసునకుఁ గల విలువయైన నాయం దున్నదని తలంపక నన్నుఁ దృణముకంటె నీచముగా నెంచి నాయింటిలోఁ బ్రవేశించి సీతను జూడఁబోయి పెద్దగవనిగోపురము విఱుగఁదన్ని నేలఁ ద్రోచి, రాక్షసులఁ జంపి పట్టణమును బీభత్సముగఁ గాల్చెను.

ఉ. ఏమి యొనర్చువాఁడ? నిఁక ♦ నెయ్యది మార్గము? మీకు నాకు మే
లేమి విధంబునం గలుగు? ♦ నేమి యొనర్చిన నెల్లఁ జక్కనౌ?

రాము నెడాటమం దెటులు • గ్రాలిన మే లొనగూడుఁ? జెప్పుఁడా
మీ మతమున్, జయాస్పదము • మేలి సుమంత్రమ యందు దార్యులున్. ౧౨౮

అర్థములు. రాము నెడాటమందు=రాముని విషయమున.

తాత్పర్యము

అయిన దేమో యైనది. దానికి వగచి ఫలము లేదుకదా. ఇఁక జరగవలసిన కార్యము చెప్పుఁడు. నేనేమి చేయవలయును? నే నేమి చేసిన నాకు మీకు మేలు గలుగును? ఏమి చేసితిమేని యంతయుఁ జక్కఁబడును. రాముని విషయ మం దేమి చేసిన మనకు మేలుగలదు? మీ యభిప్రాయముఁ జెప్పుఁడు. మంచి యాలోచనయే జయకారణ మని పెద్దలందురు. కావున నాలోచింపక కార్యములు చేయరాదు.

తే. జగతిఁ బురుషులు గలరు ము • త్తెగలవారు, దలఁప నుత్తమ మధ్యమా • ధములనంగ
వారియందలి గుణదోష • వర్గములను, వరుస వచియింతు రాక్షస • ప్రవరులార!

తాత్పర్యము

లోకమునందు నుత్తములనియు, మధ్యములనియు, నధములనియు మూఁడు తెగల పురుషులు గలరు. రాక్షసశ్రేష్ఠులారా! వారే గుణములచే నుత్తములయిరో యే దోషములచే నధములయిరో చెప్పెద వినుండు.

చ. సమసుఖదుఃఖ బాంధవుల • సంహతితోఁ దనమేలు గోరు నె
య్యముగలవారితోడఁ దన • యాత్మను నచ్చిన మిత్రకోటితో
విమలమనీష యోజనలు • వే యొనరించి ఫలంబు దైవయ
త్నముగను గార్యముం గడఁగు • తజ్జనుఁ డుత్తముఁ డంద్రు కోవిదుల్. ౧౨౯

తాత్పర్యము

తన సుఖమే తమ సుఖముగను, తన దుఃఖమే తమ దుఃఖముగను నెంచు బంధువుల సమూహముతోడను, తన మేలుగోరు స్నేహముగలవారితోను, దన మనస్సు నమ్మిన మిత్రులతోను నిర్మలమైన బుద్ధితో శీఘ్రముగ నాలోచించి ఫలము దైవాధీన మని కార్యముచేయ నెవ్వఁడు పూనుకొనునో వాఁ డుత్తమ పురుషుఁడు.

క. దైవమె శరణంబుగఁ గొని, భావించి యొకండె కార్య • పద్ధతి నొకఁడే
కావింపఁ బూను నేనియు, నా వాఁ డగు మధ్యముం డ • టందురు ప్రాజ్ఞుల్. ౧౩౦

తాత్పర్యము

జయాపజయములకు లాభాలాభములకు దైవమే కారణము. ఆయనయే రక్షకుఁ డని దైవమునే నమ్మి యితరులతో నాలోచింపక తనకు మేలనితోఁచిన విధముగఁ గార్యము చేయఁబూనువాఁడు మధ్యమపురుషుఁడు.

క. అరయుక గుణదోషంబులఁ, బొరి దైవాశ్రయము చింత • పూనక పని దా
నెరయింపఁబూనియును నది, పరిపూర్తి నొనర్పకున్న • వాఁ డధముఁ డగున్.

తాత్పర్యము

ఇటుచేసిన మేలు, అటుచేసిన కీడు అని యాలోచనలేక దైవమును విశ్వసింపక దైవసాహ్యము గోరక కార్యము చేయఁబూని దానిని జక్కఁగఁ దుదముట్టఁ జేయనివాఁడు పురుషాధముఁ డనఁబడును.

ఆ. పురుషులందుఁబోలె ♦ సురవైరివరులార! గొప్ప మంత్రములను♦నుత్తమాధ
మములుమధ్యమంబు♦మఱియేనిలక్షణ,ములను విశదపఱుతుఁ ♦ దెలియవినుఁడు.

తాత్పర్యము

పురుషులందు ఉత్తమ మధ్యమాధము లున్నట్టులు మంత్రాలోచన యందును మూఁడువిధములు గలవు. వాని లక్షణములు తెలియఁజెప్పెద వినుఁడు.

తే. శాస్త్రదృష్టిని జూచుచు ♦ సచివులెల్లఁ
గార్యమునయందు నాసక్తి ♦ కడమ వడక
యైకమత్యంబు వహియింతు ♦ రట్టి యదియ
యుత్తమాలోచనం బందు ♦ రుర్వి బుధులు. ౧౩

తాత్పర్యము

శాస్త్రమునందు దృష్టి యుంచి యది చెప్పినప్రకారము మంత్రులందఱు కొఱఁతలేని యాసక్తితో నెట్టులైన నీ కార్యము సాధింపవలయు నని పట్టుదలగలవారై యేకాభిప్రాయము గలవారై రేని యట్టిది యుత్తమమైన యాలోచన మని పండితులందురు.

తే. కార్య మాలోచనము సేయఁ ♦ గడఁగు నపుడు
మొదల వేర్వే అభిప్రాయ ♦ ములను గొనియుఁ
దుదకు నేకమతంబునఁ ♦ బొడలిరేని
దాని మధ్యమ మందురు ♦ తత్త్వవిదులు. ౧౪

తాత్పర్యము

కార్యము నాలోచింపఁ బూనినపుడు మొదట వేఱువేఱ అభిప్రాయములు గలవారైనను గడపట నందఱు నేకాభిప్రాయము గల వారై రేని మంత్రతత్త్వము దెలిసినవారు దానిని మధ్యమాలోచన మందురు.

తే. ఒకరిమతమును మెచ్చక ♦ యొక్కఁడుండు, తాను బట్టిన పట్టును♦మానకొనక
యైకమత్యంబునందు శ్రే♦యస్సులేద,టన్న యాలోచనం బది♦యధమమంత్రము.

తాత్పర్యము

ఒకఁడు చెప్పిన దానిని మఱియొకఁ డంగీకరింపక తాను జెప్పినదే సరియని హఠవాదము చేయుచు నేకాభిప్రాయమునకు రాక యెవరి అభిప్రాయము వారి దను నాలోచన మధమాలోచనము.

ఉ. మీరలు బుద్ధిమంతులరు • మే లగు కార్యము నిశ్చయించి యీ
తీరునఁ జేయ నౌ ననుచుఁ•దీ రెఱిఁగించుటె నా యభీష్ట మా
వీరుల వానరేంద్రులను • వేలకొలందులఁ గూడి భీకరా
కారత ముట్టడించు రఘు•కాంతుఁడు లంక నిజంబు చూడఁగన్. ౧౩౬

తాత్పర్యము

మీ రందఱు బుద్ధిమంతులరు. మంచి యాలోచనచేయు శక్తి గలవారు. కావున నేమి చేసిన మనకు మేలు గలుగునో మీ రంద ఱాలోచించి యిదో యీ ప్రకారము చేయుట తగును అని చెప్పవలయునని నాకోరిక. అంత దీర్ఘముగ నాలోచింప వలసినంతటి యుపద్రవమేమి వచ్చినది. ఎవఁడో తుంటరి కోఁతివాఁ డొకఁడువచ్చి గంతులుపెట్టి పోఁగానే యింతదూర మాలోచింప వలయునా యందు రేమో. అది సరిగాదు. ఏలన రామచంద్రుఁడు భయంకరాకారము గలిగిన వేల సంఖ్యగల వానరులను దోడు చేసికొని లంక ముట్టడించును గాని విడువఁడు. ఇది సత్యము.

ఉ. సానుజుఁడుం జమూయుతుఁడు • నై రఘురాముఁడు దాఁటివచ్చు న
న్యూనసుఖంబుతో జలధి • యుక్తపరాక్రమరీతి మైఁ బయో
హీనముఁ జేసియో మఱి యొ•దేని నిజాద్భుతశక్తిఁ జూపియో
కానఁ బురీబలంబులకుఁ • గల్గ శుభం బొకయుక్తిఁ జెప్పుఁడా. ౧౩౭

అర్థములు. అన్యూనసుఖంబుతోన్ = అనాయాసముగ, సుఖమునకు, లోపము లేక యుక్తపరాక్రమ రీతిమైన్ = ఆయన పరాక్రమమునకు యోగ్యమైన రీతిగా, పయోహీనము = నీళ్ళు లేనిది, పురీబలంబులకున్ = లంకానగరమునకు, సేనలకు, చమూయుతుండు = సేనతోఁ గూడినవాఁడు.

తాత్పర్యము

రాజేంద్రా! కోఁతి కావున గంతువేసి సముద్రము దాఁటఁ గలిగెను. రామలక్ష్మణు లెట్లు దాఁటి రాఁగలరు. ఒక వానరుఁడు దాఁటగానే యందఱు వానరులు దాఁటఁగలరని యెట్లు నిశ్చయము అని సందేహింపరాదు. రామచంద్రుఁడు తమ్మునితోడను సేనతోడను గష్టములేక యాయన పరాక్రమమునకుఁ దగినట్లు సముద్రము నెండించియో లేక తన దైవిన నద్భుతశక్తిఁ జూపియో సముద్రము దాఁటివచ్చును. కావున నప్పుడు పురము నే విధముగ రక్షింపవలెను. ఎట్లు చేసిన సేనలకు మేలుకలుగును. దానికి నొక యుక్తిఁ జెప్పుఁడు ఒకవేళ మీరు దలంచునట్లు రాముఁడు రాఁజాలఁ డయ్యెనా మఱియు మే లే-మన మాలోచించి జాగ్రత్త పడుటవలన హాని యేమియు లేదుకదా.

—• ౭-వ సర్గము. రాక్షసులు రావణుపరాక్రమంబుఁ బొగడుట. •—

చ. పవిధరవైరిపల్కులకుఁ • బల్కిరి మోదముపుఁ గేల నెల్లదా
నవులు మహాబలాఢ్యులు మ•నంబున నాత్మవిరోధిపక్షముల్

లవము నెఱుంగ లేక మిగులన్ మతిహీనత నీతిబాహ్యులై
భువి నవినీతులైన సచివుల్ గద రాజుల పాలిశాత్రవుల్. ౧౫

అర్థములు. పవిధరవైరి = వజ్రము ధరియించిన యింద్రుని పగవాఁడు, రావణుని యొక్క—ఆత్మవిరోధిపక్షముల్ = తన బలము, విరోధిబలము, పక్షము = పక్షో మాసార్ధకే పార్శ్వే గృహే సూర్యవిరోధయోః । కేశాదేః పరితో బృందే బలే సఖి సహాయయోః. విశ్వ నిఘంటువు లవము = కొంచెమైనను; మతిహీనతన్ = బుద్ధిలేనితనము చేత, నీతి బాహ్యులై = నీతిమార్గము వదలినవారై, అవినీతులు = నీతిమాలినవారు, సచివుల్ = మంత్రులు, అర్థాంతరన్యాసాలంకారము.

తాత్పర్యము

రావణుఁ డీప్రకారము పలుకఁగా మహా బలవంతులు రాక్షసులు చేతులు జోడించి దేహబలము గలవారేకాని బుద్ధిబలము లేనివారగుటచే తమ బల మెంత-విరోధుల బల మెంత యని తెలిసికొనలేక యిట్టి సందర్భముల నెట్లు ప్రవర్తించుట నీతియో యదియు నెఱుఁగక కొంచెమైనను బుద్ధి లేనివారై యిట్లనిరి. నీతిమాలిన మంత్రులు గదా రాజులకు విరోధులు - చెఱుపు చేయువారు విరోధులు - దురాలోచనము చెప్పి చెఱుపుచేయుదురు గావున దుర్మంత్రులు విరోధులే.

ఇట్లు చెప్పుటయందుఁ గవి యభిప్రాయ మేమన:—రాముఁ డింతవఱకుఁ జేసిన కార్యము లిప్పు డొక క్రోతి చేసిన కార్యము-ఇట్టివా రింకను జెక్కుఱు గలరు గదా. కావున బలవద్విరోధము మేలు లేదని యాలోచించి యంత నేకవాక్యముగా సీతను మరల నిమ్మని పట్టుపట్టి యుండినయెడల రావణుఁ డీయక తప్పించుకొనలేఁడు. అటుగాక వా రధమపురుషులై యధమమంత్ర ముపదేశించి వానిని జెఱచి నాశమున్న జేసిరి.

సీ. దనుజేంద్ర! యిటు విచా॰రము పడ నేటికిఁ? బట్టిసశక్తృష్టి॰పరిఘశూల
సంకుల మగు మహా॰సైన్యంబు నీ కుండఁ, బరిమార్చితివి భోగ॰వతిని ఫణుల
గైలాసవాసి య॰క్షవ్యూహసంయుతు, ధనదుని నోడిచితి ॰ దర్పగరిమ
సమ్మహేశ్వరుసఖ్య॰ మంది కీర్తితుఁడ నై, కినుక దిక్పాలుర ॰ గెలిచి తీవు
తే. యక్షులను బట్టి గళవళ॰మందఁ జేసి, కొట్టి వధియించి కైలాస॰కూటమందుఁ
దేజరిల్లు విమానంబుఁ దెచ్చితివటకు,నీకు సరివారు గలరె ము॰ల్లోకములను?

అర్థములు. శక్తి = పొడుగాటి కత్తులు, రిష్టి - ఋష్టి = ఖడ్గములు ఖడ్గేతు నిస్త్రింశ చంద్రహాసాసి రిష్టయః కౌక్షేయకో మండలాగ్రః కరవాలః కృపాణవత్ ॥ అమరుఁడు. చంద్రహాసర్ష్టి నిస్త్రింశా జ్ఞేయా ఏకార్థవాచకాః ॥ త్రి. శేషము - రిష్టి, రూ. ఋష్టి రెండు రూపములు గలవు.

తాత్పర్యము

రాక్షసేశ్వరా! పట్టిసములు - శక్తులు - ఋష్టులు - పరిఘములు - శూల

ములు నిండిన గొప్ప సేన నీ కుండఁగా నీవేల యిట్లు వ్యసనపడెదవు. భోగవతీ పురమందు సర్పముల నెల్ల గెలిచితివి. కైలాసమున యక్షసమూహములతో నుండు కుబేరుని బల గర్వముచే జయించితివి. ఆ మహేశ్వరునితో స్నేహముచేసి కీర్తిని సంపాదించి కోపించి దిక్పాలకులనెల్ల జయించితివి. యక్షులనుఁబట్టి తికమక పడఁగొట్టి చంపి కైలాస శిఖరమందున్న విమానము నిచ్చటికిఁ దెచ్చితివి. నీకు సమానులు మూఁడులోకములందును గలరా.

చ. భయమున నీదు సఖ్యమును • బ్రార్థన సేయుచు నాత్మసంభవన్
మయుఁ డను దానవేశ్వరుఁడు • మానుగ నిచ్చెను నీకు భార్యగా
జయము గొనంగ లేదొకో ర•సాతలసీమ రణంబునన్ బిలే
శయులను వాసుకిన్ జటిని • శంఖునిఁ దక్షకు గల్పి శూరతన్. ౧౪౦

అర్థములు. బిలేశయులను = సర్పములను - బిలే+శయులు=బిలమందు శయనించువారలు=అలుక్సమాసము.

తాత్పర్యము

నయమున నీయకుండినఁ జంపుదు వను భయముచే నీ స్నేహముఁ గోరిగదా దానవేశ్వరుఁడు మయుఁ డనువాఁడు తన తనయను నీకు భార్యగా నిచ్చెను.(ఉత్తర రామాయణమున ౨౫౬ వ పద్యము చూచునది) పాతాళమునకుఁ బోయి యుద్ధమున సర్పములను వాసుకిని జటిని శంఖుని తక్షకుని శౌర్యముచే గెలువలేదా.

ఉ. దానవనాయకుండు బల•దర్పితమానసుఁ డా మధుండు కుం
భీనసి సౌఖ్యధాత యతి•వీరుఁడు నీకు వశంపడండె ? యు
ద్ధాన సమస్తదిక్పతుల•దర్ప మడంచి సురేంద్రలోకమున్
మానక చేరి యందు బల•మర్దను నిర్జితుఁ జేయవే ప్రభూ. ౧౪౧

అర్థములు. బలదర్పిత మానసుఁడు=బలముచే గర్వించిన మనస్సు గలవాఁడు - కుంభీనసి సౌఖ్యధాత=కుంభీనసి మగఁడు, బలమర్దనున్=ఇంద్రుని.

తాత్పర్యము

దానవుల కధిపతియు బలగర్వము గలవాఁడును - నీ చెలియలు కుంభీనసి మగఁడును నగు మధుఁడు నీకు వశపడలేదా - యుద్ధమున సమస్తదిక్పాలురను గర్వమడంచి యింద్రలోకమునకుఁ బోయి యందు నింద్రుని జయింపలేదా.

క. బలయుతుల లబ్ధవరులను, గలిశూరుల నక్షయులను • గదనములోనన్
నిలిచి యొకయేఁడు దనుజుల, గెలువవె మాయలను నేర్చి•కీర్తిం గనవే. ౧౪౨

అర్థములు. లబ్ధవరులను=బ్రహ్మచే వరముల నొందిన వారలను, కలిన్=యుద్ధమందు, అక్షయులన్ నాశము లేనివారలను, కదనములోనన్=యుద్ధమందు.

తాత్పర్యము

బలవంతులును బ్రహ్మచే వరము పొందినవారును రణశూరులును నాశము గాని వారు నగు దనుజులతో నొక సంవత్సరము యుద్ధముచేసి గెలువలేదా; వారి వలన మాయలను నేర్చి కీర్తి సంపాదింపవా.

క. విక్రమవంతుల మఱి ని,ర్వక్రభుజబలాఢ్యయుతుల ♦ వరుణాత్మజులన్
చక్రాన్వితుల బాహువ,రాక్రమమున గెలువలేదె ♦ రణలంపటతన్. ౧౪౩

అర్థములు. నిర్వక్ర=వంకరలేని, లోపములేని, భుజబల+ఆఢ్యయుతుల = బాహుబల సంపత్తితోఁ గూడినవారు, చక్రాన్వితులన్ = సేనలతోఁ గూడినవారిని రణలంపటతన్=యుద్ధమందలి యాశక్తిచే.

తాత్పర్యము

పరాక్రమము గలవారిని, సంపూర్ణ భుజబల సంపన్నులను, సేనలతోఁగూడిన వారలను వరుణ పుత్రులను యుద్ధమందలి యాసక్తిచే భుజబలముచే గెలువలేదా.

చ. ప్రకటితశాల్మలీద్రుమవి♦భాసము భీకరమృత్యుదండన
క్రకమును గాలపాశసుత♦రంగము దండధరోగ్రకింక రా
హికము పరేతరాడ్బలమ♦హిష్ఠసముద్రముఁ జొచ్చి మృత్యువున్
దికమకఁ బూర్పవే జగము ♦ దిగ్భ్రమ నొంద జయింబుఁ గాంచవే. ౧౪౪

అర్థములు. ప్రకటిత = ప్రసిద్ధపఱుపఁబడిన, శాల్మలీద్రుమ= బూరుగు చెట్లచేత, బూరుగుచెట్లవంటి యాయుధములచేత, విభాసము = విశేషముగఁ బ్రకాశించునది, భీకర=భయము కలిగించు, మృత్యుదండ నక్రకమును = యమ దండ మను మొసళ్ళు గలదియు, కాలపాశసుతరంగము=కాలపాశ మను నలలు గలది, దండధర=యమునియొక్క, ఉగ్రకింకర = భయంకరులైన కింకరు లనెడి, అహికము=పాములు గలది, పరేతరాట్ = యమునియొక్క, బల = సేనయనెడి, మహిష్ఠ సముద్రము=గొప్ప సముద్రమును, మృత్యువున్ = యముని, మృత్యు దేవతను, తికమిక=కలఁత, సముద్రమునందుఁ జెట్లుండునని సందేహింపరాదు. ద్వీపములందు మహావృక్షములు గలవు.

తాత్పర్యము

ప్రసిద్ధమైన బూరుగు చెట్లచేఁ బ్రకాశించునదియు, భయంకరమైన మృత్యు దండ మను మొసళ్ళు గలదియు, కాలపాశ మను నలలు గలదియు, యమకింక రులను పాములు గలదియు, నగు యముని సేన యను గొప్ప సముద్రమునఁ బ్రవేశించి మృత్యుదేవతను గలవరము గొనఁజేయలేదా? లోకము దిగ్భ్రమ నొంద జయింపలేదా?

ఉ. వృత్రవిరోధిసన్నిభులు ♦ విశ్రుతవీర్యపరాక్రమాఢ్యు లౌ
క్షత్రియు లీ ధరాస్థలిని ♦ గానవృక్షము లట్లు లుండఁగా

దాత్రముచేతఁ బోలె శర•దారితగాత్రులఁ జేయవా? కో; యా
గోత్రధృతీడ్యవిక్రముల•కున్ సరి వచ్చునె రాముఁ డాజిలోన్. ౧౮౫

అర్థములు. వృత్ర విరోధి సన్నిభులు=ఇంద్రునితో సమానులు, విశ్రుత=ప్రసిద్ధికెక్కిన, కాననవృక్షములు=అడవిలోని చెట్లు, అడవిలోని చెట్లు అడ్డములేక తమ యిష్టము వచ్చినట్లు పెరిఁగి యభివృద్ధి చెందినట్లు క్షత్రియులు పెరిగినారని భావము. దాత్రము=కొడవలి, ఇచ్చట గొడ్డలి యనియే చెప్పవలెను. శర=బాణములచే, దారిత = చీల్పఁబడిన, గాత్రులన్ = దేహములు గలవారినిగ. గోత్ర ధృతి = పర్వతములవంటి ధైర్యముగల, ఈడ్య=స్తోత్రము చేయఁదగిన, విక్రములకున్ = పరాక్రమము గలవారికి.

తాత్పర్యము

నేను దేవదానవాదులచే భయములేకుండ వరము గోరితిని, గావున నింద్రాదుల జయింపగల్గితిని. మనుష్యులవలన భయములేకుండ నేను గోరలేదు గదా! రాముఁడు మనుష్యుఁడుగదా యందువేమో. ఇంద్రునితో సమానులై మహాబల పరాక్రమవంతులైన యనరణ్యాది క్షత్రియులడవి చెట్లవలె బాగుగ యథేచ్ఛముగ బలసియుండగా గొడ్డలితోఁ గొట్టినట్లు బాణములచే వారిని జీల్చలేదా? వారు మనుష్యులుగారా? పర్వతములవలె ధైర్యముగలవారును స్తోత్రము చేయఁబడిన విక్రమము గలవారు నగు ఆ రాజులకీ రాముఁడు యుద్ధములో సమానుఁడగునా?

ఉ. ఊరక యుండు గాసిఁ గొన•కో మనుజాశననాథ! పాకజి
ద్వైరి యొకండె చక్కఁడుచు•వానరకోటుల నెల్ల, మృత్యుసం
హారు మహేశు యజ్ఞమున•హర్షితుఁ జేసి సుదుర్లభంబు మ
ర్త్యారము నా వరంబుఁ గని•రంజిలఁ జేయఁడె మొల్లవారలన్. ౧౮౬

తాత్పర్యము

రాక్షసేశ్వరా! నీ వేయాలోచన చేయవలసిన పనిలేదు. ఏకార్యము చేయవలసిన పనిలేదు. నిశ్చింతముగ నూరకుండుము. వానరుల నందఱను నింద్రజిత్తొక్కఁడే చంపును. యముని జయించిన శివునిగూర్చి యజ్ఞముచేసి యాయనను సంతోషపెట్టి మిక్కిలి దుర్లభము అడ్డగింపరానిది యగు వరంబు సంపాదించి రాక్షసుల నందఱ సంతోషపెట్టఁడా?

సీ. శక్తితో మరచయ•శకులికమును విని, కీర్ణాంత్రశైవాల•కీలితంబు
వారణకచ్ఛప•వారసంబాధంబు, నశ్వమండూకచ•యాంచితంబు
నాదిత్యరుద్రమ•హాగ్రాహమును మరు,ద్వసుమహాపన్నగ•దరకరంబు
స్యందనతురగగ•జాంబుపూరంబును, బటువ త్రిపైకత•భ్రాజితంబు

తే. నైన నిర్జరసైన్యమ•హార్ణవంబుఁ. బఱచి శంబరవృత్రహుఁ•బట్టి లంక
కిటకుఁ గొనివచ్చి శ్రీసుర•జ్యేష్ఠునాజ్ఞఁ,దలఁచి విడిచినశూరుఁడీ•తండు కాఁడె. ౧౮౭

అర్థములు. శక్తితోమరచయ=శక్తులయు, చిల్లకోలల సమూహ మనెడి, శకులీకమును = చేఁపలు గలదియు, వికీర్ణ=రాలియున్న, అంత్ర = ప్రేవులనెడి, శైవాల=పాఁచిచే, కీలితంబు = నిండినదియు, వారణ=ఏనుఁగు లనెడి, కచ్ఛప = తాఁబేళ్ళయొక్క, వార = సమూహముచే, సంబాధితంబు = నిండినది, అశ్వ = గుఱ్ఱము లనెడి, మండూక = కప్పల, చయ = గుంపుచే, అంచితంబు=ఒప్పినది, ఆదిత్యరుద్ర = సూర్యులు, రుద్రుఁడు ననెడి, మహాగ్రాహమును=గొప్ప మొసళ్ళు గలదియు, మరుత్, వసు=మరుత్తులు వసువులనెడి, పన్నగ = పాములచే, దర కరంబు = భయము కలిగించునది, స్యందన తురగ గజ = రథములు గుఱ్ఱములు ఏనుఁగులు నను, అంబు = నీళ్ళ, పూరంబును = ప్రవాహము గలదియు, పటు= దృఢమైన, పత్తి=పదాతు లనెడి, సైకత = ఇసుక దిబ్బలచే, భ్రాజితంబు=ప్రకాశించునదియు, నిర్జరసైన్య = దేవతల సేన యనెడి, మహార్ణవంబు = గొప్ప సముద్రము, పఱచి = పాఱఁదోలి, శంబర వృత్రహన్=శంబరుని వృత్రుని జంపిన యింద్రుని, సురజ్యేష్ఠ=బ్రహ్మయొక్క.

తాత్పర్యము

శక్తులు తోమరములను చేఁపలు, ప్రేవులనెడి ప్రాఁచితీఁగలు, ఏనుఁగు లనెడి తాఁబేళ్ళు, గుఱ్ఱము లనెడి కప్పలు, సూర్యుఁడు రుద్రుఁడు నను పెద్ద మొసళ్ళు - మరుత్తులు వసువు లనెడి పాములు, తేరులు - గజములు-గుఱ్ఱములనెడి నీళ్ళు, కాలిబంట్లనెడి యిసుకదిబ్బలు గల దేవసేన యనెడి సముద్రమును పాఱిపోఁజేసి (ఎండించి) శంబర వృత్రుల జంపిన యింద్రుని జెఱఁబట్టి లంకకు దీసికొని వచ్చి బ్రహ్మ యాజ్ఞప్రకారము వదలిన శూరుఁ డితఁడే కదా.

ఈ రాక్షసులు చెప్పిన విషయము లన్నియు నుత్తరకాండంబున వివరింపఁ బడినవి.

ఉ. కావున నిట్టి యాత్మజు న•ఖండపరాక్రము నింద్రజిత్తుఁ గీ
 శావళి రామయుక్తముగ • నంతకు నంతికసీమఁ జేరఁగాఁ
 బోవ ననుజ్ఞ యిమ్ము, పొరి•పుచ్చును వారలఁ, బ్రాకృతుం డొకం
 డావిధిఁ జేటు గూర్చె నని • యాత్మఁ గలంగకు, గల్తు రాఘవున్. ౧౮౮

అర్థములు. అంతకు = యమునియొక్క, అంతికసీమన్ = సమీప ప్రదేశమును, పొరిపుచ్చును=చంపును, ప్రాకృతుఁ డొకండు = ఎవఁడో యొక నీచుఁడు, క్రోఁతిగాఁడు.

తాత్పర్యము

ఇటువంటి గొప్పకార్యము చేసిన నీ కొడుకును నింద్రజిత్తును, పూర్ణ పరాక్రము రామునితోడ వానరులఁ జంపఁబోవునట్లు ఆజ్ఞాపింపుము, వారలను

జంపును. ఎవఁడో యొక నీచపుఁ బ్రోఁతిగా డాప్రకారము కీడు కలిగించెనని వ్యాకులపడకుము. రాముని నీవు గెలువఁగలవు.

—◆ ౮-వ సర్గము. ప్రహస్తాదులు తమతమ పరాక్రమంబు రావణుతోఁ జెప్పుట. ◆—

ఉ. అంతట సైన్యనాథుఁ డసి◆తాబ్దనిభుండు ప్రహస్తుఁ డుగ్రదు
ర్దాంతపరాక్రమోద్ధతుఁడు◆ప్రాంజలియై యసురేంద్ర! యేల యీ
చింత? సురాసురోరగవి◆శిష్టపిశాచగణంబు లేని నీ
చెంతలఁ జేర లేవనఁగఁ◆జెప్పెడి దేమి వనేచరావళిన్. ౧౪౯

అర్థములు. అసిత+అబ్ద+నిభుండు = నల్లని మేఘముతో సమానుఁడు, ఉగ్ర = భయంకరమైన, దుర్దాంత=అణపరాని, పరాక్రమ = పరాక్రమముచే, ఉద్ధతుఁడు = గర్వించినవాఁడు, ప్రాంజలియై = అంజలి జోడించినవాఁడై, సుర+అసుర+ఉరగ+విశిష్టపిశాచగణంబులు = దేవతలయు, అసురులయు, సర్పములయు, సమస్త పిశాచములయు సమూహములైనను, వనేచర+ఆవళి=వానరుల గుంపును, వనే+చర=సప్తమ్యలుక్సమాసము.

తాత్పర్యము

సభలోనుండు రాక్షసు లందఱునిట్లు చెప్పినపిమ్మట మంత్రులు ప్రముఖులు వారివారి యభిప్రాయము వేఱువేఱఁ జెప్పుచున్నారు. అందు మొదట ముఖ్య సేనానాయకుఁడు ప్రహస్తుఁడు తన యభిప్రాయము దెలుపుచున్నాఁడు.

ఇట్లందఱుఁ జెప్పిన పిమ్మట మేఘమువలె నల్లనివాఁడు భయంకరమై యణఁపరాని పరాక్రమముచే గర్వించినవాఁడును నగు ప్రహస్తుఁడు నమస్కరించి యిట్లనియె. రాక్షసేంద్రా! నీ కేల యీ విచారము. దేవాసురులైనను పన్నగ పిశాచములైనను నీ సమీపమునకు నైన రాలేవు. ఇఁకఁ గ్రోఁతులా నీ యెదుట నిలిచి యుద్ధముచేయఁ గలవు?

ఉ. ఎవ్వఁడు మ మ్మెదుర్పఁ గమ◆నెవ్వఁడు గెల్వఁగఁ జాలు నంచు మే
మివ్విధ సప్రమాదగతి◆నేమఱి యుంటిమి గాన వానరుం
డవ్విధి మేనితోఁ జనఁగ◆నయ్యెను వంచన చేసి, కానిచో
నవ్వనగోచరున్ యమగృ◆హాతిథిగా నొనరించి యుండమే? ౧౫౦

అర్థములు. ఇవ్విధన్=ఈ విధముగ - సప్రమాదగతి=హెచ్చరిక తప్పి-యమగృహాతిథిగా = యముని యింటికి నతిథిగా - చంపియని యర్థము - పర్యాయోక్త్యలంకారము.

తాత్పర్యము

మమ్మెదిరించు వాఁ డెవ్వఁడు? మమ్ము గెలువఁగల వాఁ డెవ్వఁడు? అని యీ ప్రకారము మేము హెచ్చరిక దప్పి యేమఱియుంటిమి. కావున వానరుఁడు వంచన

చేసి ప్రాణములతోఁ బోవఁ గలిగెను. కాని కొంచెము హెచ్చరిక కలిగి యుండినచో వాని నప్పుడే చంపి యుండనా?

చ. జలధిపరీతధారిణి స♦శైలవనాంత మవానరంబుగాఁ
   జలిపెద, నాజ్ఞ యి మ్మిపుడ ♦ చయ్యన నేగెదఁ, గ్రోధిచేత నే
   విలయము గూడకుండ నొక ♦ వేయివిధంబులఁ గాపు పెట్టెదన్,
   గలుగదు స్వాపరాధభవ♦కష్ట మొకింతయు నీకు నాపుడున్. ౧౬౧

అర్థములు. జలధిపరీతధారిణి = సముద్రముచేఁ జుట్టబడిన భూమి-అవానరంబుగా=వానరు లనువారు లేకుండ - స్వాపరాధ భవకష్టము = సీతాపహరణ మనెడి స్వయంకృతాపరాధము వలనఁ గలుగు కష్టము.

తాత్పర్యము

సముద్రముచేఁ జుట్టఁబడిన భూమి యంతయు కొండలతో నడవులతోఁ గూడిన దానిని వానరులనువారు లేకుండఁ జేసెదను. ఆజ్ఞ యిచ్చెదవేని యిపుడేపోయెదను. నీ వొక క్రోధిఁబోయిన వారొక క్రోధవచ్చి యూరిపై బడుదురేమో యనకుము. అట్టి భయము లేకుండ వెయ్యి విధముల రక్షణోపాయములఁ గావించెదను. చేతులారఁ జేసికొనిన దోషమువలని కష్టము నీకుఁ గలుగదు.

స్వాపరాధభవ కష్ట మనుటచే నీవు స్వయముగఁ జేసినదేమో దోషమే. దానివలన నవమానము రాకుండుటకై యుద్ధము చేయవలసి యున్నదని ప్రహస్తుని యభిప్రాయము.

ఆ దోషము నవరించుకొనుటకు రెండుపాయములు సీత నిచ్చుట మొదటిది. అది యనమానకర మని తోఁచినయెడల యుద్ధము సేయుట- మొదటి యభిప్రాయమునఁ జెప్ప- కేకీభవింపమిచే నంతఃకలహ మాపుటకై వారిమార్గమును దా ననుసరించి యుద్ధవిషయము చెప్పెను. ప్రహస్తుని వాస్తవాభిప్రాయము ౧౧౭౮ వ పద్యంబునఁ జెప్పఁబడినది.

ఉ. క్రుద్ధుఁడు దుర్ముఖుం డనెడి♦ఘోరపలాశి వచించెఁ గ్రోధి దు
   ర్బుద్ధి పురంబువారికిని ♦ బౌల్కుకకూటువకున్ సురేంద్రుదిన్
   బద్ధు నొనర్చినట్టి బల♦వంతున కీ యసురాధినేతకున్
   సిద్ధ మగౌరవం బొనరఁ ♦ జేసెను, దీనిని సైఁపఁ జెల్లునే. ౧౬౩

అర్థములు. క్రుద్ధుఁడు = కోపించినవాఁడు - పలాశి = రాక్షసుఁడు - పల+అశి=మాంసముదినువాఁడు; దుర్బుద్ధి = చెడుబుద్ధిగలవాఁడు; పౌల్కుకకూటువకున్ =అంతఃపురస్త్రీలకు.

తాత్పర్యము

ప్రహస్తుఁడు తా నజాగ్రత్తగా నుండుటచే వానరుఁడు చెడుకార్యము చేయ గలిగెనని చెప్పఁగా కోపించిన దుర్ముఖుఁ డను రాక్షసుఁ డిట్లను చున్నాఁడు.దుర్బుద్ధి

గల క్రోఁతి నగరమున నుండువారికిని కొంపలుగాల్చి యంతఃపుర స్త్రీలు నడి వీథులలోకి వచ్చునట్లు చేయుటచే స్త్రీల గుంపునకును, ఇంద్రుని బట్టి కట్టిన రాక్షసేశ్వరునకు నవమానము గలిగించుట సత్యము. నే నజాగ్రత్తగా నుంటి ననిన పోయిన మానము మరలి వచ్చునా? ఈ యవమానము సైఁప సాధ్యమా ?

క. ఈనిమిషంబున నొకఁడన, వానరవర్గంబు మిన్ను • బ్రాఁకిన జలధిం
దీనతఁ దూఱి భుజంగ; స్థానంబున కేగఁ బట్టి • చంపెదఁ గడిమిన్. ౧౫౩

తాత్పర్యము

అవమానము కలుగుట సత్యమే, దానిని సహింపరాదనుట సత్యమే, అయినను దానికి నీవేమి ప్రతీకారము చెప్పెద వందువా! నే నొకఁడనే యీనిమిషంబునఁ బోయి వానర సమూహము ఆకాశమున కెగిరిపోయినను ఏడ్చుచు సముద్రములో దాఁగినను పాతాళంబునకుఁ బోయినను బట్టి చంపెదను.

చ. అనవుడు వజ్రదంష్ట్రుఁడు మ•హాబలశాలి పలాస్రరూషితం
బను బరిఘంబుఁ గేలఁ గొని • బొబ్బిడుచుం బలుకున్ దపస్వియా
వనచరుతోడ నేమి పని • వ్రాలిన శక్తిని రాముఁ డుండఁగా
ననుజాఁడు లక్ష్మణుండుఁ బ్లవ•గాధిపుఁ డుండఁగ? నే నొకండనే. ౧౫౪

అర్థములు. పల+అస్ర+రూషితంబు = మాంసము నెత్తురుతోఁ బూయఁబడినది. (పూజా వేళ నని శేషము) తపస్వి = తపము చేయువారివలెఁ గూరగాయలు దిని శుష్కించినవాఁడు, కావుననే (౨) కనికరింపఁదగినవాఁడు; వనచరుతోడన్ = అడవులందుఁ దిరుగువానితో.

తాత్పర్యము

దుర్ముఖుఁ డిట్లు చెప్పఁగా దానిని మెచ్చక వజ్రదంష్ట్రుఁ డనువాఁడు మాంసము నెత్తురు పూయఁబడిన యినుపకట్ల గుదియఁ జేతఁ దీసికొని సింహనాదము చేయుచు నిట్లనియె. క్రోఁతులు జంపెదమని కొందఱ అనుచున్నారు. క్రోఁతు లడవులలోఁ దిరుగునవి, మనయిండ్లతో వాకిండ్లతో మనతో వానికేమి పని ? అదియునుగాక తపస్సు చేసికొనువారివలెఁ గాయగసురులు దిని జీవించునవి, కావుననే కనికరింపఁ దగినవి. వానిని జంపిన రాఁగల లాభమేమి? అంతతో విరోధము పోవునా ? మనలను నవమాన పఱుపఁ బూనిన శత్రువులు రామలక్ష్మణ సుగ్రీవులు కదా! వారిని విడిచి వానరులను జంపుట వలన మేలులేదు. కావున నే నొకఁడనే.

క. రాముని సుగ్రీవాన్వితు, సౌమిత్రియుతంబుగాఁగఁ • జవ్వన నిపుడే
నామ మణఁతుఁ బరిఘంబున, భీమంబుగఁ గ్రోఁతు లదరి • బెదరి తపింపన్.

తాత్పర్యము

మీ రెవ్వరి సాహాయ్య మక్కఱలేకయే లక్ష్మణ సుగ్రీవులతోడ రాముని

నా పరిఘంబున నిప్పుడే చంపెదను. అది చూచి వానరు లదరి బెదరి సంతాపపడి పరువెత్తుదురు.

శా. రాజేంద్రా! విను మే నుపాయ మనువారం బల్కెదన్, యుక్తులన్
భ్రాజద్ధీ వచియించువాఁడ యరిఁ దీర్పం జాలు నిస్తంద్రుఁడై
యోజస్వీతులఁ గామరూపధరులన్ ♦ యుద్ధక్రియాభీలర
క్షోజాలాగ్ర్యుల నేఁటి వేలకోలఁదిం ♦ గూర్పం దగున్ వెంటనే. ౧౫

అర్థములు. భ్రాజద్ధీ = ప్రకాశించు బుద్ధిచే, అరిన్ = పగవానిని, తీర్పఁ జాలున్=చంపఁ గలుగును, నిస్తంద్రుఁడై = ప్రమాదము లేనివాఁడై, ఓజస్వీతులన్=సంపూర్ణబలముగల వారిని, యుద్ధక్రియా=యుద్ధకార్యమందు, అభీల=భయంకరులైన, రక్షోజాలాగ్ర్యులన్=రాక్షస శ్రేష్ఠులను,

తాత్పర్యము

రాజా! నే నొక యుపాయము చెప్పెదను. బుద్ధి వికాసముచేఁ జక్కని యుపాయము చెప్పువాఁడే శత్రువుల హెచ్చరికతో సంహరింపఁగలవాఁడు కావున బలవంతులగు రాక్షసులు కామరూపులను యుద్ధక్రియయందు భయంకరులను నేరి వెంటనే జతగూర్పవలయును.

ఉ. వారలు మానవాకృతుల ♦ వారిజమిత్రకులీను రామునిన్
జేరి భవత్సహోదరుఁడు ♦ శ్రీభరతుం డనిపె న్మము న్మఖా
కారుఁ డ దేమొ యాత్యయిక ♦ కార్యము గల్గెఁ బురంబుఁ జేర నే
తేరు మటంచుఁ బల్కఁ దనఁ ♦ దెప్పున నాతఁడు పోవు సేనతోన్. ౧౬

అర్థములు. వారిజమిత్ర కులీనున్ = గొప్పదగు సూర్యవంశమునఁ బుట్టిన వానిని, ఆత్యయిక కార్యము=ఆవశ్యము వెంటనే చేయవలసిన పని.

తాత్పర్యము

ఇట్లు చేరినవారలు మనుష్యుల వేషములు వేసికొని రామునియొద్దకుఁ బోయి నీ తమ్ముఁడు భరతుఁడు పంపఁగా వచ్చితిమి. - అయోధ్యయం దేదో నీవు చక్కఁజేయవలసిన యావశ్యకార్యము గలదఁట, నిన్నుఁ బిలుచుకొనిరమ్మని మమ్ముఁ బంపెను అని చెప్పఁగానే యతఁడు సేనతో నయోధ్యకు వెంటనే పోవును.

క. ఆ సమయంబునఁ జాపశ, రాసిగదాకరుల మగుచు ♦ నభ్రతలమునన్
రాసులపై ప్లవగులను ప, రాసులఁ జేయంగవచ్చు ♦ నశ్మసువృష్టిన్. ౧౭

అర్థములు. చాప - శర - అసి - గదా కరులము = విల్లు బాణములు - కత్తులు-గదలు చేతగలవారమై-అభ్రతలమునన్=ఆకాశమునుండి, పరాసులను = చచ్చినవారిని, అశ్మసువృష్టిన్ = రాలవానచే.

తాత్పర్యము

అట్లు రాముఁ డయోధ్యకుఁ బోవు సమయంబున విల్లు బాణములు గదలు

కత్తులు ధరించి యాకాశమునుండి వానరులమీఁద జాలవాన గురియించి చంప వచ్చును.

క. ఈ యనువున మా పన్నిన, మాయలలోఁ జిక్కి రామ • మహీపుఁడు ననుజుం
డా యమసదనముఁ జేరఁ, బోయెద రంతటను బీడ • వోవును మనకున్. ౧౫౯

తాత్పర్యము

ఈ విధముగ మేము పన్నిన యుపాయములకుఁ జిక్కుపడి రాముఁడు తమ్మునితోఁ జచ్చును. అంతతో మనపీడ పోవును.

తే. కుంభకర్ణసుతుండు ని • కుంభుఁ డనెడి, ఘోరదర్పుఁడు పరమసం • క్రుద్ధుఁ డగుచు
భువనరావణు రావణుఁ • బోలఁజూచి, యధికగంభీరవాక్కుల • ననియె నిట్లు.

అర్థములు. ఘోరదర్పుఁడు=భయంకర బలగర్వము గలవాఁడు, భువనరావణున్=లోకముల నేడ్పించు.

తాత్పర్యము

ఆ మాటలు విని కోపించినవాఁడై కుంభకర్ణుని కొడుకు నికుంభుఁ డనువాఁడు బలగర్వముచే లోకము నేడిపించు రావణుఁజూచి మిగుల గంభీరములైన వాక్కుల నిట్లనెను.

ఉ. ఉండుఁడు మీర లింద యసు • రోత్తములఁ గొల్చుచు నేనొకండ దో
ర్దండపరాక్రమక్రమవి • దారితగాత్రులఁ జేసి ద్రుచ్చెదన్
భండనసీమ రాఘవుని • భ్రాతృయుతున్ హనుమం గపిప్రభున్;
జెండెదఁ దక్కు వానరవి • శిష్టచమూనివహంబు వ్రేల్మిడిన్. ౧౬౧

అర్థములు. దోర్దండ=దండములవంటి భుజములయొక్క, పరాక్రమక్రమ=పరాక్రమ విధముచే, విదారిత గాత్రులన్ = చీల్పఁబడిన దేహములు గలవారిని భండనసీమన్=యుద్ధరంగమందు, వ్రేల్మిడిన్=చిటికె వేయు కాలములో.

తాత్పర్యము

మీ రందఱు రాక్షసశ్రేష్ఠుని సేవసేయుచునిండే యుండుఁడు, నేనొక్కఁడనే భుజబల పరాక్రమముచే యుద్ధరంగమందు రాముని లక్ష్మణుని హనుమంతుని సుగ్రీవుని జీల్చి పాఱవేసెదను. తక్కిన వానరసేన నంతయు తునుకలుగా చిటికె వేయు కాలములో ఖండించెదను.

క. అప్పుడు వజ్రహనుం డను, నప్పలలాశనుఁడు పర్వ • తాభుఁడు క్రోధం
బుప్పతిలఁ బెదవి నాకుచుఁ, దెప్పున పలియించెదనదు • ధీరత వెలయన్. ౧౬౨

అర్థములు. పలలాశనుఁడు = రాక్షసుఁడు, పర్వతాభుఁడు = కొండతో సమానుఁడు, ఉప్పతిలన్=పుట్టఁగా.

తాత్పర్యము

అప్పుడు వజ్రహనుఁ డను రాక్షసుఁడు కొండంత దేహము గలవాఁడు

కోపము పుట్టుచుండఁగా పెదవి నాకుచు తన ధైర్యము ప్రకాశించు నట్లిట్లు చెప్పెను.

ఉ. ఎక్కఁడిజోలి మీకుఁ జను • డీ పదఁడీ మదిలోనఁ జింతలం
దక్కి యథేచ్ఛమైఁ బను లొ • నర్చుకొనం, దనివార మాంసమున్
మెక్కుఁడు ద్రాగుఁడీ మధువు • మెచ్చగు నాటల నాడుఁ, డొక్కఁడన్
గ్రక్కున రాఘవాంగదుల • గాడ్పుసుతుం గపిరాజుఁ ద్రుంచెదన్. ౧౬-౩

తాత్పర్యము

రాక్షసులారా! యీ ప్రసంగము మీకేల? మనస్సులో విచారము మాని యిష్టము వచ్చినట్లు మీమీ గృహకృత్యములు చేసికొనఁ బొండు పొండు, మీకు తృప్తిగలుగ మాంసముఁ దినుడు, సారాయము త్రాగుడు, ముచ్చటలాడుడు నేనొకఁడనే రామలక్ష్మణులను సుగ్రీవాంగద హనుమంతులను జంపెదను.

—• ౯-వ సర్గము. రథసాదులు విజృంభించి వెలువడుట •—

సీ. అంతట రాక్షసుల్ • యజ్ఞహంతుఁడు నికుంభ, రభస మహాపార్శ్వ • రశ్మికేతు
సూర్యశత్రువులును • సుప్తఘ్నుఁడును మహో, దరుఁ డగ్నికేతుండు • దశశిరస్కు
సుతుఁ డింద్రజిత్తు ని • స్తులుఁడు ప్రహస్తుండు నతికాయుఁడును, విరూ • పాక్షుఁడుగ్ర
ధూమ్రాక్షుఁడును వెంట • దుర్ముఖవజ్రదంష్ట్రులు పట్టసంబులు • శూలములును
తే. ప్రాసశక్తి పరశ్వధ • పరిఘములును, గాండివిశితచాపముల్ • ఖడ్గములును
నాడిసి త్రిప్పుచుఁ జెలరేఁగి • మిడిసిపడుచు, మండుచును బల్కి రసురప్ర • కాండుతోడ.

తాత్పర్యము

ఆవల యజ్ఞహంతుఁడు, నికుంభుఁడు, రభసుఁడు, మహాపార్శ్వుఁడు, రశ్మికేతువు, సూర్యశత్రువు, సుప్తఘ్నుఁడు, మహోదరుఁడు, అగ్నికేతుఁడు, రావణునికొడుకు ఇంద్రజిత్తు, అనమానుడగు ప్రహస్తుఁడు, అతికాయుఁడు, విరూపాక్షుఁడు ధూమ్రాక్షుఁడు, దుర్ముఖుఁడు, వజ్రదంష్ట్రుఁడు, వీరందరు నికుంభుని మార్గ మనుసరించి యట్లే చేయఁదలఁచి యహమహమికతో నేను ముందనిన నేను ముందనుచు వారి వారి యాయుధములు పట్టసములు శూలములు ప్రాసములు శక్తులు గండ్రగొడ్డండ్లు ఇనుపగుదియలు బాణములతోడి విండ్లు కత్తులు వీనిని బట్టుకొని త్రిప్పుచు విజృంభించి ఎగిరిపడుచు కోపముతో మండిపడుచు రాక్షసశ్రేష్ఠునితో నిట్లనిరి.

ఇందు అసురప్రకాండునితోడ నని ప్రకాండ శబ్దము పుంలింగముగాఁ బఠింపఁబడినది. అమరకోశమునందు "మతల్లికా మచర్చికా ప్రకాండ ముద్ధతల్లజౌ" యని, నియత నపుంసకలింగముగాఁ బఠింపఁబడినది. అయినను 'ప్రకాండోఽస్త్రీ ప్రశస్తేచ' యని నానార్థరత్నమాల యందు పుం నపుంసకముల రెంటిని జెప్పుటచేతను 'క్షత్రియ ప్రకాండః' అని భవభూతి మహావీర చరిత్రమందు (4-35-5-48) పఠించి యుండుట చేతను "ప్రకాండో నస్త్రీ విటపే మూలశాఖాంతరే తరోః ప్రశస్తే" యని మేదిని యందుండుటను 'ప్రకాండో విటపే శస్తే మూలస్కంధాంతరే తరోః' యని విశ్వనిఘంటువు

నందుండుటను “ప్రకాండః పుంస్యపి అస్త్రీ ప్రకాండో విటపే తరుస్కంధ ప్రశస్తయో” అని సుధయందుండుటను నిచ్చటఁ బుంలింగమున ప్రయుక్తము.

క. ఈనగరంబును గాల్చిన, యా నీచుని హనుమ రాము ♦ ననుజసమేతున్
వానరనాయకు నిపుడే, నేనే వధియింతుఁ ద్రుంతు ♦ నేనే నేనే. ౧౬౫

తాత్పర్యము స్పష్టము.

క. అని కేల నాయుధంబులు, గొని బిరుదము లాడు నసుర ♦ కోటులఁ దమ యా
సనముల నుండ న్మరలిచి, యనియె విభీషణుఁడు భ్రాత ♦ కంజలితోడన్. ౧౬౬

అర్థములు. బిరుదములు=పౌరుష వాక్యములు.

తాత్పర్యము

ఈ ప్రకార మాయుధములు ధరించి పౌరుషపు మాటలు పలుకుచున్న యందఱను వారివారి స్థానంబులం దుండఁజేసి విభీషణుఁ డన్నకు నమస్కరించి యిట్లనియె.

ప్రహస్తాదులు ప్రభు వను నుద్దేశముతో మాటలాడిరి. విభీషణుఁ డన్నయను ప్రేమముతో మాటలాడు చున్నాఁడని భావము.

—♦ విభీషణుఁడు రావణునకు రాజనీతిఁ దెలుపుట ♦—

క. విను సామదానభేదము, లనెడు నుపాయముల మూఁట ♦ నర్థము సిద్ధిన్
గనకున్న విక్రమంబును, గొనియాడుదు రయ్య నీతి ♦ కోవిద వర్యుల్. ౧౬౭

అర్థములు. నీతికోవిద వర్యుల్=నీతిశాస్త్రమునందుఁ బండిత శ్రేష్ఠులు.

తాత్పర్యము

రాజనీతియందుఁ గార్యము సాధింప సామము దానము భేదము అను మూఁడుపాయములు చెప్పఁబడినవి. ఈ మూఁడుపాయములచేఁ గార్యము సాధింప సాధ్యపడదేని యప్పుడు దండ మను నాలుగవ యుపాయము నవలంబింపఁ దగునని నీతిశాస్త్రమందుఁ పండితశ్రేష్ఠులు చెప్పుచున్నారు. మొదటి మూఁడుపాయములు యత్నింపకయే యుద్ధమునకు దిగుట శాస్త్రవిరుద్ధము.

సామాదీనా ముపాయానాం। త్రయాణాం విఫలేన యే। వినయే న్నయ సంపన్నో దండం దండ్యేషు ధర్మభృత్ ॥ అని కామందకము.

చం. అమలినరాజ్యతంత్రముల ♦ యందు విరక్తునిమీఁద, నింద్రియ
ప్రమదసురక్తి హెచ్చరిక ♦ వాసిన యాతనిమీఁద, దైవసా
హ్యము గనిరానివానిపయి ♦ నర్భకభీరులమీఁద, మంత్రయు
క్తముగ విమర్శ సల్పి మఱి ♦ దండముఁ బూన జయంబు సిద్ధమా. ౧౬౮

అర్థములు. ఇంద్రియ ప్రమదసురక్తిన్=ఇంద్రియములను సంతోషపెట్టుననురాగముచే, అర్భక, భీరులమీఁదన్=పిల్లవాండ్రమీఁద, పిఱికి వాండ్రమీఁద “బాలో వృద్ధో దీర్ఘరోగీ, తథా జ్ఞాతిబహిష్కృతః। భీరుకో భీరుకజనో, లుబ్ధో

లుబ్ధజన స్తథా । విరక్త ప్రకృతి శ్చైవ, విషయే ష్వతిసక్తిమాన్ । అనేకచిత్త మంత్రశ్చ, దేవబ్రాహ్మణనిందకః । దైవోపహతక శ్చైవ దైవచింతక ఏవచ । దుర్భిక్షవ్యసనోపేతో బలవ్యసనసంయుతః । అదేశస్థో బహురిపు ర్యుక్తో కాలే న యశ్చ సః । సత్య ధర్మవ్యపేతశ్చ, వింశతిః పురుషా అమీ । ఏతైస్సంధిం న కుర్వీత విగృహ్ణీయాత్తు కేవలమ్॥" కామందకము.

తాత్పర్యము

మనవారు యుద్ధమును బొగడుచున్నారు గదా! ఎవరితో యుద్ధము చేసిన గెలుపు గలుగునని శాస్త్రము చెప్పుచున్నదో వినుము. రాజ్యకార్యములయందుఁ బ్రీతిలేక యుండువానిమీఁద, ఇంద్రియములకు సంతోషము గలిగించుటయందు నాసక్తిగలవానిమీఁద, దైవసాహాయ్యము లేనివానిమీఁద, పిల్లవాండ్రమీఁద పిఱికివాండ్రమీఁద, కార్యాకార్యములు విమర్శించి యుద్ధము చేసినచో జయము తప్పక కలుగును.

ఉ. ఏమఱుపాటు లేదు మది•నేనియు, గెల్పు గోనంగఁ గోరెడిన్,
భీమబలస్థితుండు, రణ•వీథిని దేఱి కనంగరాదు, దు
ర్ధామపరాక్రముండు, విజ•తప్రతిఘుం, డల రామభద్రుఁ డా
రాముని నెట్లొకో ఘనప•రాక్రమవృత్తి జయింపఁ జూచుటల్. ౧౬౯

అర్థములు. భీమ బలస్థితుండు = భయంకరమైన సేన గలవాఁడు-విజిత ప్రతిఘుండు=కోపమును జయించినవాఁడు- ఇట్లు చెప్పుటచేఁ గోప మనునది సేవకునివలె రమ్మనిన వచ్చును, పొమ్మనినఁ బోవునుగాని స్వతంత్రించి తనంతటఁ దాను రాఁజాలదు-ప్రతిఘా రుట్ క్రుధౌ స్త్రియా మ్మని యమరుఁడు-పరాక్రమవృత్తిన్= పరాక్రమ కార్యముచేత. 'క్రోధాత్ భవతి సమ్మోహః' యన్నట్లు కోపములేని కారణముచే మోహము లేదనియుఁ జక్కఁగా నాలోచించి కార్యము చేయుననియు భావము. కామము చెందినఁగాని క్రోధము గలుగదు. కావునఁ గ్రోధము లేదన్న ప్పుడు కామము లేదని భావము. కామము క్రోధము నను రెండు నీయందుండి నీవు భ్రమపడి చేయరానిపని చేయుచున్నావుగాని, యాయన స్వస్థచిత్తుఁడై కార్యములు చేయవలసిన విధానమునఁ జేయుచున్నాఁడని భావము.

తాత్పర్యము

మనస్సునందైనను రాముఁడు ప్రమాదపడి యుండువాఁడు కాఁడు. ఎట్టులైన జయముఁగోరి యుండువాఁడు-భయంకరమైన బలముగలవాఁడు- యుద్ధము నందు నాయనను గన్నెత్తిచూడ సాధ్యపడదు. నివారింపరాని పరాక్రమము గలవాఁడు- కోపమును జయించినవాఁడు-కావున నిష్కారణముగఁ గోపగింపఁడు-రామభద్రుఁ డిటువంటివాఁడు- ఇట్టివానిని పరాక్రమముచే నెట్లు జయింప సాధ్యపడును.

క. ఘోరనదీనదపతిఁ గూ, పారము లంఘించి యొక్క•ప్లవగుం డరరే
ధీరత దుష్కరకార్యముఁ దీరుచు నని యెవ్వఁడే మ•దిం దలఁచె నొకో. ౧౧

అర్థములు. ఘోర=భయంకరమైన-నదీనదపతిన్=మగయేళ్ళకు నదులకు పతియైనవాఁడు, నదులు తూర్పుగాఁ బారునవి-నదములు పడమరగాఁ బారునవి కూపారము=సముద్రము.

తాత్పర్యము

భయంకరములైన నదములకు నదులకుఁ బతియైన సముద్రమును దాఁటి యొక్క క్రోఁతి ధైర్యముతో నసాధ్యకార్యముఁ జక్కఁజేసికొని పోవునని మనస్సునందైన నెవ్వఁడైనఁ దలఁచెనా? ఏమి యీ యాశ్చర్యము.

దీనివలననే రామచంద్రమూర్తి తన కార్యము చక్కజేసికొనుటయందు హెచ్చరికఁ గలిగి కృషి చేయుచున్నాఁడనియు, గెల్వ నిశ్చయించినాఁడనియు, గొప్పసేన బలము గలవాఁడనియు నేర్పడుచున్నది. ఆయన యుద్ధము చేయు విధము గురించి శూర్పణఖాకంపనుల వలనను వాలివధమువలనను వినియున్నాము. ఇట్టివానిని జయించుటెట్లు?

క. బలమా లెక్కింపఁగ రా, దలవును నట్టిదియ పగఱ•కట్టియెడం గే
వలము నలక్ష్యంబుగ నిటు, పలుకఁగ నర్హంబె యసుర•వల్లభులారా! ౧౨

అర్థములు. అలవు=పరాక్రమము, పగఱకు = విరోధులకు; పగవారు = పగఱు.

తాత్పర్యము

వానరాధిపతి యగు సుగ్రీవుఁడు రామునకుఁ దోడైనాఁడని వింటిమి, కంటిమి కదా! వానరసేన యెంతయైనది యెట్టిదైనది మనకుఁ దెలియునుగదా. కావున రామునకు సేనాసమూహము లెక్కింపరానిదై యున్నది. పగవారికిఁ బౌరుషము గట్టిదైయున్నది. ఇట్టి సందర్భములందు శత్రువుల విషయమై లక్ష్యము లేక మీరు రాక్షసవీరులారా! మనమే వీరులము, ఇతరవీరులు లోకమున లేరని మాటలాడ వచ్చునా? ఏ విషయమున మీకంటె వారు తక్కువవారో చెప్పుఁడు

ఉ. ఏ యుపకారముం జలిపె•నేర్పడఁ జెప్పుఁడు రాఘవుండు దై
తేయకులాగ్రగణ్యునకుఁ•దేరకుఁ దా మును మున్న యీతఁడే
యీ యవనీంద్రు భార్యను వ•నాంతరవీథి హరించి తెచ్చె, న
న్యాయచరిత్ర మెవ్వరిదొ•యాడుఁడి యెవ్వరొ వైరకారకుల్? ౧౩

తాత్పర్యము

రామునిమీఁదికి యుద్ధమునకుఁ బోయెద మని పలుకుచున్నారు గదా. ఏమి కారణము? ఆయన మీకుఁ జేసిన యపకార మేది? తన దూతచేత మన నగరము తగులఁ బెట్టించి మన వారిని జంపించెఁ గదా యందురేమో, ఏల యిట్లు

చేసెను? తొలుత నెవ్వరి కెవ్వ రపకారము చేసిరి? రాముఁడే మైన మన రాక్షస రాజునకు నపకారము చేసెనా? ఈయనయే కదా ముందుగాఁ బోయి యెందో యడవిలో నున్న రాముని భార్యను హరించి తెచ్చెను. ఇం దన్యాయ మెవరిది? కలహమునకుఁ గాలు ద్రవ్వినవా రెవ్వరు? ఆయన భార్యను హరించి తెచ్చుటయే గాక యీయన తన భార్యను మఱల గ్రహించుటకుఁ జేయు ప్రయత్నము దోష యుక్తమందురా? సీతాదేవి యిందు లేదేని వానరుఁ డిందు వచ్చి యుండునా? అంత పని చేసి యుండునా? ఇదియేల మీ రాలోచింపరు. మీ భార్యలను బరులు హరించిన మీరూరకుందురా? కుంభీనసిని మధుఁడు హరించినప్పుడు వాని మీఁదికి మీరు యుద్ధమునకుఁ బోలేదా? మీరు చేసిన నొప్పు, పరులు చేసిన తప్పా?

ఉ. రాముఁడు గాఁడె మున్ను ఖర • రాక్షసునిం దునుమాడె నందురా!
యీ మనుజాశనుండె కద • యాతని పైపడిపోయెఁ జివ్వకై?
భూమిని నెల్ల ప్రాణులును • బూని యథాస్వబలంబుగాఁ దముం
దాము సురక్షఁ జేత తగ • దా? యది దోషమె మీరు చెప్పఁడా? ౧౨౩

అర్థములు. చివ్వకై = యుద్ధమునకై, యథాస్వబలంబుగా = వారి వారి బలము కొలఁది.

తాత్పర్యము

విభీషణా! నీవు చెప్పునది సరిగాదు-ఖరాదులను ముందు రాముఁడు చంపుటచేఁ గదా రాక్షసరాజు రాముని భార్యను హరించెను. కావునఁ గలహకారకుఁడు రాముఁడే యందురా? రాముఁడు ఖరాదులమీఁదికి దండెత్తి వచ్చెనా? ఖరుఁడు రామునిమీఁదికి దండెత్తి పోయెనా? ఖరుఁడే కదా పోయినవాఁడు-తన ప్రాణమునకపాయము వచ్చినపుడు వారి శక్తి కొలఁది దమ్ముఁ దాము రక్షించుకొనుట లోకమునఁ గలిగిన విషయమే కదా-అట్టులే తమ్మఁదాను రాముఁడు రక్షించుకొనినఁ దప్పేమి? మీ ప్రాణముమీఁదికి వచ్చినపుడు మిమ్ము మీరు రక్షించుకొనరా?

ఇచ్చట మఱియొక ప్రశ్న రావలసినదే - రాలేదు. శూర్పణఖ ముక్కు-చెవులు కోయుటచేఁ గదా ఖరుఁడు యుద్ధమునకుఁ బోయెనని రాముఁడే కలహకారకుఁడని వాదము రావలసినదే - అది వచ్చినయెడల శూర్పణఖ అంతు బైటపడును-ఇప్పటికే రాక్షసుల కందఱకు శూర్పణఖ అంకాడఁబోయి ముక్కు- చెవులు పోఁగొట్టుకొనెనని యునదియే కలహకారకు రాలనియు లంకలోనివారికిఁ దెలియును. సీతాదేవివలన నిది వెలువడి యుండును. రాక్షసుల కందఱకు నీ విషయము దెలియునని ౨౧౯౯-౨౨౦౦-౨౨౦౧ పద్యములవలన స్పష్టపడును.

క. పరదారహరణ మెప్పుడుఁ గర మపకీర్తిని ఘటించుఁ • గలుషముఁ బెంచున్
హరియించు నాయు వర్థముఁ, బోరి నాశము సేయుఁ గానఁ • బుణ్యజనేంద్రా.

అర్థములు. పరదారహరణము = ఇతరుల భార్యలను హరించుట.

తాత్పర్యము

రాక్షసరాజా! యితరుల భార్యలను హరించుటవలన మిగుల నపకీర్తి కలుగును. అది పాపమును వృద్ధిచేయును. ఆయుస్సు క్షీణింపఁజేయును. అర్థము నాశము చేయును.

మ. తలఁపన్ జానకికారణంబుగ నము • త్పాదిల్లెనీయెల్లవా
రలకున్ భూరిభయంబు; నిక్క మిది, కా • ర్యం బామెఁ బో వీడుటల్;
కలహార్థం బొక కార్యముం జలుప బా • గా? యా నటం చందువేన్
గలహం బే నిజమేని యేమి పని లం • కన్ సీతతోఁ జూడుమా. ౧౬

తాత్పర్యము

ఈ లంకలోని వారి కందఱకు నపాయము గలుగుటకు సీతయే కారణము. ఆమె యిందుండువఱకు నా యుపద్రవము తప్పదు. కావున వదలిపెట్టుము. అదియే తగిన కార్యము. విభీషణా! నేను గాముకుఁడనై సీతను దీసికొని రాలేదు. రాముఁడు ఖరాదులను జంపెను. కావున యుద్ధమందు రాముని జంపవలెను. అతనిని యుద్ధమునకు లాగుటకై సీతను దెచ్చితి నందువా? అట్లు యుద్ధమే నీకు ముఖ్యోద్దేశ మగునేని సీతతో లంకలో నేమి పని? సీత లేకుండినను మనము వారి మీఁదికి యుద్ధమునకుఁ బోరాదా? నా తమ్ములను జంపిన కారణముచే నేను యుద్ధమునకుఁ బోయెద ననిన లోకము మెచ్చు కార్యమై యుండును. అప్పుడే నీ వీ పని చేసియుండిన రామునకు వానరసేనాసంపత్తి లభించి యుండదు. నా రన్నదమ్ము లిరువురే కాన సులభముగా జయించి యుందువు. వారు వచ్చి మన యూరిపైఁ బడకుందురు గదా. అటుగాక నీవు వక్రమార్గము నవలంబించి సీతను దెచ్చుటచే వా రెంత బలసంపత్తి గలవారైరో చూడుము. నీ కెట్టి యపఖ్యాతి వచ్చెనో యాలోచింపుము.

క. సారబలిష్ఠుఁడు ధర్మా • చారరతుం డట్టి రామ • చంద్రునితో ని
ష్కారణవైరము దగునే? శ్రీరామున కప్పగింపు • సీతాదేవిన్. ౧౭

అర్థములు. సారబలిష్ఠుఁడు = దృఢమైన మహాబలము గలవాఁడు, ధర్మాచారరతుఁడు=ధర్మముతోఁ గూడిన నడవడియం దాసక్తి గలవాఁడు.

తాత్పర్యము

అన్నా! రామచంద్రమూర్తి సామాన్య బలముగలవాఁడు కాఁడు. సారవంతమైన మహాబలము గలవాఁడు. ఇట్లు దేహబలమునకుఁ దోడు ధర్మపునడవడి యం దాసక్తిగలవాఁడు ధర్మమున్న చోట జయముండును. కావున ధర్మబలము, దాని వెంట దైవబలము గలవాఁడు అటువంటి రామచంద్రునితో నీవు కారణము లేక కలహమునకు దిగుట సరిగాదు. కావున సీతాదేవిని శ్రీరామున కర్పింపుము.

క. చారుమణిసంకులము హయ, వారణయుక్తంబు లంక • వరబాణాళిన్
దారితము గాక మున్నే • శ్రీరామున కప్పగింపు • సీతాదేవిన్. ౧౮

అర్థములు. చారుమణి సంకులము=అందములైన రత్నములచే నిండినది, హయ వారణ యుక్తంబు=గుఱ్ఱములతోను; ఏనుఁగులతోను గూడినది, పరబాణాళిన్=శత్రువుల బాణసమూహములచే, దారితము=చీల్పఁబడినది.

తాత్పర్యము

మనోహరములగు రత్నములచే నిండినదియు, గుఱ్ఱములు, ఏనుఁగులు గలదియునగు లంక శత్రువుల బాణములచే భిన్నముగాక ముందే సీతాదేవిని శ్రీరామున కర్పింపుము.

క. ఘోరము దుర్ధర్షము కపి, వారము మనపురికి లగ్గ పట్టక మునుపే
పేరిమి యొసఁగఁగఁ దండ్రీ, శ్రీరామున కప్పగింపు సీతాదేవిన్. ౧౧౮

అర్థములు. దుర్ధర్షము=తిరస్కరింపరానిది, పేరిమి=గొప్పతనము.

తాత్పర్యము

తండ్రీ! ఘోరమై తిరస్కరింపరానిదై వానరసేన లంకకోటలకు లగ్గలు పట్టక ముందే సీతాదేవిని శ్రీరామున కర్పించుట గౌరవకరము.

క. మానవభోజులతో లంకానగరము నాశమందు త్వన్మసుత నీవే
మానితగతి నీ వేఁయు, జానకిని మరల రామ చంద్రున కిమ్మా. ౧౧౯

తాత్పర్యము

నీవు సీతాదేవిని రామునకు మరల నీయకపోయితివా రాక్షసులతో లంకానగరము నాశమై పోవును, గావున సీతాదేవిని మఱల రామచంద్రున కిమ్ము.

ఉ. అన్నవు గాన నిన్నిదిగొ హస్తముల న్ముకుళించి వేఁడెదన్,
నన్ను ననుగ్రహింపు, దయ నా వచనంబుల చొప్ప చేయుమీ
యన్న! హితంబుఁ బథ్యమును నాడితిఁ గాని మఱొండుగాదు, త్వ
కన్నను రామచంద్రునకుఁ గ్రమ్మఱఁ బుచ్చుము మేలు హెచ్చఁగన్. ౧౨౦

తాత్పర్యము

నీవు మాకు రాజవు మాత్రమే కావు, నా కన్నవు కావున నన్ను యును గౌరవముతోఁ బ్రేమముతో నమస్కరించి చెప్పుచున్నాను, నన్ననుగ్రహింపుము, నాయందు దయయుంచి నేను జెప్పినట్లు చేయుము. అన్నా! నీకు మేలయినది, పథ్యమైనది చెప్పితిని గాని విరుద్ధముగ నే నేమియుఁ జెప్పినవాఁడఁగాను. సీతాదేవిని రామచంద్రునకు మరలఁబంపుము. మనకు మేలు గలదు.

కం. శరదర్క-కరనిభంబును, బురుదృఢము నవాగ్రపుంఖమును నగు ధరణీ
వరు శరనికరము నిన్నుం,బొరిగొన వెడలకయ మున్న పుచ్చుము సీతన్. ౧౨౧

అర్థములు. శరదర్క-కరనిభంబు=శరత్కాల మందలి సూర్యకిరణములతో సమానమైనది, పురుదృఢము=మిగుల గట్టిది, నవాగ్రపుంఖము=క్రొత్తదైన కొన పిడిగలది, ధరణీవర=రామచంద్రునియొక్క, శరనికరము=బాణసమూహము.

తాత్పర్యము

విభీషణుని మాటలు రావణునకు రుచించినవి కావు. అవి వానికి గోపము హెచ్చించెను. అయినను భయపడక చెప్పుచున్నాఁడు.

శరత్కాల సూర్యకిరణముల వంటివి, మిగుల గట్టివి, క్రొత్తకొనవిడులు గలవి యగు రామబాణంబులు నిన్నుఁ జంపుటకై వెలువడక ముందే సీతను రామునకిమ్ము.

పంచచామరము, త్యజింపవయ్య కోపమున్ సు•ధర్మ సౌఖ్యనాశమున్
భజింపవయ్య సౌఖ్యకీర్తి•వర్ధనంబు ధర్మమున్
భుజింపవచ్చు భోగముల్ స•పుత్రమిత్ర రాక్షస
వ్రజంబులెల్ల, సీత నిమ్ము • రామభూమిభర్తకున్. ౧౮౨

తాత్పర్యము

అయ్యా! ధర్మమును సుఖమును నాశముచేయు కోపమును వదలి పెట్టుము. సౌఖ్యము కీర్తి వృద్ధి చేయు ధర్మమును సేవింపుము. కొడుకులతో మిత్రులతో రాక్షసు లందఱు భోగములు యథాప్రకారముగ ననుభవింప వచ్చును. కావున రామచంద్రునకు సీత నిమ్ము.

క. నావుడు విభీషణుని వా, క్యావళి నాలించి రాక్ష•సాధిపుఁడు వెసన్
దా వారి నెల్ల వీడి ని,జావాసముఁ జొచ్చెఁ బరిజ•నావళితోడన్. ౧౮౩

తాత్పర్యము

విభీషణుఁ డిట్లు చెప్పఁగా నా మాటలు విని రావణుఁడు సభ చాలించి తరువాత నీ విషయము పరిష్కరింత మని యందఱను బోఁబనిచి పరిచారకులతోఁ దనయింటిలోనికిఁ బోయెను.

ఇంతవఱకు హనుమంతుఁడు లంక విడిచిననాఁటి వృత్తాంతము.

—• ౧౦-వ సర్గము. విభీషణుఁడు రావణు గృహంబునకుఁ బోవుట •—

సీ. శైలాగ్రసంచయ•సన్నికాశంబును, నుర్వీధరోరుశృం•గోన్నతంబు
సువిభక్తకక్ష్యంబు • సూరిసంయుతమును, మతిమత్సరక్తస•న్మంత్రియుతము
నాప్తపర్యాప్తసు•రారిరక్షితమును, శంఖనిస్వనమహా•స్వానితంబు
ప్రమదావిశాలవనం•బాధితంబును దూర్య,నాదానునాదిత•నవ్యతలము
తే. మత్తమాతంగనిశ్శ్వాస•మారుతాధి, కాకులీకృతవాతవి•హారహృద్య
మతులకలకలకలితమ•హాపథంబు, తప్తకాంచనమత్తదం•తావళంబు. ౧౮౪

అర్థములు. శైలాగ్ర=పర్వతశిఖరముయొక్క, సంచయ=సమూహముతోఁ సన్నికాశంబును=సమానమైనదియు, రావణు నింటిమీఁద ననేక శిఖరములుండుటచే నీ యుపమానము, ఉర్వీధరోరుశృంగోన్నతము=పర్వతముయొక్క పెద్ద శిఖరము వలె నెత్తైనది, సువిభక్తకక్ష్యంబు = చక్కఁగా విభజింపఁబడిన తొట్టికట్లు గలది,

నారిసంయుతమును = పండితులతోఁ గూడినది, మతిమత్ = మతిమంతులై, సురక్త=మంచి యనురాగముగలవారైన, సన్మంత్రియుతము = మంచి మంత్రులతోఁ గూడినది, ఆప్తపర్యాప్త = కార్యము నెఱవేర్పుటయందు నేర్పరులైన, అసురారిరక్షితము=రాక్షసులచేత రక్షింపఁబడినది, శంఖనిస్వన = శంఖధ్వనులచే, మహాస్వానితంబు=మిగుల చప్పుడు గలుగఁజేయఁబడినది, ప్రమదావితాన సంబాధితంబు = పడుచుపడుచుల సమూహముచే నిండినది, తూర్యనాద = వాద్యముల ధ్వనిచేత, అనునాదిత=ప్రతిధ్వని కలుగఁజేయఁబడిన, సవ్యతిలము = మనోహరమైన ప్రదేశముగలది, మత్తమాతంగ=మదపుటేనుఁగుల, నిశ్శ్వసమారుత = ఊర్పుగాలులచే, అధిక = మిక్కిలి, ఆకులీకృత = కలఁతపెట్టఁబడిన, వాత = వాయువుయొక్క, విహార=సంచారముచే, హృద్యము=మనోహరమైనది, అతుల= సమానములేని, కలకలకలిత = కలకల ధ్వనులచేఁ గూడిన, మహాపథంబు = పెద్ద బాటగలది, తప్తకాంచన మత్తకంఠావళింబు = మంచిబంగారుసొమ్ములు గల మదపుటేనుఁగులు గలది.

తాత్పర్యము

పర్వతశిఖరములతో సమానమైనదియు, కొండశిఖరమువలె నెత్తైనదియు, చక్కఁగావిభజింపఁబడిన తోటకట్లు కలదియు, పండితులతోఁగూడినదియు, బుద్ధిమంతులై రావణునందు ప్రేమగల మంత్రులతోఁ గూడినదియు, కార్యసాధనమునందు నేర్పరులైన రాక్షసులచేఁ రక్షింపఁబడినదియు, శంఖధ్వనిచే మోగుకొనునదియు, స్త్రీసమూహముచే నిండినదియు, ప్రతిధ్వనించుచున్న వాద్యధ్వనులు గలదియు, మదపుటేనుఁగుల యూర్పుగాలులచేఁ గలఁతచెందిన గాలివీచుటచే మనోహరమైనదియు, జనుల కలకల ధ్వనులు గల పెద్ద బాట గలదియు, బంగారు సొమ్ములు ధరించిన మదపుటేనుఁగులు గలదియు.

క. మరుత్తుల గంధర్వుల మం, దిరముల కెన యగుచు రత్న • నికరముచే సం
భరితంబై భోగుల సుం, దరగేహము నట్లు వెలయు • దానిన్ ద్యుతిమై. ౧౭౫

అర్థములు. ఎనయుచు=సమానమై.

తాత్పర్యము

మరుత్తులయు గంధర్వులయు నిండ్లతో సమానమై రత్నసమూహములచే నిండినదై కాంతిచే సర్పముల సుందరగృహముల వలె వెలయునదియు నగుదాని,

తే. ప్రాప్తధర్మార్థనిశ్చయుండై విభీష, ణుండు భీమపరాక్రముండు • చండభానుఁ
డభ్రపటలంబుఁజొచ్చునట్లన్నగృహముఁ, జొచ్చెమఱునాఁటి వేకువ • శుద్ధమతిని.

అర్థములు. ప్రాప్తధర్మార్థ నిశ్చయుండు = పొందఁబడిన ధర్మమునందు నర్థమునందు నిశ్చయబుద్ధి కలవాఁడు అనఁగా సీతాదేవిని మఱల రామచంద్రున కిచ్చుటచేతనే ధర్మము, అర్థము ప్రాప్తించు నను నిశ్చయ జ్ఞానము గలవాఁడు.

అర్థప్రాప్తి యనఁగా క్రొత్తగా ధనము లభించుటగాదు. ఉన్నది శత్రువులచే చెడక దక్కుటయే. ధర్మము అర్థము చెప్పుటచే గామము కూడ గ్రహింపవలెను. రావణుఁడు కామాసక్తుఁడు, జీవించినఁ గదా భార్యలతోడనైనఁ గామ మనుభ వింపఁ గలడు. కావున దానిని బోగొట్టుకొనక దక్కించుకొనుటయే ప్రాప్తి. భీమ కర్మాండు=భయంకరకార్యము చేయఁబూనినవాఁడు, వాస్తవమున నన్నకుమేలైన దయ్యును అతనికి నిష్టము లేనిది కావున నతనితో సాహసించి చెప్పుటకు నందఱు భయపడువారే. విభీషణుఁడు చెప్పిన మాటలు మఱియొకఁడు చెప్పియుండిన వాని తల యక్కడనే దొగిరిపడియుండును. కావున విభీషణుఁడు చేయఁదలఁచినది భయము కలిగించు కార్యమే. చండభానుఁడు=సూర్యుఁడు, అభ్రపటలంబు=మేఘ సమూహము, శుద్ధమతిని=నిర్మలమైన మనస్సుతో, మఱునాఁటి వేకువ=పున్నమ నాఁటి ప్రొద్దున.

తాత్పర్యము

అన్న గృహమును ధర్మము అర్థము ప్రాప్తించుటకు సీతాదేవిని మఱల రామచంద్రమూర్తి కిచ్చుటయే యను నిశ్చయ బుద్ధిగలవాఁడు, అపాయకరమైన యీ విషయమును రావణుతోఁ జెప్ప సాహసించిన వాఁడును నగు విభీషణుఁడు సూర్యుడు మేఘములందుఁ జొచ్చిన విధముగా నిర్మలమనస్సుతో లంకాదహన మైన మఱునాఁడు (పున్నమ) ప్రవేశించెను.

• సూర్యుఁడు మేఘమండలము చొచ్చె ననుటచే విభీషణునకే తేజోహాని యని సూచితము. ఇది తెలిసియు నన్న యందుఁగల ప్రేమచేఁ బోయెనని భావము. ఈ గృహావర్ణనమునకుఁ గారణ మింతయైశ్వర్యమును బుద్ధిమాలిన యధర్మ కార్యముచేసి నాశము చేసికొనఁ బోవుచున్నాఁడని తెలుపుటకే.

ఇది హనుమంతుఁడు లంక గాల్చిపోయిన మఱునాఁటి వృత్తాంతము. ఉదయ మున స్నానము సంధ్య దేవపూజ లోనగునవి చేయువాఁ డగుటచే నప్పుడు రావ ణుని మనస్సు సత్త్వగుణము కలదై యుండును. కావున నప్పుడు ధర్మవిషయము చెప్పిన నంగీకరించు నని తలఁచి వేకువనే పోయెను.

తే. భ్రాతృజయసంశ్రితంబులు • పరమపుణ్యములును వేదవిదభిహిత • ములును నైన
విమలపుణ్యాహరవములు • వినుచు నచటి, దధిఘృతాక్షతపుష్పపా • త్రములచేత,

అర్థములు. భ్రాతృజయసంశ్రితంబులు = అన్నజయమే ఫలముగాఁ గలవి, వేదవిత్ + అభిహితములు = వేదము తెలిసిన వారిచే నుచ్చరింపఁబడునవి, దధి= పెరుగు, ఘృత=నేయి, పుష్ప=పూలు, వీని పాత్రములచే, ఇది పై పద్యముతో అన్వయము.

తాత్పర్యము

అన్నకు జయము గలుగవలయు నను ఫలము గలవియు మిగులఁబుణ్యవంతము

లును వేదవిదులచే నుచ్చరింపఁబడుచున్నవియు నగు పుణ్యాహవాచన మంత్రములు వినుచు అందున్న పెరుగు-నేయి-అక్షతలు-పూలు గల పాత్రలచేత,

తే. అర్చితము మంత్రి వేదవి•దవనివిబుధ, పూగముం గని రాక్షస•పూజ్యమానుఁ
డగుచుఁ దనతేజమున వెల్గు • నాసనస్థుఁ శ్రీదసోదరుఁ గనుఁగొని• చేరి మ్రొక్కె.

అర్థములు. అర్చితము = పూజింపఁబడినది యగు, మంత్రి, వేదవిత్ + అవని విబుధ పూగమున్=మంత్రము బ్రాహ్మణము అను వేదభాగముల నెఱింగిన బ్రాహ్మణసమూహమును, వైదికకర్మములు చేయునపుడు చెప్పఁబడు వేదభాగము మంత్రి మనఁబడును. వైదికకర్మముల విధించు వేదభాగము బ్రాహ్మణమనఁబడును. పూజ్యమానుఁడు=గౌరవింపఁబడుచున్న వాఁడు, శ్రీదసోదరున్=కుబేరుని తమ్ముని ఇది రావణు నైశ్వర్య సమృద్ధిఁ దెలుపఁ జెప్పఁబడెను.

తాత్పర్యము

పూజింపఁబడు మంత్రబ్రాహ్మణవేత్తలగు బ్రాహ్మణ సమూహముఁ గని (ఈ బ్రాహ్మణులు రాక్షసబ్రాహ్మణులని తెలియవగు) రాక్షసులచేఁ బొగడఁబడుచుఁ దన తేజస్సుచేఁ బ్రకాశించుచు నాసనమందున్న కుబేరుని తమ్ముఁడగు రావణుఁజేరఁ జని నమస్కరించెను.

క. ఈ రీతి మ్రొక్కి విహితా,చారవిదుఁడు నడపి యర్హా•చర్యల రక్షో
వీరుని కనుస న్నఁజేఁగి మ,హారజతాసనమునందు • నాసీనుఁడై. ౧౧౯

అర్థములు. విహితాచారవిదుఁడు = ప్రభువునొద్దకుఁ బోయినపు డెట్లు ప్రవర్తింపవలయునో యా యాచారములను దెలిసినవాఁడు, అర్హాచర్యలన్=కాల దేశముల ననుసరించి చేయఁదగిన కార్యములు, జయ జయ యనుట లోనైనవి, కనుసన్న=కంటితోఁ జేయఁబడిన సంజ్ఞ, మహారజతాసనము = బంగారుపీఁట.

తాత్పర్యము

ఈ రీతి నమస్కరించి ప్రభువులయొద్ద నే సమయమున నెట్లు నడువవలయునో యా యాచారముల నెఱిఁగినవాఁడు కావున సమయోచిత చర్యల నడపి రావణుఁడు కూర్చుండుమని కనుసైఁగ చేయఁగా నది తెలిసికొని బంగారుపీఁటపై విభీషణుఁడు కూర్చుండెను.

—• విభీషణుఁడు రావణునకుఁ బురంబున నపశకునంబులు పుట్టుటఁ జెప్పుట. •—

తే. దేశకాలార్థసంవాది • దృష్టలోక, మంగళామంగళుం డట • మంత్రు లెదుట
విజనముగ సాంత్వసూక్తుల•విభుఁ బ్రసన్నుఁ, జేసికొని యిట్టులనియె న•క్లిష్టఫణితి.

అర్థములు. దేశకాలార్థ సంవాది=ఆ యా దేశ కాలముల ప్రయోజనము ననుసరించువాఁడు, దృష్టలోక మంగళామంగళుఁడు = బాగుగఁ దెలియఁబడిన లోకము నందలి శుభాశుభములు గలవాఁడు. విజనముగన్ = మంత్రాలోచనము

నకుఁ దగని యితరజనులు లేనప్పుడు. సాంత్వేసూత్త్రలన్ = మంచిమాటలచే ప్రసన్నుఁ జేసికొని=అనుగ్రహము గలవానిఁగాఁ జేసికొని, స్పష్టమై సందేహమున కెడమీని మాటలతో.

తాత్పర్యము

దేశకాల ప్రయోజనముల ననుసరించి పోవువాఁడును. లోకుల శుభాశుభములు దెలిసినవాఁడును, (ఏది చేసిన మేలో యేది చేసిన కీడో తెలిసినవాఁడు, ఇట్లనుటచే రావణుఁడు చేసినది కీడు కలిగించునది యని తెలిసినవాఁ డనుట) మంత్రులు వినుచుండఁగ నితరు లెవ్వరు లేని సమయమున మంచి మాటలచే ప్రభువునకుఁ దనయం దనుగ్రహబుద్ధి కలుగఁ జేసికొని స్పష్టములై సందేహము కలిగింపనీని మాటలచే నిట్లనియె.

శా. అన్నా! జానకి యెప్డు నీ పురికి సం◆ప్రాప్తించె నాఁ డాదిగా
నెన్నంజాలని పెక్కుదుశ్శకునము ◆ లీక్షింప నయ్యెం జుమీ
చెన్నారం డు సుమంత్రయుక్తహవులం ◆ జేర్పంగనున్ ధూమజా
లౌన్నత్యుండు సవిస్ఫులింగుఁడు సధూ◆మార్చిర్యుతుం డగ్నియున్. ౧౫

అర్థములు. ఎన్నంజాలని = లెక్కలేని, సుమంత్రయుక్తహవులన్=మంచి వీర్యవంతములయిన మంత్రములతోఁ గూడిన హవిస్సులచే, చేర్పంగనున్=చేర్చినప్పటికిని, ధూమజాల+ఔన్నత్యుండు=పొగగుంపుల యాధిక్యము గలవాఁడు, సవిస్ఫులింగుఁడు=మిణుఁగురులతోఁ గూడినవాఁడు, సధూమ+అర్చిః+యుతుఁడు= పొగతోఁ గూడిన జ్వాలలతోఁ గూడినవాఁడు.

తాత్పర్యము

అన్నా! యే నాఁ డీ యూరికి సీత దాపరించెనో యా దినము మొదలు లెక్కలేని యపశకునములు పురమందుఁ గానవచ్చుచున్నవి. మంచి మంత్రములచే హవిస్సు హోమము చేసినను పొగయు మిణుఁగురులు కలవాఁడై పొగతోడి జ్వాలలు గలవాఁడగుటచే నగ్నిహోత్రుఁడు ప్రకాశించుటలేదు.

ఆ. వంటయిండ్లలోన ◆ వైశ్వానరుని గృహం,బులను వేదపాఠ◆ములు పఠింపఁ
బడెడి మందిరములఁ ◆ బాములు ప్రాఁకెడి,హవ్యములను జీమ◆లంటఁ దొడఁగె

అర్థములు. వైశ్వానరుని గృహంబులందు=అగ్నిహోత్రుని యిండ్లయందు, హవ్యములను=దేవతలకై యుద్దేశించిన హోమపదార్థములు, నెయ్యిలోనైనవి.

తాత్పర్యము

వంటయిండ్లలో, అగ్నిహోత్రగృహములలో, వేదములు పఠించు మందిరములలోఁ బాములు ప్రాకులాడుచున్నవి. హవ్యములకుఁ జీమలు పట్టుచున్నవి.

క. ఆవులు వట్టి చనెన్ దం, తావళముల మదము చెడియె ♦ దైన్యముతో మేఁ
పావంత యొలమి ముట్టవు, మావులు మన వీట విమత ♦ మదమానహరా! ౧౩

అర్థములు. వట్టిచనెన్ = ఎండిపోయెను, మావులు = గుఱ్ఱములు, విమతుల=శత్రువుల, మదమానహరా=గర్వము మానము హరించినవాఁడా!

తాత్పర్యము

మన నగరమందు నావుల పొదుగులందుఁ బాలెండిపోయినవి. ఏనుఁగుల మదము చెడినది. విచారమునచుఁ గన్నుల నీళ్ళు కార్చుచు గుఱ్ఱములు కొంచెమైన మేఁపు సంతోషముతో ముట్టుటలేదు.

క. ఖరములకు నొంటెలకుఁ గం, చరగాడిదలకును రాలి ♦ చని రెంౘ్రుక లే
తెరువున జికిత్స చేసినఁ, బరిగోన వా ఖంగి బాష్ప ♦ ములు పొరిఁ గార్చున్.

అర్థములు. బాష్పములు = కన్నీళ్ళు.

తాత్పర్యము

స్పష్టము.

క. కాకులు గుంపులు, గుంపులు నై కటువరవాళి నినిచె ♦ నన్నిరలములన్
ట్రోకలు నై విహరించెడిఁ, గాకారవముల విమాన ♦ గణములమీఁదన్. ౧౪

అర్థములు. కటువరవాళి = వినుటకుఁ బరుషములైన ధ్వనులు, నినిచెన్ = నించెను, కాకారవములన్ = కాకా యను ధ్వనులను.

తాత్పర్యము

స్పష్టము.

క. గ్రద్దలు చక్రాకృతిగాఁ, బద్దుగఁ దిరుగాడి వ్రాలె ♦ భవనంబులపైఁ
బ్రొద్దుల సాయంవేళలఁ, దద్దయు వఱఘలును నించె ♦ దారుణరవముల్. ౧౫

అర్థములు. చక్రాకృతిగా = గుండ్రముగ, పద్దుగన్ = పందెము వేసికొన్నట్లు, వఱఘలు=నక్కలు, దారుణరవముల్ = భయంకర ధ్వనులు, వఱదు బహువచనమున వఱదులు కాఁగా, ఉవర్ణకంబునకు ముందున్న యసంయుక్తంబులై యుదంతంబులైన డలరలకు నలఘుల కారంబు బహుళంబుగ నగు. సు-వ్యా-అచ్ఛిక. సంధి. ౨౦ సూ.

తాత్పర్యము

గ్రద్దలు గుండ్రముగాఁ దిరిగి యిండ్లపై వ్రాలుచున్నవి. ఉదయాస్తమాన కాలములందు నక్కలు భయంకరధ్వనులు చేయుచున్నవి.

క. పిడుగుల నడువున రవములు, కడు వెడిదముగాఁగ నించెఁ ♦ గ్రవ్యాదంబుల్
విడివడి పురిగనఁకులకడ, విడువక తద్ధ్వనులు వీఁట ♦ వినఁగా నయ్యెన్. ౧౬

అర్థములు క్రవ్యాదంబుల్ = మాంసము దిను పులులు తోడేళ్ళు సింహములు కుక్కలు నక్కలు లోనైనవి, విడివడి=విచ్చలవిడి.

తా త్ప ర్య ము

మాంసము దిను మృగములు పురిగ వనివాకిట నిలచి విచ్చలవిడిగా పిడుగుల ధ్వనివంటిధ్వనితో మిగులభయంకరముగా నూరిలోకి వినవచ్చునట్లు లఱచుచున్నవి.

—• విభీషణుఁడు రావణునితో సీతాదేవిని శ్రీరామున కిమ్మని చెప్పుట •—

క. ఈ యశుభంబుల కెల్లను, బ్రాయశ్చిత్తం బొకండు • వాకొను వాఁడన్
చేయు మిది సీత రామున,కై యర్పింపుము క్షితీశ • యభిమత మేనిన్. ౧౯౮

అర్థములు. వాకొనువాఁడన్ = చెప్పెదను, అభిమతమేనిన్ = నీకు సమ్మతమైన యెడల.

తా త్ప ర్య ము

స్పష్టము.

క. ఇది యజ్ఞానముచేతనొ, బ్రదికెడియాసలనొ యిట్లు • పలికితి ననుచున్
మదిఁ దలఁతు వేనియును సుర,హృదయవ్రణ! యపుడు దోష • మెంచకు నాపై.

నే నిట్లు చెప్పుటకుఁ దెలివితక్కువతన మనుకొనినను, వీఁడు పిఱికి, చచ్చెదనని భయపడి చెప్పుచున్నాఁడని తలఁచినను, దేవవిరోధీ! నేను ద్రోహబుద్ధితోఁ జెప్పుచున్నానని దోష మెంచకుము.

క. పురమున నంతఃపురమునఁ, దరుణులకుం బురుషులకు ను • దాహృతదోషో
త్కరములు విదితంబులు చు,మ్మరయుము వలఁ దేని రాక్ష • సాన్వయచంద్రా!

అర్థములు. ఉదాహృత దోషోత్కరములు=నేను జెప్పిన యపశకునముల సమూహములు, విదితంబులు=తెలిసినవే, అరయుము=విచారింపుము.

తా త్ప ర్య ము

నేను జెప్పిన దుష్టశకునములు పురమునందు నీ యంతఃపురమునందు స్త్రీలకుఁ బురుషులకు నందఱకుఁ దెలిసినవే, రహస్యములు గావు. నేను గల్పించి చెప్పునవి కావు, నీ యిష్టమున్న యెడల వాస్తవము విచారింపుము.

క. విను నీమంత్రులు నీకున్, వినిపింపఁగ లేరు సుమ్ము • వీని న్నెనో
కనినది వినినది సర్వము, వినిపింపక యుండ నాకు • విహితమె యన్నా! ౨౦౧

తా త్ప ర్య ము

నీవు చెప్పునది నిజమైన యెడల నా మంత్రులు నా కేల చెప్పలే దందు వేమో, వారు భయముచే నీకు చెప్పలేదు. కాని వారికి నేను చెప్పినవి తెలియక కాదు. నేనో నీ తమ్ముఁడ నగుటచే నీ మేలు కోరి నేను చెప్పవలసి యున్నది. మంత్రుల కొక రాజు పోయిన మఱియొక రాజు వచ్చును. నా కన్నపోయిన మఱియొక అన్న రాఁడుగదా! కావున నన్ను బోఁగొట్టుకొనలేక చెప్పుచున్నాను, (చూ. ౨౩౩౮. ప.)

క. కావున న్యాయాన్యాయము, లో వీరా! ముందు వెన్క ♦ యోజించి మతిన్
గావింప వయ్య నీ యి, చ్ఛావిధి నని చెప్ప నెల్ల ♦ సచివులు వినఁగన్. ౨౦౨

తాత్పర్యము

అన్నా, సీత నిచ్చుట న్యాయమో యన్యాయమో యిచ్చినఁ గలుగు ఫలమేమో యియ్యకుండినఁ గలుగు కష్టమేమో జరిగినది రాఁబోవునది యాలోచించి తరువాత నీ యిష్టము వచ్చినట్లు చేయుము. విచారింపక తొందరపడి చేయకుము అని మంత్రులందఱు వినుచుండఁ జెప్పెను.

చ. హితము మహార్థమున్ మృదుల ♦ హేతుయుతంబు వ్యతీతకాల సం
ప్రతిశుభదంబు, సౌఖ్యదము ♦ భావిని, నా తన తమ్ము వాక్యముల్
శ్రుతిఁ జొరనిచ్చి రావణుఁడు ♦ క్రోధముఁ దాలిచి యాత్మకృత్యమం
దతిశయ మైన పట్టుదల ♦ నాతనితోఁడ వచించె నివ్విధిన్. ౨౦౩

అర్థములు. మహార్థము=గొప్ప ప్రయోజనము గలది, మృదుల=మెత్తని మాటలచేఁ జెప్పఁబడినది, హేతుయుతము = యుక్తియుక్తమైనది, వ్యతీతకాల= కడచిన కాలమునకు, సంప్రతి=వర్తమాన కాలమునకు, శుభదంబు = మేలిచ్చునది, విభీషణుఁడు చెప్పిన మాట విన్న యెడల నిదివఱకుఁ గలిగిన సీతాపహరణ దోషము, దానివలనఁ బ్రాప్తించిన యపకీర్తి తొలఁగును కావున భూతకాల హితము. ఇప్పుడును విచారము లేక యుండవచ్చును. గావున వర్తమానకాల హితము. భావిని=రాగల కాలమందు, సౌఖ్యదము=అందఱు జీవించి యుండుటచే సౌఖ్యము నిచ్చునది, ధర్మవర్ధకము గావున భవిష్యత్కాలహితము.

తాత్పర్యము

హితమైనవియు గొప్పప్రయోజనముగలవియు మృదుత్వముతోఁ గూడినవియు యుక్తియుక్తమైనవియు, కడచిన కాలమునను, వర్తమానకాలమునను, భవిష్యత్కాలమునను శుభము సౌఖ్యము కలిగించునవియును నగు దన తమ్ముఁడు చెప్పిన వాక్యములు చెవిఁ జొరనిచ్చి రావణుఁడు కోపించి దానఁ జేయఁబూనిన పనియందే యెక్కువ పట్టుదల గలవాఁడై యీ విధముగ నతనితోఁ జెప్పెను.

ఉ. ఏమిర వచ్చె నంత భయ ♦ మీ యెడ నా? కది యట్టు లుండనీ
రాముఁడు డాయునే జనక ♦ రాజకుమారికి ? నెట్లు చూచినన్
సామరసంఘశక్రుఁ డయి ♦ యాలము చేయఁగఁ బూని నేనియున్
రాముఁడె నిల్చువాఁడు రణ ♦ రంగమునందు మదగ్రధారిణిన్ ? ౨౦౪

అర్థములు. సామర సంఘ శక్రుఁ డయి = దేవతా సమూహములతోఁడ, నింద్రునితోఁడ, ఆలము=యుద్ధము, మదగ్రధారిణిన్ = నా యెదుట.

తాత్పర్యము

ఇప్పు డేమిరా నా కంత ప్రాణభయము వచ్చెను. అదట్టు లుండనీ, కాని

రాముఁడు సీతాదేవి సమీపమునకైన రాఁగలఁడా? దేవతలతోడి యింద్రుని గూడి యుద్ధము చేయఁబూనినను రాముఁడు నా యెదుట నిలువఁ గలఁడా?

క. అని నిర్జరసైన్య విమర్దనుఁడు మహోచండబలుఁడు • దశవదనుండున్
దనయనుజుని హితవాదిని, ననఘు విభీషణుని విడిచి• యవలకుఁ జనియెన్. ౨౦౫

అర్థములు. నిర్జర సైన్య విమర్దనుఁడు = దేవతాసైన్యమును మర్దించిన వాఁడు; మహోచండబలుఁడు=మిగుల తీక్ష్ణమైన బలము గలవాఁడు, హితవాదిని= మేలు చెప్పు వానిని, అనఘున్ = ద్వేషాసూయాది దోషరహితుని.

తాత్పర్యము

ఈ ప్రకారము చెప్పి దేవతాసేనను దండించిన వాఁడును మిగుల జండ బలుండును (అనఁగ గర్వము గలిగి రాముని ధిక్కరించిన) పది తలలు గల వాఁడును నగు రావణుఁడు తన తోఁబుట్టిన వాఁడును తన మేలుగోరి చెప్పు వాఁడును నిర్దోషియు నగు విభీషణుని విడిచి లేచి యావలఁ బోయెను. అందఱ యెదుట నతని నేమియు ననలేక తానే లేచిపోయెను.

—• ౧౧-వ సర్గము. రావణుఁడు కొలువు కూటంబునకుఁ బోవుట •—

క. హితుల యనాదృతిని స్వయం,కృత సీతాహరణ పాప•కృతిచే సీతా
తతకామమోహితుం డగు, పతితుఁడు రావణుఁడు చిక్కఁ•బాఱుచు నుండెన్.

• అర్థములు. హితుల యనాదృతిని = తన మేలు గోరు వారే తన్ననాద రించిరి గదా యనియు, తన యభిప్రాయమునకు విరోధముగ విభీషణుఁడు చెప్పి నపుడు తక్కిన మంత్రు లందరు విని యూరకుండిరి గాని నీవు చెప్పినది సరికాదని యతనిని నాక్షేపింప కుండుటచే వారును వాని యభిప్రాయముతో నేకీభవించిన వారే యని రావణుఁడు గ్రహించి తన్నలక్ష్యము చేసిరని యెంచెను. స్వయంకృత= తానుఁగా జేసికొనిన, సీతాహరణ = సీతను హరించుట యనెడి, పాపకృతిచే = పాపపుఁ గార్యము చేతను, సీతాతతకామమోహితుండు=సీతయందు విస్తారముగఁ గల కామముచే మతిచెడినవాఁడు, 'సుఖదుఃఖాదిజనితో మోహాశ్చిత్తస్య మూఢదా'=సుఖదుఃఖాదులవలనమనస్సు మౌఢ్యమును వహించుటయే మోహము, ఆకారణముచేతనే, పతితుఁడు=భ్రష్టుఁడైనవాఁడు, చిక్కఁబాఱుచు నుండెన్ = శుష్కించుచు నుండెను. శుష్కించుట యనునది యీ గడియ యం దగునది కాదు. కొంతకాలమునుండి జరుగుచుండవలెను. దీని వలన విభీషణుఁడు హనుమంతుఁడు రాకముందుకూడ నీ విషయము చెప్పుచుండి నట్లు మంత్రులు దాని నామోదించుచుండి నట్లు పాపము వృద్ధి యగుకొలఁది తేజస్సు మాఱుచున్నట్లు తేర్పడు చున్నది. కామము వృద్ధియగు కొలఁది బుద్ధి చెడుచున్నట్లు తేర్పడుచున్నది. బుద్ధి నాశాత్ ప్రణశ్యతి యన్నట్లు పతితశబ్ద మీ నాశములను దెలుపుచున్నది

తాత్పర్యము

హితులగు వా రనాదరణము చేసిన కారణముచేతను, తానుగాఁ జేసిన సీతాహరణమను పాపకార్యముచేతను, సీతయందుఁ గల కామాతిశయముచే బుద్ధినాశ మగుటను, ఆ కారణములచేఁ బతితుఁడై యాకారణమున దేజోహీనుఁ డగుచు రావణుఁడు శుష్కించుచుండెను.

క. ఆలోచనకును సర్వ్వపుఁ, గాలము కడచనఁగ యుద్ధ•కాలము డాయన్
గాల మిది సచివహితులతోఁ, గాళులతో మంతనమున•కద నని తలఁచెన్. ౨౦౭

తాత్పర్యము

ఆలోచనకుఁ దగిన కాలము కార్యము చేయుటకు ముందటి కాలము, ముందాలోచించి యావలఁ గార్యము చేయవలయును. అది దాఁటిపోయినది. కార్యము కానేయైనది. దానిఫల మిప్పుడు యుద్ధముచేయవలసిన కాలము వచ్చినది. ఇది యెల్లవారితోఁ గలసి చేయవలసిన కార్యము. ఇప్పుడేమి చేయవలయు నని మంత్రులతో, హితులతో నాలోచించుటకుఁ దగిన కాల మని తలఁచెను.

సీ. బంగారు కిటికీలఁ • బగడాల సొమ్ములఁ దీరిన గుఱ్ఱాల • తేరి నెక్కి
మబ్బు లుఱ్ఱమికీర్తి • గొబ్బున సభకునై, దశకంఠుఁ డంతటఁ దరలి చనఁగ
వాలును బలుకయు•వఱలు సాధనములు, ధరియించి మున్ను గొం•దఱు చనంగ
నానావికృతవేష • నానాపరిష్కార, భూషితు లిరువంకఁ • బొల్చుచుండ
తే. రథములను వీరవారణ•రాజమీఁద, నటన మాడెడి వాజుల • పటలిమీఁద
నతిరథులు కొంద ఱెక్కఁ ద•శాస్యు బలసి, కొలిచి వెనువెంట నేగిరి•కొప్పరించి.

అర్థములు. వాలు=కత్తి, పలుక = డాలు, నానాపరిష్కారభూషితులు= అనేకవిధములైన సొమ్ములు ధరించువారు. బలసి = చుట్టుకొని, కొప్పరించి = అతిశయించి.

తాత్పర్యము

విభీషణుఁడు తనకు విరోధముగఁ జెప్పుట, తక్కిన మంత్రులు దాని నామోదించి యూరకుండుట, దీనివలన దనవిషయమై భేదాభిప్రాయము గలవారు కొందఱు గలరని రావణుఁడు గ్రహించి తాను జేసినది సరి యని సభలో నందఱ చేత ననిపించి తప్పనఁగలవారిని దిరస్కరింపవలయు నని సభ చేరుటకై యాలోచనశాలకు రావణుఁడు పోవుచున్నాఁడు. విభీషణునివలెఁ జెప్పినవారు మఱికొందఱు గలరు. (౨౫౭౩ పద్యము చూచునది.) కాని విభీషణునివలెఁ దెగఁబడి చెప్పినవారు లేరు. వారు రావణు కోపమునకు భయపడి యూరకుండిరి.

బంగారు కిటికీలు, పగడాల సొమ్ములు గలిగి చక్కఁగా శిక్షితములైన గుఱ్ఱములను గట్టిన రథ మెక్కి రథచక్రములు మేఘము లుఱిమినట్లు ధ్వనించుచుండఁగా రావణుఁడు సభామందిరమునకై బయలు దేఱఁగా తరవారి, డాలు ధరించి కొందఱు

ముందుగా నడచిరి. నానావిధములైన వికారవేషములు గలవారు నానావిధములయిన సొమ్ములు ధరించి యిరుప్రక్కల వచ్చుచుండిరి. తేర్ల మీఁదఁ గొందఱు, మదపు టేనుఁగుల మీఁదఁ గొందఱు, నాట్యమాడునట్లు చిందులు ద్రొక్కు గుఱ్ఱముల మీఁదఁ గొంద ఱతిథులు నెక్కి రావణాసురుని విశేషముగఁ జుట్టుకొని వెంటఁబోయిరి.

క. పరిఘగదారిష్టులఁ దోమరములఁ బరశువుల శక్తి • మండలి శూలో
త్కరములఁ గరములఁ దాల్చి, సురవైరులు చనిరి విబుధ • సూదను వెంటన్.

అర్థములు. పరిఘ = ఇనుపకట్ల గుదియలు - గదా = గదలు - కొనలు లావుగా నుండు బడితలు - రిష్టుల=కత్తులను, పరశువులన్ =గండ్రగొడ్డండ్లను.

తాత్పర్యము

ఇనుపకట్ల గుదియలను, గదలను, కత్తులను, చిల్లకోలలను, గండ్రగొడ్డండ్లను, శక్తులను, కట్టెలను, శూలములసమూహములను చేతులను ధరించి కొందఱు రాక్షసులు రావణు వెంటఁ బోయిరి.

ఉ. అంతటఁ దూర్యనిస్వనము • లంతట నిండె మహారవంబుగా,
దొంతర లయ్యె శంఖముల • తోరపు నాదములున్, ధరాంబరా
క్రాంతము లయ్యె నేముల వి•రావము, లిట్లు రహింపఁ దారకా
కాంతిని మించె ఛత్రములు • గ్రాల మహాపథమార్గగాములై. ౨౧౦

అర్థములు. అంతటన్=అట్లు రావణాసురుఁడు సభామందిరమునకై పయనింపగా-తూర్యనిస్వనములు=వాద్యధ్వనులు, అంతటన్=అన్ని ప్రదేశములందు - దొంతరలయ్యెన్=ఒకటి వెంట నొకటి పరంపరగా వచ్చెను. దొంతులవలె నగుట దొంతరలగుట, తోరపు = అధికమైన స్థూలశబ్దభవము తోరము - ధరాంబరాక్రాంతములయి=ఆక్రాంతధరాంబరములు=ఆక్రమింపఁబడిన భూమి యాకాశములు గలవి, నేముల=రథచక్రముల యంచులయొక్క, విరావము = ధ్వని, మహాపథ మార్గగాములై=మహాపథ మనెడి మార్గమునఁ బోవువారలై.

తాత్పర్యము

రావణుఁడు సభామందిరమునకై బయలుదేఱి ఆపెద్దబాట వెంటఁబోఁగా వాద్యధ్వను లన్నిచోటుల పెద్దధ్వనితో నిండెను. శంఖముల పెద్దధ్వనులు పరంపరలుగా నయ్యెను. రథచక్రముల ధ్వనులు భూమి, యాకాశము నాక్రమించెను. ఛత్రములు నక్షత్రముల వలెఁ గాన నయ్యెను. పగట నక్షత్రములు గానవచ్చుట యుత్పాత సూచకము.

క. చనఁగా హాటకమంజరి వినిచయగర్భితము స్ఫటిక • విగ్రహములు నా
ఘనచామరవ్యజనములు, దనరారె దశాస్యునవ్య • దక్షిణదిశలన్. ౨౧౧

అర్థములు. హాటకమంజరి వినిచయ గర్భితము=బంగారు కమ్మల గుత్తులు

నడుమ నడుమఁ గలవి, చామర వ్యజనములు=వింజామరలు, విసనకఱ్ఱలు, సవ్య దక్షిణదిశలన్ = ఎడమ కుడి ప్రక్కలందు.

తాత్పర్యము

బంగారు పూసలగుత్తులు నడుమ నడుమ కుచ్చులవలె వ్రేలాడునవియు, స్ఫటికములవలెఁ దెల్లనైనవియు నగు వింజామరములు, వీవనలు రావణుని యెడమ కుడివైపులందు నొప్పుచుండెను.

క. దనుజులు నేల న్నిలఁబడి, వినయంబునఁ గేలు మోడ్చి ♦ వినమితశిరులై
ఘనరథసంస్థుని దశవ,క్త్రుని మ్రొక్కిరి పోవుచుండ ♦ త్రోవల నెదురై. ౨౧౨

తాత్పర్యము

పోవునపుడు మార్గమున నెదురైన రాక్షసులు వాహనములు దిగి నేలమీఁద నిలఁబడి వినయముతోఁ రెండుచేతులు జోడించి తలవంచి రథముమీఁదనుండు రావణునకు మ్రొక్కి పోవుచుండిరి.

క. దేవారులు జయజయ యని, దీవింపఁగఁ గొంద ఱంతఁ ♦ దెలచుచు నుండన్
భావితతేజుఁడు సువిహిత,మై వెండిపసిండికంబ ♦ మై శోభితమై. ౨౧౩

అర్థములు. తెలచుచున్ = స్తోత్రము చేయుచు, భావితతేజుఁడు=పొందఁ బడిన తేజము గలవాఁడు, సువిహితమై = చక్కఁగ నిర్మింపఁబడినదై, పసిండి కంబమై=బంగారు స్తంభములు గలిగి.

'జయజయ' ఈ సంస్కృత శబ్దంబు లనుకరణ రహితంబులై ప్రయోగింపఁ బడినవి. ఆశ్చర్యసంతాపాద్యర్థంబుల ననుకరణంబు లేమి దోషంబుగాదు. "జయ జయ శంకర" "అంటితి నమశ్శివాయ పాపాత్ములాల" "మనుజాశను లంట బలు లంట మునులంట యాగంబు లంట నమో విశ్వసృజే యన నెన్నఁడు" ఉ. హరివంశము. "లింగనివాస మేమియును లేమికిఁ జొక్కి నమశ్శివాయ చేయుంగలకార్యమెద్ది" కాళహస్తి. "ఆరగింపుఁడు లెండు మీకమృతమస్తు" శ్రీనాథుఁడు. భీమఖండము. ఇత్యాది.

తాత్పర్యము

కొందఱు రాక్షసులు జయజయ యని దీవింపఁగా కొందఱు స్తోత్రము చేయుచుండఁగా తేజముతోఁ గూడిన రావణుఁడు చక్కఁగా నిర్మింపఁబడి వెండి బంగారు స్తంభములు గలదై, ప్రకాశించునదియై.

తే. అమలిన స్ఫటికాంతర ♦ మగుచుఁ బైఁడి, పట్టుసరిగల రత్నకంబళము గలిగి
యాఱునూర్లపిసాసు ల ♦ హర్నిశంబుఁ, గాచు భవనోత్తమము విశ్వకర్మకృతము.

అర్థములు. అమలిన స్ఫటికాంతరము = నిర్మలములైన స్ఫటికములచే నడుమ నడుమఁ గూర్పఁబడినది, అహర్నిశంబు=రాత్రియుఁ బగలు, ఎల్లవేళల నని భావము - సమాహార ద్వంద్వము - ఏకవచనము.

తాత్పర్యము

నడుమనడుమ స్ఫటికములు గూర్పఁబడి పట్టు సరిగ గల రత్నకంబళము పఱచి ఆఱువందల పిశాచములు రాత్రి పగలు విడువక కాచియుండునదియు, విశ్వకర్మ నిర్మితము నగు మందిరము.

క. రయమునఁ జొచ్చి నిశాచరజ, నయముం బ్రియకాజినాభి•మండితము నుపా
 శ్రయ రాజితమయిన సము, చ్ఛ్రియ పరమాసనముఁ గొనుచు• రావణుఁ డంతన్.

అర్థములు. ప్రియకాజినాభిమండితము = చిత్రవర్ణముగల జింకచర్మముచే నలంకరింపఁబడినది, ఉపాశ్రయ రాజితము = ఆనుకొనుటకు నొఱగు దిండ్లచేఁ బ్రకాశించునది, సముచ్ఛ్రియ=ఎత్తైన, పరమాసనము=గొప్ప పీఠము.

తాత్పర్యము

కార్యము తీవర పెట్టుటచే దొందరగాఁ బ్రవేశించి పై మార్యములతో నిండి చిత్రవర్ణపు జింకచర్మముచే నలంకరింపఁబడి యొఱగుదిండుగల యెత్తయిన యుత్తమాసనమునఁ గూర్చుండి రావణుఁడు; ఆ పిమ్మట.

—• రావణుఁ డెల్ల రాక్షసుల సభకు రప్పించుట •—

ఉ. దూతల వేగవంతులను • దోడన పిల్చి జవంబున న్మహా
 జ్ఞాతమునై సమర్థ్యము వి•చార్యమునై పని యొండు గల్గె మీ
 రాతత వేగయుక్తి సభ•కై చనుదెం డని సర్వరాక్షస
 వ్రాతముఁ బిల్చిరం డనిన • వారును నేగి పురంబులోనికిన్. ౨౧౬

అర్థములు. వేగవంతులను=వేగముగఁ బోఁగలవారిని, తోడన=వెంటనే కూర్చుండి కూర్చుండకముందే, మహత్ +జాతము = గొప్పవారివలనఁ గలిగినది, ఇట్లు చెప్పుటచే రామలక్ష్మణులు వానరసేనతో వచ్చి సముద్రతీరమున దిగి రని సూచితము. దూతలకుఁ జెప్పుటకావున నింత కెక్కువ యిచ్చుటఁ జెప్పలేదు గాని సభలో రామలక్ష్మణులు వేలావనిఁ జేరినా రనియే చెప్పెను. (వ-౨౩౯) కావుననే యీ తొందర. సమర్థ్యము=సమర్థులు సాధింపఁ దగినది, విచార్యము=సాధనమార్గ మాలోచింపఁదగినది, అతతవేగయుక్తిన్=మిగుల వేగముగ.

తాత్పర్యము

రావణుఁ డాసనమునఁ గూర్చుండి కూర్చుండక ముందే వేగముగఁ బోవఁ గల దూతల బిలిచి మీరు త్వరగాఁ బోయి రాక్షసుల నందఱను గొప్పవారివలనఁ గలిగినదై, సమర్థులు నిర్వహింపఁదగినదై, కావుననే యాలోచింపఁదగిన పని యొకటి గలిగెను, మీరంద ఱతివేగమున రం డని పిలిచి రండని చెప్పఁగా వా రంద ఱూరిలోకిఁ బోయి.

క. ఇల్లిల్లు తోఁటవొడ్డులు, సల్లలితవిహారదేశ•సమితిఁ గనుచు వా
 రెల్లరఁ బిలిచిరి మఱి ని,ద్రిల్లెడివారలను గూడ • దిగు లేది వెనన్. ౨౧౭

అర్థములు. పల్లలిత విహారదేశసమితి = మనోహరమై విహరింపఁ దగిన ప్రదేశ సమూహములను, దిగు లేది=భయము లేక, ఇల్లిల్లు వీప్సయందు ద్విరుక్తి. ఒకయిల్లు, ఆవల మఱియొక యిల్లు.

తాత్పర్యము

ఆ దూతలింటింటికిఁ బోయి యిండ్లయం దుండు వారిని, తోటలలో దొడ్లలో నుండు వారిని, క్రీడావిహారప్రదేశములందుండు వారిని, నిద్రపోవుచుండు వారినిఁగూడ దిగులు లేక రాజాజ్ఞ కావున లేపి పిలచిరి.

ఉ. కొందఱు స్యందనంబులను • గొందఱు భూరిమదావళంబులన్
గొందఱు సైంధవంబులను • గొందఱు కాల్నడ వచ్చుచుండఁగా
నందఱి తేర్ల వారణహ•యంబులచే నగరంబు రాజిల్లెన్
గ్రందుగఁ బక్షిసంఘములు • గ్రమ్మి రహించు నభంబు కైవడిన్. ౧౧౮

అర్థములు. స్యందనంబులను=రథములమీఁదను, భూరిమదావళంబులన్ = పెద్దయేనుఁగులమీఁదను, సైంధవంబులను=గుఱ్ఱములమీఁదను, పక్షిసంఘములు గ్రమ్మి రహించు నభంబు కైవడిన్=అనుటచేతను నుదయమే సూచితము, ఆహారమునకై గూండ్లు విడిచి యుదయముననే కదా పక్షులు పోవును.

తాత్పర్యము

ఇట్లు దూతలు పిలువఁగానే రాక్షసులు కొందఱు రథములనెక్కియు, గొందఱేనుఁగులనెక్కియు, గొందఱు గుఱ్ఱములనెక్కియు, గొందఱు నడచియు వచ్చుచుండఁగా వారల తేర్లచే, నేనుఁగులచే, గుఱ్ఱములచే నగరము పక్షులగుంపులు గ్రమ్మిన యాకాశము వలె నుండెను.

ఉ. యానము లెల్ల దూరతల•మందున నిల్పి పదప్రచారులై
లోనికి నేఁగు లెల్ల గుహ•లోనికిఁ బోవు మృగాధినాథులో
నా నయ మార నేగి సుర•నాయకగర్వవిదారి పాదముల్
పూని కరంబులన్ మరలఁ • బూజితులై యుచితత్వ మేర్పడన్. ౧౧౯

అర్థములు. దూరతలమందున=దూరప్రదేశమునందే, సురనాయక గర్వవిదారి=ఇంద్రుని పొగరణఁచిన రావణుని, పూజితులై=సన్మానింపఁబడినవారై, ఉచితత్వ మేర్పడన్=వారివారి యోగ్యతకుఁ దగినట్లు.

తాత్పర్యము

వారివారి వాహనముల నన్నిటిని దూరమునందే నిలిపి దిగి కాలినడకతో గుహలోనికిఁ బోవు సింహములవలె సభలోనికిఁ బోయి రావణుని పాదములంటి నమస్కరించి మరల గౌరవింపఁబడినవారై వారి వారి యోగ్యతకుఁ దగినట్లు.

క. కొందఱు పీఁటల మఱియుం గొందఱు దర్భాసనములఁ • గొందఱు నేలన్
బృందారకరిపు శాసన, మొందీ యతివిప్రమోల నెల్ల • నుపవిష్టులుగాన్. ౧౨౦

అర్థములు. బృందారకరిపు శాసనము = దేవవిరోధి యగు రావణునాజ్ఞ ఉపవిష్టులు=కూర్చుండినవారు.

తాత్పర్యము

పురోహితులు లోనగు వారు పీటలమీఁదను, శ్రోత్రియులు దర్భాసనముల మీఁదను, కొడుకులు లోనగువారు నేలఁ బఱచిన కంబళ్ళమీఁదను రావణు నాజ్ఞ ప్రకారము కూర్చుండిరి.

సీ. అర్థనిశ్చయ సమ♦ర్థాత్ములా, పండితుల్, సర్వజ్ఞులును బుద్ధి♦చక్షువులును
గుణయుక్తు లగు మంత్రి♦కుంజరుల్ నూటుల, కొలఁదిగ నుండిరి♦కూటమునను
యోధులు పెక్కురు ♦ నొప్పి రా యాస్థాని, నందఱు,బఱిసేమ ♦ మారయుటకు
నపుడు విశాలమై ♦ హాటకచిత్రితం, బగు మేలిగుఱ్ఱాల♦స్యందనమున
తే. వరయశశ్శాలియు మహాను♦భావుఁ డైన, యవ్విభీషణుఁ డరుదెంచి♦యన్నఁ దాసి
తనదు పేరు వచించి పా♦దముల మ్రొక్కె, నట్లె శుకుఁడు ప్రహస్తుఁడు ♦ నాచరింపఁ

అర్థములు. ఆ సభయం దెట్టివా రుండి రనిన:— అర్థ నిశ్చయ సమర్థాత్ములు=ఈకార్య మిటు చేసిన బాగు, ఇటు చేసిన నోగు అని నిర్ణయించి చెప్పఁగల మనస్సు గలవారు, పండితుల్=నీతిశాస్త్రవేత్తలు, సర్వజ్ఞులు=ఏవిషయ మడిగినను జెప్పఁగలవారు, బుద్ధిచక్షువులు=జ్ఞానమనెడి కన్నులుగలవారు, శాస్త్రము నాధారము చేసికొని యింద్రియ గోచరములుగాని వానిని బుద్ధిబలముచేఁ జెప్పఁగలవారు, గుణయుక్తులు = మంచిగుణముగలవారు, మంత్రి కుంజరుల్ = మంత్రి శ్రేష్ఠులు ఆస్థాన = సభయందు.

తాత్పర్యము

కార్యము నిశ్చయించు సామర్థ్యముగల మనస్సుగల పండితులు, సర్వము దెలిసినవారు, జ్ఞాననేత్రము గలవారు, గుణవంతులు నగు మంత్రి శ్రేష్ఠులును ఆ సభయందు వందలకొలందిగ నుండిరి. యుద్ధనిపుణులైన వారనేకు లా సభయం దుండిరి. వీరంద ఱున్నట్టుండి తమ్ముల బిలిపించుటచే నేమి యపాయము వచ్చెనో యని రావణుని క్షేమము విచారింప వచ్చిరి. అపుడు వెడలుపై బంగారు నగలు ధరించిన గుఱ్ఱాలు కట్టిన తే రెక్కి గొప్పకీర్తిగలవాఁడును, మహానుభావుఁడైన విభీషణుఁడు వచ్చి యన్న యొద్దకుఁ బోయి పాదములు స్పృశించి తనపేరు చెప్పి నమస్కరించెను ఆ ప్రకారమే శుకుఁడు, ప్రహస్తుఁడు చేసిరి.

క. వారల కుచితాసనముల, వేరుగఁ బఱి యొసఁగ వారు ♦ వెలసిరి వానన్
సారపరార్థ్యాగురు క,ర్పూర ప్రసూనరభి గొనుచుఁ♦బొలిచెఁ బవనుఁ డునన్. ౨౭

అర్థములు. ఉచితాసనములు = తగిన యాసనములు, వేరుగన్ = వేర్వేరుగ-వేరు వేఱు అని రెండురూపములు గలవు. 'కౌరవుల సేమమెల్ల వేర్వేర నడిగె' నని భార, ఉద్యో ౨౮ – వానన్=వానియందు, అది యిది యెది యనువానికిఁ

ద్వితీయాస ప్రత్యేక వచనంబులందు దాన, దీన దేన వనియు, వానిబహువచనంబుల యందు వాన, వీన వేన వనియు రూపంబులు, ప్రా-వ్యా-సర్వ-ఓ-అసూ-సార= సత్త్వగల, పరార్థ్య = శ్రేష్ఠమైన, అగురు. కర్పూర, స్రక్ సురభి = అగురు యొక్కయు, పచ్చకర్పూరము యొక్కయు, పూలదండల యొక్కయు పరిమళమును.

తాత్పర్యము

వారికిఁ దగిన యాసనములు వేలుగ నేర్పాటు చేయఁగా వానియందు వారు కూర్చుండిరి. శ్రేష్ఠమైన, అగరు; పచ్చకర్పూరము, పూలదండలు వీని వాసన గ్రహించి గాలి కమ్మగ వీచెను.

ఉ. గట్టిగఁ బల్కఁ డెవ్వఁడు నొ • కండును నక్రమవాది లేఁ డటన్
మట్టును మీఱి సద్దిడఁడు • మానవభోజుల నొక్కఁ డేని దై
త్యేట్టుని యాసనంబుఁ గను • చెల్లరు ధీరులు వీరు లుండ స్వా
రాట్టు వసుల్ భజింపఁగను • రాజిలుభంగి సతండు రాజిలెన్. ౨౩

అర్థములు. సద్దిడఁడు=చప్పుడు చేయుఁడు, దైత్యేట్టుని= రాక్షసశ్రేష్ఠుని యొక్క, ఆసనంబు = ముఖము, ధీరులు = పండితులు, వీరులు = శూరులు, స్వారాట్టున్=ఇంద్రుని, వసుల్=వసువులు, స్వర్+రాట్టు=స్వారాట్టు.

తాత్పర్యము

ఆ రాక్షసులలో నొకఁడైన గట్టిగ మాటలాడినవాఁడు లేఁడు. అక్రమముగా వాదించువాఁడు లేఁడు. మర్యాదఁదప్పి చప్పుడు చేసినవాఁడు లేఁడు. అందఱు ధీరులు వీరులు. రావణుని ముఖముఁ జూచుచు నింద్రుని వసువులు గొలుచునట్లు గొలువఁగా నతండు ప్రకాశించెను.

—• ౧౪-వ సర్గము రావణుఁడు రాక్షసుల నంబోధించుట •—

సీ. కలయంగ సభ నెల్ల • గనుఁగొని దళవాయి, యగు ప్రహస్తునితో ద • శాస్యుఁ డనియె
సేనాపతీ! నీవు • చెచ్చెరఁ జని చతు, ర్విధకళాధుర్యుల • వీరవరుల
నెక్కడు కాపుంచు • మీా యస నతేఁడును, రాజశాసనమున • రక్ష నిలిపె
వీటిలోపల మఱి • వెలుపల నెల్లెడఁ బురరక్షణార్థంబు • పూర్ణముగను
ఆ. వేల వేల యసుర • వీరుల నిటు నిల్పి, సర్వసైన్యములను • సకలదిశల
రక్ష నిలిపినాఁడ రాక్షసవల్లభ, శంక లేక పనులు • సలుప వచ్చు. ౨౪

అర్థములు. దళవాయి = సేనానాయకుఁడు, చతుర్విధ కళాధుర్యులన్ = నాలుగు విధములైన విద్యలయందు సమర్థులు-రథికులు, అశ్వారోహకులు (రౌతులు) గజారూఢులు-పదాతులు- (కాలిబంట్లు) అను నాలుగు విధముల యోధులు.

తాత్పర్యము

అప్పుడు రావణుఁడు సభయందుండు వారి నందఱను నలుప్రక్కలఁ గలయఁ జూచి సేనానాయకుఁ డగు ప్రహస్తునితో నిట్లనియె, సేనాపతీ! నీవు త్వరగాఁ బోయి,

నాలుగు విధములగు యోధులను వీరులగువారిని నిదివఱకుండు కాపునకంటె నెక్కు-వగాఁ గాపుంచుము. అని చెప్పఁగా నతఁడును రాజాజ్ఞ ప్రకారము పట్టనము లోపల, వెలుపల, నన్ని ప్రదేశములందును, బట్టనము రక్షించుకొఱకు వేలువేలు రాక్షసుల వేలువేలు స్థలముల నుండ నియమించి, రాక్షసేశ్వరా! యన్ని సేనలను నన్ని ప్రదేశముల నిలిపినాఁడను, భయము లేదు. సందేహము లేక మీ కార్యము మీరు చేయవచ్చును.

క. అనవుడు రాజ్యహితైషుఁడు, దనుజాధిపుఁ డతని వాక్య • తతి విని సుఖమం
దనురక్తి కలిమి సుహృదులఁ గనుగొని యిట్లనియెఁ బ్రకృత • కార్యము దెలియన్

అర్థములు. రాజ్యహితైషుఁడు = రాజ్యముయొక్క మేలు కోరువాఁడు, సుఖమందున్ = తన సౌఖ్యమందు, అనురక్తి కలిమిన్ = అనురాగము కలుగుటచే, సుహృదులన్ = మిత్రులను, సుహృత్తులు - మిత్రులు - వయస్యులు నను నీ శబ్దములు పర్యాయవాచకముగ నుపయోగింపఁబడినను వానియందుఁ గొంత భేదము గలదు.

దుఃఖే విపది సంమోహే, కార్యకాలాత్యయేపి చ
హితాన్వేషీ చ హితకృత్, య స్సుహృ త్సోఽభిధీయతే.
సత్యవా గార్జవరతి, రుపకుర్వన్ ప్రియం వదన్
భజతే య స్స్వయం ప్రీతిం, ప్రియ స్స పరికీర్తితః
సమాన శీలవ్యసనో, గహ్యోఖ్యా నైకభాజనమ్
విపత్ప్రతిక్రియాభిజ్ఞో వయస్యః పరికీర్తితః
ఉపకారము గోరి యుపకారము సేయువాఁడు మిత్రుఁడు.

తాత్పర్యము

ఈ ప్రకారము ప్రహస్తుఁడు చెప్పఁగా రాజ్యము మేలుగోరువాఁ డగు రావణుఁడు తన సౌఖ్యమునందలి ప్రేమచే స్నేహితుల నందఱఁ జూచి యప్పుడు సలుపఁబూనిన కార్యము దెలియ నిట్లనియె.

రాజ్యహితము గోరినవాఁడును, తన సుఖమునం దనురక్తి గలవాఁ డనుటచే- సీతవలనఁ దాను బొందఁగోరిన సౌఖ్యమునకు హాని రాఁగూడదు. ఇది వాని ముఖ్యోద్దేశము - ఆ నిమిత్తమున బ్రజలకుఁ గీడు రాఁగూడ దని భావము.

ఈ విషయము స్పష్టముగా ౩౯వ పద్యమునఁ జెప్పఁబడును.

చ. అసురలు! ధర్మకామముల • నర్థమునం దగు దేనిఁ బూనఁగా
వెస నని యోజనన్ జలుపు • వేళల లెస్సగ దాన దాన నే
దొనఁగులు మేల్మి సౌఖ్యములు • దుఃఖములుం బ్రియవిప్రియంబులుం
బొసఁగునొ లెస్సగా నరసి • పూర్ణమనీషను నిశ్చయింపుఁడీ. ౩౬

అర్థములు. దానన్ దానన్=దానిచే దానిచే; (౨౨వ పద్య వ్యాఖ్య చూచునది) దోసఁగులు=కీడులు; పూర్ణమనీషను=నిండు మనస్సుతో,

తాత్పర్యము

రాక్షసులారా! ధర్మము అర్థము. కామము వీనిలో నేది చేయఁదగినది యని యాలోచించునపుడు ఏది, యేదిచేసిన కీడులు, మేళ్ళు, సౌఖ్యములు, దుఃఖములు, ప్రియములు, అప్రియములు కలుగునో యవి లెస్సగా విచారించి యణుగొలులేని మనస్సుతో నిశ్చయింపుఁడు.

ఉ. ఎప్పుడు నేనికార్యముల • నేనొనరించిన మీరలెల్లరుం
చెప్పిన పద్ధతి న్నడతుఁ • జే టొనఁగూడద యొంట నేని, నే
నప్పురుహూతుఁ డిందు మిహి•రామరసమ్మతిఁ బోవుమాడ్కి మీ
రొప్పుగఁ జెప్పినట్లు చని • యొంచుదుఁ గాదె నితాంతసంపదన్. ౨౭

తాత్పర్యము

మాకేది మేలో, మీకేదిమేలో నీకుఁదెలియదా, మమ్ము నడుగవలయునా యందురేమో, నాకుఁ దెలిసినను దెలియకున్నను నింతవఱకు నెప్పుడు నే నే కార్యము చేసినను మీ రందఱు చెప్పినవిధముగానే నడచుచున్నాను. దానివలన నే కార్యము చెడినది లేదు- అన్నియు ననుకూలములుగానే వచ్చెను. కావుననే యిప్పుడు మీ యాలోచనప్రకారము పోవఁదలఁచి యడుగుచున్నాను. ఆ యింద్రుఁడు, సూర్యుఁడు చంద్రుఁడు దేవతలు సమ్మతించిన మార్గమునఁ బోవునట్లు మీరు చెప్పినట్లు చేసికదా నే నీ సంపద పొందినవాఁడ నైతిని. మీరు సంపాదించి యిచ్చినది, మీ రేకదా కాపాడవలయును.

ఉ. మీకిది సర్వముం దెలుపఁ • మేకొనియుండియుఁ గుంభకర్ణు ని
ద్రాకలితత్వముం గనుటఁ • గ్రన్నన యిప్పుడ చెప్పనైతి, న
స్తోకపునిద్ర నార్నెలలు • సోలెను, నిప్పుడ మేలు కాంచె, నీ
ప్రాకటసర్వశస్త్రధర•వర్యుఁడు కావున నేఁడు చెప్పెదన్. ౨౮

అర్థములు. మేకొని యుండియున్ = సమ్మతించి యుండియు,

తాత్పర్యము

ఇప్పుడు నేను మీకుఁ జెప్పఁ బోవునది సమస్తము ముందే చెప్పవలయు నని మనస్సు నం దుండెను. కాని కుంభకర్ణుఁడు నిద్ర పోవు చుండుటచేఁ దెలుప లేదు. ఆఱునెలలు నిద్రించి యిప్పుడే మేలుకొన్నాడు కావున నేఁడు చెప్పఁబూనితిని.

ఆఱునెలలు కుంభకర్ణుఁడు నిద్రపోయినచో సీతాదేవిని దెచ్చి పదినెలలయి నదికదా! ఆఱునెలలకు ముందు వాఁ డొకసారి మేలుకొనెఁగదా! అప్పు డేల చెప్పి యుండరాదు? వాస్తవ మేమన సీతను దాను దెచ్చిన విషయము రావణుఁ డెవ్వరికిఁ దెలియకుండ దాఁచెను. ఎవరికిఁ దెలియ రాదనియే తన యంతఃపుర స్త్రీలుమాత్రము

సంచరించు నుద్యాన వనములో నుంచెను. కావున నంతఃపురమునకు వచ్చుచుం బోవుచుండు వారికి మాత్రమే తెలియును. ఆఁడువారిమూలమున విభీషణాదులకుఁ దెలిసెను. హనుమంతుఁడు బహిరంగపఱచు వఱకు నగరములో ననేకులకుఁ దెలియదు. ఇంతయేల, యుద్ధమునకుఁ బోవు భటులకు నేల యుద్ధమో, యెవరితో యుద్ధమో యా గడియవఱకుఁ దెలియదు, (చూ-వ ౨౦౦) ఈ కుత్సితోపాయము నేఁటి దేశాధిపతులు యుద్ధవేళల ననుసరించు చున్నారుగదా! ఇది రాజనీతియే కాని దుర్నీతి. రాజనీతి రెండువిధములు. సునీతి, దుర్నీతి యని. సునీతి ధర్మము ననుసరించి యుండును, దుర్నీతి ధర్మవిరుద్ధముగ నుండును. రాజుల కుభయనీతులం దధికారము గలదు. తక్కినవారికి దుర్నీతియం దధికారము లేదు.

—• రావణుఁడు రాక్షసులతో సీతవృత్తాంతముఁ జెప్పుట. •—

ఉ. రాముని దేవి సీతఁ బ్రియు • రాలి విదేహతనూజ దండకా
భూమిని నుండఁ దెచ్చితిని • బుష్పసుగంధిని, మందయాన యా
భామిని నాదు శయ్యపయిఁ • బండఁగ నొల్లదు, మూఁడులోకముల్
వేమఱు రోయ సీత సరి • లేమ లభింప దటంచుఁ దోఁచెడిన్. ౨౯

తాత్పర్యము

పూలవాసనవంటి వాసనగలదియు, మెల్లగా నడచునదియు నగు రాముని భార్యయు, విదేహరాజకూఁతు రగు సీతను దండకారణ్యము దుండఁగాఁ దెచ్చితిని. ఏల తెచ్చితి వందురా-మూఁడులోకములలో వెదకినను అటువంటి సుందరి వేఱొకతె లేదు. ఆమెను నా భార్యగాఁ జేసికొనఁ దలఁచి తెచ్చితినిగాని యామె నా పాను పెక్క సమ్మతింపలేదు.

చం. తనుతరమధ్య సత్పృథుల • తాపరిశోభినితంబబింబఁ గం
జనిభ విశాలలోచనను • శారదపూర్ణసుధాకరాస్య నా
కనకపుబొమ్మ సుందరిని • గాంచినచో మయుఁడే సృజించెనా
వనజభవాయుతాక్షి నని • భావమునం దలపోఁత గల్గెడిన్. ౩౦

అర్థములు. తనుతరమధ్య=మిగుల సన్నని నడుముగల దానిని, సత్పృథులతాపరిశోభి = బలిసియుండుటచేఁ బ్రకాశించు, నితంబబింబ = పిఱుఁదులు గలదానిని, కంజనిభ = తామరలతో సమానమైన, విశాలలోచనను = వెడలుపాటి కన్నులు గలదానిని - శారదపూర్ణ, సుధాకరాస్య = శరత్కాలమునాఁటి నిండు చంద్రునివంటి ముఖము గలదానిని - తలపోఁత = ఆలోచన.

తాత్పర్యము

మిగుల సన్నని నడుము, బలసిన పిఱుఁదులు, తామరలవంటి కన్నులు, శరత్కాలమునాఁటి నిండుచంద్రునివంటి ముఖముగల యీబంగారు బొమ్మను, అందగత్తెను,

చూచినపుడు మయుఁడే దీనిని సృజించెనా యని తోఁచును. మయుఁడు దానవుఁడు కావున వాఁడు సృజించినది తాను గ్రహించుట దోషము కాదని సూచన.

తే. అరుణతలములు కడు మనో•హరతమములు
సుప్రతిష్ఠితములు నైన • సుందరాంగి
చరణములు తామ్రనఖములు • చక్కఁ జూడఁ
జూడ నను బుష్పబాణుండు • వాఁడి మెఱసి. ౨౩౧

అర్థములు. అరుణ తలములు = ఎఱ్ఱని యడుగులు, సుప్రతిష్ఠితములు = చక్కఁగా నేలమోపునవి, హెచ్చుతగ్గులు లేనివి, తామ్రనఖములు=ఎఱ్ఱని గోళ్లు, వాఁడి = పరాక్రమము.

తాత్పర్యము

ఎఱ్ఱని యఱకాళ్లు గలవియు, మిగుల మనోహరములైనవియు, నేల చక్కఁగా మోపఁబడునవియునగు నా సుందరి పాదములు-ఎఱ్ఱని గోళ్లు చక్కఁగాఁ జూడఁగాఁ జూడఁగా నన్ను మన్మథుఁడు పరాక్రమించి కాల్చుచున్నాఁడు.

క. సారహుతాగ్నిజ్వాలల,తీరున నీరజహితద్యు•తి న్వెలిఁగెడి యా
సారసదళనయనం గని, మారుని వశమైతి నసుర•మండనులారా. ౨౩౨

అర్థములు. సారహుతాగ్నిజ్వాలలతీరున=అగ్నియొక్క సారవంతములైన జ్వాలలు - హోమము చేయఁబడిన యగ్నిహోత్రుని సారములైన జ్వాలలవలె - (౨) సారమైన హవిస్సుచేత హోమము చేయఁబడిన యగ్నిజ్వాలలవలె-ఈ యుపమానము సీతాదేవి పవిత్రతను, తపోమహిమను దెలుపుచున్నది- నేనై తాఁకినఁ గాల్చునని యామెయే నమ్మతించువఱకుఁ గాచియున్నానని భావము. నీరజహిత= సూర్యుని, కాంతివంటి, ద్యుతి=కాంతిచే, ఎండను జూడవచ్చునే కాని, సూర్యుని జూడరానట్లు లామె కాంతిని జూడవచ్చునే కాని, యామెను జూడ సాధ్యపడదని భావము-(౨) సూర్యకాంతియే మనలను దహింపఁ జేయునపుడు, సూర్యుఁ డెంత చేయలేఁడు - అగ్నిసెగకే కమరునది యగ్నిలోఁబడిన నేమగును? సారసదళనయనన్ = కమలముల రేకులవంటి కన్నులుగలదానిని, మారుని వశమైతిన్= (౧) మన్మథుని వశమైతిని- (౨) మృత్యుదేవతకు వశమైతిని - మారయతీతి మారః - చంపువాఁడు గావున మారుఁడు - మృఙ్ ప్రాణత్యాగే-

యుద్ధమునందుఁ జత్తునో, చావనో సందేహముగాని, సీత నాకు లభింపదేని నేను మదనతాపమునఁ జచ్చుట నిజము. కావున నేను బ్రతికియుండఁగోరిన సీత నాకుఁ దక్కు నుపాయము చెప్పుఁడని భావము.

తాత్పర్యము

సారవంతములైన మంత్రములచే, హోమ ద్రవ్యములచే హోమము చేయ

బడిన యగ్నియొక్క శిఖలవలెను, సూర్యుని కిరణములవలెను వెలిఁగెడి యాసీతను జూచి రాక్షసశ్రేష్ఠులారా! నేను మన్మథుని వశమైతిని.

అగ్నిజ్వాలలు-సూర్యునికాంతి పట్టుకొనఁబోయిన చేతికిఁ జిక్కునవి కావు - అట్టిదే సీతయు-ఆమెను నేను గ్రహింపఁగోరుట నా చాపువకే యని ధ్వన్యర్థము - 'సత్యావాణీ సరస్వతీ' యని కలదుకదా-ఇట్లులే ఖరుఁడు చెప్పెను-కుంభకర్ణుఁడు చెప్పఁబోవుచున్నాఁడు-రాఁగల యనిష్టములను ముందు వాక్కు సూచించును.

క. తీరైన యున్నసంబును, హారులు విపులంబులైన • యక్షులుఁ గల యా
నారి ముఖముఁ గని వివశత, మారుని వశమైతి నసుర • మండనులారా! ౨౩౩

అర్థములు. ఉన్నసము=ఎత్తగు ముక్కు, హారులు = మనస్సు హరించునవి, విపులంబులు=విశాలములైనవి, అక్షులు=కన్నులు, నారి=స్త్రీ, వివశతన్ = పరవశత్వముచేత, అల్లెత్రాడను నర్థమందు నారీశబ్దము దేశ్యవిశేష్య మని శబ్దరత్నాకరమందుఁ గలదు గాని "నారీయోషితి మార్వ్యాం చ" యని రభసుఁడు చెప్పుటచే రెండర్థము లందును నది సంస్కృత శబ్ద మనియే యెఱుఁగ నగు, 'నారిఁగూర్చి నిశాచర నారిఁగూర్చి' యనుచో రెంటను సంస్కృత శబ్దముగా గ్రహించిన రాఁగల బాధ లేదు.

తాత్పర్యము

చక్కఁగాఁ దీరిన యెత్తైన ముక్కు, మనోహరములు విశాలములునైన కన్నులు గల యా స్త్రీముఖముఁ జూచి రాక్షసులారా! మారుని వశమైతిని.

క. అలుకను ముదమునఁ దుల్యుఁడు, బలియించును శోకతాప • భరముం గాంతిం
దొలఁగించు నట్టి స్మరుచేఁ, గలుషితచిత్తుఁడ నిశాట • కాండములారా! ౨౩౪

అర్థములు. నిశాటకాండములారా=రాక్షససమూహములారా, అలుకన = కోపమునందు, ముదమునన్ = సంతోషమునందు, తుల్యుఁడు = సమానుఁడు, కలుషిత చిత్తుఁడను=కలఁతపెట్టఁబడిన మనస్సు గలవాఁడను (౨) పాపపు బుద్ధి గలవాఁడను, స్మరుచే - విభక్తి మార్చి యన్వయింపవలెను.

తాత్పర్యము

ఎట్టి మన్మథుఁడు కోపమునందును, సంతోషము నందును సమానుఁడో, ఎవఁడు శోకతాపాతిశయమును అధికముచేయునో, తొలఁగించునో యట్టి మన్మథునిచేఁ గలఁత నొందిన మనస్సుగలవాఁడ నైతిని.

మన్మథునకుఁ గోపము వచ్చినను, సంతోషము వచ్చినను పర్యవసానము విరహులఁ జంపుటే యని యైనఁ జెప్పవచ్చును. లేక మనుష్యులకుఁ గోపము వచ్చినను సంతోషము వచ్చినను మన్మథబాధ తప్పదని యైనఁ జెప్పవచ్చును. అక్షాదులు చచ్చి దుఃఖించు చున్నను మదనతాపము పోలేదని భావము. "ఏప్పుచు రైకముల్ప్ర విప్పువాఁ"డని సామెత కలదుగదా.

క. తనమగఁడు రామచంద్రుఁడు, చనుదెంచెడి ననెడి యాస ♦ సంవత్సరమున్
నను గడుపు వేఁడెఁ దశకం,ఠుని నే నా మేలిమాటఁ ♦ గైకొంటిఁ జుఁడీ. ౨౩౫

తాత్పర్యము స్పష్టము.

సీతాదేవి గడువుకోరె ననుట యసత్యము.

క. చక్కఁగ స్వారి యొవర్చుట, మిక్కిలి వడఁబడిన తేజ♦మిహినా నేనుం
జిక్కితిఁ గామునిదాడికి, స్రుక్కితి నిది నా విధం బ♦సురవరులారా! ౨౩౬

అర్థములు. వడఁబడిన=గాసిపడిన, తేజమిహి=శ్రేష్ఠమైన గుఱ్ఱము.

తాత్పర్యము

మిక్కిలి సవారిచేయుటచే గాసిపడిన యుత్తమాశ్వమువలె నేనును మన్మథుని ధాటికి స్రుక్కితిని.

ఉ. ఏ కరణిం దరింతురు మ♦హిష్ఠభయంకర సత్త్వయుక్త నీ
రాకరవర్య మా ఘనవ♦నౌకసు లేని నృపాలు రేని నా
నాకపి యొక్కఁడే కద మ♦హాహవము న్మనతో నొనర్చె, న
ష్టే కరణిం గ్రియాసరణి ♦ యేగడినో తెలియంగ శక్యమే. ౨౩౭

అర్థములు. మహిష్ఠభయంకర = మిగుల భయమును గలిగించు, సత్త్వ= జంతువులచే, యుక్త = కూడిన, నీరాకరవర్యమును=శ్రేష్ఠసముద్రమును, వనౌకసులు=కోఁతులు, మహాహవమున్=గొప్పయుద్ధమును.

తాత్పర్యము

కోఁతులైనను రాజకుమారులైనను మిగుల భయంకరమైన జంతువులుగల సముద్రము నెట్లు దాఁటి రాఁగలరని యూరకుండరాదు. ఏలన,నొక కోఁతిగాదా సముద్రము దాఁటివచ్చి మనతో నంత పెద్దయుద్ధము చేసెను. ఏ కార్యమే సమయమున నెట్లు జరుగునో యెట్లు తెలియ సాధ్యమగును.

ఉ. దాన భవిష్యదర్థము య♦థామతి యోచనచేసి చెప్పఁడీ
మానవుచే భయం బొదవు ♦ మాటయు లే దది చక్కఁజూడుఁడీ
దానవదేవయుద్ధములఁ ♦ ద్వద్భుజశౌర్యము నేను నూఁతగాఁ
బూని కదా జయించితిని ♦ బోరుల గెల్చిడినారు మీరెకా. ౨౩౮

అర్థములు. భవిష్యత్+అర్థము = ముందుఁ జేయవలసిన కార్యము, యథామతి=మీ మనస్సు చొప్పున.

తాత్పర్యము

ఆ కారణముచే నిఁక ముందు నేను చేయవలసిన దేమియో యది మీ యిష్టప్రకార మాలోచించి చెప్పఁడు. మనుష్యులవలన మనకు భయములే దనుమాట మనస్సులో నిలుపుఁడు. దేవదానవ యుద్ధములందు మీ భుజశౌర్య మాధార

ముగఁ జేసికొనికదా జయించితిని. యుద్ధములందు మీరేకదా నాకు జయము గలిగించినవారు. ఇవి యిచ్చకాలమాటలు.

ఉ. ఆ వసుధాధిపాత్మజులు ♦ క్ష్మాత్మజ పోబడి తా రెఱింగి సు
గ్రీవపురస్సరం బగు హ♦రిధ్వజినీతతిఁ గూడి వార్ధి వే
లావనిఁ జేరినారు, వసు♦ధాత్మజ నీయఁగ రాదు, వెండి నీ
తావిభుఁ జంపఁగా వలయు ♦ దానికిఁ జెప్పుఁడు మంచియుక్తులన్. ౨౯

అర్థములు. వసుధాధిపాత్మజులు = రాజకుమారులు, క్ష్మాసుత పోబడి = సీతాదేవి యిందున్నజాడ, సుగ్రీవ పురస్సరంబగు=సుగ్రీవుఁడు ముందుగాఁ గల, హరిధ్వజినీతతి = వానర సేనాసమూహము, వార్ధి వేలావనిన్ = సముద్రతీర భూమిని.

తా త్ప ర్య ము

ఆ రాజకుమారులు సీతాదేవి యిందున్న జాడ దెలిసి సుగ్రీవుఁడు ముందుగాఁ గల వానరసేనతో సముద్రతీరమున వచ్చి దిగియున్నాడు. మీరు నాకుఁ జెప్ప వలసిన యాలోచన యేమనఁగా సీతాదేవిని మరల నీయరాదు. రాముని జంప వలెను. దానికిఁ దగిన యుపాయముఁ జెప్పుఁడు.

దీనివలన రావణుఁడు సామ దాన భేదోపాయములు తలఁచినవాఁడేకాఁడు. దండము మాయ ఇంద్రజాలము వీనిలో నేది యనుష్ఠింపవలయు ననియే వాని ప్రశ్న.

సామ దానంచ భేదశ్చ దండశ్చేతి చతుష్టయమ్
మాయోపేక్షేంద్రజాలం చ సప్తోపాయాః ప్రకీర్తితాః
అదేశే కాలాపరోక్ష్యం పరోక్షస్యైవ వస్తునః
మంత్రౌషధ క్రియాభేదై రింద్రజాలం ప్రచక్షతే॥ అని యింద్రజాలలక్షణము.

—♦ **కుంభకర్ణుఁడు రావణునిఁ గోపించి పలుకుట** ♦—

ఉ. రాముఁడు దక్క వేఱొకఁడు ♦ రాఁడు సముద్రము దాఁటి వానర
స్తోమముతోడఁ గాన జయ♦శుద్ధి వినిశ్చిత మంచుఁ బల్క నా
కామపరీతచిత్త దశ♦కంఠుని రోదన మాలకించి కో
పామితదగ్ధచిత్తుఁ డయి ♦ యాతని బల్కెను గుంభకర్ణుఁడున్. ౩౦

అర్థములు. వానరస్తోమము = కోఁతిగుంపు, కామపరీతచిత్త = కామముచే విపరీతమైన బుద్ధి గల, దశకంఠునిరోదన= రావణుని యేడుపు, రావణుఁడు చెప్పినది యేడుపు వంటిదేకాని మంత్రాలోచనము కాదని భావము. నేను జేయఁ దలఁచినది చేసినాను, ఇప్పుడు నా ప్రాణము మీఁదికి వచ్చినది, మీరు రక్షింపుఁ డనియే కదా వాని యేడుపు. కోపామిత దగ్ధచిత్తుఁడయి = కోపముచే మిగుల దహింపబడిన మనస్సు గలవాఁడై.

తాత్పర్యము

వానర సేనతోడ సముద్రము దాఁటిరాఁగలవాఁడు రాముఁ డొక్కఁడే. రాముఁడు రానియెడల వానరులు రారు. కావున నా యొక్క రామునిఁ జంపితిమా మనకు జయము నిజము. దాని కుపాయము చెప్పుఁడని చెప్పఁగా కామముచేత వైపరీత్యము చెందిన మనస్సుగల రావణుని యేడ్పువిని కోపముచే మిగుల దహింపఁబడిన మనస్సుగలవాఁడై, కుంభకర్ణుఁడు వానితో నిట్లనెను.

సీ. రామసౌమిత్రిసం♦రక్షణీయను సీత, నపహరించితి వేరి ♦ నడిగి నీవు ?
అటు చేయకయు మున్న ♦ యడిగినఁ జెప్పమే, యామునరక్షిత ♦ యమునవోలె
నీ చిత్త మెంతయు♦నిల్కడ భజియింప, నో మహారాజ ! మేల్ ♦ యుక్తి నొకటి
నటులైన నెంతో లెస్సైయుండు నీ పని, నిప్పుడు చింతింప ♦ నేమి ఫలము ?
తే. రాజకార్యంబు లెవ్వఁడు♦ప్రథమమందె, న్యాయపద్ధతి యోజించి♦యాచరించు
నట్టివాఁ డెందుదుఃఖంపఁ♦డనలఁ గార్య,మ ట్లొనర్చక చెడిపోయె నేయని♦యాత్మయందు.

అర్థములు. సంరక్షణీయను = కాపాడఁబడు దానిని, యామునరక్షిత యమునవలె = యమునానది యొడ్డుననుండు, యమున పొర్లిపోకుండఁ గాపాడు పర్వతము యమునను గాపాడినట్లు, కార్యములు చేయు పురుషు లుత్తమ మధ్యమాధములుగల రని నీవే చెప్పితివిగదా- (చూ.ప.౧ ౨౯) సమసుఖ దుఃఖబాంధవు లగు మాతో నెవ్వరితోనైన నాలోచించి చేసినవాఁడవు కావు. కావున నీవు త్తమ పురుషుఁడవు కావు. దైవమే శరణ మని నమ్మి కార్యము చేయఁబూనితివా ఇప్పుడు నీవే చేసికో మమ్ము నడుగ నేల ? మా సాహాయ్యము కోరుచున్నావు కావున నీవు మధ్యమ పురుషుఁడవు కావు - నీవు అధమపురుషుఁడ వని కుంభకర్ణుఁడు చెప్పుచున్నాఁడు.

తాత్పర్యము

రామలక్ష్మణు లిరువురు రక్షించు సీతను నీ వెవరినడిగి తెచ్చితివి. ఆలోచించి యావలఁ గార్యము చేయవలయునా ? కార్యము చేసి యాలోచింపవలయునా ? కార్యము నీవు చేయకముందు మా యాలోచన నడిగియుండిన యాముస పర్వతము రక్షించు యమునవలె నీకీ మనఃక్షోభము లేకుండు నుపాయము చెప్పియుందుము. అటు చేసియుండిన నెంతో మేలై యుండును. కార్యము చేసి యిప్పుడు ప్రాణము మీఁదికి వచ్చినప్పుడు విచారపడిన లాభ మేమి ? రాజకార్యములను మొదటనే న్యాయ్యమార్గమున నాలోచించి కార్యము చేసినవాఁడు పిమ్మటఁ గార్యము చెడినను వాఁడు విచారపడఁడు. మనము న్యాయ్యముగఁ జేయవలసినది చేసితిమి. దైవము ప్రతికూలించిన మన మేమి చేయఁ గల మని వ్యసనపడకుండును.

క. విపరీతాలోచనఁ బని, నిపుణత లేకాచరింప ♦ నెఱి చెడు మఱియున్
విపరీతఫలము లొదవును, నపవిత్రపుఁ దనెల నన్న ♦ హవిఁ దిన్నట్లే. ౨౮ ౨

అర్థములు. నెఱి = అందము, తవిలె = పాత్రము, హవి = హోమము చేయబడిన యన్నము.

తాత్పర్యము

ఎంత మంచి కార్యమైనను విపరీతముగ నాలోచించి చేయుటయందును సామర్థ్యము లేదేని యా కార్యము యొక్క యందమే చెడును; చెడుటమాత్రమే కాదు-చెడుఫలమునుగూడఁ గలిగించును. ఎట్లనిన హవిస్సు పవిత్రమైన దైనను పాత్రము శుద్ధమయినది యగునా కాదా యని చూడక చిలుముపాత్రములో వండితిమేని మంచిఫలము లేకుండుటగాక యది తినిన విషమించును. మంచికార్యములే యిట్లు విపరీతఫల మిచ్చుచుండఁగా నీవుచేసిన యకార్యమువలనఁ జెడు ఫలము గలుగుట యేమి వింత? కైముతిక న్యాయము.

క. మొదలం దగు కార్యంబును, బిదపం గావించువానిఁ ◆ బిదపటిపనులన్
మొదల నొనరించువాతని, విదితంబుగ నీత్యనీతి◆విదుఁ డనఁ దగునా ? ౨౮౩

అర్థములు. నీత్యనీతి విదుఁడు = ఇది నీతి, ఇది నీతి కాదు అను జ్ఞానము గలవాఁడు.

తాత్పర్యము

వెనుకఁ జేయవలసిన పని ముందు, ముందు చేయవలసిన పని వెనుకఁ జేయువాఁడు నీతి అనీతి తెలిసినవాఁడని చెప్పఁ గూడునా? కావున నీవు నీతి తెలిసిన వాఁడవు కావు.

క. బలియుఁడు దుస్సాధుం డని, తలఁపంబడువాఁడు చపల◆తం బని సేయన్
సులువుగ భేదింతు రొరుల్, పులుఁగులు క్రౌంచాద్రిరంధ్ర◆మునఁ గా దె చనున్.

అర్థములు. దుస్సాధుఁడు = సాధింపరానివాఁడు, చపలతన్ = బుద్ధి స్థిరత్వము లేక, పులుఁగులు = పక్షులు.

తాత్పర్యము

ఒకఁడు బలవంతుఁడు, ఆ కారణమున సాధింపరానివాఁడే అయినను వాఁడు బుద్ధి స్థైర్యము లేక నియమము దప్పి కార్యములు చేయునేని వానియందలి దోషము గనిపెట్టి సులభముగా విరోధులు భేదింతురు. క్రౌంచపర్వతము బలిష్ఠమై భేదింపరానిదైనను దానిలో నుండు రంధ్రమునఁ దూఱి గదా పక్షులును ఆవలి కీవలికి పోవుచు వచ్చుచుండును. కుమారస్వామి క్రౌంచపర్వతమును శక్తిచే భేదించెను. అప్పుడు దానిలో రంధ్ర మేర్పడెను. ఆ రంధ్రములోఁ దూఱి హంసలు మానస సరోవరమునకుఁ బోవుచుండును.

క. దుష్ట మనాలోచితమును, గష్టం బగు పనిని జలుపఁ ◆ గలిగితి విషసం
శ్లిష్టాన్నభుక్తిభంగి న,దృష్టము పో చంపఁ దన్యో ◆ శ్రీరాముఁ డటన్. ౨౮౪

అర్థములు. దుష్టము=దోషముతోఁగూడినది, అనాలోచితము = ఆలోచన

లేక చేయఁ బూనినది - కష్టము = అపాయకర మైనది, విషసంశ్లిష్టాన్నము = విషముతోఁగూడిన యన్నము.

తాత్పర్యము

నీవు దోషయుక్తము, అపాయముతోఁగూడిన పనిని ఆలోచనలేక విషము కలిసిన యన్నమును దినునట్లు చేసితివి. నిన్ను రాముఁ డప్పటనే చంపక విడుచుట వలన నీ వెంతో నిజముగ నదృష్టవంతుఁడవే.

సీ. పరులకుఁ జాల దు•ష్కర మైన కార్యంబు, నెత్తికొంటివి ఘటి•యించుటకును
(సీతోడఁ బుట్టుట • సీతోడ నిల్వక, నాకుఁ దప్పునె దైత్య•నాథ యిపుడు)
జరుగంగఁ దగు కార్య•సరణి వచించెద, నీ పగతుర నేను • నిల్గఁజేసి
కార్యంబు సరిపడఁ • గావింతు శక్రాన,లార్క-మరుచ్ఛ్రీదు • లడ్డపడినఁ
ఆ. గేలఁ బరిఘ మూని•లీలమైఁ ద్రిప్పుచు, గఱకుఁగోల డాలు • కడలఁ గప్పఁ
గొండఁబోలు మేన•గండుమ గర్జింపఁ, గొండపగతుఁడైన•బెండు వడఁడె. ౨౮౬

అర్థములు. పగతురన్ = శత్రువులను, శక్ర-అనల - అర్క-మరుత్ - శ్రీదులు = శక్ర = ఇంద్రుఁడు, అనల = అగ్ని, అర్క=సూర్యుఁడు, మరుత్ = వాయుదేవతలు, శ్రీదుఁడు=కుబేరుఁడు, డాలు=కాంతి, కడలన్ = దిక్కులందు, కొండపగతుఁడు=ఇంద్రుఁడు, బెండుపడఁడె=బెండువలె నిస్సారమై పోఁడా.

తాత్పర్యము

ఇతరు లెవ్వరు చేయలేని దుష్కార్యముల నీవు చేయఁ దలపెట్టితివి. సీతోడ బుట్టిన కారణమున నిప్పుడు నీ తోడ నిల్వక నాకుఁ దప్పునా ? తప్పదు. అయిన దానికి వగచి లాభ మేమి? ఇఁక జరగవలసినది చెప్పెద వినుము. ఇంద్రుడు- అగ్ని- సూర్యుఁడు వాయువులు- కుబేరుఁ డడ్డపడినను నీ శత్రువులఁ జంపి నేను నీ కార్యము చక్కఁజేసెదను. నేను జేత గుదియ ధరించి త్రిప్పుచు కఱకైన కోలలకాంతి దిశల వ్యాపింపఁగా కొండంత దేహముతో బలముకొలఁది సింహనాదము చేసితినేని యింద్రుఁ డైనను డీలు పడిపోవును.

క. రెండవశరమున రాముఁడు, ఖండించెడు నంతలోఁ దఁగఁగ నా నెత్రు
ద్దండత నేఁ ద్రావెదఁ జుమి, ఖండితసురజాల! సుఖముఁ • గాంచుము మీఁదన్.

తాత్పర్యము

ఓయీ! నీవు పరిఘముతో సమీపమునకుఁ బోయికాని కొట్టఁ జాలవు. రాముఁడో దూరము నుండియే నీమీఁద బాణముల ప్రయోగించి కొట్టును, నీ వేమి చేయఁగలవు అందువేమో - రాముని మొదటిబాణమునకే నేను జావను. (నేను వాలిని గాను) కావున రెండవ బాణము వైచి నన్ను ఖండించు లోపలనే పైపడి యా రాముని నెత్తు నేను బూర్ణముగఁ ద్రావెదను జుమా-ఆవల నీవు సుఖపడుము.

తగఁగన్ + ఆ నెత్తురని యొక్క పదచ్ఛేదము - తగఁగ+నానెత్తురని యొక్క

పదచ్ఛేదము. రెండవ యర్థమున నా నెత్తురు నేనే త్రావెదను, ఆవల నీవు సుఖపడుము.

ఉ. రాముని గీటణంచి మఱి • క్రచ్చఱ లక్ష్మణుఁ బిల్కుమార్చి శా
 ఖామృగయూథము న్మెసవి • గట్టునఁ ద్రేచుచు నీకు గెల్పునం
 గామముఁ దీర సౌఖ్యమును • గల్గఁగఁ జేసెదఁ, ద్రాగు వారుణిన్
 నీ మది కెక్కు కార్యముల • నిర్భయతం జరియింపు స్వేచ్ఛమై. ౪౦

అర్థములు. గీటణంచి=చంపి, పిల్కుమార్చి = వధించి, మెసవి = తిని, వారుణిన్ = సారాయమును.

తాత్పర్యము

రామలక్ష్మణులఁ జంపి వానరుల నందఱ భక్షించి గట్టునఁ ద్రేపులు పుచ్చుచు నీకు గెలుపు, యిష్టమైన సౌఖ్యమును గలిగించెదను. నీవు సారాయము నీ యిష్టము కొలఁదిఁ ద్రావుము. ఇంకను నీ కిష్టమైన కార్యములందు భయము లేక యిష్టానుసారము వర్తింపుము.

క. భీమాహవ రంగంబున, శామనపురి కేగ మృత్యు•సంగతి నల శ్రీ
 రాముఁడు పడపడి సీతా, భామారత్నంబుఁ బొందు•బాఢముదమునన్. ౪౧

అర్థములు. భీమాహవరంగంబునన్=భయంకరమైన యుద్ధభూమియందు, శామనపురి = యముని పట్టనము, మృత్యుసంగతిన్ = మృత్యుదేవతతో, బాఢముదమ్మునన్ = మిగుల సంతోషముతో.

తాత్పర్యము

ఆ శ్రీరాముఁడు భయంకరయుద్ధమందుఁ జచ్చి యమపురికిఁ బోఁగా నావల సీతాభామారత్నముతో నీవు సంతోషింపుము. రెండవ యర్థము - కర్తృపదము 'నేను' అనునది అధ్యాహారము. నేను భయంకర యుద్ధభూమియందుఁ జచ్చి యమపురమునకుఁ బోఁగా ఆవల శ్రీరాముఁడు సంతోషముతో సీతాభామారత్నమును బొందును. నన్నుఁ జంపినవాఁడు నిన్నుఁ జంపక విడుచునా ? కావున నీవు చచ్చినవాఁడవే. లేదా నీవు యుద్ధమునఁ జచ్చిన పడపడి యని చెప్పినను జెప్పవచ్చును. లేక మన మను పదము కర్తగాను గ్రహింప వచ్చును.

—• ౧౩-వ సర్గము. మహాపార్శ్వుఁడు రావణుతో సీతాదేవిని విడువరాదని చెప్పుట •—

క. రావణుఁడు క్రుద్ధుఁడగుటను, భావించుచు శాంతుఁడగున•పాయము త్రుటి సం
 భావించి మహాపార్శ్వుఁడు, కావించుచు నంజలిన్ స•గర్వోక్తి ననున్. ౧

తాత్పర్యము

నీవు చేసిన పని సరికాదని యాక్షేపించుటచే రావణునకుఁ గోపము వచ్చిన

దని గ్రహించి మహాపార్శ్వుఁ డనువాఁడు వతనికిఁ గోపము చల్లారు నుపాయము కొంచెముకాల మాలోచించి నమస్కరించి గర్వముతో నిట్లనెను.

క. నానామృగ సత్త్వాన్విత, మైన వనం బెల్లఁ జొచ్చి • యటఁ జేపడఁగాఁ
 దేనియను ద్రాగఁ డెవ్వం, డా నరునిం బాలిశుం డ • టందురు ప్రాజ్ఞుల్. ౨౯౧

అర్థములు. నానా = అనేకములైన - మృగ = జింకలు మొదలగువాని తోను, సత్త్వ=పులులు మొదలగు జంతువులతోను, అన్వితము=కూడినది, బాలిశుఁడు = మూఢుఁడు.

తాత్పర్యము

అనేకవిధములైన క్రూరజంతువులు గల యడవికి నెంతో కష్టపడి పోయి యందుఁ దేనె లభింపఁగా దానిఁ ద్రావక యెవఁ డుపేక్షించునో వానిని బుద్ధిమంతులు మూఢుఁ డందురు. అట్లులే నీవు ప్రాణగండమైన కార్యముచేసి, సీతను దెచ్చి యనుభవింపవేని మూఢుఁడవే. తేనె సీతాదేవి యనియు రామలక్ష్మణులు తేనెటీగ లనియు గ్రహింపవగు.

క. ఈశ్వరుఁడవు లోకంబుల, కీశ్వరుఁ డన్యుండు గలుగు • నే నీ కసురా
 ధీశ్వర ! శత్రునిబర్హణ ! శాశ్వతసుఖ మనుభవింపు • త్ర్యామసుతతోడన్. ౨౯౨

తాత్పర్యము

శత్రువుల వధించువాఁడా ? నీవే లోకములకుఁ బ్రభువవు. నీకుఁ బ్రభువు వేఱొకఁడున్నాఁడా ? కావున రాక్షసేశ్వరా ! నీవు సీతతో నిత్యసుఖ మనుభవింపుము.

రెండవ యర్థము. లోకంబులకు రాముఁ డీశ్వరుఁ డవును, ఆయన కీశ్వరుఁడు లేఁడు. కావున సీతను రామున కిచ్చుటచే నామెను గరణముగాఁ జేసికొని శాశ్వత సుఖ మనుభవింపుము.

త్ర్యామసుతతోడన్ =కరణార్థంబునఁ దృతీయఁగా గ్రహింపవలయును. లేక సహార్థంబున గ్రహించిన రాముఁడు కపులతో సేతువు దాఁటెను-అన్నట్లు సీతను నీ విచ్చితివేని నీవు సుఖింతువు. ఆమెయు సుఖించును అని భావము. ఇవి మహాపార్శ్వుని యుద్దిష్టార్థములు గావు.

క. మక్కువతో జానకి నిను, దక్కఁ గొనఁగ నొల్లదేని • తానుగ నీవే
 కుక్కుటవృత్తిఁ జరింపుము, తక్కుము సందేహ మెద సు • ధాభుగ్వైరీ! ౨౯౩

అర్థములు. దక్కఁగొనఁగన్=అనుభవయోగ్యముగాఁ జేసికొన, కుక్కుటవృత్తి=కోడిపుంజువలె,ఆఁడుకోడిని బలవంతముగాఁ బట్టుకొని మగకోడి రమించును. అట్టులే నీవుచేసి సుఖింపుము. ఆమె యంగీకారమునకై నీ వేల కాచుకొనవలె? 'ఎద్దు పడిగియా గంతకట్టుట' యను సామెత నెఱుఁగవా? "క్రుద్ధా మాక్రమ్య భోగస్తు కౌక్కుట స్సోఽపి సౌఖ్యద" యని కామందకము. సుధాభుక్ + వైరి=అమరవిరోధి.

తాత్పర్యము

సీతాదేవి ప్రేమతోఁ దానుగ నీతో సుఖ మనుభవింప నొల్లని దేని కోడి పుంజు కోపించిన యాఁడు పుంజుతో బలవంతముగా రమించునట్లు నీవును రమించి సుఖింపుము అందును సుఖము గలదు.

తే. వేగ నీ వాంఛితము నెఱ • వేఱెనేని, గలుగ నీ భయ ముత్తర • క్షణమునంద
కాక కాలాంతరంబునఁ • గలుగనిమ్ము, వాని నెల్ల సహింపఁగ • వచ్చు నీవు. ౬౪౮

తాత్పర్యము

శీఘ్రముగా నీ కోరిక నెరవేఱెనేని యాయుత్తరక్షణమునందే చచ్చితివా చావుము. లేక కొంత కాలము వెనుక మరణము వచ్చిన రానీ. దానిని నీవు సహింప వచ్చును. ఇప్పుడు నీవు పడు బాధకంటె మరణము గొప్పది కాదనుట.

నీవు సీతను కౌఁగిలించితివేని రాముఁడు కోపించి యానిమిషమందే చంపెనా చంపనీ, సీత యేమో చెడినది, ఇఁక రావణునిఁ జంపి లాభ మేమని పోయినా పోనీ, కాలాంతరమున మరణము రానీ యని భావము.

క. దంభోళిఁ గేలఁ గైకొని, జంభారియు వచ్చెనేని • సమితిక్షితి సం
రంభమునఁ గుంభకర్ణుఁడు, జంభారిజితుండు మేముఁ • జంపుదు మతనిన్. ౬౪౯

అర్థములు. దంభోళి = వజ్రాయుధము, జంభారి = ఇంద్రుఁడు, సమితి క్షితిన్ = యుద్ధభూమియందు.

తాత్పర్యము

రామునిఁ జంపుట యెట్లని యది యొక గొప్పకార్యముగా నాలోచించు చున్నావే, ఏల? వజ్రమును ధరించి యింద్రుఁడు రామునికిఁ దోడుగా వచ్చినను - కుంభకర్ణుఁడు, ఇంద్రజిత్తు, మేము శీఘ్రముగాఁ జంపుదుము. నీదాఁక రానిత్తుమా?

ఉ. ముందుగ సామదానములు • మూఁడవ భేదము శక్తి లేని యా
పందలు మెచ్చుచుంద్రు సలు • పం దగు నందును, శక్తిశాలి దా
నెందును దండనీతిఁ జరి • యించును, గావున దండపద్ధతిన్
పొందుము నీదు వాంఛితముఁ • బూర్ణముగా మనుజాశనాధిపా! ౬౫౦

తాత్పర్యము

రాక్షసరాజా! కొందఱు సీత నిచ్చుట మంచిదని నీకు బోధించుచున్నారు, ఆ విషయమై నాయభిప్రాయము వినుము. శక్తి లేని పిఱికివాండ్రు ముందు సామము, దానము అనియు, నవివ్యర్థము లగునేని భేదము సలుపుట దగు నని మెచ్చుదురు. కాని యది బలవంతుల మార్గము కాదు. శక్తిగలవాఁడు సర్వకాలము లందు దండనీతినే చరించు చుండును. కొట్టి తీసికొను శక్తి యుండఁగా నడుగుకొనుట, లంచమిచ్చుట యేల? కావున నీ కోరికను యుద్ధము చేతనే నెఱవేర్చుకొనుము.

ఉ. వచ్చిన యేని యిచ్చటికి ♦ వైరిసమూహము శస్త్రసంహతిన్
చ్చి వధింప నోపుదుము ♦ వాస్తవ మియ్యది, సందియంబు లే
దిచ్చఁ జరింపు మన్న నసు♦రేశ్వరుఁ డాతని వాక్యజాలమున్
మెచ్చుచు వాని కిట్టులను ♦ మేటిలు చింతను నాత్మవృత్తమున్. ౨౫౭

తాత్పర్యము

పగవారిగుంపు లిచ్చటికి వచ్చినా మేమే వారి నందఱను శస్త్రములఁ జీల్చి చంపుదుము. సందేహము లేదు. నీ యింతట నీవు నీ కోరిక ప్రకారము వర్తింపు మని చెప్పఁగా వానిమాటలను రావణుఁడు మెచ్చుకొని తన పూర్వచరిత్రను విచారముతో నిట్లు చెప్పెను.

మహాపార్శ్వుఁడు చెప్పినట్లు కుక్కుటమువలె వర్తింప సాధ్యము గాదాయె గదా యనియే విచారము.

—♦ రావణుఁడు మహాపార్శ్వునితో బ్రహ్మ తన్ను
శపించిన విధంబుఁ దెలుపుట ♦—

సీ. వినుము మహాపార్శ్వ! ♦ వినిపింతు మత్పురా,వృత్తంబు గోప్య మ♦విశ్రుతంబు
హాటకగర్భుసే♦వార్థ మవ్వీటికై, పుంజికస్థల యను ♦ పువ్వుఁబోఁడి
యభ్రమార్గంబున ♦ నరుగుచు నన్నుఁజూచి, జంకుచు నొదుకుచు ♦ జనుచునుండ
నగ్నిశిఖయుఁబోని♦యద్దానిఁ గనుఁగొని, బలవంతముగను బై♦పటముఁ దెరచి
తే. కోలవిగఁ జేసి విడిచినఁ ♦ గోమలాంగి, నలువసభ కేగ నలిపిన♦నలిన మనఁగ
నబ్జభవుఁడును దాని వృ♦త్తాంతె మెఱిఁగి, కోపమున నాకు నీ గతి♦శాప మిచ్చె.

అర్థములు. మత్పురావృత్తంబు=నా విషయమైన పూర్వచర్య. గోప్యము=రహస్యము, అవిశ్రుతంబు = మఱి యెవ్వరు విననిది, హాటకగర్భు సేవార్థము = బ్రహ్మను గొలుచు నిమిత్తము, అవ్వీటికై=ఆయన సత్యలోకమునకు, కోలవి=దిస మొలది. నలువసభకు = బ్రహ్మసభకు, పైపడి కోలవిగఁ జేసి చెఱచిన నని యన్వయము.

తాత్పర్యము

మహాపార్శ్వ! నా విషయమైన పూర్వచర్య యొకటి వినిపించెద వినుము. అది రహస్యము ఎవరికిని దెలియదు. మును పొకనాఁడు పుంజికస్థల యను యప్సరస బ్రహ్మసేవకై యాకాశమార్గంబునఁ బోవుచు నన్నుఁజూచి భయపడుచు నొదిగి యొదిగి పోవుచుండెను. అగ్నిశిఖవంటి కాంతిగల దానిని నేను బలవంతముగఁ బట్టి చెఱచి చీరలేకుండ దిసమొలదానిని జేసి విడిచితిని. అది నలిపిన తామరవలె బ్రహ్మసభకుఁ బోయెను. బ్రహ్మ దానివృత్తాంత మెఱిఁగి యీ విధముగ నన్ను శపించెను.

ఎంత సిగ్గుమాలిన భోగము దైనను వస్త్రహీనయై సభలోనికిఁ బోవునా యని సందేహింపఁ బనిలేదు. ఆ దినము మేళము దాని వంతు. దానివా అందఱు వచ్చి

యదిమాత్రము రాకుండుటచే బ్రహ్మ యాలోచించి తెలిసికొనెనని గ్రహింపవలెను. మఱి యెవరిదో యేదో వస్త్రముదీసి కట్టుకొని యాలస్యముగా వది సభకుఁబోయెను.

అగ్నిశిఖ యను నుపమానము కాంత్యతిశయముచేఁ జెప్పినను జెప్పవచ్చును. లేదా పురుషులఁ గరఁగించుటయందని చెప్పినను జెప్పవచ్చును. "పొలతి దావవహ్ని పురుషుఁ డాజ్యఘటంబు కరఁగకుండ రాదు కదిసెనేని" యను వాక్యము స్మరింపునది.

క. ఇది మొదలుగ దశకంఠా! మదిలో నిన్నొల్లనట్టి మానిని బలిమిన్
గదిసితివా నీతల యా, పదనున ధర వ్రాలు నూఱువ్రక్కలు గాఁగన్. ౨౫౯

అర్థములు. ఆ పదనున = ఆ సమయమందే, వెంటనే.

తాత్పర్యము

ఇది మొదలు రావణా! నీవు నిన్నొల్లని స్త్రీని బలవంతముగా జెఱుపు సమీపించితివా యా వెంటనే నీ తల నూఱుతునుకలై నేలఁ బడును. ఈ కారణముచేతనే రావణుఁడు సీతను దాఁకినప్పుడు చావకుండినది. రావణుఁడు సీతను నంగీకరింపఁజేసి యావలఁ గూడవలయు నని యభిప్రాయము గలవాఁ డగుటచేఁ జావలేదు.

నలకూబర శాపమొకటి కలదుగదా, యది యేల చెప్పలేదు? ఆ శాపమును రావణుఁడు లక్ష్యము చేసినవాఁడు కాఁడు. శాప మనునది తనకంటె దక్కువ శక్తిగల వానిని బాధించునుగాని తనకంటె గొప్ప తపస్విని బాధింపదు. రావణుఁడు నలకూబరునకంటె గొప్ప తపస్సుచేసిన వాఁడు కావున వాని శాపము పాఱదు. ఆ శాపభయ ముండిన యెడలఁ బుంజికస్థల నిట్లు చెఱచియుండడు. అది దీనికి వెనుకటి వృత్తాంత మందమా యనిన రంభను దాఁకినపుడే రావణుఁడు చచ్చియుండును, నలకూబరశాప ప్రసక్తికిఁ గారణ ముండదు. నలకూబరశాపము వ్యర్థమని తెలిసియే బ్రహ్మ మరల శపించెను.

కం. ఈ శాపభీతిఁ గాదే, యాశింపక యున్నవాఁడ నవనిజఁ; గాదే
నా శయనంబున నెపుడో, యా శంపాదేహఁ గూడనా, జంకుదునా? ౨౬౦

అర్థములు. శాపభీతి=శాపము వలన భయము, శంపాదేహన్=మెఱుపు వంటి దేహము గలదానిని, జంకుదునా=సంకోచింతునా?

ఈ శాపమునకు భయపడి సీతను నాశింపక యున్నానుగాని, యీ భయమే లేనియెడల నెప్పుడో నా పానుపుమీద నామెతోఁ గూడుటకు సందేహింతునా?

ఇవి భర్తని మాటలో - కాముకుని మాటలో చదువరులు గ్రహింపవలెను.

శా. నా వేగం బది సాగరం బెనసెడి న్వాతూలమున్ బోలెడిన్
నా వర్ధిష్ణుగతి ప్రకార మనిఁ, గానన్లేక యిద్దాని నీ
శావామాక్షి నిమిత్త మిచ్చటికిఁ బ్రోద్దామోగ్రసైన్యంబుతో
నే వచ్చెం గపినేత బాసటగఁ బ్రహ్వీ కన్యకాకాంతుఁడున్. ౨౬౧

అర్థములు. అనిన్ = యుద్ధమందు, ఎనసెడిన్ = సరిపోలు చుండును, వాతూలము = సుడిగాలి, వర్ధిష్ణుగతి ప్రకారము = వృద్ధిపొందఁ గలిగిన విధము, కపినేత=సుగ్రీవుఁడు, బాసటగ = సహాయుఁడుగ, పృథ్వీకన్యకా కాంతుఁడున్ = సీతాదేవి మగఁడు.

తాత్పర్యము

యుద్ధమందు సముద్రవేగ మెట్టిదో నా వేగ మట్టిది. సుడిగాలి యెట్లు వృద్ధి చెందునో యట్లు నేను వృద్ధిచెందుదును. ఇది తెలిసికొనలేక సీత నిమిత్తమై యిచ్చటికి సుగ్రీవుఁడు సహాయుఁడుగ పెద్దదండుతో రాముఁడు వచ్చుచున్నాఁడు.

ఇది మహాపార్శ్వుఁడు ౨౧౧౧వ పద్యములో కుంభకర్ణుఁడు, మేము, రాముని జంపెద మన్న మాటకుఁ బ్రత్యుత్తరము. నేను రామునిఁజంపలేక మీసాహాయ్యముఁ గోరుచున్నానని తలఁచితి వేమో అది సరిగాదు. మహాకార్యము రాక్షసుల కందఱకు సంబంధించినది గావున రాజనీతి ననుసరించి మిమ్ము నడుగుచున్నా నని భావము.

ఉ. శైలగుహాప్రసుప్తహరి•సత్తము మ్మాడి నిద్రలేపు నా
పోలికిఁ; గ్రుద్ధమృత్యువుఁ బ్ర•బోధ మొనర్చెడి భంగి, మామకా
భీలభుజంగ సన్నిభసు•విశ్రుతశాతశరాళి రాముఁ డే
వేళను గుర్తెఱుంగఁడని • వేగమ వచ్చెడి నన్నెదుర్కొనన్. ౨౬-౨

అర్థములు. శైలగుహా = పర్వతగుహయందు, ప్రసుప్త = నిద్రబోవు చున్న, హరిసత్తమమున్=శ్రేష్ఠమైన సింహమును, మామక=నాయొక్క, ఆభీల= భయంకరమైన, భుజంగసన్నిభ = పాముతో సమానమైన, సువిశ్రుత = ప్రసిద్ధి కెక్కిన, శాతశరాళిన్ = వాఁడి బాణముల సమూహమును, ఎదుర్కొనన్=ఎదిరించుటకొ.

తాత్పర్యము

కొండగుహలో నిద్రించు పెద్దసింహమును నిద్దుర లేపినట్లు, కోపించిన మృత్యువును మేల్కొలిపిన విధముగ, నా భయంకరములై పాములవంటి బాణములను రాముఁ డెప్పుడు చూచినవాఁడు కాఁడు. కావున నన్నెదిరించి యుద్ధము సేయ నిచ్చటికి వచ్చుచున్నాఁడు.

శా. దంభోళిప్రతిమానమామకధను•ర్దండచ్యుతాభీలబా
ణాంభోవృష్టి సహస్రధాగతిఁ బయి • న్వ్యాపింపఁగా జేయుచుం
గుంభీంద్రంబు వలాతకోటిబలె నా•క్రోశింపఁగాఁ దోలుదున్
జంభద్వేషిసహాయుఁడే రఘుపతిన్ • సంగ్రామ రంగంబునన్. ౨౬-౩

అర్థములు. దంభోళిప్రతిమాన = వజ్రాయుధముతో సమానము లగు, మామక=నాయొక్క, ధనుర్దండచ్యుత=వింటినుండి విడువఁబడిన, ఆభీల = భయంకరమైనబాణము లనెడి, అంభోవృష్టి = నీటివర్షము, సహస్రధాగతి=వేయి విధ

ముల, కుంభీంద్రంబు = శ్రేష్ఠమైన యేనుఁగు, అలాతకోటిబలె = కొఱవికట్టెల సమూహముచేతఁ బోలె, జంభద్వేషి=ఇంద్రుఁడు, సహాయుఁడేన్ = తోడై వచ్చినను,

తాత్పర్యము

నా వింటినుండి వెలువడిన వజ్రాయుధముతో సమానములగు బాణముల వర్షము తనపయి వ్యాపింపఁగాఁ జేసి యేనుఁగును కొఱవికట్టెల గుంపులు చూపి కరువెత్తునట్లు చేయు రీతిగా నింద్రుఁడు సహాయుఁడై వచ్చినను యుద్ధరంగము నందు మొఱ్ఱో యనఁ జేసి రాముని బాఱఁదోలెదను.

ఉ. అల్ల సహస్రనేత్రుఁ డమ • రాధిపుఁ డేనియుఁ బాశహస్తుఁ డ
బ్వల్లభుఁ డేని నాజి నిలు • వం గలఁడా నను దాఁకి? శ్రీదు పెం
పెల్ల నణంచి లంక హరి • యింపనె! తద్బల మెంత? చుక్కలన్
బొల్లువడంగఁ జేయు నవ • పూషుని భంగిని దేజ మాపెదన్. ౨౬౮

అర్థములు. సహస్రనేత్రుఁడు = వేయికన్నులు గలవాఁడు, అమరాధిపుఁడు=ఇంద్రుఁడు, పాశహస్తుఁడు = పాశములను జేత ధరించిన, అప్ + వల్లభుఁడు=జలాధిపతి, వరుణుఁడు, ఆజిన్ = యుద్ధమందు, శ్రీదు = కుబేరునియొక్క తద్బలము=రామునిబలము, నవపూషుని భంగిన్=క్రొత్తసూర్యునివలె.

తాత్పర్యము

వేయి కన్నులు గలయా యింద్రుఁడైనను, పాశములఁ జేతధరించిన వరుణుఁడైనను నన్నెదిరించి యుద్ధమునందు నిలువఁగలఁడా? కుబేరుని గర్వ మణఁగఁ గొట్టి లంకను హరించితిని గదా! ఇఁక రాముని బల మెంత? ఉదయించు సూర్యుఁడు నక్షత్రముల కాంతి హరించినట్లు రాముని సేనను రూపు మాపనా?

—• ౧౪-వ సర్గము. విభీషణుఁడు సీతాదేవిని శ్రీరామున కిమ్మని రావణునకు బోధించుట •—

క. దనుజకుల సార్వభౌముం, డనుమాటలుఁ గుంభకర్ణుఁ • డతి గర్జితముల్
విని విని విభీషణుం డి, ట్లను దశకంఠునకు హితము • నర్థయుతముగన్. ౨౬౯

అర్థములు. అతిగర్జితముల్ = వ్యర్థములైన యఱపులు, మొదట నీతి బోధించినట్లె బోధించి కడపట రావణు నభిప్రాయములోనే కలిసికొనెను. ఏమేమో వదరెను. అర్థయుతముగన్ = ప్రయోజనముతోఁ గూడినట్లు, ఇట్లనుటచే రావణ కుంభకర్ణుల మాటలు ప్రయోజనము లేని వని భావము.

తాత్పర్యము

రావణుఁడు చెప్పిన మాటలు, కుంభకర్ణుని వదరుటలు వినివిని హితముగ సప్రయోజనముగ విభీషణుఁ డిట్లనెను.

మ. తత బాహ్యాంతరభోగరాశి ధ్భృతచిం • తాకాలకూటంబు ను
గ్రతరస్మేరనిశాతదంష్ట్రికరశా • ఖాపంచకస్ఫారవి

స్తృతపంచోగ్రశిరోతికాయము పతీ • సీతామహాశీవిషం
బతిమేధావివి కట్టి తేఁ దగ వో•నా దాని భావింపుమా. ౨౬

అర్థములు. పతీ=రాక్షసరాజా, తత=విస్తారమైన, బాహు + అంతర = ఱొమ్మనెడి, భోగరాశి=గొప్పపడగ గలది. (౨) తత=అధికమైన, బాహ్వంతర= ఱొమ్మునందలి, కౌఁగిలింత యందలి, భోగరాశి=సౌఖ్యాతిశయ మనెడి, (౩) తత= విశాలమైన, బాహ్వంతర = బారెఁడు కొలఁతగల, భోగరాశి=శరీరము నిడుపు గలది. ఆవృత్తిచే రూపకము, భృశచింతాకాలకూటంబు=గొప్పవ్యసన మనెడి విషముగలది. సీతాచింత ప్రాణము హరించునది కాన విష మనఁబడెను. ఉగ్రతర= మిగుల భయంకరమైన, స్మేర=చిఱునవ్వనెడి, నిశాత దంష్ట్రి=వాఁడియగు కోఱ, కరశాఖా పంచక = చింతాకాలమునఁ దలపైఁ బెట్టుకొనఁబడిన చేతియొక్క వ్రేళ్ళనెడి, స్ఫార=ప్రకాశమానమును, విస్తృత = విచ్చినదియు నగు, పంచ = అయిదును, ఉగ్ర = భయంకరము నగు, శిరోతికాయము=తల లనెడి యతిశయమైన శరీరభాగము గలది, సీతామహాశీవిషంబు=సీత యనెడి గొప్పపాము, తాఁకి నంతమాత్రముననే చంపునది. అతిమేధావివి = మిగుల బుద్ధిబలము గలవాఁడవు. మేధావి-పతి శబ్దములు నిందాగర్భితములుగాఁ జెప్పినను జెప్పవచ్చును. సీతను మరల నీయఁగూడ దని రావణుఁడు చెప్పిన దానికిది ప్రత్యుత్తరము. ఎందో యున్న సీతను నీ వేమని తెచ్చితివి? పొత్తుగానికి పొత్తు నీయఁ గూడ దనుట యేమి యాలోచించి చెప్పితివి. బుద్ధిబలము గలవాఁడ వైనచోఁ జెప్పు మని భావము.

తాత్పర్యము

విశాలమైన ఱొమ్మనెడి దేహము, చింత యను విషము, చిఱునవ్వనెడి కోఱ తలపై నుంచుకొనిన వ్రేళ్ళనెడి పడగలు గల సీత యనెడి మహావిషసర్పమును బుద్ధిమంతుఁడా తీసికొని వచ్చుట తగునా యాలోచింపుము.

క. భూమిధర కూటనిభు లుద్దామనఖాయుధులు భూరి•దంష్ట్రిలు క్రోఁతుల్
భీమగతి రాక మున్నే, రామునకున్ సీత నిమ్ము • రాక్షసరాజా! ౨౭

అర్థములు. భూమిధరకూటనిభులు = పర్వతశిఖరములతో సమానులు, ఉద్దామనఖాయుధులు=గొప్ప గోళ్ళాయుధములుగాఁ గలవారు, భూరిదంష్ట్రిలు = పెద్దకోఱలు గలవారు, భీమగతి=భయంకర విధముగ.

తాత్పర్యము

రాక్షసరాజా! నీవు రాక్షసులను రంజింపఁజేయుట నీకుఁ గార్యము కాని వారికిఁ జేటు దెచ్చుట నీకార్యము కాదు. నీవు చేసిన పనివలన కీడు నీ యొక్కనితోఁ బోదు. పర్వతశిఖరములవలె నెత్తైనవారును, గోళ్ళు కోఱలు నాయుధములుగాఁ గల వారును, భయంకరమైన గమనము గలవారు నగు క్రోఁతులువచ్చి ముందు లంకను

ముట్టడించి పౌరులను బాధింతురు. ముందు బాధపడువారు రాక్షసులే. అందఱకు వెనుక నీవు, కావున వానరులు రాకముందే రామునకు సీత నిమ్ము.

క. సామీరజవము లశని, గ్రామనిభము లైన రామ•కాండము లసుర
స్తోమముల తలలు ధరఁ బడఁ, బ్రామిక మును సీత నిమ్ము•రఘురామునకున్.

అర్థములు. సామీర = సామీరశబ్దము సంబంధార్థకమున అణ్ప్రత్యయాంతము, సమీర సంబంధముగలది, పురుష-పౌరుష, నరక - నారకాదులవలె సమీరమే సామీర మని చెప్పినను జెప్పవచ్చును. సామీరజవములు = వాయువేగముగలవి, అశనిగ్రామ నిభములు = పిడుగుల సమూహముతో సమానము లైనవి. కాండములు = బాణములు, అసురస్తోమముల = రాక్షస సమూహముల, ప్రామికమును=తఱుగుటకు ముందే.

తాత్పర్యము

ఒక్క వానరుఁడే యింత చేసినపుడు అందఱు వానరు లెంత చేయలేరు. ఆలోచింపుము. వానరు లట్లుండనీ, వారికంటె ముందు వాయువేగము గలవై, పిడుగుల గుంపుతో సమానములై రామబాణములువచ్చి రాక్షసులతలలు నేలఁబడ నఱకును. అవి రాకముందే సీతను రామున కిమ్ము. నీ వలన రాక్షసుల కందఱ కింతచేటు గలుగఁగలదు.

ఆ. కుంభకర్ణుఁడైనఁ • గుంభనికుంభులు, నైన నింద్రజితుఁడై • నయినఁగాని
యా మహోదరుఁడు మ•హాపార్శ్వుఁ డీయతి, కాయుఁడైన రాముఁ•గలరె చెనక.

తాత్పర్యము

వానరులు, రాముఁడు వచ్చిన నిందుండు వారందఱు నిద్రపోవుచున్నారను కొంటివా యందువేమో? కుంభకర్ణుఁ డైనను, కుంభ నికుంభు లైనను, నింద్రజిత్తైనను, మహోదర మహాపార్శ్వులైనను రాముని జెనకఁ గలరా?

ఉ. భానుఁడు నిన్నుఁ గాచిన సు•పర్వచయంబులు ప్రోచినన్ దయా
న్యూనముగా బలారియు ని•జోరుతలంబున నిన్నుఁ జేర్చినన్
మానక మృత్యు వడ్డపడి•న న్బలిసీమ మఱుంగిన న్బ్రహ
స్తా! నిను రామచంద్రుఁ డనిఁ • బ్రాణముతో విడువం డెఱుంగుమీ. ౨౦

అర్థములు. భానుఁడు=సూర్యుఁడు, సుపర్వచయంబులు = దేవతాసమూహములు, దయ+అన్యూనముగాన్ = కొఱఁతలేనిదయతో, బలారి = ఇంద్రుఁడు నిజోరుతలంబునన్ = తన తొడయందు, బలిసీమన్ = పాతాళమందు 'అధోభువన పాతాళే బలిసద్మ రసాతలమ్' అని యమరుఁడు. మఱుంగినన్ = దాగికొనినను, అనిన్ = యుద్ధమందు.

తాత్పర్యము

ప్రహస్తా! నీవు అవానరంబుగాఁ జంపెద నంటివి. (చూ-స. ౧౫౧)యుద్ధము

నందు నీవు రాము నెదిర్చితివా సూర్యుఁడు తనలో నిన్నుఁ బెట్టుకొని రక్షించినను, దేవతాసమూహములు ముప్పదిమూఁడుకోట్లు కాపాడినను, నీ యందు నిండారు దయతో నింద్రుఁడు తన తొడలో నిను దాఁచినను, ఇప్పుడు వీనిని జంపవల దని మృత్యుదేవత యడ్డుపడినను, పాతాళలోకమునకుఁ బోయి దాగికొన్నను రాముడు నిన్ను బ్రాణములతో వదలఁడని తెలిసికో.

చ. అనుడు విభీషణోక్తికిఁ బ్ర • హస్తుఁడు మా ర్వచియించె మాకు నా
యనిమిషసిద్ధ కింపురుష • యక్షనగాహులచేత నేనియుం
బొనరదు వో భయంబు, రఘు • పుంగవుఁడౌ నరనాథపుత్రుచే
మొనయు నె? యేల యిట్టులు మ • ము న్బెదరించెదు రిక్తమాటలన్. ౨౭౧

అర్థములు. విభీషణోక్తికిన్=విభీషణుమాటకు, మాఱు=బదులు.

తాత్పర్యము

అని చెప్పిన విభీషణుని మాటకుఁ బ్రహస్తుఁడు బదు లిట్లు చెప్పెను. దేవతలు, సిద్ధులు, కింపురుషులు, యక్షులు, వాసుకి మొదలగు నాగులను సర్పములు వీని చేతనైనను మాకు భయము లేదు. నిశ్చయము. ఇఁక రాజకుమారునిచేతనా మాకు భయము కలుగును. ఏల మమ్ము వ్యర్థవాక్కుల బెదరించెదు.

—• విభీషణుఁడు ప్రహస్తుని గర్హించుట •—

సీ. అన్నఁ బ్రహస్తు వా • క్యంబుల నాలించి, ధర్మార్థకామ త • త్పరమనస్వి
ప్రభుహితైషణుఁ డయి • గ్రాలు విభీషణుం, డనియెఁ బ్రహస్త యి • ట్లాడెదేల?
యీవు మహోదరుం • డీ కుంభకర్ణుండుఁ, జలుపు యోజన రామ • చంద్రుపట్ల
ధర్మవిరుద్ధవ • ర్తనులకు స్వర్గంబు, ఫలియింపనట్లు స • ఫలతఁ గనదు
క. కలము లేనివాఁడు • జలనిధిఁ దరియింపఁ, దలఁచినట్లు కార్య • దక్షుఁ డైన
జానకీహృదీశు • నే నైన నీ వైన, సకలదనుజు లైనఁ • జంపలేము. ౨౭౨

అర్థములు. ధర్మార్థకామతత్పర మనస్వి = ధర్మార్థకామములం దాసక్తి గలవాఁడు, గొప్ప మనస్సు గలవాఁడు, ప్రభుహితైషుఁడు = ప్రభువు మేలుగోరువాఁడు, ధర్మవిరుద్ధవర్తనులకు = ధర్మమునకు విరోధముగ నడచుకొనువారికి, కలము=ఓడ.

తాత్పర్యము

ప్రహస్తుఁ డిట్లు చెప్పఁగా విని ప్రభువుమేలు గోరువాఁడగుటచే నతని ధర్మార్థకామములందు విశేషాసక్తిగల విభీషణుఁ డిట్లనియె. ప్రహస్తా! యేల యిట్లు మాటలాడెదవు? నీవు, మహోదరుఁడు, ఈ కుంభకర్ణుఁడు రామచంద్రమూర్తి విషయమునఁ జేయు నాలోచన నధర్మవర్తనునకు స్వర్గము ఫలింపనట్లు ఫలింపదు. ఓడలేనివాఁడు మహాసముద్రమును దాటలేని యట్లు శక్తిలేనిమనము కార్యనిర్వహణమందు సమర్థుఁ

డగు రాముని, నేను నీవు సకలరాక్షసులు కలసినను జంపలేము. అట్లు చంపసాధ్యమైన యెడల నేనేల యిట్లు చెప్పుచున్నానని యైన నీవాలోచింపవలదా?

తే. పరమధర్మైకనిరతు నిక్ష్వాకవంశ, భవు మహారథు రాజేంద్ర • వర్యు, గార్య
దక్షు రణభూమి నెదుర న • దక్షు లగుచు, సూక్షిగా వేల్పు లెల్లరు • మూఢులైరి.

అర్థములు. పరమధర్మైకనిరతున్ = కేవల ధర్మమే పర మని దానియందాసక్తిగలవాఁడు, అయన గెలుపుట కిది యొకటియే చాలును. 'ధర్మోజయతి' 'ధర్మో రక్షతి రక్షిత' యన్నట్లు తన్ను రక్షించునది ధర్మము. కావున ధర్మబలమాయనకుఁగలదు, మనకు లేదు. ఇక్ష్వాకువంశభవున్=గొప్ప వంశంబున-ఇక్ష్వాకువంశమునఁ బుట్టినవానిని, పరాక్రమము జన్మసిద్ధమని సూచన. మహారథున్=తన్ను సారథిని గుఱ్ఱములను గాపాడుకొనుచు శత్రువుల సంహరించువానిని, తనవారినిఁ జావనీయక యెదుటివారిని జంపువాఁడు మహారథుఁడు. "ఆత్మానం సారథిం చాశ్వాన్ రక్షన్ యుధ్యతి యో నరః। స మహారథసంజ్ఞస్స్యా దిత్యాహుర్నీతికోవిదా" యను వచనము స్మరింపనగు. రాజేంద్రవర్యున్=రాజశ్రేష్ఠులలో శ్రేష్ఠుఁడగువానిని, కార్యదక్షున్=కార్యము సాధించు సామర్థ్యము గలవానిని' రామమూర్తిని.

తాత్పర్యము

ధర్మమే పరమమని దానియందుఁ బ్రీతిగలవాఁడును, ప్రసిద్ధికెక్కిన యిక్ష్వాకువంశమందుఁ బుట్టినవాఁడును, మహారథుఁడును, రాజులలో నుత్తమోత్తముఁడును, కార్యసాధన సామర్థ్యము కలవాఁడును నగు రామచంద్రుని నెదిరింపలేక దేవతలు గూడ నాయనశక్తి యింత యని తెలిసికొనలేకపోయిరి. ఇఁక మన మెంతమాత్రము.

ఉ. సాటి వచింపరాక హరి • శంబసమానజవాన్వితం బసూ
ద్ఘాటన కర్మశీల మగు • దాశరథిప్రవిముక్తము న్నిరా
ఘాటము నైన తచ్ఛరని • కాయము పోరఁ బ్రహస్త నీ మెయిన్
నాటవు పూర్వ, మా కతము • న న్గద పగ్గెలు కొట్ట దివ్యోడన్. ౧౪

అర్థములు. హరిశంబ సమాన = ఇంద్రుని వజ్రాయుధముతో సమానమైన, జవ = వేగముతో, అన్వితము=కూడినది. అసు + ఉద్ఘాటన కర్మశీలము = ప్రాణముల లేవఁదీయు పని స్వభావముగ గలది. బాణముతగిలినా ప్రాణముపోవుట నిజమని భావము, దాశరథి ప్రవిముక్తమున్ = రామునిచే విడువఁబడినది. నిరాఘాటము = అడ్డములేనిది, తత్ = ఆ రామచంద్రునియొక్క, శరనికాయము = బాణసమూహము, పోరన్=యుద్ధమందు, నీమెయిన్=నీ దేహమునందు, నాటవు= నాటినవి కావు, ఆ కతమునన్ = ఆ కారణముచే, పగ్గెలు కొట్టెదు = ప్రజ్ఞలు పలుకుచున్నావు, గర్వించి పలుకుచున్నావు.

తాత్పర్యము

సమానమైన వని చెప్పుటకు సాధ్యపడక యొక వేళఁ జెప్పవలసివచ్చిన నింద్రుని

వజ్రాయుధము వేగమువంటి వేగముతోఁ గూడినవై, ప్రాణములు తీవఁదీయుట స్వభావకర్మమై, రామునిచే విడువఁ బడినవై యెదురు లేనివగు రాముని బాణములు నీ దేహమందు యుద్ధరంగమున నింతకుఁ బూర్వము నాటినవి కావు. కావుననే యిట్లు జ్ఞానముచే గర్వించి పలుకుచున్నావు.

ఓయి విభీషణా! రామబాణములు నాకుఁ దగులలేదు. కావున వాని జవసత్త్వములు నాకుఁ దెలియవు. నీకును నవి తగులలేదుగదా. నీ వనుభవము గలవాని వలె మాటలాడుచున్నాఁడవే. అది యెట్టు లనెదవా? అకంపనుఁ డేమి చెప్పెనో మఱచితివా? (అరణ్య-స-౮౧౩-౮౧౪-౮౧౬-౮౧౭-౮౧౮-౮౧౯) "ఈ వొక్కఁడంచుఁ బల్క నదియేటికి లోకమునందుఁగల్గు రక్షోవరలోక మంతయును గూడియు నాతని డాయలేవు" అని వాఁడు చెప్పలేదా. శూర్పణఖ యేమిచెప్పెను? వినలేదా? (అరణ్య ౫౩౦వ ప.) ఇవి నీవు నేను నిచ్చటనుండు ప్రముఖులు విన్నవారే కదా! మారీచుఁడీ రాక్షసరాజున కేమి చెప్పెనో యది యచ్చటివారు పదపడి చెప్పఁగా వినలేదా? (మా. ౨౫౭-౨ పద్యము) యుద్ధప్రియుఁడైన మనరాజు పూర్వము స్త్రీలను వారి మగవారిని జయించి తెచ్చినట్లు తేక సీతను, మోసగించి దొంగతనముగాఁ దేవలసిన పని యేమివచ్చెను? ఆ బాణములకు భయపడియే కదా! అప్పుడు యుద్ధము వలదని చాలించుకొన్నవాఁడు ఇప్పుడు యుద్ధమునకు దిగఁ గారణమేమి? పూర్వము లేని వానరబలమిప్పుడు రామచంద్రున కెక్కువగాఁ గలిగెఁగాని మనకుఁ బూర్వమున్న బలమేకదా! మన రాజులతో సమానబలుఁడు కాఁడా విరాధుఁడు? మనరాజుకంటె బలిష్ఠుఁడు కాఁడా వాలి? ఇవి యన్నియు నీవాలోచింపవైతివి గదా! మొట్టమొదట నీ యింటికే కదా హనుమంతుఁడు చిచ్చుపెట్టెను. నీ యాఁడువారు నడివీధిలోఁబడి యేడ్చినపుడు నీవు నిద్రపోవుచుంటివా? ఇవి యన్నియు నాలోచించిన యుద్ధము ప్రశస్తమని నీ కెట్లు తోఁచెను. నీ యాలోచనప్రకారము పోయినఁ గీడెవ్వరికో యాలోచించితివా? హనుమంతుఁడు నగరమంతయుఁ దగులఁబెట్టినపుడు మేమేమటి యుంటి మను మాట యేమి మాట? మీ రంద రేకమైనను మీ మీ యిండ్లను గాపాడుకొనఁ గలిగిరా? స్వపరబలాబలములు విచారింపవలదా?

ఉ. ఎందనుకన్ దురాసద మ♦హీననిశాతము తీవ్రవేగితా
స్యందముఁ గంకపత్రమును ♦ క్ష్మాతనయాధవహస్తముక్తని
ర్మందశిలీముఖోచ్చయ మ♦మంథరరీతిని నిన్ను వ్రచ్చునో
యందనుకం బ్రహస్త! యిటు ♦ లాడుచు నుండు వికత్థనంబులన్. ౨౮౫

అర్థములు. దురాసదము=సహింపరానిది, అహీననిశాతము = మిక్కిలి వాఁడిగలది, తీవ్రవేగితాస్యందము=మిక్కిలి వేగమునుండి జాఱునది, అతివేగముతోఁ గూడినది, కంకపత్రమును = గ్రద్దయాకెలు కట్టఁబడినది, క్ష్మాతనయాధవ = రామునియొక్క, హస్త=చేతినుండి, ముక్త=విడువఁబడిన, నిర్మంద = మందము

గాని, శిలీముఖోచ్చయము = బాణసమూహము, అమంథర రీతిని = అడ్డములేని విధముగ, ప్రచ్ఛనో=చీల్చునో, వికత్థనంబులన్=ఆత్మస్తుతి వాక్యములు.

ఉ. రావణుఁడైనఁ గాని సుర•రాజజితుండును గుంభకర్ణుఁ డే
నీ వయినం ద్రిశీర్షకుఁడ • యేని నికుంభనరాంతకాదు లేన్
గ్రావసమానసారగుఁ డ•కంపనుఁ డే నతికాయుఁ డేని నీ
లావిభుదృష్టి మార్గమునఁ • దాళరు నిల్వఁగ సంగరంబునన్. ౧౬

తాత్పర్యము

ప్రహస్తా! నీ వొకఁడవే కావు. రావణుఁడైనను, ఇంద్రజిత్తయినను, గుంభకర్ణుఁ డయినను, త్రిశిరుఁడైనను, నికుంభనరాంతకాదులైనను, పర్వతమంత బలము గల యకంపనుఁడైనను, అతికాయుఁడైనను వీరు వేఱు వేఱుగాఁగాని యందఱు కలసికాని యుద్ధమందు రాముని కనుచూపుమేరలో నిలిచి సహింపలేరు. అందఱను గలిపి చెప్పుటకే తాళరని బహువచన ప్రయోగము.

ఉ. మీర లమిత్రతుల్యు లయి • మిత్రులు నా వ్యసనాభిభూతుఁ డై
క్రూరతరస్వభావుఁ డయి • కొంచక తా ననమీక్ష్యకారి యై
కారియము ల్ఘటించు సుర•కంటకనాథునకున్ నిశాట సం
హార వినాశనార్థముగఁ • బంచన చేరితి రేమి చెప్పుమన్. ౧౭

అర్థములు. అమిత్ర తుల్యులు = పగవారితో సమానులు, "అపకారార్థి లక్షణైః"మ్మన్నట్లు కీడుచేయువాఁడే పగవాఁడు, మిత్రులునా=స్నేహితులను పేర, వ్యసనాభిభూతుఁడై=సప్తవ్యసనములలోఁ జేరిన స్త్రీ వ్యసనముచే ఆవరింపఁబడినవాఁడై, అనమీక్ష్యకారియై=ఆలోచనలేక కార్యము చేయువాఁడై, సురకంటక నాథునకున్ = రాక్షసరాజునకు, నిశాట సంహార వినాశనార్థముగన్ = రాక్షసులందఱు నాశమై పోవుటకు.

తాత్పర్యము

ప్రహస్తా! శత్రువులు చేయవలసిన పనులు మీరు చేయుచున్నారు. పేరునకు మిత్రులవలె నటించుచున్నారు. ఇట్టి హితశత్రువులు మీరు వ్యసనములచే మతిచెడి, మిగులఁ గ్రూరమైన స్వభావము గలవాఁడయి, యాలోచనలేక సందేహింపక, యే పనియైనఁ జేయు రావణునొద్ద సకలరాక్షసులు నాశమైపోవుటకొఱకుఁ జేరియున్నారు. ఇట్లు సర్వవినాశకు లగు మీకు నేనేమి చెప్పఁగలను?

క. శిరములు వేయియు నంతయుఁ, బరికింపఁగ రాని మేను • భయదాకృతియున్
గురుబలమగు నహిచుట్టైనను బరిరక్షితుఁ జేయరయ్య•ప్రసభమునఁ బతిన్. ౧౮

అర్థములు. గురుబలము = గొప్పబలము, అగు = కల, అహి=రామునిద్వేషమను పాము, ప్రసభంబునన్ = బలాత్కారమున, పరిరక్షితున్=బాగుగా గాపాడఁబడిన వానిని,

తాత్పర్యము

వేయితలలు కలిగి తుదకానరాని దేహము, భయంకరమైన యాకారము, గొప్పబలముగల రామద్వేషమను పాము రాక్షసేశ్వరుని జుట్టుకొనినది. ఆయన దానినుండి తప్పించుకొనలేక మతిచెడియున్నాఁడు. మీరైనను బలవంతముగ నాయనను బైకిలాగి రక్షింపుఁడు.

క. పరిపూర్ణకాములగు హిత, వరులెల్లరుఁ జేరి కావ•వలయును రాజుం
గురు లొడిసిపట్ట శత్రూ, త్కర మరుదేరకయ మున్న•గ్రహవిద్ధు బలెన్. ౨౯

అర్థములు. పరిపూర్ణకాములు=రావణునివలన వారి వారి కోరికలన్నియు సంపూర్ణముగా నెఱవేర్చుకొన్నవారు. ఇంతవఱకు నాయనసొమ్ము కావలసినంత దినినవారు, హితవరులు = ఆయన మేలుగోరువారిలో నుత్తములు, హితకాంక్ష యున్నను శక్తిలేని వారేమి చేయగలరు? శత్రూత్కరము విరోధుల సమూహము గ్రహవిద్ధుబలెన్ = దయ్యము పట్టినవానివలె.

తాత్పర్యము

ఇంతవఱకు రావణుని ద్రవ్యము కోరికదీరఁ బూర్ణముగాఁ దిని యుతని మేలు కోరువారిలో నుత్తములగు వారు ఆయనను గ్రహపీడ గలవానిని మంత్రముచే రక్షించునట్లు శత్రువులువచ్చి తలవెండ్రుకలు పట్టుకొనకముందే రక్షింపవలయును. అట్లు చేయలేని కృతఘ్నులు, ద్రోహులు నగుదురు. ఆయన బాగుండినఁగదా యింకను మీరు దినవచ్చును. కావున మీ మేలుకోరియైన నాయనను రక్షింపుఁడు.

దీనిని మఱియొకవిధముగ నన్వయింపవచ్చును. పరిపూర్ణకాములగు హితవరులెల్లరుఁ గురులొడిసిపట్ట రాజు జేరి శత్రూత్కర మరుదేరకయ మున్న కావవలయును.

మైత్రిగలవాఁడు తన మిత్రుఁ డకృత్యములు చేయుచుండెనేని వాని తలవెండ్రుకలు పట్టి యీడ్చియైన వానినుండి తప్పింపవలయు ననియే నీతిశాస్త్రము చెప్పుచున్నది.

"ఆకేశగ్రహణాన్మిత మకృతేభ్యో నివర్తయేత్" నీళ్ళలోబడి మునుఁగుచు దేలుచుఁ జచ్చుటకు సిద్ధముగా నుండువానిని దలవెండ్రుకలు పట్టిలాగికదా బయట వేయవలయును.

తే. ప్రళయకరమైన సౌమిత్రి•జలధిలోన, మునిఁగి శ్రీరామపాతాళ•ముఖముఁజొచ్చు
పంక్తికంఠునిఁ గావరే•ప్రాజ్ఞులార, పట్టి బలవంతముగ నైన•బయట వేసి. ౩౦

తాత్పర్యము

సర్వవినాశకరమైన లక్ష్మణుఁడను సముద్రములో మునిఁగి శ్రీరాముఁడనెడి బడబాగ్నియందుఁ బడబోవు రావణుని,బుద్ధిమంతులారా! బలవంతముగనైనబయట వేసి రక్షింపుడు. "పాతాళం బడబాగ్నౌచ" యని నిఘంటువు. ఇక్కడ నీశబ్దమున

కీ యర్థమే తగినది. పాతాళలోక మనినచో నది రావణునకు మేనమామలు, తాతలుండు స్థలము గనుక సుఖమే.

క. ఈయది లంకకు నసురని, కాయమునకు రాజునకును ♦ గడుమే లిచ్చున్
జేయ నిటు తగును సీతా,నాయకునకు సీత నీయ ♦ నా మతము సుఁడీ. ౨౧

తాత్పర్యము.

ఈ ప్రకారము మీరు చేసితి రేని రాక్షససమూహమునకు, రావణునకు మిగుల మేలు గలుగును. ఇది చేయఁదగిన కార్యము. రామచంద్రునకు సీత నిచ్చుట మేలని నా యభిప్రాయము.

క. తనబలము నెదిరిబలమును, దన స్థానము ♦ క్షయము వృద్ధి దాయలవిధమున్
దనమదిఁ దలంచి లెన్నగఁ, దన జేనికి హితముఁ గూర్పఁ♦దగు మంత్రులకున్.

అర్థములు. ఎదిరిబలము = విరోధిబలము.

తాత్పర్యము

మంత్రులారా! మీరు చేయరాని పని చేయుఁడని మీకు నేను చెప్పరాలేదు. మంత్రులగు మీరు చేయవలసిన కార్యము మీకు నేను జేయుఁడని చెప్పుచున్నాను. ఏమి మాకార్య మంటిరా? మనరాజు బల మెంత? శత్రుబల మెంత? స్థానము= స్థితి, తనస్థితి యెట్టిది? శత్రుస్థితి యెట్టిది? శత్రువులు తగ్గియున్నారా? మనము తగ్గి యున్నామా? వృద్ధి శత్రువుల కున్నదా? మన కున్నదా? యని యాలోచించి తన రాజునకు మేలగు దానిని జెప్పుట మంత్రికృత్యము. దానినే మీరు చేయుఁడని చెప్పుచున్నాను. స్థాన మనఁగా నిచ్చట దండెత్తి పోక నిలచుట. ఇది సంధి విగ్రహము యానము ఆసనము ద్వైధము ఆశ్రయమను వానిలోనిది. ఈ యాసన మైదు విధములు. సంధాయాసనము, ప్రసంగాసనము, విగృహ్యాసనము, సంభూయాసనము, ఉపేక్ష్యాసనము. శత్రువులు క్షీణదశయం దుండిన దండెత్తిపోవలయును. శత్రువులు వృద్ధియం దుండిన సంధి సేయవలయును. సమానులుగ నుండిన నాసనము తగును. ఇప్పుడు శత్రుపక్షము వృద్ధిలో నున్నదా, మనపక్షము వృద్ధిలో నున్నదా? ఆలోచించితిరా? సీతాహరణకాలమున రామలక్ష్మణు లిరువురు మాత్రమే. అప్పుడు వారిఁ బలము తక్కువ. మనమాదండెత్త దగిన యప్పు డుపేక్షించి యూరకుంటిమి. ఇప్పుడో వారికి వృద్ధికాలము. వానరసేన యంతయు వారి పక్షమందేయున్నది. మనకు క్షయకాలము. మనపక్షమువా రగు ఖరాదులు, వాలి చచ్చిరి. ఇచ్చట నక్షకుమారాదులు పలువురు చచ్చిరి. పాతికసేన నాశ మయ్యెను. కోటలు విఱిగిపడెను. కావున నిది సంధికిఁ గాలముగాని కలహమునకుఁ గాలము గాదు. ఇది యాలోచించి మీ కృత్యము మీరు చేయుఁడు.

విభీషణుఁడు మంత్రికృత్యములు న్యాయ్యముగనే చెప్పెను. కాని మంత్రు లందఱుఁ గలసి సీత నిమ్మని చెప్పినను రావణుఁడు వినియుండునా? యనఁదిన

సందేహము. "ద్వావిమౌ పురుషౌ మూర్ఖౌ దుర్యోధన దశాననౌ। గోగ్రహం వన భంగంచ, దృష్ట్వా యుద్ధం పునః పునః" లోకములో మూర్ఖు లిరువురు. దుర్యోధనుఁడు, రావణుఁడు. ఉత్తరగోగ్రహణమందు దెబ్బఁదినియు దుర్యోధనుఁడును, వన భంగముఁజూచియు రావణుఁడును మరల యుద్ధము సేయఁబూనిరి.

—అన్నట్లు మంత్రు లందఱుఁ గలసి సీత నిమ్మని చెప్పినను రావణుఁడు వినియుండఁడు. అప్పుడు జరుగవలసిన దేమి? అందఱు రావణునితో విరోధింపవలయును గదా. అందఱు విరోధించియు నేమి చేయఁగలరు? వాఁడు పైఁబడి చంప మొదలు పెట్టిన నప్పు డేమిగతి? రాక్షసులచేత వాఁడు చావఁడు. అప్పుడైనను లంక పాడుకావలసినదే కదా. అందఱు లంకవిడిచి యెందుఁ బోఁగలరు? కావునఁ బ్రహస్తాదులు రావణునకుఁ దెగఁజెప్పక యతనినే యనుసరించిరి. పెట్టి వన్నినాళ్ళు దిని సమయము వచ్చినప్పుడు తాను తప్పించుకొని వాఁడొకఁడే చచ్చుచుండఁ జూచుటయు సరిగాదు కదా. ఈ యాలోచన విభీషణున కేల కలుగలేదు? అధర్మమున వర్తింపలేక, సర్వబంధు వినాశము చూడలేక, అందుఁ దాను భాగము గొనలేక. మంత్రు లందఱు రావణుతో విరోధించి రనుకొందము. అప్పుడు రావణుఁడు వారి నుపేక్షించి నేను సీతనీయను మీరు తోడురాకుండిన నేనొక్కఁడనే యుద్ధము చేసెదను. గెలిచిన గెలుతును, చచ్చిన జత్తును-అని యూరకుండెననుకొందము. అప్పుడు జరగవలసిన దేమి? వానరులు లంకను ముట్టడి వేసినప్పుడు రావణుఁ డొకఁడే యుద్ధమునకుఁ బోయిన వాని కొడుకులు, తమ్ము లూరక చూచుచుందురా? వారుపోయిన వారి పోష్యవర్గ మూరకుందురా? అప్పుడీ మంత్రు లేమి చేయఁగలరు? వారు మాత్ర మెట్టు లింట నూరకుండఁ గలరు. ఉండి రనియే తలంతము. వానరులు లంకలోఁ బ్రవేశించి తమ కొంపలపైఁ బడినపుడు తమ నిమిత్తమైన యుద్ధము చేయవలయును గదా! ఇట్లు నానాముఖముగ యుద్ధము చేయుట మేలా? ఏకముఖముగా యుద్ధముచేయుట మేలా? ఇవన్నియు నాలోచించియే విభీషణుఁడు రావణున కెక్కువగ బుద్ధి చెప్పెను.

ఉత్తరకాండమునందలి ౨౧౧- ౨౧౪ పద్యములు చూడుడు. ఎట్టికష్టదశయందైనను ధర్మబుద్ధి గలవాఁడై యుండునట్లు చావు లేకుండునట్లు విభీషణునకు బ్రహ్మ వరమిచ్చెను. కావునఁ బరునిభార్య నపహరించుట, దాని మగనిఁ జంపుట, దానిని విధవను జేసి దానితో సంభోగింపనో, దానినిజంపనో యాలోచించుట-యిట్టి యధర్మ కార్యమును ధర్మబుద్ధి గలవాఁ డెవ్వఁ డంగీకరించును. ఇందరుచచ్చినను విభీషణుఁడు చచ్చువాఁడుకాఁడు. అప్పుడైన సీతను దాను రామున కప్పగింపవలసిన వాఁడే కదా. సీతాదేవిని లంకకుఁ దెచ్చిన దినమందే విభీషణుఁడు మండోదరితో నీ మగఁడు సర్వాపవర్తకరముగా ర్తమునందు సీతను దొంగిలించి తెచ్చెను. దీనివలన మేలు లేదని చెప్పెను. దాని ననుసరించి యపశకునములు కనబడుచుండెను. త్రిజటాస్వప్నము,

లంకాదహనము మొదలైనవి దానినే బలపఱచెను. కావున యుద్ధమే జరిగనేని రావణునకు జయము లేదని విభీషణునకు నమ్మకముగాఁ దెలియును. ఈ కారణముచే నొక్కి చెప్పవలసి వచ్చెను. ప్రత్యక్షముగాఁ గీడు కానవచ్చుచుండ నెట్లు చెప్పక యుండఁగలడు.

—• ౧౫-వ సర్గము ఇంద్రజిత్తు విభీషణుఁ దిరస్కరించి పలుకుట •—

తే. బుద్ధి సురగురుతోఁ సరిపోల్పఁజాలు, న వ్విభీషణు వాక్యంబు•లాలకించి
తండ్రిఁగని రాక్షసాళియో•ధప్రబర్హుఁ,డైన వాసవజితుఁ డిట్టు•లనుచుఁ బల్కె.

అర్థములు. యోధప్రబర్హుఁడు=యుద్ధము చేయువారియందు శ్రేష్ఠుఁడు.

తా త్ప ర్య ము

బృహస్పతితోఁ బుద్ధియందు సమానుఁడైన విభీషణుఁడు చెప్పిన మాట విని తండ్రిని జూచి యోధులందు శ్రేష్ఠుఁడైన యింద్రజిత్తు తండ్రితోఁ నిట్టులనెను. విభీషణుని బుద్ధియందు బృహస్పతి యని, యింద్రజిత్తు యోధాగ్రేసరుఁడని చెప్పుటచే నింద్రజిత్తు యుద్ధమునందు సమర్థుఁడే కాని కార్యాలోచనయందుఁ గాఁడని భావము.

ఉ. ఏ మిటు నీదు సోదరుఁడె•హీన మనర్థకమున్ విభీతిదం
బై మనజాతి కర్హము ర•వంతయుఁ గాని విధంబు పల్కె విం
కే, మన యన్వయంబున జ•నింపనివాఁ డయిన న్వచించునే
యీమెయిఁ? జెప్పెఁ బో వినునె•యెవ్వఁ డెంతటి శక్తిహీనుఁడేన్. ౨౦౪

అర్థములు. హీనము = నీచము, అవమానకరము కావున, అనర్థకము = నిష్ప్రయోజనము, ఈ మాటలువిని యాప్రకారము వాఁడు నడచుకొనకుండుటచేత, విభీతిదంబు = భయముకలిగించునది, అన్వయంబునన్ = వంశమునందు, ఈమెయిన్ = ఈ విధముగ.

తా త్ప ర్య ము

ఇది యేమి తండ్రీ! నీ తోఁడబుట్టిన వాఁడే యిటువంటి నీచము, నిష్ప్రయోజనము, భయము పుట్టించునదియై మనజాతికే కొంచెమైన యోగ్యముగాని విధముగాఁ బలికెను. విన్నావా? మన వంశమందుఁ బుట్టనివాఁడే యగునుగాక- ఈ విధముగ నెవ్వఁడైనఁ జెప్పునా? ఒకవేళ నితనివంటివాఁడుఁ చెప్పిన నెంతటి శక్తిహీనుఁడైనను వినునా?

ఉ. శౌర్యము భూరిసత్త్వమును•సాహసము న్పటువిక్రమంబునున్
స్థైర్యముఁ దేజము న్పరిబల•ధైర్యము నేమియు లేనియట్టి ని
ర్వీర్యుఁడు నీదు తమ్ముఁడు వి•భీషణుఁ డొక్కఁడె సుమ్ము తండ్రి! యీ
యార్యకులంబునం బ్రభవ•మందెను దుర్యశముం గడింపగన్. ౨౦౫

అర్థములు. భూరిసత్త్వము= విస్తారబలము, నిర్వీర్యుఁడు = వీర్యము లేని వాఁడు, సవీర్య మతిశక్తిభాక్ = దృఢమైన యుత్సాహము లేనివాఁడు, 'శుక్రం తేజో రేతసీచ బీజవీర్యేంద్రియాణిచ'-అమరము-నపుంసకుఁడు, దుర్యశమున్ =అప కీర్తిని, గడింపఁగన్ = సంపాదించుటకు, శౌర్యము = శత్రువులపై పడిపోవుట, తేజము="అధిక్షేపావమానాదేః ప్రయుక్తస్య పరేణ యత్, ప్రాణాత్యయే ప్యస స్థానం తత్తేజ స్సముదాహృతమ్"పరు లాక్షేపించినను అవమానించినను ప్రాణము పోవున ట్లుండినను సహింపకుండుట తేజ మనఁబడును-పరులను శుష్కింపఁజేయు నది తేజము-ధైర్యము-మనసో నిర్వికారత్వం ధైర్యం సత్స్వపి హేతుషు చాప లేనానుపహతా సర్వార్థే ష్వవికత్థనా, స్వాభావికీ చిత్తవృత్తి ర్ధైర్య మిత్యభి ధీయతే। మనస్సు చలించుటకు హేతువు లుండినను చలింపకుండు స్వభావమైన చిత్తవృత్తి ధైర్య మనఁబడును.

తాత్పర్యము

శౌర్యముగాని, దానికిఁ గావలసిన బలముగాని, సాహసముగాని, దృఢమైన విక్రమముగాని, నిలుకడగాని, తిరస్కారమందు సహనముగాని, బలిష్ఠమైన ధైర్యముగాని వీనిలో నొక్కటియైన లేని నపుంసకుఁడు నీ తమ్ముఁడు, విభీషణుఁ డొక్కఁడే యీ గొప్పకులమందు నపకీర్తి సంపాదింపఁ బుట్టినవాఁడు అని తండ్రికిఁ జెప్పి విభీషణుఁ జూచి చెప్పుచున్నాఁడు.

మ. పితృకీ! మాకు భీతి నేర్పెదవు? పృథ్వీ నాయక ద్వంద్వమున్
బఱపన్లేఁడొకో దేబెసోఁకుఁ డయిన న్మాలోన, నీ కేల ప
ల్లఱపు ల్లోకము లేలు జిష్ణు నమృతాంధోధీశుని న్గర్వమున్
బఱిపోవం జెఱ నుంపనే! తెలియ నే భ్రాంతాత్ముఁడా వేల్పులన్. ౨౦

అర్థములు. పృథ్వీనాయక ద్వంద్వమున్=రాజుల నిద్దఱను, రామలక్ష్మణు లను, బఱపన్ లేఁడొకో=పాఱఁదోలఁజాలడా యేమి, దేబెసోకుఁడు = బలహీనుఁ డైన రాక్షసుఁడైనను, ఏకవచన ప్రయోగముచే నొక్క రాక్షసుఁడే చాలునని భావము, పల్లఱపుల్ = వ్యర్థభాషణములు, జిష్ణున్ = ఇంద్రుని జయించు స్వభా వము గలవానిని, అమృతాంధోధీశునిన్=అమృత మాహారముగాఁగల చావులేని దేవతల కందఱకుఁ బ్రభువుగా నుండువానిని, పఱిపోవన్ = కొల్లపోఁగా.

తాత్పర్యము

ఇంద్రజిత్తుకూడ రామలక్ష్మణులను జయింపలేఁడని విభీషణుఁడు చెప్పిన కారణముచే నింద్రజిత్తు తన పరాక్రమ పౌరుషములఁ జెప్పుచున్నాఁడు.

పితృకీ! నీవు మాకాభయము నేర్పెదవు? మాలో నధముఁడైన రాక్షసుఁ డొక్కఁడు రామలక్ష్మణుల నిరువురఁ దఱుమఁగొట్టలేఁడా యేమి? ఏల వ్యర్థముగా నిన్ని మాటలు మాటలాడుచున్నావు. లోకముల నన్నిటిని పాలించువాఁడై జయించు స్వభావము గలవాఁ డగుటచే జిష్ణుఁడని పేరుపొంది చావులేని దేవతల కందఱకుఁ

ప్రభువైన వాని గర్వము కొల్లగొట్టి నేను జెలసాలయం దుంపలేదా ? దిక్కు తెలియక తికమకలాడు దేవతలఁ దఱిమి తఱిమికొట్టనా ?

చ. కెరలిన నాదుశక్తిఁ గని • గీయని కూయుచు నేలఁ బోర్లని
ర్జరపతి వారణంబు రద•సంహతి నూడఁగఁ బీకి దానిచే
నరులను దోలనే ? సురచ•యంబుల దర్పమణంప లేదె ? యా
శరులకు శోకదాత నయి • సన్నుతిఁ గాంచనె ? నీ వెఱుంగవే ! ౨౧౭

అర్థములు. కెరలిన=విజృంభించిన, రదసంహతిన్=దంతముల సమూహమును, నాలుగు దంతములను, అరులను = శత్రువులను, ఆశరులకు = విరోధి రాక్షసులకు.

తాత్పర్యము

నేను విజృంభింపఁగా నాశక్తిఁ జూచి నేను గొట్టకముందే నేలఁబడి గీయని కూయుచున్న యైరావతము కొమ్ముల నూడఁబెఱికి వానితో శత్రువులను దఱుమ లేదా ? దేవతా సమూహముల గర్వ మణఁపలేదా? విరోధిరాక్షసులకు శోకదాతనై పొగడఁబడలేదా? ఇ వన్నియు నీ వెఱుంగవా ?

ఉ. అంతటివాఁడఁ బ్రాకృత నృ•పాత్మజుల న్బలహీనమర్త్యులన్
వింత యొకో జయించుట వి•భీషణ యంచు వచింప నంత దు
ర్దాంతబలుం డజయ్యు సుర•రాజనిభున్ గురుతేజుఁ జూచి యా
వంతయుఁ గొంక కిట్లను మ•హార్థసుభాషిత మెల్లరు న్వినన్ ౨౧౮

తాత్పర్యము

అర్థములు. ప్రాకృత నృపాత్మజులన్ = సామాన్య రాజకుమారులను, దుర్దాంతబలుండు = అణఁపరాని బలముగలవాఁడు, ఈ విశేషణము బలహీనుఁడై యింద్రజిత్తాక్షేపించినట్లు పిఱికివాఁడై విభీషణుఁడు చెప్పలేదని సూచించుచున్నది. అజయ్యున్=జయింప సాధ్యముగాని వానిని, ఇది యింద్రజిత్తు రామలక్ష్మణుల జయింప లేఁ డనుట వాని బలశౌర్యములు తెలియక కాదని సూచించెడిని, ఆవంతయును = కొంచెమైనను, అవగింజంత యైనను, కొంకక=సందేహింపక, మహార్థ సుభాషితము=గొప్ప ప్రయోజనముతోఁ గూడిన మంచిమాట.

తాత్పర్యము

అంతటి కార్యములు చేసినవాఁడను సామాన్య రాజకుమారులను బలములేని మనుష్యులను విభీషణా, జయించుట యాశ్చర్యమా ? యనఁగా విశేషబలశాలి యగు విభీషణుఁడు, జయింపరాని వాఁడును ఇంద్రునితో సమానుఁడును గొప్ప తేజస్సు గలవాఁడు నగు నింద్రజిత్తుఁ జూచి యందఱు వినుచుండ జంకక యిట్లు గొప్ప మేలుకూర్చు మంచిమాట చెప్పెను.

ప్రాకృతు లనుటచే నింద్రునివలె గొప్పవారు గారనియు, నృపాత్మజు లనుటచే బాలురనియు, బలహీను లనుటచే నైరావతమువలె బలముగలవారు గారనియు

మర్త్యులనుటచే అమర్త్యులను గొట్టిన వానికి నొక దెబ్బ గొట్టినఁ జచ్చువా రెంత మాత్ర మనియు గ్రాహ్యము.

—♦ విభీషణుఁ డింద్రజిత్తును నిందించుట ♦—

ఉ. బాలుఁడ వీవు నాయన! యప♦క్వమనీషుఁడ వౌట మంత్ర కా
ర్యాళి యథార్థదృష్టిఁ గను♦వంతటివాఁడవు గావు, కావునన్
నీ లయ మే నెఱుంగకయె ♦ నేర్చినయట్టులు లేనిపోని వా
గ్గాల ముపన్యసించితివి ♦ కార్యము తీరెనె యంతమాత్రనే. ౨౦౯

అర్థములు. నాయనా = కుమారా! గ్రుడ్డువచ్చి పిల్లను వెక్కిరించినట్లు నీవే నన్నా క్షేపింపఁ జూచితివా! యని భావము. అపక్వ మనీషుఁడవు = పక్వము గాని బుద్ధిగలవాఁడవు, మంత్రకార్యాళిన్ = ఆలోచనచేయు కార్యములందు, యథార్థదృష్టి=ఉన్నదున్నట్టు లాలోచించు.

తాత్పర్యము

కుమారా- నీవు పిల్లవాఁడవు- 'బాలా దపి సుభాషిత' మ్మని లేదా యందు వేమో, బుద్ధిమంతులగు పిల్లవాండ్రు చెప్పిన గ్రాహ్యమే కానినీబుద్ధియింక నుపక్వము కాలేదు. కావుననే మంత్రాలోచనమందు యథార్థము తెలిసికొను శక్తి నీకు లేదు. కావున నీవు చెప్పుటకూడ నీ వెఱుంగక తెలిసినవానివలెనే లేనిపోనిమాటల నుప న్యాస మిచ్చితివి. అంతమాత్రముతోనే కార్యము చక్కఁబడెనా? నీవు చెప్పునది యుద్ధవిషయము లు. ఇక్కడ జరుగు ప్రస్తావన నీతండ్రి చేసినది తప్పొ యొప్పొ- తప్పైన సవరించుకొను కట్టులనునది- కార్యము నిరపాయముగ నెఱవేఱుటకు నే యుపాయము మంచిదని యాలోచించునప్పుడు యుద్ధము తీర్మానమైన పిమ్మటఁ జెప్పవలసిన ముచ్చట లిప్పుడేల? సామము దానము దండము-వీనిలో నేది మంచి దని విచారింపఁ బనుచున్నది. గోటఁ బోవుదానికి గొడ్డలి ప్రయోగించువాఁడు బుద్ధిమంతుఁడా! ఇది యాలోచించు బుద్ధి నీకు లేదు. నీకు యుద్ధమునందే దృష్టి యుండుటచేఁ దక్కినవి నీకుఁ గానరావు. కావున నీ యాలోచన ప్రకారము పోయిన నీవు నాకే మగుట యెఱుంగక యేవేవియో ముచ్చట లుపన్యసించితివి! ఈ ముచ్చటలతోనే కార్యము చక్కఁబడెనా?

క. పుత్రుఁడ వను నెపమునఁ బ్రియ మిత్రునివలె రావణున క♦మిత్రుఁడవై క్ష్మా
పుత్రీపతి భయమునఁ దన నీ,మాత్రము గనలేక చెనఁటి♦మాటలు వినుదే. ౨౧౦

అర్థములు. అమిత్రుఁడవు=పగవాఁడవు.

తాత్పర్యము

కొడుకను పేర ప్రియమిత్రునివలెనుండి వాస్తవమున నీతండ్రికి నీవు పుత్రుఁడ వయియున్నావు. సీతాపతియగు రామునివలన భయముగలదు. యుద్ధము వలదని నేను చెప్పఁగా నేను నీకుఁ గీడుచెప్పినట్లు తలఁచి దుర్మార్గులమాటలు విని యా

పక్షమున మాటలాడెదవా? నీకు నీతండ్రికి నేను మేలు కోరువాఁడను, పరాయివారు మేలుకోరు వారైరికదా. నీ వివేక మింతలో నున్నది.

చ. అరయఁగ నీవు దండ్యుఁడవ ♦ యంతియ కా దిటువంటి మంత్రముం
జరపెడివేళ నిచ్చటఁ ♦ సాహసముఖ్యుని బాలు ధీరతం
దిరుని, సభాస్థలిం జొరఁగఁ ♦ దెచ్చిన దుర్మతికూడ వధ్యుఁడౌ;
సరిపడునొక్కొ మంత్రి మది ♦ జాల్ములు మూఁగిన కొల్వులోపలన్. -౫౧

అర్థములు. దండ్యుఁడవు = దండింపఁదగినవాఁడవు, తిరునిన్ = స్థిరుని, దుర్మతి = చెడుమనస్సు గలవాఁడు, జాల్ములు = మూఢులు, మూఁగిన=గుంపు చేరిన.

తా త్ప ర్య ము

నీ వహితము బోధించుచున్నావు. కావున నీవు పగవానివలె దండింపఁబడఁ దగిన వాఁడవు. గొప్ప విషయ మాలోచన జరుగు సమయమున సాహసము ప్రధానముగా నెంచువానిని, పిల్లవానిని, పట్టిన పట్టు సాధింపఁ జూచువానిని నిన్ను సభకు రానిచ్చిన దుర్బుద్ధి కూడ దండ్యుఁడే. ఎలయున మూఢులు గూడిన సభలోఁ గార్యాలోచనము కుదురునా? గొప్ప కార్యము లాలోచించునపు డేడవ చెవి వినఁగూడ దని శాస్త్ర ముండఁగా నీ వంటి పిల్లవాండ్రను ఆలోచింపశక్తి లేని వారిని రానిచ్చుట తప్పుఁగదా.

చ. తెలివియొ సర్వమంగళము ♦ తీక్ష్ణత నీకు స్వభావసిద్ధమున్
దెలియ వణంకు వెట్టిదియొ ♦ తీర్పులు దిద్దె దెఱంగినట్టులే
యలుచవు స్వల్పబుద్ధివి దు ♦ రాత్ముఁడవు న్మొఱకండవుం గడు
ల్బిల్లుకవు మేటిదుర్మతివి ♦ పిల్లతనంబునఁ బ్రేలె దీ గతిన్. -౫౨

అర్థములు. సర్వమంగళము = సున్న, 'కైదువు సున్న పూజ్యములు కంకటఖేట శిరస్త్రలత్రముల్, లేదరదంబుల త్తడి హాళిక్కి సహాయము సర్వమంగళంబు, మను. ౪-౧౦౫. అణంకువ = వినయము, అలుచవు = మందుఁడవు, స్వల్పబుద్ధివి=కొంచెపు బుద్ధిగలవాఁడవు, మొఱకండవు=మూర్ఖుఁడవు బాలుఁడవు, నీవు మేటిదుర్మతివి=ప్రహస్త మహాపార్శ్వ కుంభకర్ణాదులు దుర్మతులు. వారికంటె నీవు హెచ్చు దుర్మతి వని భావము.

తా త్ప ర్య ము

ఇంద్రజితా! నీకుఁ దెలివి సున్న, క్రౌర్యము నీకు స్వభావగుణము. పెద్దల సేవించినవాఁడవు కావు. కావున వినయ మెట్టిదో తెలియఁగవు, తెలిసిన వానివలె తీర్పులు దిద్దెదవు. మందుఁడవు. బుద్ధి విశేషము లేనివాఁడవు. చెడుబుద్ధి గలవాఁడవు నీకుఁ దెలియదు, ఒకరు చెప్పినను వినవు. మిక్కిలి బాలుఁడవు, దురాలోచన పరులందు మేటివి, కావునఁ బిల్లతనముచే నిట్లు వదరెదవు.

తే. ఎవఁడు సైరించు నోర్వఁ-సీతేశుఁడేయు, బ్రహ్మదండనిభంబులు-రవితనూజ
దండకల్పంబు లర్చిర్యు-తంబు లుగ్ర, కాలతుల్యాకృతులు నైన కాండములను.

అర్థములు. బ్రహ్మదండనిభంబులు=బ్రాహ్మణశాపముతో సమానమైనవి, (౨) ప్రలయకాలమున బయలుదేఱు నగ్నివర్ణధూమకేతువు, రవితనూజ దండకల్పంబులు=యమదండముతో సమానములు, అర్చిర్యుతంబులు=జ్వాలలు గలవి, 'అగ్నేర్భ్రాజంతే అర్చయః' అని వేదమందు అర్చిశ్శబ్ద మికారాంతము గలదు, ఉగ్ర=భయంకరములైన, కాల=యమునితో; తుల్య=సమానములైన ఆకృతులు=ఆకారములు గలవి, కాండములను=బాణములను.

తాత్పర్యము

బ్రహ్మదండముతో సమానములై యమదండములను బోలి జ్వాలలు గలిగి భయంకరమైన యముని యాకారముతో సమానములైన యాకారములఁ గలిగిన రాముఁడేయు బాణములను నెవఁడు సైరింపఁగలఁడు.

మ. దనుజాధీశ్వర ! నాదు విన్నపము డెం-దంబందుఁ బొందింపుమీ
ధనము ల్రత్నములుం బరిష్కరణసం-తానంబు దీవ్యన్మహా
ధనము ల్చిత్రమణు ల్ధరాసుతయుఁ దా-త్పర్యంబున న్రామచం
ద్రున కర్పింపుము, సౌఖ్య మంద నగు నెం-తో యెల్లవారుం బురిన్. ౨౯౮

అర్థములు. ఇట్లు లింద్రజిత్తునకు బదులుచెప్పి రావణుని జూచి చెప్పుచున్నాఁడు. పరిష్కరణ సంతానంబు=సొమ్ముల సమూహము.

తాత్పర్యము

రాక్షసేశ్వరా! నావిన్నపము హృదయమున నాటనిమ్ము-ధనములు ఆ యా జాతియందు శ్రేష్ఠములైన పదార్థములు - సొమ్ములు ప్రకాశించునవియు మిగుల వెలగలవియు, చిత్రములైన మణులు - సీతను బుద్ధిపూర్వకంబుగ రామచంద్రున కర్పింపుము. ఊరిలో వారందఱు మిగుల సుఖపడుదురు. అటు చేయని యెడల వారికి నీకుఁ గీడు తప్పదని భావము.

విభీషణుఁడు చెప్పినది దాని నర్థానుసంధానముచేసి యాప్రకార మాచరించక పోయినను వినుటచేతనే మనస్సునఁ బ్రీతి జనింపఁజేయునది. ఆచరణమం దిష్టము లేకపోయినను వినరానిదికాదు, అవశ్యము వినదగినది.

—•{ ౧౬-వ సర్గము. రావణుఁడు విభీషణునకు జ్ఞాతిలక్షణంబుఁ దెలిపి నిష్ఠురంబు లాడుట. }•—

తే. అనుచు సునివిష్టమును హిత-మైనవాక్య,మును వచించు విభీషణు-మోముఁ జూచి
రావణుఁడు కాలచోదిత-భావుఁ డగుటఁ, బరుషవాక్యంబు లిట్లని-పలికె నతని.

అర్థములు. సునివిష్టము = చక్కఁగాఁ గూర్పఁబడినది, పదముల చేరిక మంచిదైనది - రావణాదుల కిందలి యర్థము రుచింపకున్నను వాక్యము చెవుల.

కింపుగా నుండుటచే వదలుటకు సాధ్యపడ లేదనియు విభీషణుఁడు చెప్పఁ దలచిన దంతయు నీ వాక్యమునం దున్నదని సూచితము. దీనివలన భగవద్విషయ ముప దేశించువారు భయముగాని దాక్షిణ్యముగాని లేక వారి మేలు గోరి ఖండితముగఁ దెగ జెప్పవలయు ననియుఁ జెప్పుటయందు లోప ముండరాదనియుఁ దెలియనయ్యె డిని- భయదాక్షిణ్యాదులచే నిచ్చకము లాడువాఁ డాత్మద్రోహి- పరద్రోహియు నగును, హితము = చెవుల కింపుమాత్రమే కాక కీడు పోఁగొట్టి మేలు గూర్చు నది. వచించు=చెప్పు, 'నాసంవత్సరవాసినే బ్రూయాత్' తనునట్లు సంవత్సరము గురుశుశ్రూష చేసినవానికిఁగాని చెప్పరాని గోప్యవిషయము రావణుఁడు చెడి పోవుట నొల్లక నాలుగుమాటలతోఁ జెప్పినాఁడని భావము. విభీషణు మోముఁ జూచి మఱి యెవ్వరైనఁ జెప్పినఁ ద్రోచివేయవచ్చును గాని సొంత తమ్ముఁడే చెప్పుటచే నే మాత్రము ద్రోచివేయరా దని భావము.

విభీషణుఁడు చెప్పినది సునిశ్చితము హిత మనుటచే నీ వాక్యము లిట్ల నను సంధించునది.

> ఆత్మా రాజ్యం ధనంచైవ కళత్రం వాహనానిచ
> ఏత ద్భగవతే సర్వ మితి తత్ప్రేక్షితం సదా. నను.

'పితరం మాతరం దారాన్ పుత్రాన్ బంధూన్ సఖీన్ గురూన్, రత్నాని ధనధాన్యాని క్షేత్రాణిచ గృహాణిచ, సర్వధర్మాంశ్చ సంత్యజ్య, సర్వకామాంశ్చ సాక్షరాన్, లోకవిక్రాంత చరణౌ శరణం తే వ్రజం విభో' దీనివలన విభీషణుఁడు శరణాగతి బోధించె నని యేర్పడుచున్నది. అది రావణునివంటి రాక్షసున కెట్లు రుచించును. ఇట్టి యభిప్రాయము లేదేని సీతను మాత్ర మిమ్మనినఁ జాలును. ఈపదార్థము లన్నియుఁ దాత్పర్యముతో నిమ్మని చెప్పనేల? తత్పరత్వమే తాత్ప ర్యము. ఇది భక్తిని ననుకూలభావమును సూచించును. దుర్బుద్ధులకు భగవద్విషయ ముపదేశించినఁ గలుగు ఫలముఁ జెప్పుచున్నాఁడు.

రావణుఁడు 'రావయతీతి రావణ'యను వ్యుత్పత్తి ప్రకారము జనుల నేడ్పిం చుట యందు లోకప్రఖ్యాతుఁ డని భావము (౨) రాతీతి రావణ యను వ్యుత్పత్తి ప్రకారము ఇంద్రియసౌఖ్యములకై యేడ్చువాఁడని భావము, కాలచోదితభావుఁడు= యమునిచేఁ బ్రేరింపఁబడిన మనస్సుగలవాఁడు-రామునకు శరణాగతి చేయు మని విభీషణుఁడు చెప్పినమాటవినవలదని యముఁడు ప్రేరించుచున్నాఁడని భావము, ఇన్ని పాపములు చేసి తన లోకమునకు రావలసినవాఁడుశరణాగతి చేసినఁ దప్పించుకొనునే యని యముఁడు విభీషణుమాట వినవల దనుచున్నాఁడని భావము.లోక విరుద్ధచర్య నడచి నరకమునకుఁ బోవ నున్న వారికి శరణాగతిరుచింప కుండుటయేగాక వికటించు నని సూచితము-కావుననే, మోముఁజూచి=చాటుగఁగాదు - రహస్యముగఁగాదు- ఎదురుగనే- పరుష వాక్యములు- అటువంటి మంచిమాటలు విన్నవాఁడు నీ సద్వా

క్యములచే నా సందేహము దీఱెనని రైనఁ జెప్పియుండవలెను. నీవు నాకు మహోప కారము చేసితి వని స్తోత్ర మైనఁ జేసియుండవలెను. ఇట్టి మహోపదేశము చేసిన వారికిఁ జాలినంత ప్రత్యుపకారము చేయనైతినిగదా యని యనుతాప మైనఁబడి యుండవలెను. ఈ సన్మార్గము వదలి పామునకుఁ బాలుపోయుఁ బోవ నది పైఁబడి పీకినట్లు రావణుఁడు పరుషవాక్యము లనుచున్నాఁడని భావము.

తా త్ప ర్య ము

ఈ ప్రకారము చక్కనికూర్పు గల మాటలచే హిత ముపదేశించు విభీషణు ముఖముఁ జూచి రావణుఁడు మృత్యుప్రేరితుఁ డగుటచేఁ గఠినవాక్యము లిట్లు పలికెను.

దీనివలన భాగవతుని పరుషముగా మాటలాడుట తన వినాశసూచక మని సూచన.

క. కినిసినఫణితోఁ నేనియుఁ, దన శత్రుపుత్రోఁడ నేనిఁ • దగు వసియింపం
దన మిత్రునివలె మెలఁగెడి, తనరిపు సేవకునితోడఁ•దగదు వసింపన్. ౨౬

అర్థములు. కినిసినఫణితోన్ = కోపించిన పాముతో, తనరిపు సేవకుని తోడన్=తన విరోధిని గొలుచువానితోడ.

తా త్ప ర్య ము

తనపైఁ గోపించిన పాముతోనైనను, తన్నుఁ జంపఁజూచు ప్రత్యక్షశత్రు వుతోనైనను గూడియుండవచ్చును. కాని తన మేలుగోరు మిత్రునివలె నటించుచు లోలోపలఁ దన శత్రువునకు సేవకుఁడై యుండువానితో వసింపరాదు. ఇక్కడ సేవకుఁ డనఁగా బక్షపాతము గలవాఁ డనియే గ్రహింపనగు.

మన కొకఁడు ప్రత్యక్షశత్రు వని స్పష్టముగాఁ దెలిసినప్పుడు మన జాగ్ర త్తలో మన ముందుము. కావున నపాయము తక్కువ. అటుగాక "రాజులలోఁ గొలువు, నవాబులలో నౌకరు" అన్నట్లు శత్రువునకు లోకువై యుండి మిత్రునివలె నటించు వానివలనఁ బ్రమాదముచేఁ జెడుదుము. ఇట్లు చెప్పుటచే విభీషణుఁడు రామునకు నౌకరై తన కీడు వెదకు చున్నాఁడని సందేహపడినట్లు భావము. ఇది దూషింపవలసి దూషించిన మాటయేకాని సీతాదేవిని దెచ్చిన దినము మొదల లప్పుడప్పు డీ విషయమే విభీషణుఁడు చెప్పుచుండిన కారణముచే నిండు మనస్సుతోఁ జెప్పిన మాటగాదు, తనకు విరోధముగాఁ జెప్పెనే యని యాక్రోశ ముతోఁ జెప్పిన మాట కోపించిన సర్పముతోను, ప్రత్యక్ష శత్రువుతోడను నొక చోట నుండుట యెట్లు సరిపడదో యట్లు నీతోఁ గూడియుండుట నాకు సరిపడదు. కావున నా నగరము విడిచి పొమ్మని సూచన.

క. జ్ఞాతుల స్వభావ మంతయు, నా తెలియని యదియె త్రిభువ•నంబులలోనన్
జ్ఞాతులకు వ్యసన మబ్బిన, జ్ఞాతులకును సంతసంబు•నమకూడుఁ గదా. ౨౭

అర్థములు. జ్ఞాతుల = దాయాదులయొక్క, నా తెలియని యదియె = నాకుఁ దెలియని విషయమా, ధాతుజవిశేషణ భావార్థక పూర్వవ్యవహితా వ్యహితకర్తృపద ప్రథమకుఁ దఱుచుగ యొక్క-షష్ఠి యగు. ప్రౌ. వ్యా. కారక. ౧౫ సూ. "అపారపారావారపర్యంత మహీతలంబునందు నా చూడని రాజు లెవ్వరును లేరు." భార. అరణ్య. ౨. ఆ.

తాత్పర్యము

మూఁడు లోకములందును దాయాదు లగువారి సహజగుణము నాకుఁ దెలియదా యేమి? దాయాదులకుఁ గష్టము కలిగినచో వాని దాయాదులు సంతోషించుచుందురుగదా! "జ్ఞాతిశ్చేదనలేన కిమ్" అని భర్తృహరి. దాయాదుఁ డుండెనేని యగ్నితో నేమి పని.

మూఁడు లోకములం దనుటచే మనుష్యులందు, దేవతలందు, రాక్షసులందు, నన్ని జాతులందు, భూతములందుఁ గలదని భావము.

క. ఆతతమతియుతు ధర్మో, పేతు ననుత్తముని శూరు • హితసాధకునిన్
జ్ఞాతులు మెచ్చరు మఱి పరి,భూతియు నొనరింత్రు సమయ•ముంగనుఁగొనుచున్.

అర్థములు. ఆతతమతియుతున్=విస్తారమైన బుద్ధిగలవానిని, ధర్మోపేతు= ధర్మముతోఁ గూడినవానిని, అనుత్తముని = మిగుల శ్రేష్ఠుని, హితసాధకునిన్ = తనకు హితమైనదానిని సాధించు వానిని, పరిభూతి=అవమానము, తిరస్కారము.

తాత్పర్యము

జ్ఞాతులలో మిగుల బుద్ధిమంతుఁడు, ధర్మమునం దుండువాఁడు, మిగుల నుత్తమ గుణములు గలవాఁడు, శూరుఁడునై హిత మగుదానిని సాధించువానిని, దక్కిన వాని జ్ఞాతులు మెచ్చను మెచ్చరు. పైపెచ్చు ఏదైనఁ గొంచెము సమయము దొరకెనా యవమానింతురు. నీవు నట్టివాఁడవే.

క. కలసి మెలసినట్ల • కనఁబడు చుందురు, క్రూరకర్మములకు • రోయకుంద్రు
మనసు నీయ రెడరు•నను జంపఁ జూతురు, భీతికరులుగారె • జ్ఞాతు లెందు.

అర్థములు. మనసునీయరు = మర్మము విడిచి మాటలాడరు, ఎడరునను= ఆపత్కాలమందు, భీతికరులు=భయము గలిగించువారు.

తాత్పర్యము

మిగుల నొద్దిక, యైకమత్యము గలవారివలెఁ దమతోఁ గలసి మెలసి తమలో నొకఁడుగాఁ దిరుగుచుందురు. సమయము వచ్చెనా యెంతఘోరకార్యమైనఁ జేయుటకు జుగుప్సపడరు. తమ మనస్సు బయటబెట్టరు. ఆపదలందుఁ జంపఁ జూతురు. కావున జ్ఞాతు లెప్పటికైన నపాయము గలిగించువారే. ఇట్లు సామాన్యముగ జ్ఞాతి లక్షణము చెప్పినను ఇవియన్నియు నీయందున్నవని నీవు నిట్టివాఁడవేయని భావము.

క. మును పాశహస్తవరులను, గని పద్మవనంబునందుఁ ♦ గల వారణముల్
వినిచె నొక కొన్ని పద్యము, లను వానిని వినుము జ్ఞాతి♦లక్షణ మెఱుఁగన్.

అర్థములు. పాశహస్తవరులను = తమ్ముఁబట్టుటకుఁ బగ్గములు చేతఁబట్టుకొని వచ్చిన మనుష్యులను.

తాత్పర్యము

తమ్ముఁబట్టుటకుఁ గొందఱు మనుష్యులు పగ్గములను, వారికి మచ్చికపడిన యేనుఁగులనుదీసికొనిరాఁగా వారినిఁజూచి పద్మవనంబునందలి యేనుఁగులు వారితో నిట్లు చెప్పెను. ఆ మాటలు వినినచో నీకు జ్ఞాతు లెట్టివారై నది తెలియఁగలదు.

ఆ. భయము లేదు మాకుఁ ♦ బాశచయంబుల, నిప్పువలన శస్త్ర ♦ నిచయములను
స్వార్థపరులుఁ గ్రూరు♦లైనదాయాదుల, వలననే భయంబు♦గలుగు మాకు. ౩౦౧

అర్థములు. స్వార్థపరులు=తమ మేలు చూచుకొనువారు.

తాత్పర్యము

మనుష్యులారా! మీ పగ్గములకు మేము భయపడము. మీరు వేయు మంటలకు, మీరు చూపు కొఱవులకు మేము భయపడము. మీరు ధరించిన ఆయుధములకు మేము భయపడము. కాని తమ మేలుగోరి కఠినచిత్తులైన మా దాయాదులకు మేము భయపడుదుము.

ఆ. మీరు దెచ్చినట్టి♦వారణంబులు మమ్ముఁ బట్టుకొనఁగ నుపముఁ ♦ బల్కు నిజము
సకలభయములందు ♦ జ్ఞాతిభయం బది, దుస్సహంబు మాకు ♦ లెస్స తెలియు.

అర్థములు. ఉపము=ఉపాయము, దుస్సహంబు=సహింపరానిది.

తాత్పర్యము

అట్టి మిమ్మేమి చేసెదమురా-మీ పోషణ మందుండి మీరు తోడి తెచ్చిన యేనుగులు మమ్ముఁ బట్టుకొను నుపాయము మీకుఁ జెప్పును. అన్ని భయములందు జ్ఞాతులవలని భయము సహింపరానిది. ఇది మాకు బాగుగఁ దెలియును.

కట్టెలు కొట్టువాఁ డొక్కఁడు గొడ్డలి తీసికొని యడవికిఁ బోయెను. వానిని జూచి యొక చెట్టు మఱియొక చెట్టుతోఁ వీఁడు మనలఁ గొట్టుటకై వచ్చెను. మనలో నెవరిని గొట్టునో యేమో యనెను. ఆ రెండవ చెట్టు మన వారెవరైన వానితోఁ గలిసినారా చూడుము. మనవారు కలసిననే మనకు భయము. మనవారు కలియకుండువఱకు మనకు భయము లేదని చెప్పెను. కట్టెలేని గొడ్డలి యేమి చేయఁగలదు? ఇది దాయాదుల లక్షణము.

ఆ. గోవులందు భాగ్య ♦ గుణ మది నైజంబు, విప్రులందు దమము ♦ విశ్రుతంబు
స్త్రీస్వభావగుణము ♦ చిత్తచాంచల్యంబు, జ్ఞాతి కెడరు సేత ♦ సహజగుణము.

అర్థములు. భాగ్య గుణము = తమ్ము మేపువారికి నైశ్వర్యము గలిగించు గుణము-పాలు పెరుఁగు నెయ్యి మొదలైనవి యిచ్చి యని భావము, దమము =

ఇంద్రియ నిగ్రహంబు - చిత్తచాంచల్యంబు = చపలచిత్తము-ఎడరు సేఁత = కీడు సేయుట.

తాత్పర్యము

గోవుల స్వభావ మైశ్వర్యము నిచ్చుట-బ్రాహ్మణుల స్వభావము ఇంద్రియ నిగ్రహము, చపలచిత్తము స్త్రీల స్వభావము, కీడు సేయుట జ్ఞాతుల స్వభావము.

క. కావున లోకము నను సం,భావించుట నిరుపమాన•భాగ్యము గనటన్
నే వైరులతలఁ ద్రొక్కుట, నీ వెదఁ జూపోవ వైతి•వే సౌమ్యుండా ! ౩౦౪

అర్థములు. చూపోవవైతివే=చూడలేకపోయితివా.

తాత్పర్యము

ఈ కారణములచే నీవు నాకు జ్ఞాతివగుట-లోకులు నన్ను గౌరవించుట, అవమానసంపద నాకు లభించుట. నేను వైరుల తలలపై నెక్కి వారి నవమానించుట చూచి పెద్దమనుష్యుఁడా ! సహింపఁజాలకపోయితివిగదా! కావున నా శత్రువులకు నన్ను లోపడచేసి యవమానింపఁ జూచుచున్నావు, ఇది ౨౧౫ పద్యమునఁ జెప్పిన దానికి నన్వయము.

క. అంటియును దామరాకున, వంజని జలబిందు వమిరి•యట్లు లనార్యుం
డొంటుకొని చేయు స్నేహం, బంటియుంటకయ యుండు•నో రాక్షసుఁడా. ౩౦౫

అర్థములు. ఒంటుకొని=కూడనుండి, అంటియుంటక=తాఁకియుఁ దాఁకక, క్త్వార్థక ద్వంద్వంబున నర్థవిశేషంబునఁ బూర్వపదంబునకు దీర్ఘము విభాష నగు, దీర్ఘము రానిచో సముచ్చయ మధ్యాహార్యం బొందేనగు సూ.వ్యా.వాక్యా౫౦ సూ.

క. "నమ్మమి మృత్యువు పెద్దయు, నమ్ముట యపమృత్యు వగుట నరపతి నమ్మీ
నమ్మక పనిగొనునది ని,త్యమ్మును సూక్ష్మమతిఁ దాన యరయఁగవలయున్,
భార - శాంతి ౨-౩౫౦ ప.

తాత్పర్యము

తామరాకునందలి జలబిందువులు దానిని దాఁకియుండునుగాని, దానిఁ దడుప లేవు, కావున దాఁకకుండిన నెట్లో తాఁకియు నట్లే, తాఁకుటవలనఁ గలుగు గుణము కానరాదు. అట్లులే నీచుఁ డగువాఁడు కలిసిమెలసి చేయుస్నేహము స్నేహఫలము చూపదు. రాక్షసుఁడా! యిది నీచసంబోధనము. నీవు నిజముగ రాక్షసుఁడవే.

క. విను విరులఁ దేనెఁ గ్రోలిన, వెనుక న్మధుపములు వాని • విడిచెడి గతి దు
ర్జనులు తొలిమైత్రిఁ దలఁపరు, పనితీరిన వెనుక నిజము•పలికెద నసుగా! ౩౦౬

అర్థములు. విరులన్ = పుష్పములందు, మధుపములు=తుమ్మెదలు.

తాత్పర్యము

పుష్పములయందుఁ గల తేనె ద్రావి తమ యక్కఱ దీర్చుకొనిన వెనుక నాతుమ్మెద లా పుష్పనందలి తేనె వలనఁ గదా తమ యాఁకలి దీరె నని తలఁపక

విడిచిపోవునట్లు దుష్టులు తా మెవరివలన బాగుపడిరో వారిని వారితోఁ దమ పని తీరినవెనుకఁ దలఁపరు. రాక్షసుఁడా! నేను నిజము చెప్పుచున్నాను. నీవునట్టివాఁడవే.

క. మును జల కేళిం దేలియుఁ, దనశిరమునఁ దనకుఁ దాన ♦ తన తొండమునన్
మను వైచుకొను నేనుఁగు, ననుపున ఖలమైత్రియును ని♦రర్థక మసురా! ౩౦౭

తాత్పర్యము

కొలని స్నానము చేసి యొడ్డునకు వచ్చి యేనుఁగు తన నెత్తిమీఁదఁ దానే మన్ను కొట్టుకొనునట్లు దుష్టులతోడి స్నేహము వ్యర్థము - పూర్వస్నేహమును దుష్టులు తామే నాశము చేసికొందురు. నీవు నట్టులు చేయుచున్నావు.

క. శారద వేళల గర్జ ల, పారంబుగ నించి చినుకు ♦ పడ రాలిచియున్
ధారిణి తడియనిగతి నిస్సారము నిష్ఫల మనార్య♦సంగతి యసురా! ౩౦౮

తాత్పర్యము

శరత్కాలమునందు మేఘములు మిగుల గర్జించియు, చినుకులు రాల్చియు నేల తడియక యుండునట్లు నీచుల సంగతి సారహీనము వ్యర్థము.

క. ఈపాటి నన్నుఁ డాడిన, వే పొర్లదె వాని శిరము ♦ పృథివిని ద్రుటిలోఁ
బాపాత్మా! కులపాంసన, ఛీ పో నాయెదుట నిలువఁ♦జెల్లదు నీకున్. ౩౦౯

తాత్పర్యము

నీవు పలికిన విధముగ మఱియొక్కఁడు పలికియుండిన వాని తల నిమిషములో నేలమీఁదఁ బొరలియుండదా? నీవు తమ్ముఁడ వని చంపక విడువవలసి వచ్చినది. పాపాత్ముఁడా! కులద్రోహీ! ఛీ. పో. నా యెదుట నీవు నిలువఁదగదు.

ఇది చంపుటకు మాఱుగాఁ జేసిన శిక్ష యని యెఱుఁగనగు. లక్ష్మణుని రామచంద్రమూర్తి చంపవలసిన వచ్చినపుడు నా యొద్ద నుండవలదు, నిన్ను విడిచితిఁ బొమ్మనెను. (చూ. ఉత్తర ౧౬౯ వ పద్యము)

రావణుఁ డిట్టివాఁడని యెఱిఁగియే చావునకు వెఱచి మంత్రులెవ్వరు హితముఁ జెప్ప భయపడిరి.

—♦ విభీషణుఁడు సభ విడిచి మింటి కెగసి రావణునకు హితముఁ దెల్పుట ♦—

తే. అనుచుఁ బరుషంబులాడు దు♦ర్న్యాయ వాది, యగు విభీషణుఁడును గదా♦ హస్తుఁడగుచు
నలువు రసురులతో వియ♦న్మార్గ మెగసి యులుక శ్రీమంతుఁ డన్నతో ♦ ననియెనిట్లు.

అర్థములు. పరుషంబులు = కఱకుమాటలు, వియత్ + మార్గము = ఆకాశమార్గము, శ్రీమంతుఁడు = లక్ష్మీసంపన్నుఁడు.

ఈ విషయమున ఛాందోగ్యోపనిషత్తు ౭ వ యధ్యాయము ౧౫ వ ఖండము రెండవ మంత్రమున నిట్లున్నది. "స యది పితరం వా మాతరం వా భ్రాతరం వా స్వసారం వాచార్యం వా బ్రాహ్మణం వా కించిత్ భృశమివ ప్రత్యాహ ధిక్త్వాస్త్విత్యేవైన మాహుః పితృహా వై త్వమసి మాతృహా వై త్వమసి, భ్రాతృహా వై త్వమసి స్వసృహా

చైత్యము సాచార్యహా చైత్యమసి, బ్రాహ్మణహా చైత్యమసీతి." ఎవఁడైనను తండ్రినిగాని, తల్లినిగాని, తోడఁబుట్టినవానిఁగాని, తోడఁబుట్టినదానిని గాని ఆచార్యునిఁగాని, బ్రాహ్మణునిఁ గాని, ఛీ, పో, యని కఠినముగా మాటలాడెనేని నీవు తండ్రిని జంపినవాఁడవు, తల్లిని జంపినవాఁడవు, సోదరునిఁ జంపినవాఁడవు, తోడఁబుట్టినదానిని జంపినవాఁడవు, ఆచార్యుని జంపినవాఁడవు, బ్రాహ్మణుని జంపినవాఁడవు అందురు. ఈ కారణము చేతనే శ్రీరామచంద్రమూర్తి లక్ష్మణుఁ బ్రత్యక్షముగాఁ జంపఁజాలక నాయొద్ద నుండ వలదు, పొమ్మనెను.

తాత్పర్యము

ఈ ప్రకారముగఁ గఠినముగ రావణుఁడు పలుకఁగా ధర్మమార్గమును జెప్పు విభీషణుఁడు కాలిడి యిసుకమీఁద నిలువలేనట్లు చేత గద దీసికొని తన మంత్రులగు నలుగురు రాక్షసులతో నింక నీ మాహాత్మ్యుఁడగు రావణుని నేలమీఁద నడుగు పెట్టరాదని రావణుని పంచప్రాణము లెగిరిపోవుచున్నవా యన్నట్లు లాకాశమున కెగసి కోపముతో లక్ష్మీసంపన్నుఁ డన్నతో నిట్లనెను. అన్నతో ననుటచే రావణుఁడు తన్ను దూషించినను వానియందు భ్రాతృభావము వదల లేదని భావము. కావుననే తాను సర్వము విడిచి తొలఁగి పోవుచు మరల నొకసారి హితముపదేశించుచున్నాఁడు.

శ్రీమంతుఁడు="నెయ్యర, లంక, సిరిం, ద్యజించితిన్" అని సర్వము వదలి యింటికైనఁ బోక యెట్లున్నవాఁ డట్లు రామునియొద్దకుఁ బ్రయాణమైన వాఁడు శ్రీమంతుఁడని వాల్మీకి చెప్పెను. ఇప్పుడు విభీషణుఁడు శ్రీమంతుఁ డనుటచే నింతవఱ కాయన దరిద్రుఁడే యని వాల్మీకి యభిప్రాయము. ఇంతవఱకు నిల్లు, వాకిలి, ధనము, ధాన్య మున్నను నవి నశ్వరములు గావున విభీషణుఁడు దరిద్రుఁడే. ఇప్పుడు శ్రీరామచంద్ర పాదారవిందసేవాలక్ష్మి లభించెను. గనుక శ్రీమంతుఁ డయ్యెను. ప్రతికూల సాంగత్యము వదలుటయేగాక రామచంద్రమూర్తి యందుఁ బ్రేమజనించుటకంటె లక్ష్మీప్రాప్తిమఱియేదిగలదు. నిజమైననిత్యమైనశ్రీ భగవత్ప్రాప్తియే సోపాధిక బంధుల విడుచుట - నిరుపాధికబంధు వగు భగవంతు నాశ్రేయించుట భాగ్యహీనులకు లభించునా? ఇట్టులే యరణ్యమునకు రాముని వెంట బయలుదేఱిన లక్ష్మణుని వాల్మీకియు, శ్రీ భాగవతమున కృష్ణపాదారవిందతాడితుఁడైన కాళియుని వ్యాసులును శ్రీమంతులని చెప్పిరి.

ఈ విభీషణుని చర్యవలన భగవదీయమయ మైన హితవాక్యములు వినక కేవలము ప్రతికూలభావము గలవార లెట్టి విడువరాని బంధువులైనను కాలుచున్న యింటివలె విడువవలయు ననియు, భగవద్భాగవతద్రోహు లున్నచోటఁ బ్రకన్న దుండక తొలఁగి పోవుట యావశ్యక మనియు నేర్పడుచున్నది. ఇదియొక విధమైన ప్రతికూల్య వర్జనము.

ఉ. అన్నవు నీవు రాజవటు ♦ లౌటను నిచ్చకొలంది పల్కఁ, మే
టెన్నఁగ నైన మాన్యుఁడవు ♦ శ్రేష్ఠుఁడవు న్పితృసన్నిభుండవ
ట్లున్నను ధర్మమార్గమున ♦ నుండమి నీ యనృతంబులుం గడుం
బన్నము దెచ్చు నిష్ఠురపుఁ ♦ బల్కులు సైపఁగ లే నొకింతయున్. ౩౧౧

అర్థములు. పితృసన్నిభుండవు=తండ్రితో సమానుఁడవు, అనృతంబులన్=అసత్యవాక్యములను, నేను శత్రుపక్షము వహించి వారికి వశుఁడనై నీ కీడు కోరి నీకవమానము గలిగింప నాలోచించితినని నీవు చెప్పినవి యనృతంబులు, బన్నము=అవమానము.

తాత్పర్యము

నీవు నా కన్నవు గావునఁ బెద్దవాఁడవు. తండ్రితో సమానుఁడవు. కావుననే నేను నీకు నెదురు చెప్పరాదు. అందు రాజవు. బంధువు కాకపోయినను కేవల రాజవని చూచినను నీ కెదురాడ రాదు. కావున నీ యిష్టము వచ్చినట్లు నీవు మాటలాడ వచ్చును. అయినను నీవు సీతను దొంగిలించి తెచ్చి యధర్మకార్యము చేసితివి. నేను శత్రువులకు లోపడి నీకుఁ గీడు గలిగింప నీ కీ మాటలు చెప్పితినని యంటివి. ఇవి యసత్యములు. అధర్మమందు, నసత్యమునం దుండు నీవు ధర్మము, సత్యము నాధారపరుచుకొనియుండు నన్ను సభలో నవమానించి పలికితివి. ఆ యవమానమును నేను సహింపఁజాలను. ఈ మాటలు పడియు నం దుండెనేని వానిని సత్యపఱిచినట్లే కదా యగును.

క. హితకాముఁడనై నీకును, వితతముగ సునీతివిధము ♦ వినిపించితి నీ
మతి కెక్కదు కాలవశా, గతుఁ డకృతాత్ముఁడు హితము♦గ్రహియించునొకో.

అర్థములు. హితకాముఁడనై = మేలుగోరినవాఁడనై, వితతముగన్=విపులముగ, సునీతి పథము = మంచినీతి మార్గము, నేను చెప్పినది యుక్త రాజనీతి మార్గమే కాదు. ధర్మముతోఁ గూడి యిహపరసాధకమైన నీతిమార్గము. ఎక్కదు= నీ మనస్సునకు సరిపడినది కాదయ్యె. కాలవశాగతుఁడు=మృత్యువునకు వశపడినవాఁడు. అకృతాత్ముఁడు=మనస్సు కామమునకు వశపడి తన వశమున లేనివాఁడు.

తాత్పర్యము

నీ మేలుగోరువాఁడనై విపులముగఁ జెప్పవలసిన యన్నివిధముల నిహపరసాధనమైన మంచి నీతిమార్గముఁ జెప్పితిని. అది నీకు మనస్సున కెక్కలేదు. ఏల యందువా? నీ మనస్సునఁ గామము పెక్కియున్నది. కావున నందు నీతి యొక్కట కెడము లేదు. అదియునుగాక నీవు మృత్యుదేవతకు వశపడియున్నాఁడవు. అది దాని కనుకూలముగ నిన్నుఁ బ్రవర్తింపఁ జేయునే కాని, మఱియొక విధముగ నడవ నిచ్చునా? హితము విననిచ్చునా?

క. అనయము ప్రియవాక్యంబుల, ననియెడి జను లెందు సులభు•ల ప్రియ మయ్యున్
గనఁ బథ్య మైన సూక్తిని, ననువాఁడును వినెడివాఁడు•నరు దసురేంద్రా! ౩౧౩

అర్థములు. ఈ పద్యము మారీచుఁడు చెప్పినదే. (అరణ్య. ౫౭౬ వ.చూచునది) అందు ౫౯౦ వ పద్యము నందు విభీషణాదుల వడిగి చూడు మనియు మారీచుఁడు చెప్పెను. మారీచుఁడు చెప్పినప్రకారము జరిగినది. తక్కినది జరుగఁ గలదని రావణునకుఁ దోఁపఁ జేయుటకై విభీషణుఁడు మారీచుని వాక్యములనే యనువదించెను. మారీచుఁడు నీకు హితము చెప్పినను వినక నీ యిష్టప్రకారము వర్తించి చచ్చెను. నీ యభిప్రాయప్రకారము పోవు నీ యందలి గతియు నంతే కాఁగలదు. నీవు చెప్పినట్లు విని యధర్మపక్షము వహించి చావ నొల్లను గావున నీవు చెప్పినట్లు వెడలిపోయెదను.

లోకములో నీ మంత్రులు నీకుఁ జెప్పునట్టు లిచ్చకములు చెప్పెడివారు పెక్కురుగలరు. అప్రియ మయ్యును పథ్యముగ చెప్పెడువాఁడు మారీచునివంటి వాఁడు, నా వంటివాఁడు అరుదు. ఒకవేళ మావంటివారు కొందఱు చెప్పెడివారున్నను వినెడివాఁ డుండఁడు. దానికి నీవే నిదర్శనము.

ఉ. కాలెడుగేహము న్విడువఁ•గా మన సొప్పనిభంగి సర్వభూ
శాలి వినాశహేతు వగు • నంతకుపాశము చేతఁ జిక్కి ని
న్నాలము సేయ నొల్ల, నవ•హాటకపుంఖము దీప్తపావకా
భీలము రాఘవాశుగము • పృథ్వి నినుం గన నొల్లఁ గూల్పఁగన్ ౩౧౪

అర్థములు. ఆలము = ఉపేక్ష, నవహాటకపుంఖము=క్రొత్త బంగారు పింజ గలది. దీప్తపావకాభీలము=మండుచున్న యగ్నివలె భయంకరము, రాఘవాశుగము=రామబాణము.

తాత్పర్యము

లోకమునందుఁ దన యిల్లు కాలుచుండుట చూచి యిఁక దీనితో మనకేమి పని వదలి పోదమని యెంచక ఆ మంట చల్లార్చి మరల దానినే చక్కఁజేసికొనుట చూచుచున్నాము. దీనికి మన లంకలోఁ గొంపలు కాలినవారే దృష్టాంతము అట్టులే నేను కొంప కాలకముందే హెచ్చరికపడుట బాగని తలఁచి లంకయందలి సమస్తజనులు నీవు యమపాశములకుఁ బాలుపడుట సహింపలేక ముందుగనే హెచ్చరించితిని. ఇదియే నా దోషము. ఏల ముందుగా జెప్పెద వనిన బంగారు పింజలు గలిగి మండెడు మంటవంటి రామ బాణములు నిన్ను నేలబడఁగొట్టఁగాఁ జూచి సహింపలేక చెప్పితిని.

క. వాలుమగ లేని కడు బల, శాలులునే శస్త్రాస్త్ర•చతురులు నైనం
గాలునిచేఁ జిక్కిన తఱి, వాలుక సేతువులు పోలెఁ • బసచెడుదు రిలన్. ౩౧౫

అర్థములు. వాలుమగలు = శూరులు, వాలుకసేతువులు = ఇసుకతోఁ గట్టిన యానకట్టలు, పనచెడుదురు=నిస్సారమై పోవుదురు.

తాత్పర్యము

ఎంతటి శూరులైనను, మిగుల బలవంతులైనను, అస్త్రశస్త్రములందు నిపుణులైనను మృత్యువుచే చిక్కిన సమయంబున నేటికిఁ గట్టిన యిసుక యాన కట్టవలె నిస్సారమైపోదురు.

నీవు శూరుఁడవే, నీ మంత్రులు కుంభకర్ణాదులు బలవంతులే, ఇంద్రజిదాదులు నస్త్రశస్త్రసంపన్నులే గాని మృత్యువుచేతఁ జిక్కితిరి. కావున మీా గట్టితనము వ్యర్థము.

ఉ. అన్నవు నీ వటంచు హిత • మారవచించిన యట్టి నా నుడుల్
మన్నన సేయవైతి, విఁక • లంకను రాక్షససంఘ యుక్తమున్
నిన్నును లెస్స కాచుకొని • నెమ్మది నుండుము, స్వస్తి నీకగున్,
న న్నిడఁబాసి సౌఖ్యము ఘ • నంబుగ నందుము, పోయి వచ్చెదన్. ౩౧౬

తాత్పర్యము

నీవు నా కన్నవని నీ మేలుకోరి చెప్పుట నాకు విధి యని నేను జెప్పిన మాటలు నీవు గౌరవింపకపోయితివి. నా మాట లాదరింపకపోవుట యటుండ నేను భాముని, శత్రువని, నా సాహసము నీకపాయకర మని నన్ను వెడలిపొమ్మని చెప్పితివి. అట్లులే పోయెదను. ఇఁక నన్ను విడిచి రాక్షసులతోడ లంకను, నిన్నుఁ జక్కఁగాఁ గాఁచుకొని నిర్విచారముగ నుండుము. నీకు మే లగునుగాక. నీ వెట్లులైన బాగుపడుటకదా నేనుగోరునది. కావున నే వేళకే పాము నిన్నుఁ బీఁకి చంపునో యను భయము వదలి సుఖముగా నుండుము.

క. హిత మెంచి యెంతచెప్పిన, మతి కెక్కఁగనీవు నాదు • మాటలు నీవున్
హితసూక్తులు రుచియించునె, గతజీవితు లగు పరీత • కాలుర కెందున్. ౩౧౭

అర్థములు. గతజీవితు లగు = అవ్యవహిత భవిష్యత్తునకు వర్తమాన భూతము లగు సు. వ్యా. వాక్య. ౮౧ సూ. ప్రాణము పోనున్న వారగు - పరీత కాలురకు=మృత్యువు సమీాపించిన వారికి.

తాత్పర్యము

నేను నీ మేలు కోరి యెంత చెప్పినను నా మాటలు నీవు మనస్సునకుఁ బట్టనీయవు. మృత్యువు సమీాపించి ప్రాణము పోవ సిద్ధముగానుండు వారికి హిత వాక్యములు రుచించునా?

రావణాసురుఁడు చేసిన తెలివితక్కువ కార్యములలో నెల్ల విభీషణుని విడుచుట పెద్ద దనవచ్చును. కేవల కామ క్రోధములకు వశుఁడై నా యభిప్రాయమున కెకఁ డెదురు చెప్పువాఁడా యను దురహంకారముచే విభీషణుఁ దిరస్కరించెను.

లోచుచేయక విభీషణా, యిది యందఱకు సంబంధించిన కార్యము గనుక నందఱ యభిప్రాయముఁ దెలియఁగోరి సభ చేసితిని. అందఱు నొక మాటగా నున్నారు. నీ వొకఁడవే మఱియొక విధముగ నున్నావు. పదుగురు చెప్పినట్లు పోదునా నీ వొకఁడవు చెప్పినట్లు పోదునా? నీవు నా మేలు కోరినట్లు వీ రందఱు నా కీర్తి సౌఖ్యములు గోరువారే కదా. నిన్నొక్కనినిఁ బురస్కరించుకొని యందఱి యభిప్రాయము నెట్లుపేక్షింతును. కావున మేలో, కీడో నీవు నేను బదుగురు పోవు త్రోవఁ బోద మని శాంతితోనే చెప్పియుండవచ్చును. గర్వాంధకారము కన్నులఁ గప్పియుండఁగా, మృత్యుదేవత తలవెండ్రుకలు పట్టి యీడ్చుచుండఁగా సౌమ్య మార్గ మెట్లు స్ఫురించును? రావణుఁ డిట్లు చెప్పియుండెనేని విభీషణుఁడు శత్రు పక్షమునఁ జేర సాధ్యపడియుండదు. ఒక వేళ పోయినను నన్నవమానించి పొమ్మనుటచే వచ్చితి నని చెప్ప నోరు వచ్చియుండదు, విరోధమునకుఁ గారణముండదు. పదుగురిలో నవమానించుటచేఁ గదా శత్రువయ్యెను.

ఫాల్గున బహుళమ్మునఁ పాడ్యమి సాయంకాలము రామచంద్రమూర్తి సముద్రతీరమునఁ జేరెను. ఇది విదియ యుదయమున జరిగిన వృత్తాంతము.

౧౭-వ సర్గము విభీషణుఁడు నలువురుమంత్రులతో శ్రీరాముఁ డున్న చోటికిఁ బోవుట.

క. అని పరుషం బగు వాక్యము, లని ఖలు రావణుని రావ • ణానుజుఁ డా వెం
టనె వచ్చె సలక్ష్మణుఁడౌ, జనకసుతానాథుఁ డున్న • స్థలమున కంతన్. ౩౧౮

తాత్పర్యము

ఈ ప్రకారము కఠినవాక్యములు చెప్పి దుష్టుఁడైన రావణుని విడిచి రావణానుజుఁడైన విభీషణుఁడు లక్ష్మణుతోడ నుండు సీతాపతియు రామచంద్ర మూర్తి యున్నచోటికి వచ్చెను.

ఈ క్రింది విషయము గోవిందరాజీయము నుండి సంగ్రహింపఁ బడెను. "ఆనుకూల్యస్య సంకల్పః ప్రాతికూల్యస్య వర్జనం। రక్షిష్యతీతి విశ్వాసో గోప్తృత్వ వరణం తథా। ఆత్మనిక్షేపకార్పణ్యే షడ్విధా శరణాగతి" యన్నట్లు శరణాగతి యనెడి యుపాయమునకు నంగము లాఱు. అందు భరసమర్పణము ప్రధానము - తక్కినవి తద్గుణంబులు-అందు ఆనుకూల్య సంకల్పమును, ప్రాతికూల్య వర్జనమును శరణాగతివనుష్ఠింపఁబోయెడి విభీషణునియెడఁ గల వని ఈతొమ్మిది సర్గములందును జెప్పుచువచ్చెను. రామ పరాక్రమమును బలుమాఱుపన్యసించుటచేత నీయుపాయమునందు విభీషణునకు మహావిశ్వాసము కలదనియు నీసర్గములందే సూచితము. ఇక రక్షకునికి వేగిరము కృప కలిగించెడి యాకించన్యనివేదనమును(తాను గత్యంతరము లేనివాఁడని తెల్పుకొనుట)ప్రధానమైన శరణాగతి స్వరూపమును నీసర్గమందు జెప్పు

చున్నాఁడు. అందు మొదటిపద్యమందు రావణుఁడుతన్నుఁ దిరస్కరింపనిట్టిదుర్మార్గుని దేశము తనకు వాసార్హము కాదు, సర్వథా పరిత్యాజ్య మనియుఁ బరమధార్మిక శ్రీరామాశ్రయమే కర్తవ్యమనియు నిట్టిధర్మబుద్ధి ధార్మికుఁడైన విభీషణునికి జనించెఁ గదా యని కవి యాతనిని స్తోత్రము చేయుచున్నాఁడు. అని యిట్లు 'రామునకున్ సీత నిమ్ము' అని కర్తవ్యకార్యము మిక్కిలి సులభమైనదనియు అట్లు చేయనిచో 'రామకాండము లసురసోమములలలు ధరఁబడ గ్రామకమును' అని ప్రత్యవాయము కలుగునవనియు, అను నీ ప్రకారముగా ఈ 'అనికిఁ' పై 'యని' తో నన్వయము. పరుషంబు=భార్యలతోఁ గూడియున్న వారికి సుఖకరమైన మందమారుతము భార్య నెడఁబాసిన వారికి దుఃఖకరమైనట్లు విభీషణుని హితోపదేశము రావణునికిఁ దన యజ్ఞానదోషము చేతకరినమైనది. వాక్యమును, వక్తవ్యములైన సర్వహితములును నిందుఁ బరిపూర్ణములై యున్నవి-అని విభీషణుఁడు ఎవరికెప్పు డేది హితమో యది తెలిసియుండియు సోదరుఁడై యుండియుఁ గష్టదశలో నన్న తన యన్నను వదలి పెట్టి పోయెనుగదా యనెడి యపకీర్తి తనకు రాకుండునట్లు వలసినంత మట్టుకు చెప్పి విభీషణుని హితోపదేశము రావణునికిఁ బరుష మగుటకుఁ గారణములను జెప్పుచున్నాఁడు. ఖలుని రావణుని=తాను దుర్మార్గుఁడు కాన నీతిపరులుబలవంతులు దుర్బలులను విచారము లేక యందఱ నేడ్పించువాఁడు కాఁబట్టి యట్టివానికి శత్రు బలవర్ణనము పరుషముగాక మఱెట్లుండుననిభావము. రావణానుజుఁడు=ఇట్టి దుర్మార్గుని తమ్ముఁడయ్యును విభీషణుఁడు సత్వగుణాధికుండు కాన సర్వవిధములహితోపదేశము చేసె నని కవి విభీషణుని స్తోత్రము చేయుచున్నాఁడు. హితోపదేశమందుఁ బెద్ద చిన్న లక్షణము లేమి. పెద్దవారు చిన్న వారికివలె చిన్న వారును బెద్దవారికి హితముపదేశింపవచ్చును. ఇందు జ్ఞానాజ్ఞానంబులే ముఖ్యము. 'పిత్రానధ్యాపయామాస శిశురాంగిరసః కవిః। పుత్రకా ఇతి హోవాచ, జ్ఞానేన పరిగృహ్య తాన్। అజ్ఞం హి బాల మిత్యాహుః పితేత్యేవ చ మంత్రద' మ్మను మనువాక్యమీ యర్థమందుఁ బ్రమాణము. ఆ వెంటనె వచ్చె = 'వరం హుతవహజ్వాలాపంజరాంతర్వ్యవస్థితిః। న శౌరి చింతావిముఖ జనసంవాద వైశస'మ్మన్నట్లు విభీషణునికి రావణ గృహవాసము మండెడి నిప్పులో నడుగు పెట్టినట్లుండెననియు, మొదపలుపు విచ్చిన దూడ తన తల్లి యొమ్ము చేపుటకై యొక్కడను జాగుచేయక పరుగెత్తుకొని వచ్చినట్లంత వేగముగా విభీషణుఁడు రామునిసన్నిధికి వచ్చె ననియు దీనిచేత సూచితము. విభీషణుఁడు తనకు రావణసభయందుఁ గౌరవ లేనప్పుడు రామసన్నిధానమే స్వగృహమని తలంచినాఁడు. కాన కవి — విభీషణుఁడు రామ సన్నిధానము నకుఁ బోయె నని చెప్పక, వచ్చెనని చెప్పెను. స్వగృహమునకు వచ్చెను, పరుల గృహమునకుఁ బోయె నగుదా లోకరూఢి. సలక్ష్మణుఁడు (1) రామునికి లక్ష్మణుఁడు వ్యావర్తక విశేషణము. (2) పురుష కారనాన్నిధ్య మీ పదము చెప్పు

ననియు నగును. జనకసుతానాథుఁ డున్న స్థలమునకున్ = రామునికంటెను రామ నివాసదేశ మత్యంత ప్రాప్యమని సూచితము. ఈ పద్యము నందు భగవంతుని విరోధించుకొను వారిదేశమును వదలివేయవలె ననియు భగవత్సంబంధము గల దేశమే వాసార్హ మనియు సూచితము. అందును అట్టి భగవత్సంబంధమును భాగవతాభిమానపాత్రము కాదేని 'సా కాశీతి న చాకశీతి' యన్నట్లు పరిత్యాజ్యమే యనియు, భాగవతాభిమానపాత్రమై భగవత్సంబంధముగల దేశమే జనులకుఁ బ్రాప్యమనియు సలక్ష్మణుఁడను శబ్దముచేత సూచితము.

విభీషణుఁడు బ్రహ్మవిశ్రవస్సు మొదలగు మహర్షియుల యపారకరుణచేత సకల ధర్మముల నెఱిఁగినవాఁడు. అంతియకాక 'విభీషణస్తుధర్మాత్మా' యని యచ్చటచ్చట విశేషించి పొగడఁబడిన వాఁడు. రావణుఁ డన్ననో 'జ్యేష్ఠభ్రాతా పితృసమ' యన్నట్లు విభీషణునికిఁ దండ్రివలె సేవింపఁ దగినవాఁడు. మఱియు విభీషణునికి బాల్యమునుండియు పోషకుఁడు. అంతేకాక శత్రువు లిపుడు రావణుని పై పడ దండెత్తి వచ్చియున్నారు. ఇట్లుండఁగా నింతటి ధర్మాత్ముఁడైన విభీషణుఁడు తన కింతటి మహోపకారియైన రావణుని నింతటి మహా విపద్దశలో క్షుద్రబుద్ధివలె వదలిపెట్టి పోవుట యుక్తమా? వదలెనుబో నేరుగా వానితల తఱుగవలె నని యున్న రామునొద్దకాపోవలెను. పోయెనుబో, రావణుని రాజ్యము తనకు వచ్చునట్లు చేయవలె నని రాముని వేఁడుట యుక్తమా? వేఁడెనుబో, రావణుఁడు చచ్చుటకుఁ దగిన యుపాయములను రామునికి జెప్పుట యెంతయుఁ దగదు. అనునీయాక్షేపణములు విభీషణునిపై గలుగవచ్చును. కాని "గురోరప్యవలిప్తస్య కార్యాకార్యమజానతః ఉత్పథం ప్రతిపన్నస్య పరిత్యాగో విధీయతే" "కార్యం భవతి శాసనమ్" అన్నట్లు తప్పులకుఁ బుట్టినిల్లైయున్న రావణుని వదలిపెట్టుట విభీషణునికి దోషము కాదని సంక్షేపముగఁ గొందఱు సమాధానము చెప్పుదురు.

శ్రీ వేదాంతాచార్యులవారు ఈ యాక్షేపణములకు విస్తరించి సమాధానము చెప్పియున్నారు. అదెట్లనగా:— విభీషణుఁడు బ్రహ్మయిచ్చిన వరము ప్రకారము గొప్ప జ్ఞానసంపన్నుఁ డగుటచేత సర్వవేదాంత వేద్యుఁడై, సర్వలోకేశ్వరుఁడై, సర్వలోక శరణ్యుడై, ముక్తప్రాప్యుఁడై, బ్రహ్మమైన, శ్రీమన్నారాయణుఁడే లోకోజ్జీవనార్థమై శ్రీరాముఁగా భూమిపై నవతరించి యున్నాఁడని నిస్సందేహముగఁ దెలిసికొని యున్నాఁడు. ఇట్టి విశేషజ్ఞానము గల విభీషణునికిఁ దా ననుష్ఠించు ధర్మములలో సామాన్య విశేషములను బరీక్షించి విశేషధర్మముతో విరోధించు నపుడు సామాన్యధర్మము వదలి విశేషధర్మము మాత్ర మనుష్ఠించుటయు, అట్లు విరోధము లేనపుడు రెంటి ననుష్ఠించుటయు నిట్టివి కర్తవ్యములు - అట్లుగాన నీతనికి నన్న ననుసరించియుండుట సామాన్య ధర్మము - పరమాత్మ యగుఁ శ్రీరాము ననుసరించి యుండుట విశేషధర్మము - యజ్ఞాదులు తాము సాక్షాత్తుగా

ప్రధాన పరమాత్మారాధనములు గాక ప్రధాన పరమాత్మారాధనమున కంగము లైనట్లు ఫలాభిలాష లేని శ్రేష్ఠానువర్తనమును బరమాత్మారాధనాంగమై, యప్రధానమైన సామాన్య ధర్మము. రామానువర్తన మట్లుగాక తానేపరమాత్మారాధన మగుటచేతఁ బ్రధానమైన విశేష ధర్మము. ఈ సామాన్య విశేష ధర్మములకు విరోధముండిననే తప్పనితర సమయములందు నీ రెండును ననుష్ఠేయములే కాబట్టియే విభీషణుఁడు ఈ రెంటికిని విరోధము కల్పించి రెంటిని ననుష్ఠింపఁ దలఁచి రావణునికి వలసినంతమట్టుకు హితోపదేశము చేసెను. రావణుఁడు రామునికి లోఁబడినచోఁ దనకు రామరావణోభయానువర్తనమును దటస్థించు నని విభీషణుని తలంపు గాని యసురస్వభావుఁడైన రావణుఁడు రామునిపై వైరమును దృఢముగా మనస్సున నుంచుకొని విభీషణుని హితోపదేశము నేమాత్రమును వినఁడయ్యెను. విభీషణుఁడు దీనిని జూచి రామవిరోధియైన రావణుని దానుసరించి యున్నచో రావణునివలెఁ దనకును రామవిరోధము తప్పదు. ఇది మహానర్థకరము అనియెంచి "వరం హుతవహ జ్వాలా" యను న్యాయప్రకారము దుర్మార్గుఁడైన యీ రావణుని సాంగత్యము వదలి విశేషధర్మమైన రామసేవనే యనుష్ఠింపఁబోయెను. కాఁబట్టి యిందేమి తప్పో నిరూపింపుఁడు.

ఇంతవఱకు నుపకరించిన రావణుని వదలి రాజ్యాపేక్షచేత రాము నాశ్రయించుట విభీషణునికి కృతఘ్నత కాదా యనియు నాక్షేపించరాదు. విభీషణుఁడు రాజ్యాపేక్షచేత రాముని నాశ్రయించినట్లు లెచ్చటను జెప్పియుండలేదు. విభీషణుఁడు తన్ను రామునికిఁ దెలిపి కాపాడవలె నని వానరులను వేఁడుకొను నపుడు "అలుబిడ్డలను ద్రోసికి యియ్యెడ రామచంద్రునిన్ శరణము చొచ్చినాఁడ" నని తన కున్న వైరాగ్యము స్పష్టపడునట్లునొక్కి చెప్పియున్నాఁడు. ఇట్లే విభీషణుఁడు శ్రీరాముని చరణంబులపైఁబడి తన్ను నివేదించుకొనునపుడు 'నిను శరణంబుఁజొచ్చితిని, నెయ్యుర లంకసిరిం ద్యజించితిన్। మనుజవరా! భవద్గతము మత్సుఖ జీవిత రాజ్య భోగముల్' అని తనకు రాజ్యాదులపై నభిలాష లేదనియు రాముని పాదసేవయే తనకు సకలవిధ పురుషార్థము లనియుఁ జెప్పియున్నాఁడు. వీనిని బట్టి చూడఁగా విభీషణుఁడు రాజ్యమునకై రాము నాశ్రయింపలేదనుట స్పష్టము. 'వినుమా రావణుఁ బుత్ర మిత్ర సచివాన్వితున్...ప్రాణావన్విడఁ జిమ్మి నిన్ననఘా. కట్టెద పట్ట మయ్యసురరాజ్యశ్రీకి సత్యంబుగన్" అని రాముఁడు విభీషణునికి రాజ్య మిచ్చునట్లు చెప్పుటయు విభీషణునిపై రామునికిఁగల్గిన నిరతిశయప్రీతికొఱకై యానుషంగిక ఫలమని యెఱుఁగునది. 'ఆయురారోగ్యమర్థాంశ్చ భోగాంశ్చైవానుషంగికాన్। దదాతి ధ్యాయతాం నిత్య మపవర్గప్రదో హరి' యని యనన్య ప్రయోజనులై తన్నాశ్రయించిన వారికి భగవంతుఁడు సకల పురుషార్థంబుల నిచ్చునని చెప్పఁబడెను గదా, ఇంత మాత్రమే తప్ప విభీషణుని కేమాత్రమును రాజ్యాభిలాష లేదు. "తానును రాజ్యము

వేడుపొంబు నీ, రామహీశ నీయెడకుఁ దారసిలెన్మతిపూర్వకంబుగన్'' అనిహనుమంతుఁడును 'స్థిరమతి రాజ్యకాంక్షఁ జనుదెంచిన వాఁడగు' నని శ్రీరాముఁడును సుగ్రీవునితోఁ జెప్పుట, విభీషణుని జేర్చికొంటమేని రామునికేమికీడు కలుగునో యని భయపడియున్న పరమభక్తుఁడైన సుగ్రీవుని యజ్ఞానముతీరుటకై లోకసిద్ధమైన రాజనీతి ప్రదర్శనమే కాని వాస్తవ విభీషణాభిప్రాయముగాదు. 'అంతరంగబహిరంగయో రంతరంగం బలీయ' యని యొక న్యాయము కలదు. హనుమద్రామ వాక్యములకును విభీషణవాక్యమునకు విరోధము కల్గినపుడు విభీషణవాక్యానుసారముగనే తక్కిన వారి వాక్యముల కర్థము చెప్పవలెను. కాని విభీషణాభిప్రాయ మెఱుఁగని యితరుల వాక్యము ప్రకారము విభీషణవాక్యమున కర్థము చెప్పరాదు. విభీషణవాక్య మంతరంగము. తక్కిన వారి వాక్యము బహిరంగము. అంతరంగ బహిరంగములలో నంతరంగము ప్రధానము. మఱియు, 'నిన్న నఘా కట్టెద పట్టము న్యసుర రాజ్యశ్రీకి సత్యంబుగ' నని రాముఁడు చెప్పినమాటకు సరియే యని యొప్పుకొనక 'అనఘశీల మదీయదేహమునందుఁ బ్రాణములందు నందనుకఁ జొచ్చెద శత్రుసేన నితాంత సాహ్యమొనర్తు లం, కను వినాశ మొనర్చ రాక్షసకాండముం బరిమార్చుఁగన్' అని తాను రామునికిఁ జేయు పరిచరణమునే చెప్పుకొనియున్నాడు. దీనిని జూచినను విభీషణునికి రాజ్యాభిలాష లేదనుట స్పష్టము. విభీషణుని కిష్టములేకున్నను రాముఁడు బలాత్కరించి రాజ్యము నిచ్చిన ట్లుత్తరకాండమునందుఁ జెప్పియున్నది. "యావత్ప్రజా ధరిష్యంతి తావ త్త్వం వై విభీషణ! రాక్షసేంద్ర మహావీర్య లంకాస్థ స్త్వం ధరిష్యసి॥ శాసిత స్త్వం సఖిత్వేన కార్యం తే శాసనం మమ। ప్రజాస్సంరక్ష ధర్మేణ నోత్తరం వక్తు మర్హసి" యని యచ్చటి వాక్యము. ఇట్లు విభీషణుఁ డనన్య ప్రయోజనుఁడై శ్రీరాములవారి నాశ్రయించినవాడు గనుకనే శ్రీరాముఁడును దన కులధనమైన శ్రీరంగనాథుని నితనిచేతనే వేంచేపు చేసియిచ్చెనుగాని మఱెవ్వరిచేతను నియ్యలేదు. విభీషణునికి స్వయముగా రాజ్య మిష్టము కాకున్నను ధర్మసంస్థాపనార్థమై యవతరించిన శ్రీరాములవారి యాజ్ఞను మీఱఁగూడదు కాన వారి యాజ్ఞానుసారమై శేషించిన రాక్షసులను ధర్మమార్గమునకుఁ ద్రిప్పి రక్షించుటకుఁగా రాజ్యము తా నంగీకరించెను. ఇదియు శ్రీరాములవారియాజ్ఞానువర్తనమై కైంకర్యములలో నంతర్భవించుటచేఁ దన స్వరూపానురూపమని విభీషణుని తాత్పర్యము సకలధర్మములు జక్కఁగా నెఱిఁగినట్టి లక్ష్మణుఁడును, 'అహం తావన్మహారాజ పితృత్వం నోపలక్షయే' భ్రాతా భర్తా చ బంధుశ్చ పితా చ మమ రాఘవ' యన్నట్లు కర్మకృతపితృత్వసంబంధముగల దశరథుని వదలి పెట్టి నిరుపాధికసకలవిధబంధువైన శ్రీరాము నాశ్రయించి 'అగ్రత స్తే గమిష్యామి పంథాన మనుతోభయం। అహం సర్వం కరిష్యామి జాగ్రత స్స్వపతశ్చ తే' యని శ్రీరామపరిచరణమే ఫలముగాఁ బ్రార్థించియున్నాడు. 'సభ్రాతుశ్చరణౌ గాఢం నిపీడ్య రఘునందన' యన్నట్లు శ్రీరాములవారిని శరణుఁ జొచ్చియు

నున్నాఁడు. అట్లుగనే శ్రీవిభీషణుఁడును కర్మకృతభ్రాతృత్వసంబంధము గలరావణాసురుని వదలిపెట్టి స్వాభావిక సకలవిధబంధువైన శ్రీరాముని గైంకర్యాపేక్షచేతనే యాశ్రయించినాఁ డనుట దృఢము. కాఁబట్టియే "సతు నాగవర శ్శ్రీమాన్" అనియు 'లక్ష్మణో లక్ష్మి సంపన్న' యనియుఁ బొగడినట్లు విభీషణుఁడు రావణునిఁ బరిత్యజించి రాము నాశ్రయింప బయలుదేఱు నప్పుడును 'నలుపు రసురులతో వియన్మార్గ మెగసి।యులక శ్రీమంతుఁడన్నతో' నని యొనిట్లు' శ్రీమత్పదముచేత స్తోత్రముచేసెను. కాఁబట్టి విభీషణుని యెడ నధర్మాక్షేపణ మే మాత్రమును జేయరాదు. శ్రీరామలక్ష్మణులు నాగపాశబద్ధులై యున్నప్పుడు వారికష్టమునుజూచి విభీషణుఁ డేడ్చుచు 'ధీరుల నేరిఁ జేరితిఁ బ్రతిష్ఠను గోరి నరేంద్రు లిద్దఱే తీరున మిత్తిగూరెడి గతిం బడినారిఁక నేను మన్నడన్, గూరియుఁ జచ్చినట్లయితిఁ గుంఠితరాజ్యమనోరథుండనై కోరికయుం బ్రతిజ్ఞ సమకూడె దశాస్యున కేమి పాపమో" యని తనకు రాజ్యము లభింపక పోయెఁగదా యని దుఃఖించి యున్నాఁడు. విభీషణునికి రాజ్యాభిలాషయే లేనిచో నీ మాట యెట్లు సమంజసమగు ననియు నాక్షేపింపరాదు. ఈ పద్యమునందు ప్రతిష్ఠ యనఁగా రామకైంకర్య ప్రతిష్ఠ యని యర్థము - అకుంఠితరాజ్యమనోరథుండనై యనఁగా "మనుజవరా,భవద్గతమువత్సుఖ జీవితరాజ్యభోగము" లన్నట్లు నే నపేక్షించిన కైంకర్యసామ్రాజ్యము లభింపక పోయెఁగదా యని భావము - ఆ సమయముననే సుగ్రీవుఁడు "అల్లన లంక నీవ యేలెదు। తనయులతోఁ గనఁడు కాంక్షితము రావణుఁడు' న్నని విభీషణుని నూఱార్చుటయు నాతని యభిప్రాయ మెఱుఁగక చెప్పినమాట యని తెలియునది- కేవల రామసేవార్థమే విభీషణుఁడు శ్రీరాములవారి నాశ్రయించి నాఁడన్న సంగతి 'నీ యానతిఁ గొని చని, యాతరా యెడలన్ నిలిపి సేనలన్నియును యథా,న్యాయంబుగ విభజించితి,చేయంగల యంత పట్టు చేసితి నధిపా'యని ఈ కాండమున నెనుబది నాల్గవ సర్గంబు నందలి పద్యము చేతఁగూడ స్పష్టమగుచున్నది. కావున విభీషణుని యం దెట్టిదోషశంకయు లేదు.

క. మేరుగిరిశిఖరతుల్యా, కారు జ్వలచ్చంచలాని॰కాశు నభస్సం
చారుని ధరణీగతవన,చారిప్రాగ్రసరచయము • సంవీక్షించెన్. ౩౧౯

అర్థములు. విభీషణుడు రావణునివదలి యాకాశమున కెగురునపుడే సుగ్రీవాది వానరులాతనిని గనిపెట్టిరనుచున్నాఁడు. మేరుగిరి శిఖరతుల్యాకారునిన్=ఎత్తు, లావు,సకలరత్న పరిపూర్ణత,వీనిచేత మేరుశిఖరసామ్యము. ఇంతియకాక, విభీషణుఁడు తాను శత్రుపక్షము వదలి మనస్సు కుదుటఁబడి నిశ్చలుఁడై యున్నాఁడనియు, మిక్కిలి ప్రకాశించుచున్నాఁడనియుఁ దాను శ్రీరామునికిఁ బరతంత్రుఁడని తెలుపు నట్లున్నాఁ డనియు మేరుశిఖరసామ్యముచేత వివక్షితములు. ఇట్టి గుణములచేత శృంగతుల్యుఁడైన విభీషణుఁడు రావణుని వదలుటచేత నతనికి శృంగభంగమైన దనియు రాముని సన్నిధికి వచ్చుటచేత నతనికి శృంగలాభమైన దనియు

సూచితము. జ్వలత్ + చంచలా + నిశాశున్ = మెఱయుచున్న మెఱుఁగువంటి వానిని = కాంత్యతిశయమునందును, నాకాశ సంచారమునందును మెఱుఁగు దృష్టాంతము. రామభక్తులైన వానరులు తన్నుఁ దమలోఁ జేర్చుకొనరేమో యని భయకంపమును, తాను వారలలోఁ జేరనిచో బ్రతుకుటయే యసాధ్యమని గమన త్వరయు నీ దృష్టాంతమున సూచితములు. అతని నని విశేష్య మధ్యాహార్యము. కాలుచిచ్చున విశేషతాపముఁ జెంది శీతల హ్రదము వెదకి పోవువానివలె మిక్కిలి యాత్రముతో వచ్చెడి విభీషణుని నభస్సంచారుని నంవీక్షించెను. రావణసభనుండి యాకాశమున కెగురునపుడే యంతదూరముననే చూచెను. ధరణీ......చయము= ధరణీగత=(౧) భూమిపై నెట్టికీడుగాని రాకుండ రక్షింపవలెననిమాత్ర మాజ్ఞప్తులై యున్నను ఆకాశమార్గముగా వచ్చిన విభీషణునిఁగూడఁ గనిపెట్టిరిగదా యని వానర జాగరూకత దీనిచేత సూచితము.

(౨) అచ్చటచ్చటఁ జెట్లపైనున్న వానరులు ఆకాశమున విభీషణునిఁ జూచు నప్పటికి రామునికేమి కీడుకలుగునో యని యెంచి భూమిపైఁదూకి యందఱును రాముని జుట్టుకొనిరని భావము. ప్రాగ్రసరులు=శ్రేష్ఠులు, వీర లింత జాగ్రత్తతో రామునిఁ గాచుచున్నారుగదా యని కవిస్తోత్రము చేయుచున్నాఁడు వనచారిప్రాగ్ర సర శబ్దముచేత. వనచారి ప్రాగ్రసరచయము సంవీక్షించెన్ = ఒక వానరుఁడు చూచి మఱియొకనికిఁ జెప్పఁగ నిట్లందఱును దెలిసినదనిగాదు, అందఱునేకకాల మందే చూచిరని భావము. ప్రతికూల సాంగత్యత్యాగము మాత్రమే కాక యనుకూల కటాక్ష పాత్రతయు విభీషణునకు లభించెనని యీ పదమునందుఁ జెప్పినట్లాయెను.

తాత్పర్యము

మేరుపర్వతముయొక్క శృంగముతో సమానమైన పొడవైన యాకారము గలట్టియు, ధరించిన యాభరణములచే మెఱయుచున్న మెఱుపుతో సమాన మైనట్టియు, ఆకాశమునందుఁ బయనించి వచ్చునట్టియు వానిని భూమియందుండు వానరశ్రేష్ఠ సమూహములు చక్కఁగా జూచెను.

రాక్షసులే ప్రక్కనుండియైన వత్తురు, వానర నాయకులు కనిపెట్టి యుండ వలయునని రామచంద్రమూర్తి యాజ్ఞాపించి యుండుటచేఁ బదిదిక్కులను బరిశీ లించి హెచ్చరికతోఁ బదిదిక్కులందు జూచుచుండిన వానరశ్రేష్ఠులు విభీషణుఁడు దూరమునందుండఁగనే యతనిఁ జూచిరి.

వనచారి చయము సంవీక్షించెన్=అనుటచే నొకఁడు చూచి మరియొకనికిఁ జెప్పలేదనియు వానరసమూహమంతయు నేకకాలమందే చూచెననియు గ్రాహ్యము. అందఱు నంత హెచ్చరికతో నున్నారని సూచన.

క. తనతో నైదవవాఁడయి, చను దెంచెడు నతనిఁజూచి • చతురుఁ డసాధ్యుం
డినసుతుఁ డాలోచించుచు, వనచరతతితోడ నిమిష•పర్యంతంబున్. ౩-౨౦

అర్థములు. తవతో నైకవవాఁడయి=తాను గాక మఱినలుగురితోఁ గూడిన వాఁడై, ఆ యయిదుగురిలో నితఁడే ప్రధానుఁడని భావము. తవతో నైదవవాఁడను టచే, తనకు రామచంద్రమూర్తి యం దెంతభక్తి, యెట్టి యభిప్రాయము గలదో తక్కిన నలుగురికి నంతటిభక్తియు, నట్టి యభిప్రాయము గలదని భావము. చతురుఁడు=మిగుల సమర్థుఁడు, ఆలోచనమందు, కార్యనిర్వహణమందు, యుద్ధమందు నేర్పుగలవాఁడు. కనుక నే విభీషణుని జూడఁగనే శత్రువని భ్రమింపక వీఁడెవఁడు? ఏల వచ్చుచున్నాఁడని యాలోచింపఁ గలిగెను. అసాధ్యుఁడు=తిన్నఁ జూచినంత మాత్రముననే వీనిని మనము జయింపలేమని భయపడి వెనుకంజ పెట్టవలసిన రీతిగ నుండువాఁడు, ఆలోచించుచున్ = వీఁ డెవ్వఁడు? వేగులవాఁడా, వేగువాఁడైన పక్షమున మాఱువేషముతో, సౌమ్యవేషముతో రహస్యముగ వచ్చునుగాని యిట్లు బయలు మెఱసి యథాస్వరూపముతో నాయుధధారియై వచ్చునా? రాఁడే - ఇక యుద్ధమునకు వచ్చెనందునా? ఇంత సేనను నైదుగురు గెలువఁగలరను ధైర్యముతో వచ్చెనా? ఒకవేళ బయలు దేఱునపుడు తోఁపకపోయినను ఇంత సేనను జూచిన పిమ్మటనైన జంకవలయును గదా! జంకులేక యెవ్వని పరిచితునివలె వచ్చుచున్నాఁడే? కావున వీఁడు యుద్ధమునకును వచ్చువాఁడు కాఁడు. ఈ యిరువురు కాకపోయిన వేఱుకార్య మితని కిం కేమి గలదు అని యాలోచనవిధము. నిమిషపర్యంతము = అల్పకాలము-దీర్ఘకాల మాలోచించు చుండిన శత్రువైనచో వచ్చి మీఁదఁ బడునే మనుచు. వనచర తతితోడన్ = 'కం. విను మధురాహారంబులు, గొనుటయుఁ జెక్కిండ్రు నిదుర గూడిన యెడ మేల్కని యుండుట కార్యాలోచనము దెరువు నడచుటయును జన దొక్కనికిన్' భార - అని యుండుటచే నేను జతురుఁడను, ఒకరితో నే నాలోచింపవలెనా, నాకంటె వీరు బుద్ధిబలము గలవారా - యని రావణునివలెఁ దలఁపక కార్యము చేయుటకు ముందే పలువురతో నాలోచించెను.

తాత్పర్యము

తాను గాక మఱి నలుగురిని దీసికొని వచ్చుచున్న యతనిఁ జూచి కార్యనిర్వహణమందు నేర్పుగల వాఁడును, అసాధ్యుఁడును నగు సుగ్రీవుఁడు అల్పకాలము వానరులతో నాలోచించెను. ఇట్లాలోచించి,

క. హనుమత్ప్రముఖుల కిట్లనుఁ, గనుఁడీ రక్కసులు గొల్వఁగాఁ నల్వురు తన్
మనుజాశనుం డఖిల సాధనములతో మనలఁ జంపఁదలఁచి యిదె వచ్చెన్. ౯-౧౦

అర్థములు. హనుమత్ప్రముఖులకు = హనుమంతుఁడు మొదలగువారికి - హనుమంతుని పేరు చెప్పుటచే లంకయం దితని హనుమంతుఁడు చూచి యుండ వచ్చును. ఎట్టివాఁడైనది యాయనకుఁ దెలిసియుండవచ్చునని యాయనతో నిట్లనెనని భావము. గౌరవకాలమందు వృద్ధుఁడగు జాంబవంతుఁడు పూజ్యుఁడు. ఆలోచనకాలమందు బుద్ధిసంపన్నుఁడైన హనుమంతుఁడు పూజ్యుఁడు. కావున హనుమంతుఁడు

చెప్పఁబడెను. మనుజాశనుండు = మనుష్యుల భక్షించువాఁడు. ఇట్లనుటచే రామలక్ష్మణులఁ జంపి తినుటకై వచ్చుచున్నాఁడని భావము. అఖిల సాధనములతో = సర్వాయుధములతో - విభీషణుఁ డొక్క గదతో బయలు దేఱి వచ్చెనని ముందు చెప్పఁబడెను. యుద్ధకాలమందుఁగూడ గదతోనే యుద్ధము చేసినట్లు చెప్పఁబడెను గాని మఱియొక యాయుధ మాయన పట్టినట్లు చెప్పఁబడలేదు. ఇట్లుండ సర్వాయుధము లని యెట్లు చెప్పెను ?

(౧) ఎంతటి శూరులైనను యుద్ధమునకు వచ్చునపు డొంటి యాయుధముతో రారు. రామలక్ష్మణు లంతటివారు విల్లు బాణములేగాక, కత్తులు ధరించి యున్నట్టు చెప్పఁబడెను. కావున వెలుపలికిఁ గానవచ్చునది యొక యాయుధమే యైనను దక్కిన యాయుధములు ధరించి యుండవలయునని యూహించి చెప్పెను.

(౨) తక్కిన నలువురు ధరించిన యాయుధములను గలుపుకొని చెప్పెనని చెప్పవచ్చును. ౫౧౦ వ పద్యమున గదాహస్తుఁ డను చోట గద యనునది తక్కిన యాయుధముల కుపలక్షణము.

విభీషణుఁడు విల్లుపట్టి యుద్ధము చేసినట్లు ౧౯౭౦-౨౧౦౩-౨౧౦౪ పద్యములయందుఁ గలదు. కావున విల్లు పొదులు కలవాఁడై వచ్చెననుట తప్పుగాదు. ఆయనకు ముఖ్యసాధనము గద - దానిని చేతధరించి వచ్చెను. విల్లు మూఁపున వ్రేలాడుచుండెను.

మనుజాశనుఁ డనుటచే జాతిచేతనే క్రూరకర్ముఁడనియు, రక్కసులు నల్వురనుటచేఁ గ్రూరసహాయులు కలవాఁడనియు, నఖిలసాధనములతో అనుటచేఁ గ్రూరకార్యము చేయఁ గావలసిన సాధనసంపత్తి గలదనియు, నాకారణముచే వీఁడు చంపవచ్చెనే కాని సాధుభావముతో సంధికై రాలేదనియుఁ దలఁచెనని భావము. తథ్యము = సత్యము.

తాత్పర్యము

హనుమంతుఁడు మొదలగువారితో నిట్లనెను. ఈమనుష్యభక్షకుఁడు నలుగురు రాక్షసులతో,సమస్తాయుధములతో నిజముగా మనలఁ జంపుటకై వచ్చుచున్నాఁడు.

ఉ. నావుడు వానరేంద్రు వచ • నంబులు వీనుల సోఁకినంతనే
గ్రావములన్ ధరారుహని • కాయములం గొని యిట్లు పల్కి రో
దేవ! దురాత్ములన్ వధి వ • ధింపఁగ నానతి యిమ్ము, యిప్పుడే
జీవముఁ బాసినేలఁ బడి • చెల్లిరి చూడుము స్వల్పతేజులన్. ౩౨౨

అర్థములు. వీనులన్ = చెవులను, గ్రావములన్ = రాలను, 'గ్రావాఽ పర్వతోఽపలౌ' యని నానా.ర. ధరారుహనికాయములన్ = చెట్ల సమూహములను; కర్తృపదము వానరయూథముఖ్యులు.

తాత్పర్యము

అని సుగ్రీవుఁడు చెప్పిన మాటలు చెవులఁబడఁగానే వానరయూథముఖ్యులు

జాలు, చెట్లు తీసికొని యిట్లనిరి. రాజా! వీరిని త్వరగాఁ జంపుఁడని యుత్తరువిమ్ము. బలహీనులగు వీరు త్వరలోనే ప్రాణములుపోయి నేలఁబడి పొర్లఁగాఁ జూచెదవు.

వీనుల సోఁకినంతనే యనునది కార్యమునందలి త్వర సూచించును. చెవిలో మాటలు చొచ్చెను. చేతికి జాలు చెట్లువచ్చెను; రెండు నేకకాలమందే జరిగెనని భావము. జాలను చెట్లను ననుటచే చేతికి దొరికినదాని ననికాని యొకచేత జాయి, యొకచేతఁ జెట్టనికాని గ్రహింప నగును. ఇది రామసేవయందలి యాదరాతిశయమును సూచించును. రామసేవయందుఁ బట్టాభిషేకసమయమున నందఱు నొకొక్క వస్తువును దీసికొనఁగా లక్ష్మణుఁడు రెండుచేతులందు భద్రచామరముల నేకకాలముసఁ దీసికొనెనుగదా - రాక్షసుల నశింపఁజేయుటయు భగవత్సేవయేకదా- ఇట్లు చెప్పుటచే భగవత్సేవయందుఁ గైంకర్యపరులు సదా దాస్యసిద్ధికొఱకు వారివారికృత్యములందు వారువారు హెచ్చరిక పడియుండవలయు ననియు, నొకరు చెప్పినఁ జేయుద మని కాచియుండరా దనియు నేర్పడుచున్నది. దేవకార్యమందుఁ దమకెంత యుత్సాహమున్నను ప్రభువు నాజ్ఞలేక యేకార్యము చేయరాదు. పారతంత్ర్యహాని మాకు రారాదు. కావున ప్రభువైన నీయాజ్ఞ వేచియున్నారమని సూచితము-దురాత్మ్యలన్=వాఁడేల వచ్చెనో తెలియకముందే యెట్లు వానిని జంపుమందు వనెదవా! వారు స్వభావముచేతనే దుష్టులు-అట్టివారు మంచియుద్దేశముతో వత్తురా-కావునఁ జంపవలసినదే-వడిన్ = ఆలస్యముచేసిన ముందు-మించి నిన్ను వాఁడు తటాలునఁ జంపిన నేమి చేయువచ్చును. కావున వాఁడు పైపడకముందే యాజ్ఞ యిమ్ము- వధింపఁగన్=బంధింపరాదు-కొట్టి తఱుమునురాదు, అట్లుచేసిన వారు మరలఁ గీడు చేయకమానరు-కావునఁ జంపుటయే కర్తవ్యము-ఆనతియిమ్ము=చంపిన బాగేమోయని సందిగ్ధముగఁ జెప్పకుము. ఆజ్ఞ చేయుము-ఇప్పుడే, మఱి యెప్పుడోకాదు - నీనోటిమాట నీనోట నుండఁగనే, నేలఁబడి చెల్లిరి = ముందు నేలఁ బడగొట్టెదము - మరల నాకాశమున కెగురకుండఁ జంపెదము-యుద్ధమున వారే గెల్తురో మీరే గెల్తురో యనెదవా-వారల్ప తేజులు=ఇట్టి తేజోహీనులు మమ్మెట్లు గెల్వఁగలరు. పల్కిరి=బహువచన ప్రయోగముచేఁ బ్రతి వానరుఁడు చెప్పెనని గ్రాహ్యము, రామకార్యాసక్తియందలి యతిశయముచేఁ బ్రభువు నెదుటనంత తొక్కిసాకిగ నడువచ్చునా యను నౌచిత్యజ్ఞానము కూడ లేక యందఱుఁ బలికిరని భావము.

—• విభీషణుఁడు తనరాక శ్రీరామునకుం దెలుప వానరులవేఁడుట •—

మ. అనుచు న్వానరయూథముఖ్యు లిటు ల•న్యోన్యంబు భాషింపఁ గ
కుక్కనఁ దా వచ్చి విభీషణుండును మద•కూకలంబునం జేరి మిం
టన నిల్చుండి మహాత్ముఁడు న్సుమతి యం•ద ర్గోపితులన్ భానుమ
త్తనయుం జూచి వచించె స్వీయ మగు వృ•త్తాంతం బుదారధ్వనిన్. ౩_౨౩

అర్థములు. అన్యోన్యంబు = ఒకరితో నొకరు, సంభాషించుచుండన్ = ముచ్చటలాడుచుండఁగ, వాఁడు వచ్చి యేమిచేయఁగలఁడులే-ఏమిచేయునో చూతము లే-మనమేల ముందుగనే కలహమునకుఁ గాలు ద్రవ్వవలెనులే యని యుపేక్ష వహించియుండఁగనే; గగనాన్ = వేగముగ-ఆవునో ద్దకఁ బాలు ద్రాగుటకై పరువెత్తు లేదూడవలె-విభీషణుండును = అనుటచేఁ దక్కిన నలువురుకూడ, ఉదక్కూలంబునన్ = ఉత్తరతీరమున, ఖింటన = ఆకాశమందే. మహాత్ముఁడు = గొప్ప మనస్సుగలవాఁడు, సుమతి = మంచి మనస్సుగలవాఁడు, ద్రోహబుద్ధి లేనివాఁడనుట; అందఱు+క్రోతులన్ = అందర్గోత్రులన్ = శకట రేఫము సంయుక్తమైనపుడు లఘురేఫముగా మాఱును, భానుమత్తనయున్ = సూర్యపుత్రుఁడైన సుగ్రీవుని, ఉదాత్తధ్వనిన్ = పెద్ద కంఠధ్వనితో.

ఉదక్కూలంబునం జేరి = తన్నుఁ జూచి వానరులు కలవరపడుట, తన్నుఁ జంప జాలు చెట్లు తీసికొనుట పరికించియు వీరు తన్నేమి చేయుదురో యని భయపడక వారేమైనఁ జెప్పుకొననీ సర్వజ్ఞుఁడు పరమకారుణికుఁడు సర్వశరణ్యుఁడు శ్రీరామచంద్రమూర్తి తప్పక నన్ను రక్షించునని మహావిశ్వాసముంచి వారల మాటలు పెడచెవినిబెట్టి తన్నుఁజంప యత్నించుచున్న వానరుల యెదుటనే వారి సమీపమందే యాకాశమున నిర్భయముగ నందఱకుఁ దెలియునట్లు నిలిచియుండెనని భావము.

• మహాత్ముఁడు='బహూనాం జన్మనా మంతే జ్ఞానవాన్ మాం ప్రపద్యతే వాసుదేవ స్సర్వ మితి స మహాత్మా సుదుర్లభః'॥ అనేక పుణ్యజన్మముల కడపట జ్ఞానముగలవాఁడై దాని ఫలముగ నన్నుఁ బ్రపత్తిచేయును. అనగా నా శరణుచొచ్చును. ఏమని? నాకు సర్వము అనఁగా 'రక్షక శ్శేషీ నివాస శ్శరణం మహత్' నాకు రక్షకుఁడు స్వామి, నిలువనీడ, గొప్పశరణము. అన్నట్లును, 'స్వామి త్వేవ సుహృత్త్వేవ, గురుత్వేవ చ సర్వదా పితృత్వేవ సదా భావ్యో మాతృత్వేవ చ మాధవః' స్వామి యని స్నేహితుఁడని గురువని తండ్రియని తల్లియని విష్ణువును దలఁపవలయును అన్నట్లును, 'రాముఁడె భ్రాతయు భర్తయు రాముఁడె ప్రియబంధువరుఁడు రాముడెచుమిమ్మా, రాముడెఁ నా జనకుండును' (అయోధ్య ౧౯౭౩) అని లక్ష్మణుఁడు చెప్పినట్లును నాకు సర్వము భగవంతుఁడే యను భావముకలవాఁడే శరణుచొచ్చును. ఇట్టి మహాత్ముఁడు సుదుర్లభుఁడు అని భగవంతుఁడు కృష్ణమూర్తి మహాత్ముఁడని యెవనిని జెప్పెనో యట్టి మహాత్ముఁడు.

సుమతి=మంచి మనస్సుగలవాఁడు, వానరులు తన్నుఁ జంప యత్నించుచుండినను వారియందు భగవంతుఁడు శ్రీరామచంద్రమూర్తియందే వాసులు గావున భగవంతులను గౌరవము గలవాఁడు. వానరులు నన్నిపుడు చంప నాలోచించట నాపై ద్వేషముచేఁగాదు. రామచంద్రమూర్తి యందలి ప్రేమాతిశయము చేతనే

(లక్ష్మణుఁడు భరతునిఁ బంపెద నన్నట్లని యెఱుంగునది.) వారి స్థానమందు నే నుండిన నేను నిట్లు చేయవలసినవాఁడనే, చేసియుండువాఁడనే. రామునకు నేనేమి కీడు చేయుదునో యని వీరి సందేహము కావున నిది గుణమే యను మంచి మనస్సుగలవాఁడు. అందఱు క్రోఁతులను రామచంద్రమూర్తి పరిచారకులైన వీరిని నే నాశ్రయించి వీరి యనుగ్రహము సంపాదించుకొననేని రామచంద్రమూర్తి యనుగ్రహము వచ్చియు నేమి లాభము. భాగవతులు మెచ్చిన వానిఁగాని భగవంతుఁడు మెచ్చఁడుగదా. కావున వీరినే నేనును దొలుత నాశ్రయింపవలెను, అను మనస్సుగలవాఁడు, అర్బుదముల కొలఁదినుండు వానరుల నందఱ నాశ్రయించుట దుష్కరము కావున వారి ప్రభువు నాశ్రయించిన నందఱ నాశ్రయించినట్టు లగు నని సుగ్రీవునిఁ జూచి యని చెప్పఁబడెను.

మింటనే నిల్చి=ఆకాశమున నెవ్వాఁ వచ్చినవాఁడు అట్టులే వచ్చి తటాలున రామచంద్రమూర్తి పాదములఁబడి యుండవచ్చునే, యాకాశమున నిల్వనేల? యనిన, నట్లు చేసినచో నది సాహసమును స్వాతంత్ర్యమును దెలుపును. రామచంద్ర మూర్తి నే సాక్షాత్తుగ సేవించిన రక్షించుననుమహావిశ్వాసమున్నను పురుషకారము నపేక్షింపని కారణముచే వానరుల నందఱ నలక్ష్యపఱచినట్లగును. అది భాగవతాపచారమగును. మహాత్ముఁడు కావున పురుషకార మూలముగనే రామచంద్రు సమీపింప నెంచెను. కావున దూరమునందే నిలిచెను. ఆకాశమునందుండ నేల, నేల దిగియుండవచ్చునే, భూమిమీఁదికి దిగిన తనమాటలు కొందఱకే వినఁబడును. కొందఱనే యాశ్రయించినట్లగును. అదియునుగాక వారితో సమానుఁడుగ నిలుచునట్టి యోగ్యత యింకను గలుగలేదు, గనుక దూరమునందే యుండెను. వారిలోఁ గలియుటకు వారి యనుమతి కావలయును. రాముఁడు రక్షింపనీ రక్షింపకపోనీ, వానరులు రక్షించినఁజాలునని యభిప్రాయముతో వానరులతో వచించెను. ఆ గుంపులో నల్పవానరులు గలరుగదా వారేమి చేయఁగలరు, రామచంద్రమూర్తికిఁ జెప్పఁగలరా, వారి నాశ్రయింపనేల? యనరాదు. వారిలో వారికిఁ దారతమ్య మున్నను భాగవతుఁడగు శరణాగతునకు నేకాంతివాసులందఱు సమానులే కావున నందఱకుఁ గనఁబడునట్లు నిలిచి యందఱకు వినఁబడునట్లు చెప్పెను. భగవంతుని దృష్టికి మనుష్యులందఱు సమానులయినను వారిలో వారికి భేదములు గలవుగదా! వేరునకుఁ జెట్టంతయు సమానమైనను కొమ్మలు, రెమ్మలు, ఆకులు పిందెలు, పండ్లు, కాయలు, పూలు నని రూపముల గుణముల భేదము గలదుగదా! భగవంతుఁ డుపేక్షించినను భాగవతు లనుగ్రహించినచో భయములేదు, "సిద్ధిర్భవతివా నేతి సంశయోఽచ్యుత సేవినామ్, నసంశయోఽత్ర తద్భక్తపరిచర్యారతాత్మనామ్." రామచంద్రమూర్తిని విడనాడినను లక్ష్మణుని విడనాడకుండిన సీతాదేవికి లంకాప్రాప్తి లేదుకదా.

ఉదారధ్వనిన్=పెద్ద గొంతుతో, అందఱకు వినవచ్చునట్లు రామలక్ష్మ

ణులకును స్పష్టముగా వినవచ్చునట్లు 'ఆకించన్యైక శరణాః కేచి ద్భాగ్యాధికాః పునః మామేవ శరణం ప్రాప్య మామేవాంతే సమశ్నుతే' లక్ష్మీతంత్రము. కొంత అధిక భాగ్యము గలవా రకించనులై నన్నే శరణుపొంది కడపట నన్నే యనుభవింతురు అని యుండుటచే రామచంద్రమూర్తికి వినవచ్చునట్లు దీనులై గట్టిగా నఱచు వారు నేస్తువారుగదా భాగ్యవంతులు ఇట్లు చెప్పుటచే రామనామోచ్చారణము నిండుమనస్సుతో బిగ్గఱగాఁ జేయుటయే గుణమని తెలియనయ్యెడి. నేను మానసిక ధ్యానము చేసెదను, బాహ్యముతో నాకుఁ బనిలేదని విభీషణుఁడు స్తంభమువలె నిలువఁబడలేదు. విభీషణుఁ డిట్టివాఁడు గనుకనే ౨౧౦ వ పద్యమున వాల్మీకి విభీషణుఁడు శ్రీమంతుఁ డనెను. భగవదనుగ్రహ మున్నచో లౌకికైశ్వర్యము తనంతటఁ దానే వచ్చును. ఈ యైశ్వర్య మునకీనంతిమాత్రమున నది రాదు.

ఇందు షడంగపూర్తిగల శరణాగతి ప్రదర్శింపఁబడెనని మహేశ్వరతీర్థులు.

క. రాక్షసుఁడను దుర్వృత్తుఁడు, రాక్షసకులనాథుఁ డైన రావణునకు నే
సాక్షాదనుజుఁడ జుండీ, యా క్షితిని విభీషణాఖ్యనెఱుఁగం బడుదున్. ౩౨౮

అర్థములు. రాక్షసుఁడును=పరులను హింసించి తన్ను రక్షించుకొనువాఁడు రాక్షసుఁడు, కావునఁ గ్రూరపుజాతికిఁ జేరినవాఁడు, రాక్షసజాతి కాఁగానే యేమి, వారిలో మంచివారు లేరా, నీవు రాక్షసుఁడవుకావా, బలిప్రహ్లాదులు రాక్షసులు కారా యందువేమో, దుర్వృత్తుఁడు=చెడ్డవృత్తి-వృత్తముగలవాఁడు, రాక్షసకుల నాథుఁడు = వీని చుట్టుపట్లనుండువారందఱు నిట్టివారే, వారి యందఱలో వీఁడు క్రౌర్యమునందు శ్రేష్ఠుఁడు, ఇట్లు చెప్పుటచే నటువంటి దుష్టునకు భృత్యుఁడనై యుండిన దోషము నాయందును గలదని భావము. ఒకనియొద్దఁ గొలువులోనుండుట యుండకుండుట సేవకుని యిష్టము. నీ కొలువు నాకక్కఱలేదనిపఁ గొట్టువారు లేరు, దుష్టుఁడని తెలిసియు నతనితోడ నుండుట నా దోషమేకదా.

రావణునకు = అటువంటి రావణునకు, మాంసముదినువారు మెడలోఁ బ్రేగులు వేసికొనరు. ఎంతచెడ్డవాఁడును పేరైన మంచి దుంచుకొనును. వీఁడు పేరుకూడఁదన క్రౌర్యమును దెలుపునదే యుంచుకొనినవాఁడు.

సాక్షాదనుజుఁడను = ఉత్తియనుజుఁడనుగాను, కుబేరుఁడనుజుఁడే, తల్లులు భేదించువారు. నేనో రావణునకు సోదరుఁడను. నాజన్మమునుండి యిటువంటి దుష్టసాంగత్యము గలవాఁడను. ఇట్లు జన్మప్రయుక్త దోషము చెప్పఁబడెను. ఇది నాదోషముగాదు. 'దైవాయత్తం కులే జన్మ, మదాయత్తంచ పౌరుష' మ్మన్నట్లు నాజన్మమునకు దైవము కారణము. నేనుజేయు కార్యములు నాస్వాధీనములు. వానికి నేను త్తరవాదిని. విభీషణుఁడు తనదోషములఁ జెప్పుచున్నాఁడు. "ఉపాయా నైవ సిధ్యంతి హ్యపాయా వివిధా స్తథా ఇతి యాగర్వహాని స్తద్దైన్యం కార్పణ్య ముచ్యతే" అన్నట్లు గర్వహాని లక్షణకార్పణ్యము చెప్పఁబడెను.

తాత్పర్యము

రాక్షసుఁడును చెడునడవడి గలవాఁడును రాక్షసరాజునగు రావణునకు నే నేకోదరుఁడ నగు తమ్ముఁడను, నా పేరు విభీషణుఁడు.

మ. ధరణీకన్యక దండకాటవి జన•స్థానంబునం దుండఁగా
హరియించెన్ మఱి యజ్జటాయువును సం•హారించె రోధించె నా
కరణీయానను స్వావరోధమున ర•క్షస్స్త్రీలఁ గాపుంచెఁ దీ
పురముల్ పల్కఁగఁ జేసె రావణుఁడు పూ•వుంబోణి దుఃఖింపఁగన్. ౩౫

అర్థములు. రోధించెన్=చెఱయందుంచెను, కరణీయానను=ఆఁడేనుఁగు నడకవంటి నడక గలదానిని, స్వావరోధమునన్ = తన యంతఃపురమందు, ధరణీకన్యక = భూపుత్త్రిక, ఇట్లు చెప్పుటచే లోకములోని కర్మబద్ధులు పుట్టునట్లు గర్భవాసాది దుఃఖము లనుభవించి పుట్టినది గాదనియు, నయోనిజ యనియుఁ బరత్వ ద్యోతకమందుఁ గల సౌకుమార్యాది గుణము లన్నియు నిపుడును గల వనియు భావము. ఇట్లు చెప్పుటచే సీతాదేవియందుఁ దనకుఁ గల పరత్వబుద్ధి, భక్తి తెలిపెను. దండకాటవి జనస్థానంబునందు = తక్కిన వారికి ఘోరారణ్యముగ రాక్షసావాసముగఁ దోఁచినను, ఆమెకుఁ బూలుగోయుటకు, స్వేచ్ఛగా విహరించుటకు నుపయోగించు నుద్యానమువలె నుండెనని భావము. జనస్థానమందలి వారు తనబంధువు లని బిడ్డలని తలంపుగలదై వారికేకీడు కోరినది గాకుండెను. రాముని తో నిష్కారణముగ రాక్షసులఁ జంపవలదనియేకదా యామె చెప్పెను. ఏకాంత క్రీడకు ననువుపడుటచే నయోధ్యకంటె దండకయే యామెకుఁ బ్రియమై యుండెనని భావము. హరించెన్ = అపహరించెను 'భాస్కరేణ ప్రభా యథా' సూర్యునినుండి యెండను వేఱుదీయుటవలె వ్యర్థప్రయత్నమని తలఁపక హరించెను, నిన్నుఁ బాసితిమేని మేము నీటిలో నుండి బయట వేయఁబడిన చేపలవలె నగుదుమని చెప్పినట్లు ఆమె మరణించు నంతటి ఘోరకార్యము చేసెను. "సింహము పాలి సొమ్ము గో, మాయువు గోరుచందమున మత్తుఁడు చైద్యుఁడు నీపదాంబుజధ్యాయినినైన నన్ను వడిఁ దాఁగొని పోయెదనంచు నున్నవాఁడు, డా యధమాధముం డెఱుఁగఁడద్భుతమైన భవత్ప్రతాపమున్" అన్నట్లు వాఁడు ప్రయత్నించిన పని వీఁడు చేయనే చేసెను. ఇట్టి "నక్షమామి క్వచిత్ వ్యజ్ఞాన్ సంసారకే" యన్నట్లు భాగవతాపచారమే యెంతటి దండమునకైనఁ జాలును. ఇంతతోఁ బోక, ఆ జటాయువును సంహరించెన్ = మీకత్యంత ప్రియుఁడైన యా జటాయువును, మీకై ప్రాణములైన నిచ్చి సేవచేయువానిని, సీతనువలె నిర్బంధమందైన నుంచక సంహరింపనే సంహరించెను. సీతాహరణమును క్షమించినను నిట్టి ఘోరకార్యము క్షమింపఁదగినది కాదని భావము. ఇట్లు పరమభాగవతాపరాధము హింసాత్మకమగు దానిఁ జేయుటచే వీఁడును సపుత్ర మిత్ర భృత్యుఁడై హింసింపఁదగినవాఁడని భావము. సంహార శబ్దముపైఁ గలిగిన నామధాతువు సంహరించెన్.

సీతాదేవిని హరించినవాఁడు భక్తితో గౌరవించెనా యనిన: దన యంతఃపురమున నట్టివారికిని, నస్ఖలితబ్రహ్మచారియై, నవవ్యాకరణ పండితుఁడై జితేంద్రియుఁ డైన హనుమంతునికిఁ గూడఁ జొరరానిచోట నిర్బంధమం దుంచెను. అడవియందు మహాభయంకరమృగము లుండు స్థలమునందుఁ దిరిగినంత మాత్రము గూడఁ దిరుగుటకు లేక యుండునట్లు నిర్బంధించుటయే గాక చూచుటకు నాకారములు, వినుటకు మాటలు, తలఁచుటకుఁ జేష్టలు భయంకరమైనవిగల రాక్షసస్త్రీలను నిటు నటు గదలకుండఁ గావలి యుంచెను. అంతతోఁ బోక - తీఁపురములు = ఆగడపుమాటలు పలుకఁ జేసెను. పూవుంబోణి = ౧ పుష్పములవలె శిరస్సున ధరింప వలసిన దానిని (౨) దిరిసెనపూవువలె నతికోమలమైన దేహముగల దానిని - అత్యంత సుకుమారియైన యెంతో సుఖ మనుభవింపఁ దగిన దానిని, దుఃఖంపఁగన్ = దూరక యుండనియ లేదు. పడివించుచున్నాఁడు. మా యన్నయు మహాపాపములను జేయుచున్నాఁడు.

క. రామునకు సీత నిమ్మని, వేమాఱును హేతుయుక్తవివిధోక్తులచే
నామునున నెంతో చెప్పితి, మానవభోజ కది నిరర్థక మయ్యెన్. ౩౨

అర్థములు. అన్నమీఁద దోషములు చెప్పెదవే, తమ్ముఁడవు నీవేమి చేయుచుంటివి? నీవు మంచివాఁడ వైన నన్నకు బుద్ధిచెప్పి యుండరాదా? యందురేమో! "చరాచరాణి భూతాని, సర్వాణి భగవద్వపుః । అత స్తదానుకూల్యం మే కర్తవ్య మితి నిశ్చయః" చరాచరభూతము లన్నియు భగవంతుని శరీరము. కావున వాని కనుకూలుఁడనై ప్రవర్తించుట నాకుఁ దగిన కార్యమను నిశ్చయము అనుకూల్య సంకల్పము-అట్టి శరణాగతి యంగము తా ననుష్ఠించితినని విభీషణుఁడు చెప్పుచున్నాఁడని తీర్థీయులు, వేమాఱును=ఒకసారిగాదు, రెండుసాళ్లుగాదు-సీతను దెచ్చినది మొదలు వెయ్యిమాళ్లు చెప్పితిని - నీవు నకారణముగఁ జెప్పిన నతఁడు విని యుండఁడా? యందురేమో-హేతుయుక్త = కారణములతోఁగూడిన, వివిధోక్తులచే=సామదానాద్యుపాయములతోడి మాటలచే-ఖరవధ-విరాధవధ - వాలివధ యుదాహరించి చెప్పితిని - ఆయనసొత్తు నపహరించిన దోషమని నీతి వాక్యములు చెప్పితిని - ఎంతో = విశేషముగ నేను జెప్పవలసిన మర్యాద నతిక్రమించికూడఁ జెప్పితిని, ఆ మానవభోజికి=ఆ రాక్షసునకు, నిరర్థకము=వ్యర్థమయ్యెను.

దీనివలన నాకుఁ గాల విళంబ మయ్యెను. లేనిమొదలఁ గిష్కింధకే రావలసినవాఁడను-ఇంకను బాగుపడు నేమో యను నాశచేఁ బలుమాఱు చెప్పుచుంటిని - అన్నిమాళ్లుచెప్పుట యేలయందురా? వాఁడు నామాట వినియుండిన సామాన్య ధర్మమైన జ్యేష్ఠ భ్రాతృసేవయు, విశేషధర్మమైన సీతారామచంద్రసేవయు లభించునుగదా యని యాశపడితిని-వాఁడు విననికారణముచే సామాన్యధర్మము వదలి విశేషధర్మమే గ్రాహ్యమని వచ్చితిని.

తాత్పర్యము

రామునకు సీత నిమ్ము, అట్లు చేసితివేని ఆయన సాత్తాయన కిచ్చునటులే గాక నీ సాత్తా మన కిచ్చునట్లు రామచంద్రమూర్తి సంతోషించునని నెయ్యిమార్లు నిదర్శనములతో, శాస్త్రవాక్యములతో, మంచిమాటలచే నెంతమారము నేను జెప్ప వచ్చునో యంతకుమించియే చెప్పితిని. నేను చెప్పినదంతయు వ్యర్థమై పోయెను.

క. అంతకవశుఁ డగువానికి, నెంతటిమే లౌషధంబు•నిందనిగతి నే
నెంత హితమాడినను నొక, సుంతయు మఱిఁగొనఁడు కాల•చోదితుఁడగుటన్.

అర్థములు. అంతకువశుఁ డగువానికిన్ = మృత్యుదేవతకు స్వాధీనపడి యుండువానికి, చావసిద్ధముగా నుండువానికి, ఇందనిగతి = దేహమునకు నరికడని విధమున, సుంతయు = కొంచెమైనను, కాలచోదితుఁడు=యమునిచేఁ బ్రేరింపఁ బడినవాఁడు.

తాత్పర్యము

చావనున్నవానికి నెంత మంచి మందిచ్చినను దేహమునకు సరిపడక పోవు నట్లు నే నెంత హితము చెప్పినను మృత్యుప్రేరితుఁడై నా మాటలు వినినవాఁడు కాఁడు. విభీషణుఁడిట్టి కార్యము చేసి సీతాదేవి యనుగ్రహంబునకుఁ బాత్రుఁడయ్యె నని యెఱిఁగియే రామచంద్రమూర్తియు విభీషణు ననుగ్రహించెను. విభీషణు విషయము సీతాదేవి హనుమంతునకుఁ దెలిపెను. ఆయన రామునకుఁ దెలిపెను. కావునే విభీషణు విషయమై సీత యనుకూలాభిప్రాయము గలదని రాముఁడు గ్రహించెను. కావున రామచంద్రమూర్తి నిర్వ్యాజముగ విభీషణు ననుగ్రహించె ననుట సరిగాదు. జీవుఁడు తన కృత్యము తాను నెఱవేర్చినఁగాని భగవదనుగ్రహము గాదని చమర శ్లోకము లన్నియు జెప్పుచున్నవి.

రావణుఁడు నన్ను నిగ్రహించుటకును రామానుగ్రహమే కారణమని నా యభిప్రాయము. జన్మప్రభృతి నేను ధర్మనిష్ఠగలవాఁడ నగుటను సీతాసేవ చేసియు తన భక్తుఁడ నగుటను, రామచంద్రమూర్తి తెలిసికొని "సర్వపాపేభ్యో మోక్ష యిష్యామి" నా ప్రాప్తికిఁ బ్రతికూలములైన వాని నెల్ల నేనే తొలఁగించెద నన్నట్లు దీక్షగలవాఁడు కావున నా పరితాప మణఁప నా దుష్టసహవాసముఁ దొలగించి తనయొద్దఁ జేర్చుకొనుటకై రావణున కా బుద్ధి పుట్టించె నని విభీషణు నభిప్రాయ మని గ్రాహ్యము - ఈ కారణముచేఁ బరమపురుషార్థరూప రామప్రాప్త్యర్థము రామచంద్రమూర్తినే శరణు వొచ్చితి నని చెప్పెను.

చ. పరుషము లాడి నన్ను నొక•బంటువిధాన నవజ్ఞ చేసినన్
మసనుచు, నాలుబిడ్డలను•ద్రోచిడి యిచ్చోడ రామచంద్రునిన్
శరణముఁ జొచ్చినాఁడ, రఘు•సత్తముతోడ జగచ్ఛరణ్యుతోఁ
బరమమహాత్ముతోఁ బ్లవగ•వర్యులు! నా స్థితి వేగఁ దెల్పరే. ౩౨౭

అర్థములు. నీవు చెప్పిన మాటలకు నతఁడేమి ప్రత్యుత్తర మిచ్చెనందురా- పరుషములాడి=నేను దనకు ద్రోహినని, శత్రు పక్షపాతి, నని అసూయాపరుఁడ నని తన కీడు కోరుచున్నానని దూషించి, బంటువిధానన్ = తని యెంగిలి దిను దాసునివలె, అవజ్ఞచేసినన్ =ఛీ పో నా యెదుట నుండవలకని యుండినఁ జంపెద నని యవమానింపఁగా, దురుసువన్ = కఠినమైన మనస్సుతోను, వాక్కుతోను; ఆలుబిడ్డల ననుటచేఁ దనకుఁ గల సర్వస్వమని భావము.

"త్యజే దేకం కులస్యార్థే, గ్రామస్యార్థే, కులం త్యజేత్ । గ్రామం జనపద స్యార్థే, ఆత్మార్థే పృథివీం త్యజేత్" వంశమును రక్షించునిమిత్తి మొకనివంశమునఁ బుట్టినవానిని వదల వలయును. గ్రామము రక్షించు నిమిత్తము వంశము వదల వచ్చును. ఊరిని రక్షింప గ్రామమును విడువవచ్చును. తన్ను రక్షించుకొను నిమిత్తము దేశమునే విడువవచ్చును."ఆత్మానం సతతం రక్షేత్ దారైరపి ధనైరపి" భార్యలను, ధనమును వదలియైనఁ దన్ను రక్షించుకొనవలెను - అని యుండుటచే, సోపాధిక బాంధవు లెవ్వరు రక్షకులు కాఁజాలరు. నిరుపాధిక బంధువు శ్రీరామచంద్ర మూర్తియే రక్షకుఁ డను తలఁపుతో సహధర్మచారిణులై సగము దేహము పంచుకొనిన భార్యలను, నరకమునుండి రక్షించు బిడ్డలను, తల్లిదండ్రులను సర్వము వదలి వచ్చితినని భావము. దీనిచేఁ బ్రపన్నుఁడు ప్రాప్యాభాసములను ప్రాపకా భాసములను వదలవలయునని యేర్పడుచున్నది. ఆలుబిడ్డలను ద్రోపిడియనుటచేఁ బ్రాతికూల్యమును విడువవలయునను నంగమును, రామచంద్రునిన్ శరణము జొచ్చినాఁడ ననుటచే ఆత్మనిక్షేప మనెడి యంగము చెప్పఁబడెను. త్రోపిడి= త్రోపు+ఇడి = వదలి, ఇది బుద్ధిపూర్వక త్యాగము దెలిపెడిని, ఇయ్యెడన్ = ఈ స్థలమునందు, ఈ సమయమందు-రఘుసత్తముతోడన్ = శరణాగత రక్షణమే వ్రతముగాఁగలరఘువంశ రాజులలో శ్రేష్ఠునితోడ,రాఘవేంద్రునిన్="క్వింత్వర్థినా మర్థితదాన దీక్షాకృతవ్రత శ్లాఘ్య మిదం కులంతే" యన్నట్లు కోరినవారికోరికల నెరవేర్చుట వ్రతముగాఁగల వంశమునఁ బుట్టినవారిలో శ్రేష్ఠుని, జగత్+శరణ్యు తోన్=ప్రపంచమున కంతయు సురవర వానర పశుపక్షి మృగ వృక్షాది సకల చరాచర సమేతమైన ప్రపంచమున కంతయు కులవిద్యాధన వృత్తివివక్ష లేక యంద ఱకు రక్షకుఁడైన వానితో, వీనిలో నేను జేరినవాఁడనే గనుక నాకు నాయనయే రక్షకుఁడుశరణ్యుఁడు="శరణేరక్షణే సాధుశ్శరణ్యః తత్రసాధురితి 'యత్' ప్రత్యయః" శరణ మనఁగా రక్షణము. దానియందు సాధువు శరణ్యుఁడు, శరణం భవితు మర్హ శ్శరణ్య ఇతి నిరుక్తిః, రక్షకుఁడగుటకు యోగ్యుఁడు శరణ్యుఁడు. అయిన రావణా సురునికిమాత్రము రక్షకుఁడుగాఁడా యందు రేమో,అనుకూలించివచ్చిన నాయనకు రక్షకుఁడే. అగ్నిహోత్రము తన్ను సమీపించిన వాని చలినేకదా పోఁగొట్టును. వాఁడు రాలేదు. కావున లాభము పొందినవాఁడు కాఁడు. నేను వచ్చితిని.

కావున నా కా లాభము కలుగవలయును అని భావము. ఓయీ! యీయన రక్షకుఁడని నీ వెట్లు విశ్వసించి యాశ్రయింప వచ్చితి వందురా, లోకమునఁ గేవలము హీనమై సులభమైన మట్టిపెళ్ళకై యెవఁడు నాశపడఁడు. కేవల పరత్వము నెవఁడునాశింపఁడు.దుర్లభమైన మేరుపర్వతము నెవఁడాశించుచున్నాఁడు. కావున సౌలభ్యము పరత్వము రెండుగలవానినే జను లాశ్రయింతురు. రామచంద్ర మూర్తి రఘుసత్తముఁడగుటచే సులభుఁడై యున్నాఁడు. పరమ మహాత్ముఁడగుటచే పరత్వముగలవాఁడై యున్నాఁడు. కావున నాశ్రయింప వచ్చేఁడు.రఘుసత్తముడనుటచే,మనుష్యస్వరూపమున వచ్చినవాఁడనుటచే సమస్తజీవకోటికిలోచనగోచరుఁడై సులభముగా సేవింపఁదగియున్నాఁడు. "చిన్మయ స్యా ద్వితీయస్య నిష్కళస్యా శరీరిణః। ఉపాసకానాం కార్యార్థం బ్రహ్మణో రూపకల్పనా" అన్నట్లు భక్తుల సౌకర్యార్థమై కదా భగవంతుఁడు రూపము ధరించుచున్నాఁడు. ఇట్లు మనుష్యస్వరూపము ధరించుటచేఁ బరత్వహాని కలదా యనిన పరమమహాత్మతో ననుటచే నట్టి హాని లేదనుచున్నాడు. పరముఁడు మహాత్ముఁడు నైనవాఁడు పరమమహాత్ముఁడు. "అభ్యాసయోగ యుక్తేన చేతసా నాన్యగామినా। పరమం పురుషం దివ్యం యాతి పార్థానుచింతయన్, భ.గీ. ౮౮ అక్షరం బ్రహ్మ పరమం. ౮-౩. పరం బ్రహ్మ పరంధామ పవిత్రం పరమం భవాన్ । పురుషం శాశ్వతం దివ్య మాదిదేవ మజం విభుమ్ భ.గీ. ౧౦-౧౨ త్వ మక్షరం పరమం వేదితవ్యం త్వమస్య విశ్వస్య పరం నిధానమ్ భ.గీ. ౧౧-౧౮" ఇట్టివాఁడు పరముఁడు, మహాత్ముడు, ఆత్ముఁడు, జీవుఁడు, మహాత్ముఁడు=పరత్వ పరమస్వరూప స్వభావములు వదలక మనుష్యుఁడుగాఁ గానవచ్చు భగవంతుఁడుగదా నేవ్వఁడు. "భవతో యత్పరం రూపం తన్నజానాతి కశ్చనఅవతారేషు యాద్రూపం తదర్చంతి దివౌకసః" "యస్యావతారరూపాణి సమర్చంతి దివౌకసః। అపశ్యంతః పరం రూపం నమస్తస్మై పరాత్మనే॥" వి. పు. ౧-౯-౭౦ దేవతలు భగవంతుని పరస్వరూపమేదో తెలియక యవతారరూపములనే పూజించుచున్నారు.శ్రీరామచంద్రమూర్తి యిట్టివాఁడు గనుక నాయన శరణుఁజొచ్చితిని. కాఁబట్టి నాస్థితి మీరు రామచంద్రమూర్తికి, వేగన్=శీఘ్రముగ, ఆలస్యములేక ఆయన నన్ననుగ్రహింపని విమిష మొక కల్పము నరకమున నున్నట్లున్నది. నాబాధ తప్పింపుఁ డని భావము.

శరణాగతుఁడ ననిన నామాట శరణాగతరక్షణవ్రత మవలంబించిన రామచంద్రమూర్తి విన్నమాత్రముననే కరిరాజును రక్షింపవచ్చినట్లు బయలుదేఱి వచ్చును. అప్పుడు మీకుఁ బురుషకారఫలము లేకపోవును. కావున నాయన యానతము విడిచి లేవకముందే పోయి చెప్పుఁడు. శరణన్న వారిని దప్పక రక్షించు వ్రతము రామచంద్రమూర్తికిఁ గలదని సీతాదేవి రావణునకుఁ బోధించెను.

"రావణా, కొంకక రాముతోఁ జెలిమిఁ గోరుము యప్పురుషోత్తముండు ధర్మాంకుఁడు నిన్ను నేలు శరణాగతవత్సలుఁడౌట నిర్మలిన్." సుందర ౫౧-౨౨.

ఈ విషయము విభీషణుఁ డెఱుఁగును. కావుననే జంకు కొంకు లేక రక్షించునను మహావిశ్వాసముతో వచ్చెను. ప్రపత్తియం దీ మహావిశ్వాసమే ప్రధానాంగము.

తెలుపరే = ఇది ప్రార్థనము.

తాత్పర్యము

పామునకుఁ బాలు పోయఁబోయినఁ గాటు పడి పీఁకినట్లు తనకు హితము నుపదేశించు నన్ను వినరాని కఠోరవాక్యము లని తిన యెంగిలితిని బ్రతుకు దాసులవలెఁ గఠిన హృదయుఁడై యవమానించెను. కావున వానినేకాక నా భార్యను, బిడ్డలను దలిదండ్రులను ధనధాన్యాదులను లంకను సర్వము వదలి శ్రీరామచంద్రమూర్తియే మనకు రక్షకుఁ డనుకొనివచ్చి యాయన శరణుచొచ్చితిని – రఘువంశమునఁ బుట్టిన వారిలో నుత్తముఁడును పరమ మహాత్ముఁడు నగు రామచంద్రునితో శరణాగతుఁడై విభీషణుఁడు వచ్చినాఁడని నా స్థితిఁ దెలుప మిమ్ముం బ్రార్థించెదను.

విభీషణుఁడు రామచంద్రమూర్తికిఁ గానవచ్చుచున్నాఁడు – విభీషణునకు రామచంద్రమూర్తి గానవచ్చుచున్నాఁడుగదా – విభీషణుమాటలు రామచంద్రమూర్తియు వినుచున్నాఁడు–ఇఁక నేమి చెప్పవలెననిన — ఇన్ని దినములు పరమ పాపియగు రావణుతోడ నుండుటచే నపరాధ పరిపూర్తి గలవాఁడును, దానికై పశ్చాత్తాపపడుచు, ఈలోక పరలోక సుఖములందలి రాగమును వదలినవాఁడును, అపరాధముల క్షమించి తనవారిలోఁ జేర్చుకొనుటకై శరణాగతిని నుపాయముగా గ్రహించినవాఁడును, రామ కైంకర్యమును రామ పరిచారికులతోడి, సాంగత్యమును గోరినవాఁడు నగు విభీషణుఁడు వచ్చినాఁడని నా స్థితిగతులఁ దెలుపుఁడు– నీవు దుష్టుఁడవే యెట్లు చెప్పుదుమందురేమో? నేను దుష్టుఁడనుగాను – నా విషయము నా చెల్లెలు శూర్పణఖ 'దనుజ చేష్టిగమాగుండు ధర్మచిత్తుఁడగు విభీషణుఁ డని (అరణ్య ౩౮౯) ముందే రామచంద్రునకుఁ జెప్పినది – నాపే రామునకుఁ దెలియును. కావున నా స్థితి శరణాగతుఁడనిమాత్రమే మాయనకు మీరు దెలిపినఁ జాలును–శరణముఁజొచ్చినాఁడను=నేను జేయవలసిన పని చేసితిని. ఇఁక రామచంద్రమూర్తి చేయవలసిన పనియే నిలువయున్నది. ఆ ఋణమును తీర్చుకొమ్మని వేగఁ దెలుపుఁడు. "ఋణం ప్రవృద్ధమితి మే" యన్నట్లు లాలస్యము చేయుకొలఁది వడ్డి చెల్లింపవలసి వచ్చునని యుఁ దెలుపుఁడు. నా స్థితిఁ దెల్పుఁడు = నేనిచ్చటికి వచ్చియున్నానని తెలుపుఁడు.

అతిహీనుఁడైనను తన రక్షణముగోరి తన్ను సమీపించి వచ్చినాఁడను నదియే రామచంద్రుఁడు రక్షించుటకుఁ జాలినంత కారణము.

తెలుపరే = వాచాధర్మంబు గట్టుకొమ్మన్నట్లు, ఈ మాట మాత్రము

దెలుపు సాహాయ్యము చేసినఁ జాలును. అంతకెక్కువ మీరు చేయవలసినది లేదు 'అప్రార్థితో న గోపాయేదితి తత్ప్రార్థనామతిః గోపాయితా భవేత్యేవం గోప్తృత్వ వరణం స్మృతమ్' అన్నట్లు గోప్తృత్వ వరణ మనెడి యంగము చెప్పబడెను.

శరణు జొచ్చెదను అనక చొచ్చినాఁడ ననుటచేఁ 'రక్షిష్యత్యనుకూలాన్న ఇత్యేవం సుదృఢా మతిః। స విశ్వాసో భవేచ్ఛక్ర సర్వదుష్కృతి నాశనః' అని మహావిశ్వాసము చెప్పఁబడెను. అట్టి విశ్వాసము లేకుండినచో శరణు చొచ్చినాఁడ ననఁడు గదా.

ఓయీ! నీవు చెప్పినమాట వినలేదని నిన్నవమానించినాఁడని యన్నపైఁ గోపించి వచ్చితివి గాని రామచంద్రమూర్తి యందలి భక్తితో రాలేదు కదా యందురేమో, రావణుఁడు చేసినది తత్కాలమునఁ గీడుగాఁదోఁచి నాకుఁ గోపము గలిగించుట సత్యమే కాని వాఁడట్లు చేయుటచేఁ గదా నాకు వైరాగ్యము శ్రీరామచంద్ర శరణాగతిప్రాప్తి కలిగెను. కావున వాఁడు నా కుపకారము చేసినాఁడనియే నా భావము.

ఓయీ! సీతాదేవిని దెచ్చినది మొదలు వేయిమారులు చెప్పితినంటివే; అట్టివాఁడ వింతకాల మూరకుండి యిప్పుడు రానేల యందువా? రావణుని కింకను బుద్ధివచ్చునేమో యని కాచి కొన్నిదినము లుంటిని. మీ యుద్యమము దెలియరామిచే నామాటలు వానికి నమ్మరానివయ్యెను. వాఁడు దురహంకారమందు సీతాదేవిని దెచ్చిన కారణముచే వానికి మీవలనఁ దప్పక కీడు కలుగు నని నే నెఱుఁగుదును. కావున మీ రెవరైనఁ దప్పక వత్తురనియు నప్పుడు చెప్పిన నా మాటలు వాఁడు విశ్వసించు ననియుఁ దలఁచి మీ రాక కెదురుచూచుచుంటిని. హనుమంతుఁడు వచ్చి లంక గాల్చిన తరువాతఁ జెప్పితిని. అప్పుడు విన్నవాఁడు కాడు. 'గొంతుమీఁదికత్తివలె మీరు వచ్చి యిచ్చట విడిసినారని విని నేఁడు సభచేసెను. అందు నొక్కి చెప్పితిని. నామాట వినక నన్నవమానించెను. ఇఁక నీ దుష్టసహవాసమువలన మేలు లేదని బయలుదేఱి వచ్చితిని.

పారమార్థికబుద్ధితో విభీషణుఁడు వచ్చినట్లు ముందే వ్రాయఁబడెను. వ్యావహారిక బుద్ధి నతఁడు చేసినది తప్పా యొప్పా యని యాలోచింతము. రావణుఁడు ఛీపో నా యొద్ద నుండఁదగదని చెప్పెనుగద. ఎందుఁబోవలె, లంకయందే యుదాసీనుఁడై యుండవచ్చునా? అది సాధ్యపడదు. తక్కినవారు కొందఱు హితముపదేశించినను దుడుకు రావణుని యిష్టప్రకారము వర్తించిరి. విభీషణుఁ డట్లు గాదు. వ్యతిరేకించెను. పొమ్మన్నను నూరిలో నుండెనా? యింకను నేదో కుట్ర చేయుటకై యున్నాఁడని రావణుఁ డెక్కువ సందేహము గలవాఁ డగును. అది యపాయకరము. లంకయందుండెనేని యుద్ధకాలమందు నీవు యుద్ధమునకుఁ బోవలసినదని రావణుఁ డాజ్ఞాపించును. రాజాజ్ఞ మీరెనా దండింప సిద్ధపడును.

మీఁదికిపోయెనా ప్రహస్తాదులలోఁ గలిసినవాఁడగును. అంతఃకరణమునకు విరోధముగఁ బ్రవర్తించినవాఁ డగును. కావున లంక విడుచుట యుత్తమకార్యము, లంకలో నుండుటచే రామరావణుల కిరువురకు మంచివాఁడు కానేరఁడు. అటుగాక లంకయం దుండక రామచంద్రమూర్తితోను గలియక యెందైన దేశమునకుఁ బోయెనా రావణవధానంతరము లంకను రామచంద్రమూర్తి యంగదునకో మఱి యెవ్వరికో యిచ్చి యుండునుగాని, తనయం దనుకూల బుద్ధిలేని విభీషణునిఁ బిలిపించి యుండఁడు. అప్పుడు విభీషణుఁడు రెంటను జెడిన రేవణుఁడగును. వీఁడు రాక్షసుఁడు రావణ పక్షపాతి యని వానరులు వీనితోఁ బోరాడుచుందురు. లంకావాసము సాధ్యపడదు. కావున నే విధముగఁ జూచినను ధర్మపక్షపాతము వహించి రాముని పక్షముచేరుట విభీషణునకు యుక్తకార్యము. తనకుఁ దగిన యాశ్రయము మని రామచంద్రమూర్తి నాశ్రయించెను గాని లంకారాజ్యము దానాక్రమింపవలె ననుకోరికతో లంకారాజ్యము నాకిచ్చెదరేని నేను మీకు సాహాయ్యము చేసెద నని బేరమాడ లేదని స్పష్టముగాఁ దెలియ నయ్యెడిని.

—♦ సుగ్రీవుఁడు రామునకు విభీషణురాక దెలిపి
రాక్షసుల నమ్మరా దనుట ♦—

క. అను నా వచనంబుల విని, యినతనయుఁడు శీఘ్రగామి ♦ యేగి సుమిత్రా
తనయు సమక్షమునం దీ, ట్లనియె రఘురాముతోడ ♦ నత్తరపడుచున్. ౩౮

శీఘ్రగామి=త్వరగాఁ బోఁగలవాఁడు, అత్తరపడుచున్=తొందరపడుచు, అత్తరము రూ. ఆత్రము.

తాత్పర్యము

తా ననుకొన్న ప్రకారము వేగులవాఁడుగాక, దూతయుఁగాక ప్రత్యక్షవిరోధియుఁగాక శరణాగతుఁడను అనుమాటలు సుగ్రీవుఁడు విని శరణు అని విభీషణుని నోరరాఁగానే అభయమ్మని రామచంద్రమూర్తి నోరవచ్చునేమో, కార్యము చెడునే యని, 'అతిస్నేహః పాపశంకీ' అతిస్నేహము పాపపు సందేహములు గలిగించు ననుసూక్తి ననుసరించి రామచంద్రుని యం దత్యంతస్నేహము గల సుగ్రీవుఁడు అభయమ్మనుమాట రాకముందేపోయి నివారింపవలె నని మిగుల వేగముతో తత్తరపాటుతోఁ బోయిన లక్ష్మణుఁడు వినుచుండఁగా నిట్లనెను. పరాయివాఁడు తాను జెప్పిన వినునో వినఁడో తమ్ముఁడవైన నీవు చెప్పిన వినును. కావున నీవును జెప్పుమని లక్ష్మణునిఁ దనతోఁ గలుపుకొనఁగోరి లక్ష్మణు ముఖము చూచుచు రామచంద్రమూర్తితో జెప్పెను.

విభీషణుఁడు పగవానితమ్ముఁడు కావున నన్నపక్షమందభిమానముగలవాఁడై యుండుట సహజగుణము. అందు నూతన సహాయ సంపత్తిఁ గోరవలసిన కాలము

కాని యున్నవారిని వదలుకొనవలసిన కాలముగాదు. కావున రావణుఁడు భేదోపాయము ననుసరించి పంపఁగా భక్తునివలె నటించుచున్నాఁడనియు, దగ్గఱఁ జేర నిచ్చిన సమయము వేచి రామునకో లక్ష్మణునకో కీడు చేయఁదలఁచిన ద్రోహి యనియు గావున దగ్గఱఁ జేరనీయరాదనియు సుగ్రీవుని యభిప్రాయము. దీని ననుసరించియే మాటలాడుచున్నాఁడు.

క. తనపేరు విభీషణుఁ డఁట, యనుజుం డఁట దేవ! రావ ♦ ణాసురునకుఁ దా
మనుజాద చతుష్కముతోఁ; జనుదెంచి నరేంద్ర! నిన్ను♦శరణముఁ జొచ్చెన్.

అర్థములు. దేవ=సంబోధనము, మనుజాద చతుష్కముతోన్=నలుగురు రాక్షసులతో.

తాత్పర్యము స్పష్టము.

తే. యోజనలు నేయు తెఱఁగుల♦వ్యూహములను,నుపమలందేని,చారని♦యుక్తియందు
వానరులపట్ల వైరుల♦వలన మిగుల, నప్రమత్తుండ వై యుండ♦నగు జయంబు.

అర్థములు. ఇట్లు విభీషణుని వృత్తాంతము దెలిపి తన యభిప్రాయము చెప్పుచున్నాఁడు. యోజనలు=ఆలోచనలు, వ్యూహములను = సేనలను వ్యూహాకారములుగాఁ బన్నునప్పుడు, ఉపమలందేని = ఉపాయములు చేయుట యందేని, చారనియుక్తియందు=వేగువాండ్ర నియోగించుటయందు.

తాత్పర్యము

దేవా! జయము కావలయు నని నీకుఁ గోరిక యుండెనా నీ వాలోచనలు చేయుటయందును వ్యూహములు దీర్చుటయందును ఉపాయములు పన్నుట యందును వేగుల నేర్పాటు చేయుటయందును వానరులకు వైరులవలనఁ గీడు రాకుండ మిక్కిలి హెచ్చరిక గలవాఁడవై వర్తింపవలయును.

తే. కామరూపులు మఱియు ని ♦ కారవిదులు శూరవర్యులు రాక్షసు♦ల్సూరివర్య
తెలియ రాకుండఁ గనులకుఁ♦దిరుగుచుంద్రు, వారి నెన్నండు నమ్మంగ♦వలనుపడదు

అర్థములు. వానరులకుఁ గీడు కలుగు పనిచేసితినా చేయఁదలచితినా, ఏల యిట్లు చెప్పెద వందువేమో, సూరివర్య=పండిత శ్రేష్ఠుఁడా! రాక్షసులు కామరూపులు=కోరినరూపము ధరింపఁ గలవారు. ఇది నీకు మారీచుని చర్యవలనఁ దెలిసిన విషయమే, నికారవిదులు=వంచనచేయఁ దెలిసినవారు, రావణుని చర్య వలన దెలిసిన విషయమే, శూరవర్యులు = శూరులందు శ్రేష్ఠులు, ఇది నీకు ఖరాదుల చర్యవలనఁ దెలిసినదే.

తాత్పర్యము

పండితశ్రేష్ఠుఁడా! రాక్షసులు కోరినరూపము ధరింపఁగలవారు, మోసపువిద్య నేర్చినవారు, శూరులందు శ్రేష్ఠులు, ఎప్పటి కే వేషభావలచే శత్రువుల గెలువ వచ్చునో యవి యన్నియుఁ దెలిసి యాప్రకారము వర్తించువారు,ఇంతేకాదు. మన

కన్నులకుఁ గానకుండ మనలోఁ దిరుగఁగలరు. కావున వారిని నెప్పటికినమ్మరాదు.

క. ప్రణిధి యయి రావణునకున్, జనుదెంచెనొ నీతిశాలి•న్వయముగఁ దానే
మనలోన నుండి సమయముఁ, గని మనలం బిలుకుమార్పఁ•గా వచ్చెనొకో. ౩౩౩

ప్రణిధి = వేగులవాఁడు, యథార్హవర్ణః ప్రణిధి రపసర్ప శ్చర స్పశః చారశ్చ గూఢపురుష' యని యమరుఁడు, నీతిశాలి = నీతివిద్యచేఁ బ్రకాశించువాఁడు, పిలుకుమార్పఁగాన్ = చంపఁగా.

తాత్పర్యము

రావణుఁడు పంపఁగా వేగులవాఁడై వచ్చెనో లేక నీతి విద్య సామదానభేదోపాయములు చక్కఁగా దెలిసినవాఁడగుటచేఁ దనంతటఁ దానే మనలోఁగలసి మెలసియుండి నమ్మికపుట్టించి సమయము కాచివేచి మనము హెచ్చరికతప్పియున్నప్పుడు మనలఁ జంపనేవచ్చెనో, కాని వీఁడు నిజముగ భక్తిచే వచ్చినవాఁడుకాఁడు.

క. తనహితు లనిచిన బలమున్, వనచారులబలము మూల•బలముం దనవే
తనమునఁ గుదిరిన బలమును, జను నమ్మఁగ, నమ్మరాదు•శాత్రవబలమున్. ౩౩౪

అర్థములు. అనిచిన = పంపిన, వనచారులు=అడవియందుండు వారల, వేతనమున=జీతము తీసికొనుటచే.

తాత్పర్యము

. మనకు సహాయ సంపత్తి యెక్కువ, శత్రువులకుఁ దక్కువయగుట మేలే కదా. ఏల విభీషణుఁ జేర్చుకొనవల దందువేమో.

తనమిత్రులుపంపిన సేనను నమ్మవచ్చును, తన రాష్ట్రములోని యడవులందుండు వారి బలమును నమ్మవచ్చును, పరంపరగా వచ్చిన మూలబలమును నమ్మవచ్చును. జీతమునకుఁ గుదిరిన భటులబలమును నమ్మవచ్చును. వీరివలన నపాయము లేదుగాని శత్రువులు పంపిన సేనను నమ్మరాదు, కీడు కలుగును.

'మౌలం, భృతం, సుహృ, చ్ఛ్రేణీ, ద్విషదాటవికం బలమ్,' అని బలము లాఱువిధములు. ఇందు పరంపరగా వచ్చిన గర్భదాసాదుల నిలుకడ యగు బలము మూలబలము, జీతమిచ్చి చేర్చినది భృతబలము, మిత్రులు పంపినది సుహృద్బలము, పల్లెలనుండి గ్రామములనుండి తెచ్చినది శ్రేణిబలము, మనవిరోధులకు విరోధులుగా నుండువారు మనపక్షమునకుఁ బంపిన బలము ద్విషద్బలము, కిరాతాదుల బలము ఆటవిక బలము.

పూర్వము మన స్వదేశరాజులు అడవులను చెంచులు, బోయలు, ఎఱుకలు, ఏనాదులు లోనగువారి స్వాధీన మందుంచి వారడవి ఫలములవలనఁ గలుగు లాభమనుభవించుచు రాజునకుఁ గావలసిన విచ్చుచు యుద్ధసమయంబుల సేవలు పంపునట్లొడంబడిక గలవారు, ఈ విధముగ వచ్చు సేనకు నాటవికబల మని పేరు, ఈ సేనల నమ్మవచ్చును.

క. రాక్షసుఁ డఁట సహజంబుగ, రాక్షసనాథునకు నసుఁగు • భ్రాతయు నఁట ద్వి
ట్పక్షమున వచ్చినాఁడఁట, యీక్షింపుము నమ్మవచ్చు • నే వీని మదిన్. ౩౩౫

అర్థములు. ద్విట్ + పక్షమునన్ = విరోధి పక్షమునందుండి. "రిపౌ వైరి సపత్నారి ద్విషద్ద్వేషణ దుర్హృదః, ద్విడ్విపక్షాహితామిత్ర దస్యు శాత్రవ శత్రవః అభియాతి పరారాతి ప్రత్యర్థి పరిపంథినః" అమరుఁడు.

తాత్పర్యము

పుట్టువుచేతనే క్రూరకర్ముఁ డగు రాక్షసుఁడఁట. అట్టి రాక్షసులకుఁ బ్రభువగు వానికిఁ గూరిమి గల తోఁడఁబుట్టినవాఁడఁట. ప్రత్యక్షముగ శత్రువుల యొద్దనుండి వచ్చినాఁడఁట. ఇవన్నియు వాఁడే చెప్పుచున్నాఁడు. ఇట్టివానిని నమ్మవచ్చునా? నీవే యాలోచింపుము.

చ. వినుము విభీషణుండు రఘువీర! దశాస్యునిచారుఁ, డాతఁడే
పనుపఁగ వక్రబుద్ధియయి • వచ్చినవాఁ డిట, నీవు నమ్మినన్
జనవర! మాయచే మనలఁ • జంపుట సత్యము, వీని నిప్పుడే
పొనుఁగుపడంగఁ జేఁత దగుఁ • బో క్షమవద్వర! నాకుఁ జూడఁగన్. ౩౩౬

అర్థములు. చారుఁడు = వేగులవాఁడు, వక్రబుద్ధి = మోసపుబుద్ధి, పొనుఁగు పడంగఁ జేఁత = చంపుట, క్షమవత్ + వర = సామర్థ్యము గలవారిలో శ్రేష్ఠుఁడా.

తాత్పర్యము

సుగ్రీవా! శరణని వచ్చినవారిని నెల్లు చేరఁదీయక నిరాకరింపవచ్చు నందు వేమో! నిజమైన భక్తిశ్రద్ధలు గలిగి శరణుగోరినవారిని రక్షింపవలసినది విధియే. అది నేను గాదనను. ఈ విభీషణుఁడో రావణుని వేగులవాఁడు — వాఁడే పంపఁగా మోసపుబుద్ధితో నిచ్చటికి వచ్చినాఁడు. నీవు శరణాగతుఁడుగదా యని నమ్మి చేరఁ దీసితివా యేదియో వంచనచేసి మనలఁ దప్పక చంపును. కావున వీని నిపుడే చంపుట దగిన కార్యమని నా యభిప్రాయము. నీవు సమర్థుఁడవే — నేను కాదనను గాని నిద్రపోవు సింహమును నక్కలు పరిభవించును. మన మేమఱియున్న సమయమున మనలఁ జంపును. కావున శరణాగత రక్షాన్యాయ మిం దన్వయింపదు.

చ. వెరవరియైన దాయ యరి • వీరుల సేనలలోనఁ జొచ్చి యే
యరమర లేక త్రిమ్మరుచు • నంతట సందొకయింత గల్గినన్
బొరిగొను శత్రుసంతతులఁ బూర్ణముగాఁగ నులూకసంహతిన్
గరటముపోలెఁ గాన నెటు • కార్యము గాదు విరోధి నమ్మఁగన్. ౩౩౭

అర్థములు. వెరవరి = ఉపాయశాలి, దాయ = పగవాఁడు; అరి = శత్రువుల గుంపు, అరమర = భేదము, త్రిమ్మరుచున్ = తిరుగుచు; పొరిగొనున్ = చంపును; ఉలూకసంహతిన్ = గుడ్లగూబల సమూహమును, కరటముపోలెన్ = కాకివలె.

తాత్పర్యము

ఉపాయశాలి యగు శత్రువు తన శత్రువుల సేనలలోఁజొచ్చి వారిలోఁ దానొకడుగఁ గలిసి మెలసి భేదబుద్ధిగలవాఁడని కానరాకుండఁ దిరుగుచు సమయము దొరికి నపుడు శత్రువులఁ జంపును. పూర్వ మొక కాకి గూబల నిట్లగదా చంపెను. కావున విరోధిని నమ్మనేరాదు.

కాకి గూబల కథ పంచతంత్రమునఁ గలదు. కాకులకు గూబలకు నెప్పటికి విరోధమే. పగలు గూబలు బయటవచ్చినా కాకులు కొట్టును. రాత్రులందుగూబలు పోయి కాకులఁజంపును. ఇట్లుండ నొక కాకుల గుంపునకు గూబలగుంపునకుఁ గలహము జరుగుచుండెను. అప్పుడొక కాకి యుపాయముచేసి గూబలలోఁ జేరుకొని కాకుల నన్నిటినిఁ జంపు నుపాయము మీకుఁజెప్పెద నని నమ్మించి యవియేమఱి యుండఁగా నొకనాఁటి పగలు కాకులకన్నిటికిఁజెప్పి యవి కొఱవులు తీసికొనిరాఁగా గూబలుండు తొఱ్ఱల నన్నిటిని జూపఁగా వానిలో గడ్డిఁగూరి నిప్పుపెట్టెను. గూబలన్నియు చచ్చెను. కావున విభీషణుఁడు నట్లే చేయును గావున నమ్మరాదు.

క. క్రూరుఁ డగు రావణాసురు, కూరిమితమ్ముండు సేవ♦కులతో వీనిన్
క్రూరంబుగఁ జంపుటయే, సారమతీ! కృత్య మిపుడు ♦ చర్చింపంగన్. ౩౦

తాత్పర్యము

రావణాసురుఁడు క్రూరుఁడు. వాని కూరిమి తమ్ముఁడు వీఁడు కావున వీనిని వీని సేవకులతోఁడఁ గ్రూరముగఁ జంపుటయే తగిన కార్యము.

వీనిని ద్రోహబుద్ధిని జిత్రవధ చేసి చంపవలెఁగాని వాలివలె నొక్క బాణముతోఁ దటాలునఁ జంపరాదు. వీనిని విడువనురాదు. విశ్వామిత్ర యాగమున మారీచుని విడుచుటచేఁగదా వెనుక వాఁ డంత పాపకార్యము చేయఁ గలిగెను.

క. అను నినజుని సంరబ్ధం, బున నాడిన వాక్యములను ♦ బురుషోత్తముఁడున్
విని నికటపార్శ్వవర్తుల, హనుమత్ప్రముఖాగచరుల ♦ కను సంప్రీతిన్. ౩౧

అర్థములు. సంరబ్ధంబునన్ = తొందరగా, రామచంద్రమూర్తి యభయమునునేమో, ఆడినమాట తప్పఁడే యనియే తొందర, నికటపార్శ్వవర్తులన్ = సమీపమునఁ బ్రక్కల నుండువారిని, హనుమత్ప్రముఖాగచరులన్ = హనుమంతుఁడు మొదలగు వానరులను, సంప్రీతిన్ = సంతోషముతో, విభీషణు మాటలకు రావణుఁడు కోపించినట్లు కోపింపక తనమనస్సును దాఁపక వచించెఁగదా యని సంతోషించెను.

—♦ శ్రీరాముఁడు విభీషణువిషయమై కపుల యభిప్రాయ మడుగుట. ♦—

చ. వలిముఖనేత యాయసుర♦వల్లభుతమ్ము నెడాటమందుఁ దాఁ
బలికిన యుక్తియుక్త మగు♦పల్కులు మీరును వింటిరే కదా
బలితపుఁగార్యసంకటము♦పట్ల హితుం డొకఁ డాడ నంతతోఁ
బలుకమి యొప్ప దన్య మగు ♦ ప్రాజ్ఞ సమర్థ శుభేప్సుపాళికిన్. ౩౨

అర్థములు. వలిముఖనేత = వానరనాయకుఁడు = సుగ్రీవుఁడు; ఏడాట మందున్ = విషయమందు, పలుకమి = మాటలాడకుండుట; ప్రాజ్ఞ = బుద్ధిమంతులు=సమర్థులు; శుభేప్సు=మేలుకోరినవారునగు, పాళికిన్=సమూహమునకు.

తాత్పర్యము

సుగ్రీవుఁడు విభీషణునుగుఱించి యుక్తాయుక్తముగఁ జెప్పినమాటలు మీరందఱు విన్నారుగదా-గొప్పకార్యము చేయవలసి యందు సందేహముగలిగినపుడు హితుఁడొకఁడు చెప్పినదానితో నందఱు సంతుష్టిపడి మౌనము వహింపరాదు-ప్రాజ్ఞులు - సమర్థులు మేలుకోరువారితిరులును వారివారి యభిప్రాయము దెలుపవలయును.

క. కావున నియ్యెడ మీ మీ, భావంబులు దెలుపుఁ డన్నఁ ♦ బ్లవగవరుల్ త
ద్భావుక చికీర్షులై నం, భావించుచు దమమతంబుఁ బలికి రతనికిన్. ౩౮౧

అర్థములు. భావుక చికీర్షులై=శ్రీరామమూర్తికి మేలుచేయు నాలోచన గలవారై; 'భావుకం భవుకం భవ్యం కుశలం క్షేమ మస్త్రియామ్' అమరుఁడు.

తాత్పర్యము

ఇది నీతివిధముగావున మీమీ యభిప్రాయ మేమో వానరులారా చెప్పుఁడని యడుగఁగా మెట్లుచేసిన రామచంద్రమూర్తికి మేలో దానిని జేయఁగోరి తమ యభిప్రాయ మిట్లు పలికిరి.

సుగ్రీవుని యభిప్రాయమునకు విరోధముగఁ జెప్పిన నతఁ డేమనుకొనునో యని తలంపక నాస్థానమున మీరుండిన మీరేమిచేయుట బాగని తలంచి యుందురో దానిని దెలుపుఁడు.

చ. తెలియని దింత లేదు జగ♦తీత్రయమందు మహాత్మ ? నీకు మా
వలని నిగారపుంజెలిమి♦బల్మిని బ్రశ్న యొనర్చి తింతయే,
యెలసెఁ బరీక్ష్యకారిత సు♦హృత్పరతంత్రత ధార్మికత్వముం
బలదృఢశౌర్యసత్త్వము ల♦పారపరాక్రమ ! జ్ఞప్తి, నీయెడన్. ౩౮౨

అర్థములు. నిగారపున్ జెలిమిన్=నిర్మలమైన ప్రేమయొక్క; బల్మిన్ = అతిశయముచే, పరీక్ష్యకారిత = ఏదియైనను జక్కఁ బరీక్షించి కార్యముచేయుట, సుహృత్పరతంత్రత=మిత్రుల యిష్టప్రకారము నడచుకొనుట,మీఁదఁజెలిమియున్నప్పుడు సౌహృదయము భావము మాత్రము చెప్పఁబడెను. ఇచ్చటఁ బారతంత్ర్యము చెప్పఁబడెను. సద్వ్రతిత్వమున్ = శ్రేష్ఠమైన శరణాగతరక్షణవ్రతము ననుసరించి వర్తించుట, బల=దేహబలము, దృఢశౌర్యము=అధికశౌర్యము, సత్త్వము=సాధుస్వభావము, జ్ఞప్తి=స్మరణము,ధర్మము;ఎలసెన్=చేరియున్నవి. తెలియనిదింత లేదు సర్వజ్ఞుఁడవనినచో బహుత్వమును దెలుపునుగాని నిశ్శేషత్వము దెలుపదు,గావున దెలియని దింత లేదు అని చెప్పఁబడెను. అపారపరాక్రమ యనుటచే నిన్ను నెవరేమి చేయఁగలరని భావము. చెలిమి బల్మిని ప్రశ్న చేసితివి (౧) మాయందు. నీకుఁగల

స్నేహము ప్రకటించుటకుఁగాను అడిగితివి. (౨) రామచంద్రమూర్తి వానరులకు మిత్రుఁడు అనుకీర్తి మాకుఁ గలిగింపఁ బ్రశ్నించితివి.

తాత్పర్యము

మహాత్మా! నీకుఁ దెలియనిది మావలనఁ దెలిసికోవలసినది లవమైన లేదు. అయినను మాయందు నీకుఁగల నిర్మలమైన స్నేహము నతిశయముచే రాముని మిత్రులు వానరులనుకీర్తి మాకు సంపాదించి యీయ నడిగితివి కాని మఱియొండు గాదు. ఏపనియైనను నీవు ముందు పరీక్షింపక చేయవు. మిత్రుల యిష్టప్రకారము వర్తించువాఁడవు. నీవు చేయఁదలఁచిన కార్యము మిత్రులచే సరి యనిపించియావలఁ జేయుదువు, సత్యమైన వ్రతము గలవాఁడవు. నీవు పట్టిన వ్రతమును వదలవు. మేమేమి చెప్పినను నీ శరణాగతరక్షణ వ్రతమును నీవు విడువవు. సత్యమే నీకు వ్రతము ఏది చేసినను ధర్మము ననుసరించి చేయుదువు. బలము దృఢశౌర్యము దృఢసత్త్వము జ్ఞప్తి యివి నీయందు దృఢముగ నిలచియున్నవి. ఇట్టి నీ వేమి చేసిన నిన్నుఁ గాదనువారెవరు? పరాక్రమము చేతనే సర్వకార్యములు నీవు సాధింపఁగలవు, ఇట్టి నీకు మే మేమి చెప్పఁగలము?

క. మతిసంపన్నులు క్రియలం, దతినిపుణులు నీదు సచివు • లందఱు నగుటన్
 హిత మొక్కొక్కఁడు తనతన, మత మనుటయు మేలు హేతు•మానితఫణితిన్.

అర్థములు. మతిసంపన్నులు = ఆలోచించు శక్తి గలవారు. క్రియలందున్ = కార్యములు చేయుటయందు, సచివులు=మంత్రులు, మతము = అభిప్రాయము. హేతుమానితఫణితిన్=కారణముచే గౌరవింపఁబడిన మాటలచే.

తాత్పర్యము

నీ మంత్రు లందఱు చక్కఁగా నాలోచించి చెప్పఁగల బుద్ధిమంతులు. మాటలు చెప్పుటయందే కాదు. కార్యములు చేయుటయందు సమర్థులు కావున అందఱుఁ గలసి యొక్కటిగఁ జెప్పుటకంటె నొక్కొక్కఁడు ఈ యీ కారణములచే వీనిని జేర్చుకొనవచ్చును, ఈ యీ కారణములచే వీనిని జేర్చుకొనరాదని వాని వాని యభిప్రాయము వాఁడు వాఁడు చెప్పుట బాగు.

—• అంగదాదులు వారి వారి యభిప్రాయంబులఁ దెలుపుట •—

చ. అన విని వాలిపుత్రుఁడు ధ•రాధిపుతోడ విభీషణుం డరా
 తినికటమందు నుండి చను • దెంచుటచే ననుమానపాత్రుఁడే,
 చనను తటాన నమ్మఁ, దమ•చందము మార్పడఁ జేసి రంధ్రముం
 గని ప్రహరింత్రు ద్రోహు, లటు•గాన ననర్థము గల్గు నెంతయున్. ౩౪౪

అర్థములు. అరాతినికటమందున్=పగవాని యొద్దనుండి.

తాత్పర్యము

ఆ మాటలు విని రామచంద్రమూర్తితో నంగదుఁ డిట్లనియె. దేవా! విభీషణుఁడు మనశత్రువులయొద్దనుండి వచ్చినవాఁడు కావున సందేహింపఁదగినవాఁడే. కావునఁ బూర్వోత్తరములు విచారింపక తటాలున నమ్మరాదు. ఏలన ద్రోహులు తమ యథార్థస్థితి దాఁచి మాఱువేషమువేసి సమయము వచ్చినపుడు కొట్టుదురు. కావునఁ గీడు కలుగును.

ఉ. కావున నట్టివారలను • గార్యములం దిడి తత్ప్రవర్తనన్
వావిరి నిశ్చయించి గుణ•వంతుఁడ యేన్ గ్రహియింపవచ్చు, దు
ర్భావుఁడ యేని వీడు టది • భావ్యము, దోషబహుత్వమున్నచోఁ
జే విడువం దగుం గుణవి•శిష్టుఁడ యేనియుఁ గైకొనం దగున్. ౩౪౫

అర్థములు. తత్ప్రవర్తనన్=వారి నడవడిని, వావిరి=చక్కఁగా; దుర్భావుఁడు = చెడుతలంపుగలవాఁడు; భావ్యము=మేలు; దోషబహుత్వము = పెక్కుదోషములు; గుణవిశిష్టుఁడు = ఎక్కువ మంచిగుణములు గలవాఁడు, కైకొనం దగున్ = గ్రహింపవచ్చును.

తాత్పర్యము

కావునఁ గ్రొత్తవారినిఁ జేర్చుకొనునప్పుడు వానిచేతఁ గొన్నిపనులు చేయించి యవి వాఁడెట్లుచేయునో వాని నడవడి యెట్టిదో చక్కఁగా నిర్ధారించి గుణవంతుఁ డాయెనా గ్రహింపవచ్చును. దురభిప్రాయము గలవాఁడని తోఁచెనా విడువవచ్చును.

స్వామీ! 'యోగ్యః పురుషో నాస్తి' "అయోగ్యః పురుషో నాస్తి" అన్ని సద్గుణములు గలవాఁడు లేడు. అన్ని దుర్గుణములు గలవాఁడు లేఁడుగదా, యందు వేమో! దోషములు పెక్కు లున్న విడువవలయును. గుణములు పెక్కులున్న గ్రహింపవచ్చును, అని యువరాజగుటచే నంగదుఁడు తొలుతఁ జెప్పెను. సుగ్రీవుఁడు విభీషణుని సమీపమునకే రానీయరాదని చెప్పెను. అంగదుఁడు పరీక్షించి దుష్టుఁడైనచో విడువ వలయును అని చెప్పెను. ఇది భేదము.

ఉ. ఆ నుడు లాలకించి శర•భాహ్వయుఁ డి ట్లను సాధ్యసూక్తులన్
దానవు చిత్తశోధన మొ•నర్పఁగ వేగుల సూక్ష్మబుద్ధులన్
బో నియమించి వా రితని•పోకల నెల్ల నెఱింగి వచ్చినన్
మానవలోకపాల యను•మానము వాయ గ్రహింపు మిమ్మటన్. ౩౪౬

అర్థములు. క్రొత్తవానిని మనలోఁ జేర్చుకొని వానిచే మన పనులు చేయించుకొని గుణదోషములు నిశ్చయింపవలె నన్నమాట శరభునకు రుచించినది కాదు. ఏలనః—ఎప్పుడు మనలోనొకనిఁ జేర్చుకొంటిమో మనలో గుట్టులన్నియు

వాఁడప్పుడే తెలిసికొనఁ గలఁడు. ఆవల వానిని నుంచుకొనినను గీడే. పొమ్మనినను గీడే, యని తలఁచి శరభుఁడు తన యభిప్రాయమును చెప్పుచున్నాఁడు.

సాధ్యసూక్తిలన్ = చేయుటకు సాధ్యమైన మంచిమాటలచే ఇట్లు చెప్పుటచే నంగదు నభిప్రాయ మసాధ్య మని సూచన.

తాత్పర్యము

ఆ మాటలు విని శరభుఁడు చేయ సాధ్యమైన మంచి మాటలచే నిట్లనెను. రామచంద్రా! వీనిని మనలో నిప్పుడే కలుపుకొనక దూరమందే యుంచి సూక్ష్మబుద్ధిగల వేగుల నియమించి పరీక్షించి వీని నడవడుల నన్నిటిని వారు పరీక్షించి తెలిసికొని వచ్చిన పిమ్మట వీనియం దనుమానింపఁ గారణము లేదని తోఁచిన గ్రహింపుము.

చ. అనవుడు జాంబవంతుఁడు గుణాఢ్యము దోషవివర్జితంబుగా
మనవి యొనర్చె రావణుఁడు ♦ మత్సరచిత్తుఁడు బద్ధవైరుఁ డా
తని నెడఁ బాసి మిమ్మితఁడు ♦ దాయఁగ వచ్చె న హేతుకంబుగాఁ
గనఁగ నదేశకాలములఁ ♦ గావున నమ్మకుఁ డీ విభీషణున్. ౩౪౭

అర్థములు. ఈ యభిప్రాయము జాంబవంతునకు సరిపడినదికాదు. గుణాఢ్యము = గుణాధిక్యముగలది, దోషవివర్జితము=దోషములేనిది; ఇట్లు చెప్పుటచే శరభుని యభిప్రాయమందు గుణములేదు, దోషముగలదని జాంబవంతుని యభిప్రాయము. వేగుల నొప్పు డేర్పాటు జేసితిమో యప్పుడే వాఁడు హెచ్చరికపడి వాస్తవమును దాఁచి మంచివానివలెనే నటించును. అదియునుగాక వీరు నన్ను నమ్మరైరి కదా యను నభిప్రాయము వారికిని గలిగించి నట్లగును.

తాత్పర్యము

శరభుఁడిట్లు చెప్పఁగా గుణవంతము దోషరహితమునగు మాటను జాంబవంతుఁడిట్లు చెప్పెను. రావణుఁడు మనయందు మాత్సర్యముగలవాఁడు. విరోధమునే సాధింపవలయు నని కంకణము గట్టుకొన్నవాఁడు. అటువంటివానినివిడిచి వీఁడు వచ్చుటకుఁ దగినకారణము వీఁడు చెప్పలేదు. వీఁడు చెప్పినది నమ్మదగిన కారణము గాదు. అదియునుగాక వీఁడు వచ్చినది దేశకాలవిరుద్ధమైనది. మనమా లంకకు నూఱామడ దూరమున నున్నాము. మనముఖములు వారుచూడలేదు. వారి ముఖములు మనముచూడలేదు. మనవలన వారికివచ్చిన యుపద్రవములేదు. కావున నింత దూరము వెదకికొనుచు రాఁ గారణములేదు. అన్న తిట్టెను వచ్చితి ననెను. తన యెదుటికి రావలదనెనుగాని లంకలోనే యుండవలదనెనా? కావునవీఁ డింతదూరము రావలసిన పనిలేదు. వీఁడు వచ్చుట కిది తగిన కాలముగాదు. అన్నమాట తమ్ముఁడు వినవలయునా? తమ్ముని మాట యన్న వినవలయునా? తనమాట యన్న వినలేదని యతనినాపత్కాలములో విడిచివచ్చుట కాలవిరుద్ధము కావున మీరీతనినమ్మరాదు

ఉ. మైందుఁడు నీత్యనీతుల స♦మంబుగ బుద్ధిఁ దలంచి పల్కె ము
న్నుందు విభీషణుం దఱిసి ♦ ముచ్చట కీడిచి తేనెమాటలన్
నందున రావణాసురుని♦చందము మాటలపొం దెఱింగి మీా
దం దగు యుక్తముం జలుప ♦ దాశరథీ! ఖలుఁడే నదుష్టుఁడేన్. ౩౪౮

అర్థములు. జాంబవంతుఁడు చెప్పినమాట మైందుఁడు మెచ్చక యిట్లను చున్నాఁడు. నీత్యనీతులన్=నీతిని, నీతికాని దానిని, సమంబుగ బుద్ధిదలంచి యను టచే జాంబవంతుఁడు చెప్పిన దానియందు నీత్యనీతులు సమముగా లేవని సూచన, తేనెమాటలన్ = తేనెవంటి తియ్యని మాటలచే, ఇది యుపమానపూర్వపదకర్మ ధారయము, ఖలుఁడేన్=దుష్టుఁడైనను, అదుష్టుఁడేని=దుష్టుఁడు కాకున్నను.

తాత్పర్యము

జాంబవంతుఁడు చెప్పిన మాటలు విని మైందుఁడు నీతి యనీతులను సమ ముగా నాలోచించి యిట్లనియె. ముందుగా విభీషణుఁ జేరఁదీసి ముచ్చటలు పెట్టి కొని యా మాట ధోరణివలన రావణువిధము, వానివిషయమున వీని యభిప్రా యము నిజము దెలిసికొని దుష్టుఁడని తోఁచిన దండింప వచ్చును. శిష్టుఁడని తోఁచిన గ్రహింపవచ్చును.

తే. అంత సంస్కార సంపన్నుఁ ♦ డఖిల మంత్రి
సత్తముఁడు నగు హనుమ ప్ర♦శస్త ఫణితి.
నర్థవంతంబు మధురంబు ♦ నగుచుఁ బ్రియము
మితము నగు వాక్యములు పల్కె ♦ హితము దోఁప. ౩౪౯

అర్థములు. సంస్కారసంపన్నుఁడు = శాస్త్రమునందు చక్కని శిక్ష యభ్యాసము గలవాఁడు, ప్రశస్తఫణితిన్=మెచ్చుకొనఁదగిన వాక్యములచే, అర్థ వంతము=ప్రయోజనము గలది, మధురము = వినవింపైనది, మితము = ఎక్కువ మాటలు లేనిది.

తాత్పర్యము

ఇట్లందఱు చెప్పినపిమ్మట శాస్త్రజ్ఞానము శిక్షాపూర్వముగఁ దెలిసిన వాఁడును- మంత్రులందరిలో శ్రేష్ఠుఁడును, (ఇది సుగ్రీవుని నిషేధించు చున్నది) నగు హనుమంతుఁడు మెచ్చఁదగిన ప్రయోజనము గల తియ్యఁదనము ప్రియము హితము మితమునగు మాటల నిట్లనియె.

ప్రభువుగావున సుగ్రీవుండు చెప్పిన దానిని బూర్వపక్షము చేయక తక్కిన వారు చెప్పిన యాలోచనములు సరిగా దనుచున్నాఁడు. ఆలోచన సరిగా దను చున్నాఁడే కాని యది చెప్పినవారిపేరు చెప్పలేదు. ఆలోచన దుష్టముగాని యాలోచన చెప్పినవాఁడు దుష్టుఁడు గాఁడని భావము.

—• విభీషణుని గ్రహింపవచ్చునని హనుమంతుఁ డభిప్రాయము దెలుపుట •—

క. మతిమంతులలో శ్రేష్ఠుఁడ, వతికుశలుఁడ వర్థముల మ•హావాగ్మివి ని
  న్నతిరేకించి వచింపఁగ, శతమఖు నాచార్యుఁడైన • జాలఁడు రామా. ౩౫౦

అర్థములు. అర్థములన్ = ధర్మార్థకామమోక్షముల విచారణయందు; మహావాగ్మివి = మిగులఁ జక్కఁగ యుక్తియుక్తముగఁ జెప్పఁగలవాఁడవు; అతిరేకించి=అతిక్రమించి; సరిగాదని; శతమఖు నాచార్యుఁడు=బృహస్పతి.

తాత్పర్యము

రామచంద్రా! బుద్ధిమంతు లనిపించుకొనిన వారిలో నీవే శ్రేష్ఠుఁడవు. నీకు సమానులు లేరు, అధికులు లేరు, పురుషార్థముల నాలోచించి చేయుటయందు మిగుల నేర్పరివి. నీవుచేయు కార్యము పరులు మెచ్చునట్లు మాటలు యుక్తి యుక్తముగ శాస్త్రసమ్మతముగఁ జెప్పఁగల సామర్థ్యము గలవాఁడవు. నీవు చెప్పునది సరిగాదనుటకు బృహస్పతి యైనను సమర్థుఁడు గాఁడు.

సీ. వాగ్వాదముల నేను•వావదూకుఁడ నంచుఁ, దర్కనైపుణిఁ జూపఁ•దలఁప లేదు
  అన్యమతంబుల • నణఁచి నా వాదంబె, గెలిపింప వలయు న• న్తలఁపు లేదు
  ఎల్ల వారలకన్న • నేన మిన్నయటన్న, గౌరవంబును గాంచు • కాంక్ష లేదు
  నా వచోజృంభణ • మావిష్కృతము సేయ, నిది సమయంబంచు • నెంచ లేదు
తే. దనుజునందలి పక్షపా•తమునఁ గాదు, త్వద్గురుత్వాప్తి నభిలాష • వలనఁ గాదు
  రాజవల్లభ! దశరథ•రాజతనయ, కలది వచియింతు శ్రీరామ! • గౌరవమున. ౩౫౧

అర్థములు. వాగ్వాదములను = పూర్వపక్ష సిద్ధాంతరూపముగా మాటలాడుటయందు, నేన = నేనే, వావదూకుఁడను=యుక్తిగా మాటలాడుటయందు సమర్థుఁడను, 'వాచోయుక్తిపటు ర్వాగ్మీ వావదూకోఽతివక్తరి' అమరము. తర్కనైపుణి = యుక్తి చమత్కారము, మిన్న = గొప్పవాఁడు, వచోజృంభణము = మాటల యుద్దండత, ఆవిష్కృతము=వెల్లడి, త్వద్గురుత్వాప్తి = నీ వలన గొప్పవాఁడ ననిపించుకొనవలయు నను, గౌరవమున = (1) కార్యముయొక్క గొప్పతనము వలన, (2) ఇన్ని దినములుగ నాయందు నీకుఁ గల గౌరవమున, కలది= వాస్తవము.

తాత్పర్యము

ఇతరుల యభిప్రాయముల ఖండించి నా యభిప్రాయము స్థాపించుటయందు యుక్తియుక్తముగ మాటలాడఁ గల నని నా తర్కచాతుర్యము చూప నే నాలోచించినవాఁడఁ గాను. ఇతరుల యభిప్రాయములు తప్పనిపింపవలె, నా యభిప్రాయంబె స్థాపింపవలె నని యభిప్రాయము లేదు. తక్కిన యందఱికంటె హనుమంతుఁడు

బుద్ధిమంతుఁడు మంచి యాలోచన చెప్పును అని గౌరవమును సంపాదించుఁ గోరికయు లేదు. నేనుద్దండముగా మాటలాడఁగల వని నా గట్టితనము ప్రకటింప వలయు నని నే నెంచలేదు. వీఁడు లంకలో నాకనుకూలుఁడై పలికెను కావున వాని యందలి పక్షపాతముచే నేను జెప్పరాలేదు. నీ వలన నొక గౌరవము బిరుదు సంపాదింపవలె ననికాదు. రామచంద్రా! కార్యగౌరవమునుబట్టి నన్ను నీవు చూచు గౌరవమును బట్టియున్న వాస్తవము జెప్పెదను. సీతాదేవి వృత్తాంతము నేను నీకుఁ జెప్పినపుడు 'భృత్యకార్యము హనుమానసుతుండు దీర్చెఁ బ్రశస్తవ్యగతిన్' అనియు, నే నుత్తమభృత్యుఁడ ననియు నీవే చెప్పితివి. నన్నుఁ గౌఁగిలించి గౌరవించితివి. అట్టి యుత్తమభృత్యుఁడను గౌరవము నేను బోఁగొట్టు కొనరాదు. కావునఁ జెప్పెదను.

తక్కిన వానరు లీ పీఠికయే లేక వారి యభిప్రాయము దెలిపిరి కదా. ఈయన కీ పీఠిక యేల? ఈయన చెప్పఁబోవునది తక్కిన యందర యభిప్రాయ ముతో విరోధించునది. అందఱు నొక్క విధముగఁ జెప్పిన దా నొకఁ డొక విధ ముగఁ జెప్పెనని తక్కినవారు లేనిపోని దురూహలు పన్నఁ గారణము కలుగును విభీషణుఁడు తనకు లంకలోఁ జేసిన మేలిదివఱకే చెప్పియున్నాఁడు. ఆ పక్షపాత ముచే నిప్పుడాయన కనుకూలుఁడై చెప్పెనే కాని కార్య మాలోచించి చెప్పలే దను ధూఱు రాఁగలదు. అట్టి యభిప్రాయము లేవియు నాయందు లేవని ముందుగా జెప్పుకొనవలసి వచ్చెను.

తే. అర్థము ననర్థమును నారయంగ నీదు
సచివవర్యులు పలికిన చందములను
దోష మొక్కండు నా మదిఁ దోఁచుచున్న
దది గ్రహించుట కిపుడు సాధ్యంబు గాదు. ౩౫

అర్థములు. అర్థము = గుణము, అనర్థము = దోషము, అరయంగన్ = విచారింపఁగా.

మతఖండన కాలమందు వారి వారి పేర్లు చెప్పిన వారి వారికిఁ గోపము వచ్చును. అందు నంగదుఁడు యువరాజు. ఆయనకుఁ గోపము రాకుండుటకై యాయన పేరు చెప్పక సామాన్యముగ నందఱఁ గలిపి నీ మంత్రు లని చెప్పెను. అంగదుఁడు చెప్పిన దానిని ఖండించు చున్నాఁడు. విభీషణుని గ్రహించుటయందు గుణమును దోషమును నీ మంత్రివర్యులు చెప్పిన విధములందు నొక్కొక్క దోషము కానవచ్చుచున్నది. అంగదుఁడు చెప్పినది గ్రహింప నిపుడు సాధ్యపడదు.

క. పనులందు నియోగింపక, పనివానితనంబు తెలియఁబడదు తటాలన్
బనులందు నియోగించుట, యును దోషమ యనుచుఁ దోఁచె నుర్వీశవరా.

తాత్పర్యము

ఒకనిని బరీక్షించి చేర్చుకొనవలయు ననిన వానిని బనులందు నేర్పాటుచేయ కుండిన వాని గుణదోషములు తెలియవు. ఒకని గుణదోషములు తెలియక వానిని గొప్ప రాజకార్యములందు నెట్లేర్పాటుచేయ సాధ్యమగును? బనులందు నేర్పాటు చేసితిమా మనగుట్టు రట్టగును. కావున నిట్టిపరీక్ష సరిగాదు. (ఇది ౩౪౫ వ పద్యమునఁ జెప్పఁబడిన దాని ఖండనము) ఇందనోన్యాన్యాశ్రయత్వదోషముగలదు. పిచ్చి కుదిరినఁగాని పెండ్లికాదు. పెండ్లియైనఁగాని పిచ్చి కుదురదు. ఇట్టిది యనోన్యాన్యాశ్రయత్వము.

క. చారప్రణిహితమిపు డను,వారు ననుచు ననిరి యది ని•రర్థక మగుఁ బా
దూరవుఁబనికిన్ వేగులు, చేరువల న్వార లేమి • సేయఁగ వచ్చున్. ౩౫౪

అర్థములు. చారప్రణిహితము = వేగులవారి నేర్పాటు చేయుట; అను వారున్ = బాగుగనుండును. (ఇది ౩౪౬ వ పద్యము నందలి శరభుని మతము) అనునది వ్యర్థము=దానివలనఁ బ్రయోజనము లేదు. ఏలన దూరమున నుండువారి విషయమై విచారించి తెలుసుకొనవలయు ననిన వేగులు కావలయును. దానికి గాలము పట్టును. ఎదురుగానుండి యవునో కాదో యాక్షణమందే ప్రత్యుత్తర మీయవలసిన సందర్భములందు వేగు లేమి చేయఁగలరు.

ఉ. ఈతఁ డదేశకాలముల • నిం దరుదెంచె నటన్నమాటకున్
వా తలఁ పేమినా నసుర•నాయకు దౌష్ట్యము నీదు శౌర్యముం
జేతముసం దెఱింగి యిటు • చేరె గుణోత్తరు నర్హవేళనే,
యీతని బుద్ధికిం దగిన • దియ్యదిగాదె? యదేశ మెట్లగున్ ? ౩౫౫

తాత్పర్యము

ఈతఁడు దేశముగాని దేశమునందుఁ గాలము గాని కాలమందు వచ్చె నన్న విషయములో (ఇది ౩౪౭ వ పద్యములోని జాంబవంతుని యభిప్రాయము.) నా యభిప్రాయ మే మంటివా, రావణుఁడు సర్వరాక్షసనాశనకరమైన సీతాపహరణమువలన మరలనామె నీయమిని దుష్టుఁడనియు, ఖర వాలి వధచే నీవు శూరుఁడ వనియు, విభీషణుఁడు చక్కఁగా నెఱిఁగినవాఁడే. కావున గుణములచే గొప్పవాఁడగు నిన్ను ఏ సమయమందుఁ జేరవలెనో యా సమయమందే, యే ప్రదేశమునఁ జేరవలెనో యా ప్రదేశమందే చేరెను. ఈతని సౌమ్యబుద్ధికిఁ దగిన దియ్యదియే. సముద్రము దాఁటిన తరువాత వచ్చియుండరాదా యందురేమో మనము నిన్న రాత్రి యిచ్చటఁ జేరితిమి. ఆ వార్త తెలిసి యీదిన ముదయమున రావణుఁడు సభ చేసెను. అం దితనికి రావణునకు వాదప్రతివాదములు జరిగియుండును. వాఁడు దుష్టుఁడు గావున నీతని నవమానించి యుండును. మనము సముద్రము దాఁటు టెప్పుడో, అంతవఱకు లంక విడిచి యెందుండవలె. ఏమి చేయుచుండవలెను. ఉండిన

నచ్చేటనో లేక యిచ్చటనో యుండవలెను. అది విడిచెను గావున నిచ్చటికి వచ్చెను. సముద్రము దాఁటిన తరువాత వచ్చియుండిన నేనాఁడో యవమానించిన నీ నాఁడేల వచ్చితివని మనమే యడుగమా? అప్పు డేమి చెప్పఁ గలఁడు ?

జాంబవంతుఁడు చెప్పిన యాలోచనయందు స్వరూపాసిద్ధి యను దోషము గలదు. చెప్పిన హేతువు సరి గానిచో స్వరూపాసిద్ధి యను దోష మగును.

ప్రతికూలునిపై దోషము దృఢపడినపుడే వానిని విడువఁ దగిన కాలము. అనుకూలునిపై గుణము నిశ్చయమైన యపుడే యాశ్రయింపఁదగిన కాలము. ఈ రెండు నిపుడే నిశ్చయము లైనవి.

శరణాగతికి దేశకాలనియమము లేదు.

"ప్రపత్తికి దేశనియమమును కాలనియమమును, ప్రకారనియమమును, అధికారినియమమును, ఫలనియమమును లేవు. విషయనియమమే గావలసినది" శ్రీవచన భూషణము.

ప్రతిపత్తియనఁగా:— భగవంతుని శరణుజొచ్చుట. దేశనియమ మనఁగా, పుణ్యదేశములయందుఁ జేయవలయును. తదితర దేశములందుఁ గూడదు అనునది, కాలనియమ మనఁగా వసంతాది కాలములందుఁ జేయవలయును, తదితర కాలములయందుఁ జేయఁగూడదుఅను నియమము. ప్రకారనియమమనఁగా, స్నానపాదప్రక్షాళనాది పూర్వకముగఁ జేయవలయును. వేఱొక విధముగఁ జేయఁగూడదు అను నియమము. అధికారినియమ మనగా త్రైవర్ణికులుగానే యుండవలయును, తక్కిన వారు పనికిరారు అనునది. ఫలనియమ మనఁగా, దృష్టాదృష్ట ఫలములలో నీ ఫలమునకిదిసాధనము, వేఱొక్క ఫలమున కిదిసాధనముగాదు అను నియమము. దేశకాలముల మంచిచెడ్డల మూలమున నొక యతిశయమునుగాని, యొక సంకోచమునుగానిపొందునట్టిది కానందునను, నదిలో దిగి స్నానముఁ జేయఁదలంచినపుడు అది యపరిశుద్ధమైనదా కాదా అనెడి వివక్ష లేకుండ దిగి స్నానముఁ జేయునట్లు స్వయముగఁ బవిత్రమై ఇది పరిశుద్ధము, అది పరిశుద్ధముకాదు అనెడి వివక్ష నెంతమాత్రము చేయనక్కఱలేకుండ తనతో సంబంధించి యుండదగి యున్నందునను, వర్ణాదులకనుగుణ మైనదై యుండునట్టిది కాకుండ స్వరూపమునకనుగుణముగానుండునది యైనందునను, చేతనుల రుచికనుగుణముగా నానావిధ ఫలములకు సాధనభూతమైనందునను, ఈ నియమము లేవియు దీనికి లేవు. అది యెట్లనిన "న జాతిభేదం న కులం న లింగం న గుణక్రియాః న దేశకాలౌ నావస్థాం యోగో హ్యయమపేక్షతే, బ్రహ్మక్షత్రవిశశ్శూద్రాః స్త్రియశ్చాంతరజాతయః సర్వ ఏవ ప్రపద్యేరన్ సర్వధాతారమచ్యుతమ్" సర్వమును ధరించి యుండువాఁడగు శ్రీమన్నారాయణునిశరణుజొచ్చు విషయమునజాతిభేదముగానికులభేదముగాని, లింగభేదముగాని, గుణముకాని, క్రియలుగాని దేశకాలావస్థలుగాని యాపేక్షకములుగావు. బ్రహ్మ, క్షత్రియ, వైశ్య, శూద్ర జాతులవా అందఱును స్త్రీలును,

వీరిలో నంతర్గతములగు నితరజాతులవారును వీరు వారనక నందఱును శరణుఁ జొఁరవచ్చును. అని యిట్లు ప్రపత్తికి దేశకాలాధికారి నియమములు లేకుండుటను గుఱించి భారద్వాజ సంహితయందుఁ జెప్పఁబడినది మఱియు "ప్రపత్తేః క్వచిదప్యేవం పరాపేక్షా నవిద్యతే. సాహి సర్వత్ర సర్వేషాం సర్వకామఫలప్రదా" ప్రపత్తికి వేఱొక్కదాని యపేక్ష లేదు. అది సర్వకాల సర్వావస్థలయందును అందరకును అన్నికోరికలను నెరవేర్చునది. అన్నిఫలముల నిచ్చునది. అని ప్రపత్తికి ఫలనియమము లేకుండుటను గుఱించి సనత్కుమార సంహితయందును జెప్పఁబడినది.

(నపద ఇత్యాది) "బద్ధవైరాచ్చ పాపాచ్చ రాక్షసేంద్రా ద్విభీషణః, అదేశకాలే సంప్రాప్తః సర్వదా శంక్యతా మయం" (రా. యు. ౧౭-౨౮) బద్ధవైరుండును పాపియును నగు రావణాసురుని యొద్దనుండి విభీషణుండు కాలముగానికాలమునను తావుకాని తావునను మీయొద్దకు వచ్చియున్నాఁడు. కావున నీతని రాకను గుఱించి యనుమానింపవలసి యున్నది-అని యిట్లు జాంబవంతుఁడు శ్రీరామచంద్రునితో విన్నవింపఁగా దానిని దూషించుచు శ్రీయాంజనేయుఁడు "అదేశకాలే సంప్రాప్త ఇత్యయంస విభీషణఃవివక్షాచాత్ర మేఽస్తీయం తాం నిబోధ యథామతి॥నపద దేశకాలశ్చ భవతీహయథాతథా,పురుషాత్పురుషం ప్రాప్య తథాదోషగుణావపి॥దౌరాత్మ్యం రావణేదృష్ట్వా విక్రమంచ తథా త్వయి, యుక్తమాగమనం తస్య సదృశం తస్యబుద్ధితః" రావణునిచే నవమానింపఁబడి నైచ్యమును దలంచుచు శరణుఁజొచ్చిన శ్రీ విభీషణాళ్వారులు కాలముగాని కాలమున, తావుగాని తావున వచ్చినారని దేవరవారి మంత్రులు ఏదో చెప్పియుండిరి. ఈ విషయమును గుఱించి నేనొక్కటి విన్నవింపవలసియున్నది. వారు ఏకాలమున, ఏదేశమున దేవరవారిని శరణు జొచ్చిరో అందులకదియే దేశము, అందులకదియే కాలమని యేదో యొకవిధమున నాకు తెలిసినంతవఱకు నేను విన్నవించువానిని కృపతో నాలకించుదురు గాక. అది యెట్లనిన తమోగుణస్వభావుండగుటచే పరహింసయే వృత్తినిగాఁ గలిగియుండు రావణుని కంటెను సత్త్వగుణ ప్రధానులగుటచే పరరక్షణమే వృత్తిగా గలిగియుండునట్టి దేవరవారిని ప్రాపులనఁగాఁ దలంచియు, రావణుని విడిచిపోక పోయినట్లయిన వాని యకృత్యములకుఁ దోడ్పడి వానికిఁగల ప్రాతికూల్యముతోఁగూడ నశించిపోవుట యనెడి దోషమును, ధార్మికులగు దేవరవారితోఁగూడనుండినట్లయిన, అందులకుఫలముగా దేవరవారి శ్రీపాదముల సన్నిధిని కైంకర్యము లభించి సుఖించుట యను సుగుణమును యోజించి దేవరవారి హృదయమునకు ఎక్కువ కష్టమును గలుగఁజేయునట్టి పాపంబులను లెస్సగాఁ జేసియున్నట్టి రావణుని దుష్టస్వభావమును, దుష్టులను అనాయాసముగ దండింపగల దేవరవారి పౌరుషమును యోజించినట్లయిన విశేషజ్ఞుఁడగువాని కిట్లు చేయుటయే యుక్తము, న్యాయమార్గమును సంచరించునట్టి వాని బుద్ధికిని యిది సరియైనది యనికదా చెప్పియున్నాఁడు కావున నిట్టిభావశుద్ధి గల

శ్రీవిభీషణులవారు శరణుజొచ్చినట్టి దేశకాలముల మంచిచెడ్డలను గుఱించి విచారింప నక్కఱలేదు. ఆయన వచ్చినకాలమే యందులకుఁ దగినకాల మనియు, ఆయన వచ్చిన తావే యందులకుఁ దగిన తావనియు శరణాగతి ధర్మమును గుర్తెఱింగినట్టి శ్రీ యాంజనేయులవారు నిర్ణయించుట చేసి ప్రపత్తికి, దేశకాలనియమములు లేవని యెఱుంగునది.

తే. పనిచి యజ్ఞాతరూపు లౌ • వారి దేవ! ప్రశ్న యొనరింపఁదగు ననిఁ • పలుకఁబడియె
నీ విచారంబునందు నా • భావమునను, దోఁచుచున్నది యొక్కండు • దోషమధిప.

అర్థములు. పనిచి = పంపి, అజ్ఞాతరూపులు = తెలియఁబడని రూపము గలవారు, మాఱువేషములు ధరించినవారు. (ఇది మైందునిమతము. ౩౪౮ పద్యము)

తాత్పర్యము

కొందఱు దూరముగఁ బంపి వారు మాఱువేషములతో వచ్చి విభీషణుని బ్రశ్నింపవలయు నను విషయమునందు నాకొక్క దోషము కానవచ్చుచున్నది.

చ. పరిచితి లేనివాఁ డొకఁడు • ప్రశ్నలు వేయఁ గడంగినంతనే
వరమతి యైన వానికి న • వశ్యము సందియ ముద్భవించి యే
వరుసునఁ జెప్ప నేమొ యని • పల్కు సదుత్తర మీక, దానిచే
దురితము లేని మిత్రుఁడును • దూషితుఁ డౌ సరిగాని ప్రశ్నలన్. ౩౫౭

అర్థములు. పరిచితి = పరిచయము, మైత్రి, వరమతి = బుద్ధిమంతుఁడు, ఏ వరుసన=ఏ విధముగ, సదుత్తరము=మంచి ప్రత్యుత్తరము, దురితము=దోషము, దూషితుఁడు దోషిగా నెన్నబడు వాఁడు.

తాత్పర్యము

పూర్వపరిచయములేని క్రొత్తవాఁడు తన్ను గుఱించి ప్రశ్నలు వేయఁబూనినచో బుద్ధిమంతుఁడు వానికి సదుత్తర మీయక యేమి చెప్పిన నేమో యని సందేహించి యెదుటివానికి వాస్తవము తెలియరాక, యర్థముగాక యుండునట్లు ప్రత్యుత్తర మిచ్చును. దానివలన వీఁడు సరియైన ప్రత్యుత్తర మీయలేదు. కనుక దోషి యని ప్రశ్న లడిగెడివాఁడు తలఁచును. ఈ విధముగ సంబంధములేని వక్రప్రశ్నలడుగుటచే నిర్దోషికూడ దోషిగానే యెన్నఁబడును. అడిగినవారి కందఱకుఁ దన విషయము తేటతెల్లముగ విప్పి చెప్పవలయు నని నియమము లేదు. ఆప్తులకుఁ జెప్పఁదగినవి యనాప్తులకుఁ జెప్పవచ్చునా? శత్రువులందు వారిలో వారికి భేదము పుట్టించి కొందఱఁ జీలఁదీసి మనలోఁ గలుపుకొనుటకు మనమే యత్నింపవలసి యుండఁగా వారిలో వారు కలహించి యొకపక్షమువాఁడు తానై వచ్చినను కొంటె ప్రశ్నలచే వానిని నిరాకరించుటవలన మిత్రలాభము చెడిపోవును. కావున నది నీతిశాస్త్రసమ్మతముగాదు. హనుమంతుఁడు లంకలో దండనీతి నవలంబించునపుడు చేసిన యాలోచన యిదియేకదా-అది కొంతకుఁ గొంత ఫలించెను. అట్లు చెప్ప

కుండినంత మాత్రమున వాఁడు దొంగ యగునా? మైందుఁడు చెప్పినదానియందు వ్యభిచరితదోషము గలదు. ఏ కారణమువలన సరియైన కార్యము కలుగదో విపరీత ఫలము గలుగునో యద్ది వ్యభిచరితకారణము.

ఉ. మాటలఁ దాన యెంతయు స♦మర్థుఁడనంచుఁదలంచువాఁడు ధీ
పాటవ మేర్పడం దనదు♦భావ మెఱుంగఁగనీక పల్కునా
మేటరి మాటకాని మది ♦ మేర నెఱుంగఁగలేఁడు నిక్క, మ
ల్లాటఁ దదీయయుక్తియు ని♦రర్థక మంచుఁ దలంతు రాఘవా. ౩౫౮

తాత్పర్యము

మాటలాడుటయందుఁ దానే నేర్పరియని తలంచువాఁడు బుద్ధిబలముచేఁ దన భావముఁ దెలియనీక పలుకువాని వాస్తవాభిప్రాయ మెఱుంగలేఁడు. కుట్రప్రశ్నలకు బుద్ధిమంతుఁడు కుట ప్రత్యుత్తరములే యిచ్చును. అప్పుడు వాస్తవాభిప్రాయ మేమో తెలియరాదు. కాబట్టియీ యుక్తియు వ్యర్థమనియే నాయభిప్రాయము.

ఉ. ఆతఁడు మాటలాడు నెడ ♦ నారసి చూచిన దుష్టభావ తా
రీతియు నేని దోఁపదు గ♦రిష్ఠగుణాఢ్య! ప్రసన్నమౌ ముఖం
బీ తతి వంచకుం డిటుల ♦ యెంతయు నిబ్బర మూని రాఁడు శం
కాతురవృత్తిలేక, నుడిఁ ♦ గానఁగరా దొక దోష మేనియున్. ౩౫౯

అర్థములు. దుష్టభావ రీతి=దురభిప్రాయము గలవాని విధము, తోఁపదు= కానరాదు, గరిష్ఠగుణాఢ్య = మిగుల గొప్పదగు గుణసంపత్తి గలవాఁడా! శంకాతుర వృత్తిలేక=సందేహము భయములేక, నుడిన్=మాటలయందు, ఎదుటివాని చిత్తవృత్తి తెలిసికొనుటకు శాస్త్రములందు- ఇంగితము- ఆకారము-చేష్ట- భాష యను నాలు గుపాయములు చెప్పఁబడెను. మాటలాడుట యందు దుష్టభావము గానరాలే దనుటచే నింగితము, ముఖము ప్రసన్న మనుటచే నాకారము నిబ్బరముగ=నిస్సందేహముగ, నిర్భయముగా వచ్చినాఁడనుటచేఁ జేష్టయును, నుడి దోషము కానరా దనుటచే భాషయు శుద్ధ మని చెప్పఁబడెను.

ఇతరులు చెప్పిన వానియందు దోషములు చెప్పితివే నీ యభిప్రాయ మేమందువా? చెప్పెద నని హనుమంతుఁడు తన యభిప్రాయము చెప్పుచున్నాఁడు.

తాత్పర్యము

ఎదుటివాని మనశ్శుద్ధి తెలిసికొనుటకు శాస్త్రములందు నాలు గుపాయములు చెప్పఁబడెను. అవి ఇంగితము-ఆకారము-చేష్ట - భాష యనునవి. వీఁడు మాటలాడు నపుడు వీఁడు దుష్టభావము గలవాఁడు కాఁడని యింగితము తెల్పుచున్నది. ముఖము ప్రసన్నమై వికారములు లేకుండుటచే ఆకారము శుద్ధమని యేర్పడుచున్నది. మోసగాఁడు నిబ్బరముగ జంకు గొంకు భయము లేక రాఁడు, వీఁడు వచ్చినాఁడు, కావున చేష్ట శుద్ధమని యేర్పడుచున్నది. మాటలయందుఁ దడఁబాటు పూర్వోత్తర

విరుద్ధములు సందిగ్ధములు గలవా యనిన నవి లేవు. కావున భాషాశుద్ధి గలదు, కావున వీఁడు నిర్దోషి యనియే నాయభిప్రాయము.

క. ఏ విధి గోరిన రూపం, బా విధి మార్పఁ బడవచ్చు ♦ నంతర్గత మా
భావంబు దాఁప శక్యమె? భావంబును బయలు పుచ్చు ♦ వదనం బెటులేన్.

తాత్పర్యము

నీ వింగితము, ఆకారము ప్రబల ప్రమాణములుగాఁ జెప్పుచున్నావే, భావ మొక విధముగా నుండిన ముఖనయనాదులు మఱియొక విధముగ నుండ రాదా యందురేమో, వాఁడు వాఁడు కోరినట్లు వేషమును మార్పవచ్చును గాని లోపలనుండు భావము బయట పడకుండ దాఁప సాధ్యపడదు. లోపలి భావమును ముఖ మేవిధముగనైన బయలు పఱచుచుండును. (Face is the index of mind) అనఁగా ముఖము మనస్సుయొక్క విషయసూచిక యని సామెత గలదు.

ఉ. కావున సంశయింపఁ దగు ♦ కారణ మేదియు లేదు, ఏని స
ద్భావమునన్ గ్రహింపఁ దగుఁ బార్థివసత్తమ! దేశకాలముల్
భావనచేసి కార్యమును ♦ బాగుగఁ జేసిన దత్ఫలంబు పెం
పౌ వహిన్ వైశ మబ్బు, మహి♦తాత్మక! నీకు వచించువాఁడనే. ౩౬౧

అర్థములు. సద్భావమునన్ = మంచి యభిప్రాయముతో, దగ్గఱఁ జేర్చుకొనఁ గీడు చేయునేమో యను సందేహము లేక, భావన చేసి = ఆలోచించి, పెంపు+ఔ+వహిన్ = వృద్ధిపొందు విధముగ, వైశము = శీఘ్రముగ.

తాత్పర్యము

ఈ కారణములచే వీఁడు దుష్టుఁ డని సందేహింప హేతువు కానరాలేదు. మంచి యభిప్రాయముతోనే చేరదీయవచ్చును. దేశము కాలము నాలోచించి కార్యమును జక్కఁగఁ జేసినచో ఫలముకూడ త్వరగానే వృద్ధిచెందును. వీనిని నిరసింపక చేర్చుకొనిన మేలుఫలము కనఁబడునుగాని కనఁబడకపోదు. మహాత్మా! నీకుఁ జెప్పగలవాఁడనా నేను?

ఉ. నీ మహితోద్యమంబు రజ♦నీచర నాయకు దుర్ణయంబు సు
త్రామసుతు న్వధించి కపి♦రాజ్యము భాస్కరసూతి కిచ్చుటల్
తా మును విన్నవాఁ డగుటఁ ♦ దానును రాజ్యము వేఁడుపొంటె నీ
తామహిశేశ! నీ యెడకుఁ ♦ దారసిలె న్మతిపూర్వకంబుగన్. ౩౬౨

అర్థములు. నీ మహితోద్యమంబు=నీ గొప్ప ప్రయత్నము, వాలినిఁ జంపుట, యింతసేన గూర్చుట, దండెత్తి వచ్చుట, సముద్రము దాఁట యత్నించుట యను ప్రయత్నము. దుర్ణయంబు=దుర్నీతి, సుత్రామసుతున్=వాలిని, భాస్కరసూతికి సుగ్రీవునకు, వేఁడుపొంటె=ప్రార్థించుకొఱకు, తారసిలెన్=వచ్చెను, మతిపూర్వ

కలుషగన్ = నిండు మనస్సుతో, ఇది రావణుఁడు పంపఁగా వచ్చినవాఁడు కాఁడని తెలుపుచున్నది.

తాత్పర్యము

హనుమంతా! ప్రయోజన మనుద్దిశ్య న మందోపి ప్రవర్తతే' ప్రయోజనము నుద్దేశింపక మందుఁడుకూడ నొకకార్యముఁ జేయఁడుకదా! వీఁడు బుద్ధిమంతుఁడని నీవు చెప్పుచున్నావే-వీఁడు ప్రయోజన ముద్దేశింపక వచ్చియుండఁడుకదా - ఆయుద్దేశ్య మేది యని నీ యభిప్రాయము. రావణాసురుఁడు చంపు నను భయముచే ప్రాణము కాపాడుకొనుటకై వచ్చెనా? ఎక్కడ నిలువ నీడలేక కొన్నాళ్ళిచ్చట నుండ మని వచ్చెనా? నీ యభిప్రాయ మేమందువా? నీవు చేయుచుండు గొప్ప ప్రయత్నము రావణుఁడు సీతాహరణాది నీతిమాలినకృత్యంబులు చేయుట చూచి నీచే రావణుఁడు చచ్చు నని నిశ్చయించి నీవు పూర్వము దుర్నీతిపరుఁడగు వాలిని జంపి సుగ్రీవునకు రాజ్యమిచ్చినట్లు విన్నవాఁడగుటచే నీవు రావణు జంపి రాజ్యమును దన కిమ్మని ప్రార్థించుటకై బుద్ధిపూర్వకముగ నీ యొద్దకు వచ్చె నని నా యభిప్రాయము.

ఇది హనుమంతుని యూహ. వాస్తవము హనుమంతునికిఁ దెలియదు. సీతాదేవి ప్రశ్నలకు సమయోచితముగ నమ్మఁదగిన విధముగఁ బ్రత్యుత్తరము లిచ్చినట్లు రామచంద్రమూర్తికిని నుండిన నుండవచ్చు నని నమ్మఁదగిన కారణము చెప్పెను. విభీషణు నభిప్రాయ మదియేని నీకు సాహాయ్యము చేసెదను, నాకు రాజ్య మిమ్మని విభీషణుఁడు బేరము పెట్టను లేదు, వెనుకనైన వేఁడను లేదు.

తే. దీని నంతయు యోజించి•వీని సాధు, గుణముఁ బల్కితినాశక్తి•కొలఁది రామ
బుద్ధిమంతులలో నుత్త•ముఁడవు, నీవు శేషకార్యంబు నీవ యో•జింపవయ్య. ౬౬

తాత్పర్యము

ఈ విషయము లన్నియు నా బుద్ధిబలము కొలఁది నాలోచించి వీఁడు సాధువర్తనము గలవాఁడని చెప్పితిని- నీవు బుద్ధిమంతులలో నుత్తముఁడవు. ఇఁక చేయవలసిన కార్యము వీనిని జేర్చుకొనుటో విడుచుటో నీవే యాలోచింపుము.

అంగదాదుల వాక్యములవలన నూతనాశ్రితునియందుఁ బ్రాఁతవారి (భాగవతుల) యభిప్రాయ మిట్టిదై యుండునని చెప్పఁబడెను.

హనుమంతుని వాక్యమువలన నాచార్య పరతంత్రుఁడై యుండువాఁడైనను నూతనముగ వచ్చిన యాశ్రితునియందుఁ దన తోడివారికి సందేహము కలిగె నేని భగవత్ప్రేమాతిశయమువలన నయ్యాశ్రితుని పక్షము వహించి మాటలాడుటయే యాచార్యునకుఁ బ్రీతిజనకం బగు నని యేర్పడుచున్నది.

—• { ౧౮-వ సర్గము శ్రీరాముఁడు కపులతో విభీషణుఁడు గ్రాహ్యుఁడని చెప్పుట. } •—

ఉ. మారుతపుత్రుఁ డాడిన స•మంజససూక్తుల నాలకించి దు
ర్వారమతిన్ సువిశ్రుతుఁడు • రామవిభుండు ప్రసన్నచిత్తుఁడై
వారలతో నిజాశయముఁ • బల్కె- వినుండు హితేచ్ఛ లౌటచేఁ
గోరెద నీ విభీషణుని•గూర్చి వచింపఁగఁ గొంత నేనునన్. ౩౬౮

అర్థములు. సమంజస సూక్తులన్=న్యాయముతోఁ గూడిన మంచిమాటలు, హనుమంతుఁడు చెప్పినవి సమంజస సూక్తులనుటచేఁ దక్కినవారు చెప్పినవి సమంజసములుగావు. సూక్తులుగావని భావము. శరణాగతుని ద్రోచిపుచ్చుమనుట సమంజసముగాదు. నిర్దోషిని దోషియని దూషించుట సూక్తియుఁగాదు. దుర్వారమతిన్=అడ్డగింపరాని మనస్సుతో, వసిష్ఠాదులైన పెద్దలవలనఁ గపోతోపాఖ్యానము=కండూపాఖ్యానము, శిబి చరిత్రమును ఈ మొదలైనవి విన్నవాఁడగుటచే శరణాగతుని విషయమున వడవడియందు దృఢపడిన మనస్సుగలవాఁడై సుగ్రీవాదుల మాటలకుఁ గలఁతచెందిన మనస్సుగలవాఁడు కాఁడయ్యెనని భావము, సువిశ్రుతుఁడు=చక్కని వినికిడిగలవాఁడు, ప్రసన్నచిత్తుఁడై =నిర్మలమైన మనస్సుగలవాఁడై, సుగ్రీవుఁడు మొదలు మైందునివఱకు నంద ఱేకవాక్యముగ విభీషణునికిఁ బ్రతికూలముగఁ జెప్పినవారే. వారిమాటలు విన్నప్పుడు ఏమిరా? వీరందరు నా యభిప్రాయమునకు విరోధముగఁ జెప్పుచున్నారే; ఇదికాదనిన వీరికందఱకుఁ గోపము వచ్చునో,అంతఃకలహములే పుట్టునో యని వ్యాకులపాటు గలవాఁడగుటచే ముఖము ప్రసన్నముగాలేదు. హనుమంతుఁడు చెప్పినపిమ్మట నొకఁడైన ననుకూలముగఁ జెప్పెఁగదా యని ప్రసన్నుఁడయ్యెనని భావము. నిజాశయము=తనయభిప్రాయము, హితేచ్ఛులౌటచేన్=నామేలు గోరినవారలగుటచే, ఇది తాను జెప్పఁబోవువానివలన వానరులకుఁ గోపము రాకుండుటకై చెప్పిన శాంతివాక్యము, నేనునున్=నేనుగూడ, మీరందఱెట్లు చెప్పితిరో యట్లనే నేనుగూడ నా యభిప్రాయముఁ జెప్పెదను.

తాత్పర్యము

ఆంజనేయుఁడు చెప్పిన న్యాయముతోఁ గూడిన మంచిమాటలు విని యిట్టి సందర్భములందు శాస్త్రము లేమి చెప్పుచున్నవో, పూర్వు లెట్టు లాచరించిరో యది వసిష్ఠాది వృద్ధులవలన విన్నవాఁడై చేయవలసినపని నిశ్చయించుకొన్న రామచంద్రమూర్తి ప్రసన్నమైన మనస్సుగలవాఁడై వానరులతో నిట్లనియె. మిత్రులారా, మీ రందఱు నా మేలు గోరువారు. మీ మీ యభిప్రాయములఁ దెలిపితిరి. విభీషణుని గుఱించి నా యభిప్రాయమును నేను దెలిపెదను. అది మీరు విని యేది బాగని మనము నిర్ణయించెదమో యా ప్రకారమే చేసెదను.

తే. మైత్రి భావించి తాన సంప్రాప్తుఁడైన, వాని నెపుడేని చేవిడువాఁడఁ గాను
వాని యెడ నుండె నేని యేదేని దోష, మద్ది గర్హ్యంబు గాదు సత్సాధులకును.

తాత్పర్యము

ఇట్లు మంత్రులతో మంచిమాట లాడి తన కొక్క స్వభావసిద్ధమైన గుణమున్నదని చెప్పుచుఁ దన్మూలమున విభీషణుని గుఱించి స్వాభిప్రాయమును సహేతుకముగా వెల్లడించుచున్నాఁడు.

విభీషణుఁడు దుష్టుఁడు కాఁబట్టి యంగీకరింప రాదని సుగ్రీవాదులు చెప్పిరి. వారు చెప్పిన వానిలో హేతువును సాధ్యమును రెండును సరిగావు. విభీషణుఁడు నిర్దోషి కావున నంగీకార్యుఁడే యని హనుమంతుని యభిప్రాయము. దీని యందు సాధ్యముమాత్రము సరిగాని హేతువు సరిగాదు. కాఁబట్టిశరణన్నవానిని రక్షింపవలెననుటయే సహేతుకమై యుక్తమైన మాట. ఈ కడపటి యభిప్రాయమునందు విభీషణాంగీకారము సాధ్యాంశము. ఇది యబాధితమైనది. శరణుఁజొచ్చుట హేతువు. దీనికి స్వరూపాసిద్ధ్యాది దోషములు లేవు. అట్టి యీ హేతువునే మైత్రిభావించి యను వాక్యమునందుఁ జెప్పుచున్నాఁడు. మైత్రిభావించి = వాస్తవ మిత్రత్వము లేకున్నను మిత్రనటనమాత్ర మున్నను జాలుననియర్థము. "శరణవరణవాగియం రామాదిత్వానభవతి బత సాపి ధీపూర్వికా" యను పెద్దలమాట యిందుఁ బ్రమాణము. భావశబ్దమునకు లీల యనియు నర్థముగలదు. భావో విద్వల్లీలా స్వభావేషు భూత్యభిప్రాయజంతుషు" నానా॥ర॥ కావున భావించి యనఁగా నటించి యని యర్థము. ఈ ప్రకరణమునందు మొదట రామచంద్రునిన్ శరణము జొచ్చినాఁడనని యుండుట చేతను నిను శరణంబుజొచ్చితి నని పైని జెప్పఁబోవుటచేతను. నీవడుమనున్న యీ మైత్రిశబ్దము శరణాగతినే తెలుపునని యెఱుఁగునది. ఇట్లే సుందరకాండమునందును రాముతోఁ జెలిమికోరుమయని చెలిమి శబ్దముతో నుపక్రమించి శరణాగతవత్సలుఁడౌట నని శరణాగతి శబ్దముచే నుపసంహారము చేసియున్నది. ఇచ్చటను నుపసంహారానుగుణముగను నితర హేతువును బట్టియు నుపక్రమములో నున్న మైత్రి శబ్దము శరణాగతి పరమే యనియుఁ దెలియునది, లేదా యీ చేయుపట్టికార్యము ఆశ్రయించువానికి శరణాగతిగాఁ దోఁచినను నట్టు లాశ్రయించిన వానిని దనతో పాటు చూచుకొనెడి భగవంతుని యభిప్రాయమున కిది మైత్రిగనే తోఁచును. కాఁబట్టి మైత్రి యని చెప్పెనని యైనను జెప్పవచ్చును. (2) మైత్రిన్ = స్నేహమును అద్వేషాభిముఖ్యములను భావించి మమ్ము నాశ్రయించువానికి అద్వేషాభిముఖ్యములే చాలును. ఇంతమాత్రమునకే మే మతని నంగీకరింతుము. ఇందుకై పరిపూర్ణభక్తియు ననవసరము. అది లేకున్నను దప్పులేదని భావము. త్వామామనంతి కవయః కరుణామృతాబ్ధే, జ్ఞానక్రియాభజనలభ్య మలభ్యమన్యైః। ఏతేషు కేన వరదోత్తరకోసలస్థాః పూర్వం సదూర్వమభజంత హి జంతవస్త్వా" మ్మను పెద్దలవాక్య మీ యర్థమునందుఁ బ్రమాణము. (3) మైత్రిన్ సుహృదం సర్వ

భూతానా మ్మని శాస్త్రములందు చెప్పియున్నట్లు నాకు జనులపైనున్న స్నేహ మును భావించి యిట్టి భగవంతుని స్నేహము మనకును గార్యకారి యగునని గదా యని యెంచి (4) మైత్రి భావించి = ఆనుకూల్య సంకల్పాదులఁ గలిగియుండి (5) మైత్రిన్=మిత్+త్రాయతే మిత్ర మ్మని వ్యుత్పత్తి. ఒకఁడు తనకుఁ జేసిన యుపకారమును దన మనస్సున నిది యింతగదా యని నిర్ణయించి చూచి దానికిఁదగినట్లు వానికిఁ బ్రత్యుపకారము చేయువాఁడే మిత్రము. అట్టి వానిగుణము మైత్రి. అనఁగా నీశ్వరుఁడు తనకుఁ జేయు నుపకారమునకుఁ దగ్గట్లు ఈశ్వరు నికిఁ బ్రత్యుపకారము చేయుటయే యిచ్చట మైత్రి. భావించి=కల్గి (6) మైత్రిన్= నమ్మకమును. 'తన్మిత్రం యత్రవిశ్వాస' యను వాక్య మిందుఁ బ్రమాణము. భావించి=చెంది "తానిత్యాది." (1) తాన్+అసంప్రాప్తుఁడైన వానిన్ అనిపదచ్ఛే దము భగవంతు నాశ్రయించువాఁడు తా నున్న చోటనుండి శరణాగతి చేసినను జాలును. భగవంతుఁడున్న చోటికిఁ బోనక్కఱ లేదని భావము. (2) తాన+ సంప్రాప్తుఁడైనవానిన్, అనియుఁబదచ్ఛేదము. తానున్న చోటనుండియే భగవంతు నెడ నద్వేషాభిముఖ్యములు చూపినవానిని "ప్రీ కేశాహి మమాతులా" యన్నట్లు నేనే వెదకుకొని వానియింటికిఁబోయి రక్షించుచుండఁగా వాఁడే నా స్థలమునకు వచ్చి శరణన్న విడక నేనెట్లు వదలవచ్చునని భావము. (3) సంప్రాప్తుఁడు= చెప్పులను గుడి వెలుపల విడిచిపెట్టి లోనఁబోయి దేవుని గన్నులతోఁ జూచుచు జెప్పులపై ధ్యానించువానివాలెఁగాక యితర వస్తువులం దపేక్షయే పెట్టక "నయ్యర లంక నిరిం ద్యజితబితి" నని యితర విషయ వైరాగ్యపూర్వకముగ వచ్చినవాఁడు. (4) "మాతా పితా భ్రాతా నివాస శ్శరణం సుహృద్గతి ర్నారాయణ" యన్నట్లు నన్నే సకలవిధబంధువులుగ నెంచి వచ్చినవాఁడు. (5) నా కంతరంగులైన మిమ్ముఁ బురుషకారముగా జేసికొనివచ్చినవాఁడు (6) తానసంప్రాప్తుఁడు=లంకలోనుండి శ్రీరాముని నేను శరణు జొచ్చినాఁడనని చెప్పినేని వీనిని రక్షించుటకై నేను "అతంద్రిత చమూపతి ప్రహిత హస్త" మన్నట్లు యిచ్చటనుండి పరుగెత్తి పోవలసి యుండును. అట్లుగాక తానై మనయొద్దకువచ్చి శరణు చొచ్చుట గంగా నది తానై వచ్చి పడినట్లున్నది. ఇంత మనకు లాభము చేసినవాని నెట్లు వదలవచ్చు నని భావము. (7) వీఁడు నా యొద్దకు వచ్చినంతమాత్రానన వీనిని నేను తప్పక రక్షింతును. వీఁ డంతమాత్రముతో నిలువక మానసిక, వాచిక కాయిక, రూప మైన పరిపూర్ణ ప్రవృత్తినే చేసినాఁడు. ఇట్టివాని నెట్లు వదలవచ్చునని భావము. ఈయర్థములు సంప్రాప్త శబ్దముతో సం అను దానివల్ల నేర్పడినవి. ఏటులైనఁ గేవీడు వాఁడఁగాను. (1) నాకు వీనిని వదలుటకు శక్తి లేదు. నేను సర్వశక్తుఁడనై యుండియు శరణనిచెప్పినవాని మాత్రము వదలుటకు శక్తి లేని వాఁడనై యున్నానని భావము. (2) సంప్రాప్తుఁడైన వానినిఁ జేవీడువాఁడఁగాను. "శరణాగత సన్యమాలిన్యం

నృపశ్శైలేశ కృపీవలం ధినోతి' యని పెద్దలన్నట్లు ఎవఁడైనను నన్ను రక్షింప రావయ్యా యని పిలుచునా యని నేనెదురుచూచుచుండఁగా తానై నన్ను వెదకికొనివచ్చి నన్ను రక్షింపవయ్యా యని వేఁడుచున్న ఈవిభీషణుని నేనెట్లువదలుదునని భావము. (3) చేపీఁడువాఁడఁగాను వీనిసంబంధమునుబట్టి రావణాదులనుగూడ నేనురక్షింపవలెనని యుండఁగా వీని నేవదలుట యెట్లుసంభవించును. ఇందువలననే కదా ఘంటాకర్ణునికి మోక్ష మిచ్చునపుడు వాని తమ్మునికిఁగూడ మోక్షమిచ్చునదియు, మాలకారునిఁ గటాక్షించునపుడు వాని సంతతివారల కందఱకును దీర్ఘాయుస్సు కలుగునట్లు లాశీర్వదించుటయు నచ్చటచ్చటఁ జెప్పియున్నవి. (4) చేపీడువాఁడఁగాను= వీనిని త్యజింపవలెనని యాలోచనయు నాకు లేదని భావము. వీనినిఁ త్యజింపవలెనని యాలోచన నాకుఁ గల్గెనేని యా యుత్తరక్షణముననే నాసత్తకే హాని తటస్థించును. కాఁబట్టి వీనిని త్యజింపవలెననెడి యాలోచనమాత్రము నాకు లేదు. అట్టి యాలోచనయే లేనప్పుడు ఏకారణమునుబట్టి వీనిని వదలుదుమా యని కారణాకాంక్షయే నాకు సంభవింప నేరదని భావము. శరణాగతుఁడైన వీనిని త్యజింపవలెనని యాలోచించినపుడు మీకు సత్తాహాని కలుగునని వీని సంగీకరించుటయే యుత్తమమని మీకుఁ దోఁచినయెడల వీని సంగీకరించి తన్మూలమున వీని దౌష్ట్యముచే మీకే ప్రాణహాని సంభవించిన యెడల త్వదేకాధారకులైన మాకు సత్తాహాని కలుగునని పాటించి మాకై వీనిని వదిలిపెట్టవలసినదే యను వానరుల యాక్షేపమునకు సమాధానము. ఎటులైనను (1) ఈనినయావు అప్పటి దూడపై వాత్సల్యముచేత దానికి పెద్దదూడను గసరునట్లు వీనికై మిమ్మునుగూడ వదలవలసి వచ్చెనేని యదియుఁ జేయుదు నని భావము. 'అప్యహం జీవితం జహ్యా' మ్మని గదా నా స్వభావము. (2) సర్వదేశ సర్వకాల సర్వావస్థలందునైనను (3)శరణాగతునియందు గుణములు లేకున్నను, అంతియకాక వానియందు దోషములు మెండుగనున్నను, అట్టివానిని సంగీకరించుట యందఱకసమ్మతమైయున్నను, తన్మూలమున దృష్టాదృష్టములందు నాకుఁ బెక్కు కీడులు సంభవింపనున్నను నాకే ప్రాణహాని సంభవింపనున్ననుగూడ నేను వీనిని వదల నని భావము.

ఇంతేకాక వానియెడ నేదేని దోష ముండెనేని (1) నాయభిప్రాయప్రకారము వీనియందుఁ దప్పులే లేవు. అస్థానభయశంకులైన మీకు వీనియందుఁ దప్పున్నట్లు తోఁచినను అట్టితప్పును నేసంగీకరించెదను, వాత్సల్యగుణ పరిపూర్ణుఁడైన నాకు నాశ్రితుని తప్పులుక్షమించివానిని మనస్సునకేరాకుండ జేసికొనుటయే గదా నాయందున్న వాత్సల్యము. (2) రాజకుమారుఁడు సుకుమారుఁ డయ్యును సువాసనమైన కుసువేరు మున్నగు వేళ్ళ ననుభవించునపుడు వాని యందలి మట్టి ననుభవించునట్టులే కొంచెము మట్టి యున్నను ఆ కారణమున దానిని వదలనట్లు తలంచెనని భావము. (3) దోష ముండెనేని — శరణాగతునియందు దోషమే

యుండదు. "యదైకతూల మగ్నౌ ప్రోతం ప్రదూయేత ఏవం హాస్య సర్వే పాప్మానః ప్రదూయంతే"యని శ్రుతి చెప్పినట్లు శరణాగతి చేసినవాని కేదోషము నంటదని భావము. (4) ఏదేని దోష ముండనేని యది వానియెడన్=వానిదిగదా! శరణాగతి యను గొప్ప గుణముగల వానియొద్ద నున్న దోష మెంతమాత్రమును గర్హ్యము కానేరదు. భగవంతుఁడు ప్రపన్నుని దోషమును భోగ్య వస్తువుగా గ్రహించునని యొక మతమువారు చెప్పుదురు. దీనికి వారు చెప్పెడి దృష్టాంతములు (౧) ఆవు దూడ నీనఁగానే దాని దేహమునందలి మురికి నాకుట (౨)రాజ కుమారుఁడు కురువేరులోనైన వేళ్ళ శిరస్సున ధరించునపుడు దానిలోనుండు మట్టినిగూడ ధరించుట. మఱియొక మతమువా రీ నిదర్శనములు భగవంతుఁడు దోషమును భోగ్యవస్తువుగా గ్రహించునని చెప్పుటయందు సమర్థములుగా వందురు. ఎలన:— ఆవు లేదూడ దేహమును నాకునపుడు ఆ మురికి భోగ్యవస్తు వని యాశచే నాకుట లేదు. తన బిడ్డయందలి మురికి పోఁగొట్టుటే దాని యుద్దేశము. ఆ మురికియున్న కారణముచే బిడ్డను విడనాడదు. అట్లులే రాజకుమారుఁడు కురువేరు ధరించునపుడు అందలిమట్టి భోగ్యవస్తువనియా నెత్తిపైన బెట్టుకొనును. ఆమట్టిని అలక్ష్యముచేసి ఆ కారణమున వదలక కురువేరు ధరించును ననగూడి నార తల కెక్కిన దన్నట్లు పూలతోడ దారమును శిరసున ధరించువారు అది భోగ్యవస్తువనియా ధరించు చున్నారు? కావున భగవంతుఁడు ప్రపన్నుల దోషము లక్ష్యము చేయనివాఁడై ఆ దోషకారణమున వానిని రక్షింపక విడువఁ డని మఱికొందఱ యభిప్రాయము. రామచంద్ర వాక్యము రెండవ యభిప్రాయమును బలపఱచుచున్నది. శరణాగతుని దోషము గర్హ్యము కాదని చెప్పెనేకాని గ్రాహ్య మని చెప్ప లేదు. దోషము లెప్పటికి దోషములే. అవి సుకృతములుగావు. సీతారాము లసత్య మాడిరి. అవి యసత్యములైనను "పంచానృతా న్యాహు రపాతకాని"యని వానివలన పాపము లేదని చెప్పఁబడెను, గాని సుకృతములు గావున గ్రాహ్యములని చెప్పఁబడ లేదు. చంద్రునియందలి కలంకము కలంకము గాకపోదు. ఆ కారణమునఁ జంద్రుఁడు నింద్యుఁడుకాఁడు. (5) వానియెడ నిత్యాది-ఉండ నిమ్మని శేషము. గుణవంతుని రక్షించినపుడు నాకంతగా గీర్తి లేదు. పరమదోషిని రక్షించినపుడేగదా నాకుఁ గీర్తి కలుగును. కాఁబట్టి శరణాగతునియందు దోషము నాకుఁ బ్రార్థనీయమే యని భావము. (6) వానియెడ నిత్యాది-ఏదేని దోష ముండనేని, నాకును బ్రాణాపాయ కరమైన కార్యమేదైన నుండినను అనఁగా వీఁడు నా యొద్దనుండి నన్ను మోసముగాఁ జంపనెంచి శరణాగతుఁడు కానిచో నాయొద్దఁ జేరుట సంభవింప దని తలఁచి యందులకైన నన్ను శరణుఁ జొచ్చినను, వానియెడ నుండనిమ్ము. తన్మూలమున వానికైనను సుఖము కలుగునుగదా. అదియే నా కపేక్షితము అని భావము. ఈ యోజనను రాఁగల కపోతోపాఖ్యానమును జూచియతదనుసారిగాఁ బెద్దలు చెప్పిరి. (1) ఇ దింత ఘనకార్యమై యుండఁగా గొప్ప గొప్ప మీా మంత్రులే

దీనిని దూషించుటకుఁ గారణ మేమియనఁగా నుత్తరము చెప్పుచున్నాఁడు. అద్ది యిత్యాది-అద్ది = ఆశ్రితునిదోషము, సత్ + అఖిలకు = గొప్పవారి సమూహమునకు, గర్హ్యంబు = నింద్యము; కాదు. మీ యందలి ప్రేమాతిశయము చేత నిష్కారణ భీతులై యున్న యీ మంత్రులవంటి వారి కదితప్పుగాఁ దోఁచినను గపోతము వంటివారి కదినింద్యమే కాదని భావము. (2) ఈదుష్టు నంగీకరించుటచే మీ కేమైన నొకపురుషార్థము రాఁగలదా? లేక యేదైనఁ గొంత పాపక్షయము కలుగఁ గలదా, లేక వీని నంగీకరింపని యెడల నేదైన ప్రత్యవాయము వచ్చునా? ఏదియు లేదు. అట్లుండ వీనిని నేలాభమునుబట్టి యంగీకరింపఁదలంచి యున్నారనుట కుత్తరము చెప్పుచున్నాఁడు. అద్ది యిత్యాది, అద్ది = దుష్టుని రక్షించుట. సదాఖిలకున్ = తమ ప్రాణములను దీయ వచ్చిన వానిని గూడ రక్షించినకపోతాదులకున్, గర్హ్యంబుగాదు=నింద్యముగాదు. కపోతాదుల వంటివారి సద్గోష్ఠియందు నాకు నింద లేకుండుటకై నేను వీనిని రక్షించెదనే గాని వేఱు ఫలము లేదని భావము. (3) దుష్టులను రక్షించిన వారిని శిష్టు లెప్పుడు గర్హింతురు. అంతియకాక యీ కార్యము శాస్త్రవిరుద్ధము. ఇట్లుండ నీ కార్యమును నీవు చేయుట తప్పని వానరు లాక్షేపింపఁగా నుత్తరము జెప్పుచున్నాఁడు. అద్ది యిత్యాది-అద్ది=దుష్టుఁడు శరణన్న మాత్రాన వాని నంగీకరించుట. సదాఖిలకును = ఇది సామాన్యశాస్త్రము, ఇది విశేషశాస్త్ర మను జ్ఞానము కలవారికి, గర్హ్యంబు కాదు = నిందింపఁ దగినది కాదు. సామాన్యశాస్త్రములందు దుష్టుని రక్షింప రాదని యున్నను "తస్మాదపి వధ్యం ప్రపన్నం నప్రతిప్రయచ్ఛంతి" యని విశేష శాస్త్రముండుటం బట్టి సామాన్య విశేష శాస్త్రజ్ఞానముగల పెద్దలు, శరణాగతుఁడు కాని దుష్టుని రక్షింప రాదని సామాన్యశాస్త్రములకును, ఎంత దుష్టుఁడైనను శరణాగతుఁడైనచోఁ దప్పక రక్షింప వలసినదే యని విశేష శాస్త్రములకును నర్థము వర్ణించియున్నారు. కాఁబట్టి నేను శరణాగతుని రక్షించిన యెడల నాకు సామాన్య విశేషశాస్త్ర తాత్పర్య ముపదేశించిన వసిష్ఠ విశ్వామిత్రాదులైన పెద్దలు వారి యుపదేశాను సారము అనుష్ఠించి నందులకు నన్ను శ్లాఘింతురే గాని యేమాత్రమును దూషింపరు. ఇందు శాస్త్రవిరోధమును లేదని భావము. సర్వశక్తుఁడై యున్న భగవంతునికి శరణాగతులఁ ద్రోసివేయఁ జాలనట్టి యొక్క యశక్తి యున్నదనియు సర్వజ్ఞుఁడై యున్నను భగవంతునికి శరణాగతుని త్రోచివేయు నుపాయజ్ఞానము శ్రీరామునందుఁ లేకుండుటచేఁ గొంచె మజ్ఞానము గలదని గోవిందయతి యభిప్రాయము. నీవు శత్రువు తమ్ముఁడవు గావున నిన్ను నేను రక్షింపనని చెప్పుట కేయుపాయము తెలియవలెను? నిరాకరించియుండిన నీతిహీనుఁ డని లోకము నిందించి యుండదు. కాని శరణాగత రక్షణపరతంత్రు లగు మహాత్ములు తప్పక నిందించి యుందురు. శ్రీరామచంద్రమూర్తి విభీషణు నిరాక

రింపకుండుటకు భయార్తుఁడై వచ్చిన వానియందలి దయయు శరణాగత రక్షా వ్రతము కారణములు.

అహ మస్మ్యపరాధానా మాలయోఽ కించనోఽగతిః
త్వమేవోపాయభూతో మే, భవేతి ప్రార్థనామతిః ॥ శరణాగతిః ॥

౧. నేను సమస్తాపరాధములను జేసినవాఁడను అని తా నంతవఱకుఁ జేసిన దోషముల నెఱిఁగి వానికై నిర్వేదపడుట.

౨. అకించనుఁడు = భగవత్ప్రాప్తిసాధనధనము కొంచెమైనను లేని దరిద్రుఁడు.

౩. అగతి = భగవంతుఁడుతప్ప మఱియొక రక్షకుఁడును, భగవత్ప్రాప్తి దప్ప వేఱొక ప్రాప్తియు, భగవంతుఁడు తప్ప భగవత్ప్రాప్తికి వేఱొక యుపాయమును లేనివాఁడు.

౪. నీవే నా కుపాయము గమ్ము అని ప్రార్థించు మనస్సు.

౫. దీనిని దేవుని సన్నిధానమందుఁ జేయవలయును.

ఇట్లు చేయువాఁడుగదా శరణాగతి కర్హుఁడు. విభీషణునం దీ గుణములు కలవా? కలవు.

రాక్షసుఁడును దుర్వృత్తుఁడు రాక్షసకులనాథుఁడైన రావణునకు నే సాక్షా దనుజుఁడ నని చెప్పుటచేత రాక్షసుఁడు కావున జన్మమువలన వచ్చిన దోషము, దుర్వృత్తుఁడైన రాక్షసనాథునకు భృత్యుఁడుగా నుండుటచే సాంగత్యదోషము, రావణునకు ననుజుఁడ ననుటచే సంబంధదోషము తనయందుఁ గలఁదని చెప్పిన వాఁడయ్యెను. భార్యను బిడ్డలను లంకను సిరిని సర్వము త్యజించితి ననుటచే, తన్ను రక్షింపఁ గలవా రెవ్వరు లే రనుటచే ఆకించన్యము చెప్పఁబడెను.

అన్నకూడ నన్నుఁ జేయివిడిచెను. ఇక్కడకుఁ దప్ప మఱియొకచోటికిఁ బోవ స్థలమే లేదు. ఎవ్వరు నన్నుఁ జేరఁదీయువారు లేరు. కావున నగతికుఁడను. తండ్రితో సమానుఁడగు జ్యేష్ఠభ్రాత నన్ను రక్షింపవలసినవాఁడు వాఁడే నన్నవ మానపఱిచి తిట్టి పంపెను. ఈ రాక్షసుని మఱియెవ్వరు దగ్గఱఁ జేర్తురు.

రామచంద్రుని శరణము చొచ్చితి ననుటచే నీవే నన్ను రక్షించు నుపాయ మని చెప్పినట్లు లయ్యెను.

పాదంబులన్ శరణార్థియై పడెన్=అనుటచే శరణాగతి దేవుని సన్నిధాన మందు జేయవలసిన దన్న యర్థము చెప్పఁబడెను.

కాన శరణాగతున కుండవలసిన లక్షణములు విభీషణుని యందున్న వని యేర్పడెను.

సుగ్రీవాదుల యభిప్రాయమునకు ఖండన మీ పద్యమునం గలదు. విభీష ణుఁడు రాక్షసుఁడు, రావణుని తమ్ముఁడుగాన వానిని గ్రహింపరాదని సుగ్రీవుఁడు వానియందు దోషము చెప్పెను. మీ యభిప్రాయమున నది దోషము, నా యభిప్రా

యమున నది దోషముగాదు. అది దోషమే యైనను శరణాగతునియందలి దోషము నింద్యముకాదు. ఆ దోష ముండిన నుండునుగాక. ఆ నెపముపెట్టి నేను రక్షింపక యుండరాదు అని ఖండనము అంగదుఁడు పరీక్షించి గుణవంతుఁ డైనయెడల గ్రహింపవచ్చును, దోషియైన వదలవచ్చునననెను. రామచంద్రమూర్తి శరణాగతుని యందు దోషమున్నదా యని పరీక్షయే చేయరాదనెను. గంగానదిలో స్నానము చేయఁదలచినవాఁడు దానిలో నడుగున బురదయున్నదని స్నానముమానవచ్చునా? హనుమంతుఁడు విభీషణుఁడు దుష్టుఁడుకాఁడు కావునఁ బరిగ్రహింపవచ్చు ననెను. పరిగ్రహింపవచ్చు ననుట గ్రాహ్యమే కాని దానికిఁ జెప్పినకారణము గ్రాహ్యము కాదు. శరణాగతుఁడు దుష్టుఁడైనను బరిగ్రహింపవలసినదే యని ఖండనము.

వానరు లందఱు చెప్పినది సామాన్యవిధి. రామచంద్రమూర్తి చెప్పినది విశేషవిధి యని యెఱుఁగనగు. కావున విశేషవిధి సామాన్యవిధిని బాధించును.

తాత్పర్యము

నిజమైన మైత్రికలవాఁడుకాని, మిత్రునివలె నటించువాఁడుకాని, సమీపించి రానీ, దూరమందేయుండనీ, శరణాగతుని విడువను. దానివలన నాకు మేలుగలుగనీ కీడుగలుగనీ వానియం దేదేని దోషముండెనా యది సత్పురుషులు నిందింపవలసిన విషయముగాదు. ఆ నెపము పెట్టి శరణాగతుని ద్రోచిపుచ్చరాదు. అట్లు ద్రోచి పుచ్చితినేని నేను దుష్టులలో జేరుదును.

క. అను రాము భాషణంబులు, విని సుగ్రీవుండు దాని • వెండి తలచి యి
ట్లను నిశ్శ్రేయసకరముగ, వినిమోత్తుల రామచంద్ర • విభునకు మైత్రిన్. ౩౬౬

అర్థములు. వెండి = మఱియును, తలచి = విమర్శించి, నిశ్శ్రేయస కరముగ = శుభము కల్గునట్లుగ, మైత్రిన్ = స్నేహభావముచే - నేను చెప్పినది కాదనెను జూచితివా యని విపరీతభావము లేనివాఁడై యని యర్థము.

తాత్పర్యము

ఇది నా స్వభావ మని రామచంద్రమూర్తి చెప్పఁగా నిట్టి స్వభావ మపాయ కరమైన సాహస మని యెంచి సుగ్రీవుఁడు భయపడి నీతిశాస్త్రప్రకారము దానిని విమర్శించి తప్పని తోఁచుటచే స్నేహభావముతో వినయముతో నిట్లు చెప్పెను.

ఉ. ఉతఁడు దుష్టబుద్ధి యగు • నేనియు దుష్టుఁడై కాక యుండెనే
నీతనిచేతఁ గాఁగలుగు • నెయ్యది యెవ్వని కొను వీఁడు ? న్వ
భ్రాతను నిట్టి కష్టదశఁ • బాసినవాఁ డెడఁబాయకుండునే
యే తఱి నెవ్వనిం ? బరుల • కీతఁడు నాదుకొనంగ నేర్చునే ? ౩౬౭

తాత్పర్యము

రామచంద్రా ! విభీషణుఁడు దుష్టుఁ డని నే నంటిని. నా యభిప్రాయమున దుష్టుఁడు గాఁ డని నీ వంటివి. ఆ విచార మట్లుండనీ. వీఁడు దుష్టుఁడే కాని

శిష్టుఁడే కాని వీని వలన మనకు రాఁగల లాభమేమి? నా యభిప్రాయ ప్రకారము దుష్టుఁడాయెనా యపాయము తప్పదు. నీ యభిప్రాయము సరియాయెనా భయము లేదు. అది యనుభవమువలనఁ దెలియవలసిన విషయము. వీఁడెట్టి వాఁడైనను నెవరి కేమి సాహాయ్యము చేయఁ గలఁడు? తనకు మన వలన మే లున్నదని తోఁచినంత వఱకు మనతో నుండును. మేలు లే దని తోఁచెనా వెడలిపోవును. తన మేలుగోరి వచ్చినాఁడు గాని నిన్ను, నన్ను నుద్ధరింప వచ్చినవాఁడు కాఁడు. వీఁడిట్టి వాఁడని నీకెట్లు తెలియు నందువా? ప్రాణాపాయమైన కష్టదశ ప్రాప్తించిన యిట్టి సమయమందు తండ్రితో సమానుఁడగు నన్నను వదలిపెట్టి వచ్చినవాఁడు నిన్ను విడిచి పోక యుండునా? నిన్నే కాదు, నన్నే గాదు, ఎవరినైన వీఁడు వదలువాఁడే. ఎవరికిని వీఁడు సాహాయ్యపడువాఁడు కాఁడు. కావున నిష్ప్రయోజనమై, యపాయకరమైన కార్యము నీవు చేయవచ్చునా?

చ. అనవుడు రామభద్రుఁడు వ•నౌకసులం గని మందహాస మా
 ననము నలంకరింపఁ దగు • నర్మిలిఁ దమ్మునివంకఁ జూచి యి
 ట్లను ననధీతశాస్త్రుఁ డయి • యార్యుల వృద్ధులఁ గొల్వకుండినం
 బనుపడు నొక్కొ యిట్టి ప్రతి•భాయుతవాక్కుశలత్వ మేరికిన్. ౩౬౮

అర్థములు. వనౌకసులన్ = వానరులను, మందహాసము = చిఱునవ్వు, ఆననము = ముఖము, అర్మిలిన్ = ప్రేమచే, అనధీతశాస్త్రుఁడు = శాస్త్రము నధ్యయనము చేయనివాఁడు, పనుపడునొక్కొ=దృఢపడునా? ప్రతిభా=అప్పటికప్పటికి వికసించు బుద్ధితో, యుత = కూడిన, వాక్కుశలత్వము=మాటల నేర్పు, ఏరికిన్ = ఎట్టివారికి.

తాత్పర్యము

ఈ ప్రకారము సుగ్రీవుఁడు చెప్పఁగా ధర్మసూక్ష్మముగాని, నాపరమశక్తిగాని నా శరణాగత రక్షణ ప్రతనిష్ఠగాని తెలియక యుక్తివాదము చేయుచున్నాఁడుగదా యని తనలోఁ దాను నవ్వుకొనుచు వానరులను లక్ష్మణునిఁ జూచి యిట్లనెను. లక్ష్మణా! యీ సుగ్రీవుఁడు శాస్త్ర మధ్యయనము చేయక యోగ్యులగు పెద్దల సేవింపక యుండెనేని యిట్లు సమయోచితముగ మాటలాడు నేర్పు దృఢపడి యుండునా? ఈ పొగడ్త బోరగిల ద్రోయుటకే వగచినట్లు యుండవలె, వాఁత పెట్టినట్లె యుండవలెను. పరుషముగా నీవుచెప్పినది తప్పు, ఆలోచన లేక మాటలాడుచున్నావనుట మర్యాదగాదు. కావున నిట్లు చెప్పుచున్నాఁడు.

ఇచ్చట లక్ష్మణుతో నీమాటలు చెప్పుటచేతను, ౩౬౮ వ పద్యమందు సుమిత్రాతనయు సమక్షమం బిట్లనియె నని చెప్పుటచేతను లక్ష్మణ సుగ్రీవులేకాభిప్రాయము గలవారనియు నిరువురు విభీషణుని చేర్చుకొనవలదని శరణాగతి చేసి రనియు పూర్వ వ్యాఖ్యాతలు వ్రాసిరి. వారే ౩౧౮ వ పద్యంబున సలక్ష్మణుఁడౌ జనకసుతానాథుఁ

దున్న స్థలమునకు విభీషణుఁడు వచ్చెనన్న చోటఁ బురుషకార భూతుఁడైన లక్ష్మణుఁడని వ్రాసిరి. ఇది పరస్పర విరుద్ధముగాఁ గానవచ్చుచున్నది. శరణాగత లక్షణము రఘువంశసంభూతుల కులమర్యాదయనియు, రాముఁడు దానిని విశేషముగఁ బాటించుచున్నాఁడనియు లక్ష్మణుఁ డెఱుఁగఁడా? ఆ వంశముననే తాను బుట్టినవాఁడు కాఁడా? రామచంద్రమూర్తి కట్టివ్రతము లేదని యెఱిఁగియుండెనేని తా నెట్లు శరణాగతుఁడయ్యెను. వశిష్ఠాదులవలన రామచంద్రమూర్తి వినినంత తాను వినలేదా? అట్టి వాఁడు శరణాగతుని రక్షింపవలదని చెప్పునా? యని సందేహము. అదైన నేల సుగ్రీవునితోపాటు గుంజిళ్ళు పెట్టుచుండెననిన, సుగ్రీవుని కన్నీళ్ళు తుడుచుటకే. రాముఁడేమో యెవరెన్ని చెప్పినను తన వ్రతము మానఁడని లక్ష్మణుఁ డెఱుఁగును. సుగ్రీవునకుఁ దన విషయమున దురభిప్రాయము కలుగకుండుటకై యాయనకుఁ బ్రక్కఁగ నిలుచుండెను.

పూర్వవ్యాఖ్యాతల యభిప్రాయము ననుసరించితిమేని సుగ్రీవ లక్ష్మణుల శరణాగతి వ్యర్థమయినది. దానివలన నితర భాగవతులకు విరోధముగాఁ జేయు శరణాగతిని భగవంతుఁ డంగీకరింపఁ డని యేర్పడుచున్నది.

చ. కల దొక సూక్ష్మధర్మము ప్ర•కాశముగా నిఖిలావనీశులం
బలికెద వి న్మనంతరపు • క్ష్మాపతు లేకకులోద్భవు ల్విరో
ధులు, వ్యసనంబు లొత్తుతఱి • ద్రోహ మొనర్చుచునుంద్రు, గావునన్
లలితగుణా ! విభీషణుఁడు • న న్నిటఁ జేరఁగ వచ్చెఁ గానిచోన్. ౩౬౯

అర్థములు. సూక్ష్మధర్మము= ధర్మమునందు సూక్ష్మబుద్ధిచేఁ గ్రహింపవలసిన విషయము, ప్రకాశముగా=స్పష్టముగా, ఇది రహస్య విషయము గాదు. నిఖిలావనీశులన్ =అందఱు రాజులందు సప్తమ్యర్థమున ద్వితీయ. కొన్నియెడల నజడంబు తృతీయాసప్తములకును, బహుత్వంబున ద్వితీయ యగు. ప్రౌ. వ్యా. కా. ౧౮ సూ. "అనిన నలుగాలివానగోవును నశేష, శబ్దముల మంత్రమును లోహజాతిఁగాంచనమును మనుజుల విప్రుండు సమధికత్వ, భాజనములంద్రు వేదప్రపంచవిదులు" భార శాంతి. ౧ ఆ. కలదు = ఉన్నది. ఊహ గాదనుట - అనంతరపు క్ష్మాపతులు = తమ దేశమున కానుకొని పొరమేరలు కలియునట్లుండు దేశముల రాజులు, ఏకకులోద్భవుల్ = జ్ఞాతులు.

తాత్పర్యము

సుగ్రీవా! విభీషణుఁడు మనయొద్దకు వచ్చిన కారణము చెప్పెద వినుము. రాజులగు వారందఱియందు నొక సూక్ష్మధర్మము సుప్రసిద్ధముగాఁ గలదు. అది రహస్యవిషయముగాదు. ఏ రాజుల రాజ్యముల పొలిమేరలు కలసియుండునో యెవరొక వంశముననఁ బుట్టినారో వారు పగవారు. వీ రితరులకుఁ గష్టము వచ్చినపుడు పరస్పరము ద్రోహము చేయుచుందురు. కావున విభీషణుఁడు రావణుఁడు జ్ఞాతులు

కావున విరోధులే. ఆ కారణముచే వీఁడు మనయొద్దకు వచ్చెనుగాని, నీవు తలంచి నట్లు రావణుఁడు పంపగా వానిమీఁది ప్రేమచే వచ్చినవాఁడు కాఁడు.

క. కలుషవిహీనాత్ములు తత్కులజులు స్వీయు లగు హితులకున్ గౌరవముం
గలిగింతు రైన నృపతులు, కలుషింతురు ప్రాయికముగఁ • గడు నిర్మలులన్. 320

అర్థములు. కలుషవిహీనాత్ములు = పాపములేని మనస్సుగలవారు, ఇట్లు చెప్పుటచే మీఁది పద్యంబునఁ జెప్పబడినవారు కలుషాత్మకులని గ్రాహ్యము తత్కులజులు=అవంశమునందుఁ బుట్టినవారు.

తాత్పర్యము

పాపవిచారములేని మనస్సుగల జ్ఞాతులు తమ వంశమందుఁ బుట్టి తమ మేలు గోరువారికి గౌరవము గలిగింతురు. ఇది ప్రభువులుగాని వారు ప్రభువుల విషయమై నడచు విధము, మన యన్న ప్రభువైన నేమి? నేనైన నేమి? యని యన్నకే యెక్కువ గౌరవము కలిగించుచుందురు. అట్లున్నను ప్రభువులు మాత్రము ప్రజ్ఞా శౌర్యసామర్థ్యములచే నిర్మల మనస్సుగల జ్ఞాతులందును దఱచుగ ద్రోహబుద్ధి గలవారై వీఁడేవేళకు మనకేమి కీడు చేయునో యని యణఁగఁ ద్రొక్కుచే యుందురు. అట్లు వారుండుటచే నిర్మలులైనవారును మన మెంత శుద్ధముగానున్నను మనలను నమ్మక వృద్ధికి రానీయకున్నాఁడు గదా యని వాఁడును కలుషితచిత్తుఁ డగును. అట్టులే విభీషణుఁడు నిర్మల మనస్కుఁడైనను రావణుఁడు దుష్టుఁడు కావున నీయనను సందేహించి యుండవచ్చును. ఇప్పుడు తన కేమి కీడుచేయునో యను సందేహభయములచే నీయనను వెడలఁగొట్టి యుండవచ్చును. విభీషణుఁడు వచ్చుటకుఁ గారణ మిది, కాని నీవు చెప్పినది కాదు.

చ. అరిఁ దను జేరనిచ్చు టనయం బని యాడితి వీవు, శాస్త్రస
త్సరణి వచించెద న్వినుము • జ్ఞాతుల మెవ్వరుఁ గాము వానికిన్
స్థిరమతి రాజ్యకాంక్షఁ జను • దెంచినవాఁ డగు, వారిలోన నుం
డరె మతిమంతు? లట్లు లగు • టన్ గ్రహియింపఁ దగు న్విభీషణున్. 321

అర్థములు. అరిన్=శత్రువును, అనయము = నీతివిరుద్ధము, శాస్త్రసత్సరణిన్=నీతిశాస్త్రము నందుఁ జెప్పబడిన మంచిమార్గము.

వీఁడు మనకు శత్రువనియు, వీనినిఁ జేరనిచ్చిన మన కపాయము గలదనియు నది నీతిశాస్త్రవిరుద్ధమనియుఁ జెప్పితివి. నీతిశాస్త్రప్రకార మెవ్వరి కెవ్వరు విరోధులో చెప్పితినిగదా. వీనికి మన మెవ్వరము జ్ఞాతులముగాము. ఆ కారణమున వానికి మనకు విరోధము లేదు. రాజ్యవిషయమైన విరోధమును లేదు. హనుమంతుఁడు చెప్పినట్లు వాఁడు రాజ్యము సంపాదించుకొనఁగోరి వచ్చియుండవచ్చును. అట్లు వచ్చిన వాఁడు మనకుఁ గీడుచేసెనేని తన నెత్తినఁ దానేకదా మన్ను వేసికొని రెంటను జెడిన

వాఁడగును. రాక్షసులకే మాత్రము తెలివితేటలు గలవా యందువేమో, వారిలో మాత్రము బుద్ధిమంతులు లేరా యేమి? ఈ కారణమున విభీషణుని గ్రహింపవచ్చును.

ఉ. శూరులలోన హృష్టులును • శుద్ధమనస్కులు నైన వారిలో
వైరిమి యొక్కొక్క వేళఁ బ్రభ•వించును, గావున నిట్టి రచ్చ, త
త్కారణజాత మౌ వెఱపు • గల్గుట నీతఁడు చీలి వచ్చె న
స్వైరఁగ నిప్పు, డట్లగుట•చే గ్రహియింపఁ దగు న్విభీషణున్. ౩౨.

అర్థములు. వైరిమి=వైరము, ప్రభవించును=పుట్టును, రచ్చ=కలహము, తత్కారణజాతము=ఆ కారణమువలనఁ గలిగినది, చీలి=వేఱుపడి.

తాత్పర్యము

ఇదివఱకు జ్ఞాతులలో నొకఁ డెక్కువ యొకఁడు తక్కువ. ఒకఁడు దుష్టుఁడు వేఱొకఁడు శిష్టుఁడు నగువారి విషయము చెప్పితిని. శూరులం దిరువురు సమానముగ సంతుష్టచిత్తులు నిర్మలులుగా నుండినను ఒక్కొక వేళ వారిలో వారికి విరోధము సంభవించును- అప్పుడే యిప్పుడు రావణ విభీషణులకుఁ గలిగిన కలహమువంటి కలహము కలుగును. ఆ కారణముగఁ గలిగిన భయముచే నీతఁడు వానితోఁ గలిసి యుండక వేఱుపడి నన్నుఁ జేరవచ్చెను. ఆ కారణముచే వీనిని గ్రహింపవచ్చును.

తే. భ్రాత యెల్లను భరతుని•పాటి గారు, జనకునకు నన్నుఁ బోలిన•తనయుఁ డున్నె
హితులయందును నీయట్టి•హితుఁడు, లేఁడు, తండ్రి! లోకంబునం దిది•తథ్యమయ్య.

తాత్పర్యము

రామచంద్రా! నీవు చెప్పినది భిన్నోదరుల విషయము. ఏకోదరుల విషయమున నట్టి కలహములు గలుగునా యందువేమో? గుణములు ప్రధానములుగాని యేకోదరత్వ భిన్నోదరత్వములు ప్రధానములుగావు. నీవు వాలి యేకోదరులే కదా, ఏల కలహించితిరి? భరతుఁడు నాకు సవతితల్లి కొడుకే కదా. తనకుఁ దండ్రి యిచ్చిన రాజ్యము నా కిచ్చుటకై యడవులకు వచ్చి యెంతో ప్రార్థించియు నేను గైకొనకుండఁగ నావలెనే వానప్రస్థునివలెఁ గాలము ద్రోయుచున్నాఁడే! న్యాయముగ నాకు రావలసిన రాజ్యము నా కీయకుండుటయే గాక నన్ను మా తండ్రి యడవులకుఁ బొమ్మనినఁ దథాస్తని వచ్చితినే! తండ్రి కిటువంటి కొడు కేఁడీ? నీ మాట ప్రకారము నీవు వర్షాకాలము దాఁటగానే రాకుండుటచే లక్ష్మణునిఁ బంపి తిట్టించినను నాయందు మైత్రి వదలవయితివి కదా! ఇప్పుడు నా యందలి ప్రీతిచేఁ గదా విభీషణుని జేర్చుకో వల దనుచున్నావు. నీ వంటి మిత్రుఁ డేఁడీ? కావున గుణములు ప్రధానములు, బంధుత్వము గాదు.

ప్రశంస రాజ్యవిషయ మగుటచేతను, లక్ష్మణునకు రాజ్యము లేకుంటచేతను, తమ్ముఁడు కుమారుఁడు సమానులు గావున ప్రత్యక్షమున బ్రశంసింప రాకుండుట

చేతను భరతుని పేరు చెప్పఁబడెను, నావంటికొడుకు లేఁడనుట యాత్మశ్లాఘకాదు. ఒక ప్రయోజనము నుద్దేశించి చెప్పవలసి వచ్చినపుడు జరిగిన విషయము నలువురకుఁ దెలిసిన విషయము చెప్పుట దోషముగాదు. వ్యర్థప్రగల్భములు దోషావహములు, యుద్ధములందు శత్రువుల భయపెట్టుటకై వీరులు తమ్ముఁ దాము పొగడుకొందురు. అది దోషముకాదు. దుష్యంతుఁడు శకుంతలను జూచినపుఁడు 'సతాంహి సందేహ పదేషు వస్తుషు ప్రమాణ మంతఃకరణ ప్రవృత్తయః' యని తన్ను సత్పురుషుఁ డని యంతఃకరణశుద్ధి గలవాఁడనని చెప్పుకొనెను. అట్లులే యాంజనేయుఁడు సముద్రము దాఁటుటకు ముందు వానరుల యుత్సాహము నిమిత్తమై తన ప్రతాపము చెప్పుకొనెను. వీనియం దాత్మప్రశంసాదోషములేదు. కావ్యాదర్శమందు దండియు 'స్వగుణా విష్క్రియా దోషో నాత్ర భూతార్థశంసినః అపి త్వనియమో దృష్ట స్తథాత్వన్యైరుదీరణా' త్తని చెప్పెను.

జనకునకు నన్నుఁబోలిన తనయుఁ డనుటను మఱియొకవిధముగ విభక్తి మార్చి చెప్పవచ్చును. కొడుకును విడిచినంత మాత్రమునవే ప్రాణము విడుచు తండ్రిగలవాఁడను నేనొక్కఁడుగాక మఱి యెవ్వఁడున్నాఁడు ? నాయనా ! లోకమునం దిది సత్యము.

క. అను రాముని వాక్యంబులు, విని లక్ష్మణుతోడ లేచి • వినయంబు మెయిన్
దినకరతనయుఁడు ప్రజ్ఞాధనుఁ డిట్లను రామచంద్ర • ధరణిపుతోడన్. ౩౭౮

తాత్పర్యము

ఈ ప్రకారము రామచంద్రమూర్తి చెప్పఁగా విని బుద్ధిమంతుఁ డగు సుగ్రీవుఁడు లక్ష్మణునితోడ లేచి యణఁకువతో నిట్లనియె.

క. రావణునివేగువాఁ డని, భావింపు విభీషణున్ క్ష • పాచరవర్యున్
గావున క్షమవద్వర ! నీ, వే విధి నితనిన్ వధింప • నెంచుట తగ వౌ. ౩౭౯

అర్థములు. క్షపాచరవర్యున్ = రాక్షసశ్రేష్ఠుని, క్షమవత్ వర=సమర్థులలో శ్రేష్ఠుఁడా ? ఈ విశేషణము రామచంద్రమూర్తి చెప్పఁదలచినదానిని సమర్థించు నేర్పుగలవాఁడని తెలుపుచున్నది.

తాత్పర్యము

రామచంద్రమూర్తి తొలుత వీఁడు నిజముగ శరణాగతుఁడే కావున రక్షించుట యవశ్యకర్తవ్య మనెను. అది సుగ్రీవునకు నచ్చినదికాదు. ఆవల నీతిశాస్త్ర ప్రకార మిది యన్నదమ్ముల కలహము, అన్నతో వాస్తవముగ విరోధించి వచ్చెనని చెప్పెను. అదియు నాయనకు నరిపడినదికాదు, కావున నీ రాక్షసుఁడు వేగులవాఁడు. వీఁడు మోసగాఁడు. వీఁడు చెప్పునది సత్యముగాదు, కావున వీనిని సంహరింప నాలోచించుటయే తగిన కార్య మనెను.

ఉ. వచ్చినవాఁడు వీఁడు దశ • వక్త్రుఁడు వక్రపుబుద్ధిఁ బంపఁగా
నచ్చిత మేని మాయల నొ • నర్చి ప్రమాదపుబుద్ధి నుండగాఁ
గ్రచ్చుఱ నన్నొ, నిన్నొ, మఱి • గాదిలితమ్మునినో వధించు నో
సచ్చరితా! యటౌటఁ దగుఁ • జక్కడపన్ సచివాన్వితంబుగన్. ౩౨౭

అర్థములు. వక్రఁపుబుద్ధి = మోసబుద్ధి, నచ్చితమేని = నమ్మితిమా. చక్కడపన్=చంపఁగా, సచివాన్వితంబుగన్=మంత్రులతోఁ.

తాత్పర్యము

వీఁడు మోసబుద్ధిచే రావణుఁడు పంపఁగా వేగులవాఁడై వచ్చినాఁడు నమ్మితిమా మన మేమఱి యున్నవేళ నదో టక్కు చేసి నిన్నో, నన్నో, లక్ష్మణునినో చంపును. కావున వీనిని మంత్రులతోఁ జంపుటయే తగిన కార్యము.

క. అని మిన్నకున్న సుగ్రీవుని వాక్యము లాలకించి • పొరిఁ జక్క విమ
ర్శన మొనరిచి శుభతరసూ, క్తిని సీతానాథుఁ డనియెఁ • గీశాగ్రణితోన్. ౩౨౮

అర్థములు. మిన్నక+ఉన్నన్=ఊరకుండఁగా, శుభతరసూక్తిని=మిగుల మేలైన మంచిమాటలను-నీతి బోధించుట యందు విభీషణ సుగ్రీవు లిరువురు సమాన సంబంధమునందే యున్నారు. విభీషణుఁడు సీవు సీతను మరల నీయకుండిన నీవు చచ్చెదవు. బంధువులు చచ్చెదరు. లంకయుఁ బాడగునని రావణునితోఁ జెప్పెను. సుగ్రీవుఁడు నట్లులే విభీషణుని నీవు చేర్చికొంటివా, నిన్నే చంపునో, నన్నే చంపునో, లక్ష్మణునే చంపునో, కాకి గూబలను జంపినట్లు వానరుల నందఱఁ జంపునో? ఇట్లు తేరకుఁ జచ్చుటకా నీ వెంట వచ్చినది యని నిర్దాక్షిణ్యముగఁ జెప్పెను. ఇరువురు ప్రేమచేఁ జెప్పినవారే. సుగ్రీవుఁ డిట్లు చెప్పుటనే నిరవధిక స్నేహముఁగల వారిట్లులే చెప్పవలయునని యేర్పడుచున్నది. మిత్రుఁ డిట్లు ఖండితముగాఁ జెప్పుటవలన నా యం దితనికి నెంత ప్రేమ లేనిదే యిట్లు నామాటకు విరుద్ధముగాఁ జెప్పునా యని రామచంద్రమూర్తి సంతోషించెను. దీనివలన నాయన యతిశయము బయలు పడెను. 'ప్రియో హి జ్ఞానినోత్యర్థమ్' నా యంతరంగభక్తునకు నా యందెంత ప్రేమగలదో యది నేనుగూడఁ జెప్పలే నని కదా కృష్ణభగవానులు చెప్పిరి.

ఇఁక రామచంద్రమూర్తి వాక్యములవలనఁ బ్రభువు తా నెంత నిర్వాహకుఁ డైనను తన మేలు కోరి చెప్పువారు తనకు విరుద్ధముగాఁ జెప్పినను వారిని ధిక్కరింపక తనయభిప్రాయమున వారు కలిసివచ్చునట్లు తగినకారణములు చెప్పి యంగీకరింపజేవలయు ననియు, విరోధాభిప్రాయ మిచ్చినంత మాత్రము చేతనే శత్రు వనియు రావణునవలెఁ దలంపరాదనియు నేర్పడుచున్నది. ఇట్టి నిరవధిక స్నేహము గలవారే నాకుఁ బ్రియులు. "సచ మమ ప్రియః" యని కదా కృష్ణభగవానుఁడు చెప్పెను. "ప్రియతమ ఏవహి వరణీయో భవతి" ఇట్టి ప్రియతములే యభిమానపాత్రులగుదురు-అని చెప్పఁబడెను. భగవంతునకు వరణీయుఁ డగుటచే

భగవంతుఁడే స్వప్రాప్తిని దానే కలుగఁజేయుచున్నాఁడని భావము. కావుననే కదా తాను పరమపదమునకుఁ బోవునపుడు పిలిపించి కూడఁబిలుచుకొనిపోయెను.

తాత్పర్యము

అని చెప్పి యూరకుండఁగా సుగ్రీవుని మాటలు విని రామచంద్రమూర్తి యిదివఱకుఁ జెప్పిన నీతిశాస్త్ర వాక్యముల కంటె మేలైన దానిని జెప్పుచున్నాఁడు. మైత్రి భావించి యెవఁడు వచ్చినను నేను జేర్చుకొనెద నని రామచంద్రమూర్తి చెప్పెను.

ఇది కేవలము రాముని సాహస కార్యమే కాని దానికిఁ బ్రమాణవాక్యములు గాని, శిష్టానుష్ఠానముగాని లేదని సుగ్రీవుఁడు దాని నిరాకరించెను. ఇప్పుడు శరణాగతి ధర్మశాస్త్ర వాక్యముల పూర్వుల యనుష్ఠానముఁ జెప్పి సుగ్రీవు నంగీకరింపఁ జేయుచున్నాఁడు.

—•శ్రీరాముఁడు సుగ్రీవునకు శరణాగతరక్షణం బవశ్యకర్తవ్యంబని చెప్పుట•—

ఉ. ఈతఁడు దుష్టబుద్ధి యగు • నేనియు దుష్టుఁడె కాకయుండె నే
నీతనిచేతఁ గాఁగలుగు • నెయ్యది? యొక్కరవంతయేని వాఁ
డే తఱినేని కీడు ఘటి•యింపఁగ శక్తుఁడు గాఁడు మామక
వ్రాతము లందు నా యెడ, దివాకరనందన! నన్ను నమ్ముమీ. ౩౭౮

అర్థములు. మామకవ్రాతములందు=నా వారియందు, అనఁగా నీకుఁగాని లక్ష్మణునకుఁగాని వానరులం దెవ్వరికిఁగాని యని యర్థము.

తాత్పర్యము

సుగ్రీవా! వాఁడు దుష్టుఁడు, మనలో నెవ్వరికైన కీడెనఁగేసు చేయునని యేల భయపడెదవు. వాఁడు దుష్టుఁడుకానీ, కాకపోనీ, వాఁడేమి చేయఁగలఁడు? మనము హెచ్చరికగా నుండినను, హెచ్చరిక తప్పియుండినను నిద్రపోవుచున్నను, నాకుఁగాని నావారికిఁగాని, వారివారికిఁగాని, యెట్టి కీడుచేయుటకు వాఁడు సమర్థుఁడు గాఁడు. నా మాట నమ్ముము. నేను బ్రగల్భములు చెప్పువాఁడను గాను. ఎంత చెప్పెదనో యంతయు జరగవలసినదే.

క. ఈ నిఖిలావని యక్షుల, దానవరక్షఃపిశాచ•తతులను వలతేన్
భానుజ! యంగుళికొనచే, నే నిమిషములోనఁ జమ్మ•నే మిత్తిఁ గనన్. ౩౭౯

అర్థములు. నిఖిలావనిన్ = సమస్త భూమియందు, వలతేన్ వలయునేని (౧) చేయవలసిన పని పడెనేని (౨) నాకు సంకల్పము కలిగినయెడల అంగుళి కొనగూడ నక్కరలేదు. సంకల్పముచేతనే చంపనా? అంగుళి = వ్రేలి; మిత్తి గనన్=చచ్చునట్లు.

తాత్పర్యము

మనము నిద్రపోవునపుడు వాఁడు రాక్షసుల నందఱను బిలుచుకొనివచ్చి కాకులు గూబలను జంపునట్లు జంపునని కదా నీ భయము. ఒక రాక్షసులనే కాదు. లంకలోనుండువారిని మాత్రమే కాదు, ఈ భూమిమీఁద నెందఱు యక్షులదానవుల రాక్షసుల పిశాచుల గుంపులుగలవో యందరు కలసివచ్చినను దేహమంతతోఁ గాదు- రెండుచేతులతోఁగాదు- ఒక చేతియంతతోనుగాదు- అన్ని వ్రేళ్ళతోను గాదు- ఒక వ్రేలితోనుగాదు- ఒక వ్రేలి కొనచేఁ నొకసారిగఁ జిమ్మునట్లు లందఱను మీఁటి పాఱవేయనా? వీరిని జంపుటకు నా కాయుధము సేవలు కావలయునా? వ్రేలికొనయు నక్కఱలేదు. నా సంకల్పముచేతనే చంపఁగలను. వీని యన్న కుబేరునితోఁ జెప్పుకొని యక్షుల నందఱను, వీనిమామ మయునితోఁ జెప్పి దానవుల నందఱును, వీని స్వాధీనమందుండు వీని తల్లివంక రాక్షసులను, వీనికి వరమిచ్చిన శివుని పరిచారకులగు పిశాచముల నందఱను బిలుచుకొనివచ్చినను వ్రేలితో మీటి పారవైచెదను. అటులైన నిందఱు వానరులకు నీకు నాకీ కష్టమేల? లంకలోని రాక్షసుల మీఁటరాదా యందువా? విభీషణునివలె మనయొద్దకు రాకున్నను, లంకయందు మనయందుఁ బ్రతికూల భావము లేని వారెందఱున్నారో? వారుగాక ముదుసళ్ళు బాలురు స్త్రీలు లేరా? వారి నందఱ నొకటిగాఁ గలిపి యెట్లు చంపుదును? కావున మనమీఁదికిఁ బ్రత్యక్షముగా వచ్చినవారిని మాత్రమే చంపఁదలఁచితిని. కావున వీఁడు మనతోఁ బ్రతిఘటించి పిలుచుకొని వచ్చినా అప్పుడు వారందఱు ప్రత్యక్షవిరోధి సమూహము గావునఁ జంపెదను.

ఈ సందర్భమున నీ వాక్యంబులు స్మరణీయములు. "విష్టభ్యాహ మిదంకృత్స్న మేకాంశేన స్థితో జగత్" కార్యకారణ రూపమైన యీ ప్రపంచము నంతయు నాయొక్క యంశముతో నిలువఁబెట్టి యున్నాను. భ. గీ. ౧౦-౪౨.

'యస్యాయుతాయుతాంశాంశే విశ్వశక్తి రియం స్థితా' వి.పు. ఎవనియొక్క పదివేల పదివేలవ భాగములో నీ ప్రపంచశక్తి నిలిచియున్నదో,

'కిం స్విద్వనం, క ఉ సవృక్ష, ఆసీద్యతో ద్యావాపృథివీ నిష్టతక్షుః మనీషిణో మనసా పృచ్ఛతేదు తద్యదధ్యతిష్ఠ ద్భువనాని ధారయన్' శ్రుతి. ఇల్లు కట్టుటకు స్తంభాదులు కావలెఁగదా! ఆసామాను యేవనములోని యే వృక్షము నుండివచ్చెను? అట్టులే యీ భూమ్యాకాశములను బ్రపంచసృష్టికిఁ గావలసినది యే వనమునుండి యే వృక్షమునుండి వచ్చెనో మేధావులారా! చక్కఁగాఁ బ్రశ్నింపుఁడు. మఱియు నీ ప్రపంచమును నేది యెందుండి ధరించుచున్నది అదియు నడుగుఁడు. వనము సమిష్టి ప్రపంచము. వృక్షము వ్యష్టిరూపము. ఈ ప్రశ్నమునకుఁ బ్రత్యుత్తరము బ్రహ్మవనము బ్రహ్మవృక్ష మని ప్రత్యుత్తరము. పెద్దవనములో నొక వృక్ష మెట్టులో యీ ప్రపంచము భగవంతున కట్టి దని భావము.

మ. వినవా మిత్రము బోయవాఁ డొకఁడు పృ ◆ థ్వీం గూల్చి స్వప్రేయసిన్
దన ప్రాణంబులు పెన్బుభుక్ష నడలన్ ◆ రక్షార్థియై చేరినం
దన మాంసంబు లొసంగి వానికిఁ గపో ◆ తం బాతనిం గాచెఁ గా
ననచారీ! శరణాగతు న్విడుచుటల్ ◆ న్యాయంబె నాబోఁటికిన్ ? ౩౮౦

అర్థములు. స్వప్రేయసిన్=తన భార్యను, పెన్ బుభుక్ష = గొప్పయాఁకలిచే, రక్షార్థియై=రక్షణము కోరినవాఁడై, కపోతంబు=పావురము, కాననచారీ = అడవులందుఁ దిరుగువాఁడా! (౧) పావురము అడవియం దుండునదే, నీవు నడవియం దుండువాఁడవే, ఆ పక్షికున్న తెలివి నీకుండఁ బనిలేదా ? (౨) కనఁబడిన మృగమును జంపి తినుటే స్వభావముగా గల యడవి మృగములలోఁ దిరుగువాఁడవు. జీవి రక్షావిషయము నీకేమి తెలియును. వీని వలన నాకేలాటి కీడు రాదని యింతవఱకుఁ జెప్పను. ఒకప్పుడు వీఁడు మోసగాఁడై యుండి నా ప్రాణహాని సంభవించునట్లు దుర్మార్గము చేయనున్నను నేనేమో వీని నుపద్రవ పెట్టను, ఏ మాత్రము వదలను, తప్పక యంగీకరించి రక్షింపవలె ననియే యున్నాను అని కపోతోపాఖ్యానముచే విశదపఱచుచున్నాఁడు. (౧) వినవా - యనుటచేత నీకథ మిక్కిలి ప్రసిద్ధమని భావము. (౨) వినవా యనుటచేత నిది యందఱు వినవలసినదేగాని యెవ్వరును ననుష్ఠింపలేరనుట సూచితము. (౩) ఈ శరణాగత రక్షణ చరిత్రము శ్రుతివంటిది యనియు భావము. బోయవాఁడొకఁడు వీఁడు పక్షికి సహజ శత్రువు. ఇట్టి వానినిగూడఁ గపోతము రక్షించినది. విభీషణుఁడు మనకు సహజ శత్రువుగాఁడు. అట్టుండ నతనిని రక్షింపకుండుట యెట్లని భావము. బోయవాఁడు పక్షికి సహజశత్రు వగుటయేకాక, పృథ్వీంగూల్చి స్వప్రేయసిన్ - ఇట్టి భార్యానాశకునే కపోతము రక్షించినది. విభీషణుఁడు తానై మన కేటువంటి తప్పును జేయకున్నను భార్యాపహారి యూరినుండి వచ్చినాఁడన్న మాత్రమున మనము వానిని వదలిపెట్టుట యుక్తమా యని భావము. భార్యాపహారి యైన రావణుఁడు వచ్చినను. మనము తప్పక రక్షింపవలెననుట యీ పదము చేత సూచితము బుభుక్ష = ఆఁకలి, రక్షార్థియై - 1. “సాంజలిం శిరసా బధ్వా వాక్య మాహ వనస్పతిం, శరణంహి గతోఽస్మ్యద్య దేవతా మిహ వాసినీ మ్మని యాకపోతమున్న వృక్షములోని దేవతను దన్ను రక్షింపవలెనని ప్రార్థించువాఁడై - ఇంతియుగాని కపోతము తన్ను రక్షింపవలెనని యపేక్షతో వచ్చినవాఁడు కాఁడు. విభీషణుఁ డన్ననో యట్లుగాక రఘురాక్షస సంవాదము నందలి శరణాగతి రక్షణమును జ్ఞప్తి పెట్టుకొని యీ వంశము లోని నేను నాకూటస్థుఁడైన రఘువువలె శరణాగతుని రక్షింతు నని యెంచి నను శరణుఁ జొచ్చినట్లు ‘రఘుసత్తముతోఁ’ నని మీతోఁ జెప్పి పంపినాఁడుగదా.

2. రక్షార్థియై=తనతల దాఁచుకొనవలెనని యొక చెట్టునీడ నపేక్షించినవాఁడై; చేరినన్ = కపోతము వసించెడి చెట్టునొద్దకు రాఁగా, కపోతము బోయవానిని

రక్షించినందులకు హేతువు బోయవాఁడు కపోతవాస వృక్షమును సమీపించుటయే. వాఁడు చెట్టులోని దేవతతోఁ జెప్పుకొన్న శరణాగతివాక్యమును గపోత మే మాత్రమును వినసే లేదు. కాన నది హేతువు కానేర దని యీ పదము చేత సూచితము. తన మాంసంబు లొసంగి వానికిన్-సహజశత్రువై భార్యాపహర్తయై యున్న యీ బోయవాని కాపద వచ్చినపు డా కపోతము చావనీ యీ ముండవాఁడని యుపేక్షయైనను జేయవలెను. లేదా వానిని జంపుటకు యత్నమైనను బడవలెను. ఈ రెండు విధములునుగాక యింటికి వచ్చిన యతిథిని దేవతగా భావింపవలెనను శాస్త్రము ననుసరించి వాని నొక దేవునిగా భావించి యది శీతకాలము కాన శీత నివారణార్థము వానికి గుంపటి తెచ్చి యిచ్చి మఱియు బోడశోపచారంబులును జేసి తన కొరకై సంపాదించి తెచ్చిన వస్తువులను బెట్టి యంతటితోఁ గాని లేదా. తన యంగములలోని కొంతమాంసము పెట్టి యంతటితోఁగాని వానిని బంపివేయవలె నని యెంచక నిష్కల్మషమైనబుద్ధితో వాని యాఁకలి తీఱునంతవఱకును దన దేహము నిచ్చివేసినది. ఈ కపోతోపాఖ్యాన కథ భారతమున శాంతిపర్వంబున ౧౪౩వ యధ్యాయమునఁ గలదు. అజ్ఞు లందఱును శరీరమునే యాత్మగా భావించి దానియందు విశేషాభిమాన ముంతురుగదా! ప్రాజ్ఞులు గూడ “శరీర మాద్యం ఖలు ధర్మసాధన”మ్మని యం దభిమాన ముంతురు గదా. అట్టి తన శరీరమును గూడ నీకపోతము దీనిని వీనికిఁ బచ్చిగ నిచ్చినచో వండుకొన వలసిన శ్రమము వీనికిఁ దటస్థించు నని యెంచి యా శ్రమమును లేకుండునట్లు శరభంగ మహర్షి వలె ‘ఇదమేకం మహా త్తప’యన్నటు తానై నిప్పులోఁబడి పచనమై వానికిఁ దృప్తికరమైన మాంస మాయెను. మన మన్ననో “సచ్చరితా యటంటఁ దగుఁ జక్కఁడుపన్ సచివాన్వితంబుగ”’న్ననికదా వీనిఁ దృప్తిపఱచుచున్నామని భావము.

కపోతంబు=నావలె ధర్మానుష్ఠానయోగ్యమైన వంశము నందును బుట్టినది గాదు. శరణాగతరక్షణమే బిరుదుగాఁగల వంశమునందును బుట్టినది కాదు. ధర్మానుష్ఠానానధికారియైన యొక తిర్యగ్జాతిలోని దని భావము. ఇంతటిహీనజాతియే శరణాగత రక్షణము చేసినప్పుడు మనకేమి చెప్పవలసియున్నది. సహాయములేని యీ కపోతమే శరణాగత శత్రురక్షణము చేసినపుడు సహాయ సంపన్నుఁడైన నేను శత్రుభిన్నమై శరణాగతుఁడైన వీనిని రక్షింపవలెననుట కేమి చెప్పవలసియున్న దని యేకవచన తాత్పర్యము.

అతనిన్ = ఈ బోయవానికి జాతియు హీనము, నడతయు నట్టిదే. మఱియు “పక్షిణాం కాలసమ్మిత” మన్నట్లు పక్షిజాతికి సహజవిరోధి. వీనియందు రక్షణార్హమైన గుణ మేదియు లేదు. అంతియేగాక విపరీతగుణంబులును గలవు. అనుతాపము కొంచెమైనను లేదు. ఆంతరముగా ననుతాపము లేకున్నను నట్టి నటనయు లేదు. అంతియకాక యాఁకలిచే నల్లాడుచువచ్చి యీ చెట్టుక్రిందఁబడెనే కాని యీ పక్షికి

శరణాగతుఁడై యచ్చటికి రాలేదు. ఇట్టి వానినిగూడఁ గాఁచెను. తన శరీరమిచ్చి యాఁకలితీర్చి రక్షించెను. ఈ కపోతము శ్యేనకపోతోపాఖ్యానమందలి కపోతము వలె గపోతరూపముఁదాల్చిన యొక దేవతగాని,ఋషిగానికాదు. వాస్తవకపోత జాతిలోనిదే. అట్లయ్యుఁ బురాతన సుకృత విశేషమునుబట్టి గజేంద్రాదులకువలె నింతజ్ఞానసంపత్తియు, నింత ధర్మానుష్ఠానయోగ్యతయుఁ గల్గినవని యెఱుఁగునది.

కాననచారీ=వానరమా, కపోత జాతిలోని తిర్యక్కు-వలె వానర జాతిలోని మఱొక తిర్యక్కును నొక వ్యాధుని రక్షించెను. నీవు నాజాతివాఁడవుగా నుండియు, మఱి యాజాతికి రాజుగా నుండియు నీ వ్యాధ వానరకథను వినలేదా, వినియు ననుష్ఠింపకుండెదవే యిదియేల యని భావము. ఒక యడవిలో నొక వానర మొక వృక్షముపై నుండఁగా నొకపులి యొక బోయవానిని దఱుముకొని వచ్చెను. వాఁడు దన ప్రాణరక్షణార్థమై యా చెట్టునే యెక్కెను. అప్పు డా చెట్టుపై నెక్కిన యా బోయ నా వానరము బాధింపక రక్షించెను. ఆపైనా పులి వానిని భక్షింపవలె నని యాచెట్టుక్రిందఁ గాచుకొని యుండెను. అంత నావానరము నిద్రపోయెను. పులి యా వానరముచేత వానిని సులభోపాయమున భక్షింపనెంచి నీ వానరమును బడఁద్రోయుము. నేను దానిని భక్షించిపోయెదను. ఆపై నీ ప్రాణములు సురక్షితము లగునని యా బోయవానితోఁ జెప్పెను. పాపియైన యా బోయ తన్నిది రక్షించి నదిగదా యని యెంచక యా వానరమును బడఁద్రోసెను. అంత నాపులి మనుష్య మాంసమును గోరి వచ్చినది కాన వానరమును జంపక దానితో నిట్లనియె. నిన్నుఁ జంపక వదలెదను. అందులకై నాకొక యుపకారము చేయుము. నీ వొనర్చిన యుపకారమును భావింపని బోయవానిని బడఁద్రోయుము. వానిని భక్షించి నేఁ బోయెదను.నీవు సురక్షితముగ నుండుము.ఆపదయం దబద్ధము తప్పుకాదని భావించిన యా వానర మల్లె యని యంగీకరించి వ్యాఘ్రము వదలిపెట్టఁగాఁ జెట్టునెక్కి యీ బోయవాఁడు ఇపుడు నన్నుఁజూచి భీతిల్లి యిందుండిపాఱిపో వీలులేక యగతికముగ నిందే మిణకరించుచు నున్నాఁడు. ఇట్టి యనాథను నేనెట్లు త్రోయుదు నని యెంచి రక్షించెను. శరణాగతు న్విడుచుటల్ న్యాయంబె నాబోఁటికిన్ (౧)ఇట్టి కపోతాది చరిత్రములను వినియున్న నాబోంట్లకును శరణాగతత్యాగము యుక్తమా యని భావము.(౨) నాబోటికిన్-శరణాగత రక్షణ బిరుదాంకిత వంశమున జనించిన నావంటివానికి(౩)"షష్టిర్వర్ష సహస్రాణి లోకస్య చరతా హితం। పాండరస్యాతపత్రస్య ఛాయాయాం జరితం మయా" యన్నట్లు అఱువది వేలేండ్లు లోకరక్షణ దీక్షితుఁడై యున్న దశరథుని పుత్రుఁడై వసిష్ఠ విశ్వామిత్రాదుల శిష్యుఁడై యోగిజనాగ్రేసరుఁడైన జనకమహారాజున కల్లుఁడై 'రామో విగ్రహవాన్ ధర్మ'యని ప్రసిద్ధుఁడై "మర్యాదానాం చ లోకానాం కర్తా కారయితా చ స"యన్నట్లు లోకసంగ్రహార్థమై ధర్మానుష్ఠానపరాయణుఁడై యున్న నేనిట్లు శరణాగతుని రక్షింపకుంటినేని

తక్కిన వారా ధర్మమేమని యాచరింతురు. (౪) నామాట యటుండనిమ్ము 'ధర్మసేతు ర్నృపాణా'మ్మని మావంటి వారందఱును నొప్పుకొన్నట్టిదిగదా యీశరణాగత రక్షణధర్మము (౫) నావంటివాఁడు శరణాగతుని రక్షింపకుండునా? కుర్మార్గులైన రావణాదులకుఁగదా యట్టి కార్య మిష్టపడును అని భావము.

తా త్ప ర్య ము

మిత్రుఁడా! నీ వీ చరిత్రము వినలేదా యేమి? ఇది ప్రసిద్ధమైనదే. ఒక పావురము తన భార్యను బోయవాఁడొకఁడు చంపి తన ప్రాణంబు లాఁకలిచేఁ దపించుచు రక్షణము గోరి తానున్న చోటికి రాఁగా నా మగపక్షి తన మాంసమును వానికాహారముగా నిచ్చి రక్షించెను. అకవి ద్రిమ్మరీ! పక్షియే యట్లు రక్షింపఁగా శరణు అని వచ్చిన వానిని వదలిపెట్టుట నా యట్టి వానికి ధర్మమా?

క. మును కణ్వసుతుఁడు కండుం, డను పరమతపోధనాఢ్యుఁ • డాడిన గాథల్

విను మతిధర్మిష్ఠంబులు, నినతనయా! సత్యవాక్సు•హితమును వినుతున్. ౩౮౧

అర్థములు. పక్షిజాతి శాస్త్రోక్తమైన ధర్మానుష్ఠానమునకు అధికారి గాదు. అట్లుండనట్టి పక్షి యనుష్ఠానము మనకెట్లుపాదేయమగును. మఱియు విధి శాస్త్రమునందుఁ జెప్పబడినదే ధర్మమని మీమాంసకులు చెప్పుదురు. పైఁ జెప్పిన కార్యము ఏవిధిశాస్త్రమందుఁ జెప్పియుండుటంబట్టి మనము ధర్మమని తెలిసికొనవలయును? ఆ విధిశాస్త్రమేది? యని యాక్షేపించుకొని కండు మహర్షి గాథలందు విధి యుండుటచేత మనకిది ధర్మమైయనుష్ఠేయమైనది యనుచున్నాఁడు. కణ్వసుతుండనుటచేత మహావంశోత్పత్తియు, పరమ తపోధనాఢ్యుఁ డనుటచేత సమస్తాంశములను గూర్చియు యథార్థదర్శనమును, ఇతని గాథలఁ జెప్పిన సత్యవిశేషణము చేత సత్యవాదితయు నీ కండుమహర్షికిఁజెప్పినట్లాయెను. ఈ గుణముల చేత నితఁడు పరమాప్తుఁ డని యిందు స్పష్టమైనది. కాఁబట్టి యితని గాథ వేదవాక్కు వంటిదనిసూచితము. మును ఆడిన గాథల్-ముందున్న వేదవాక్యము నే యితఁడుగాథగాఁ జెప్పెనని భావము. గాథల్ = అనేకార్థములుగల్గి అభ్యసించుటకుసులభముగాఁగూర్చఁబడి పదంబులఁగూర్చి యేర్పఱిచిన పద్యములు-అతి ధర్మిష్ఠంబులు = వేదమునఁ జెప్పఁబడిన ధర్మములవంటి ధర్మమును జెప్పునవి. అనఁగా స్మృతిరూపంబులు - సత్యవాక్కులును+సుహితములును=నిజమైన సంగతిని దెలుపునవియు, మేలైనవియునగు గాథల్ వినుతును వినుమని యన్వయము. ఇంతకు ముందుండి యన్ని మాటలను వినుచున్న సుగ్రీవుని గూర్చి యీ మాటల నట్టనడుమ వినుమని మరలఁ జెప్పినందులకేమి కారణ మనఁగా-ఇంతకు ముందు రాముఁడు చెప్పిన మాటలను వినియు సుగ్రీవుఁడు వానియభిప్రాయమును జక్కఁగఁ దెలిసికొనక పోవుటచేత నా ప్రకారము నడచుకొనక, తప్పుటాక్షేపణలు చేయుచున్నాఁడు. ఇఁకనైనను నట్లుచేయక వాఁడు

జాగ్రత్తగా విని మనస్సునందలి సందేహముల నన్నిటిని దీర్చుకొనవలెనని రాముఁ డిచ్చట శ్రద్ధతో వినుమని చెప్పెను.

తాత్పర్యము

పూర్వము కణ్వమహర్షి కుమారుఁడైన కండుమహర్షి గొప్ప తపస్సంపద గలవాఁడు చెప్పిన పద్యములుగలవు. అవి మిగుల ధర్మస్థాపనము చేయునవి, యథార్థములైనవి - మేలిచ్చునవి - వానిని జెప్పెదను. చెవి మనస్సు నిచ్చి వినుము. (౩౭౨-౩౮౩-౩౮౪-౩౮౫ పద్యము లీ విషయమును దెలుపును.)

తే. కరములను మోడ్చి దైన్యంబు • కడలుకొనఁగఁ
 జేరితిని నీదు మఱువు ర•క్షింపు మనుచుఁ
 బ్రార్థనము సేయువాఁ డరి • యైనఁ జంప
 రాదు కరుణాగుణావనా•ర్థంబు గాఁగ.

కండుమహర్షి చెప్పిన గాథలు నాలుగు- వానిలో మొదటిగాథయందు-పరిపూర్ణమైన శరణాగతి చేయుటకు నొకనికి వీలులేకపోయినది. వాఁడు తన రక్షకుని గూర్చి శరణాగతి యంగములలోఁ జేరిన యంజలి బంధమో, మఱేదైన నొక యంగమున మాత్రమో చేసెను. ఆ చేసినకార్యములయందే వాఁడు తన రక్షణ భార మంతయుఁ దన రక్షకునియందే యుంచినట్లు సూచన యున్నదిగదా, కాఁబట్టి వాఁడు పరిపూర్ణశరణాగతి చేయలేదని వానిని వదలిపెట్టరాదు. వాస్తవముగ దయను బాటించు రక్షకుఁడైనచో నట్టి వానిని దప్పక రక్షించు ననుచున్నాఁడు. కరములను మోడ్చి = అయ్యా నిన్ను నేను శరణుఁ జొచ్చినానని చెప్పుకొనుటకు వాగింద్రియము స్వాధీనత తప్పియున్నను అంజలిమాత్రము చేసినను జాలును. "అంజలిః పరమా ముద్రా క్షిప్రం దేవప్రసాదినీ"యన్నట్లు స్వతంత్రుఁడై యున్న భగవంతునికి వేగిరము దయ పుట్టించునదిగదా యీ యంజలిముద్ర. దైన్యంబు కడలుకొనఁగన్ = అంజలి చేయుటకు హస్తములు స్వాధీనత తప్పియున్నను దన దీనస్థితి చూపునట్లు వాఁడు వెలవెలఁ బోవుచుండినను జాలును. చేరితి నిత్యాది - నీదుమఱువు=నీ యాశ్రయముననుండు; అంజలి చేయుటకు వీలులేకపోయినను దైన్యము చూపలేకపోయినను మనస్సునం దాతనిని దనకురక్షకునిఁగాఁ బ్రార్థించినను జాలును. అరియైనను=తనకు సాక్షాచ్ఛత్రువైనను, ఇట్లు అంజల్యాదులు చేయుచున్నను ముందున్న శత్రుత్వము ప్రకృతి సంబంధమునుబట్టి మరలననువర్తించినను జంపరాదు ఇట్టివానిని జంపరాదని యీ శాస్త్రము చెప్పుట యిహలోక సౌఖ్యార్థమా, లేక పరలోకసౌఖ్యార్థమా, కానిచో బాపాపనోదనార్థ మా యని యాశంకించుకొని యివి యేవియుఁగావు; తనకున్న దయాగుణసంరక్షణార్థమని ప్రత్యుత్తరము చెప్పుచున్నాఁడు కరుణా గుణావనార్థంబుగాఁగ="ఆనృశంస్యం పరో ధర్మః"యనిగదా నీతివాక్యము.

తాత్పర్యము

రెండు చేతులు జోడించుకొని, దీనత్వ మతిశయింపఁగా నీ మఱుఁగు చేరితిని, నన్ను రక్షింపు మని కోరువాఁడు తనకు శత్రువైనను మఱి యే కారణముచేతఁ గాదు, కరుణాగుణమును రక్షించు నిమిత్తము వానిని జంపరాదు. కాపాడవలయును.

తే. పరులకును శరణాగతుఁ డరియయ్యెనే, నార్తుఁడైనను మఱి దృప్తుఁ డైనఁ గాని
యాత్మనాశంబునకు నోర్చియైనఁ గావ, వలయు శాస్త్రసువిశ్వాస భావులకును

అర్థములు. ఒకఁడు తానై సాక్షాత్తుగా శరణాగతుని హింసింపఁ బోఁగా వాఁడట్టి కార్యమును జేయ రాదని పూర్వపద్యమునందు నిషేధించినాఁడు. పరుఁడు హింసించుచున్నను శరణాగతునిఁ దన ప్రాణముల నాశింపక రక్షింపవలెను. అపుడా శరణాగతుఁ డార్తుఁడా, దృప్తుఁడా యని విచారము పెట్టుకో రాదని యీ పద్యమునందుఁ జెప్పుచున్నాఁడు. శరణాగతుఁ డరియైనను=ద్వేషము మనస్సునఁ బెట్టుకొని పైకిమాత్రము శరణాగతి శబ్దము చెప్పుచున్న వాఁడైనను, అట్లు కాక ఆర్తుఁడైనను=(1) తాని ఫలము నుద్దేశించి శరణాగతి చేసెనో యా ఫలమునకై త్వరపడు వాఁడైనను (2) తాఁ జేసిన తప్పులను దలఁచుకొని తలఁచుకొని భయపడు వాఁడైనను, దృప్తుఁడైనను=(1) మన శరణాగతి ఫలము నేఁడుగానీ, చిరకాలమునకుఁగానీ యెప్పుడైనను రానీ యని త్వరలేనివాఁడైనను, (2) తన తప్పులకై భీతిల్లక తనకు వినయము లేదనియు జంకక యున్నవాఁడైనను మోక్షార్థమై శరణాగతుని విషయమున నీ పదములకు సమన్వయ మెట్లనఁగా, ఆర్తుఁడు = (1) సంసార మసహ్యముగాఁ దోఁచి దేహ మెపుడు వదలునా యని త్వరపడుచుండువాఁడు (2) తనకొక గుణమును లేదనియు మోక్షార్థమై దానొక యుపాయమును ననుష్ఠింప లేదనియుఁ దలఁచి తన యాకించన్యానన్యగతికత్వములను దెల్పుచు భయభక్తులతో శరణాగతుఁడు-దృప్తుఁడైనను=శరీర మున్నవఱ కుండనీ, ఆపై మోక్షము రానీ యని యుండు వాఁడైనను (2) ఎగతాళి పరిహాసమునకై శరణాగతుఁడైనట్లు తలంచుచుండువాఁడైనను, శాస్త్రసువిశ్వాసభావులకున్=ధర్మశాస్త్రములను నమ్మిన మనస్సుకలవారికి, ఆత్మనాశనం బోర్చియైనఁ గావలయును. అందఱకును దన ప్రాణము తియ్యనిది. అట్టి ప్రాణమునకు లోపము వచ్చినను రానీ యని యుండవలెను శరణాగత రక్షణ సమయమందు. అదేల యనఁగా ప్రాణములు నశ్వరములు, శరణాగత రక్షణధర్మము స్థిరముగదా యని భావము. శాస్త్రసువిశ్వాసభావుల కని చెప్పుటచేతఁ బండితులు తప్పుచేసిరేని శిక్ష యధికమని భావము. "సర్వ త్రైవాత్మానం గోపాయేత్తని శాస్త్రమునం దాత్మరక్షణము ప్రధానముగాఁ జెప్పియున్నను నిది సామాన్యశాస్త్రము కాఁబట్టి యిది విశేషమైన శరణాగతి శాస్త్రమును బాధింపక శరణాగతి రక్షణమునందుఁ దప్పఁ దక్కిన కాలములందు నాత్మరక్షణము ప్రధానమని నిర్వహించుకొనునది.

తాత్పర్యము

శాస్త్రమునందు నమ్మకముగల మనస్సుగలవారు తమకు శరణాగతుఁడైన వాఁడు శత్రువైనను; ఆర్తుఁడైనను, దృప్తుఁడైనను, దన ప్రాణము పోవుట సహించి యైన వానిని రక్షింపవలయును.

తే. భయముచే నొండె మోహంబు•వలన నొండెఁ
ప్రతిఫలాసక్తి నొండె స్వ•బలముకొలఁది
ప్రాపుకోరినవారిఁ గా•పాడఁ డేని
వాఁడు పొలియు విహంబునఁ • బరమునందు. ౩౦౮

అర్థములు. శరణాగత రక్షణమునుగూర్చి శాస్త్రమున విధి యున్నదని యింతకుముందు పద్యములందుఁ జెప్పెను. అట్లు శరణాగతరక్షణము చేయని యెడలఁ బాపము తప్పక కలుగునని యీ పద్యమునఁ జెప్పుచున్నాఁడు. భయముచే నొండెన్=(1) వ్యాఘ్ర కిరాత న్యాయప్రకారము ఈ శరణాగతుని రక్షించితిమేని వీని శత్రువు మనల నేమిచేయునో యని భయముచేతఁగాని, (2) మనము వీనిని శరణాగతుఁడని రక్షించినచోఁ బిదప వీఁడే మనలను దిరుగఁబడి కొట్టునేమో యని భయమువలనఁగాని, మోహంబువలన నొండెన్=చక్కని శాస్త్రార్థజ్ఞానము లేక పోవుటచేతగాని, ప్రతిఫలాసక్తి నొండెన్ = శరణాగతుని శత్రువునొద్దనుండి లంచము పుచ్చుకొని శరణాగతుని వదలెనేని - స్వబలముకొలఁది=తన శక్తికొలఁది, తానై తోడ్పడుటయో, ద్రవ్యమూలమునఁ దోడ్పడుటయో, ప్రాణమునే యిచ్చి తోడ్పడుటయో, యేదైన నొకరీతిగా- ప్రాపుఁ గోరినవానిన్ = శరణాగతుని - కాపాడఁడేని అట్లు కాపాడనివాఁడు - వాఁ డిత్యాది=ఈ లోకమున నపకీర్తిపాలై పరలోకమున నరక మనుభవించునని భావము.

తాత్పర్యము

శరణాగతుని రక్షించితినేని వీని శత్రువు మనలఁ జంపునో, లేక వీఁడే యక్కఱ తీఱిన వెనుక తిరుగఁబడి చంపునో యను భయముచేతఁగాని, శాస్త్రజ్ఞానము లేక పోవుటచేఁగాని నీవు నాకు లంచమిచ్చినచో మఱియేదైన మేలుచేసినచో కాపాడెదను, లేకున్నఁ గాపాడనని చెప్పిగాని, తన సహాయము గోరినవానిఁ దనశక్తి కొలఁది రక్షింపనివాఁడు ఈ లోకమందుఁ బరలోకమందుఁగూడ నాశమగును. దీని వలన శరణాగతుని రక్షింపనిచోఁ బ్రత్యవాయము గలదనియుఁ గావున నిది నిత్యవిధి యనియు నేర్పడెను.

తే. తాను జూచుచుండఁగఁ•దన్ను శరణుఁ జొచ్చినాతఁడు పరునిచేఁ•జచ్చెనేని
యా యనాథుఁడు రక్షసే•యనినృశంసు, నెల్ల సుకృతంబుఁ గైకొని•యేగువాఁడు.

తాత్పర్యము

తనకు శరణాగతుఁడైనవాఁడు తాను రక్షింపమిచే వాని శత్రువుచేఁ జంపఁబడె నేని రక్షింపఁబడనివాఁడు వానిని గాపాడని నిర్దయుని సుకృతమంతయుఁ గొనిపోవును

ఈ నాలుగు పద్యముల సారాంశ మేమన :—

అంజలి మాత్రమే జోడించుట, దీనుఁడై యెదుట నిలఁబడుట, తన యభిప్రాయమును ప్రార్థనారూపముగ విన్నవించుట, రక్షకుఁ డున్నచోటికి వచ్చుట, ఈ నాల్గింటిలో దేనినైన నొకదానినైనను నవలంబించినవాఁడు తనకుఁ బ్రత్యక్ష శత్రువుగా నుండినను వానిని బరుల దుఃఖమును జూచి సహింపలేని దయాగుణము గలవాఁడు రక్షించుట యుత్తమధర్మము. తాను రక్షించుట మాత్రమే కాదు. వానిని గాపాడుటయందుఁ దన ప్రాణము పోవునట్లుండినను వెలువక వాని కితరుల వలనఁ గీడు రాకుండఁ గాపాడవలెను. అట్లు రక్షింపక యేదేని నెపము పెట్టి వానిని వదలెనా వాఁ డీ లోకమున నిందల పాలగుటయే కాక పరలోకమున నరకముల పాలగును. మఱి విశేష మేమనిన ఆశ్రయింపఁ బడినవాని యెదుట నాశ్రయించిన వానిని మఱియొకఁడు చంపెనా చంపఁబడినవాఁడు రక్షింపని వాని పుణ్యమువంతయుఁ గొనిపోవును. ఇది కందుగీతల సారాంశము. శరణాగతునియందు నిటఁ జెప్పబడిన నాలుగుగుణములలో నొకటియుండిన రక్షింపవలసియుండఁగా నాలుగును గల విభీషణుని నెట్లు వదలఁ గలఁడు ?

ఉ. కానఁ బ్రపన్నుఁ డౌ పురుషుఁ గావక యున్న దురంతపాపముల్
మానక కల్గు, నారక ఫలం బపకీర్తియుఁ దప్ప దేమియున్
మేని బలంబు వీర్యమును మేకొను నాశము, గాన సద్యశ
స్థానము ధర్మనాకఫలదంబు నొనర్చెదఁ గందువాక్యమున్. ౩౨

అర్థములు. ప్రపన్నుఁడు=ప్రపత్తి చేసినవాఁడు, శరణాగతుఁడు, దురంత పాపముల్ = అంతములేని పాపములు, నారకఫలంబు=నరకమే నారకము, నరకమున ననుభవింప వలసిన దండము, మేని=దేహముయొక్క, సద్యశస్+స్థానము= మంచికీర్తికి స్థానమైనది, ధర్మనాకఫలదంబు, ధర్మఫలదము=పాపముల హరించునది. నాకఫలదము=స్వర్గలోక సౌఖ్యములను గలిగించునది.

తాత్పర్యము

ఈ కారణములచేత శరణాగతుఁ డగు పురుషునిఁ గావకయుండినఁ గలుగు పాపముల కంతములేదు. దానివలన బరలోకమున నరకబాధ యనుభవింప వలయును. ఈలోకమున నపకీర్తికిఁ బాలుపడ వలయును. ఇవి రెండు కొంచెమైనఁ దప్పవు పాపముచే దేహబలము వీర్యము నాశమగును. కావున సత్కీర్తికి నిలువ స్థానమై పాపహరమై స్వర్గసుఖదాయకమైన కందువాక్యమును సార్థకము చేసెదను.

సుగ్రీవా ! మైత్రిచే వచ్చినవానిని గాపాడెద నని నేను జెప్పినపుడు అది నాకల్పిత నియమము గావునఁ ద్యజింపు మంటివి. అట్లు త్యజింపరా దనుటకు శ్రుతిస్మృతివాక్యములు శిష్టాచారము చెప్పితిని. ఆ ప్రకారము చేయకుండినఁ బ్రత్యవాయము గలదనియుఁ జేసిన స్వర్గసుఖము గలదనియుఁ బ్రమాణవాక్యములు చెప్పితిని.

ఇప్పుడు శాస్త్రబద్ధుఁడనై విభీషణుని రక్షించు పుణ్యము, కీర్తి సంపాదింపు మనెదవా? వానిని వదలి నరకముపాలై, యపకీర్తిపాలై, పొమ్మనెదవా? నీవే చెప్పుము. అపకీర్తిపాలై నరకదుఃఖములనుభవింప నొల్లనుగావున విభీషణు రక్షించెదను. స్వాతంత్ర్యము లేదు. శాస్త్రబద్ధుఁడ నగుటన్ — ఇట్లు చెప్పుటచేత శ్రీరామచంద్రమూర్తికి నరకభయము, స్వర్గసుఖ కాంక్ష దలదని తలఁపరాదు. సుగ్రీవుని సమాధానపఱుప లౌకికాభిప్రాయము ననుసరించి చెప్పఁబడినది.

ఇట్లు శరణాగతరక్షణము సర్వసామాన్యవిషయమని చెప్పి యిక నావిషయమునఁ దన యనుష్ఠాన విధము చెప్పుచున్నాఁడు.

—• శ్రీరాముఁడు విభీషణున కభయ మిచ్చుట •—

క. నీవాఁడని యొకపరియే, యే వాఁడేన్ శరణు వేఁడ • నేని సకల భూ
తావళి కభయంబును నే, వావిరి ఘటియింతు నిదియ • వ్రతమగు నాకున్. ౩౦౭

అర్థములు. నీ వాఁడని=నీ వాఁడను అని, ఒకపరియే=ఒకసారి మాత్రమే, రెండుమార్లు, పలుమార్లుగాదు. ఏ వాఁడేన్=ఎట్టివాఁడైనను, వేఁడునేని=కోరినపక్షమునసే, సకల భూతావళికి = (౧) సమస్తజీవకోటికి. (౨) సమస్త జీవకోటుల వలన, వావిరి=శీఘ్రముగ, అభయంబును=భయము లేకుండుటను, ఘటియింతున్=చేయుదును, ఇదియ=ఇదియే, వ్రతము=పరిహరింపరాని ధర్మనిష్ఠ.

ధర్మానుష్ఠానమందు "శ్రుతి స్మృతి స్సదాచారః స్వస్యచ ప్రియ మాత్మనః, సమ్యక్సంకల్పజః కామో ధర్మమూల మిదం స్మృతమ్" ధర్మనిర్ణయమందు శ్రుతి- స్మృతి- సదాచారము- స్వప్రియము మని, సమ్యక్సంకల్పజ కామ మని యైదు ప్రమాణములని యాజ్ఞవల్క్యులు చెప్పిరి- ఈ యైదువిధములైన ప్రమాణములు శరణాగతి రక్షణమునందుఁగలవు. ఎట్లనఁ: వినవా-యనుటచే సుప్రసిద్ధ శ్రుతిప్రమాణము చెప్పఁబడెను. "వధ్యం ప్రపన్నం ప్రతిప్రయచ్ఛంతి"యని వేదవాక్యము ప్రమాణము. కండుమహర్షి వాక్యముచే స్మృతి ప్రమాణము చెప్పఁబడెను. కపోతవృత్తాంతముచే శిష్టాచారము చెప్పఁబడెను. రామచంద్రమూర్తి యితరమతముల ఖండించి తన యభిప్రాయము స్థిరపఱుచుటచేత స్వప్రియము దెలుపఁబడెను. ఇట్లు శరణాగత రక్షణము సర్వప్రమాణసిద్ధమయ్యెను. ఈవిషయమున నింక నైదవప్రమాణము సమ్యక్సంకల్పజకామము. యాజ్ఞవల్క్యులు సమ్యక్సంకల్పజకామ మని చెప్పిన దానినే మనువు "వేద ఏవ ధర్మమూలం స్మృతిశీలేచ తద్విదామ్, ఆచారశ్చైవ సాధూనా మాత్మన స్తుష్టి రేవచ" మను ౨-౬ అనుచోట శీల మని చెప్పెను. శీల మనిన: బ్రహ్మజ్ఞానము, దేవ పితృభక్తి, సమత్వము, అపరోపతాపిత, అనసూయత, మృదుత్వము, అపారుష్యము, మైత్రి, ప్రియవాదిత్వము, కృతజ్ఞత, శరణ్యత, కారుణ్యము, ప్రశాంతి అని, 'త్రయోదశవిధం శీల' మ్మని హారీతుఁడు చెప్పెను. శీలమనఁగా రాగద్వేషాది పరిత్యాగ మని గోవిందరాజాభిప్రాయము. ఇది శ్రుతిస్మృతి

విరుద్ధము కాక యుండవలెను. పూర్వాపరములు చక్కఁగా విచారించి చేయఁ బడు సిద్ధాంతము సమ్యక్సంకల్పజకామ మని యాజ్ఞవల్క్యులు. సమ్యక్సంకల్ప జకామ మను చోట కామ మనఁగా శాస్త్రవిరుద్ధముకాని వ్రత మని యర్థము. దీనినే శీల మని మనువు చెప్పెను. ఇట్టి వ్రతము తనకుఁ గల దని రామచంద్ర మూర్తి చెప్పుచున్నాఁడు.

మైత్రి భావించి యను పద్యమునఁ దన ప్రకృతిని రాముఁడు చెప్పెను. ఈ పద్యమునందు - ఆ ప్రకృతి ననుసరించియుండు తన వ్రతమును (ప్రతిజ్ఞను) జెప్పుచున్నాఁడు.

నీ వాఁడు-"కొన్ని యెడల మధ్యమోత్తమ పురుషంబులకుఁ బ్రథమ పురుష మగు" సు. వ్యా. కారక. ౪౦ సూ. ప్రకారము ఉత్తమపురుషమునకుఁ బ్రథమ వచ్చెను. "పాండు భూవరునకుఁ గోడలైతి" నన్నట్లు నీ వాఁడను అని యర్థము. ఇది శేషషష్ఠీ కావున సంబంధమును దెలుపును. నాకు, నీకు, సంబంధము గల దని భావము. ఏమి సంబంధ మనిన రక్ష్య రక్షక సంబంధము రక్షింపఁబడవలసిన వాఁ డను నేను, రక్షింపవలసిన వాఁడవు నీవు. స్వామివి నీవు. భృత్యుఁడను నేను-అను నట్టి సంబంధము. (౨)నీవాఁడు=వీఁడు నీ వాఁడు అని వినీతిని ప్రథమగా గ్రహింప వచ్చును. అప్పు డిది కార్పణ్యమును సూచించును. 'ఒకపరియే' యందలి ఏవకార మిచ్చట ననుసంధింపవలయును. నీ వాఁడె యని యేర్పడును. అప్పుడు నేను నీ వాఁడనే కాని నా వాఁడనుగాను, రావణుని వాఁడనుగాను మఱియెవ్వరివాఁడను గాను- అని యర్థ మిచ్చుచున్నది. దీనివలన మమత్వము, అన్యపారతంత్ర్యము, స్వాతంత్ర్యము తొలఁగుచున్నవి. శరణాగతుఁ డెవరెన్ని చెప్పినను, కసరినను, బెదరించినను, ఛంపెద మనినను, స్థిరచిత్తుఁడై తొలఁగక యనన్యగతికుఁడై యుండవలె నని 'ఏ' కారము తెలుపుచున్నది.

మీరు "దురాత్ములన్ వధింపఁగ నానతి యిమ్ము" "నేలఁబడి చెల్లిరి చూడుము." "వీని నిప్పుడే హానఁగుపడంగఁ జేతదగు" అని యిట్లు మీరు దూషించినను, చంపెద మని బెదరించినను లక్ష్యముసేయక యిటునటు కదలక, బెదరక యింతసేపు నిలువవేసినను విసిఁగి మరలిపోక యున్నాడు గదా. ఇది గదా యనన్యగతికుని లక్షణము. ఇదియే పారతంత్ర్యము.

ఒక్క పరియే=ఒక్కసారి మాత్రమే. పలుమాఱు నాకుఁ జెప్పవలసిన పని లేదు. స్మృతిబలములేని మఱపుగొట్టునకు నప్పు డప్పుడు జ్ఞప్తి పఱుపవలెను. (౨) అనేక కోట్లజన్మలలో నొక జన్మమందు మాత్రమే. అదియును, బ్రపత్తి ననుష్ఠించినది మొదలు నీ వాఁడను అన్నది. మొదలు ఆయువ్వ్యముండువఱకుఁ దాను జెప్పినది తాను మఱచిపోక యుండినచో నది యొకసారియేయగును. ఇట్లు చెప్పుటచే "బహూనాం జన్మనా మంతే।జ్ఞానవాన్ మాం ప్రపద్యతే"అనేక పుణ్య జన్మముల కావల జ్ఞానము గలవాఁడు ప్రపత్తిచేయును అనియు,"ప్రయత్నా ద్యత

మానస్తు యోగీ సంశుద్ధ కిల్బిషః । అనేక జన్మ సంశుద్ధ స్తతో యాతిపరాంగతిమ్" దృఢప్రయత్నము గల యోగి యనేక జన్మముల కావల శుద్ధుఁడై పరమగతికిఁ బోవును. ఇట్టులే భక్తికిని జన్మాంతరములు చెప్పఁబడెను. ప్రపత్తి యేజన్మమందు గలుగునో యా జన్మమందే ముక్తి కలదు. కావున దక్కిన వానికంటె నిది విలక్షణ మైనది. కడసారి జన్మమందుఁ గాని, ప్రపత్తిచేయ బుద్ధి పుట్టదు.

ఒకసారి యథావిధి చెప్పిన పిమ్మట మరల దాని స్మరించుట దానియందలి రుచినిబట్టియే కర్మజ్ఞాన, భక్తిజ్ఞానములు మొదలైన యుపాయములలో రెండు మూఁడుసారులావృత్తి గలదుగాని, ప్రపత్తి విషయమున మరల నావృత్తిలేదనియే శాస్త్రార్థము. "సకృదేవ హి శాస్త్రార్థః కృతో యది తారయే న్నరమ్" అని ప్రపత్తి శాస్త్రప్రమాణము.

ఏవాఁడేన్=ఏ జాతివాఁడైనను, ఏ నీతివాఁడైనను, ఏ వయస్సువాఁడైనను, ఎంతటిపాపియైనను, పశువులు, పక్షులు నైనను, స్త్రీయైనను, పురుషుఁడైనను తక్కిన యోగములకు జన్మము, వృత్తి, వృత్తములోనగు నియమములు గలవు. శరణాగతికి నధికారి నియమములేదు. ప్రపత్తి కెవ్వఁడైన నధికారియే. రుచి యుండినఁ జాలును. శరణు=రక్షణము, ఏ విషయమందైనను సరియే, ఐహికము నకే కాని, ఆముష్మికమునకై గాని, మోక్షమునకై కాని, వేఁడె నేని=కోరినంతమాత్ర మున, నీ వాఁడు అని యనుటచే వాగ్రూపకమైన శరణాగతి చెప్పఁబడెను. కోరె నేని యనుటచే మానసికము చెప్పఁబడెను, రెంటిలో నేదైనఁ జేయవచ్చును. నీవాఁడని వేఁడు నేని, ఒక పరియే శరణు వేఁడు నేని యని రెండు వాక్యములుగా నన్వయింపవచ్చును. అందు మొదటి వాక్యము రెండవ వాక్యమునఁ జెప్పఁగల శరణాగతికి శేషత్వానుకూల మైన ఫలప్రార్థనము చెప్పును. ఆ ఫలసాధనమైన శరణాగతిని రెండవవాక్యము చెప్పును. వేఁడు నేని - ఇది శద్ధర్మ్యార్థకము కావున మూఁడు కాలములందు నన్వయించును. వేఁడుచుండు నేని, వేఁడగలఁడేని వేఁడె నేని యనుటచే తైలధారవలె నవిచ్ఛిన్నమైన భావనాసంతతి రూపముగల భక్తి చెప్పఁబడెనని కొందఱందురుగాని యిం దట్టిది లేదు. వేఁడినన్-అనినఁజాలదా? ఏశబ్ద మేల? వేఁడినపక్షమునందే యని-వేఁడుట యందుఁ బ్రాధాన్యము తెలుపు టకే. వేఁడనివారిని రక్షింప నని భావము కోరని వారిని రక్షింపఁబూనితి నేని లంకలోని యందఱను రక్షింపవలసి వచ్చును. అప్పుడు దుష్టులకు, శిష్టులకు, మిత్రులకు శత్రులకు భేదము లేకపోవును. శిష్టత్వము నశించును. దుష్టత్వము ప్రబలును. కావునఁ గోరినవారిని మాత్రమే రక్షింతును. అయిన పశువులను, బక్షులను రక్షింతునంటివే? అవి వచ్చి మేము నీవారమని నీతోఁ జెప్పుకొనఁ గలవా? చెప్పుటకు శక్తిగలవారిని జెప్పుమంటినిగాని, శక్తిలేనివారిని జెప్పుమంటినా? అవి నన్నుఁజూచి నేనున్నచోటనుండి నా యం దనురాగముగల వగు నేని జాలును. కావుననే యయోధ్యయందుండు పశువులకుఁ బక్షులకు, బురుగులకుఁగూడ

మోక్షమిచ్చెదను నీవే చూడఁగలవు. "పురిని నగోచరంబులగు భూతములున్ రఘువంశవర్ధనున్, సరసతఁగన్న ప్రాణులును స్థావరముల్ రఘురాము వెన్కొనెన్, బురమున నెద్ది శ్వాసమును బుచ్చెడి దొక్కటియైనలేక" ఉత్తర ౧౬-౪౮, సకల భూతావళికిన్=సమస్త జంతుకోటికిన్, మనుష్యులకు మాత్రమే కాదు, పశువులకుఁ బక్షులకు క్రిమికీటాదులకుఁగూడ (౨) పంచమ్యర్థమున షష్ఠి - సకల భూతావళివలన నని యర్థము. నాకు శరణాగతుఁడైనవాని కెవరు భయము గలిగింతురో వారి యందఱవలనను, అభయము = భయము లేకుండుట, భయము = మృత్యువు, "కం. జీవికి మరణభయముగా, కావల భయమేదిగలుగ దనవరతంబున్, జీవికి మృత్యువుతోసరి, యా వైరియు లేఁడు" ఉత్తర ౨౦౪ ప. కావున నభయమనఁగా మోక్షము. "అథ సోఽభయంగతో భవతి" బ్రహ్మజ్ఞాని యభయమును బొందును. "ఆనందం బ్రహ్మణో విద్వాన్ నబిభేతి కుతశ్చన" బ్రహ్మవిద్యవలని ఫలము అభయమని శ్రుతి చెప్పుటచే అభయమునకు మోక్షమనియే యర్థము వావిరి=అధికము-ఉత్కృష్టము. వావిరి యభయ మనుటచే పరిపూర్ణ బ్రహ్మానుభవాత్మకమైన సాయుజ్యము. ఇది నీవాఁడను అని రక్షణము కోరినవాని విషయము. ఇది ధర్మార్థకామములకు నుపలక్షణముగా నెఱుంగనగు. శరీరారోగ్యమర్థాంశ్చ, భోగాంశ్చైవానుషంగికాన్ । దదాతి ధ్యాయినాం నిత్య మపవర్గప్రదో హరిః" "అయాచితోఽపి తత్సర్వం ప్రపన్నేనిదధా మ్యహ" మ్మన్నట్లు మోక్షమునే యియ్యఁగల భగవంతుఁడు ధర్మార్థకామముల నిచ్చుట యేమి వింత?

అభయము - నఞ్ తత్పురుషము. ఇచ్చట నకారము తదన్యార్థము-తదభావార్థము-తద్విరోధార్థము-అను మూఁడర్థములను దెలుపుచున్నది. అభయము = అనఁగా భయమునకంటె నన్యమైనదని యర్థము. భయమునకంటె వేఱైనది క్షేమము. కావున నభయమనఁగా క్షేమమని యర్థము. 'ప్రాప్తస్యరక్షణం క్షేమ'మని యుండుటచే ప్రపన్నునకు లభించియుండు భోగ్య భోగోపకరణాదులు సురక్షితములుగాఁ జేయుదునని యర్థము.

తదభావ మను నర్థమున యభయమనఁగా భయములేమి-దానిని గలిగించెదనని యర్థము. భయము కలుగు కారణమే లేకుండఁ జేయుదును.

తద్విరోధము=అభయమనఁగా భయమునకు విరుద్ధమైనది. శత్రువులు కీడు చేయుదురేమో యను మనోవ్యాపారము. దీనికి విరుద్ధమైనది శత్రువులవలన గీడు లేదని నిబ్బరముగా నుండుట. ఇతఁడు ప్రపన్నుఁడు, పుణ్యాత్ముఁడు, వీనికి మనము కీడుచేయరాదని పగవారుకూడ చేతనైన మేలు చేయుదురు.

అతీతము శోకము-వర్తమానము వ్యథ - రాఁబోవునది భయమనఁబడును. కావున భయము భవిష్యత్కాలమున రాకుండఁ జేయుదునని భావము.

ఇది నాకు వ్రతము = వ్రతము పూనినవాఁడు దానిని నడుమ విడిచెనేని

యవకీర్తియగును. కావున నే వ్రతమైనను బూని విడువరాదు. శరణాగత రక్షణము నా కట్టివ్రతము నేను విడువ సాధ్యపడదు. శ్రుతిస్మృతిశిష్టాచారసమ్మతమై, యాత్మప్రియమైన వ్రతమును నేను విడిచితినేని నాకంటె మర్ఖుఁ డెవఁడు? నా నడవడిచే లోకమునకు ధర్మ ముపదేశింపవలయు నని నా యుద్దేశము, నానడవడి వక్రమైనచో లోకమంతయు వక్రపు నడవడికలది యగును. అది సహ్యమా? సర్వ భూతముల కనుటచేత నన్నాశ్రయించినవారికే గాక నన్నాశ్రయించినవారి నాశ్ర యించిన వారినిగూడ రక్షించెదను – అని భావము. కావున నేకదా శరణాగతి విభీష ణుఁడు మాత్రమే చేసినను అయనవెంట వచ్చిన నలువురకు రామచంద్రమూర్తి యభయ మిచ్చెను. 'పశు ర్మనుష్యః పక్షీవా, యేచ వైష్ణవసంశ్రయాః। తేనైవతే ప్రయాస్యంతి తద్విష్ణోః పరమం పదమ్' అని ప్రమాణము. పశువులుగాని, మను ష్యులుగాని, పక్షులుగాని వైష్ణవుని నాశ్రయించున వన్నియు నాయనవెంట విష్ణుమూర్తియొక్క పరమపదమునకుఁ బోవును – అని యర్థము.

—• శ్రీరామ సుగ్రీవ సంవాదము •—

సుగ్రీ— రామచంద్రా! శరణాగతుఁ డగు ప్రపన్నుని రక్షింపవలసినది విధి యని శ్రుతిస్మృతి శిష్టాచార ప్రమాణములను, స్వప్రియమును, దాని కారణము లను జెప్పితివి. అంగీకరించితిని. శాస్త్రవిరుద్ధముగ, శిష్టాచారవిరుద్ధముగఁ బొమ్మని నేను జెప్పను గాని,

"నీవాఁ డని యొకపరియే, యేవాఁడేన్ శరణు వేఁడు నేని సకల భూ
తావళి కభయంబును నే, వావిరి ఘటియింతు నిదియ వ్రతమగు నాకున్"

అని చెప్పితివే. ఆ విషయమున నాకుఁ గొన్ని సందేహములు గలవు. అడుగుదునా?

రామ —నీవు వినయవిధేయలతో జిజ్ఞాసువై యడిగినపుడు నేనేల చెప్పకుందును? అవశ్య మడుగుము.

సుగ్రీ—నీవాఁడని విభీషణునంటివే. ఆయన నీకుఁ దండ్రిగాఁడు, తోడఁబుట్టిన వాఁడుగాఁడు, తుదకు సజాతీయుఁడు కూడ గాఁడే! వాఁడా మాట యను టెట్లు? నీవు దాని నంగీకరించు టెట్లు?

రామ —నావస్త్రమని నీ వనెదవే, అది నీకుఁ దల్లియా? తండ్రియా? తోడఁబుట్టువా? నీ సజాతీయమా?

సుగ్రీ—నేను ధరించువాఁడను, అది ధరింపఁబడునది. ఆ సంబంధముచే నా వస్త్ర మందును.

రామ —మఱియొకరి వస్త్రమును నీ వొకసారి ధరించి విడుతువేని దానిని నా వస్త్ర మందువా?

సుగ్రీ—అవును. అది నియతముగ నాసొత్తుగాదు. దానియందు నాకు నిత్య స్వామిత్వము లేదు.

రామ—అట్టులే నీవాఁ డన్నప్పుడును, నీవు స్వామి వని- నీసొమ్ము నే నని నీవు రక్షించువాఁడ వని- నేను రక్షింపఁబడవలసినవాఁడ నని- ఈ సంబంధము మనయందు నిత్య మని యర్థము. ఇట్టి సంబంధముగల చోటనే నీ వాఁడు, నా వాఁడు అను శబ్దములు ప్రయోగింపఁబడును. విభీషణుఁ డట్టి భావము గలవాఁడు కావున నీవాఁడ ననెను.

సుగ్రీ—రామచంద్రా! నీవు చెప్పినది తృప్తికరముగా లేదు. విభీషణుఁడు ఇక్కడ నీవాఁడను అనినది నిజమే. వీఁడే నేను రావణుని తమ్ముఁడ ననలేదా? నా భార్యను బిడ్డలను అనలేదా ? అవి యావజ్జీవ ముండు సంబంధము లేకదా. దీనికి దాని కేమి భేద మున్నది ?

రామ—నీవు చెప్పినది సత్యమే. విభీషణుఁడు లంక విడుచువఱకు రావణుఁడు రక్షకుఁడు, తాను రక్ష్యుఁడు - అను భావ ముండినది. ఆ భావమే యిప్పు డున్న నిచ్చటి కేల వచ్చును? వానిని విడిచికదా నాయొద్దకు వచ్చినాఁడు. తన్నుఁ దాను రక్షించుకొనఁ గలనని కాని, భార్యలు బిడ్డలు రక్షింతు రని కాని ధైర్య ముండినచో వారినందఱ విడిచి నాయొద్దకు వచ్చునా? రావణు నందు స్వామిభృత్యన్యాయము, స్వస్వామిన్యాయము, రక్ష్య రక్షకభావము, పూర్వ ముండినది, యిప్పుడు లేదు. తన్నుఁ దాను రక్షించుకొనఁగల నని స్వాతంత్ర్యముగాని, ఇతరులు తన్ను రక్షింతు రని పరపారతంత్ర్యము గాని యున్నయెడల వారిని నేనుఁ జేరఁదీయను.

సుగ్రీ—ఒకపరియే యంటివే. పలుమాఱు చెప్పుకొన్న దోసమా ?

రామ—'దోఁటసిరి నీదు చెల్మి మన దుఃఖసుఖంబులు పొందె నైక్యమున్' అని నీవు నాతోఁ దొలుత నొకసారి చెప్పితివికదా. దినదిన మా మాట నీవు చెప్పుచున్నావా ? ఏల చెప్పవు ?

సుగ్రీ— నేను నీ స్నేహితుఁడ నని నీవు దృఢముగ విశ్వసించితివి. నీవు నా మిత్రుఁడ వని నేను నమ్మితిని. తెలిసిన విషయము మరల మరలఁ బ్రస్తావింప నేల? నీవు మఱచినఁగదా నేను బ్రస్తావింపవలె.

రామ—ఆ కారణముచేతనే ప్రపత్తి పలుమాఱు చేయరాదు. ప్రపత్తి యనఁగాఁ బ్రకృష్టజ్ఞానము. నేను సుహృత్తు, శేషి, రక్షకుఁడు,స్వామి యనియుఁ దాను భృత్యుఁడు, రక్ష్యుఁడు సొమ్ము- అను జ్ఞానము. విభీషణుఁడు తాను నావాఁడ నని నమ్మెను. విభీషణుఁడు నా వాఁ డని నేను గ్రహించితిని. నేను మఱచి పోయినఁగదా ఆయన పలుమాఱు హెచ్చరింపవలె.నాయందు జ్ఞప్తిబలము గల దని మీరే చెప్పితిరికదా. (చూ. ౩౮-౨) సీతాదేవియు.

గీ. కంటి కెదురనున్నఁ • గదుఁ క్షేమ గలుగును
మఱుఁగు పడిన మైత్రి • మఱపు గలుగు
సత్య మిద్ది యగు కృ • తఘ్నుల యం దెదఁ
క్షేమ మఱవఁ డెపుడు • రామవిభుఁడు. సుం॥ ౬౭౮

అని చెప్పినట్లు హనుమంతుఁడు మీకుఁ జెప్పెగదా- నీ భార్య వచ్చి ప్రతిదినము నేను నీ భార్యను అని, నీకొడుకు వచ్చి నేను నీ కొడుకు నని, నీ మంత్రులువచ్చి మేము నీమంత్రులమని ప్రతిదినము చెప్పుచుండవలయునా? అట్లు చెప్పి రేని నీవే మనుకొందువు? ఉపచారము స్నేహము కుదురువఱకే- స్నేహము దిటవడిన తరువాతఁ జేయు నుపచారము కైతవము. కావున నీ వాఁడను అని యొకసారి చెప్పి యీ విషయము మనస్సునం దుంచుకొని యా భావముతో స్వధర్మమునఁ బ్రవర్తించుచుండినఁ జాలును.

సుగ్రీ—రామచంద్రా! ఒకపరియే యుంటివిగదా! అవధారణార్థకమైన ఏకారము నీ వాఁడనే అను ప్రపత్తి వాక్యముతో చేరునా? రెండు మూఁడు మార్లు చేయరాదని యొకపరి యనుదానితో చేరును. ప్రపత్తిచేసిన వానినే రక్షించెదను. ఇతరుల రక్షింప నంటివా 'అభయంగతో భవతి'అని ప్రపన్నుఁడు కాని భక్తినిష్ఠునకు నభయప్రదానమును బ్రతిపాదించు శ్రుతివాక్యమునకు విరోధించుచున్నది. అదియును గాక వీని యందు ప్రపన్నత్వ మున్నదా లేదా యని తర్కించి సందేహము నివారించి వీనియందు గల దని నీవు నిర్ధారింప లేదు గదా—అటు గాక ఒక పరియే యభయంబు ఘటింతును, పలుమారు ఘటింపను, అంటివా యిదివఱకే వచ్చి పోయిన భయముల విషయమై నీవు చేయగల దేదియు కాదు. ఇక రాబోవునవి యేవేవి వచ్చునో యెన్ని వచ్చునో వానికిగా నీ విపుడు చేయదగినది లేదు. అవి వచ్చినపుడు చేయవలసిన కార్యముగా నుండును. కావున దేనితో ఏ కార్య మన్వయింప వలయు నని నీ యభిప్రాయము.

రామ—ప్రపత్తి యొకసారి చేయవలయు ననియే నా యభిప్రాయము.
ఒకపరియే యనునది మఱియొకవిధముగా నన్వయింపవచ్చును. ఒకపరియే నిశ్చయించుకొని శరణు వేఁడె నని మధ్యమపదలోపిగా నన్వయింప వచ్చును. అనఁగా రక్షణమందు మనవలె నూహాపోహములకుఁ బాలుపడక, చేయుదమా వలదా యని యాలోచింపక తటాలున నిశ్చయించుకొని వచ్చినాఁ డనవచ్చును. ఇది మహావిశ్వాసమును సూచించును.

సుగ్రీ—ఏవాఁడే నంటివే. ఒకఁడు పరమ పాపి- పుట్టినది మొదలు క్రూరకార్యములు చేయువాఁడు, దయాదాక్షిణ్యము లెఱుఁగఁడు. పరద్రోహి. ఘాతుకుఁడు. అట్టివాఁడు నీవాఁడ ననఁగానే రక్షింతువా ?

రామ— అవశ్యము రక్షింతును. వాఁడు పరమపాపి యని నీవంటివే కాని వాఁడు పూర్వజన్మమందు నా విషయమై యేదియో పుణ్యకార్యము చేసియుండి యది ఫలించుకాలము వచ్చుటచేతనే వానికి నేను జ్ఞప్తికి వచ్చుటేగాక నీ వాఁడను అన నోరు వచ్చినది. వాని పాపములు హరించిపోయి బాగుపడు కాలము రాకుండిన వానినోట నా మాట రానేరాదు. పాపములన్ని హరించి బాగుపడు కాలము వచ్చుటచేతనే వాఁడు ప్రపన్నుఁడై నేను నీవాఁడ ననఁ గలిగెను. వానికాబుద్ధి తేరకు నిష్కారణముగా వచ్చెనా? పూర్వ సుకృత ఫలముగా వచ్చెను. లంకలో నందఱు రాక్షసు లున్న వారుకదా! విభీష ణుఁడు తప్ప మఱి యెవ్వఁడైన వచ్చెనా? విభీషణున కైనను తల్లిదండ్రుల యొద్దకో కుబేరుని యొద్దకో పోదమని బుద్ధిపుట్టక యిక్కడికి రావలయునని యేల బుద్ధిపుట్టెను? కావునఁ బాపము లన్నియు హరించుకాలము వచ్చినఁ గాని ప్రపత్తి చేయును. తక్కినవారికి నీవు చెవులలో శంఖములుపెట్టి ప్రపత్తి ప్రపత్తియని యూఁదినను వినరాదు. విభీషణుమాట లేల రావ ణుని చెవి కెక్కలేదు? అవి విషప్రాయములుగా వానికి దోఁపలేదా? కావున శరణాగతుఁడైనవానిని బాపాత్ముఁడ వందువేని నీవే పాపాత్ముఁడ వగుదువు. ఏలన:– 'తస్యానుబంధాః పాప్మానః సర్వే నశ్యంతి తత్‌క్షణాత్' భగవంతునకుఁ బ్రపన్నుఁడైన క్షణమందే వానినంటి యుండిన ఆగామి సంచిత పాపములు, వాఁడంగీకరింపని ప్రారబ్ధములునశించును. కావున వాఁడు పాపాత్ముఁ డెట్లగును? పాపుఁడు కానివానినిబాపుఁడనుటయే మహాపాపము.

సుగ్రీ— అయినను దీనికి జాతి, నీతి యక్కఱలేదా?

రామ— ఏ జాతివాఁడైనను, ఏ నీతివాఁడైనను, పురుషులైనను, స్త్రీలైనను, బాలు రైనను, వృద్ధులైనను, శరణాగతులు కావచ్చును. ఆ యూరు మాది, యీ యూరు మీది యని యీ యూ యూళ్ళవారు చెప్పుదురు. చక్రవర్తికో? ఇది శనివారము, అది మంగళవార మందుము. సూర్యునకో? వారిలో వారికి భేదబుద్ధి యుండినను తల్లిదండ్రులకు బిడ్డలందఱు సమానులేకదా.

సుగ్రీ— వేఁడు నేని యంటివే. ఒకఁడు నీ యొద్దకు రాలేక తానున్న చోటనేయుండి శరణుచేయును. మఱియొకఁడు మనస్సులోనే తలఁచును. వారినిఁ గూడ రక్షించెదవా?

రామ— నీ వాఁడను అని వాక్కుతో ననవచ్చును, దానికి శక్తి లేకపోయిన మన స్సులో ననుకొనవచ్చును. అట్టివానిని నేనుబోయి రక్షింపవలసినకార్యమైన నేనే పోదును. సంకల్పముచేఁ జేయఁదగినదైన నట్టులే చేయుదును. విభీషణుఁ డిక్కడికి రాక లంక యందుండి శరణు అని యుండిన నేనే యక్కడికిఁబోయి

రక్షించియుండును. వాఁడే యిక్కడికి వచ్చి నాకెంతో సాహాయ్యము చేసెను. అట్టి వానిని నే నెట్లు విడుతును ?

సుగ్రీ—రామచంద్రా! నీకు నల్లని వన్ని నీళ్ళు, తెల్లని వన్ని పాలు నీవలెనే యితరులను కొనుచున్నావు. చేతులు జోడించినదే చూచి ప్రపన్నుఁ డనుకొంటివి గాని చంకదుడ్డు శరణార్థి యనుమాట నిజముగా-వానిచంకలో నేమున్నదో చూడుము. ప్రపన్నునకు గద యేల?

రామ—కామిలారోగికి పాలు, శంఖముకూడ పసుపుగానే కానవచ్చును. నీవుదోష బుద్ధిఁ దోఁచుచుండుటచే నీకు గుణము దోషముగాఁ గానవచ్చుచున్నది. నీ యొద్దఁ గొలువుచేయ నొక వడ్రంగి వచ్చె ననుకో-వాఁడు బాడిసె, ఉలి, గూటము దెచ్చిన నవి నిన్నుఁ జంపుటకా? అట్టులే యితఁడు క్షత్రియుఁడు, క్షత్రియవృత్తి నుండువాఁడు, యుద్ధకాలమున మనసేవ చేయవచ్చినాఁడు. ఇట్టివాఁ డుత్తచేతుల వచ్చెనేని యెట్లు సేవసేయఁగలఁడు? కావున దానికిఁ గావలసిన కొలిముట్లు తెచ్చుకొన్నాఁడు. అది దోషమా? నాకుఁ బాలు తెల్లఁగా గానవచ్చుచున్నవి. నీకు నల్లగాఁ గానవచ్చుచున్నవి.

సుగ్రీ-సకలభూతావళికంటెనే-ఒకఁడు ప్రపత్తిచేసిన లోకములోనందఱరక్షింతువా?

రామ—ప్రపత్తిచేసిన వానినేకాక వానికి సంబంధించి, వాని ననుసరించి, వాని యందుఁ బ్రేమకలిగి వానిప్రేమకుఁ బాత్రులైన యందఱను వాని పశువులను,పక్షులను,మృగములను, మనుష్యులను నందఱను రక్షింతును. విభీషణుఁడు మాత్రమేకదా శరణనెను. వానితోఁడవచ్చినవారినిగూడరక్షింతును. వారు ప్రత్యేకించి చెప్పుకొనవలసిన పనిలేదు. వానితోడనుండినఁజాలును. సుగ్రీవా! నీ మంత్రులు నీ యొద్దఁ గొలువుచేయు చున్నారు. కాని వారి భార్యలు బిడ్డలు సేవకులు నీ యొద్దకు వచ్చి సేవచేయుట లేదు. నీ ముఖమైన వా రెఱుఁగుదురో. యెఱుఁగరో- అట్లుండియు నీవు మంత్రుల రక్షణమునకై యిచ్చిన వన్నియు వారనుభవించుచున్నారుగదా. వారిని నీవు రక్షించిన వాఁడ వగుచున్నావు గదా. కాఁపులయింట దున్ని, విత్తి, పైరుపెట్టి, కాచి, కోసి ధాన్యము తెచ్చువాఁ డొకఁడే. ఆ ఫలము నందఱనుభవింతురుగదా. అట్టులే నావిషయమునఁ బ్రపత్తిచేసినవాఁ డొకఁడే యైనను వాఁడు భరింపవలసినవారి నందఱ నేనేభరింపవలయును.భరింతును. భరన్యాస మనఁగా నేమి? వారి భారములన్నియు నామీఁద వేయుటేకదా. [శ్రీమద్రామాయణము - "వేదోపబృంహణార్థాయ తా వగ్రాహయత ప్రభుః" అని వేదోపబృంహణార్థము వాల్మీకి బాలురఁ గ్రహింపజెసెనని రామాయణమందే చెప్పఁబడెను. "వేదః ప్రాచేతసా దాసీత్ సాక్షా ద్రామాయణాత్మనా" యనియుఁ గలదు. వేదోపబృంహణ మనఁగా వేదార్థమును

విశదీకరించుట యని యర్థము. అటయినచో రామాయణమే వేదవాక్యముల యర్థమును విశదీకరించుచున్నది- అను ప్రశ్న రాఁగా "తగ్ంహ దేవమాత్మబుద్ధి ప్రసాదమ్, ముముక్షుర్వై శరణ మహం ప్రపద్యే" ముముక్షువగు నేను బుద్ధిప్రసాదములు గలిగించు భగవంతుని శరణు చొచ్చెదను. "ప్రయతపాణిః శరణ మహం ప్రపద్యే" పరిశుద్ధహస్తుఁడనై నేను శరణు చొచ్చెదను. "స్వస్తి సంబాధే ష్వభయన్నో అస్తు" సంకటము లందు మనకు అభయము కలుగును గాక అను ప్రపత్తిని విధించు వేదవాక్యములను రామాయణము విస్తరించి చెప్పుచున్నది. పరిశుద్ధ హస్తములతో శరణుచేసెద నన్నప్పుడు అభివాదనరూపక (నమస్కార) ప్రపత్తి చెప్పఁబడెను. 'చరణౌ శరణ మహం ప్రపద్యే'యని ద్వయమందుఁ గలదుగదా. లక్ష్మణుఁడు రామచంద్రమూర్తి పాదములు పట్టుకొనికదా శరణాగతుఁడయ్యెను. పరిశుద్ధహస్తుఁ డనఁగా నీళ్ళతోఁ జేతులు కడుగుకొని యని మాత్రమే యర్థముకాదు. 'సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ' మోక్షసాధనముల నన్నిటిని వదలి నన్నొకనినే శరణుచొరుము - అనియు "పితరం మాతరం దారాన్ పుత్రాన్ బంధూన్ సఖీన్ గురూన్, రత్నాని ధనధాన్యాని క్షేత్రాణిచ గృహాణిచ, సర్వధర్మాంశ్చ సంత్యజ్య సర్వకామాంశ్చ సాక్షరాన్, లోకవిక్రాంత చరణౌ శరణం తేవ్రజం విభో" యితరయుపాయములను వానికి సహకారులైన తండ్రి, తల్లి, భార్య, బిడ్డలు, బంధువులు, మిత్రులు, వేరుపాయములనుపదేశించు గురువులు, రత్నములు, ధనధాన్యములు, గృహక్షేత్రములు, సాంగములైన, కర్మయోగ జ్ఞానయోగ అష్టాంగయోగా ద్యుపాయములు, ఐహికసుఖములు, స్వర్గ భోగములు ఆత్మానుభవరూపమైన కైవల్యము వీని నన్నిటిని వదలి (వీరియందు రక్షకభావము, భోగ్యభావము, మమకారము, వదలి యని భావము.) నీ పాదములు శరణు చొచ్చితి నన్నట్లు కర్మ జ్ఞాన భక్త్యాదులందు నుపాయ బుద్ధిని ఐహిక సుఖములయు, స్వర్గకైవల్యసుఖములయుఁ గాంక్షను పూర్ణముగ వదలి నిర్మల మనస్సుగలవాఁడై యనియు నర్థము. 'శరణం ప్రపద్యే' శరణు చొచ్చుచున్నా ననునది. శరణంబుఁ జొచ్చితిన్, నన్ను శరణంబుఁ జొరుము. ప్రార్థించు మనస్సే శరణాగతి- యను పదములచేఁ దెలుపఁబడెను. ఈ శ్రుతి వాక్యమునకు నుపబృంహణ మెట్లన:— ఒక పరియే యను పదము 'ఆవృత్తి రసకృదుపదేశాత్.' బ్ర. సూ. న చెప్పినట్లు పలుమారు ఆవర్తి నపేక్షించు భక్తి విషయమై యన్వయింపక సర్వధర్మత్యాగ పూర్వకమైన ప్రయతపాణే యనుపదము నర్థమును వివరించుచున్నది. ప్రయత మనఁగాఁ బరిశుద్ధము "పవిత్రః ప్రయతఃపూతః" అమరము. ప్రకర్షేణ యచ్ఛతి=స్వవిష యేభ్యః ఉపరమత

ఇతి ప్రయతః" అని ప్రయతశబ్దమునకు వ్యుత్పత్త్యర్థము. స్వరూపవిరుద్ధ విషయములనుండి యింద్రియములను బూర్ణముగ మరలించుట ప్రయత మనఁబడును. ఉపాయాంతరములు కర్మజ్ఞానాదులు భగవదేక పారతంత్ర్య మునకు విరోధులు, స్వరూపనాశకములు గావున భగవదుపాసనవలనఁ గల యుపాయము లన్నియు స్వరూపవిరుద్ధములే. కావున వానిని వాసన తోడ విడిచినవాఁడే ప్రయతపాణి యనఁబడును. పాణి యను శబ్దము భగవన్నామ సంకీర్తనమున కుపదేశింపఁబడి యుపయోగపడు వాగింద్రియ మును, భగవద్దివ్యమందిర ప్రదక్షిణమున కుపయోగపడు పాదములకు నుపలక్షణము. ఒకపరియే శరణాగతి చేయవలయు ననుటచే తైలధారవలె నిరంతరధ్యానరూపమైన జ్ఞానము-భక్తి దీనినుండి దూరముగ ద్రోయఁబడి నది. అట్లే శరణు వేడెనేని యను పదముచే 'శరణం ప్రపద్యే' యను పదమును, నీవాఁడని వేఁడునను పదముచే స్వ స్వస్తి' యను పదమును, అభయంబు ఘటింతు ననుటచే 'అభయ మస్తు' అనుపదముల యర్థమును విశదీకరించుచున్నది. ఈ విధముగ నీ పద్యము శరణాగతి విషయమైన వేదసూక్తుల యర్థమును వివరించెను.

మఱియు నీ వేదసూక్తులందు 'శరణం ప్రపద్యే' శరణు చొచ్చుచున్నాను- అని యేకవచనముతోఁ బ్రారంభించి 'అభయం నః అస్తు' మాకభయము కలుగును గాక యను బహువచనముతో ముగిసెను. ఇట్టివే 'వైష్ణవో నః కులే జాతః' మా వంశమందుఁ బుట్టిన వైష్ణవుఁడు మమ్మందఱ నుద్ధరిం చును. 'తే సర్వే ముక్తి మాయాంతి' ఆ వంశమునఁ బుట్టిన వైష్ణవునివలన వారందఱు ముక్తి పొందుదురు. అని చెప్పఁబడెను. అట్టులే 'యేచ వైష్ణవ సంశ్రయాః । తేనైవ తే ప్రయాస్యంతి । తద్విష్ణోః పరమం పదమ్' వైష్ణవుని నాశ్రయించినవా రందఱు విష్ణువు పరమపదమునకుఁ బోదురు- అని చెప్ప బడెను.

సుగ్రీ—ప్రపన్నులకు మాత్రమే నీ వభయహస్త మిచ్చెదవా? భక్తాదులకు నిచ్చెదవా?

రామ—రామచంద్రమూర్తి నన్ను రక్షించు నను విశ్వాసము గలవారి నందఱను రక్షించెదను. ఎట్లనిన దండకారణ్యమునులు మే మెల్లరమును నీ విషయము నందు నీచే నెప్పుడుం గావంబడ నర్హుల మనిరి. (అరణ్య ౧౮) వారిని రక్షించి తిని. (ఈ కాలమున విష్ణ్వాలయ మే గ్రామమం దున్నదో యా గ్రామ మందుండి భగవంతుఁడు రక్షకుఁ డను నిశ్చయజ్ఞానము కలిగినను జాలును) అనుకూలుఁడై వచ్చిన విభీషణు రక్షించితిని. కేవల ప్రతికూలుఁడైన రావణుఁడు వచ్చినను రక్షించెద నంటిని. (యుద్ధ ౩౮౮.) నాదు గురువులఁ గనుటకుఁ జన నానతిమ్మని యుదాసీనయైన శబరిని రక్షించితిని. 'పరమగతి

కారణం బధ్యోఽబ్రధనమున' నని చెప్పఁబడిన మృగ మగు వాలిని, (కిష్కింధ ౪-౨౨). అను త్తమగతి కరుగుము మదాజ్ఞనని పక్షియగు జటాయువునకు, (అరణ్య ౧౧౭) ఘోరపాపము చేసి శాపదష్టయై పడి యుండిన యహల్యను, (బాల-౪౯) పలుగాకి కాకి యగు కాకాసురుని, వీరినెల్లఁ గాచితినిగదా. ఇది యేమి? అయోధ్యలో నుండు కంటికిఁ గాన రాని భూతములు, నన్నుఁజూచిన ప్రాణులు, చెట్లు, చేమలు, స్థావరములు నన్నియు నేనీ లోకమును విడిచిపోవు నపుడు నా వెంట రాఁగలవు. నీవే చూడగలవు (ఉత్తర. ౧౦౯). ఈలోకమునందుండు వారేగాదు; దేవ లోకములోనుండు బ్రహ్మేంద్రాదులు, దిక్పాలురు, నారూప మర్చించుచు, నానామము జపించుచు, నామూర్తిని దమలోకముల నుంచుకొని పూజించు చున్నారు. వారి నందఱ రక్షించెదను. 'ద్విపరార్ధావసానేమాం ప్రాప్స్య మర్హసి పద్మజ' యని బ్రహ్మకును నే నభయహస్త మిచ్చి యున్నాను. వీరు వారన నేల? నాయెడ నాభిముఖ్యము గలవారి నందఱ రక్షించెదను. పరాఙ్ముఖులు వారిగతి కోలఁది వారధోలోకములకుఁ బోదురు.

సుగ్రీ—ఆభిముఖ్యము గలిగినంత మాత్రమున నీ వందఱ రక్షించెదవేని వారికిఁ బ్రపన్నులకు నేమి భేదము?

రామ—భక్తాదు లందఱకు నీ జన్మమందే ముక్తి నిచ్చెద నని నేను జెప్పలేను. వారికిఁ గాలాంతర జన్మాంతరములందు ముక్తి నిచ్చెదను. 'వాసుదేవ స్సర్వ' మ్మను భావము గల పరమభక్తునకుఁ బ్రపన్నునకు మాత్ర మీ జన్మాంత మందే తప్పక ముక్తి నిచ్చెద నని నేను బ్రమాణము చేసి యున్నాను. మార్గములు భేదములుగాని, యిరువుర భావ మొకటియే. పరమభక్తుఁడు పెక్కు-జన్మముల భక్తిని సాధించినాఁడు. ప్రపన్నుఁ డీ జన్మమందే సాధించి నాఁడు. ప్రపన్నుఁడు తన భారమును నామీఁదవైచి తల్లిదండ్రులయొద్ద చంటిబిడ్డవలె నుండువాఁడు పరమభక్తుఁడు తల్లిదండ్రులు దైవతములను జ్ఞానము గలవాఁడై పితృసేవ భక్తితోఁ జేయునట్టివాఁడు. తల్లిదండ్రు లిరువుర నాదరింతురు గదా.

సుగ్రీ—అట్లైన భక్తికి, బ్రపత్తికి నేమి భేదము?

రామ—ఫలము సమానమే-మార్గములు వేఱు వేఱు. నీ యూరికిఁ బోవలయు నని నెన్ని త్రోవ లున్నవి? అట్టులే. రెంటికి భేదము చెప్పెద వినుము.

(౧) భక్తి-స్వధర్మజ్ఞాన వైరాగ్య సాధ్య భక్త్యైక గోచరుఁడు నారాయణుఁడని చెప్పఁబడుటచే స్వధర్మనిష్ఠచేఁ గలిగినజ్ఞానమువలన లభించిన వైరాగ్యముచే జనించిన భక్తి యనుటచే భక్తి యుపాయ మనియు, నది చేతనుని వ్యాపార మునై నాధారపడి యున్నదనియు నేర్పడెను. కావున నది సాధ్యో పాయము. ప్రపత్తి యుపాయ మనుట యుపచారమాత్రము. ఉపాయము

ఉపేయము కూడను భగవంతుఁడే. భగవంతుఁడు సిద్ధోపాయము. 'సిద్ధ రూపం పరబ్రహ్మ' యనికదా శ్రుతి చెప్పుచున్నది. కావున ప్రపత్తి సిద్ధోపాయము.

(౨) 'ధ్రువాస్మృతి' యన్నట్లు భక్తి తైలధారవలె నవిచ్ఛిన్నమైన స్మృతి సంతాన రూపము. కావున నచేతనము.

ప్రపత్తి- 'యస్సర్వజ్ఞ స్స స్సర్వవిత్' 'సత్యం జ్ఞానం' అను శ్రుతి సూక్తుల వలన సర్వజ్ఞము, జ్ఞానస్వరూపమునై యున్నది.

(౩) భక్తి-'ఆవృత్తి రసకృ దుపదేశా' త్తనునట్లు అనేక జన్మపుణ్యఫల మగుచు చిరకాల సాధ్యము.

ప్రపత్తి-'తద్ద్వయం సకృదుచ్చారో భవతి' అనునట్లు లోకసారి యనుష్ఠించిన జాలును.

(౪) 'తస్య తావ దేవ చిర' మ్మనునట్లు (ఛాందో) ప్రారబ్ధదేహావసానపర్యం తము కాలవిలంబనము గలది. ఈలోపల దాని ఫలము జూపఁజాలదు.

ప్రపత్తి-'ఉపాయో యంచతుర్థస్తే' యన్నట్లు ప్రపన్నుఁడు కోరినచో నెంటనే ఫలము చూపఁగలదు. ఇది యార్త ప్రపన్నుని విషయము. కానై దేహము నిలుపఁ గోరిన దృప్తునకు నా దేహావసానమున ఫల మిచ్చును. ఆర్తి భేదముచే గాలభేదము.

(౫) భక్తినిష్ఠునకుఁ బ్రారబ్ధకర్మ శేషమువలన దేహాంతర పరిగ్రహము కలిగెఁ నేని ఫలప్రాప్తికిఁ గాలవిలంబ మధిక మగును. ఈ విషయము బ్ర॥ సూ॥ ౪౧-౧౯ 'భోగేన త్వితరే క్షపయిత్వాథ సంపత్స్యతే' యను సూత్రమున భాష్యమునఁ జర్చింపఁబడినది. "బ్రహ్మవేత్తయొక్క పుణ్యపాపము లనేక శరీరభోగ్యఫలము లైనచో అనేక జన్మముల నెత్తి యాకర్మఫలముల నన్నింటి ననుభవించి యనంతరము బ్రహ్మమును బొందుచున్నాఁడు." ప్రపన్నునకు దేహాంతరప్రాప్తి లేదు. ప్రపత్తి చేసిన దేహముండు వఱకే కాలవిలంబము.

(౬) భక్తి రూపాపన్న జ్ఞానము పుట్టుటకు విరోధులుగా నుండు పాపములు నశించుటకు యజ్ఞ దాన తపస్సు లావశ్యకములై యుండును.

ప్రపత్తియందు అంగము, అంగి-ఉపాయము, ఉపేయము-నేనే యగు టచే నితర సాధన సాహాయ్యముతోఁ బనిలేదు.

(౭) భక్తివిరోధు లగు పాపముల జయించుటకై చేయు యజ్ఞదాన తపస్సులు కష్ట సాధ్యములు.

ప్రపత్తి యనుష్ఠానదశనుండి సుఖరూపమే.

(౮) ఆ యజ్ఞాది సాధనములు అపాయకరములు. 'మిథ్యాప్రయుక్తో యజమానం

హీనస్తే' యజ్ఞాదు లనుష్ఠించు నపుడు అలక్ష్యముతోఁగాని, వ్యర్థమైన వేడుకతోఁగాని శాస్త్రోక్త క్రమము వదలిగాని యనుష్ఠించిన యెడల నవియే యజమానుని జంపు నని యర్థము జ్ఞానదోష పరిభ్రష్టశ్చాండాలీం యోనిమాస్థితః' దేశకాల పాత్రముల నెఱుఁగకయు, జ్ఞానము లేకయు ననుష్ఠించిన పక్షమందు చండాలత్వమును బొందును- అని యర్థము. కర్మ జ్ఞాన భక్తులం దీ యపాయము గలదు.

ప్రపత్తి చేయుటయందుఁ గర్మము రెండు చేతులు జోడించుట, నీవాఁడను కాపాడు మనుట. కావున నిరపాయము.

(౯) యజ్ఞాదులకు గావలసిన పదార్థములు నశించు స్వభావముగలవి. ప్రయాస పడి సాధింపఁ దగినవి. పరసాహాయ్య మపేక్షించునవి.

ప్రపత్తికిఁ గావలసినది యంజలి కావున నశించునది కాదు. ఇతరుల సాహాయ్య మపేక్షింపదు. సుకరము.

అవి పుణ్యఫలముల నిచ్చినవిమ్మటఁ దత్పూర్వము మంత్రలోప, క్రియాలోప, భక్తిలోపములచే నశించునవి.

అంజలిఫలము కలకాల ముండునది.

సకాములకు స్వర్గఫలము, నిష్కాములకు మోక్షము నిచ్చును. అట్లైన నానుకూల్య సంకల్పము, ప్రాతికూల్య వర్జనముకూడ ననావశ్యకము లేగదా! యనిన నవి సర్వముక్తిప్రసంగము రాకుండుటకై విధింపఁబడినవి. ఉపాయ స్వీకారమం దిదియే యుద్దేశము. సర్వముక్తి ప్రసంగము రాకుండుట యనఁగా శాస్త్రవిహితమర్యాదలు, స్వధర్మము, సదాచారములు తప్పి వర్తించు వారికిని-దురాచారులకు సైతము మోక్షము రాకుండుటకై శమదమాదులగు నాత్మగుణములు గల యానుకూల్యసంకల్పము విధింపబడెను దీనివలన నా యందుఁ బక్షపాతము, దయాహీనత యను దోషములు దొలఁగినవి.

(౧౦) భక్తికి నంతిమస్మరణము (మరణకాలమున నన్ను స్మరించుట, నియతము.

ప్రపత్తికి నంతిమస్మరణ మనావశ్యకము. అంత్యకాలమునఁ బ్రపన్నుఁ డేదశయం దున్నను నేనే స్మరించి వానికి ముక్తి నిచ్చెదను.

(౧౧) ఉపాయాంతరములు స్వయత్నసాధ్యములు గావున నిరపాయముగ ననుష్ఠించుటయందు సమస్తభారము చేతనునందుఁ గలదు.

ప్రపత్తియందు సకలభారము నాయందుఁగలదు. కావునఁ బ్రపన్నులకు భారము తోఁపదు. వారు ప్రమాదమునఁ గార్యములు తాఱుమాఱుగఁ జేసినను నేను దానిని లెక్కకుఁ దీసికొనను. వారికిఁ బ్రమాదబుద్ధి యిచ్చినవాఁడను నేనేకదా. నా ప్రపన్నుఁడు తెలిసి యకార్యములు చేయఁడు. ప్రపన్నుఁడు తన స్వరూపమగు పారతంత్ర్యమునకు హాని రాకుండఁ గనిపెట్ట

వలసిన భార మొక్కటియే యతనియందుఁ గలదు. తక్కిన విషయములం దతని కే భారము లేదు.

సుగ్రీ—ప్రపన్నుని దేనినుండి రక్షింతువు ?

రామ—వానికి భయము కలిగించిన దేదో దానివలని బాధ లేకుండ, మఱియెప్పటికి లేకుండఁ జేయుదును.

సుగ్రీ—అయిన నీవు మోక్షము మాత్ర మిచ్చెదవా? ధర్మార్థకామము లిచ్చెదవా ?

రామ—ఎవ రేదికోరిన నది యిచ్చెదను, ఎక్కువది కోరినఁ దక్కువదికూడ నిచ్చెదను. అనఁగా ధర్మము కోరినా అర్థము. కామముకూడ నిచ్చెదను. మోక్షముగోరినా ధర్మార్థకామములనుగూడ నిచ్చెదను. అర్థము కోరిన నర్థము, కామము నిచ్చెదను, కామముకోరిన నంత కెక్కువ యేదియు రాదు. కామము మాత్రము గోరువాఁడు పశువుతో సమానుఁడు. వాని సుఖము మాత్రము వాఁడు చూచుకొనును. అర్థముకోరిన వాఁడు తాను సుఖపడ వచ్చును. తన యాశ్రితులను, లోకులను సుఖపెట్టవచ్చును. ధర్మమునం దుండువాఁడు లోకము నంతయు సంతోషింపఁజేయును. కావున నేయుద్దేశ ముతోఁ బ్రపత్తిచేసినను జేయవచ్చును. నిన్నుఁగిష్కింధాప్రభువుఁ జేసి నపుడు దానికి లోపడిన పల్లెలు, గ్రామములు, అడవులు, కొండలు అన్నియు నీ వనుభవింపఁ దగినవేకదా. వానియం దుండు వారికి నీపై నధి కారము లేదు. కాని నీ కందఱిపై నధికారము కలదుకదా.

సుగ్రీ—సకలభూతములవలన నంటివే. పుట్టినవానివలననా? పుట్టబోవువానివలననా?

రామ—మోక్షము గోరువాఁడన్ని భూతములను దాటిపోవువాఁడు. కావున వాని కే భూతములవలనను, నే కాలమునందును, నే దేశమందును భయము లేదు. తక్కినవారా ? వారివారి కోరికలవలనఁ గలుగు ఫల మనుభవింప వలసి యుండును. నీవు వానరరాజ్యము గోరితివి. ఇచ్చితిని. దానివలనఁ గలుగు సుఖదుఃఖములు నీ వనుభవించుచున్నావు, అనుభవింపగలవుగదా ! యట్టులే యన్నియును.

సుగ్రీ—అభయము ఘటియింతునంటివి. విభీషణుఁడు రావణునకు భయపడి వచ్చెను. రావణు భయము లేకుండఁ జేయుదు వంతియేకదా ?

రామ—విభీషణుఁడు కోరిన దామాత్రమే యైన నంతియే చేయుదును. రాజ్యము గోరిన రాజ్య మిచ్చెదను. ఏమి కోరఁడాయెనా రాజ్యమే కాదు. మోక్షము కూడ నిచ్చెదను. ప్రపన్నులు తమకోరికలను ప్రార్థించే నన్నుఁగట్టి నిర్బం ధించి నీవింతే యియ్యవలయు నన్నప్పుడు వారినిర్బంధములకు లోపడియంతే యిత్తును. అట్టి నిర్బంధము లేనప్పుడు నే నెంత యియ్యఁగలనో యంతయు

నిచ్చెదను. నాతో సమానునిగనే చేసెదను. భయకారణములు పెక్కులు గలవు. పతివ్రతలకు వైధవ్యభయము, రాజులకు శత్రుభయము, ధనికులకు దారిద్ర్యభయము. ఆరోగ్యవంతులకు రోగభయము, ముముక్షువులకు సంసారభయము, సర్వభూతములకు మరణభయము. ఎవరే భయమునుండి రక్షింపఁగోరుదురో వారి నా భయమునుండి రక్షింతును. వీనిలో వానిరి యభయము=ఉత్కృష్టమైన యభయము – నా సాయుజ్యమే.

సుగ్రీ—నీవు వీనికి నిచ్చు నభయము త్యాగమా? ఔదార్యమా? ఉపకారమా? దానమా?

రామ—కీర్తి రావలయునని కోరి యిచ్చునది త్యాగ మనఁబడును. నాకట్టికోరిక లేదు. ఔదార్యమనఁగా జనుఁలు చేఁవునట్లు విషయ వైషమ్యమును జూడక తనపేరుగా నిచ్చుట. అట్టి ప్రతిష్ఠయందు నాకుఁ గాంక్ష లేదు. ఉపకార మనఁగా బదులు మేలు కోరి యొకరికిచ్చుట, ఇతనివలన నే నేమేలు గోరలేదు. దానమనఁగా దీనివలన నాకీ ఫలము కాలాంతరమందో, జన్మాంతరమందో కలుగఁగోరి మంత్రవంతముగ నిచ్చుట. వీనిలో నేను జేయునది యేదియుఁ గాదు. ఘటియింతు ననఁగా కలిగింతు ననియే యర్థము. ఇది త్యాగముగాదు. ఔదార్యాదులుగావు. చలిచే వణకువాఁడు వేఁడిమి చలికి విరోధియని తెలిసికొని యెండలోనికిఁబోయెను. వానికిఁ జలి దొలఁగెను. ఆరోగ్యము కలిగెను. ఇందు సూర్యుఁడు చేసినది త్యాగమా, ఉపకారమా, దానమా? యేది? నేను జేయునది యంతే యనుకొమ్ము. వాఁడు చేసిన శరణాగతియే వానిని రక్షించును. నేను నిమిత్తమాత్రమే. "నిమిత్తమాత్రమే వాసౌ సృజ్యానాం సర్గకర్మణి, ప్రధానకారణీ భూతా యతో వై సృజ్యశక్తయః । నిమిత్తమాత్రం ముక్త్వైవ నాన్య త్కించి దపేక్షతే, నీయతే తపతాం శ్రేష్ఠ స్వశక్త్యా వస్తువస్తుతాం । కర్మభి ర్భావితాః పూర్వైః కుశలాః కుశలైః ప్రజాః" సృజింపఁబడునట్టి వస్తువులు తను సృష్టి విషయమున నిమిత్తమాత్రము నపేక్షించునవి. వానియందుఁ గల శక్తులే వాని సృష్టికి ముఖ్యకారణములు. అవి నిమిత్తమాత్రము దప్ప వేఱొక్కదాని నపేక్షింపవు. స్వశక్తిచేతనే వస్తువు లాయా శరీరంబులఁ బొందుచున్నవి. అట్టి శక్తులు వారు వారొనర్చునట్టి పుణ్య పాపములే. చింతగింజయందుఁ జింతచెట్టగు శక్తియున్నది. కాని తనంతటఁ దానే చెట్టు కాఁజాలదు. మనుష్యుఁడొకఁడు దానిని భూమిలోనుంచి నీళ్ళు పోయవలయును. చింత విత్తనమునుండి మామిడిచెట్టు వచ్చునట్లు వాఁడు చేయలేఁడు. అట్టులే శరణాగతియందు ఆ జన్మమందే ఫలమిచ్చు శక్తి గలదు. ఆ ఫలము వానికిఁ గలుగునట్లు చేయుటే నా కార్యము.

సుగ్రీ—అకైన మైత్రి నటించినను నేను శేతిని విడువ నంటివే. నీవు వానిమోస ఫలమేకదా వానికీయవలెను.

రామ—మనోవాక్కాయము లను మూఁటిలో రెంట వాఁడు చేసిన దానికి ఫలమీయవలయునుగదా. అది నేనెట్లు తప్పింపఁగలను? ఆ రెండే వాని మనస్సును తమ త్రోవకుఁ గ్రమముగఁ దీసికొనివచ్చును. ఆవిషయమున నేను దోడుపడుదునుగాని వాఁడు నన్ను మోసముచేసినాఁడని కోపింపను. వానిని వాఁడు మోసము చేసికొనునుగాని నాకు వాఁడు చేసిన కీడేమి గలదు?

సుగ్రీ—నీ సాయుజ్య మనఁగా నేమి?

రామ— నీవు నాయొద్దఁ జేరకముం దెట్టి సంబంధముండినది? మనకు నిప్పుడెట్టి సంబంధమున్నది? లక్ష్మణు నంతటివాఁడవు నీవైతివిగదా. 'మా నలువురిలో నీవైదవ సోదరుఁడవు నిర్మల చరితా' యని భరతుఁడు ననఁగలఁడు. నీవు విభీషణునిఁ జంపవలె, నఱకవలె, నిప్పులలో వేసి కాల్పవలె నంటివే. నే నభయమిచ్చిన పిమ్మట నీవే "మాసమానుఁడయి క్రాలుత మమ్ములగూడి యిష్ట మేధావి విభీషణుండు సఖితం గని" యని నీవే యంటివా, లేదా? ఇప్పుడు మనమందరము సోదరులమేకదా. కావున సమానులమేకదా. మీరు నన్నుఁ బెద్దగా గౌరవించి పెత్తనము నాయందుంచితిరే కాని తక్కిన విషయంబుల మీకునాకు భేదము కలదా? సీతతప్ప నా సర్వస్వము మీదికాదా? నా ప్రాణములు కూడ మీ చేతియందున్నవికదా? ఇట్టి సామ్యమునకే సాయుజ్య మనిపేరు. హనుమంతున కిచ్చినట్లు నన్నే మీ స్వాధీనపరచితిని. అంతకెక్కువ నేనేమి యియ్యఁగలను. దీనినే వానికి యభయ మంటిని, తక్కిన వన్నియు దీనికి లోకువే.

సుగ్రీ—ఇదియ వ్రత మగునంటివే. యేల?

రామ—తక్కిన యన్ని కార్యములు నేను నా సంకల్పానుసారము చేయుచుందును గాని యొక నిర్బంధమువలన విధిగాఁ జేయువాఁడనుగాను. శరణన్న వానిని రక్షించుట యనునది నాకు వ్రతము. నాకిష్ట ముండినను, లేకుండినను, నేను జేయక తప్పదు. ఆ విషయమందు నాకు స్వాతంత్ర్యములేదు. అన్ని విషయముల నేను సర్వశక్తుఁడనే కాని, యీ విషయమందు నే నశక్తుఁడనే. ఎట్టి సంకటములనైనఁ దప్పించుకొను నుపాయము నే నెఱుఁగుదును గావున నేను సర్వజ్ఞుఁడనే కాని శరణు అన్న మాట చెవినిఁబడఁగానే అభయమ్మనక తప్పించుకొను పట్లో నే నెఱుఁగను గావున యీ విషయమున నే నజ్ఞుఁడనే. వ్రతముగా ననుష్ఠించునది యిది యొక్కటియే కావున నిదియ యంటిని.

సుగ్రీ—వ్రత మనఁగా నేమి?

రామ—యావజ్జీవము జర పెదనని పట్టిన నియమము. కాలక్షేపము పెట్టుకొన్నను బెట్టుకొనవచ్చును. హనుమంతునకు బ్రహ్మచర్యము వ్రతము. దానియందు స్ఖలనము వచ్చెనా యతఁడు భ్రష్టుఁడు. అపకీర్తి యనఁబడును. అట్లులే నాకు శరణాగతరక్షణమునుండి స్ఖలనము వచ్చెనా నేను భ్రష్టుఁడనే. అపకీర్తి నే.

సుగ్రీ—ఇది నా వ్రత మనినఁ జాలునే. వ్రత మగు నంటివే. ఏల?

రామ—విధి యనియుఁ దప్పించుకొన సాధ్యపడ దనియుఁ దెలుపుటకే.

సుగ్రీ—నాకున్ అంటివే. ఈ వ్రతము గల వారితరులు లేరా ?

రామ—తక్కిన బ్రహ్మరుద్రాదులు ఇష్టము వచ్చినవారిని రక్షింతురు. రానివారిని విడుతురు. మొదటఁ జేరఁదీసినను తరువాత చేయి విడుతురు. ఇతరులు సందర్భానుసారముగ వర్తింతురు. తొలుత వరములిచ్చిన బ్రహ్మ రావణుని తరువాత శపించెగదా. తొలుత రావణునకు వరము లిచ్చిన రుద్రుఁ డిప్పుడు రక్షింప రాఁడాయెఁ గదా. రక్షణ కార్యభారము వారియందు లేదు. అది వారికిఁ బదిలోఁ బదునొకండవది. నాకట్లుగాదు. సృష్టించు బ్రహ్మయు, సంహరించు రుద్రుఁడు రక్షణ మం దుత్తరవాదులు కారు. నాకట్లు గాదు. నిత్యవిధి కావున నాకది వ్రతము. 'నహి పాలనసామర్థ్యం ఋతే సర్వేశ్వరాద్ధరే' యనియు "రక్షార్థం సర్వలోకానాం విష్ణుత్వ ముపజగ్మివాన్" అనియు ప్రమాణములు. మోక్షమిచ్చు నధికారము నాయందు మాత్రమే కలదు. తక్కిన యెవ్వరియందు లేదు. తక్కినవారు మోక్షము తప్పఁ దమ యధికారానుసారముగ నేదైన నీయఁగలరు.

సుగ్రీ—నాకున్=నాకు అనినఁ జాలునుగదా! నాకును అంటివే ఏల ?

రామ—ఈ వ్రతము నాకెట్టులో నా భార్య సీతాదేవికి నట్టులే. తన్ను విశేషముగ బాధించు రాక్షసస్త్రీలకు వారొక్కనమస్కారము చేసినంత మాత్రమునసే యభయమిచ్చెనని హనుమంతుఁడు చెప్పలేదా? రాక్షసస్త్రీలు సీతను బాధించునట్లు విభీషణుఁడు మనల బాధించెనా? ఆమె చేసినంత మాత్రమైన నేను జేయవలదా? ఆమె సహధర్మచారిణి కావున మే మిరువురము ఒక్క ధర్మము నందుండు వారమే. ఆమె సొమ్ములు నీయొద్ద నుండుటచే నామె నిన్ననుగ్రహించె ననికదా నేను నిన్నుఁ జేరదీసితిని. ఆమె విభీషణు ననుగ్రహించెనని కదా హనుమంతుఁ డాయన గృహము దహింపక తక్కినదంతయుఁ గాల్చివైచెను. ఆమె యనుగ్రహించిన విభీషణు నే నెట్లు విడువఁగలను? ఆమె యనుగ్రహించుటచేతనే కాకాసురుని నే ననుగ్రహించితిని ఆమెయనుగ్రహించుటచేతనే జటాయువునకు మోక్షమిచ్చితిని. మాలో మాకా భేదము లేదు. సముద్రస్నానము చేసితి ననిన నలల నంటక చేసితి నని యర్థమా? అలలలో మునిఁగినాఁ డనిన సముద్రస్నానఫలము లేదా ?

సముద్రమును అలలను, సూర్యుని యెండను వేఱువేఱు పదార్థములని యెంచు వాఁడే మా యిరువురియందు భేద మెంచువాఁడు. తండ్రికిఁ గుమారుఁడగు వాఁడు తల్లికిఁ గుమారుఁడు కాఁడా? ఆశ్రితరక్షణమందు నా కున్నంత యధికార మామెకును గలదు. భేద మేమనిన నేను దుష్టుల దండింతును. ఆమె దండింపదు.

"యా మాలంబ్య సుఖేనేదం దుస్తరం త్రిగుణోదధిమ్ ।
నిస్తరం త్యచిరేణైవ, వ్యక్తం ధ్యానపరాయణాః ॥"

ఏమెను ధ్యానించి మహాయోగులు సత్త్వరజస్తమోమయమై వ్యక్తంబును, దుస్తరంబు నగు సంసారమును శీఘ్రముగ దాఁటుచున్నారో- "సర్వేషా మేవ లోకానాం, మీశ్వరీ మమవల్లభా । అస్యా మమచ శేషం హి విభూతి రుభయాత్మికా" అన్ని లోకములకు అన్ని జీవకోట్లకు నా ప్రియురాలు ఈశ్వరి. ఉభయవిభూతులు ఆమెకు నాకు శేషభూతములు. "యజ్ఞ విద్యా మహావిద్యా గుహ్యవిద్యా చ శోభనే । ఆత్మవిద్యాచ దేవి త్వం విముక్తి ప్రదాయినీ॥" దేవీ! యజ్ఞవిద్యాదులు, మోక్షమీయఁ గల బ్రహ్మవిద్య, యివన్నియు నీవే యను శ్లోకముల ననుసంధించునది. "సర్వ కామ ప్రదాం రమ్యాం, సంసారార్ణవతారిణీమ్। క్షిప్రప్రసాదినీం లక్ష్మీం శరణ్యా మనుచింతయేత్" అన్ని విధములగు కోరికల నిచ్చునదియు, మనస్సునకు నాహ్లాదము గలిగించునదియు, సంసారముఁ దరింపఁజేయునదియు, శీఘ్రముగ ఫలమిచ్చునదియు, శరణ్యయు నగు నామెను జింతింపవలెను. కావున నీ వాఁడ నన్నప్పుడు మీ వాఁడ ననుభావమే యుండవలెను. నాకును 'అనఁగా నాకే కాదు మీకును విధి వ్రతముగా నుండవలెను. ప్రపన్నులను జూచినపుడు మీరు వారిని సగౌరవముగ నాదరించి వారి కార్యములు దీర్చ చుండవలయును గాని యిప్పుడు మీరు చెప్పినట్లు చంపుదుము, కాలు తుము అని మాటలాడరాదు. సాధువులగు నా భక్తులందఱు ఇట్లే వర్తింప వలయును. నా నడవడికి, నా యభిప్రాయమునకు విరోధముగ వర్తించు వారు నాభక్తు లెట్లగుదురు? ఈ పద్యమున మొదటి యక్షరము కడపటి యక్షరము కలిపి చదివిన నీకున్ అని యేర్పడును.

సుగ్రీ—రామచంద్రా! నీవు విభీషణుఁడు ప్రపన్నుఁడని చెడ్డ పొరపాటు పడుచున్నావు. వాఁడు ప్రపన్నుడు కాఁడు. "సకృదుచ్చార్యతే భవతి సకృదేవ హి శాస్త్రార్థః" అని ప్రపన్నుఁ డొకసారియె కదా శరణాగతి చేయవలె నంటివి. విభీషణుఁడో "రామచంద్రునిన్ శరణముఁ జొచ్చినాఁడ" (యుద్ధ 3-౨౦) ననియు, సత్వరుఁడై శరణార్థియై వడెన్ (యుద్ధ ౩౯-౨) అనియు నిను శరణంబు జొచ్చితిని (యుద్ధ ౩౯-౩) అనియు మూఁడుమార్లు శరణా

గతుఁ డయ్యెను. ఇట్లు చేయుటచే ప్రపత్తి లక్షణమునకు హాని కలిగించుటయేగాక ప్రపత్తృఁడైన తనకు, ప్రపత్తవ్యుఁడవైన నీకు స్వరూపహాని కలిగించెను. కావున వీఁడు భక్తి ప్రపత్తుల రెంటను చెడినాఁడు. ఇట్టి వానినా నీవు రక్షించుట? ప్రపత్తి యధికారి యగు విభీషణునకు స్వరూప హాని యెట్లు కలిగె నందువా? అత్యంత పరతంత్రుఁడు కదా ప్రపత్తి కధికారి. వాఁడొక్కసారి చేసిన ప్రపత్తినిగూడ నుపాయ మని తలఁప రాదుగదా. వీఁడు అచేతనము కాదుగదా. ప్రపత్తి చేసితి నను జ్ఞానము గల చేతనుఁడుకదా. నేను రక్ష్యుఁడ నగుటకు భగవత్సంకల్పమే కారణము. ఆయన రక్షకుఁ డగుటకు నదియే కారణ మని తలఁపవలసినవాఁడు ముమ్మాఱు ప్రపత్తి సేయుటవలన స్వరూపహాని కలిగెను.

నీవు ప్రపత్తవ్యుఁడవు. శరణాగతునిచే నాశ్రయింపఁ బడు వాఁడవు. నీధర్మ మొక్కసారి శరణు అనఁగానే రక్షింపవలసినది; నీకు వ్రతము. అట్లుండ వీఁడు ముమ్మా ఱనువల నుపేక్షించితివి. కావున నీకు స్వరూప హానియే కలిగెను.

ఇట్లు ప్రపత్తి లక్షణమునకు అధికారికిఁగూడ స్వరూపహాని వచ్చుటచే ప్రపన్నుని రక్షింపకుండిన మహాదోషము వచ్చునన్న నీవాక్య మిచట నన్వయింపదు.

రామ—సుగ్రీవా! విభీషణుఁ డొకసారియే ప్రపత్తిచేసెను గాని నీవు తలఁచినట్లు ముమ్మాఱు చేయలేదు. ఎట్లందువా? అతఁడు రాఁగానే మి మ్మతఁడు చంప వచ్చె నని తలఁచి యతనినిఁ జంప నాలోచించితిరి. అప్పుడు మిమ్ముఁ జూచి "పరుషములాడి నన్ను నొక బంటు విధాన నవజ్ఞ చేసినన్, దురుపున నాలుబిడ్డలను ద్రోసిపి యిచ్చోడ రామచంద్రునిన్ శరణముఁ జొచ్చి నాఁడ"నని మీరు తలఁచునట్లు నేను విరోధిగా రాలేదు. సోదర భ్రాత నగుటచే హిత ముపదేశించిన నన్ను రావణుఁ డతినీచముగా నవమానించి పొమ్మనుటవలన నేనతని సంబంధమును విడువవలసిన తక్కినవానిని నవాసనముగ వదలి, ఆశ్రయింపఁ దగినవాఁ డగుటచే నిచ్చటికి వచ్చి రామ చంద్రు శరణము చొచ్చితి నని చెప్పెను. ప్రపత్తిలక్షణ మైన శరణాగతి యిది యొక్కటియే. ఇందు కందుఁడు చెప్పిన నాలుగు వృత్తివిశేషములు కలవు. వీనిని జేరఁదీయుటకు నివి నాకుఁ జాలును.

నే నభయ మిచ్చిన పిమ్మట మీరు పిలుచుకొని రాఁగా శరణార్థియై పడెన్ అనుటయందు జరిగిన వృత్తాంతము చెప్పఁబడెనే కాని, యివి యతని మాటలు గావు.